


కల్లోల జీవితాలు

కథలు - నవలలు

వేములపల్లి మోహనరావు
పి.వి. కృష్ణారావు

కల్లోల జీవితాలు

వేములపల్లి మోహనరావు

పి.వి. కృష్ణారావు

సంపాదకుడు

డి. నటరాజ్ శాక్య

వేములపల్లి మోహనరావు జ్ఞాపక సంపుటి

కథలు – నవలలు

కల్లోల జీవితాలు

రచన

వేములపల్లి మోహనరావు - పి.వి.కృష్ణారావు

సంపాదకుడు

డి. నటరాజ్ శాక్య

సెల్ నెం. 94404 28597

Email : dnataraj56@gmail.com

ముద్రణ : 2022

ప్రచురణ

సుజనా సొసైటీ

ముఖచిత్రం : డి.నటరాజ్ శాక్య, తుంబలి శివాజీ

ప్రతులకు

సుజనా సొసైటీ

లోకహిత, 9-31-6/2,

ఎస్.ఎఫ్. 2, కూరగాయల మార్కెట్ ఎదురుగా,

షణ్ముఖ ఫ్లాట్స్, పిఠాపురం కాలనీ, విశాఖమహానగరం-3

ఫోను : 94404 28597

మరియు

పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ. ఫోన్ : 81210 98503

ముద్రణ

Printed at Vijayasai Offset Printers

వెల : రూ. 300/-

అంకితం



స్వర్ణకి
శకుంతలకి
మనోజ్ఞకి

మోహన్ తరఫున

అంకితం



నిధికి

నీలిమకి

నాయనమ్మకి

– పి.వి. కృష్ణారావు

కృతజ్ఞతలు



మన మోహన్ రచనల్ని
జ్ఞాపకార్థం
అచ్చేస్తానంటే
ఆదరంతో ఆమోదించిన
శ్రీమతి వేములపల్లి స్వర్ణకి

– పి.వి. కృష్ణారావు

సంపాదకుని మాట



మానవ జీవనాభివృద్ధికి 'సహానుభూతి' అనేది కందెనలాంటిది. అభినందన, వాత్సల్యం, బోధన, మెచ్చుకోలు, భవిష్యత్‌ని దర్శించి ప్రోత్సహించడం... యివన్నీ 'సహానుభూతి'లోకే వస్తాయి.

ఎంతటి జ్ఞానాన్ని అయినా ప్రజ్ఞతో, అధికారికంగా నిబద్ధతని డిమాండ్ చేస్తూ చెప్పిన దాని కంటే, తల్లి బిడ్డకీ, అన్న తమ్ముడికీ, తండ్రికొడుకుకీ చెప్పే తీరులో, సహానుభూతిలో చెప్పండి, అది ఆ బిడ్డ హృదయానికి పట్టేస్తుంది.

విద్యార్థులకూ, బంధుమిత్రులకూ, నా వంటి అభిమానులకూ శ్రీ పి.వి.కృష్ణారావు గారు, అటువంటి సహానుభూతికల ఉదాత్త బోధకులు. ప్రపంచానికి మంచి పండ్లను అందివ్వడానికి చెట్టు ఎలా ఎటువంటి రాళ్ళనూ, బండలనూ అయినా వేళ్ళ ద్వారా చీల్చుకుంటూ పాతాళంలో వున్న నీటినైనా పైకి తెచ్చుకోవడానికి ఎంత శ్రమపడుతుందో శ్రీ పి.వి.కృష్ణారావు గారు కూడా, ప్రపంచానికి సాత్త్వికమైన జ్ఞానాన్ని అందివ్వడంకోసం అంతలా జ్ఞానశోధకులై, జ్ఞానాభివేశంతో వుండేవారు.

ఆయన మా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మానసిక మరియు అతి మానసిక శాఖలో, ఎన్నో విలువైన పాఠాలను, పరిశోధనా వ్యాసాలను, గొప్ప పరిశోధకులను అందించిన ప్రొఫెసర్‌గారు. కొన్నాళ్ళు శాఖాధిపతులు కూడా. ఆశ్చర్యంగా విద్యకు సంబంధించిన విషయాలలో తప్ప, బయట ఎక్కడా ఆయన ప్రొఫెసర్ అన్న పదాన్ని ఉపయోగించరు. ప్రొఫెసర్' అన్న పదంతో ఎవరినీ ప్రభావితుల్ని చేయాలన్న ఉద్దేశం ఆయనకు అసలు వుండదు. ఆయన పి.వి.కృష్ణారావుగారు. అంతే.

80వ దశకంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర్లుగారు, ప్రొఫెసర్ జి.పార్థసారధిగారు, ప్రొఫెసర్ ఎమ్.గోపాల్‌కృష్ణారెడ్డిగారు, ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తిగారు పొలిటిక్స్, ఎకనామిక్స్ మరియు లా ప్రొఫెసర్‌లు వీరంతా జాతీయ అంతర్జాతీయ సమస్యలపై స్టూడెంట్స్ పెట్టిన సమావేశాలకు హాజరై స్టూడెంట్స్‌ని ఎంతగానో ప్రభావితం చేసేవారు. ఆ తరువాతి వరసలో ప్రొఫెసర్ కృష్ణయ్య, ప్రొఫెసర్ పి.వి.కృష్ణారావు,

ప్రొఫెసర్ కె.ఎస్.చలం, ప్రొఫెసర్ మధు, ప్రొఫెసర్ తాతాజీ, ప్రొఫెసర్ చందుసుబ్బారావు గారలు తమ ఉదాత్తమైన వ్యక్తిత్వాలతో క్యాంపస్‌ను చక్కని ప్రజాస్వామ్య స్పిరిట్ పెంపొందించేలా చేశారు. విద్యార్థులలో నేనూ ఒక విద్యార్థిగా వుండేవాడ్ని. వారూ, విద్యార్థి యూనియనూ, బయట ప్రజాస్వామ్య హక్కుల, రచనల, హేతువాద, నాస్తిక సంఘాలూ, అద్భుతమైన గ్రంథపఠనా, సంఘాలతో నా కార్యక్రమాలూ నా మానసిక, భౌతిక పరిధిని ఎంతగానో పెంచాయి.

శ్రీ పి.వి.కృష్ణారావుగారికి నేను గట్టి అభిమానిని. ఆయన స్త్రీపురుషులపైన, జీన్స్‌పైన, సెల్ఫ్ హిప్నోటిజమ్‌పైన, సెల్ఫ్ హెల్ప్ మీద, సెల్ఫ్ ఎప్రిసియేషన్ మీద మానవశరీరంపైన చేసిన బోధనలు, చర్చలు మరచిపోలేను. ఎప్పుడు వెళ్ళినా ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించేవారు. ఎవరూ నన్ను నాన్‌టీచింగ్ వుద్యోగిగా చూడలేదు. అందరూ నాపై ఎంతో వాత్సల్యం కురిపిస్తారు యిప్పటికీ.

శ్రీ పి.వి.కృష్ణారావుగారి అబ్బాయి రాజాకి నేను కొన్నాళ్ళు పాఠాలు కూడా చెప్పాను. వారు మాకు కుటుంబ మిత్రులు అయ్యారు. నా మిసెస్ సుజాతగారికి వారి కుటుంబం అంటే ఎంతో అభిమానం.

వారి కవితలను నేను యిష్టంగా చదువుతూ, పుస్తకంగా వేద్దాముసర్ అంటే, వారుకూడా ముందుకు రావడంతో వాటిని ఇంకా ఎన్నాళ్ళిలా?' అన్నపేరుతో కవితాసంకలనంగా తీసుకురావడమే కాకుండా. వారు లేకుండానే యిక్కడ ఆ పుస్తకాన్ని ప్రొఫెసర్ విజయప్రకాష్‌గారిచేత ఆవిష్కరణ చేశాను. ఎంతోమంది యువజనులు, రచయితలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే వారు చేసిన అతి ముఖ్యమైన, మానసిక ధైర్యాన్ని పెంపొందించే సాధికారగ్రంథాలు, 1. నిత్యజీవితంలో వత్తిడి–నివారణ. 2. ధ్యానం, 3. స్వీయభావన–వికాసం, 4. జ్ఞాపకశక్తి–చదివేపద్ధతులు. (ఇవి యింటర్ నెట్‌లో దొరుకుతున్నాయి) వీటిని ప్రచురణకు సిద్ధం చేయడంలో నాకు కూడా కొంతభాగంవుంది. ఆ గ్రంథాలు సార్వకాలికమైనవి. ఇప్పటికీ పనికివస్తాయి.

ఆయన యీ 2022 డిసెంబరులో ఇండియాకి వచ్చే ప్రోగ్రాంలో వుంటూ, ఆయన ప్రియమైన స్నేహితులు శ్రీ వేములపల్లి మోహనరావుగారు రాసిన కథలు ఎక్కడికక్కడ వున్నాయో వెతికే ప్రయత్నంలో వున్నాను అనేసరికి, వాటిని సేకరించేందుకు నేనూ సిద్ధపడ్డాను. శ్రీ వేములపల్లి మోహనరావుగారి గురించి నాకు యిదే తెలియడం. ఈ గ్రంథంలో శ్రీ పి.వి.కృష్ణారావుగారి మాటల్లో ఆయన, ఆయన వ్యక్తిత్వం పాఠకులకు పరిచయం అవుతాయి. అందునా వారు గత సంవత్సరం మనలను వీడిపోయారు, ఆ ప్రియమైన స్నేహితుని జ్ఞాపకంగా వీటిని ప్రచురించదలచుకున్నానని ఆయన అనడంతో

నేను ఆ పుస్తకాన్ని ప్రచురించడం నా బాధ్యతగా తీసుకున్నాను. ఎన్నో స్వీయప్రచురణలు చేసివున్నాను. పుస్తకాలు ప్రచురించడం కుమారుడు శ్రీ ఎ.ఎమ్.ఈశ్వర్‌గారి ద్వారా నాకు కొట్టినపిండే కానీ ఎప్పుడో రాసిన, కాపీలు లేని ఆ కథలని ఎలా సేకరించడం?

'కథానిలయం' శ్రీకాకుళంలో ప్రయత్నిస్తే? ఇంకేముంది సరిగ్గా శ్రీకాళీపట్నం రామారావుగారి జన్మదినం రోజునే నేనూ మిత్రులు శ్రీ బి.జగన్నాధరావుగారు కలిసి కధానిలయంకు వెళ్ళాము. వారి అబ్బాయి శ్రీ సుబ్బారావుగారు కధానిలయాన్ని నడిపిస్తున్నారిప్పుడు. ఆయన ద్వారా అంటే కథానిలయం ద్వారా 80, 90 దశకాల నాటి యీ కథలను సేకరించగలిగాము. ఇందుకు కథానిలయం (ఫోన్ : 9490008743)కు ఎంతయినా కృతజ్ఞతలు. ప్రొఫెసర్ పి.వి. కృష్ణారావుగారు మంచి రచయితా, కథకుడు. ఆయన మమ్మల్ని ఎంత అప్యాయంగా ఆదరించారంటే, 4 సంవత్సరాల వయసులో మమ్మల్ని వెడలిపోయిన మాపాప సృజనవాహినీ నైటింగేల్ గురించి నేను రాసిన 'మరపురాని పాప' పుస్తకం ఆయనకు ఎంతో నచ్చింది. పిల్లల్ని ఎలా పెంచాలో యీ పుస్తకాన్ని చూసి తెలుసుకోవచ్చు, పిల్లల సైకాలజీనీ, ప్రశ్నలనూ ఎలా చూడాలో, ఎలా సమాధానాలు చెప్పాలో యీ పుస్తకంలో నటరాజ్ అద్భుతంగా చిత్రీకరించాడు అన్నారు. మనుషుల్ని, గ్రంధాల్ని, సంఘాల్నే ఎక్కువగా చదువుకున్నందువల్ల, మనుషుల్లోని అనైతిక ధోరణుల, స్వార్థం కీర్తి కాంక్షా... యివన్నీ చూసి, విరక్తి చెంది, మూగజీవాల హక్కులకొరకు పనిచేస్తూ వున్న క్రమంలో నాకు బుద్ధుడు పరిచయం అవడం, బుద్ధుని చరిత్ర పిల్లల కోసం రాసే క్రమంలో నేనే బుద్ధిస్ట్‌ని అయిపోవడం, యిప్పటికీ 4సార్లు ముద్రింపబడి, అయిదో ప్రింటింగ్‌కి అదివెళ్తూ వుండటం... యివన్నీ ఆయనకు తెలుసు. నన్ను చదివిన ఆయన ఆ పుస్తకానికి చాలా చక్కని ముందు మాట రాశారు.

ప్రస్తుతంలోకి వస్తే, 'కల్లోలజీవితాలు'కు సంపాదకుని మాట నువ్వేరాయి నటరాజ్ లోకాన్ని చదివిన నీకంటే అందుకు అర్హుడెవడూ నాకు తెలిసినంతలో ఎవరూ లేరు అనడంతో, 'కల్లోల జీవితాలు' అనే పదానికి తగినట్టుగా ఎబ్‌స్ట్రాక్ట్ పద్ధతిలో ముఖచిత్రం కోసం బొమ్మగీశాను. ఆ తరువాత ఆయా కథలు, నవలలు అన్నీ శ్రద్ధగా చదివితే, అవి మధ్యతరగతి మరియు ఎగువ మధ్యతరగతి కుటుంబాలలోని స్త్రీ పురుషుల మానసిక, జీవన ఆత్మఘోషలుగా కనిపించాయి. అన్నీ స్త్రీ సమస్యను పరోక్షంగా చిత్రించి, స్త్రీ విలువను పెంచేవే. దాంతో ముఖచిత్రాన్ని మరల యీ కథలకు తగ్గట్టుగా చిత్రించాను. ఆయా కథలు అచ్చయినప్పుడు ఆయా పత్రికలలో వచ్చిన చిత్రకారుల లోపలి చిత్రాల్ని యథాతథంగా వుంచాను. యీ రచనలను ఆ కాలంలో అచ్చువేసిన ఆయా పత్రికలవారికీ, వాటిల్లో బొమ్మలు వేసిన వారికీ నా కృతజ్ఞతలు తెలుపుకోకుండా వుండలేము.

మరి యీ కథలల్లోకి వెళ్ళేముందు నేనూ నాలుగు ముక్కలు రాయాలికదా,

అందునా సామాజిక స్పృహకలిగిన యిద్దరు మేథావుల కథల గురించి రాయడానికి సాహసం చేయాల్సిందే. అవి పూర్తి సైకాలజీపైన, అత్యంత ఆధునిక, కొన్ని 80వ దశకంలోని కార్పొరేట్ వ్యాపార స్థాయిలో వున్నందున, నేను వాటిని ఎస్టిమేట్ చేసి నా అభిప్రాయాలను యివ్వడం నిజంగా నాకు సవాల్. సామాజిక, ఆర్థిక, సోషల్‌వర్క్, న్యాయ, బుద్ధ, అంబేద్కర్, కాన్షీరామ్‌ల సంబంధిత రచనల గ్రంథ పఠనాలలోనే బాగా మునిగివున్న నాకు అటువంటి కథలు చాలా కొత్త.

తెలుగు వాటిని ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకువెళ్ళిన కథలివి. ఆయా మహానగరాలు మనముందే వున్నట్టంత సహజంగా అందించిన కథలివి. ఇరువురూ, ముఖ్యంగా శ్రీ వేములపల్లి మోహనరావు గారు దేశవిదేశాలతో వ్యాపార సంబంధాలు కలిగినవారు. ఆయా దేశాల నాగరికతలూ, విలాసాలూ అన్నీ తెలిసినవారు. అందువల్ల యీ కథలలో ఊహించి రాయడం అనేది లేదు. అంతా వారు చూసి, చెంది వున్నదే. అయితే తెలుగువాడు ఎక్కడికి వెళ్ళినా తెలుగువాళ్ళనీ, తెలుగు జీవితాల్ని హ్యూమనిస్టిక్ కంటెంట్‌నీ వదిలి వెళ్ళలేరు కదా! అదొక్కటే ఆ కథల్ని పట్టుకునేందుకు నాకు గల అవకాశం.

ఇంచుమించు ఈ కథలన్నీ ఆంధ్రజ్యోతి సంపాదకుడు శ్రీపురాణం సుబ్రమణ్యశర్మ ఎంపిక చేసినవే. కొన్ని కొడవటిగంటి కుటుంబరావు. పురాణం వారైతే కొత్తదనం వుందంటే చాలు ఆ రచయితల, కథకుల వెంటపడి మరీ తమ పత్రికకు కథలు రాయించుకునేవారు.

ఇక కథల్లోకి వస్తాను– శ్రీ పి.వి.కృష్ణారావుగారు విడిగానూ, శ్రీ వేములపల్లి మోహనరావుగారు విడిగానూ, అలాగే యిరువురూ కలిసి రాసినవి గానూ, లభ్యమైనంతవరకు చూస్తే వాటి శీర్షికలు కూడా కొత్తవిగా వుంటాయి. ది రింగ్, సంధి, ఓ మాస్టారికథ, నిషిద్ధద్వారాలు, నిర్ణీత గమ్యాలు, లోకం అంచున యిద్దరు, కింకర్తవ్యం, ఇంకోసీత, గతితప్పిన చరిత్ర, ఫారిన్ మొగుళ్ళు, దృక్పథాలు, చీకటికోణాలు, పునరంకితం, మనిషికాటు... యిలా వైవిధ్యంగా, చదవాలనే భావం కలిగేటట్టుగా వుంటాయి. వీటిలో 'మనిషికాటు' అన్న కథాశీర్షిక, నాకు గుండెదడ కలుగజేసి, యీ కథాసంకలనానికి ఆ పేరే పెడితే బాగుంటుందని కూడా ఫీల్ అయ్యాను.

ఆ 'మనిషికాటు' కథలోకి వెళ్తే, మంచితనం, సాహార్ద్రత పోతపోసినట్లుగా వుండే ఒక యువకుడు టూరిస్ట్‌గైడ్‌గా దేశవిదేశీయులకు సేవలు అందిస్తూ, భుక్తి గడుపుకుంటూ వుంటాడు. ఆ విధంగా పరిచయం అయిన ఒక తండ్రికి, యితడిలో తన కుమారుడి ఛాయలు కనిపించేసరికి అతడిని అమెరికా ఆహ్వానించి, నా కొడుకు నా మాటవినేవాడు కాడు, విమానప్రమాదంలో చనిపోయాడు, నువ్వు నా దగ్గరే వుండి, నా కంపెనీ పనులు చేస్తూ, నా ఎదుటే వుంటే సంతోషిస్తాను' అంటూ అతడ్ని బలవంతాన

అమెరికా రప్పించుకుని మంచి ఉద్యోగం యిస్తాడు. ఇతడు ఎంతో ప్రతిభతో అతడి వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తాడు. భారతీయులైన కుటుంబం ఒకటి ఆయన కుమార్తె జెన్నీ ద్వారా పరిచయమౌతారు. ఇతడు వారికుటుంబంలో ఒకడవుతాడు. కానీ దురదృష్టవశాత్తూ, కొడుకు హత్యకు గురికావడంతో వారి కుటుంబం ఇండియాకి వెళ్ళిపోతుంది. వారు వెళ్ళిపోగా, వారి అమ్మాయి అమృతకూ యితడికీ రాగబంధం ఏర్పడినట్లు తెలుసుకుని, ఆమె వియోగంతో అతడు చాలా బాధపడుతూ, తాను కూడా ఇండియా వెళ్ళిపోవాలని తలుస్తాడు. అటు ఆమె కూడా ఇతడి గురించి అనేక పీడకలలు, మానసిక సమస్యలు ఎదుర్కొంటూ సైకాలజిస్టు సాయంకూడా తీసుకుంటూ వుంటుంది.

స్నేహితురాలు జెన్నీ, ఆమెతండ్రీ యీ యువకుడు తిరిగి యిండియాకు వస్తున్నట్టు తెల్పగానే, యీమె అతడ్ని యింటికి తీసుకువెళ్తుంది. అక్కడ కొడుకుని పోగొట్టుకున్న ఆమె తల్లిదండ్రులపైన ఆ తల్లి కోరికపై, తాను కూడా యిష్టపడి వుండటంతో అమృతను పెండ్లి చేసుకుంటాడు.

వారు కారులో భీమిలీ సముద్రతీరంలో సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ వస్తుండగా అతడ్ని పాము కరుస్తుంది. అతడ్ని ఎలాగోకారులోకి చేర్చి ఆమె కారు నడుపుతూ వుండగా కారు ఆగిపోతుంది. ఆమె భయంతో వణికిపోతూ వుంటుంది. ఇంతలో అటువైపు ఒక కారు వచ్చి ఆగగా, ఆ కారువైపు అమృత పరుగుపెట్టి, హాస్పిటల్‌కు తీసుకువెళ్ళమని సాయం కోరగా అతడు కామాంధతతో తన కోరికను తీరుస్తేనే తీసుకువెళ్తాను అంటాడు. ఇంకా ఆలస్యం అయితే తన భర్త ప్రాణమే పోవచ్చునన్న భయంతో ఆమె అతడికి లొంగిపోయి, పదినిమిషాల తరువాత, ఆ దుష్టుడిసాయంతో, హాస్పిటల్‌కు వెళ్ళగా, డాక్టరు పెదవి విరిచి, యితడు చనిపోయాడు, పది నిమిషాల ముందు వచ్చిఉంటే బ్రతికి వుండేవాడు అంటాడు. ఎంత భీకరమైన మనిషికాటు యిది?

భర్త అటువంటి ప్రాణాపాయ పరిస్థితుల్లోవుండగా, ఆమె అతడి కోసం ఎలా అటువంటి క్రూరుడికి లొంగిపోయింది? అన్న అనుమానం కొంతమందికి రావచ్చు. 1980–85 ప్రాంతాల్లో వైజాగ్‌నుంచి భీమిలీ రోడ్డు, చుట్టూ పొదలు అడవులలో అత్యంత నిర్మానుష్యంగా వుండేది. ఒక్కొక్కప్పుడు నేరాలు కూడా జరుగుతూ వుండేవి. మా దంపతులము ఎప్పుడు భీమిలీ వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు యీ భయానక పరిస్థితిని ఎదుర్కొనే వాళ్ళము. ఎట్టి సాయానికీ ఎవరూ రాని ఆ భయానక పరిస్థితిలో అమృత అటువంటి త్యాగం చేస్తుంది. ఈ కథ... మన చుట్టూ ప్రపంచంలో అటువంటి విషసర్పాలు వుంటాయి సుమా! ముందు జాగ్రత్త పడండి అని హెచ్చరిస్తుంది. భయానకమైన ముగింపుకథ.... కథ మనల్ని వెంటాడుతూనే వుంటుంది. తీసుకోగల జాగ్రత్తలను మనకు అన్యాపదేశంగా చెబుతూనే వుంది. యీ కథను తప్పక చదవండి.

రెండవ చిన్ననవల 'పునరంకితం'. ఈ నవలలో 1980 దశకంలోనే

అత్యాధునికమైన కార్పొరేట్ సంస్కృతి కనబడుతుంది. వ్యాపారలావాదేవీలలో సంసారాన్ని, యిల్లాలి ప్రేమనూ పట్టించుకోని ఓ యువకుని కథ యిది. అనేక సంఘటనల ద్వారా, ఆమె స్నేహితురాలి కృషి ద్వారా అతడికి భార్యమీద తిరిగి ప్రేమ కలుగుతుంది. ఆమెతో కుటుంబ జీవితానికి పునరంకితమవుతాడు. కథా కథనం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇందులో వర్ణించిన అంతర్జాతీయ విషయాలన్నీ కథకుడు తన అంతర్జాతీయ వ్యాపారాల ద్వారా ఎరిగున్నవే కాబట్టి ఆయా ప్రాదేశిక వర్ణనలకు సహజత్వం వచ్చింది. చిన్న నవల, 'బాక్ టు ద పెవిలియన్' లాగా ప్రపంచం అంతా చుట్టి, చివరికి ఒక పల్లెటూరికి మహా అనుకంపతో చేరుకుంటుంది. ఒక మహాధన ప్రయాణం ఎంత చక్కగా ఘనంగా ముగిసిందో పాఠకులు చదవాల్సిందే.

'చీకటికోణాలు' అన్న కథలోకి వెళ్దాము. ఒక హీరో వెంట మనల్ని నడిపిస్తూ, అతడు ఒకప్పటి క్లాస్‌మేట్ అయిన స్త్రీ పట్ల చూపించే ద్వేషాన్ని మనలో కూడా కల్గిస్తూ, ఆ స్త్రీ సడన్‌గా పరిచయమై, అతడి మిత్రుడ్ని తాను కొట్టిన మాట నిజమే కానీ, అతడి హత్యకు మాత్రం తాను కారణం కాదు అంటూ, ఒకనాడు తన తండ్రితో గోదావరి ఒడ్డుకు వెళ్ళినప్పుడు, తాను చదువుతూ వుండగా, తన తండ్రి గోదావరిలో మునిగిపోతూ వుండడం, అతడిని రక్షించే అవకాశం ఉన్నప్పటికీ, రక్షించకుండా పొరలనుంచి యీ దృశ్యం చూస్తున్న ఒక యువకుడ్ని నేను గుర్తుపట్టాను, అతడెవరో నీకు తెలియదా?' అంటుంది. అతడు కంగుతింటాడు. పశ్చాత్తాపపడతాడు. తలవంచుకుని ఆమె వద్దనుంచి వెళ్ళిపోతాడు. పైకి ఎంతో మంచివారిగా కనిపించే మనుషులలోని చీకటి కోణాలను ప్రేగులు బయటికి తీసి చూపిస్తున్నట్లుగా చూపిస్తారు. యీ కథకులు. అనితరసాధ్యం అయిన కథ. నేను రాసింది చదవడం కాదు, కథలోకి వెళ్ళి చదవండి, అటువంటి చీకటి కోణాలు మనలో వున్నాయేమో అని పాఠకుడు ఒక్కసారి అయినా తలవకుండా వుండడంటే అబద్ధం కాదు.

'దృక్పథాలు' అన్న కథలో స్త్రీ సమస్యలపైన సానుభూతి కురిపించే అందరూ నిజంగా యోగ్యులై వుండరు, యోగ్యులుగా నటిస్తారు, అటువంటి యోగ్యులు వీరు అవునా కాదా అని స్త్రీలు పరీక్షిస్తూనే వుంటారు, కొన్ని సందర్భాలలో మోసపోతూనే వుంటారు. తెలుసుకున్న తరువాత యింక వారు మరోమారు మోసపోయేందుకు ఇచ్ఛగించరు." యీ అద్భుతమైన నిశ్చయస్థితి ఒక స్త్రీలో ఎలా వచ్చింది? అన్న విషయం తెలియాలంటే యీ కథ చదవాల్సిందే. మనం కూడా అటువంటి స్త్రీల పట్ల రెండునాలికల తత్వం కలిగివున్న అయోగ్యులం అయితే, యీ కథ చివరిలో అబార్షన్ అనే ఆ స్త్రీ కొట్టిన చెంపపెట్టు మనకి కూడా తగులుతుంది.

'ఫారిన్‌మొగుళ్ళు' అన్న కథలో మన ఇండియన్ భర్తల ప్రేమలలోని నిజాయితీని ప్రశ్నింప చేస్తూ, ఫారిన్ భర్తలు భార్యల పట్ల చూపే శ్రద్ధాసక్తుల్ని, బాధ్యతలను చూపిస్తారు.

అంత బాధ్యతలు చూపే ఆ ఫారిన్ మొగుళ్ళు భార్యల యిష్టాలమేరకు విడాకులు తీసేసుకుని తమకు వచ్చినవారిని ఎవరి పెళ్ళిళ్ళు వాళ్ళు చేసుకుంటారు. అంత స్వేచ్ఛ వుంది వారిలో అంటూ, మన ఇండియన్ స్త్రీలకు మొగుడు వదిలేస్తాడన్న బెంగమాత్రం లేదు అంటూ ముగిస్తారు. మరి ఇండియన్ స్త్రీ, తనకు ఫారిన్ స్త్రీలంత స్వేచ్ఛ తనకూ కావాలని కోరుకోదు కదా! ఆ బలహీనతే ఇండియన్ మగాడికి ఆమెను నిరాదరపరిచేందుకు కల సౌలభ్యం కూడా.

'గతి తప్పని చరిత్ర'లో బ్రతుకు తెరువుకోసం, నిరపరాధి అయిన తన తండ్రి వుద్యోగాన్నే వూడబెరికి, తమకుటుంబాన్నే వీధులపాలు చేసిన, ఒక పెద్దాయన దగ్గరకు, విధిలేక, వుద్యోగం కొరకు ఒక యువకుడు వెళ్తాడు. ఈ యువకుని వల్ల తనకు లాభాలు వున్నాయని ఆశించిన ఆ మోతుబరి గుణగణాల్ని, స్వార్థాల్ని ప్రత్యక్షంగా చూసి యీ యువకుడు, ఆ మోతుబరి ఎంత ఆహ్వానిస్తున్నా, యిట్లాంటి అ మనుషుల దగ్గర తాను పనిచేయలేను అనుకుంటూ, అతడి దగ్గరనుంచి బయటకు వచ్చేస్తాడు. మనం ఎట్టాంటి వాళ్ళ దగ్గర పనిచేయకూడదో తెలుస్తుంది యీ కథలో. మంచికథ.

ఓ 'మాస్టారికథ'లోని హీరో ఒక ప్రాథమిక పాఠశాలకు మాస్టారు. చక్కగా ప్రశాంతంగా పాఠాలు చెప్తుంటాడు. అలాంటి అతడ్ని ధనవంతుడైన అతడి మేనమామ, పట్నంలోని కాలేజీలో లెక్చరరు వుద్యోగం వచ్చేటట్టుచేసి, అక్కడ ఊరికి మారుగా ఒక బంగ్లాకూడా ఏర్పాటు చేస్తాడు. తన పాతకారు కూడా అందిస్తాడు. అతడు లేనప్పుడు ఆ బంగ్లాలో మందుపార్టీలు చేసుకుంటూ వుంటాడు. అక్కడ కాలేజీలో పిల్లలు అతడ్ని నానాఅగచాట్లు పెడుతుంటారు. ఒక లెక్చరర్‌తో ప్రేమలో పడతాడు. అంతలోనే ఒక స్టూడెంట్ అమ్మాయి చేత అతడ్ని ఒకచోటికి పిలిపించి, ఫోటోలు తీసి, ఆ లేడీ లెక్చరర్‌కు కుర్రాళ్ళు పంపిస్తారు. అతడు కుర్రాళ్ళని లైన్‌లో పెట్టడం వాళ్ళకి నచ్చదు. ఆ నది ఒడ్డున పొదల్లో వ్యభిచారిణులతో వున్న తన మేనమామను చూస్తాడు. ఈ విషసంస్కృతిలో నిండిన యీ పట్నం కాలేజీలో వుద్యోగంకంటే, మావూరి పాఠశాలే ఎంతోనయం అని అతడు తిరిగి తన వూరువచ్చి పిల్లలకు ప్రశాంతంగా పాఠాలు చెప్పుకుంటాడు. ఈ కథ ఆద్యంతం పట్టణ, మరియు నగర సంస్కృతికి అద్దంపడుతుంది. పల్లెటూరిలో వుండే పచ్చని హాయిని మనకు పరిచయం చేస్తుంది. చాలా చక్కని కథ అండి. చదవండి.

'సంధి' కథ. జీవిత వైఫల్యాలు మనుషుల్ని ఎలా వెంటాడుతాయో చెప్తుంది. వాటినుంచి మనిషి బయటకు రావాలని ఉద్బోధిస్తుంది. ఈ కథ చాలా బాధకల్గిస్తుంది అటువంటి వారిని తలచి.

'రింగ్' కథ కూడా అంతే. ఇందులో హీరోయిన్ సైకాలజీ ప్రొఫెసర్. ఆమె ప్రేమించిన యువకుడు తాను ప్రేమించిన అమ్మాయి చనిపోవడంతో పిచ్చివాడైపోతాడు. ఆమె యిచ్చిన వుంగరాన్నే చూసుకుంటూ ఏడుస్తూవుంటాడు. ఈమె అతడి నుంచి ఆ

వుంగరాన్ని దొంగిలించి, ఆ రింగ్ కనబడకుండా చేసి అతడ్ని మామూలు మనిషిగా చేస్తుంది. తన స్నేహితుడి దగ్గర వుండే రింగ్ యీమె దగ్గరకి ఎలా వచ్చింది? అన్న అనుమానంతో వున్న హీరో, ఆమెచెప్పిన కథ విని హతాశుడౌతాడు. వాళ్ళిద్దరూ ఒకటైనట్లుగా చూపుతూ ఏం జరిగిందో మీరేఊహించుకోండి అనేస్తారు కథకులు. చాలా ఆలోచించవలసిన కథ.

'ఇంకోసీత' కథలో, దేశదేశాలు తిరిగే ఒక సీత, ఉదారవ్యాపారస్తుడి సహాయం కోసం, తన భర్త ఆపరేషన్ నిమిత్తం విధిలేక వస్తుంది. భర్తపట్ల ఆమెకు గల ప్రేమకు స్పందించిన అతడు ఎంతకావాలంటే అంత తీసుకోమ్మా! అంటూ బ్లాంక్ చెక్ యిస్తాడు. ఆ సంగతిని అతడు మరిచిపోతాడు కూడా. ఆమె ప్లేసులోకి మరొక టెలిఫోన్ ఆపరేటరు వస్తుంది. ఒక రోజున ఒక టెలీఫోన్ ఆపరేటర్ మీకొక వుత్తరం వచ్చింది. తీసుకువెళ్ళండి' అంటే వెళ్ళి తీసుకుంటాడు. అప్పుడు ఆమె, సీత ఆత్మహత్య చేసుకుని చనిపోయింది అని చెప్తుంది. అతడు నిర్ఘాంతపోతాడు. ఆ వుత్తరంలో ఆమె ఏమి రాసింది? అతడు వెంటనే కసిగా ఏమి చేయడానికి ఎవరి దగ్గరకు వెళ్ళాడు? మీరే చదవండి. ఆమె ఆత్మహత్యకు కారణం అయిన వారిపట్ల నిజంగా మనకు కూడా అంత కోపం, కసి రాకమానవు.

'కిం కర్తవ్యమ్' అనే చిన్న కథలో, తల్లి గర్భిణిగా మొదటి రెండునెలలో పుష్టికరమైన ఆహారం తీసుకోకపోతే, ఆ తరువాత ఎంతమంచి తిండిపెట్టినా, గర్భస్థశిశు వులో కలిగిన ఆహారలేమి ఫలితాలు, వాళ్ళని వెంబడిస్తూనే వుంటాయన్న సత్యాన్ని యీ కథలో యిరువురూ, సోమరిపోతు అయిన ఒక కొడుకు మాటల ద్వారా మనకి తెలుపుతారు. పిల్లలు సోమరిపోతులుగా, తిరుగుబోతులుగా సంఘవ్యతిరేకులుగా తయారవడానికి యీ వొక్క సంగతే కారణం అని చెప్పలేం. మొదటి రెండు మూడు నెలల్లో మంచి ఆహారం తీసుకున్న తల్లులకు పుట్టినవాళ్ళు కూడా స్వార్థపరులుగా, ఆశపోతులుగా, క్రూరులుగా వుండటం మనం చూస్తున్నాం. అయితే యీ కథలో కథకులు చెప్పిన కారణాన్ని పూర్తిగా నిరాకరించలేం. మంచి కథ. చదవండి.

'లోకం అంచున యిద్దరు' అంతా భావ భౌతిక సంఘర్షణల ప్రతిరూపం. ఒక సైంటిస్టు భర్త యొక్క నిరాదరణను తట్టుకోలేని ఒక యువతి, ఒక మానసిక వైద్యుని సలహాకోరుతూ అతడికి చేరువౌతుంది. అంతవరకూ దారితెన్నూలేని ఆ మానసిక వైద్యుడు ఆమెను వివాహం చేసుకుని, అరకులోయ వెళ్ళినప్పుడు, కారు చెడిపోయి దగ్గరలో కల ఒక లాడ్జికి విధిలేక వెళ్తారు. అక్కడ క్రూరులైన పోలీసులు అతడి నెత్తిమీద మోది ఆమెను మానభంగం చేసి చంపేస్తారు. ఈ పరిస్థితి నుండి తట్టుకోలేక అతడు ఆత్మహత్య చేసుకునే సమయంలో, ఆ పరిస్థితులలో అతడు చెప్పిన సలహాకు ఒక యువతి సంతోషంగా వెళ్ళిపోగా, చాటునుంచి వారి మాటలు వింటున్న ఒక యువకుడు అతడి

దగ్గరకు వచ్చి, మాటల్లో అతడు ఆత్మహత్య చేసుకోబోతున్న విషయం తెలుసుకుని, మీరిలా చేస్తే మా లాంటివాళ్ళు ఏం కావాలి? అంటూ ప్రశ్నిస్తూ, అతడు ఆఆలోచనను విరమించుకునేటట్లు చేస్తాడు. చాలా గాఢమైన మానసిక ఉధృతుల మధ్య, స్వేచ్ఛకోసం ఒకరూ, సమభాగస్వామికోసం ఒకరూ పడే ఘర్షణ, ఆశాభంగాలు... యిన్ని కలుస్తూ, ఒక సోషియోసైకలాజికల్ ఫాంటసీ కథ చదివాము అనిపింపచేస్తుంది యీ కథ. విభ్రమకలిగిస్తుంది.

'నిర్ణీతగమ్యాలు' కథ కాస్తంత నవ్వు తెప్పిస్తుంది. తీసుకోవలసిన నిర్ణయాలపట్ల చేసే తాత్సారాలకు తోడు, కాలం కూడా అనుకూలించకపోతే, మనకు దొరకవలసింది మరొకడికి అందుతుంది. నిర్ణయాలు తీసుకునేటప్పుడు, బాగా యోచనలు చేసి త్వరగా తీసుకోండని చెప్తుందీ అందమైన నవ్వుతెప్పించే ఆశాభంగం కథ.

'నిషిద్ధ ద్వారాలు' అన్న కథలో ఒక యువ సైకాలజిస్టు దగ్గరకు వచ్చిన యువతి, అతడి గుణగణాలను చూసి, అతడినే వివాహం చేసుకోవాలని తలుస్తుంది. వివేకవంతుడైన అతడు ఎంతో సంయమనంతో ఆమెని వారించి పంపుతాడు. ఈ కథలో హీరో వ్యక్తిత్వం, అతడి మాట తీరు, సంయమనం, మనోశాస్త్ర విషయాల బోధన ఎంతో చక్కగా వుంటాయి. కథకులు యిద్దరూ మనోవైజ్ఞానిక శాస్త్రంలో ప్రావీణ్యులై వుండటం చేత, వారి వ్యక్తిత్వ వికాసాలే కథల్లోకి కూడా వచ్చివుంటాయని అనిపిస్తుంది. నాకు తెలిసి శ్రీ పి.వి.కృష్ణారావు గారు కూడా అటువంటి ఉదాత్త చరితుడే.

ఇంక చివరి కథా, శ్రీ పి.వి. కృష్ణారావుగారు యించుమించు చిన్నప్పటినుంచీ రాయాలని కోరుకుంటూ, యీ సందర్భంగా రాసిన అలిఖితం అన్న కథ, ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ వున్న తెలుగు కథ. గుండె పట్టేస్తుంది. ముగింపు వచ్చేసరికి గుండె సజలం అయిపోతుంది.

కొత్తదనం, మానవత్వం, కాలానికి తగిన కాలాన్ని అతిక్రమించని స్వేచ్ఛా భావనలు వున్న ఒక నైతిక జీవన పద్ధతి యినుమడించిన కథలు ఇవి. చాలామటుకు సైకలాజికల్ డైమన్షన్స్ వున్న కథలు. శ్రీ వేములపల్లి మోహనరావుగారు వదిలివెళ్ళిన కథను శ్రీ పి.వి. కృష్ణారావుగారు పూర్తి చేయాలని నా కోరిక.

తన స్నేహితులు శ్రీ వేములపల్లి మోహనరావుగారి జ్ఞాపకాలలో బాధ చెందుతూ, ఆయన స్మృతికి జ్ఞాపకంగా తానూ, ఆయనా కలిసి రాసిన కథలను, ఇలలో అయినా శాశ్వతంగా పుస్తక రూపేణ వుండాలన్న లోతైన ప్రేమతో శ్రీ పి.వి. కృష్ణారావుగారు చేస్తున్న యీ ప్రయత్నం, స్నేహాభిమానాల విషయంలో అతి చక్కని సాహితీ స్నేహవనం లాంటిది. నేనున్నూ వారి యందు గౌరవంతో, స్నేహానికి వారిచ్చిన గౌరవానికి అచ్చెరువందుతూ యీ కథా సంకలనం తెచ్చే నిర్వహణాభారాన్ని, సంపాదకత్వాన్ని,


ఆవిష్కరణని ఐచ్ఛికంగా ఔదల దాల్చాను. నాకు నిజంగా చాలా సంతోషంగా వుంది. పాఠకులు యీా స్నేహదీపికలను సమ హృదయంతో రిసీవ్ చేసుకుంటారని ఆశపడుతున్నాను. వారు ఏమాత్రం పుస్తకం తిరగేసినా, అది వారికి కొత్త ప్రపంచాన్ని చూపెడుతుందనీ, నెమ్మది నెమ్మదిగా చివరి పేజీ వరకూ వారు వచ్చేస్తారని నా నమ్మకం.

ఈ గ్రంథం చివరలో శ్రీ పి.వి. కృష్ణారావుగారు రచించిన అపూర్వ గ్రంథాలు లభ్యం అయ్యే నెట్ చోట్లలోకి వెళ్ళి, వాటిని కూడా వారు చదవాలనీ, వాటిల్లో అందరికీ కావలసిన ఎన్నో విషయాలు వున్నాయనీ తెలుపుతూ, వాటిని విద్యార్థి యువకులందరకూ చేరవేయవలసిందిగా కోరుతూ... అందరికీ వందనాలు.

విశాఖమహానగరం - 41 మీ బుద్ధ పథగామి

తేదీ : 4.11.2022 **డి. నటరాజ్ శాక్య**

రచయిత ముందుమాట



వేములపల్లి మోహనరావు నా స్నేహితుడు, అంతకంటే ఎక్కువ. నేను ఎం.ఎ సైకాలజీ రెండో సంవత్సరం చదవటానికి ఆంధ్ర యూనివర్సిటీలో చేరినప్పుడు ఒకరికొకరం తారసిల్లాము. మోహనరావు ఎం.ఎ. పొలిటికల్ సైన్స్‌లో చేరాడు. హాస్టల్లో ఒకే రూమ్ మాకు కేటాయించడం వల్ల పరిచయం అభిరుచులు వల్ల స్నేహానికి దారితీసింది.

అప్పుడు హాస్టల్ విద్యార్థులకు ఒక కల్చరల్ అసోసియేషన్ ఉండేది. అలాంటిదే ఒకటి ఆర్ట్స్, కామర్స్, లా కాలేజీకి ఉంది. సాహిత్య పోటీలు జరిపి, ఆహ్వానించీ మేగజైన్ అచ్చేసేవారు. నాకు వ్యాసరచనలో, మోహన్‌కి కథల పోటీలో ప్రథమ స్థానం వచ్చాయి. 'ఇఫ్ ఐ వర్' అనే నా కథకీ మోహన్ వ్రాసిన ఒక కవితకీ ఆర్ట్స్ కాలేజ్ మేగజైన్‌లో స్థానం లభించింది. హాస్టల్ మేగజైన్‌లో కూడా ఏవో అచ్చయ్యాయి. పేర్లు నాకు గుర్తులేవు. నా వచన కవిత 'ఇంకా ఎన్నాళ్ళిలా?' ఒకటి మాత్రం గుర్తుంది. ఎందుకంటే అది నా కవితల సంపుటిలో అదే పేరుతో తర్వాత ఎప్పుడో అచ్చయింది. ఆ సంపుటిని ఈ పుస్తకం ఎడిటర్, పబ్లిషర్ అయిన డి. నటరాజ్ శాక్య ఎడిట్ చేసి పబ్లిష్ చేశారు.

నేను వయసులో కొద్దిగా పెద్దవాణ్ణి, సీనియర్‌ని కావటం వల్లనేమో మోహన్ నన్ను 'బాస్' అనేవాడు. మామధ్య స్నేహం పెరుగుతూ వచ్చింది. అది ఎన్నో సంవత్సరాలు కొనసాగింది, 2021 అక్టోబరులో మోహన్ కన్ను మూసేంతవరకు.

ఒకసారి టౌన్‌లో సినిమా చూసి హాస్టల్‌కి నడిచి వెళ్దామని సరదా పడ్డాము. నడుస్తుంటే గవర్నర్ బంగళా సమీపంలో ఎయిరిండియా వారి పెద్ద బిల్‌బోర్డుని నేను గమనించాను. 'గో వెస్ట్ యంగ్‌మాన్' అని వ్రాసి ఉంది. నేను మోహన్‌తో 'ఆ పేరుతో ఒక మంచి కవిత రాయొచ్చు' అన్నాను. ఆ తర్వాత కొద్ది రోజులకి

"గో వెస్ట్ యంగ్ మాన్
ఏముంది ఈ దేశంలో

నీ మాతృ కోశంలో...”

అని మొదలుపెట్టి దేశ పరిస్థితులమీద, యువత నైరాశ్యం మీద వ్రాశాడు. నేను ఆశ్చర్యపోయాను. నేను ఆస్కార్ వైల్డ్ వ్రాసిన ‘ది పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే’ కథని సంక్షిప్తంగా చెబితే తరువాతెప్పుడో ఆ కథ వ్రాసి యువలో అచ్చయినదాన్ని చూపించాడు. అది ఈ సంపుటికి లభించలేదు. అతని శైలి, భావ వ్యక్తీకరణలకి నేను ముగ్ధుడైనాను.

నేను ఎం.ఎ. పూర్తి చేసి, రిజల్ట్సు వచ్చాక, నేను చదివిన డిపార్టుమెంట్‌లోనే, రీసెర్చికి చేరి నెల తిరక్కుండానే అసోసియేట్ లెక్చరర్ అయ్యాను. అప్పట్లో సీవ్యూ హొటల్ వెనక ఉన్న చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని ఉండేవాణ్ణి. అక్కడికి మోహన్ ఎం.ఎ. రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు తరచూ వచ్చేవాడు. సాహిత్యం, సినిమాలు, సమాజం మా ముచ్చట్ల అంశాలు.

చదువు పూర్తి కాగానే మోహన్ విజయవాడ, అతని స్వస్థలం వెళ్ళిపోయాడు. అక్కడ ఒకటి రెండు కాలేజీల్లో లెక్చరర్‌గ చేశాడు. కొన్నాళ్ళ తర్వాత మంచి అవకాశం లభించటంతో ఒక పెద్ద వ్యాపార సంస్థలో చేరటానికి అబుధాబి వెళ్ళాడు. ఆబుధాబి, బొంబాయి, హైద్రాబాద్, విశాఖపట్నం, కాకినాడల్లో వ్యాపారరీత్యా ఉన్నాడు. అతనెక్కడున్నా మా స్నేహం కొనసాగింది.

‘మనిషికాటు’ అన్న పేరుతో ఒక నవల వ్రాసి నాకు పంపుతూ సైకాలజీ, పేరా సైకాలజీ అంశాలు ఈ నవల్లో టచ్ చేశాను, నువ్వు వాటిని డెవలప్ చేసి తిరిగి నాకు పంపు అన్నాడు. చేసి పంపాను. అది మోహన్‌కి బాగా నచ్చింది.

ఆ తర్వాత మోహన్ ఎన్నో కథలు వ్రాశాడు. నాకు కొన్ని పంపేవాడు. నేను చేర్పులు మార్పులు చేసి తనకు తిరిగి పంపేవాణ్ణి. నేను రాసిన రెండు మూడు కథల్నీ నేనూ తనకి పంపాను. నేను చేసిన పనే అతనూ చేశాడు. క్రమంగా కెరీర్ డవలప్‌మెంటులో నేను, వ్యాపారపు పనుల్లో, పర్యటనల్లో మోహన్ బిజీ అయ్యాము. కొన్ని సంవత్సరాలకి మోహన్ కొంతైనా స్థిరపడదామని, గల్ఫ్ దేశాలకి ఇండస్ట్రియల్ సాల్ట్ ఎక్స్‌పోర్టు చేస్తూ విశాఖ, కాకినాడల్లో కొన్నాళ్ళు ఉండి చివరకి కాకినాడ నివాసంగా సెటిల్ అయ్యాడు. మేము కలసి వ్రాసింది తక్కువే అయినా అది ఎన్నో సంవత్సరాల పాటు కొనసాగింది, నేను 2005లో అమెరికాకు వచ్చేసే దాకా, అక్టోబర్ 2021 నుంచీ అతను నాకు జ్ఞాపకంగానే మిగిలిపోయాడు. అందుకే ఈ సంపుటి అతని స్మరణకోసం. శ్రీకాకుళం కథానిలయం కె. సుబ్బారావు గారు (కాళీపట్నం రామారావు మాష్టారి తనయుడు) ఈ కథల్ని వెతికి పట్టుకొని మాకు ఇచ్చారు. వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఆయన వల్లనే ఈ సంపుటి సాధ్యమైంది. నామిత్రుడు నటరాజ్ శాక్య ఎంతో శ్రమకోర్చి ఆ కథల్ని, నవలల్ని ఒక సంపుటిగా

ప్రచురించారు. అతని కృషి, ఇన్‌వాల్వ్‌మెంట్ నేను మరువలేనివి. నటరాజ్‌తో నా స్నేహం దశాబ్దాల నాటిది. మా తొలి పరిచయం 1982లో. నటరాజ్ బౌద్ధ జీవన శైలితో జీవిస్తూ, పరిపూర్ణత వైపుకు అడుగులు వేయటం నేను గమనిస్తూనే ఉన్నాను. అలాంటి స్నేహితుడు ఉండడం నాకొక గర్వకారణం.

వీల్‌ఛైర్‌కి పరిమితమైన మా అబ్బాయి రాజాకి ఉచితంగా ట్యూషన్ చెప్పాడు కొన్నాళ్ళపాటు. అప్పుడే అతని సేవాతత్పరత, కారుణ్యం నాకు అర్థం అయ్యాయి. మా రెండు కుటుంబాల మధ్య స్నేహం కుదిరింది. అతను క్రమంగా బౌద్ధం పట్ల ఆసక్తుడై, ఎంతో సాహిత్య మథనం చేసి, అర్థం చేసుకొని గౌతమ బుద్ధుడి మీద ఒక పుస్తకం వ్రాశాడు. ఎందరో ప్రముఖులతోపాటు నేను కూడా ఒక ముందు మాట వ్రాశాను. ఆ తర్వాత మరో రెండు పుస్తకాలకి కూడా. అతను క్రమంగా విస్తృత రచయితగా మారి సమాజ స్పృహ కలిగించే, వ్యక్తి శ్రేయస్సును కాంక్షించే ఎన్నో రచనల్ని చేశాడు. అతని రచనల్ని మీరు ఈ పుస్తకం చివరన చూడవచ్చు. నాగార్జునుడి మీద శాక్య వ్రాసిన పుస్తకం మరొక ఆణిముత్యం.

నా 'ఇంకా ఎన్నాళ్ళిలా' కవితా సంకలనం, యీ 'కల్లోల జీవితాలు' రూపుదిద్దుకున్నాయంటే అది నటరాజ్ శాక్య వల్లనే. నేను శాక్యకి ఋణగ్రస్తుణ్ణి.

ముగించే ముందు రెండు విషయాలు మీకు చెప్పాలని ఉంది. అమెరికాలో రీసెర్చ్ చెయ్యడానికి 1982లో నాకు చిన్న ఫిలోషిప్ వచ్చింది. కానీ ప్రయాణపు ఖర్చులు నేనే భరించాలి. అదేవిషయం మోహన్‌కి వ్రాశాను. కొద్దిరోజులకు నాకు తన నుంచి ఒక కవర్ వచ్చింది. చించి చూస్తే దాన్లో ఒక ఎయిరిండియా టికెట్టు ఉంది అయితే యూనివర్సిటీ నాకు చాలా ఆలస్యంగా లీవ్ ఇవ్వడంతో ఆ సంవత్సరం నేను వెళ్ళలేక పోయాను. టికెట్టు వెనక్కి పంపాను. మరుసటి యాడాది అమెరికా వెళ్ళి మోహన్‌కి ఆ సంగతి తెలియజేశాను.

నేను అమెరికాకు వెళ్ళే కొన్ని సంవత్సరాల ముందు మోహన్ నాకొక నవల మాన్యుస్క్రిప్ట్ పంపాడు. మార్పులు చేర్పులతో దాన్ని నేను వెనక్కి పంపలేక పోయాను. ఆ మాన్యు స్క్రిప్ట్‌నీ నేను పోగొట్టుకున్నాను. ఒక టీనేజర్ అంతరంగ జీవిత చిత్రణ అది. సెక్స్ గురించి విపరీతంగా ఆలోచిస్తూ అతను " రీ ఇఫికేష్ ఆఫ్‌ది సబ్జక్టివ్ " అనే మానసిక స్థితికి లోనవుతాడు. అతడి ఊహలు, ఆలోచనలు, మానస ప్రతిమలు, భ్రమలు అతని కళ్ళెదుట సాక్షారించడం మొదలై అతని వాస్తవ రేఖను దాటి కాల్పనికతలో జీవించడం మొదలుపెట్టి మానసిక రోగిగా మారతాడు. ఇదంతా గమనించిన అతని మేనమామ ఒక సైకాలజిస్టుకు అతన్ని చూపిస్తాడు. క్రమంగా ఎన్నో సెషన్ల తరవాత తన స్థితిని గుర్తెరిగి ఆ సైకాలజిస్టు సాయంతో వెనక్కి, వాస్తవంలోకి అడుగు పెట్టి, మెరుగుపడి, తన చదువు కొనసాగిస్తాడు.

మోహన్ ఆ యువకుడి అంతరంగ చిత్రణని, సెక్సువల్ ఫాంటసీలని అద్భుతంగా వ్రాశాడు.

సాహిత్యం, కళలు వాస్తవాన్నుంచి కాల్పనికత వైపుకు టేక్ ఆఫ్ చేస్తాయి. మా కథలు అంతే. మోహన్‌కి వచ్చిన మనో, పరామనో విజ్ఞాన సంబంధమైన ఆలోచనలు నిజంగా నాకు ఒక ఆశ్చర్యం. అతని భావజాలం, సరళమైన భాష ఎప్పుడూ నన్ను ఆకట్టుకొనేవి.

తన జ్ఞాపకంగా యీ కల్లోల జీవితాలు సంకలనాన్ని వెలువరించడం నాకెంతో సంతోషం కల్గిస్తూ వుంది. అతడి మధుర స్మృతులు ఎప్పుడూ నన్ను వెన్నంటే వుంటాయి.

పి. వి. కృష్ణారావు

విషయసూచిక



చీకటి కోణాలు

వేములపల్లి మోహనరావు – పి.వి.కృష్ణారావు

న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్ అబ్జర్వేషన్ డెక్ మీద కలిసింది సుధ నాకు. స్టాట్యూ ఆఫ్ లిబర్టీని చూడటానికి టెలిస్కోప్‌లో వెయ్యడం కోసం జేబుల్లో డైమ్స్ వెదుక్కుంటూ వెనగ్గా చీర రెపరెపమంటే, తిరిగి చూశాను. మరుక్షణంలో నా ప్రసన్నత మాయమైంది. ఆ నూట ఏడో అంతస్తులో నుంచి ఆ అమ్మాయిని కిందకు విసిరెయ్యాలనే బలీయమైన కోరికను ఎలా నిగ్రహించుకోగలిగానో నాకే తెలియదు. బహుశా నా జుగుప్స తాలూకు చిహ్నాలు ఆమెను బాగా గాయపర్చి ఉండాలి. కానీ

ఆ చిన్నబోయిన మొహం నాలో ఎటువంటి జాలినీ కలిగించలేదు.

సుమారు ముప్పై ఏళ్ళ క్రితం దేవుడు ఓ అందమైన విగ్రహాన్ని సృష్టించి ప్రాణానికి బదులు విషం నింపి, ఆ వ్యక్తిని భూమ్మీదకు పంపితే, ఆమెను కన్న రాక్షసుడు, సుధ అనే తియ్యని పేరు తగిలించి ముషల మీదకు వదిలితే బలైపోయిన వాళ్ళలో నేనూ ఒకణ్ణి.

'శశీ' అందామె వారిస్తున్నట్లుగా.

వెయ్యబోయిన అడుగు ముందుకు పడలేదు నాకు.

'ఎప్పుడొచ్చావ్?'

'మొన్న'

'ఎక్కడుంటున్నావ్?'

'బంధువులింట్లో'

చిన్నగా నవ్విందామె 'నేనూ వెస్టర్న్‌లోనే దిగాను.'

ఆ హొటల్ మీద అంతకు ముందు ఎప్పుడూ లేని అసహ్యం కలిగింది.

'తెలిసీ ఎందుకడిగావ్, నన్ను వెంటాడుతున్నావా?' కటువుగా అన్నాను.

ఆమెకు ఉన్న ఆస్తి అహం. ప్రపంచంలో అందరికన్నా ఐశ్వర్యవంతురాలామె. తనను నొప్పించే ఏ చిన్న అవకాశాన్నీ నేను జారవిడువలేదు.

'వెంటాడాల్సిన అవసరం నాకు లేదు శశీ. లోకం చాలా చిన్నది చుట్టిరావడానికి రోజు పట్టదు. స్నేహితులను కలుసుకోవాలంటే వెంటపడనక్కరలేదు అనుకోని సమావేశాలు అత్యంత సహజాలు.'

'మొదటిది. నేను నీ స్నేహితుణ్ణి కాను. స్నేహానికి అర్థం నువ్వనుకునేదే అయితే ఆ బంధానికి ఎటవంటి మధురిమా ఉండదు. రెండు, ఇంతకు ముందు వరకూ మనిషి ముందు ప్రపంచం చాలా చిన్నది అని గర్వించేవాణ్ణి. మన ఈ కలయికతో అది మరీ ఇంత చిన్నదైపోయినందుకు విచారిస్తున్నాను.'

ఎదుటివాళ్ళను ఏడిపించడానికి మాటల కన్నా పదునైన అస్త్రాలు లేవు. వాటిని తట్టుకుని నిలబడగల శక్తి ఏ మానవ సంబంధాలకూ లేదు. తడిసిన కళ్ళను ఆమె పక్కకు మరల్చుకోవడమే నాకు అవకాశంగా భావించి గబగబా ముందుకు నడిచాను.

నాకు తెలుసు. అవమానింపబడటం కన్నా ఆత్మహత్యే శ్రేయస్కరం కొందరికి. ఎక్స్‌ప్రెస్ లిఫ్ట్‌లో నేను గ్రౌండ్‌ఫ్లోర్‌కు దిగిన యాభై ఎనిమిది సెకన్లూ అన్ని యుగాలు.

*   *   *

లాంగ్ ఐలండ్‌లో పని పూర్తి చేసుకుని నేను జేఎఫ్‌కేకి వచ్చేప్పటికి ఎయిర్ ఫ్రాన్స్ ఫ్లైట్ టేకాఫ్‌కు రెడీగా ఉంది. బోర్డింగ్ కార్డు తీసుకుని చెకిన్ అయ్యాను. ఎయిర్ హెూస్టెస్ చూపించిన సీట్లో కూర్చోబోతూ పక్కనున్న వ్యక్తిని చూసి త్రాచుపాముమీద కాలు పెట్టినవాడిలా అయిపోయాను. ఎకానమీ క్లాస్‌లోకి పారిపోదామనిపించింది.

'నేనేం దెయ్యాన్నీ, భూతాన్నీ కాదు నిన్ను మింగడానికి, కూర్చోవచ్చు' అంది సుధ.

'అయినా బాగుండేది. ఈ చిత్ర హింసలకన్నా ఆకస్మిక మరణం చాలా ఆనందకరం కదూ' అన్నాను కోటు విప్పి ఎయిర్ హెూస్టెస్ కిస్తూ.

'నీ కెందుకింత ద్వేషం శశీ నా మీద, నేనేం చేశాననీ?'

సూటిగా చూశాను ఆమె కళ్ళలోకి. వాటిలోని నిర్మలత్వం ఒక్కసారి నా పగమీద నీళ్ళు చల్లింది...నేనే పొరపాటు పడ్డానేమో.

'నీకు తెలీదా, తెలియకుండానే మనుషుల్ని పొట్టన పెట్టుకున్నావా' అన్నాను.

ఓ నిముషం మౌనంగా గడిచిపోయింది.

'అవున్లే, నువ్వు మాత్రం అందరిలాంటివాడివి కాదూ అందులోనూ మగవాడివి.'

మొహం పక్కకు తిప్పుకుందామె. నేనేం మాట్లాడలేదు. హేండ్‌బాగ్‌లో నుంచి కర్చీఫ్ తీసుకుంది.....అదే పరిమళం...పదేళ్ళ క్రితంనాటి ఇంటిమేట్ పరిమళం.

'లోకులు అనుకునేదే నీకు తెలుసు కానీ నిజమేమిటో కనుక్కునే ప్రయత్నం చేశావా ఎప్పుడైనా' అందామె మెల్లగా.

'నిజం నాకన్నా బాగా తెలిసినవాడెవడూ లేడు. కళ్ళు మూసుకుని పాలు తాగే పిల్లులకే ఉంటాయి భ్రమలు.'

నేను ఏ విషయాన్నైతే మర్చిపోవడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నానో, అదే నన్ను నీడలా వదలడం లేదు. కాలం మాన్పలేని గాయం ఒకటి నన్నిలా వేధిస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు.

'నాకు అన్నీ తెలుసనుకోవడం ఆ మనిషి అవివేకాన్నే సూచిస్తుంది' అందామె.

నేనేం మాట్లాడలేదు. కళ్లు మూసుకున్నాను. పదేళ్ళ క్రితం....

*　　*　　*

'కూర్చో' అన్నాడు రామనాథరెడ్డి

'ఫర్వాలేదు....చెప్పండి'

'ఏమిటి, కాలేజీ ప్రెసిడెంటుగా పోటీ చేస్తున్నావట.'

'అవును'

'మా సుధ నిలబడుతోంది తెలుసుగా'

'తెలుసు'

ఒక్కసారిగా లేచాడు అతను.

"ఎన్ని గుండెల్రా నీకు....అన్నీ తెలిసే తెగించావన్నమాట. చూస్తాను. మీ బాబు పనిచేసేది మా బావమరిది కృష్ణమూర్తి ఫాక్టరీలో, నీ చెల్లి చదివేది మన కాలేజీలో. మీ అమ్మకు మందులు కొనడానికి డబ్బుల్లేవని ఓ పక్క మీ నాన్న అఘోరిస్తుంటే ప్రెసిడెంట్ గిరీ కోసం పాకులాడుతావన్నమాట నువ్వు....చూస్తాను. అదీ చూస్తాను.' లోపలికి వెళ్ళిపోయాడు.

ఓ నిముషంపాటు ఆ విశాలమైన హాల్లో ఒంటరిగా నిలబడిపోయాను. నా పరిధులు నాకు తెలుసు. కొండను ఢీకొనడం కేవలం మూర్ఖత్వం, పదవి కోసం నా వాళ్ళందర్నీ బలిపెట్టుకోలేను.

మర్నాడు కాలేజీలో అందరూ దుమ్మెత్తిపోస్తున్నా వినకుండా నామినేషన్ ఉపసంహరించుకున్నాను.

* * *

లాగి చెంపమీద కొట్టాడు అరుణ్. దెబ్బతో ఆ అమ్మాయికి కళ్ళుబైర్లు కమ్మాయి. ఒంట్లోని రక్తమంతా మొహంలో కేంద్రీకృతమైనంత ఎర్రబడిపోయిందామె. తెల్లబోయి చూస్తున్న మమ్మల్నందర్నీ వదిలేసి కారెక్కి వెళ్ళిపోయింది. తన స్నేహితురాళ్ళు 'సుధా సుధా' అని పిలుస్తున్నా వినిపించుకోకుండా.

అంతకుముందు, అరుణ్, రవీ, నేనూ మెట్లు దిగి వస్తున్నాం. కారిడార్ మలుపు తిరుగుతూ, చూసుకోకుండా ఆ అమ్మాయిని ఢీకొట్టాడు అరుణ్. ఆమె చేతిలో పుస్తకాలు కిందపడిపోయాయి.

'యూ బ్లడీ! కళ్ళు నెత్తికెక్కాయా' అందామె పొగరుగా.

సారీ చెప్పబోతున్నవాడల్లా ఆగిపోయాడతడు.

'ఏమిట్రా అలా చూస్తావ్....ఎవరనుకున్నావ్ నన్ను. ఆడపిల్ల అంటే అలుసు కదూ మీ అందరికి. నేను తల్చుకుంటే మిమ్మల్నందర్నీ సున్నంలోకి ఎముక లేకుండా చేస్తాను, బాస్టర్డ్స్."

అంతే మరునిముషం ఆ అమ్మాయి దవడ పేలిపోయింది.

'నీ కేమన్నా పిచ్చెక్కిందా?

ఏమిటా పని' అన్నాను నేను అరుణ్ వైపు కోపంగా చూస్తూ

'లేకపోతే ఎంత గర్వంరా దానికి. దీని బాబు కమిటీ ప్రెసిడెంటయితే ఎవడికి గొప్ప! వీళ్ళకు కోట్లకొద్దీ డబ్బుంటే ఎవడికి లెక్క! అపోజిషన్ వాళ్ళమనే కదూ కడుపుమంట... ఇంకో సారి అలా వాగమను, పళ్ళు రాలగొట్టి చేతికిస్తాను' అన్నాడు అరుణ్.

వాడు నాకు ఆరో ప్రాణం. నాకున్న ఒకే ఒక్క నిజమైన స్నేహితుడు.

'నీకు ఆవేశం తప్ప పర్యవసానాలు ఆలోచించే ఇంగితజ్ఞానం లేదురా, వాళ్ళకు ఎదురు నిలబడి ఎంతకాలం బ్రతగ్గలవ్....చివరికి నష్టం ఎవరికి?

'చూడు శశీ–మనిషికి ఆత్మ గౌరవం అనేది ఒకటుంటుంది. అది ఎవర్నీ దేన్నీ లక్ష్యపెట్టనివ్వదు. ఆఖరికి ప్రాణాల్నయినా సరే....'

అదే చివరిసారి నేను వాణ్ణి ప్రాణాలతో చూడటం.

* * *

విమానం హోరు నన్ను వర్తమానంలోకి తీసుకొచ్చింది. ఎదురుగా తెరమీద జాన్‌వేన్ ఎవరెవర్నో చంపేస్తున్నాడు. పక్కకు తిరిగాను, సుధ కూడా సినిమా చూడటం లేదు. గడ్డంకింద చెయ్యి పెట్టుకుని అనంతమనే శూన్యంలోకి చూస్తోంది.

నా చూపులు ఆమెను తాకాయి కాబోలు. ఇటు తిరిగింది. నిస్తేజమైన ఆ మొహంలో అర్థంకాని అనేక భావాలు.

నిట్టూర్చిందామె, ఏదో చెప్పడానికి ముందు అది ఉపోద్ఘాతమని నాకు తెల్సు.

'నిజం, వివేకం, మానవత్వం, ఇంగితం వీటన్నిటికీ ఓ పెద్ద శాపం ఉంది శశీ, ఏమిటో తెలుసా? అది అజ్ఞాతవాసం, అవి ఎప్పుడో గానీ బయటకు రావు. కానీ అప్పటికి జీవితాలే నాశనమైపోయి ఉంటాయి.

అంతసేపు సాన్నిహిత్యం ఆమె మీద నాకు ఏళ్ళ తరబడి పేరుకుపోయిన కక్షను కొద్ది కొద్దిగా కరిగిస్తోంది.

'అది కేవలం యాక్సిడెంటేననీ, నేను కావాలని చేయించింది కాదనీ అప్పుడూ ఎవరూ నమ్మలేదు. ఇప్పుడూ ఎవరూ నమ్మడంలేదు.'

రక్తం మడుగులో దొర్లుతున్న అరుణ్ శరీరం గుర్తొచ్చి నా పిడికిళ్ళు అప్రయత్నంగా బిగుసుకున్నాయి.

'నువ్వే ఆలోచించు... ఆ ఇరుకు రోడ్డు మీద మావి కనీసం పాతిక లారీలైనా గంటకోసారి అటూ ఇటూ తిరుగుతుంటాయి. ఆ సంఘటన కేవలం యాదృచ్ఛికం

కావడానికి వీల్లేదా? డాక్టర్లు కూడా సర్టిఫై చేశారు, డ్రైవరు బాగా తాగి ఉన్నాడని!'

'సర్టిఫికెట్లుకేముంది! డబ్బుంటే ప్రపంచం మొత్తం సముద్రంలో మునిగిపోయినట్టు కాగితాలు సృష్టించవచ్చు' అన్నాను.

'నీకర్థం కాదు శశీ నీకెప్పటికీ అర్థం కాదు. నేను పొగరుబోతునైతే కావచ్చు, కానీ హంతకురాలిని కాలేదు, కాలేను, ఓ మనిషి ప్రాణాలు నిలువునా బలితీసుకునేంత రాక్షసత్వం నాలో లేదు చాలా సెన్సిటివ్' నేను.

'అవునట, మొత్తం మన ఊరంతా అదే విషయం చెప్పుకుంటూన్నప్పటికీ.' నా ద్వేషాన్ని దాచుకునే ప్రయత్నం చెయ్యలేదు.

రెండు క్షణాల పాటు ఇంజన్ల శబ్దాలు మా మధ్య మౌనాన్ని కర్కశంగా కోశాయి.

స్టెర్‌ఫ్రెష్‌తో చేతులు తుడుచుకుందామె. మెత్తని యుడికొలోన్ వాసన మా చుట్టూ అల్లుకుంది.

ఓడిపోతున్న లక్షణాలేవీలేవు ఆ మొహంలో.

'పోన్లే శశీ... నీకో కథ చెపుతాను, చాలా ఇంటరెస్టింగ్, వింటావా' నా సమాధానం కోసం ఆగలేదామె.

"ఆ దుర్ఘటన జరిగిన నెల రోజులకనుకుంటాను....ఆ రోజు సాయంత్రం మన కాలేజీ వెనక గోదావరి ఒడ్డుకు వెళ్ళాం నేనూ, మా నాన్నగారూ, రోజూ అలా కాసేపు నడిచిరావడం మా ఇద్దరికీ అలవాటు, అప్పుడప్పుడూ ఆయన నదిలో ఈతకొడుతూ ఉండేవారు. నేను ఇసుకలో పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటూ ఉండేదాన్ని.

'ఆ రోజు గోదావరి ఉధృతంగా ఉంది వరదవచ్చే సూచనలు కనిపిస్తున్నాయి ఆయన స్విమ్మింగ్ ట్రంక్స్‌లోకి మారబోతుంటే నేను వారించాను. కానీ ఆయన లక్ష్యపెట్టకుండా నదిలో దిగారు.

'నేను నా పుస్తకంలో మునిగిపోయాను. రెండు పేజీలు చదివి తలెత్తి చూశాను. అప్పటికే ఆయన సుడిగుండంలో ఇరుక్కుపోయి నిస్సహాయంగా కేకలు పెడుతున్నారు.

ఏం చెయ్యను, ఏం చెయ్యగలను? జన్మనిచ్చిన తండ్రి....రక్తం పంచిన తండ్రి.....నా కళ్ళముందే ప్రకృతి విలయతాండవానికి బలైపోతుంటే, దిక్కుతోచక అటూ ఇటూ పరుగులు తీశాను.....ఆ సమయంలో ఆ నిర్మానుష్యమైన ప్రదేశంలో ఎవరూ ఉండరని తెలిసీ అరిచాను....మొత్తుకున్నాను....వలవలా ఏడ్చాను కానీ

ఎవరు వింటారు నా గోడు....నాది అరణ్యరోదనే అయింది....అయిపోయింది, నా కళ్ళముందే ఆయన నదిలో ఐక్యమైపోయారు.

'నువ్వే నా స్థితిలో ఉంటే....కనీసం అక్కడుంటే ఏం చేసి ఉండేవాడివి శశీ?'

ఊహించని ఆ ప్రశ్నకు దిమ్మెరపోయాను....నా మనసులో ప్రచండ ఘోషలు మెదడులో వేయి సమ్మెటలపోట్లు.....శరీరమంతా వాటి తాలూకు ప్రకంపనాలు. హాండ్ రెస్ట్‌ను గట్టిగా పట్టుకున్నాను.

పారిస్ ఓర్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఫ్లైట్ లాండవబోతోంది.

గోళ్ళకున్న పాలిష్ చూసుకుంటూ అందామె.

కానీ నేననుకున్నట్టు ఆ ప్రదేశం అప్పుడు నిర్మానుష్యంగా లేదు శశీ, జరుగుతున్నదంతా చూస్తూ చెట్లచాటున నిలబడి ఉన్నాడో వ్యక్తి. అతను నాకు కూడా తెలుసు... అతనికి ఈత పోటీల్లో ప్రథమ బహుమతులు రావడం నాకు బాగా తెలుసు. గోదావరి ఈ చివర్నించి ఆ చివరిదాకా ఆగకుండా ఈదగల సత్తా ఉందనీ తెలుసు. కానీ...కానీ అక్కడ అతని ఉనికి నాకు తెలుసునని అతనికిప్పటి వరకు తెలియదు.

'ఓ వ్యక్తి, అతనెలాంటివాడైనా చచ్చిపోతుంటే....శక్తి ఉండీ రక్షించకపోవడం హత్యచెయ్యటం కన్నా మెరుగంటావా;'

నాకు ఒళ్ళంతా చెమటలు... నా తల పాతాళంలోకి కుంగిపోతున్న అనుభూతి ఎవరో నన్ను ముక్క ముక్కలుగా చీలుస్తున్న భావన....చిత్రహింస.

చిన్నగా నవ్విందామె.

'నాకతను బాగా తెలుసు ప్రపంచంలో ఎక్కడున్నా గుర్తుపట్టగలను. అతన్ని కలిశాను కూడా... కానీ నిందించడానికి ప్రయత్నించలేదు. ఓ స్నేహితుడిగానే ట్రీట్ చేశాను... ఎటోచ్చీ....'

'స్టాపిట్ సుధా....ప్లీజ్... ఫర్ గాడ్స్ సేక్ స్టాపిట్' మరు నిముషంలో నేను కొలాప్స్ అయిపోతాను.

'లోకంలో ఎవరూ పరిపూర్ణులు కారు శశీ......అందరికీ ఉంటాయి బలహీనతలు, నా అహం నా బలహీనత....నీ పగ నీకు బలహీనత....మా నాన్నగారికి ఆయన అధికారదాహం, మీ అరుణ్‌కు తొందరపాటు...ఏదో లోపం లేనిదెవరికి. ఆఖరికి దేవుడనే వాడొకడుంటే అందరికన్నా పెద్ద బలహీనత వాడికీ ఉంది. అదే ఈ అవకతవకల సృష్టి.

'ఎదుటివాణ్ని విమర్శించే అర్హత ఎవరికీ ఎప్పుడూ లేదు ఐనా అది సహజం. కానీ నిందించడం, మాటల్తో మనుషుల్ని రంపపుకోత కొయ్యడం కేవలం మానసికంగా పతనమైపోయిన రాక్షసులు శాడిస్ట్‌లు చేసేపని, వాళ్ళకు నిష్కృతి లేదు కానీ, అంతో ఇంతో చదువుకుని మిగతా వారికన్నా అన్నిట్లోనూ ఓ మెట్టు పైన ఉన్నవారు, ఇంకొంచం హుందాగా మనుషుల్లా ప్రవర్తించాలి.'

లేచిందామె

మేమిద్దరమే మిగిలాం విమానంలో ఎయిర్ హెూస్టెస్ వింతగా చూస్తోంది.

'ఉంటాను శశీ......మళ్ళీ కలుస్తాం ఎప్పుడో, ఎక్కడో, ప్రపంచం చాలా చాలా చిన్నది. మనిషికున్న గుప్పెడు మనసుకన్నా ఎంతో చిన్నది. కాబట్టి మన కలయిక తప్పనిసరి. అప్పటి వరకూ గుడ్‌బై!

ప్రతి మనిషి అంతరాంతరాలలో కొన్ని చీకటికోణాలుంటాయి. తనంత తాను వాటిలో దాక్కున్న నిజాల్ని ఆవిష్కరించుకోవాలంటేనే ఎంతో భయపడతాడతను. అటువంటిది ఎదుటివాళ్ళు ఒక్కసారిగా వెయ్యిదీపాల వెలుగుల్ని వాటి మీదకు విరజిమ్మితే తట్టుకోవడం చాలా కష్టం.

ఎన్నడూలేని నీరసం నన్నావహించింది. నిలబడబోతూ, కొంచెం తూలాను.

'సమ్, థింగ్ రాంగ్ సర్?' అంది ఎయిర్ హెూస్టెస్ నా భుజం పట్టుకుంటూ.

'ఎస్ ది లైఫ్ ఇట్‌సెల్ఫ్' అంటూ ముందుకు కదిలాను.

*   *   *



దృక్పథాలు

వేములపల్లి మోహనరావు – పి.వి.కృష్ణారావు

'అమ్మా!....మీకు ఫోను....' మెట్ల కింద నుంచీ వాచ్‌మన్ కేక. (దిగు....కింద రఘు నీకోసం.....క్షణాల్లో సంవత్సరాల్ని చెరిపి, నిన్ను నువ్వు అసహ్యించుకునే పరిస్థితుల్లో వదిలి, ఫ్లోరిడా వెళ్ళే ముందు అతను నీకు చెప్పదల్చుకున్న తుది పలుకులు విను. నీ ఉనికి నిన్ను వెర్రిగా ప్రశ్నిస్తున్న ఈ పరీక్షాసమయంలో....నీ చైతన్యం పరిష్కరించుకోలేని సమస్యను నీకు సృష్టించి....ఇప్పుడు కర్టెసీ కాల్....ఆన్సర్ హిమ్)

'కస్తూరీ హియర్.'

(నిజంగా కస్తూరివేనా! నీకు నువ్వే పరాయిగా, కొత్తగా అన్పించడంలేదూ.)

'హలో....చక్రవర్తిని కస్తూరీ.'

'నువ్వా....రఘు అనుకున్నాను.'

(ఇది రిలీఫా, డిజప్పాయింట్‌మెంటా?)

'నీతో మాట్లాడాలి అర్జెంటుగా.'

'ఏమిటి?'

(అస్థిత్వమే ఆవిరైపోతున్న ఈ క్షణాల్లో మాట్లాడగలిగేదేముంది, నీ ఛాయిస్ ఎంత పొరపాటు!)

'నేనిప్పుడే రఘు దగ్గర్నుంచే వస్తున్నా, తన ప్రయాణం విషయం నీకు తెలియదని.....హలో....'

(అవును....తెలియదు....తెలిస్తే మాత్రం.....ఏమో తెలీదు)

'హలో....యస్ చక్రీ....వింటున్నాను, చెప్పు.'

'అయామ్ రియల్లీ వెరీ సారీ కస్తూరీ ఆ బ్రూట్ ఫ్లోరిడా కాదు వెళ్ళాల్సింది క్రిమెటోరియంకి, నువ్వెందుకు ఊరుకున్నావు? షల్ ఐ స్టాప్ హిమ్!'

'నో....వాట్ ఫర్....లీవ్ హిమ్ ఎలోన్.'

'ఎలా ఉన్నావ్ కస్తూరీ.....హాస్టల్‌కి రానా నేను. నువ్వు నాతో బయటికి రాగలవా....మాట్లాడాలి....గెట్‌రెడీ....పదిహేను నిమిషాల్లో అక్కడుంటాను.

క్లిక్ మంది ఫోను

(వాస్తవం జారుడుబండై ఈగో స్కిడ్ అవుతుంటే నిన్ను నువ్వు ఎలా రక్షించుకుంటావ్. ఈ విషమ ఘడియల్లో ముందు నుంచీ నిన్ను డిచ్ చేస్తూనే ఉన్నా తెలుసుకోలేకపోయావు. ఎంత గర్వంగా అర్పించుకున్నావు ముందూ ఆత్మనీ తర్వాత శరీరాన్నీ...కెన్ యూ ఆన్‌డూ... కెన్ యూ కెన్ యూ... అన్‌డూ...అన్‌డూ...అన్‌డూ...)

రెండు నెలల క్రితం అరకువేలీలో ఒకరాత్రి ఫలితం నీ గర్భకోశపు మెలికల్లో ప్రాణికదలికలు, ఫీల్ ఇట్, నీలో పెరిగే ప్రాణాన్ని....విను, ఆటోజనీ ఆరంభంలో చైతన్యపు అలజడిని, పుట్టుక కోసం నీ కడుపులో జరిగే ఆర్భాటాన్ని...కెన్ యూ బి సేన్... సేన్... సేన్...)

* * *

'ఏం...ఆపేశావేం...'

'ఏం లాభం...ఎంత స్పీడ్‌గా వెళ్ళినా, నా కారు వేగం నీ ఆలోచనల వేగాన్ని జయించలేకపోయింది, అందుకే ఆపేశాను.

(నా ప్రేమ, అభిమానం, ఆప్యాయత నీ మనసున గెలవలేకపోయాయి కదూ, అలాగే ఇది కూడా)

'అయామ్ నాట్ అప్‌సెట్ చక్రీ'

'ఐ విష్ యూ ఆర్...నీ నిశ్శబ్దాన్ని భరించడం కంటె, నీ నిర్లిప్తతని భరించడం కంటే అదే మెరుగు.'

"చాలా కన్‌ఫ్యూజ్డ్‌గా ఉన్నాను, నేనెవరో నాకు తెలీడంలేదు.'

విషాదం నీ చైతన్యాన్ని జడత్వంగా మారుస్తోంది....మాట్లాడు ఏదైనా సరే' (టాక్ సమ్‌థింగ్ కస్తూరీ.....నేను నిన్నెంతగానో కావాలనుకుంటున్నానే, నీ సాన్నిధ్యంలో యుగాలైనా క్షణాల్లా గడిపేయడానికి సిద్ధంగా ఉన్నానే.....రెసిప్రొకేట్ చెయ్యలేవా....ఓ చిన్న మాటైనా చెప్పలేవా....కనీసం....నువ్వు మంచివాడివి చక్రీ అనైనా...)

'మాటలు రావడం లేదు. ఇన్నాళ్ళ నా ప్రేమా, ఆరాధనా నా భ్రమల్లోంచి జనించాయని తెలుసుకుని, ఆ నిజాన్ని మింగలేక మూగవోయాను.'

'నీకు తెలుసా అతని మరదలు స్టేట్స్‌లో ఉందనీ, ఆమెని పెళ్ళాడి అక్కడే సెటిల్ అయిపోతాడనీ.'

(నీ దారి నువ్వే వెదుకోవాలి కస్తూరీ... ఆ దారి నేను కాకూడదా అందిస్తున్న నా ఈ చేతిని అందుకో. ప్రేమతో స్పందించే నా నరాల సవ్వడి విను....కమాన్....తిరస్కరించకు)

'ఈరోజే తెలిసింది'

'తెలిసే ఊరుకున్నావా?'

'ఏం చెయ్యమన్నావు?'

'ఏమిటా....వాణ్ణి....దట్ సనాఫేబిచ్.....'

'వెయిటే మినిట్, స్పేర్ దట్ వర్డ్ ఆరునెలల తర్వాత నాకు పుట్టబోయే ప్రాణికి లోకం పెట్టబోయే పేరు అదే'

'కస్తూరీ....'

(నిజమే చెబుతున్నావా!.....నువ్వు కాలుజారడమా....నేను నమ్మను. నన్ను అవాయిడ్ చెయ్యడం కోసం అబద్ధం చెబుతున్నావు)

'అవును చక్రీ.....నేను నెల తప్పాను.'

'నేను వెళ్ళి రఘుని తీసుకొస్తాను, మనం పరిష్కారం వెతకాలి, అతని ఫ్లైట్‌కింకా టైముంది.

'వద్దు....కొన్ని సమస్యలకి పరిష్కారాలుండవు, అతన్ని పెళ్ళాడటానికి నేను సిద్ధంగా లేను, అంతగా నన్ను వంచించిన మనిషితో జీవితాన్ని పంచుకోలేను.

'నీకు ఇంత కష్టం కలగడాన్ని నేను భరించలేను కస్తూరీ'

'నీకు గుర్తుందా! మనమంతా రీసెర్చిలో చేరి ఒక ఏడాది అయిపోయిన తర్వాత

నువ్వు నన్ను ప్రేమిస్తున్నానని అన్నప్పుడు నేనేమన్నానో...నువ్వంటే నాకు చాలా ఇష్టం అనీ... అయితే ఆ ఇష్టంతోబాటు సెక్సువల్ పాషన్ లేదనీ, రఘు అంటే రెండూ ఉన్నాయనీ...

'అవును...కానీ అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ నువ్వు నాకొక్కటే.'

(నువ్వు ఊ అను కస్తూరీ, నీ అభీష్టానికి అనుకూలంగా అప్పుడు నీ జీవితంలోనుంచి పక్కకు తప్పుకున్నాను. ఇప్పుడు నీ బ్రతుకు విచ్ఛిన్నమైపోతున్న ఈసమయంలో నన్ను కాదనకు)

'కానీ నేను మాత్రం మారిపోయాను. మనసునూ, శరీరాన్నీ వేరెవరికో అర్పించుకున్నాను.

'నీ భవిష్యత్తు గురించి నువ్వాలోచించాలి.'

'ముందు నన్నీషాక్ నుంచి తేరుకోనీ'.

'చీకటి పడుతోంది....పద నిన్ను హాస్టల్లో దింపేస్తాను. నాకో మాట ఇవ్వు ఏ అఘాయిత్యమూ తలపెట్టనని.'

'నీవంటివాళ్ళు నాకు అండగా ఉండగా నేను పిరికిగా ఉండను. ధైర్యంగా ఎదుర్కొంటాను జీవితాన్ని.'

'దట్స్ గుడ్'

* * *

'కెన్ఐ హావే కపాఫ్ కాఫీ ప్లీజ్'

'ష్యూర్ సర్.......ఒన్ మినిట్' మొహమంతా నవ్వు నింపుకున్న ఎయిర్ హొస్టెస్.

(ఓహో....ఏం నడుస్తోందీ పంజాబీ పిల్ల. గో ఎ హెడ్ యంగ్‌మాన్, ట్రై యువర్ లక్, కుదిరితే ఓ మహత్తరమైన అనుభవం, లేకుంటే యూహావ్ నథింగ్ టూ లూజ్, అయినా శృంగారానికి అవధులూ, హద్దులు ఎక్కడ?)

'థాంక్‌యు వెరీమచ్...వెరీ కైండ్ ఆఫ్ యూ.'

'అది మా డ్యూటీ సర్...యూ లైకిట్?'

'ఓ... యా... సింప్లీ సుపర్బ్.'

(విమానాల్లో మీరు మా మొహానపోసే ఈ రంగునీళ్ళకంటే మా పల్లెటూళ్ళో చూరునీళ్ళు బహురుచిగా ఉంటాయి, యూ నో...)

'మీ పేరు రఘు కదూ, ఫ్లైట్ మానిఫెస్ట్‌లో చూశాను. ఈ రోజు చాలా విచిత్రం....ఇంతవరకూ మా జంబోల్లో ఇంత తక్కువ మంది పాసెంజర్స్‌తో వెళ్తున్న మొదటి విమానం ఇదేనేమో.'

'అవునవును, తెల్లారిపోయేముందు ఆకాశంలో చుక్కల్లా అక్కడొకడూ, ఇక్కడొకడూ.'

(నీ మొహం మీద మొటిమల్లాగే)

'మీరు కవులా'

'కాదు.....ప్రేమికుణ్ణి.....ఐ మీన్ ప్రకృతిని ప్రేమించేవాణ్ణి.'

(నీలాంటి ప్రకృతిని కామించేవాణ్ణి)

మళ్ళీ ఓ అందమైన చిరునవ్వు.

'మీ పేరు.....' (సుబ్బమ్మ అయినా సరే 'బ్యూటిఫుల్' అనెయ్యడానికి రెడీగా)

'ఒన్ మినిట్.....ఆ పాసెంజర్‌కేం కావాలో చూసొస్తాను.'

ఎర్రటి ఇండికేటర్ వెలిగిన వైపుకు నడుస్తున్న జఘనసుందరి వయ్యారాలు.

(ఓ గాడ్...ఆ ముందు వెనకలూ.....ఆ ఎత్తుపల్లాలూ......స్క్రూ హర్ క్విక్ యూ బ్లడీ)

పదినిముషాల తర్వాత.

'నా పేరు కస్తూరీ రామ్‌సింగ్.'

"నైస్ నేమ్...లైక్ యువర్ లుక్స్,'

(ఇంతకు ముందు ఎన్నో సార్లు ఎంతోమంది అమ్మాయిలకు పరిచిన తొలి మెట్టు ఈ కాంప్లిమెంటు. ఇట్ నెవ్వర్ ఫెయిల్స్, అవునూ....కస్తూరి....ఎక్కడో విన్న పేరు.....ఎవరై ఉంటారు....ఎవరు.....ఎవరు......ఫర్‌గెటిట్ .....సునీల్ గవాస్కర్‌కు తను తీసిన ప్రతి పరుగూ గుర్తుంటుందా?)

'న్యూయార్క్‌లో ఎక్కడ మీరుండేది?

"థాంక్స్ అడ్రెసిస్తాను. ఓ సారి రండి వీలుచూసుకుని."

సాలెగూట్లోకి మెల్ల మెల్లగా లాగబడుతోన్న ఇంకో అమాయకప్పురుగు.

* * *

నెల రోజుల తర్వాత

తన గదిలో ఒంటరిగా కస్తూరి....చప్పుడుతో కాలాన్ని కొలుస్తున్న గడియారం, కిటికీలో ముక్కలైన సముద్రం.

విస్తరించుకుంటున్న ఆలోచనల్లో, పోగొట్టుకున్న తనని తాను వెదుక్కుంటూ ఆమె. ప్రేమజూదంలో పణంగా పెట్టి శీలాన్ని పోగొట్టుకుని, లేచి గదికి తాళం వేసి బయటికి నడిచింది.

భూమిని మింగుతూ అడుగులు....

సముద్రపు ఒడ్డు....వెన్నెల రహదారి వేసుకుని కూడా నీటిమీద నుంచీ రాలేని చంద్రుడు.

ఆలోచనా స్రవంతి, మేధస్సు గట్లు తెగేటంత ఉధృతంగా, అంపశయ్య మీద ఉన్న తన ఆత్మని తనే రక్షించుకోవాలి. కానీ బాల్యంలోలాగా నిస్సహాయత. సెల్ఫ్ ఎస్టీమ్ దెబ్బతిని, ఆమెలో న్యూనతాభావాలు, నిరాశ నిస్పృహలు, స్వీయ విరాగత నుంచి బయటపడాలి, ఎలా.....అనేం చెయ్యాలి?

ఇన్‌స్టింక్ట్స్‌కీ రీజనింగ్‌కీ ఘర్షణ, ఏది ఉచితం, ఏది కాదు? తనకో తను సమాధానపడాలి. శరీరం నుంచీ, మనసు నుంచీ అతని జ్ఞాపకాలు తొలగిపోవాలి. విలువలు వికటిస్తోన్న ఆడదా తను?

"కస్తూరీ!"

వెన్నెల్లో, వెన్నెల్లా చక్రవర్తి.

"చీకటిపడి చాలా సేపయింది. హాస్టల్‌కి వెళ్ళి, నీ గది తాళం వేసి ఉంటే ఇటొస్తున్నాను" అన్నాడు కూర్చుంటూ.

'ఎందుకు చక్రీ నన్నింకా అభిమానిస్తావు....నాలో ఏం చూసి?

'నేను రఘులా మూర్ఖుణ్ణి కాదు, నువ్వేమిటో నాకు తెలుసు, నీ దైన్యాన్ని నేను భరించలేను. ఇన్నాళ్ళూ నువ్వు కోలుకోవాలనే ఈ విషయం ప్రస్తావించకుండా ఆగాను. ఈ రోజు చెప్పెయ్యాలి నీతో."

'నాకు తెలుసు, ఆ మాత్రం గ్రహించలేననుకున్నావా! నన్ను పెళ్ళి చేసుకుంటాననీ, నా బిడ్డకు తండ్రిగా నిలుస్తాననీ చెప్పాలని అనుకుంటున్నావు. నామీద జాలివల్లనేగా!'


సూటిగా ఆమె కళ్ళలోకి చూశాడతను.

'అవునూ....కాదు.....నువ్వంటే నాకు చాలా అభిమానం. నేనెంతగానో ఇష్టపడే నువ్వు ఇంతగా బాధపడటాన్ని సహించలేకపోతున్నాను. రఘూని, నీ మనసులో నుంచి తుడిచెయ్యడానికి నన్నేం చెయ్యమంటావో చెప్పు' అతని గొంతులో జాలీ, ఆవేశం.

'ఎబార్షన్ చేయించుకుంటాను, రఘులాంటి మరో వ్యక్తిని భూమ్మీదకు తెచ్చి సంఘాన్ని మరింత అవమానించలేను. పుడమితల్లి భారాన్ని మరింత పెంచలేను. నీకు చేతనైతే ఓ మంచి డాక్టరు దగ్గరకు నన్ను తీసుకెళ్ళు. తర్వాత నన్ను మర్చిపో."

తన నడుంచుట్టూ తనకి తెలియకుండానే ఎంతో సేపటినుంచీ ఉన్న అతని చెయ్యిని తొలగిస్తూ లేచి నిలబడింది కస్తూరి, స్థిరంగా.

* * *



ఫారిన్ మొగుళ్లు

వేములపల్లి మోహనరావు – పి.వి.కృష్ణారావు

దుబాయ్ కార్ల్‌టన్ టవర్‌లో ఆ సాయంత్రం పార్టీ మాకు. మర్నాడే జార్జ్ జెనీవా వెళ్లిపోతున్నాడు ఫ్యామిలీతో సహా. అతనికి సెండాఫ్ ఇస్తున్నాం మిత్రులమంతా. అంతా కలిసి పదిమంది కన్నా ఎక్కువ లేం. ఆ పదిమందిలో నలుగుర్ని చుట్టూ చేర్చుకుని ధారాళంగా ఉపన్యసించేస్తున్నాడు మా నానీ. వినే వాళ్ళుంటే గంటలకొద్దీ హరికథలు చెప్పడం వాడిలోని గొప్ప ఆర్టు. నాకు తెలుసు, ఆ పార్టీ అయిపోయేసరికి వాడు కనీసం రెండుమూడు ఆర్డర్లైనా పట్టేస్తాడు. నాకు ఏకాంతం ఇష్టం, దూరంగా కనబడుతున్న ఫ్లోటింగ్ హోటల్ పైన గాలికి ఉయ్యాలలూగే దీపాల తోరణాల్ని తదేకంగా చూస్తున్నాను.

'ఏమిటి ఒక్కడివే నిల్చున్నావ్, నీ గ్లాసేదీ?' అడిగింది మిసెస్ జార్జ్

'నో, నో, నేను తాగను' అన్నాను స్థిరంగా.

'వాట్?' ఆ గొంతులో ఆశ్చర్యానికర్థం వీడు మనిషా మృగమా అని.

'ఇంతకు ముందెప్పుడూ తాగలేదా?'

'పెళ్ళికి ముందు తాగేవాణ్ణి, తర్వాత మానేశాను.'

ఆమె కళ్ళలో ఆసక్తి తొంగి చూసింది.

'ఎందుకని? మీ ఆవిడ వద్దందా?' అవునన్నట్టు తలూపాను

'అయితే మీ మిసెస్ ఏం చెప్తే అది, చేస్తావా?'

ఏ మొగుడూ నేను హెన్‌పెక్డ్ అని చెప్పుకోడు. కానీ సంభాషణను అంతకు మించి పొగిడించడం నాకిష్టం లేక నాకా పరిస్థితి కొంచెం ఇబ్బందిగా ఉండి, తల ఊపాను.'

'హేయ్ జాజ్ 'కమియర్' అందామె, జార్జ్ దగ్గరగా వచ్చాడు.

'ఇతన్ని చూడు, భార్య తాగవద్దందని అంటే మానేశాడు, ఏ విషయంలోనైనా పెళ్ళాం మాట జవదాటడు. నువ్వూ ఉన్నావ్ ఎందుకూ!'

అతనామె మాటలను పట్టించుకోనట్టు నావైపు తిరిగి అన్నాడు.

'ఎప్పుడొస్తోంది మీ మిసెస్.'

'ఇప్పుడెక్కడ! రేపో ఎల్లుండో డ్యూ. డిసెంబర్‌లో వస్తుందేమో?' అన్నాను.

'వాట్?' ప్రళయం వచ్చేసి ప్రపంచం మునిగిపోతున్నంత ఆశ్చర్యపడ్డారు ఇద్దరూ.

'అయితే నువ్వింకా ఇక్కడే వున్నావే' అన్నాడు జార్జ్

'ఎప్పుడెళ్తున్నావ్?' అడిగిందామె

నాకర్థం కాలేదు వాళ్ళ హడావుడి.

'ఎక్కడికి వెళ్ళేది? ఊపిరి సలపనన్ని పనులున్నాయి యిక్కడ, వెళ్ళి ఏం చెయ్యను? అయినా డెలివరీ తనకి గానీ నాక్కాదుగా, చాలామంది ఉన్నారక్కడ ఆమెను జాగ్రత్తగా చూసుకోవడానికి.'

దేశద్రోహిని నియంత చూసినట్టుగా చూశాడు జార్జ్

'రబ్బిష్, నువ్వు లేకపోతే మీ షేక్ జాయెద్ రాజ్యం అల్లకల్లోలమైపోదు. పరిపాలన సక్రమంగానే సాగుతుంది. వ్యాపారాలూ, వృత్తులూ మూలపడిపోవు. అయినా నువ్వుండి చేస్తున్న ఘనకార్యాలేమున్నాయి? ఒక వేళ ఉన్నా అవన్నీ చక్కబెట్టడానికి మీవాడున్నాడుగా....వెళ్ళు, వెళ్ళు అక్కడ పెళ్లాం ప్రసవానికి సిద్ధంగా ఉంటే, షికారుకొచ్చిన రాజకుమారుడిలా పార్టీకొచ్చాడు పెద్దమనిషి.

'నో, నో, యూ మస్ట్ గో, ఒక స్త్రీగా ఆ అనుభవం ఎలాంటిదో నాకు తెలుసు, ఎంతమంది పక్కన ఉన్నా, ఆ టైంలో భర్త ఉన్న దారి వేరు, ఆ సంతృప్తి వేరు,' అంది మిసెస్ జార్జ్.

'నేనైతే మా నికోలస్ పుట్టినప్పుడు పదిరోజులు ఈమె బెడ్ పక్కనే ఉన్నాను.

కావాలంటే అడుగు' అని ఆమెవైపు చూశాడు జార్జి.

నేనేం మాట్లాడలేదు. మళ్ళీ తనే అన్నాడు నిష్టూరంగా.

'మీ ఇండియన్స్ పెళ్ళాల్ని పువ్వుల్లో పెట్టుకుని చూస్తారని చెబుతోందిగా మీ చరిత్ర. పెళ్లికి మీరిచ్చే ప్రాధాన్యత, భార్యలకు మీరిచ్చే గౌరవం, అనురాగం, ఆప్యాయత ఏ సంఘంలోనూ లేదని అంటారు. కేవలం ప్రచారమేనన్న మాట.'

'దానికీ దీనికీ సంబంధమేముంది జార్జ్? మేము భార్యను ప్రేమగా చూసుకునే మాట వాస్తవమే. కానీ వేలమైళ్ళ దూరం ప్రయాణం చేసి ప్రసవ సమయంలో తప్పనిసరిగా పక్కనే ఉండాలనుకోవడం ప్రాక్టికల్ కాదంటున్నాను నేను.'

'ఏం? ఎందుక్కాదు! నేనే నీ స్థానంలో ఉంటే నెక్ట్స్ పాజిబుల్ ఫ్లైట్‌లో వెళ్ళిపోయేవాణ్ణి. అది ఎయిరిండియా అయినాసరే!

'ఎయిరిండియాలో మీకేం లోటు చేస్తున్నారు' ఎటొచ్చీ ఇండియన్స్‌నే కుక్కల్లా చూస్తారుగానీ. మాట మార్చడానికి ప్రయత్నించాను కానీ లాభం లేకపోయింది.

'ఎనీహౌ, నిన్నీ విషయంలో నేను సమర్థించలేను, యూ మస్ట్ బి దేర్, నీ భార్యతో నువ్వు అనుభవించిన ఆనందం ఫలించబోతుంటే దగ్గర ఉండి ఆ కష్టసుఖాల్లో పాలు పంచుకొని నువ్వేం మనిషివి? ప్రాణకోటిలో ఏ జంతువునైనా తీసుకో, నీలా ఏదీ ప్రవర్తించదు, భావించదు ఈ విషయంలో.

పెప్సీకోలా గ్లాస్‌లో పోసి నాకందిస్తూ అంది మిసెస్ జార్జి.

'వీళ్ళంతా పెద్ద హిపోక్రట్స్ జాజ్. మిగతా దేశాలకన్నా సాంస్కృతికపరంగా, నాగరికపరంగా ఓ ఉన్నతమైన స్థానంలో వున్నామని గర్వపడతారు. మా స్త్రీకి సంఘం ఇచ్చే రక్షణ, మిగతా జాతులు ఇవ్వలేవంటారు. మా వివాహాలకున్న స్థిరత్వం, శాశ్వతత్వం లోకానికే ఆదర్శం అని చాటుకుంటారు. మా ఆడపిల్లలు రేప్ చెయ్యబడకపోవడానికీ, డ్రగ్ ఎడిక్ట్స్‌గా మారకపోవడానికీ కారణం, మా సంఘం యొక్క ఔన్నత్యమేనంటారు. కానీ నన్నడిగితే ఇవన్నీ ఆ ఆడపిల్లల బానిసత్వానికి చిహ్నాలు. నిజానికి మానసికంగా చిత్రహింసననుభవించేది హిందూస్త్రీలే. ఆ హింసకు మూలం ఇలాంటి భర్తలే, బయట పదిమందితో భార్యంటే దేవత అని చెబుతారు. ఆ దేవత చావు బతుకుల్లో, ఉన్నా చూట్టానిక్కూడా వెళ్ళనక్కర్లేదనుకుంటారు.

తల దిమ్మెక్కిపోయింది నాకు. స్త్రీ స్వేచ్ఛకు నిర్వచనం, గంజాయీ, మత్తు మందులూ, పదిమంది పురుషుల చేతిలో నలగడం అని ఆమె భావిస్తోంది. అలా హిందూస్త్రీ ఉండటంలేదని వాపోతోంది. అందుక్కారణం నాలాంటి వాళ్ళేనని దుమ్మెత్తిపోస్తోంది. ఏమైనా ఈ చర్చ ఇంతటితో ఆగకపోతే నాకు పిచ్చెక్కుతుంది.

'ఓకే బాబా! రేపు ఈవినింగ్ ఓ ఫ్లైట్ ఉందనుకుంటాను. దాంట్లో వెళ్తాను సరేనా!'

ఇద్దరి మొహాలూ వికసించాయి, జార్జ్ అన్నాడు.

'దట్స్ గూడ్, అలా వుండాలి. విష్ యూ ఆల్ ది బెస్ట్. మీ మిసెస్‌కు మా శు భాకాంక్షలందజెయ్యి!'

కానీ వాళ్ళకు తెలియదు, ఆ మర్నాడు సాయంత్రం అసలు ఫ్లైటే లేదనీ, ఉన్నా నేను వెళ్ళననీ, ఆర్గ్యుమెంట్ నా చెయ్యిదాటిపోతున్నప్పుడు అలాంటి చిన్న చిన్న అబద్ధాలు నాకు అక్కరకొచ్చే చుట్టాలనీ.

ఇంకా గెస్ట్స్ ఎవరో వస్తుంటే వాళ్ళను రిసీవ్ చేసుకోడానికి అటు వెళ్ళారు భార్యాభర్తలు. నేను తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

డిస్కోలో నుండి జలపాతంలా సంగీతం జారిపడుతోంది. బార్‌లో నుండి అప్పుడే బయటకు వస్తున్నాడు దామోదర్.

'హాయ్ యంగ్‌మాన్, ఎలా ఉన్నావ్' అంటూ ఆప్యాయంగా నా చెయ్యి అందుకున్నాడు. చాలా సామాన్యమైన వాటిని ఎంతో, ఇంటరెస్ట్ కలిగేలా చెప్పడం అతని ప్రత్యేకత. ఫ్లాట్ మార్చి విల్లా తీసుకున్నాడట. ఆ సంగతి అతని భార్యకు ఇంకా తెలియదట. ఎయిర్ పోర్ట్ నుంచీ తిన్నగా ఆ ఇంట్లోకి తీసుకుపోతాడుట. కొత్త ఫర్నిచర్, కొత్త కార్పెట్లు, కొత్త టీవీ, అంతా కొత్తగా ఉండటం చూసి అతని భార్య అమాంతం అతన్ని కౌగిలించుకుని మొహమంతా ముద్దుల్తో నింపేస్తుందట. ఏ విషయమైనా తన దగ్గర దాచలేదని ఆమెకెంతో గర్వమట. రెండు నెలల క్రితమే ఈ ఇంట్లోకి మారినా, తనకింతవరకూ ఈ సంగతి చెప్పలేదని పెద్ద షాక్ తింటుందట.

అప్పుడే అతని భార్య అతన్ని ముద్దుల్తో ముంచెత్తినట్టు మొహమంతా ఎర్రబడిపోయింది. కొంతమంది మాటల్ని, అభినయాన్ని చూడటాన్ని మించిన ఎంటర్‌టెయిన్‌మెంటు ఇంకోటి ఉండదు.

'మరి నే వెళ్ళొస్తాను' అన్నాడతను.

'అదేమిటి డిన్నర్‌కి ఉండు. గెస్ట్సుని పరిచయంచేస్తాను, కమాన్' అన్నాను.

'నో, నో, చాలా ఇంపార్టెంట్ పని మీద వెళ్తున్నాను, ఇంకోసారెప్పుడైనా!'

'నా మామూలేదీ' అన్నాను నేనతని చేయి పట్టుకుని

ఒకే ఒక్క క్షణం ఆలోచించాడతను.

'ఆ! వెనుకటికి ఒక ఆయన రోడ్డుమీద వెళ్తున్న తన మిత్రుణ్ణి ఆపి, మొన్నీ మధ్య మీ ఇంట్లో ఎవరో చచ్చిపోయారని విన్నాను, నువ్వా, మీ తమ్ముడా' అని అడిగాడట.

నా నవ్వుకు ఆనకట్ట పడకముందే అతను వెళ్ళిపోయాడు.

డిన్నర్ పూర్తయి మేము హోటల్ బయటికి వచ్చేసరికి పన్నెండయింది.

'నేను వీళ్ళ కార్లో వస్తాను డియర్, నువ్వు పద,' అంది మిసెస్ జార్జ్

'ఓకే' అన్నాడతను ఆమె దగ్గరగా వస్తూ, ఇద్దరూ ఆ నడిరోడ్డుమీద ముద్దు పెట్టుకున్నారు. అప్పుడామె నన్ను క్రీగంట చూడటం నేను గమనించకపోలేదు.

మా నానీనడిగాను మెల్లగా, 'ఇదేమిట్రా, వీళ్ళు వీధులో శృంగారాలు, ఎలాగూ ఇంటికే వెళ్తున్నారుగా, అంతలోనే ఇంత విరహమా!'

'అదంతేలే, నీకు తెలీదు' అన్నాడు, అక్కడికి వాడికేదో తెలిసి చచ్చినట్టు.

అంతే మరి, జవాబు తెలియనివాడికి అడిగినవాడు లోకువ.

వాళ్ళకు 'బాన్‌వాయేజ్' చెప్పేసి తిరిగొస్తున్నాం

'రాత్రికి ఇక్కడ పడుకుందామా, వెళ్ళిపోదామా' అన్నాడు నానీ

'పోదాం రా, రెండు గంటలేగా' అన్నాను

'నేను రెండు నిముషాలు కూడా డ్రైవ్ చేయలేను. నిద్ర ముంచుకొచ్చేస్తోంది' అన్నాడు ఆవులిస్తూ.

ఇద్దరం సీట్లు మారాం.

'అవునూ, ఇందాక పార్టీలో ఆ గ్రీన్ సూటతను ఎవర్రా అతనొచ్చినదగ్గర్నుంచీ అబ్జర్వ్ చేశాను. ప్రపంచంలో సమస్తం పోగొట్టుకున్నవాడిలా, విషాదమంతా తన మొహంలోనే నింపుకుని కూర్చున్నాడు అంతసేపూ.

'అతనిది పాకిస్తాన్, ఇక్కడే ఒక ట్రేడింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పేరు సరిగా గుర్తులేదు నాకు. రేపో ఎల్లుండో అతని భార్య, పిల్లలు వస్తున్నారు కరాచీ నుంచి, బహుశా వాళ్ళు గుర్తొచ్చారామో!' అన్నాడు నానీ వెనక సీట్లో వెల్లకిలా పడుకుని మరోసారి ఆవులిస్తూ.

'పెళ్ళాం పిల్లలు వస్తుంటే ఏడుపు మొహం ఎందుకు?'

'ఒరేయ్! నీకు దొరికినట్టు అందరికీ, మా చెల్లెల్లాంటి నోరూ వాయి లేని పెళ్లాలు దొరుకుతారట్రా! వీడి పెళ్ళాం వస్తే ఇప్పటివరకూ ఉన్న స్వాతంత్ర్యం ఊడిపోయి తన ఇల్లే చిన్న పాకిస్తాన్‌లా గందరగోళమైపోతుందన్న భయమేమో! ఇక నోరు మూసుకుని కారు తోలు.'

'అలాగే అర్జునా! ఇక నీవు శయనింపుము,' అని నేనన్న రెండు నిముషాలకే వాడు మొదలుపెట్టిన గుర్రుకారుని దడదడ లాడించసాగింది.

బెర్నార్డ్ సన్‌లే వాళ్ళు కడుతున్న ఇంటర్నేషనల్ ట్రేడ్ బిల్డింగ్ దగ్గరకొచ్చేసరికి

పోలీసులు కారు ఆపేశారు.

నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. నాకు లైసెన్స్ లేదు. ఒక జీవితకాలం పోయినా ఈ ఊళ్ళలో లైసెన్స్ రాదు. జైలు కెళ్ళడానికి సిద్ధపడిపోతూ కారాపాను. కానీ దిగేలేదు, పోలీసు దగ్గరగా వచ్చాడు.

'లైసెన్స్?' అన్నాడు

ఏం చెయ్యాలి? డాష్‌బోర్డు తెరిచి వెతుకుతున్నట్టు నటించసాగాను. రిజిస్ట్రేషన్ కార్డు దొరికింది. అది తీసిచ్చాను. చూసి తిరిచ్చేస్తూ మళ్ళీ 'లైసెన్స్ మౌజూద్' అన్నాడు.

తప్పదు, ఛాన్స్ తీసుకోవాలి. శ్రీ కృష్ణ జన్మస్థానంలోకి వెళ్లి తీరిగ్గా ఆలోచించుకునేకంటే ఇక్కడ ఛాన్స్ తీసుకోవడమే వివేకం. డాష్‌బోర్డులో ఉన్న మావాడి లైసెన్స్ తీసిచ్చాను. మొహం కనబడకుండా కొంచెం చీకట్లోకి లాక్కున్నాను. లైసెన్స్ వేలిడిటీ మాత్రమే చూసినట్టున్నాడు. తిరిగి ఇచ్చేస్తూ 'ఆబూదాబీ' అన్నాడు.

అవునన్నట్టు తలూపాను

'రో' అన్నాడు చెయ్యి ఊపుతూ.

బ్రతికిపోయిన జీవుణ్ణి అరచేతిలో పట్టుకుని కారు స్టార్ట్ చేశాను. తప్పిపోయిన ప్రమాదంతో ఏం సంబంధం లేని మావాడు నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

నూటడెబ్బై కిలోమీటర్ల ఈ ఎడారి దారి అంతులేని ఆలోచనలకు ఆస్కారమిస్తుంది అప్పుడప్పుడూ ఎదురొచ్చే ఒకటీ అరా కార్లు మినహాయించి, రోడ్డంతా నా కోసం పరిచిన మాయ జలతారులా మెరుస్తోంది, మార్జిన్ దాటి పక్కకు వెళ్తే 'దారి తప్పుతున్నావ్ సుమా' అన్నట్టు, తెల్లగా మెరుస్తూ, టైర్ల కింద పలు విచిత్రమైన చప్పుడు చేసే, రోడ్డు మధ్యలో పొదగబడిన క్యాట్ ఐస్, మూసేసిన అద్దాలోంచి లోపలికి రావాలని విఫల ప్రయత్నం చేస్తూ ఈదురు గాలి, అది రోడ్డు మీదకు లాక్కొచ్చే ఇసుక కెరటాలు, కొంచెం తలెత్తి చూస్తే ఎడారిక్కూడా వెన్నెల ఎందుకో అని బద్ధకిస్తున్న మసక చంద్రుడు, సానుభూతి సమ్మె చేస్తున్నట్టు అతని పక్కన చుక్కలు.

జరిగిపోయిన యుద్ధంలో దారుణంగా చచ్చిపోయిన సైనికుల అస్థిపంజరాల్లా, యాక్సిడెంటై, రోడ్డుపక్కకు, ఎడారిలోకి ఈడ్చివేయబడి శిథిలమైపోయిన కార్ల అవశేషాలు, ఇసుకలోకి ఇంకిపోతూ కొన్ని, క్షతగాత్రుల్లా కొన్ని, నిమిషాన్ని పొదుపు చేయబోయి జీవితాన్ని ఖర్చు పెట్టుకోవద్దని హెచ్చరిస్తూ.

దూరంగా ఒంటె రోడ్డు దాటుతోంది. బ్రేక్ తొక్కాను, నూటనలభై కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న మెర్సిడెజ్ కిక్కురమనకుండా ఇరవై మీదకి వచ్చేసింది. మావాడు మాత్రం ధామ్మని సీటు మీదనుంచి కిందకు పడిపోయాడు.

'ఏమైందిరా' గట్టిగా అరిచేశాడు.

'ఒంటె' అన్నాను తాపీగా.

ఎమర్జెన్సీలో ప్రతిపక్షపు ఎంపీలా కిక్కురమనకుండా మళ్ళీ సీటెక్కి పడుకున్నాడు. వాడే అని ఏమిటి, ఈ ప్రాంతంలో ఏ కారువాడికైనా దాని పేరు చెబితే హడల్. దాన్ని గుద్దేస్తే కారు పచ్చడి, ఒళ్ళు హూనం అవడం అటుంచి జీవిత శేషాన్ని జైల్లో గడపవలసి వస్తుంది. చట్టరీత్యా పగతీర్చుకోగల జంతువు అదొక్కటేనేమో.

'మళ్ళీ కారు కదిలింది, మనసులో ఆలోచనల్లాగే ప్రేమ, పెళ్లి, మూన్నాళ్ళ ముచ్చట, విరహం, పిల్లలు అన్నీ ఒక్క సంవత్సరంలోనే. ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే అమూల్యమైన వాటిని ఎన్నిటినో పోగొట్టుకుంటున్నా మనిపిస్తుంది. ఒక్క డబ్బు మినహాయించి మరేదీ లేని ఈ ఎడారిలో ఎడారిలాంటి నిస్సారమైన జీవితం, అందమైన మాతృభూమి ఒళ్ళో తలదాచుకుందామంటే, ఈ ప్రకృతిని చూసి పరవశించు, అంతేకాని నువు అడిగినా ఏడ్చినా, అన్నం పెట్టలేను అని స్వదేశం ఇచ్చిన సందేశం. ఏ దారినెన్నుకోవాలి నాలాంటి సామాన్యుడు.

మిసెస్ జార్జ్ మాటలు గుర్తుకొచ్చాయి. ఆమె చెప్పినట్టు ప్రపంచంలో అందరికన్నా అధమ స్థితిలో, అశాంతితో మానసిక వేదనతో క్రుగ్గిపోయేది భారతీయ వనితేనా! కాదు, కేవలం నా ఒక్కణ్ణి చూపించి వాళ్ళు దేశం మొత్తాన్నే జనరలైజ్ చేసేశారు. కానీ నిజంగానే ఇప్పుడు ఇండియా వెళ్ళడానికి వీల్లేదు. అది వరకు బెజవాడలో కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తున్నప్పుడైతే క్లాసుకు నలభై సమస్యలే. కానీ ఇక్కడికొచ్చి వ్యాపారంలో దిగాక అవి నాలుగొందలయ్యాయి. ఎలా వొదిలిపెట్టి వెళ్ళేది?

ఆలోచనలను సశేషించి ఫ్లాట్ ముందు కారాపి మావాణ్ణి లేపాను. అర్ధరాత్రి రెండింటికి బాత్‌రూంలోకి టవల్ భుజాన వేసుకుని ఎందుకు వెళ్తున్నానో అర్థంకాక మావాడు విచిత్రంగా చూశాడు. పెళ్లయిన బ్రహ్మచారిచేత జీవితం చేయించే సర్కస్‌లో ఓ చిన్న ఫీట్ ఈ నడిరేయి స్నానాలు, అలా షవర్ కింద నిలబడినప్పుడల్లా, వర్ధమాన రచయితలు గుండెలు బాదుకుని ఘోషించే విధవరాళ్ళ చరిత్రలు గుర్తొస్తాయి నాకు. మా మధ్య పెద్ద తేడా ఏం ఏడ్చి చచ్చింది!

ఎడారిలో పూలు పూయవు కవుల ఊహల్లో తప్ప పువ్వుల్ని తెచ్చి ఎడారిలో వేస్తే బ్రతకవు. మాడిపోతాయి. అందుకే వచ్చిన నెల తిరక్కుండా, బ్రతికుంటే బలుసాకు తింటాను అని మా ఆవిడ మళ్ళీ ఇండియా కెళ్ళిపోయింది. ఉత్తరాల్లో మీరొలకబోసే విరహకవిత్వం చాల్లే ఈ జన్మకి అంటూ ఆవిడకు తోడు మా కూతురుకుంక ఒకటి, విమానం దిగడంతో మొదలెట్టిన ఏడుపు మళ్ళీ ఎయిర్‌హొస్టెస్‌ను చూసే వరకు ఆపలేదు.

ఆ తర్వాత రెండు నెలలకనుకుంటాను నేను స్విట్జర్లాండ్ వెళ్ళవలసి వచ్చింది. టెలెక్స్ పంపిస్తే, ఎయిర్ పోర్ట్‌కు వచ్చి రిసీవ్ చేసుకున్నాడు జార్జ్.

'ఎలా ఉన్నావు డియర్' అన్నాడు ఆప్యాయంగా కరచాలనం చేస్తూ

'అయాం ఫైన్, నువ్వెలా ఉన్నావు.

మీ నికోలస్, మీ మిసెస్ బాగున్నారా?' అడిగాను.

'ముందు నువ్వు కారెక్కు' అంటూ ఏవేవో బిజినెస్ విషయాల్లోకి దింపేడు.

ఇంటికి చేరుకున్న తరువాత కూడా మాకెవరూ ఎదురుకాలేదు. అంతా అస్తవ్యస్తంగా ఉంది. సోఫాల్లో చెల్లాచెదురుగా పడి ఉన్న విడిచిన బట్టల్ని పక్కకినెడుతూ

'కూర్చో' అన్నాడు జార్జి.

ఎక్కడో, ఏదో పొరపాటు జరిగిందని నా మనసు చెబుతోంది, ఉండబట్టలేక అడిగేశాను.

'ఆర్ యూ ఆల్ రైట్?'

'అఫ్‌కోర్స్, అయామ్ హండ్రెడ్ పర్సెంట్ ఆల్‌రైట్.'

డింపుల్ విస్కీని గ్లాసులోకి వంచుతూ అన్నాడతను. ఒకే బ్రాండ్ విస్కీ తాగేవాళ్ళను నేనెక్కడాచూడలేదు. కానీ జార్జి డింపుల్ తప్ప ఇంకోటి ముట్టుకోడు.

'కొంచెం తీసుకుంటావా' అన్నాడు రెండ్లో గ్లాసు తీస్తూ

'నో నో అప్పటికీ ఇప్పటికీ నేనేం మారలేదు' అన్నాను

నాకెందుకో ఆ సమావేశం వెలితిగా, అసంతృప్తిగా ఉంది.

'మీ ఆవిడ ఎక్కడ? నికోలస్ ఏదీ' మళ్ళీ అడిగాను.

'లేరు, ఇక్కడ ఉండటం లేదు. డైవర్స్ తీసుకున్నాం.'

ఐదు నెలల క్రితం వాళ్ళిద్దరూ రోడ్డు మీద ముద్దుపెట్టుకుంటున్న సన్నివేశం నా కళ్ళముందు మెదలింది.

'ఎందుకని'

'జస్ట్ లైక్ దట్?'

'నో, నో, ఊరికే ఎవరూ వివాహాన్ని విచ్ఛిన్నం చేసుకోరు. సరదా కోసం జీవిత భాగస్వాముల్ని దూరం చేసుకోరు, బలీయమైన కారణాలు లేకుండా ఎవరూ మమతల్ని అనుబంధాన్నీ తెంచుకోరు', కొంచెం ఉద్రేకంగా అన్నాను.

'కూల్ డౌన్ మై బాయ్, నువ్వు చెప్పేది ఇండియాలో, ఇక్కడ కాదు, ఈ సోషల్ ఎన్విరాన్‌మెంట్ వేరు మీ సాంఘిక జీవితానికి పూర్తిగా విభిన్నమైనది ఇది.'

'సామాజిక జీవనాల్లో వ్యత్యాసం ఉంటే ఉండవచ్చు. కానీ ప్రేమ, అనురాగం, ఆప్యాయత విశ్వజనీనమైనవి ఎంతో అన్యోన్యంగా ఉండే మీరు కారణం లేకుండా విడిపోవడమేమిటి!'

'కారణమంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. ఛేంజ్ కావాలనిపించింది మా ఇద్దరికీ. ఎల్లకాలం ఒకే పార్ట్‌నర్‌తో ఎలా కలిసివుండటం చెప్పు'

'ఎల్లకాలం ఒకే బ్రాండ్ విస్కీ, ఒకే బ్రాండ్ సిగరెట్ల మాత్రం కాల్చగలవేం.'

'నేను నీతో వాదించలేను, ఆమెనే పిలుస్తాను, మీరిద్దరూ తేల్చుకోండి, గొప్ప ఫ్రెండ్స్ గదా.

ఫోన్ చేసి నేనొచ్చాననీ, తనను చూడాలంటున్నాననీ చెప్పాడు. సాయంత్రం అయిదింటికి వస్తానందామె. అన్నటైంకి సరిగ్గా వచ్చింది. సోఫాలో నా పక్కనే కూర్చుంటూ అంది.

'కొంచెం లావెక్కావ్ మాన్. మీ ఆవిడెలా వుంది, ఇంతకీ మగపిల్లవాడా, ఆడపిల్లా.'

చెప్పాను

నాకాశ్చర్యం వేస్తోంది వాళ్ళిద్దర్నీ చూస్తుంటే, అసలేమీ జరగనట్టే ఉన్నారు. ఆమె ఎవరో ఆర్కిటెక్ట్‌ను పెళ్లి చేసుకుందట. జార్జికి వచ్చే నెలలో ఎవరో స్టెనోతో పెళ్లట.


'మనం ఎందుకు విడిపోయామో కారణం తెలియాలట తనకి. నేను చెబితే నమ్మడం లేదు అన్నాడు జార్జి.

'ఏముంది! రొటీన్‌గా, ఏమాత్రం మార్పులేకుండా సాగిపోయే జీవితంలో థ్రిల్ ఏముంది! అందుకే కొంత వైవిధ్యం కావాలనుకున్నాం ఇద్దరం. దట్సాల్. యూ సీ, మీ దేశంలోలాగా నచ్చినా, నచ్చకపోయినా, చచ్చేవరకూ ఒకర్నే అంటిపెట్టుకుని ఉండాలని శాసించదు మా సంఘం. జీవితమనేది కేవలం అనుభవించడానికే. దానికి బలవంతాన పెళ్ళిపేరిట ఉరి బిగించి నరకం చేసుకోలేము. అందుకే మేం చాలా లక్కీ ఈ విషయంలో.'

'ఏమో తల్లీ, ఎంతో వెనకబడిన వాళ్ళుగా మేం భావించే కొంతమంది అనాగరిక జాతుల్లోనూ ఇంతే. ఎంతో ప్రగతిని సాధిస్తున్నారనుకున్న మీలోనూ అంతే. అయితే మనలో ఎవరదృష్టవంతులనేది భగవంతుడికే తెలియాలి. కానీ ఒకటి, ప్రతి రాత్రీ భర్త పక్కన పడుకోబోయే ముందు 'ఈ మొగుడొదిలేస్తే రేపెలా' అని ఆలోచించవలసిన అవసరం మా స్త్రీకి లేదు. ఆ రకంగా ఆమె చాలా అదృష్టవంతురాలు. వస్తాను, ఏడింటికి ఎపాయింట్‌మెంట్ ఉంది,'

బయటపడి ఊపిరి పీల్చుకున్నాను.

* * *



గతి తప్పని చరిత్ర

వేములపల్లి మోహనరావు – పి.వి.కృష్ణారావు

నేను లోపలికెళ్లేటప్పటికి నల్లరెడ్డిగారెవరితోనో అనర్గళంగా మాట్లాడేస్తున్నారు. బయట మండిపోయే ఎండలో నుండి ఆ ఏసీ రూంలో అడుగుపెడుతూనే, అగ్నిహోత్రావధాన్లును తప్పించుకుని మధురవాణి ఒళ్లోపడిన గిరీశంలా ఫీలయిపోయాను.

పందిరి మంచంమీద బసింపట్టు వేసుక్కూర్చుని సుదీర్ఘమైన ఉపన్యాసమిస్తున్నారాయన. ఎదుటి వ్యక్తి పెద్ద హీరో ముందు చిన్న నిర్మాతలా అతి జాగ్రత్తగా వింటున్నాడు. జేబురుమాలుతో మొహం తుడుచుకుంటున్న నాకు పక్కనే ఉన్న ఫ్రిడ్జ్ చూపించి ఆ చేత్తోనే కూర్చోమని సైగచేశారు. చల్లటి నీళ్ళు కాసిని గొంతులో పోసుకుని మెత్తని ఆ సోఫాలో కూలబడగానే ప్రాణం ఎక్కడికో తేలిపోయింది. ఏదో తెలియని మగత నన్నావహించి, రెడ్డిగారూ ఆయన విక్టిమ్, ఇద్దరూ శూన్యంలోకి క్రమక్రమంగా జారిపోయారు.

అలా ఎంతసేపు గడిచిందో, రెడ్డిగారు నా భుజం పట్టుకుని కుదిపే వరకూ మెలకువ రాలేదు.

'ఏం పంతులూ, మంచి ఎండన పడివచ్చావ్ పాపం, వడదెబ్బకొట్టినట్టుంది. కొంచెం గ్లూకోజ్ తాగుతావా' అంటూన్నారాయన.

'అబ్బే వద్దండీ, బస్టాండ్ నుంచీ నడచి వచ్చేసరికి బాగా నీరసం వచ్చేసింది.

ఫర్వాలేదు, ఇప్పుడు బాగానే ఉంది.' అన్నాను నిటారుగా కూర్చుంటూ, అప్పటి వరకూ రెడ్డిగార్ని భరించిన ఆసామీ వెళ్లిపోయినట్టున్నాడు. గది ఖాళీగా ఉంది.

'అవును మరి, ఈ వెధవ ఊళ్ళో రిక్షాలు కూడ దొరికి చావవు, ఇంతకీ ఏం పనిమీదవొచ్చావ్.

'పనంటే పెద్ద పనేంకాదు. ఊరికే ఓసారి మీకు కనబడిరమ్మన్నారు నాన్నగారు.' అన్నాను కొంచెం సంశయిస్తూ.

'ఊ....'అన్నారాయన సాలోచనగా.

'నీ బి.ఏ, అయిపోయిందనకుంటాను పోయిన సంవత్సరం'

అవునన్నట్టు తలూపాను. ఇప్పుడేం చేస్తున్నావు మరి అని ఆయన నన్నడగలేదు. అడక్కుండానే ఆయనకు తెలుసు, నేనేమీ చేయడంలేదనీ, ఏదైనా చేస్తూ ఉన్నట్లయితే మా నాన్నగారి పేరు చెప్పుకుని ఈ మిట్టమధ్యాహ్నపు వేళ తనముందు చేతులు నలుపుకుంటూ కూర్చోననీ.

'మీ తమ్ముడూ, చెల్లెలూ బాగున్నారా, స్కూలుకెళ్తున్నారా'

మళ్ళీ తలూపాను

'మీ నాన్నగారి ఆరోగ్యం ఎలా ఉంది? డాక్టర్ దగ్గరకు వెళ్తున్నాడా! మందులవీ తీసుకుంటున్నాడా?' అడిగారాయన.

నేనేం మాట్లాడలేదు, తల వంచుకు కూర్చున్నాను, రెండు క్షణాలు నిశ్శబ్దం

'ప్చ్, తనకు అభిమానం చాలా ఎక్కువ. దాంతోనే దెబ్బతిన్నాడు మనిషి.' అన్నారు సానుభూతిగా.

నోరు తెరవబోయి ఆగిపోయాను, ఇది సమయం కాదు, ఇది ప్రదేశం కాదు. సందర్భం అసలే కాదు. లేకపోతే పాతికేళ్ళు కుక్కకన్నా విశ్వాసంగా ఈ ఇంటిని కాచిన ఆ సాధుజంతువు మీద దొంగతనం మోపి పనిలోంచి తీసివేసిన మనిషి దగ్గరికి నేను పొట్ట చేత్తోపట్టుకుని రావడం నా దౌర్భాగ్యంకాక మరేమిటి? దానికి తోడు మళ్ళీ పౌరుషం ఎందుకు నాకు? వివాదాలూ, సంజాయిషీలూ, క్షమాపణలూ ఎందుకు? ఇవన్నీ నా తండ్రి క్షోభను తగ్గించగలిగాయా? ఆయనకు పక్షవాతం రాకుండా ఆపగలిగాయా?

'నాదే తప్పులేవయ్యా, మర్చిపో, మళ్ళీ ఉద్యోగంలో జేరూ అని గడ్డాలూ, చేతులూ పట్టుకుని బతిమాలాను ఆనాడు. విన్నాడా మరి? చేజేతులా తన పిల్లల భవిష్యత్తును నేలపాలు చేశాడు.'

ఆ విషయం మీద చర్చ నాకు గిట్టదన్నట్టు అసహనంగా అటూ ఇటూ కదిలాను. అసహాయులు అంతకుమించి, అసమ్మతిని తెలియజెయ్యలేరు.

మళ్ళీ కాసేపు మౌనం మా మధ్య.

'భోంచేద్దాం రా' అన్నారాయన స్టీల్ కారియర్ విప్పుతూ.

వద్దనే అవకాశం లేదు నాకు. ఆకలి అన్నిటికన్నా పెద్ద అవసరం.

చేతులు కడుక్కుని రావడానికి లేచాను. ఆ గదిలోనే ఉన్న ఎటాచ్‌డ్ బాత్‌రూం చూపించారాయన. తలుపు తెరుచుకుని లోపలికడుగు పెట్టబోతూ షాక్ తిన్నట్టయి, మళ్ళీ వెంటనే తలుపు మూసి వెనక్కి తిరిగి వచ్చేశాను. నేను చూసిన అరక్షణం దృశ్యం నా ఒళ్ళు జలదరింపజేసింది. లేదా అది పులకింతో మరి రెంటికీ తేడా తెలిసే మనసు లేదు నాకు. ఇంకా నయం, ఆ అమ్మాయి అటు తిరిగి ఉండబట్టి సరిపోయిందిగానీ, లేకపోతే పాపం ఎంత సిగ్గుపడిపోయేదో, ఇంతకీ ఎవరామె. రెడ్డిగారి భార్య కాదు, ఆవిణ్ణి అంతకు ముందోసారి చూశాను. దర్బారులో నడవబోతున్న పట్టమహిషిలా ఉంటుందామె, గంభీరంగా, రాజఠీవిలో, మొగుడూ పెళ్ళాలిద్దర్నీ పక్క పక్కనే చూస్తే రంభా, రాక్షసుల్లా ఉంటారు.

'ఏం వచ్చేశావేం' అన్నారాయన పొడిగా ఉన్న నా చేతుల్ని చూస్తూ, ఏమని చెప్పాలి, ఎలా చెప్పాలి. విచిత్రమైన సంకటస్థితిలో పడిపోయాను.

'ఏమిటయ్యా అలా నీళ్ళు నముల్తావ్.'

'అది కాదండీ, లోపల ఎవరో ఉన్నారు...'

'లోపల ఎవరో ఉన్నారా....' క్షణం ఆలోచించి గట్టిగా నవ్వేశారు.

'భలే వాడివయ్యా పంతులూ, నాతికీ రాతికీ తేడా తెలియనివాడివి నువ్వేం మగాడివయ్యా, అది ఒట్టి బొమ్మ మాత్రమే, వెళ్ళి మళ్ళీ చూడు.'

నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. బాత్‌రూం తలుపు తెరిచిన నాలో మళ్ళీ అదే గగుర్పాటు. టబ్ వైపు తిరిగి టవల్‌తో ఒళ్ళు తుడుచుకుంటున్న భంగిమలో ఉన్న ఆ నిలువెత్తు ఆకృతి కేవలం ఓ బొమ్మా! మరి ఆమె ఇంటి మీద మెరిసే ఆ నీటిచుక్కలేమిటి? మైగాడ్! ముట్టుకుని చూశాను. చల్లని ఆ స్పర్శకు నాకు ఒళ్ళు ఝల్లుమంది. గబగబ చేతులు కడుక్కుని బయటపడ్డాను. ఉన్నవారి అభిరుచులు ఇంత విభిన్నంగా, విచిత్రంగా ఉంటాయా!

మౌనంగా భోంచేస్తున్న నన్ను రెడ్డి గర్వంగా చూశారు. నాలాంటి ఎందరు అటువంటి స్థితిలో ఇరుక్కున్నారో అంతకుముందు?

'కంగారుపడ్డావ్ కదూ, అది మా సైట్ ఇంజనీర్ ఐడియా! గొప్ప రసికుడులే వాడు, ఆ బొమ్మ చెక్కించడానికెంత ఖర్చయిందో తెలుసా....లక్షా పదమూడు వేలు.'

నాకు ముద్ద మింగుడు పడలేదు. తమ అభిజాత్యాన్ని చాటుకోవడానికి గొప్ప

వారికా మొత్తం ఓ లెక్కలోకి కాదు కాబోలు.

భోజనం పూర్తయ్యాక పడుకున్న రెడ్డిగారు నాలుగింటిగ్గానీ లేవలేదు. అప్పటివరకూ నేనేవో మాగజైన్లు తిరిగేస్తూ, దూరంగా కడుతున్న డామ్ మీద కీటకాల్లా తిరిగే కూలీల్నీ, గొంగళిపురుగల్లా పాకే బుల్‌డోజర్లనీ చూస్తూ గడిపాను.

కాఫీలు వచ్చాయి, అవి పూర్తయ్యాక

'అలా టౌనువైపు వెళ్ళొద్దాం పదవయ్యా' అన్నారాయన బట్టలు మార్చుకుంటూ, లేచి నిలబడ్డాను.

మమ్మల్ని చూడగానే డ్రైవర్ డోర్ తెరిచి పట్టుకున్నాడు. పాత మోడల్ బ్యూక్ కారు అది. నల్లరెడ్డిగారి రంగుతో పోటీ పడుతూ మిలమిల మెరుస్తోంది. నేను ముందు సీట్లో కూర్చున్నాను. గతుకుల రోడ్డును హంసలా వయ్యారంగా అధిగమించి తారురోడ్డెక్కింది కారు.

'నీకు టైపు వచ్చా పంతులూ'

'వచ్చండీ, హైయర్ పాసయ్యాను. షార్ట్‌హాండ్ కూడా లోయర్ పాసయ్యాను.

'మంచిది. అవి లేకపోతే ఉద్యోగం దొరకడం కష్టం ఈ రోజుల్లో.

కారు నీళ్ళలో పడవలా, కుదుపులు లేకుండా మెత్తగా సాగిపోతోంది.

పదిహేను నిముషాలు తర్వాత అన్నారు రెడ్డిగారు.

'వచ్చేవారం రావయ్యా అయితే...ఆ....మంచిది చూసుకుని.....పన్లో జేరుదువుగాని....కానీ వచ్చే ముందు మాత్రం, మీ నాన్ననుంచీ ఏమైనా సంక్రమించిందేమో నీక్కూడా వల్లమాలిన అభిమానంలాంటిది....దాన్ని కాస్త ఇంట్లోనో అట్టిపెట్టిరా, బయట ఒకరి కింద పనిచేస్తున్నప్పుడు, అందులోనూ నాలాంటి చదువురాని మోటువాడి కింద, కాస్త ఒడిదుడుకులూ, మాట జారడాలూ ఉంటాయి. సర్దుకుపోగలిగితేనే రా, అది నిష్ఠూరం మేలని చెబుతున్నాను.'

నా మొహం జేవురించింది, అంగీకారసూచకంగా తలూపాను. అసంకల్పిత ప్రతీకార చర్య అది. బహుశా, నా జీవితంలో జీర్ణించుకుపోయిన అవసరాలు చేయించి ఉంటాయా పని.

టౌన్ చేరుకున్నాం. కారు మార్కెట్లోంచీ వెళ్తుండగా 'ఒరేయ్.....ఆపాపు' అన్నారు రెడ్డిగారు, పేవ్‌మెంటు మీద కూర్చున్న ఓ బక్కచిక్కిన ముసలివాణ్ణి ఇటు రమ్మని సైగ చేశారు. వాణ్ణి చూస్తూనే నాకు కడుపులో దేవినట్టైంది. వెన్నెముక నానుకుని పొట్ట, ఎముకల్ని చర్మంతో కుట్టిన అస్థిపంజరంలా శరీరం, లోతుకుపోయిన కళ్ళు, ఎండి అట్టలుకట్టుకుపోయిన జుట్టు, దారిద్ర్యాన్ని ఎవరూ నిర్వచించనక్కర్లేదు. వాణ్ణి నిదర్శనంగా

చూపిస్తే చాలు.

విమానమంత కార్లోంచి, పెద్దమనిషి తనను చెయ్యెత్తి పిలిచేసరికి అది కలో నిజమో తెలియనట్టు కాసేపు కదలకుండా ఉండిపోయాడు వాడు, కించిత్తు విషాదమైన చిరునవ్వు పెదాలమీద పులుముకుని.

'ఒరేయ్, నిన్నేరా.....చెవుడా......వినబడ్డంలేదా!' రెడ్డిగారు గట్టిగా అరిచేసరికి, వాడికి ఆయన పిలిచేది తననేనని నిర్ధారణ అయిపోయింది. ఆజ్ఞలూ అరుపులూ, అధికారాలూ భరించడం వాడికి ఊపిరంత సహజం అయినట్టు మెల్లిగా లేచి కారు దగ్గరకు వచ్చి నిలబడ్డాడు, చేతులు కట్టుకుని.

'ఎంత కిస్తావ్‌రా ఆ చాపలు' అడిగారు రెడ్డిగారు.

ఆయనకు పిచ్చెక్కిందో, తనకు మతి భ్రమించిందో తెలియనట్టు కాసేపు మౌనంగా ఉండిపోయాడు వాడు.

'వినపడదా ఏమిట్రా చెవిటిముండా కొడకా! మాటాపలుకూ లేకుండా ఏమిటా వెర్రి చూపు!' చిరాగ్గా అన్నారాయన.

'చిత్తం దొరా, సరుకు నాణెం చూసి తనకి తోసినంతిప్పించండి.'

వాడి గొంతు వేయి నిలువుల లోతు. వెనక్కి పరుగెత్తికెళ్లి ఈతాకులతో అల్లిన మూడు పెద్ద చాపలూ కారు దగ్గరికి పట్టుకొచ్చేశాడు.

'ఖరీదెంతో చెప్పరా ముందు' అసహనంగా అన్నారాయన.

'మూడు రోజులు పట్టింది బాబూ ఈట్ని అల్లడానికి, ధర్మప్రభువులు, తమకి తెలియందేవుంది.'

'ఎంత?'

'ఒకోటి ఏడు రూపాయలు చేసుకోండి.'

నల్లరెడ్డిగారి మొహం మరింత మాడిపోయింది.

'ఏమిట్రోయ్ ఈ మూడింటితోనే మేడలు కట్టేద్దామనుకుంటున్నావేమిటి? అమ్మే ధర చెప్పు.'

వాడు మరింత వంగిపోయాడు. 'లేదు బాబయ్యా....మూడు రోజుల్నుంచీ ఒక్క బేరం కూడా లేదు, లంకణాలంటున్నామండయ్యా, తమరు కొనాల. ఇయ్యాలైనా మేమింత గంజినీళ్ళు తాగాల.'

రక్తాన్ని చెమటగా మార్చి శ్రమించేవాడు తన కష్టఫలాన్ని అమ్ముకోవడానికి అడుక్కోవలసి రావడం, ఇంకోడి కాళ్ళు పట్టుకోవలసిరాడం మన దేశంలోనే చెల్లు.

'నువ్వు పోనీ రా' అన్నారాయన డ్రైవర్‌తో, కానీ అతను స్టార్ట్ చెయ్యలేదు.

'బాబ్బాబు, మీకు తోసినంతిప్పించండి, ఆకలికి మాడి సచ్చిపోతున్నాం,' అన్నాడు వాడు చేతులెత్తి దణ్ణం పెడుతూ

'ఒకోటి రెండు రూపాయలకన్నా ఎక్కువ చెయ్యదురా' అన్నారాయన

కత్తితో తలనుండీ కాలి వరకూ ఒక్కవేటున తెగనరికినట్లయింది వాడిక్కాదు.....నాకు.

'ఆటి ఇలవమీక్కాదు బాబు, రెక్కలు ముక్కలు సేసుకుని అల్లే మాకు తెలుసు, అవసరం మాది గనక తమరిలాంటోరు ఆటికెంత విలువగడితే అంతే మేము ఒప్పుకోవల.'

'ఏడిశావ్ లేరా, ఇంతకీ నీది అమ్మే బేరమేనా, మూడిటికీ ఏడు రూపాయలిస్తాను, ఇస్తే ఇవ్వు, లేకపోతే లేదు.

'పది రూపాయలనా ఇప్పించండి.....నాలుగురోజుల కష్టం....

'ఇంకో అర్థరూపాయి చేసుకో, ఇక అంతే.....పైసా కూడా ఎక్కువివ్వను. పర్స్ తీసి ఏడున్నర లెక్కపెట్టి వాడి దోసిట్లో పెట్టారు రెడ్డిగారు. డ్రైవర్ డిక్కీ తెరిచి చాపల్ని అందులో పెడుతున్నాడు.

ముసలాడు తన డబ్బులు ఎవరో లాక్కుపోతారన్నట్టు గుప్పిట మూసేశాడు. 'దోసుకోండి బాబూ, నాలాంటోడి కష్టం దోసుకోకపోతే మీలాంటోళ్ళకి ఈ కార్లూ, మిద్దెలూ, పట్టుపంచెలూ, పరమాన్నాలూ ఎట్లా దొరుకుతాయి. తవరిచ్చిన ఈ బిచ్చం డబ్బుల్తో ఈ బొందిలో దీపాన్ని ఆరిపోకుండా ఇంకూసింత నూనెపోసి మళ్ళీ తనల్లాంటి ఇంకో ధర్మాతుడి కోసం నేను నాల్రోజులు తిండీ నిద్రా మాని సావలావద్దా...దోసుకోండి దోసుకోండి...' దాదాపు ఏడుపు గొంతుతో అనేసి వెళ్ళిపోయాడు వాడు.

రెడ్డిగారికి ఆ మాటలు వినబడలేదో, వినబడీ ఆయన్ని కదలించలేకపోయాయో ఆ దేవుడికే తెలియాలి.

కారు కదిలింది.

'మన దక్షిణం పక్కన కేంప్‌లో వేయించరా వాటిని, లారీ డ్రైవర్లూ వాళ్ళూ పడుకోవడానికి పనికొస్తాయి.' అన్నారాయన, డ్రైవర్ తలూపాడు.

ఫైవ్ స్టార్ హెూటల్ ముందు పార్కింగ్ లాట్‌లోకి కారు సర్దుకుంది.

ఆ కారుకు లీటర్ పెట్రోల్ రెండున్నర మైళ్ళు మించిరాదు.

లీటరు పెట్రోలు ధర అయిదున్నర, టౌన్‌కీ, డాం సైటుకూ మధ్య దూరం నలభైమైళ్ళు.

ఓ పండు ముసలివాడి నాలుగురోజుల కష్టం విలువ ఏడున్నర రూపాయలు.

నా పిడికిళ్ళు అప్రయత్నంగా బిగుసుకున్నాయి.

'సరే పంతులూ, ఇక ఉంటాను మరి. మళ్ళీ కలుద్దాం.' అన్నారాయన.

'అక్కర్లేదు.' అన్నాను గట్టిగా, నా గొంతు నాకే భయం కలిగించింది.

ఆశ్చర్యంగా చూశారాయన.

'అదేం....' ఆయన ప్రశ్నార్థకం ఇంకా పూర్తికానేలేదు.

'నేను మనుష్యుల దగ్గర మాత్రమే పనిచేస్తాను' అన్నాను.

ఆయన రియాక్షన్ చూసే అవసరం, అవకాశం నాకు లేవు, వడివడిగా ముందుకు నడిచాను.

*   *   *



ఇంకో సీత

వేములపల్లి మోహనరావు – పి.వి.కృష్ణారావు

'గుడ్ మార్నింగ్, ఇంటర్నేషనల్ బుకింగ్.'

లక్షమంది కోరస్ పాడుతున్నా, విలక్షణమైన ఆ గొంతును చిటికెలో పసిగట్టెయ్యగలను నేను.

'సీతా, నువ్వేనా డ్యూటీలో, థాంక్ గాడ్!'

'ఓ! చక్రవర్తి సాబ్, ఎక్కణ్ణుంచీ, ఎప్పుడొచ్చారు. ఎలా ఉన్నారు, ఏమైపోయారు ఇన్నాళ్ళూ! క్షేమమేనా!

ఏమిటి విశేషాలు, మేడమ్ కూడా ఉన్నారా మీతో.

'ఏమిటీ ప్రశ్నల వర్షం! ముందు లండన్‌కో కాల్ బుక్ చెయ్యి.'

'అవన్నీ తర్వాత, ముందు మీరీ సంగతి చెప్పండి, ఇన్నాళ్ళూ ఏమైపోయారు'

'చిన్న కుర్రవాణ్ణి గదూ! అందుకని ప్రపంచంలో దారి తప్పిపోయాను. సరేనా.'

'మీరెప్పుడు సరైన సమాధానం ఇచ్చారు గనుక! ఇంతకీ ఎక్కణ్ణుంచి!'

'షెరటన్‌లో ఉన్నాను, తొందరగా కాల్ ఇవ్వు, అర్జంట్,'

'మీకు అర్జంట్ కానిదెప్పుడు! అది సరే. మీతో పర్సనల్‌గా మాట్లాడాలి, ఇది ఎమర్జంట్.'

'రేపు పదిన్నరకు హొటల్లోనే ఉంటాను, సాయంత్రవరకూ పనిలేదు.'

ఓకే. అయితే, పదిన్నరకు వస్తాను. మీరు లైన్ క్లోజ్ చెయ్యండి. పది నిముషాల్లో పిలుస్తాను.'

ఆ అమ్మాయికీ నాకూ ఉన్న సంబంధం ఈనాటిది కాదు. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా టెలిఫోన్ తీగలు మమ్మల్నిద్దర్నీ కలుపుతూనే ఉన్నాయి తను చేసే ఉద్యోగానికి సహనం ఎంత అవసరమో, నేను చేసే వ్యాపారానికి అసహనం అంత సహజం. ఒకో కాల్ వేల డాలర్లతో సమానం నాకు. ఆ సంగతి ఆ అమ్మాయికి తెలుసు. నాకు త్వరగా లైన్ ఇవ్వటానికి అప్పుడప్పుడు పెద్ద రిస్కు కూడా తీసుకుంటుంది తను. ఆ సంగతి నాకు తెలుసు.

ఒకసారి ఆ అమ్మాయి నాకో ఇన్ కమింగ్ కాల్ కనెక్ట్ చెయ్యవలసి వచ్చింది మొదట బాంబే, తర్వాత ఢిల్లీ, మద్రాస్, ఇండియాలో నేనుంటాను అనుకున్న ప్రతిచోటికీ ట్రై చేసింది. ఆఖరికి హైద్రాబాద్‌లో దొరికాను నేను, విరుచుకుపడిపోయింది నా మీద.

'ఏమిటసలు మీ ఉద్దేశ్యం! ఒక రోజు తాజ్‌లో కాసేపాగి ఢిల్లీ ఇంటర్ కాంటినెంటల్‌లో, మర్నాడు మద్రాస్ కోరమండల్‌లో, ఎన్ని చోట్లని వెదకమంటారు. అరగంటనుండీ బిజీగా ఉంచాను లైన్ మీకోసం, అవతల మీ పార్టీ కాల్ కాన్సిల్ చేసుకోనంటాడు.,,

'టేకిట్ ఈజీ బేబీ' ఏం చెయ్యను చెప్పు. అన్నిరోజులూ నీతో పాటు బాంబేలోనే కూర్చోవాలంటే ఇదేమన్నా బిజినెస్సా! మజాకా! అయినా నువ్వు నాకోసం దేశమంతా రెక్కలు గట్టుకుని ఎగరక్కర్లేదు గదా! నాలుగు నంబర్లు గిర్రున తిప్పడానికి ఇంత హైరానపడిపోతావేం?'

'నాలుగొందలసార్లు తిప్పాను నంబర్లు మీ స్వాంతన వాక్యాలు మీ ఆవిడకు చెప్పండి శాంతిస్తారు. నాక్కాదు చెప్పవలసింది.'

'పోనీ నన్ను పెళ్ళిచేసుకోరాదూ, ఎప్పుడు ఎక్కడుంటానో ప్రతి నిముషం నీకు తెలుస్తూనే వుంటుంది. ఇంత కష్టపడనక్కర్లేకుండా. అయినా, ఇద్దరు పిల్లలూ, యాభైఏళ్ళ వయసూ గల నాకన్నా అర్హతగల వరుడు నీకెక్కడ దొరుకుతాడు?'

నవ్వు ఆపుకోలేకపోయిందామె.

'బాబూ మీకూ మీ పెళ్ళికి ఓ దండం. రోజుకు మూడు విమానాలు మారే మొగుడు నాకొద్దు. మాట్లాడండి మీ పార్టీతో.

ఇంకో రోజు

'నీ పేరేమిటమ్మాయ్?' మెల్లగా అడిగాను.

'మీకనసరం అబ్బాయ్.'

'వెల్! నా కనవసరమైన విషయం ఈ ప్రపంచంలో లేదు. కావాలనుకున్న తర్వాత తెలుసుకోకుండా ఊరుకునేదీ లేదు.'

'కాని మా ఆపరేటర్లు పేరు చెప్పగూడదు.'

'అది నిజమేననుకో సీతా, కానీ మీలో ఎంతమంది దాన్ని రహస్యంగా ఉంచగలరంటావ్!'

'మైగాడ్! నా పేరు మీకెలా తెలుసు?'

నీ మీద ఆసక్తి ఉన్నవాణ్ణెవణ్ణీ అటువంటి అర్థరహితమైన ప్రశ్న అడక్కు. బెర్న్‌కు ఓ కాల్ బుక్ చేసుకో.' నంబర్ ఇచ్చి ఫోన్ పెట్టేశాను.

అలా అలా పెరిగింది మా పరిచయం.

ఓబ్రాయి షెరటన్లో సాధారణంగా నన్నెవ్వరూ పదిన్నర వరకూ నిద్రలేపే సాహసం చెయ్యలేరు. ఆ రోజు అందుకు విరుద్ధంగా పదింటికే ఫోన్ మోగింది. విసుగ్గా రిసీవర్ అందుకున్నాను. నా సెక్రటరీ ఉన్నాడు ఆవతలివైపు.

'బాస్!

'ఎస్ విజయ్'

'ఫ్రాంక్‌ఫర్ట్ పార్టీ మీకోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ళకు ఫ్లైట్ టైమైపోతోంది. వాళ్ళకు పదింటికి ఎపాయింట్‌మెంట్ ఇచ్చాం నిన్న. కింద లాబీలో కూర్చున్నారు మీ కోసం. రూంకు తీసుకురానా, మీరే కిందకు వస్తారా!'

అప్పటివరకూ వాళ్ళ సంగతి నాకు గుర్తే రాలేదు. ఈ మధ్య మతిమరుపు బాగా ఎక్కువైపోతోంది. మొన్న ఓసారి ప్రేమగా మా ఆవిడ నడుం చుట్టూ చెయ్యివేసి 'వడ్డించవోయ్ వచ్చేస్తున్నా' అంటే 'విడాకులిచ్చేయ్' అని నేనడిగినంత విచిత్రంగా చూసింది. విశేషమేమిటంటే అంతకు అరగంట ముందే నేను భోంచేశానట.

'ఓకే విజయ్, నేను వస్తున్నాను. సారీ ఫర్ ది డిలే. ఈలోపల నువ్వు వాళ్ళ

ప్రపోజల్స్ ఏమిటో, మనం వాళ్ళతో ఎంత వరకు ముందుకు వెళ్ళవచ్చో చూడు. స్నానం చేసి బయల్దేరతాను.

నేను రూం లాక్ చేయబోతుండగా వచ్చింది సీత. అప్పటి వరకూ నాకామె ఎలా వుంటుందో తెలీదు. చూసిన తర్వాత సృష్టికర్త అభిరుచిని అభినందించకుండా ఉండలేకపోయాను.

'చూశారా! టైమంటే టైమే, పదిన్నర అన్నాను. వచ్చేశాను సరిగ్గా.'

'ఉద్ధరించావులే, కాల్స్ కనెక్ట్ చెయ్యడానికి రాని ఉషారు అపాయింట్‌మెంట్లకు అటెండ్ అవడానికి వస్తుంది. రా లోపలికి, అవిగో మాగజైన్స్, డ్రింక్స్ కావాలంటే ఫ్రిజ్‌లో వున్నాయి. ఫోనెత్తితే నీక్కావల్సింది కాళ్ళదగ్గర కొస్తుంది. అయిస్‌క్రీం మాత్రం అడక్కు, అనవసరంగా లావెక్కిపోయి చూసేవాళ్ళ గుండెల్ని స్పందింపజేసే నీ అందాన్ని చేజేతులా పోగొట్టుకున్న దానివౌతావు. నేనిప్పుడే పది నిముషాల్లో వచ్చేస్తాను, ఓకే.'

ఆమె సమాధానం కోసం ఆగలేదు నేను. ఆ లేతమొహంలో లీలగా మెదిలిన నిస్పృహను గమనించనట్లే లిఫ్ట్‌వైపు నడిచాను. అనేక విషయాలకన్నా నాకు కాలం చాలా ముఖ్యమైనది మరి.

ఎయిర్‌పోర్టుకు వెళ్ళి వాళ్ళను పంపించి వస్తూ టైం చూసుకున్నాను. బాప్‌రే! పన్నెండూ నలభై, ఏమయిందో పాపం ఈ అమ్మాయి. రూంలోకి అడుగుపెట్టేసరికి నేననుకున్నట్టే...

ఎంతోసేపు ఏడ్చి అలసిపోయిన పాపాయిలా మంచానికి అడ్డంగా పడుకుందామె. దిండుమీద కన్నీటి చారికలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎన్నాళ్ళుగానో సమాధిచేయబడ్డ సున్నితమైన భావాలెన్నో ఒక్కసారిగా ఉప్పొంగాయి. ఎప్పుడో మర్చిపోయిన ఆత్మీయత, అనుబంధాలు మళ్ళీ ఈరోజు తిరుగుబాటు చేస్తుంటే ఆమె తల నిమరడానికి వెళ్ళబోయిన నా చెయ్యి ఆగిపోయింది. మనిషికి నిద్రను మించిన సుఖం ఏముంది! తాత్కాలికంగా స్వర్గంలో విహరించే ఆ అందమైన పసిపిల్లను మళ్ళీ ఈ సమస్యల కీకారణ్యంలోకి బలవంతాన తీసుకురావడం ఎందుకు?

ఆ ముప్పయ్యో అంతస్తులో నిలబడి కాళ్ళకిందకు కదిలివచ్చేస్తున్నట్టున్న సముద్రాన్ని తదేకంగా చూడటం నా అలవాట్లలో ఒకటి. కానీ ఈరోజు ఈ అమ్మాయి నా దృష్టిని పదే పదే తనవైపు ఆకట్టుకుంటోంది. నిజానికి ఆడదానికీ అగాధమైన జలనిధికీ తేడ ఏముంటుంది గనక!

ఏ సుఖమైనా ఎక్కువ కాలం నిలవనట్టే, ఆ అమ్మాయి నిద్రకూడా నిలవలేదు.

'ఎంతసేపయింది మీర్పొచ్చి! నన్ను లేపలేదేం' అంది కళ్ళు తుడుచుకుంటూ.

'ఇప్పుడేలే, వెళ్ళి మొహం కడుక్కురా, భోంచేసి వద్దాం' అన్నాను

మొగల్ రూం గమ్మత్తుగా మత్తుగా వెలుగుతోంది. బఫే టేబుల్ మీద రక రకాల పదార్థాల క్రింద నీలి నీలి మంటలు సన్నగా శబ్దం చేస్తున్నాయి. ఏవేవో నాలుగు రకాలు వేసి ప్లేట్ ఆమె కందించాను. యాంత్రికంగా అందుకుందామె. మా యిద్దరిలో ఏ ఒక్కరికీ భోంచెయ్యాలని లేదు. ఏదో తిన్నామనిపించి, బయటికి వచ్చాం. లిఫ్ట్‌లో కూడా తనేమీ మాట్లాడలేదు. నేను అద్దంలో కనిపిస్తున్న నా వార్థక్యపు చిహ్నాల్ని చూసి కాసేపు విచారించాను అలవాటుగా.

సిగరెట్ వెలిగించి విశ్రాంతిగా నడుం వాల్చాను, సముద్రం, ఆకాశం కలిసి గీస్తున్న సరళరేఖ మీద నిలిచిన ఆమె రూపు ఎంతోసేపటిగ్గానీ నా మీదకు మరలలేదు. గదిలో సన్నగా వ్యాపిస్తున్న సంగీత ప్రవంతికి ఆనకట్ట వేసి ఆమెవైపు చూశాను. కానీ ఆమెలో ఏం మార్పు రాలేదు. గదిలో గూడు కట్టుకుపోతున్న నిశ్శబ్దం వయసును ఐదు నిమిషాలకు మించి పెంచదల్చుకోలేదు నేను.

'టెల్ మీ బేబీ, ఎందుకలా ఉన్నావ్?'

పదాలు వెదుక్కుంటున్నట్టుందామె. గొంతు సవరించుకుంది. ఎలా మొదలుపెట్టాలో తెలియనట్టు చేతివేళ్ళు చూసుకుంది ఓసారి.. తడిసిపోతున్న కళ్ళను బలవంతాన పొడిగా చేసుకోవడానికి విఫల ప్రయత్నం చేస్తోంది. ఆమెను వెక్కిరిస్తున్నట్లు ఫోన్ మోగింది.

'మనం నాలుగింటికి దాదర్‌లో ఉండాలి బాస్. నీరద్ చౌదురీతో అయిరన్ ఓర్ డీల్ గురించి ఈ రోజే డిస్కషన్స్. ఓ అరగంటలో బయల్దేరదాం. రెడీగా ఉండండి.'

నాకు నిజానికి ఆ నిముషంలో ఈ ప్రపంచం మొత్తాన్ని వదిలిపెట్టి పారిపోవాలనిపిస్తోంది. ఆడపిల్ల కన్నీటికి నాకు ఏమాత్రం పడదు, నేనున్నచోట స్త్రీ కంట తడిపెడితే అది నాకు చిత్రసింహ. ఈ మనస్తత్వం నాకు ఊహ తెలిసినప్పటికే నాలో పాతుకు పోయిందనుకుంటాను.

'ఓ హెల్, ఆ అపాయింట్‌మెంట్ కాన్సిల్ చెయ్యి విజయ్, లేదూ మేనేజ్ చెయ్యగలననుకుంటే నువ్వొక్కడివే వెళ్ళిరా.'

'అదేమిటి, ఈ మీటింగ్ కోసం మొన్నటి నుండీ ఎన్నో ప్లాన్ చేసుకున్నాం. అదీగాక ప్రైస్ విషయాలు మీరు ఫైనలైజ్ చెయ్యాలి గానీ నేనేం చెయ్యగలను.'

'కానీ ఇక్కడ నేను అంతకన్నా ముఖ్యమైన పనిలో ఉన్నాను.'

అతనేం మాట్లాడలేదు. కానీ ఆ మౌనంలోని ఆశ్చర్యం నా కర్దమౌతూనే ఉంది. తనకు తెలియని పనులు నాకేమీ లేవు. అధికారిని ప్రశ్నించలేని ఆశక్తత అతన్ని

పట్టి పీడిస్తోందని తెలుస్తూనే ఉంది. అతన్ని ఆ స్థితిలో ఎక్కువసేపు ఉంచడం ఇష్టం లేక 'నాకోసం ఓ అమ్మాయి వచ్చింది. మాట్లాడుతున్నాను. ఆమె వెళ్ళిపోగానే ఫోన్ చేస్తాను అప్పటివరకూ డిస్టర్బ్ చెయ్యకు.'

ఫోన్ పెట్టేశాను నిమిషం తర్వాత నేను చేసిన పొరపాటు అర్థమైంది. ఇప్పుడు విజయ్ గుండె ఆగిపోవడానికి ఎంతైనా ఆస్కారం ఉంది. అతని ఐదేళ్ళ సర్వీస్‌లో ఇంత పెద్ద షాక్ ఎప్పుడూ తిని ఉండడు. పెళ్ళాంతో తప్ప ఇంకో ఆడదానితో మాట్లాడలేని బాస్ హోటల్ గదిలో ఓ అమ్మాయితో ఒంటరిగా ఆ అమ్మాయి కోసం ఓ అతిముఖ్యమైన అపాయింట్‌మెంట్ కాన్సిల్ చేసుకుని.

'మీరెవరైనా ఎప్పుడైనా గాఢంగా ప్రేమించారా?' ఇది సీత మొదటి ప్రశ్న. ఆ ప్రశ్నలోనే 'నేను ప్రేమించాను సుమా' అని అంతర్లీనమై ఉన్న ఆమె జవాబు. ఆ వయసు అటువంటిది, ప్రేమను మించిన పెద్ద సమస్య వాళ్ళకు ఊహాతీతం.

'ఈ విషయంలో నేను మీ దగ్గరకు రావడం ఎంతవరకూ సమంజసమో నాకు తెలీదు. కానీ నేనున్న పరిస్థితులు నాకు మరో మార్గాన్ని చూపించలేకపోయాయి.'

'సూటిగా మాట్లాడేవాళ్ళంటే నాకు చాలా యిష్టం.' మెల్లగా అన్నాను.

'నాకు డబ్బు కావాలి.'

బలవంతాన నవ్వు ఆపుకున్నాను. ఈ విశాల విశ్వంలో అది అక్కర్లేనిదెవరికి?

'ఎంత?' అడిగాను

'ఎంత ఇవ్వగలరు?'

నా అహం దెబ్బ తిన్నది. నేనీ ప్రపంచంలో దేన్నైనా సహిస్తాను. నన్ను ఇతరులు తక్కువ అంచనా వేయడాన్ని మినహాయించి, ఫోన్ అందుకున్నాను.

'విజయ్!'

'ఎస్ బాస్' ఆ గొంతులో ఇంతకు ముందు నేనిచ్చిన కరెంట్ తాలూకు ఉధృతం ఇంకా తగ్గలేదు.

'స్విట్జర్లాండ్‌లో మన బాంక్ పొజిషన్ ఏమిటి ప్రస్తుతం?'

'త్రీ పాయింట్ ఫైవ్ మిలియన్ డాలర్ ఎకౌంట్‌లో, సిక్స్ హండ్రడ్ థౌజండ్ స్విస్ ఫ్రాంక్స్' రిసీవర్ ఆమె చెవి దగ్గరగా పెట్టాను.

'లండన్‌లో?'

'టూ హండ్రెడ్ థౌజండ్ పౌండ్స్, అదిగాక నిన్నటి పాతికవేల ట్రాన్సాక్షన్ కలపాలి, ఇంకా చేరిఉండదులెండి అది.'

'ఓకే, థాంక్స్ ఎ లాట్'

గర్వంగా ఆమెవైపు చూశాను. నేననుకున్న మార్పులేవీ రాలేదామెలో. నిర్లిప్తంగా కూర్చుంది. పాతికేళ్ళ నా అనుభవంలో ఎన్నివేలసార్లో అనుకున్న విషయాన్నే మళ్ళీ మనసులో అనుకున్నాను. 'మిలియన్లు సంపాదించడం పెద్ద కష్టమైన పనేంకాదు, ఒక స్త్రీని సంతృప్తిపరచడంలో సరిపోలిస్తే.' అని.

'మొన్న మొన్నటివరకూ మా జీవితాలు సాఫీగానే సాగుతూ వచ్చాయి. నా ఆపరేటర్ ఉద్యోగం, మావారి సేల్స్‌మెన్ ఉద్యోగం, మాకు అంతులేని భోగభాగ్యాల్ని ప్రసాదించలేకపోయినా, జీవికకు లోటు చెయ్యలేదు. కానీ ఈ మధ్య ఆయన ఆరోగ్యం పూర్తిగా పడిపోయింది. మొదట్లో అశ్రద్ధ చేశారు. తర్వాత జస్‌లోక్ హాస్పిటల్‌లో చూపిస్తే, డాక్టర్లు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చెయ్యాలన్నారు. ఇప్పటికే బాగా లేటయిపోయిందట.

ఆమె గొంతు జీరవోయింది

'నాకీ లోకంలో ఉన్నది ఆయనొక్కరే, తను లేకుండా నేనుండలేను.' పదాలు సామాన్యమైనవే అయినా, వాటిలో నిండిఉన్న క్షోభ, ఆ గుండెకోత నన్ను కదిలించాయి.

'నా అనేవారు మా యిద్దరికీ లేరు. కొద్దిమంది స్నేహితులున్నా, వేలకొద్ది రూపాయలిచ్చి ఆదుకోగలిగినా తాహతుకలవారు కారు. ఇప్పుడు నా ముందు రెండే రెండు మార్గాలు. ఒకటి మిమ్మల్ని యాచించడం, రెండు ఆయన చావును కళ్ళారా చూసి ఇంత బూడిద చెయ్యడం, మొదటి మార్గం మూసుకుపోతే రెండో మార్గాన నడవడం తప్ప గత్యంతరం లేదు నాకు.'

ఆ మనసు లోతుల్లోని అశాంతినీ, ఆవేదనను నా ఆలోచనల్లోకి అనువదించుకుంటే కళ్ళు తడిశాయి. ఆ గుండెలో దాగివున్న అగ్నిపర్వతాలు పరిణామం అర్థమైనకొద్దీ నాలో లావా స్రవించసాగింది.

ఫోన్ మోగింది మళ్ళీ

'మిస్టర్ చక్రవర్తీ, కాల్ కాలింగ్ ఫ్రమ్ స్విట్జర్లాండ్,' ఆపరేటర్ చెప్పింది.

నేను ఫోన్లో మాట్లాడుతున్నంత సేపూ తను జారిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకోవడం గమనిస్తూనే ఉన్నాను. అయితే, నాకు నచ్చిన వార్త ఏమంత సంతోషకరమైనది కాదు.

నాకు రావలసిన ఒక చాలా పెద్ద ఆర్డర్‌ను ఇంకో రైవల్ కంపెనీ తన్నుకు పోయింది. అప్పటికే దానిమీద నేను రెండు లక్షల డాలర్లదాకా ఖర్చు పెట్టేశాను. డబ్బుకన్నా, నా పరువు ప్రతిష్టలు దానిమీద ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. ఏం చెయ్యాలో తోచక, జుట్టు పీక్కున్నాను. బట్టతల మీద అప్పటివరకూ ఎంతో విశ్వాసంతో ఉండిపోయిన పది పదిహేను వెండితీగల్లోంచీ రెండు ఊడి చేతిలోకి వచ్చాయి. ఆలోచనలు మాత్రం

రాలేదు.

'ఏమయింది' అందామె నాలోని మార్పుల్ని గమనిస్తూ.

చెప్పాను.

'మీ బిజినెస్‌లో ఇలాంటివి సహజమనుకుంటాను.'

'నా విషయంలో మాత్రం కాదు, చక్రవర్తి నా పేరు. గెలుపు నా ఊపిరి, ఓటమికి నా జీవితంలో చోటు లేదు.' అది ఆత్మవిశ్వాసమో, అహంకారమో నాకు తెలీదుగానీ పుట్టినప్పటినుంచీ నాతోనే ఉంది అది.

'ఇది ఓటమి కాదా!'

'శత్రువుని పై చేయి అయినంత మాత్రాన అది నా ఓటమి అనిపించుకోదు. గెలవడానికి ఇంకా ఎన్నో మార్గాలున్నాయి నాకు. ఇది కేవలం చిన్న దెబ్బ మాత్రమే.'

ఫోన్ ఇంకోసారి గొణిగింది. నాకు తెలుసు, నా భార్య దగ్గర్నుంచి అని, లేకపోతే ఫోన్ అలా మోగదు. రిసీవర్ ఎత్తాను, నా అంచనాలు ఎప్పుడూ తప్పవు.

'మీ రూంలో ఎవరా అమ్మాయి!' డైరెక్టుగా అడిగేసింది. క్షణంసేపు గొంతు పెగల్లేదు నాకు.

'అబ్బే, ఏం లేదు....ఆహా....అవునూ....నీకెలా తెలుసూ!'

'ఆ గాజుల చప్పుడూ, మల్లెపూల వాసనా అన్నీ ఇక్కడికీ చేరుతూనే ఉన్నాయి.'

'కొయ్యకు ఆ అమ్మాయికి గాజులు లేవు, మల్లెపూలు పెట్టుకోలేదు.'

'మొత్తానికి అమ్మాయంటూ ఉన్నదన్నమాట.' స్టేల్‌మేట్‌లో పడిపోయాను, ఈ చక్రవర్తికి షా చెప్పడం ఆవిడకొక్కదానికే చేతనౌను. లాయర్ మరి.

'అసలు నువ్వెలా పసిగట్టావ్!'

'ఇప్పుడే విజయ్‌కి ఫోన్ చేశాను.'

అమ్మ! రాస్కెల్! ఎంత పని చేశాడు! ఈ రకంగా ఎదురు దెబ్బతీశాడన్నమాట. ఎంత పెద్ద రహస్యమైనా తనలోనే చంపేసుకుంటాడు ఎప్పుడూ. కానీ మా ఆవిడ గొంతు వినబడితే చాలు. సంజీవి మంత్రం వల్లించినట్లు అన్నీ బ్రతికిపోతాయి. లాయర్ ముందు అన్ని నిజాలే చెప్పాలన్న లోకనీతికి విరుద్ధంగా ఎప్పుడూ నడవలేడతను. అదే తనలోని పెద్ద వీక్‌నెస్. ఇప్పుడిక నేను అబద్ధం ఎలా చెప్పను?

'అవును. ఈ అమ్మాయి ఏదో పనిమీద వచ్చింది. ఇంతకీ నువ్వెలా ఉన్నావ్?'

'నాకేం నిక్షేపంలా ఉన్నాను, వందలూ, వేల మైళ్ళ దూరంలోఉన్నా, రోజుకు రెండుసార్లు ఫోన్ చేసే మొగుడుండగా నాకేం లోటు? ఇంతకీ ఎవరా అమ్మాయ్!'

'ఎవరో టెలిఫోన్ ఆపరేటర్లే, పిల్లలేం చేస్తున్నారు!'

'కాలేజీ నుంచి ఇంకా రాలేదు.....టెలిఫోన్ ఆపరేటరా!'

'నిన్న వెంకటేశ్వర్రావ్ డబ్బు తెచ్చాడా!'

'తెచ్చాడుగానీ, ఆపరేటరా!'

'అవునంటుంటే...' నాకా పరిస్థితి చాలా ఇబ్బందిగా వుంది. ఆవిడ మాటల్లో పొడిచేస్తోంది ఆవతల, ఇక్కడ ఈ అమ్మాయి చూపుల్తో గుచ్చేస్తుంది.

'ఏం పనిమీద వచ్చిందీ....' దీర్ఘం తీసింది మా లాయర్.

'ఇంకా తెలీలేదు, తెలిసిన వెంటనే నేనే ఫోన్ చేస్తాను సరేనా!'

'అయినా మీరు ఒంటరిగా ఆ అమ్మాయితో హొటల్ రూంలో ఉండటం ఏమిటి? బయటెక్కడైనా మాట్లాడొచ్చుగా, చెట్టంత కొడుకుల్ని ఉంచుకొని ఈ వయసులో ఇవేం విపరీత బుద్ధులూ మీకు!'

'చూడు శాంతా! ఈ వయసులో నాకు లేని ఆలోచనలు బలవంతాన ఎక్కిస్తున్నావు. ఇన్నాళ్ళు కాపురం చేశావ్, ఆ మాత్రం తెలీదా, నేను శ్రీరామచంద్రుణ్ణో, కేవలం శ్రీరంగనీతులు వల్లించేవాణ్ణో! అయినా ఈ అమ్మాయికి మన భాష అర్థం కాదు కాబట్టి సరిపోయింది....సర్లే యిక నువు పెట్టేయ్, నేను తర్వాత మళ్ళీ ఫోన్ చేస్తాను.'

'అంతే....అంతే....ఆ ఆపరేటర్లే నయం నాకన్నా, నాక్కూడా అటువంటి ఉద్యోగం చూడండి. అలా అయినా మీతో కాస్త ఎక్కువసేపు మాట్లాడే భాగ్యమన్నా కలుగుతుందేమో! ఇంతకీ ఇంటికెప్పుడు విజయం చేస్తున్నారు? అడ్రస్ గుర్తుందా? మళ్ళీ ఇవ్వనా పోనీ!'

'రేపొచ్చేస్తున్నాను.'

'గోవా వెళ్తున్నానన్నారు!'

'అయితే ఎల్లుండి'

'ఎల్లుండి ఢిల్లీలో మీ అమెరికా ఏజెంట్స్‌తో కాన్ఫరెన్స్ ఉందిగా.'

'అయితే....'

అంతే, శాంతి టక్కున ఫోన్ పెట్టేసింది ఆమె దేన్నైనా సహిస్తుంది. గానీ అబద్ధాన్ని సహించలేదు. నేను, నిజానికీ, అబద్ధానికీ మధ్య తేడాను ఇప్పటికీ కనిపెట్టలేదు. ముఖ్యంగా ఆవిడతో మాట్లాడేప్పుడు, నేను చెప్పే ప్రతిమాటా నిజం అనే అనుకుంటాను. కానీ అది అబద్ధమైపోతుంది ప్రతీసారీ ఆవిడ విషయంలో.

'ఎవరూ! మీ శ్రీమతిగారా!' అడిగింది సీత.

అవునన్నాను

‘ఈ వయసులో ఇంకా మీకెందుకీ తాపత్రయం, సంపాదించింది చాలదా! హాయిగా ఇంట్లో భార్యా పిల్లల్తో కూర్చోక!’

శాంతి కూడా ఇదే భావాన్ని లక్షసార్లు, కోటి విధానాల్లో వెల్లడించింది. వ్యాపారం, వ్యసనం రెండూ ఒకటే. దేన్నీ వదల్లేం, భార్యలకోసమైన సరే.

‘కేవలం నా సంసారానికైతే సరిపోతుంది, నేను సంపాదించేది, కానీ నేను ఇది మానేస్తే నీలాంటి ఎంతో మందికి ఎలా సహాయపడగలను?’

ఇది మాత్రం నిజం నేను వ్యాపారం కేవలం ఇతరులకు సహాయపడటానికి చేయకపోయినా, నేను సాయం చేసిన వాళ్ళు చాలామందే ఉన్నారు.

‘ఇతరులకు ఉపయోగపడటానికీ బ్రతికే బ్రతుక్కు అర్థం లేదు. అంతకన్నా వ్యర్థం ఇంకోటి లేదు పరాయి వాళ్ళ పరమోద్ధరణ ఆలోచించేవాడు, అయినవాళ్ళకు ఆకుల్లోనే వడ్డిస్తాడు ఎప్పుడూ ఒక స్త్రీగా మీ భార్యను నేనర్థం చేసుకోగలను, మీరు సంపాదిస్తున్న దాంతో సరిపోలిస్తే మీరు కోల్పోతున్నది చాలా ఎక్కువ.’

సలహాలు, నేను ద్వేషించేవాటిలో కొన్ని. ఆ అమ్మాయి మీద నాకు ఏర్పడిన సానుభూతి, ఆప్యాయత, అనుబంధాల లాంటి భావాలు సజీవంగా ఉండగానే ఆమెను సాగనంపడం మంచిదనిపించింది.

‘ఎనీహౌ, అది నా జీవన విధానం దాన్నంతవరకూ ఎవరూ మార్చలేకపోయారు. మార్చుకోవడం నావల్ల కాదు.’ చెక్కుబుక్కు తీసి సంతకం చేసిన బ్లాంక్ చెక్ ఆమెకిచ్చాను.

‘వ్యాపారస్థులు ప్రతిఫలం ఆశించకుండా ఏ పనీ చెయ్యరంటారు. మీరు నానుండి ఏం ఆశిస్తున్నారు?’

మళ్ళీ ఇంకోసారి ఆ అమ్మాయి నా అహంమీద తెలిసో, తెలియకో దెబ్బ కొట్టింది. అయినా కోపం రావడం లేదు. జాలి వేస్తోంది తన అమాయకత్వం మీద, సూటిగా ఆమె కళ్ళలోకి చూశాను, తల దించుకుంది.

‘ఏమివ్వగలనని నీనుండి నేనాశించాలి? వయసు మినహా నీ దగ్గరేం లేదు. ఒక చేత్తో డబ్బిచ్చి మరో చేత్తో ఆ వ్యక్తి మానాభిమానాల్ని దోచుకునే రాక్షస వ్యాపారం నేను చెయ్యలేను. మాకు సరుకుల విలువలే కాదు. మానవత్వంపు విలువలు కూడా తెలుసు. నీకీరోజున నేనీ రకంగా ఉపయోగపడుతున్నానంటే అది నా ఆత్మ సంతృప్తి కోసం, ఓ మంచి మనిషికి నేనూ చేయూతనిస్తున్నానన్న మనశ్శాంతి కోసం, మళ్ళీ నీ భర్తతో కళకళలాడుతూ నాకు కనిపించు, అదే నువ్వు నాకిచ్చే ప్రతిఫలం.

నా పాదాలు తాకడానికి వంగబోయిందామె. మధ్యలోనే వారించాను.

‘నీ కళ్ళల్లో మెరిసే ఆ వెలలేని ముత్యాలే నాకు కోటి కృతజ్ఞతల్ని చెబుతున్నాయి’

అన్నాను.

ఇక నిగ్రహించుకోలేక, నా భుజం మీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడవసాగిందామె. ఆమె తల నిమురుతూ ఉండిపోయాను కాసేపటివరకూ.

'ఊరుకో ఇక ఎందుకంత బాధపడతావ్! తప్పకుండా నయమౌతుందతనికి, మళ్ళీ మీరిద్దరూ బ్రతుకులోని మాధుర్యాన్ని తనివితీరా చవిచూస్తారు. ఇక నా డబ్బులు సంగతంటావా! ఒక కాపురం పచ్చనవ్వడాన్ని మించిన గొప్ప ప్రయోజనాన్ని, సార్థకతను దాన్నుండి నేనాశించడంలేదు.

కళ్ళు తుడుచుకుందామె మాటలు రాని దానిలా మౌనంతోనే అనేక కృతజ్ఞతలు చెబుతూ వెళ్ళిపోయింది. నేనూ మనిషినే అని నిరూపించుకునే ఒక అమూల్యమైన అవకాశాన్ని నాకిచ్చి, లిఫ్ట్ వరకూ ఆమెను సాగనంపి తిరిగి వస్తుంటే ఎప్పుడో మర్చిపోయిన నా కళ్ళు మళ్ళీ ఈవేళ చెమర్చాయి. నా మనస్తత్వం అతి సున్నితం, ఏ చిన్న తాకిడినీ తట్టుకోలేదు. అందుకే ఈ బ్రతుకులో నాకు మనశ్శాంతి బద్ధశత్రువు.

కాలం నా వయసుకో సంవత్సరాన్నీ, బాంక్ అకౌంట్‌లో నాలుగు లకారాల్నీ తగ్గించి నిశ్శబ్దంగా అనంతంలోకి జారిపోయింది. ఆ సంవత్సరమంతా నేను ఎక్కువగా మిడిల్‌ఈస్ట్, కాంటినెంట్‌లలో గడపడంలో ఇండియా రావడం పడలేదు.

బాంబే రాగానే నాకు తెలిసిన మరో ఆపరేటర్ ఫోన్ చేసి చెప్పింది. సీత నాకు వ్రాసిన ఓ ఉత్తరం తనతో ఉందనీ, సాయంత్రం తీసుకొస్తున్నాననీ ఆ అమ్మాయి బిజీగా ఉండటం వల్ల వివరాలడగటం కుదరలేదు. బహుశా ట్రాన్స్‌ఫర్ ఏమైనా వచ్చిందేమో సీతకి, లేకపోతే ఉత్తరం వ్రాయవలసిన అవసరమేమిటి? తనే స్వయంగా వచ్చి కలవవచ్చుగా, అనుకున్నాను ఆ సాయంత్రం ఆ ఉత్తరం చదువుతూంటే క్రమంగా నా మెదడు మొద్దుబారిపోతున్నట్టు, నేను మళ్ళీ నా ప్రగతి నుండి వెనక్కి, ఎంతో వెనక్కి, ప్రాకృతిక పైశాచిక ప్రవృత్తిలోకి వెళ్ళిపోతున్నట్లనిపించింది. మొదట నాకా ఉత్తరం ఏ మాత్రం అర్థం కాలేదు. అందులో ఉన్న వాక్యాలూ, దాన్నితెచ్చిన అమ్మాయి చెప్పిన మాటలూ, సమన్వయపరుచుకుంటే జరిగిన దారుణం కళ్ళముందు కదిలింది.

సీత ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్తకు పూర్తి ఆరోగ్యం చేకూరింది. ఆపరేషన్ అయిన తర్వాత అతను అనేకసార్లు అడిగాడు, ఆమెను డబ్బు ఎక్కణ్ణించి తెచ్చావని, ఒళ్ళు అమ్ముకోని ఆడది పైసా కూడా ఇతరాత్రా సంపాదించలేదని గాఢంగా నమ్మే ఒక చెడిపోయిన తరగతికి ప్రాతినిధ్యం వహించే అతన్ని, సీత నిష్కల్మషత నమ్మించలేకపోయింది. నిజం చెప్పీ చెప్పీ విసుగెత్తుపోయి, అతను పెట్టిన చిత్రహింసను ఎన్నో రోజులు భరించి, సహనం ఇంకిపోగా, ఆత్మగౌరవంతో జీవితంలో అన్నీ తుడిచిపెట్టుకుపోగా, సుఖశాంతులు

ఇగిరిపోయి, ఆరాధించే దేవుడు వరానికి బదులు ఘోరశాపాన్ని ప్రసాదిస్తే, ఈ జీవితమనే శూన్యంలో ఏం చూసుకుని బ్రతకాలో అర్థంకాక, చావులో విముక్తి వెదుక్కుంది ఆ అభాగ్యురాలు. భార్య శవాన్ని చూడ్డానికి కూడా రాలేదతను. ఆయన లేకుండా నేను బ్రతకలేను అని నాతో చెప్పిన సీత, అతని ఉనికిని భరించలేక ఉరిపోసుకుంది. ఆ ఉత్తరం తెచ్చిన అమ్మాయిని అడిగాను 'అతనెక్కడుంటున్నాడిప్పుడు?' ఆమె అడ్రసిచ్చి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి హోటల్ బయటికి వచ్చి టాక్సీలో కూర్చుని ఆ అడ్రస్ డ్రైవర్‌కిచ్చాను. మెరైన్‌డ్రైవ్ నుండి వీస్తున్న గాలి నాకేమాత్రం ఉపశాంతి నివ్వలేకపోతోంది. నా మనస్తత్వం నాకే అనూహ్యం. ఎందరో సైకియాట్రిస్ట్‌లను సంప్రదించాను, క్షణికమైన ఆలోచనతో ఆవేశపడి నిర్ణయాలు తీసుకోవద్దని అనేకమంది హెచ్చరించారు. కానీ అది నా చేతకావడం లేదు, నేను చేసే ప్రతి పనీ సమర్థనీయం కాదని నాకు తెలుసు. అయినా నేను నిగ్రహించుకోలేను.

నా డబ్బు అన్యాయాలూ, అక్రమాల ద్వారా సంపాదించింది కాదు. అది నా చెమటలో నుండి పుట్టింది. నా రక్తంతో పెరిగింది. దాని పవిత్రత దేనికీ రాదు. ఎవరూ దానికి విలువ కట్టలేరు. అమృతం అవుతుందనుకుని నేను పోసిన ప్రాణం విషంగా మారిపోతే సహించేంత పెద్ద గుండె నాకు లేదు. ఒక ఆడదాని కన్నీళ్ళు తుడవడానికి చేసిన ప్రయత్నం ఆ స్త్రీ ప్రాణాల్నే బలిగొనడాన్ని మించి వేరే నరకం నాకు లేదు.

చిన్నప్పటినుంచీ నేను మొండివాణ్ణనీ తొందర ఎక్కువనీ, ముందూవెనకా ఆలోచించననీ ఆవేశంలో అనేకమైన నిర్ణయాలు తీసుకుంటాననీ అందరూ అనేవారు. ఒకసారి నేను మా నీళ్ళ కుళాయి దగ్గర ఆడుకుంటుండగా, ఓ గండుచీమ నీళ్ళలో పడింది. పెద్ద మానవతా దృక్పథంతో దాన్ని చేతిమీద కెక్కించుకొని బయటకు తీసుకొచ్చాను. అది ఒక్కసారి ఒళ్ళు విదిలించుకుని నా వేలిని గట్టిగా కుట్టి కిందకు దూకింది. కాలితో బలంగా దాన్ని నేలరాచాను. అప్పటికీ ఇప్పటికీ నా అభిప్రాయాల్లో పెద్ద మార్పేమీ రాలేదు.

జేబు తడుముకున్నాను. రివాల్వర్ చల్లగా తగిలింది.

*   *   *



కిం కర్తవ్యం

వేములపల్లి మోహనరావు – పి.వి.కృష్ణారావు

రన్‌వే మీదనుంచి పైకి లేచింది విమానం. సీట్ బెల్ట్ సడలించి కిటికీలోంచి తొంగిచూశాడు డాక్టర్ ఆదెయ్య. అస్తవ్యస్తంగానూ, అక్కడక్కడా పొందికగానూ పాలపుంతలో నక్షత్రాలకి మల్లే విస్తృతంగా న్యూయార్క్ నగర దీపాలు.

స్టేట్ యూనివర్సిటీ ఆహ్వానం మీద 'సైకాలజీ ఆఫ్ పావర్టీ'పై జరిగిన అంతర్జాతీయ సదస్సులో రీసెర్చ్ పేపర్ చదవడానికి ఐదు రోజుల క్రితం అమెరికా వచ్చాడు. మరో గ్రహంలాంటి న్యూయార్క్‌లో, జెట్‌లాగ్‌తో తన ఆలోచనల తాలూకు ఎక్సైట్‌మెంట్‌తో అక్కడ గడిపిన ఆ కొద్ది రోజులకి తన జీవితంలో ఎంతో ప్రాధాన్యత వుంది. ఇదివరకటి తన యూరప్ ట్రిప్పులకి మల్లే కాదు. ఆదెయ్య యిపుడు తన భవిష్యత్ కార్యక్రమాల్ని గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు.

కృష్ణా డెల్టాలో ఒక సంపన్నమైన గ్రామానికి దూరంగా విసిరివేయబడ్డ ఓ గూడెంలో, మిషనరీ స్కూల్లో మొదలయిన తన చదువు, సోషియాలజీలో పి.హెచ్.డి.వరకు ఎలా సాగిందో తనకి మాత్రమే తెలుసు. అమ్మ కిరాణాకొట్టు నుంచి తెచ్చిన పొట్లాలు విప్పి ఆ కాగితాలపై అక్షరాల్ని కూడబలుక్కొని చదివిన తన కుతూహలం విద్యా సముపార్జన పట్లఎప్పుడూ వుంటూనే వచ్చింది. జిజ్ఞాస, ఏదో తెలుసుకోవాలని, చెయ్యాలని ఆరాటం అదే తన జీవితాన్ని నడిపింది.

రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్పులే కాదు, తన మార్గంలో ఎన్నో అవరోధాలు, మరెన్నో అవమానాలు, అయినా ఎన్నడూ తను తలవంచలేదు. మెరిట్‌లో ఎవరికీ తీసిపోనూలేదు.

ఎదిగినకొద్దీ హిందూ ఈథాస్ అతనికి తెలిసొచ్చింది. మార్క్సిజం చదవడంతో కలిగిన సామాజిక స్పృహ తనకో జీవన దృక్పథాన్నిస్తే,. సామాజిక శాస్త్రాధ్యయనానికి ఆయత్తమయ్యాడు. పురాణకాలం నుంచి నేటిదాకా సమాజంలోని అట్టడుగు వర్గాల జీవనరీతుల్ని, వ్యక్తిత్వ లక్షణాల్ని పరిశీలించి విశ్లేషిస్తున్నాడు. "బీదల సంస్కృతి"పై డాక్టరేట్ డిగ్రీ అతడిది. ఆ పరిశోధనలో సమాజ యంత్రాంగాన్ని నడిపే మధ్య తరగతి వ్యక్తుల విలువలకి, బీదల విలువలకి తేడా తెలుసుకున్నాడు. అదృష్టం మీద నమ్మకం, ముందుచూపు లేకపోవడం, తొందరపాటు, న్యూనతా భావాలు... ఓహ్... ఎన్ని... ఎన్నని...

స్పృహ, విప్లవం.....ఈ రెండింటిలో స్వభావ పరిమితుల వల్లా, ఆధునాతన కాలంలో సాయుధ విప్లవం అసాధ్యమనే దృక్పథంవల్లా ఆదెయ్య సమాజంలో మార్పు కోసం మొదటిదాన్ని ఎన్నుకున్నాడు. జీవితంలో స్థిరపడ్డాక తన తరగతి చైతన్యానికి చిత్తశుద్ధితో ఎంతో కృషి చేశాడు. షెడ్యూల్డు కులాలకు, వెనుకబడిన వర్గాలకు సంబంధించిన ఎన్నో కమిటీలలో తన విద్యాధిక్యత వల్ల సభ్యుడై ఇతోధికంగా కృషి చేస్తున్నాడు. కానీ.....కానీ.....

కాన్ఫరెన్స్‌లో రోజర్ లెనిన్ చదివిన వ్యాసం అతని చెవుల్లో మార్మోగుతోంది. "ఆకలి మెదళ్ళు" అన్న ఆ వ్యాసం షెనువర్, డాబ్బింగ్, శాండ్స్ మొదలైన ఎందరో శాస్త్రజ్ఞుల ఎన్నో సంవత్సరాల పరిశోధనలు దాల్చిన అక్షరరూపం. తన స్నేహితులైన

వాళ్ళ రీసెర్చి టాలెంట్‌కి ఎంత పొంగిపోయాడో, వాళ్ళు కనుగొన్న విషయాలకి అంత కృంగిపోయాడు.

"మీరు చూసేవుంటారు, ఇండియాలాంటి దేశాలలో వుబ్బిన పొట్టలతో, పుల్లల్లా వ్రేళ్ళాడే కాళ్ళూ, చేతులతో, ఆసక్తిలేని చూపుల్తో చిన్నారిపాపల్ని. ఈనాడు ప్రపంచంలో మూడు వందల మిలియన్లకు పైగా పిల్లలు సరైనా ఆహారం లోపించడంవల్ల అట్లా వున్నారు. ఆశావాహ ధోరణితో ఈ పిల్లలకి సరైన ఆహారం సమకూర్చగలిగితే వాళ్ళ రుగ్మత తగ్గుతుందని మనం అనుకోవడానికీ వీల్లేదు. ఈ బిడ్డల ప్రజ్ఞ ఎప్పటికీ పుంజుకోలేనంతగా దెబ్బ తింటుందని మా పరిశీలనలు సూచిస్తున్నాయి.

"సృష్టిలో అతి సంకీర్ణమైన మానవ మస్తిష్కంలో కోటానుకోట్ల నాడీ కణాలున్నాయి. వాటి సక్రమాభివృద్ధి సహజాతమే అయినప్పటికీ, బిడ్డ జీవన పరిస్థితుల ప్రభావం వాటి నిర్మాణంపై ఎంతో వుంటుంది. శిశువు గర్భంలో వున్నప్పటి మొదటి 10-18 వారాలలోనే అన్ని కోట్ల నాడీకణాలు రూపుదిద్దుకుంటాయి. ఆ సమయంలో తల్లికి సరైన ఆహారం లేనట్లయితే ఈ నాడి కణాల సంఖ్య బాగా తగ్గిపోతుంది. అవి సరిగ్గా ఎదగవు. బిడ్డ జన్మించిన తర్వాత వెంటనే రెండేళ్ళలో ఈ నాడీకణాల మధ్య విస్తృతంగా సంబంధాలు ఏర్పడతాయి. వయసుతోపాటు వ్యక్తులలో కన్పించే ప్రజ్ఞ, మానసికరీతుల్లో సంకీర్ణత, భాషా పటిమ ఈ కూర్పువల్లనే. అయితే పోషకాహారం, సంపన్నమైన జీవన పరిసరాలు ఈ దశలో లోపిస్తే నాడీకణాల మధ్య ఏర్పడే ఈ సంబంధాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. పుట్టుకకి ముందు ఆహార లోపం చిన్న మెదడుపై కూడా తన ప్రభావం చూపి. పెద్దయినాక మోటుతనానికి, శారీరకమైన నిపుణత కొరవడటానికి దారితీస్తుంది.

"బీదతనపు పర్యవసానం భీతావహం. దానిలో మ్రగ్గేవాళ్ళు తమ పిల్లలకి సరైన ఆహారం ఇవ్వలేరు. ఉద్దీప్తకరమైన పరిసరాల్ని కల్పించలేరు. అంటే, ఈ భూగోళం మీద నూటికి డెబ్బై మంది దారిద్ర్యం వల్ల తరతరాలుగా మెదడు సంపూర్ణంగా ఎదగకపోవుటమనే అత్యంత ప్రమాదకరమైన స్థితికి లోనై మందమతులుగా, మోటుగా తయారవుతున్నారు.

"విషాదకరమైన విషయం ఏమిటంటే, జీవితంలో తరువాత అంటే ఎదిగాక పోషకాహారం, సంపన్న జీవన పరిసరాలు లభించినా ఈ నష్టం పూడదు. మరెన్నడూ మస్తిష్కం తన పూర్వపు సాధ్యస్థాయికి ఎదగలేదు...."

బలంగా కణతలు నొక్కుకున్నాడు ఆదెయ్య. మిగతా విషయాన్ని గుర్తుతెచ్చుకోవడానికి సమ్మెటపోట్లు తిన్న అతని మేధ సహకరించలేదు.

కాల్ లాంప్ స్విచ్ నొక్కి, ఎయిర్‌హొస్టెస్‌ని అడిగి యాస్ప్రిన్ మాత్రలు రెండు

మింగి, కలత నిద్రలోకి జారిపోయాడు.

* * *

హీ త్రూ డ్యూటీ ఫ్రీ షాపుల్లో తన శ్రీమతికి, పదహారేళ్ళ పెద్ద కొడుకు రాజేష్‌కి, పన్నెండేళ్ళ చిన్నకొడుకు భావేష్‌కి తను కొనాలనుకున్న వస్తువులు కొన్నాడు. తనప్పుడే తిరిగి వస్తాడని వాళ్ళెవరూ అనుకోరు, కనీసం మరో రెండు వారాలయినా అమెరికాలో వుంటానని అనుకుంటారు. తన రాకతో సర్‌ప్రైజ్ ఇవ్వాలి అనుకున్నాడు.

* * *

కస్టమ్స్ నుంచి బయటపడేసరికి రాత్రి తొమ్మిది గంటలయింది. మరో అరగంటలో తను ఇంట్లో....వెన్నెల్లో తారురోడ్డుపై జారిపోతున్న టాక్సీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు. ఆలోచనలతో అలసిపోవడం ఆదెయ్యకి కొత్త కాదు. "ఒక గడ్డిపోచ ప్రాణం పోసుకోవాలన్నా పుడమి తల్లి పురిటినొప్పులు పడాలి" తన భవిష్యత్తు, తన వాళ్ళ భవిష్యత్తు, తన దేశం....మానవాళి....ఆలోచనల్ని కూడదీసుకునే ప్రయత్నంలో ఆ ప్రయత్నంగా 'నేనేం చెయ్యగలను' అనుకున్నాడు.

ఆలోచనల్నుంచి తల తిప్పి బయటికి చూశాడు. వెన్నెల్లో తడుస్తున్న సముద్రం. ఆ బ్రిలియన్స్‌కి అతను కొద్దిగా రిలీఫ్ ఫీలయ్యాడు. యూనివర్సిటీ క్వార్టర్సులోకి కారు ప్రవేశించి ఎత్తుపల్లాల్ని అధిగమిస్తోంది. సముద్రం మరింత చేరువౌతోంది. అలసటెరుగని అలలు.

టాక్సీ దిగి సూట్‌కేస్‌ని స్లైడ్ చేసి, చప్పుడు కాకుండా పోర్టికోలో వదిలి, హాండ్ బాగ్‌తో లోపలికి నడిచాడు.

నిశ్శబ్దంగా లివింగ్ రూమ్ దాటి పామిలీ రూమ్ గుమ్మంలో అడుగుపెట్టాడు. టి.వి. స్క్రీన్ మీద మ్యూట్‌లో అమితాబచన్, మాస్టర్ బెడ్‌రూమ్ దగ్గర భావేష్ నిలబడి ఏదో అంటున్నాడు.

"నేను సినిమా చూడను, చదువుకోవాలి" గదిలో నుంచి రాజేష్ గొంతు.

"నీకెప్పుడూ చదువేరా అన్నయ్యా ఎందుకు పద్దాక అట్లా చదువుతావు, మార్కులు తక్కువచ్చినా మనకి చదువుకోవడానికి సీట్లొస్తాయి. క్లాసులు రాకపోయినా ఉద్యోగాలొస్తాయి గదరా."

ఆదెయ్య స్థాణువై....

* * *



లోకం అంచున ఇద్దరు

వేములపల్లి మోహనరావు -
పి.వి.కృష్ణారావు

గోడ గడియారం రెండుసార్లు గుండె బాదుకుంది.

నీరసంగా లేచి లాబ్ తలుపు మెల్లగా తోశాను. డాక్టర్ రావ్ మామూలుగానే ఏదో పరిశోధనలో నిమగ్నమై వున్నారు. మొహంమీద స్వేద బిందువులు మెరుస్తున్నాయి. దగ్గరగావెళ్ళి "భోజనానికి రండి" అన్నాను సాధ్యమైనంత మెల్లగా, ఎవరైనాసరే గట్టిగా మాట్లాడటం ఆయన కిష్టం వుండదు, ఆయన తల కూడా తిప్పలేదు.

"నేను తర్వాత తింటాను. నువ్వు భోంచేసెయ్" అవి మాటలు కావు, శాసనాలు. వాటిని ధిక్కరించే అధికారం, కాదనే చొరవా ఆయన నాకు ఈ పెళ్ళయిన తొమ్మిదేళ్ళలోనూ కొంచెంకూడా ఇవ్వలేదు.

మరికాసేపు అక్కడే తటపటాయిస్తూ నిలబడ్డాను. నావైపు చూశారు ఓ నిముషం ఆగి, ఆయన మాటలకన్నా చూపులు మహాశక్తివంతమైనవి. తలవంచుకొని బయటకు వచ్చేశాను.

కిచెన్ గుమ్మానికానుకొని నాయర్ కునికిపాట్లు పడుతున్నాడు. నన్ను చూడగానే లేచి డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి అన్నిటిమీదా మూతలు తీసి వెనక్కు వెళ్ళి చేతులు కట్టుకొని నిలబడ్డాడు. నేను జీవితానికి బానిసను. వాడు నాకు బానిస

"కట్‌లెట్లు బాగా కుదిరాయా అమ్మగారూ" అన్నాడు వాడు ఆసక్తిగా

"ఊ" అన్నాడు పరధ్యానంగా, ప్రశ్నార్థకంగా వాడడిగింది నాకు అర్థమైనా, నాకు రుచులు తెలియటం మానేసి చాలా కాలమైందని వాడికి తెలియదు. ఏమనుకున్నాడో మళ్ళీ మాట్లాడలేదు.

వీడికి నామీద ఉన్న ప్రేమలో ఎన్నో వంతైనా కట్టుకున్నవాడికి ఉంటే నాకా ఆలోచన అంత అసందర్భంగా వచ్చి ఉండకపోయేదేమో "వీడితో లేచిపోతే? అనే ఆలోచన. కనీసం ఏం తింటున్నానో అసలు తింటున్నానో, ఉంటున్నానో కనుక్కునే దిక్కైనా ఉంటుంది అనే ఆలోచన. ఆలోచనలకూ, ఆచరణలకూ మధ్య ఎంత వైరుధ్యం! ఎంత ఆగాధం! ఎపుడూ, ఎవరూ దాటలేరేమో!

వాష్‌బేసిన్ దగ్గర చెయ్యి కడుక్కోగానే నాప్‌కిన్ అందించి పక్కకు తప్పుకున్నాడు వాడు. బెడ్‌రూంలోకి వచ్చాను. మడత నలగని దుప్పట్లు తమ ఉపయోగమేమిటో తెలియక వెలవెలబోతున్నాయి. ఫ్లవర్ వాజ్‌లో పువ్వులక్కూడా నిరాశే. అద్దం ముందు నిలబడితే ప్రతిబింబం నిలదీసి అడుగుతుంది. నీ బ్రతుక్కి అర్థం ఏమిటని? ఇరవై ఆరేళ్ళ వయసు శపిస్తుంది ఇంకా ఎన్నేళ్ళు ఈ ఒంటరితనమని? కోరికలు రగిలి రగిలి మండి మసైపోయి, ఆశలు ఆవిరైపోయి తమ శిథిలాల్ని మాత్రమే మిగిల్చాయి.

ఏమని సంజాయిషీ ఇచ్చుకోను వీటన్నిటికీ?

పరిష్కారం చూపలేని పనికిరాని నవలనొకదాన్ని మళ్ళీ చేతిలోకి తీసుకున్నాను. ఆ అవసరాన్ని అసహ్యించుకుంటూ. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు. లేచేటప్పటికి ఐదున్నర కావస్తోంది. నిలువెత్తు అద్దంలోని అందం ఒళ్ళు విరుచుకొని ముద్దుగా ఆవలించింది. అంత శృంగార భంగిమను ఎవరు చూసి ఆనందించాలని! చెదరని ముంగురులను అనవసరంగా సవరించుకొని నిట్టూరుస్తూ పక్కకు కదిలింది.

నిట్టూర్పులు....ఊపిరికన్నా తరచుగా విడువవలసిన అవసరం తృప్తి కుబుసాలు.

పోర్టికోలోకి వచ్చాను. నల్లటి చిన్న ఫియట్ కారు నిగనిగలాడుతూ పలకరించింది. దానికీ, నాకూ ఉన్న సంబంధం అవినాభావం, నాతోపాటే ఈ ఇంట్లోకి అడుగుపెట్టింది. డాక్టర్ రావుగారికి మేమిద్దరం ఎంతో ఇష్టం. ఆ నలుపు రంగు నా జీవితంలో విషాదానికి ప్రతిరూపం. తొమ్మిదేళ్ళయినా దాని చెక్కు చెదరని రంగు మెరుపు నా వయసుకు సంకేతం. డాక్టరుగారికి దాంతోగానీ, నాతోగానీ యెప్పుడోగానీ అవసరం యేర్పడదు. నాకన్నా అదే ఓ పాలు యెక్కువ అదృష్టవంతురాలు అప్పుడప్పుడూ ఆయన దాన్ని తుడుస్తారు.

మెట్లు దిగి దాన్ని ఆనుకొని నిలబడ్డాను. మృత్యువు చూపించి సానుభూతిలాంటి చల్లని స్పర్శ. పోర్టికోలో అదీ...ఇంట్లో నేనూ కదలికలేని జీవితాలు, గమ్యాల సంగతి దేవుడెరుగు.

చిన్న పిల్లల్లా గాలిలో ఆడుకుంటూ కేరింతలుకొట్టే పూలమొక్కలు పరిశోధనకు తప్ప ప్రణయానికి వుపయోగపడని నిర్గంధ కుసుమాల పరాగ సంపర్కంలో ఫలదీకరణలో శాస్త్రసత్యాలు తప్ప సృష్టిరహస్యాలు గోచరించవు ఆయనకి. ఇంటి చుట్టూ నిశ్శబ్దం. ఏకాంతం మైళ్ళకొద్దీ అల్లుకొని ఆ యింటిని ప్రపంచం ఆవతలకు విసిరేసింది.

కాలం ఎందుకింత పగబట్టింది నామీద, ముందుకు కదలకుండా మొండికెత్తి? ప్రకృతిని చీకటి కౌగిలించుకున్నాక ఇంట్లోకి నడిచాను. పట్టపగల్లా వెలిగిపోతున్న ఆ ఇంట్లో ఎంత చీకటి?

ఈజీ చైర్లో కూర్చున్న డాక్టర్ నన్ను చూసి కళ్ళు తెరచి చిన్నగా నవ్వారు. జస్టే ఫార్మాలిటీ. జవాబును ఆశించని నవ్వు, నిన్ను గుర్తించానులే. నీ ఉనికి నాకు పెద్ద ఇంపార్టెంట్ ఏం కాదు అని తెలియజేసే అభిలషణీయం కాని చిరునవ్వు. ప్రయోజనం, ఆనందం కలిగించని దరహాసం, మౌనంగా బెడ్‌రూంలోకి నడిచాను.

తొమ్మిదిన్నరకు ఆహ్వానం "భోంచేద్దాం రా" వంటవాడి దగ్గర్నుంచి కాదు. ఇంటివాడి దగ్గర్నేంచే. ఎన్నో ఏళ్ళుగా జీర్ణించుకుపోయిన బానిసత్వం నన్ను లేపి నా కాళ్ళను డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిపించింది. నాయర్ ఎనిమిదింటికల్లా అన్నీ సర్దేసి వెళ్ళిపోతాడు. వాడూ మనిషే, అవసరాలుంటాయి. నాలా కాదు.

ఎవరికి చెబుతున్నారో, ఎందుకు చెబుతున్నారో అర్థం కాని ఆయన పరిశోధనల ఫలితాన్ని దానివల్ల మానవాళికి జరగబోయే మహోపకారాన్ని బలవంతాన మింగేసి చెయ్యి కడుక్కున్నాను. పెట్టవలసినవన్నీ ఫ్రిజ్‌లో పెట్టి వంటిల్లు సర్దుకొని వచ్చేప్పటికి రోజులాగే ఆయన గాఢనిద్రలో ఉన్నారు."

పడుకొని కళ్లుమూసుకున్న ఇక్కణ్నుంచీ ప్రతి క్షణం నరకం నాకు అణగదొక్కబడిన కోరికలు విజృంభించి, రక్తం అప్పటి వరకూ వేసిన ఆనకట్టలను ఒక్కసారిగా గట్లు తెగ్గొట్టుకొని ఉధృతంగా ప్రవహించి నరాలు శరీరాన్ని ఉరితీస్తూ, చిత్రహింసచేస్తూ యవ్వనం విప్లవించి విచ్చుకత్తులతో ఒళ్ళంతా చీలుస్తూ, సృష్టి నన్ను శాసిస్తూ దహిస్తుంటే, తప్పించుకోవడానికి విఫల ప్రయత్నం చేస్తూ....ఎంతకాలం నా సంగ్రామం?

ఆదుకోవలసిన, ఆదరించవలసిన వ్యక్తి అందుబాటులో ఉండే శవంతో సమానమైపోతే ఎవరితో చెప్పుకోను? నా మీద ధ్వజమెత్తిన ప్రకృతి శక్తుల్ని ఒంటిచేత్తో ఎంత కాలం ఎదుర్కోను? నిముషాల్ని గంటలుగా, గంటల్ని రోజులుగా ఎంత కాలం భరించను? నా మీద విలయతాండవం చేస్తున్న వీటన్నిటినీ వికృతరూపం దాల్చనివ్వకుండా, వికటించకుండా నా మనసుతో నేను చేసే పోరాటాన్ని ఎవరు హర్షిస్తారు?

ఎన్నో యుగాల తర్వాత నిద్రపట్టి మర్నాడు మేల్కొని చూసేప్పటికి డాక్టర్ రావ్ యధా ప్రకారం లాబొరేటరీలో....లోకకళ్యాణాన్ని తిలకిస్తూ....

సిల్టన్ స్టేషన్‌తోడు కూర్చోబెట్టుకొని బ్రేక్‌ఫాస్ట్ ముగించి తొమ్మిదిన్నరకు బయటికొస్తే మళ్ళీ భయంకరమైన సమస్య. నాలాంటివాళ్ళకు కాలాన్ని మించిన శత్రువులేదు.

పెరగని గోళ్ళను చూసుకుంటూ పెరిగి వచ్చిన పరిసరాల్ని మననం చేసుకుంటూ కొన్నేళ్ళు వెనక్కెళ్ళి జీవిస్తూ పుట్టించినందుకు అమ్మా, నాన్నలతోపాటు దేవుణ్ణి కూడా తిట్టుకుంటూ (డాక్టర్ రావ్ మాత్రం దేవుణ్ణి తిట్టరు, ఎందుకంటే దేవుడి దగ్గర యెప్పుడవసరమైనా అగ్గిపెట్టి తీసుకోవచ్చుట) విజ్ఞానాన్ని పెంచినందుకు యూనివర్శిటీని, స్నేహాన్ని, ఆనందాన్ని పంచినందుకు స్నేహితుల్నీ, అందమైన అనుభవాల్ని అందించినందుకు చచ్చిపోయిన రోజుల్నీ మాకుమ్మడిగా ద్వేషిస్తూ యెంత సేపు? ఎంతసేపని? ఎన్నాళ్ళని?

పదకొండున్నరకు నిద్రాదేవి దయతలిస్తే, ఇంకెవరున్నారు ఆవిడ తప్ప దయతల్చడానికి కాసేపు సమస్యలకు దూరంగా పారిపోయి.

గోడ గడియారం రెండుసార్లు గుండె బాదుకుంది.

* * *

"ఇప్పుడు చెప్పండి, ఏం చూసుకుని బ్రతకమంటారు? ఏం ఆశించి బ్రతకమంటారు? వైవిధ్యంలేని జీవితాల వల్ల పశుపక్ష్యాదుల్లో కూడా విపరీతమైన మానసిక

సంక్షోభం తలెత్తుతుందని సైన్స్ నిరూపించింది. ఆఫ్టరాల్ నేను మనిషిని. మనిషికి ఆవలసిన కనీసపు కోరికలు కూడా తీరనపుడు. వివాహ బంధం దాని అర్థాన్నే కోల్పోయినప్పుడు స్త్రీకి మిగిలేదేమిటి? సంఘం గీచిన గీత దాటకూడదు నేను. ఎంతసేపూ నాలో నేనే కుమిలిపోవాలి. కనీసం బాధ విప్పి చెప్పుకోవడానికిక్కూడా అవకాశం లేదు.

నిర్లక్ష్యం చేయబడ్డ భార్యలకంటే హింసించబడే భార్యలు అదృష్టవంతులు. సహనానికి హద్దులున్నాయి. సంవత్సరాల పాటు ఓపిక పట్టాను. ఇక నా వల్ల కాదు. నా సమస్యకు ఇంతకన్నా పరిష్కారం లేదు ఆమె గొంతులో ఆ నిర్ణయం తాలూకూ స్థిరత గాంభీర్యంగా ధ్వనించి అతన్ని కాసేపు మాట్లాడనివ్వలేదు.

వాళ్ళముందు సముద్రం రౌద్రంగా ఘోషిస్తోంది. తిమిరాన్ని తిని అశాంతిని కక్కుతున్న పెను తిమింగిలంలా, ప్రకృతంతా నల్లగా వికృతంగా ఉంది. ఉవ్వెత్తున చెలరేగే కెరటాలు నిముషం కన్నా బ్రతకడం లేదు. రాళ్ళకేసి తలలు బద్దలు కొట్టుకొని ఆత్మహత్య చేసుకుంటున్నాయి.

గొంతు సవరించుకున్నాడతను.

"మీది సమస్య కాదనీ, మీకు సమస్యల్లేవనీ నేనటం లేదు. కానీ పరిష్కారం లేని సమస్యంటూ ఏదీలేదు. నా జీవితంలో మీకు జవాబు దొరుకుతుందేమో చూడండి"

*　*　*

"పార్వతి నా జీవితంలో ప్రవేశించేప్పటి వరకూ నేను జీవితమంటే ఏమిటో నిర్వచించుకోలేని అయోమయ స్థితిలో ఉండేవాడిని. నా ఆఫీసు గది, హెూటలు, సినిమాలు తప్ప అనుభవించదగినవి ఈ లోకంలో ఇంకా వున్నాయి అని నాకు తెలియడం పార్వతి ద్వారానే. ఆమె అందాన్ని దేనితో పోల్చినా అది ఆమెను కించపరచడమే అవుతుంది. బాహ్య సౌందర్యానికి రెట్టింపు అంతః సౌందర్యం వుందామెకు.

ఎన్నో యుగాల నా తపస్సుకు మెచ్చి ఓ దేవత ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకోమంటే, ఏం అడగాలో, అసలు అడగాలో లేదో తెలీని సందిగ్ధంలో నేనుంటే ఆమె దయతలచి నాతో జీవితాన్ని పంచుకోవడానికి అంగీకరించి నా ఇంటికి వచ్చినట్లైంది పార్వతి రాక.

మేము అనుభవించింది ఆనందం కాదు, మేమున్నది ఇహలోకం కాదు. ఆమె సాంగత్యంలో సుఖం కాదు. అమరత్వం ఉంది. మా అనుభవాలు అనితర సాధ్యాలు, అనిర్వచనీయాలు, మేము గడిపినవి రోజులుకావు, క్షణాలు అది జీవితం కాదు. ప్రణయ సామ్రాజ్యపు గట్టుతెంచుకుని ప్రవహించే ప్రేమ. మమతల ఝరీ ప్రవాహం, రెండు సంవత్సరాలపాటు నా బ్రతుకులో మాధుర్యాన్ని తప్ప మరో రుచెరగను నేను.

నాకు తల్లీ, చెల్లీ, పెళ్ళాం అన్నీ ఆ ఒక్క మూర్తే. అభిమానాలకు అనురాగాలకు భాష్యం చెప్పిన ఒకే ఒక్క దేవత.

ఆరోజు వుదయం నా ప్రమోషన్ వార్త చెవిన వేశాడు, మేనేజర్, మధ్యాహ్నం యింటికొచ్చేప్పటికి అంతకన్నా శుభవార్త చెప్పింది పార్వతి. పొంగిపోయాను. మా బ్రతుకులో మేమనుభవించిన తియ్యదనం యింక కొన్నాళ్ళలో మా కళ్ళముందు చిందులు వెయ్యబోయే చిన్నారి సజీవ సంకేతం అవుతుందని మురిసిపోయాను. అంత ఆనందాన్ని తట్టుకోలేనేమోననిపించింది.

పార్వతి ఎప్పటి నుంచో అరకు వేలీ చూడాలంటోంది. మర్నాడు ఆదివారం వెంటనే బయల్దేరితే మర్నాడు సాయంత్రం తిరిగి రావచ్చు అనుకున్నాను. నా ప్రపోజల్ విని పార్వతి ఎగిరి గంతేసి నన్ను కావిలించుకొని మొహమంతా ముద్దులతో ముంచెత్తి....

కావలసిన సరంజామాతో బయలుదేరాం మా కంపెనీ జీపులో కాశీపట్నం దగ్గర్నుంచీ మొదలు ప్రకృతి రమణీయత. అరకు వేలీ కాదు సౌందర్యపు వడి. సృష్టికొలతల్లో కాలాన్ని విస్మరించి స్థలంలో బ్రతికాం.

"మీరు చూశారా? ప్రవహిస్తూ, పరిణామంలో చల్లారుతూ పడ్డ భూమి ముడతలు సౌందర్యపు అంచులై నిలిచిన మైదానం అరకులోయ, పుడమి కప్పుకున్న పచ్చటి శాలువాపై మరకల్లా అక్కడక్కడా మానవ సంస్కృతీ చిహ్నాలు, లోయల్లో దిగటానికి వచ్చి వెనకాడి కొండలు వుచ్చుకు వేళ్ళాడి తొంగిచూసే మేఘాలు, సృష్టిలో నిబిడమైన హార్మోనీ నిశ్శబ్ద సంగీతమై ఏవో దార్శనిక లోకాలకి దారిచూసే దృశ్యాలు.

ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించాలంటే ఏకాంతంలోనూ, ఇంటిమేట్ అయిన వ్యక్తులతోనే సాధ్యం. ఆఫీసు పటాలంతో అంతకు ముందోసారి నేను చూసిన అరకువేలీ ఉత్తమెరక పల్లాల సముదాయం. పార్వతీతో కాదు.

మా కళ్ళముందు పచ్చగా పరచుకున్న అరకులోయ దూరం అయినకొద్దీ నీలమైనింగిలో కలిసిపోయింది. ఆ క్షణాల్లో ప్రకృతికీ, స్త్రీ సామ్యం తెలిసి నేను అరకు వేలీని పార్వతీతోనూ, పార్వతిని అరకువేలీతోనూ పోల్చుకున్నాను. ఇద్దరం కలిసి నడిచాము. పరుగెత్తాము, ప్రతిబింబాల్లా కొండచరియల్లో అక్కడక్కడా పరుచుకున్న బబ్బుల నీడలు. వాటిని కప్పుకున్నాము. మేమలా తిరుగుతుండగానే కొండల వెనక్కి సూర్యుడు దిగి ఆ లోయపై మెల్లిగా చీకటి ముసుగు జారింది. అప్పటి వరకూ ప్రస్ఫుటమైన రూపురేఖలు అస్పష్టమవుతూ రంగులు కలిసిపోవటం, ఎత్తుపల్లాలేకమవటం చూశాం. నక్షత్రాలు చూడటానికి వచ్చాయి. అంతకు ముందే ఉదయించే పూర్ణప్రకాశం సంతరించుకోకుండా అరకువేలీలోకి తొంగిచూడ్డానికి సిగ్గుపడ్డ చంద్రుడు మెల్లిగా కొండల వెనక నుంచి లేచి, అంతమంది తారలు తన చుట్టూ గుమికూడినా చాలనట్టు నా భుజం

మీద తలవాల్చి సోగకళ్ళను అరమూసి నేను చెప్పేది వింటున్న నా ప్రణయ సామ్రాజ్ఞిని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూశాడు సిగ్గులేకుండా. అనుభవాలను సార్థకత చిరస్మరణీయత రావాలంటే అలాంటి భూతలస్వర్గంలోనే.

తిరిగి తిరిగి తొమ్మిదిన్నరకు గెస్ట్‌హౌస్‌కి వెడుతుండగా జీప్ జర్కులిచ్చి ఆగిపోయింది. కార్బొరేటర్లో నలకలు అడ్డంపడి అలా అప్పుడప్పుడు ఆగిపోవడం దానికలవాటే. దాన్ని మార్చమని చెప్పాను డ్రైవర్‌తో అదివరకే. తిట్టుకుంటూ దిగాను.

"ఏమైంది డార్లింగ్" అంది తనూ నా పక్కనే నిలబడి.

"ఏంలేదు, నడిచెళ్ళిపోదాము, ఆ కనబడేదే గెస్టహౌస్. రేపు వచ్చి దీన్ని బాగుచేసుకుని తీసుకెళ్దాం" అన్నాను.

"ఓకే" అంది తను ఉత్సాహంగా.

ఆమె నడుంచుట్టూ చెయ్యివేసి ఆమెకి నా కోటు కప్పి ఆమెను నేను నడిపించిన ఆ అరమైలూ స్వర్గలోకానికి రహదారి అవుతుందనుకున్నాను.

గెస్ట్‌హౌస్ చేరుకుని గురకలు పెడుతున్న వాచ్‌మెన్‌ను లేపాను. విసుక్కుంటూ లేచాడు.

"రూం ఏదైనా ఖాళీ ఉందా?" అడిగాను.

"లేవు సార్! ఉన్న రెండు రూములూ ఎవరో పోలీసాఫీర్లు బుక్ చేసుకున్నారు. ఇప్పుడో, కాస్సేపట్లోనో రావచ్చు" అన్నాడు అతడు ఆవులిస్తూ.

ఇంతలో ఎదురుగా ఉన్న సూట్ తలుపు తెరుచుకుంది. ఓ నలభై ఏళ్ళ బట్టతలాయన బయటికి వచ్చాడు. చేతిలో గ్లాసులో సగం వరకూ ఉన్న విస్కీ, ఆ కళ్ళలోని తీక్షణత, అతని అధికారాన్నీ, హోదానీ తెలియజేస్తోంది మనిషి కొంచెం తూలుతున్నాడు.

"ఎవర్రా" మాటలు జారిపోతున్నాయి.

"విశాఖపట్నం నుంచి వచ్చారట సాబ్" హిందీలో జవాబిచ్చారు వాచ్‌మన్.

నన్ను నేను పరిచయం చేసుకుంటూ కరచాలనం కోసం చెయ్యి చాచాను. అతను దాన్ని అందుకోలేదు. పార్వతివైపు చూస్తున్నాడు.

"పక్కగది తాళాలు తియ్యరా, పాపం, అర్థరాత్రి యెక్కడికి వెళ్తారు" అన్నారాయన.

"సర్కిల్ దొరగారు వస్తానన్నారు బాబూ."

"వస్తే నా గదిలో పడుకుంటాడులే, లేకపోతే డాక్టర్ గారింటికి పంపిస్తాను. వెళ్ళండి" అన్నాడాయన మా వైపు తిరిగి అదే తీక్షణతతో.

థాంక్స్ చెప్పి ఆ గదిలోకి ప్రవేశించాం. చలివేస్తోంది. ఫైర్‌ప్లేస్‌లో కట్టెలున్నాయి. జేబులోనుంచి అగ్గిపెట్టె తీసి అక్కడ పక్కనేవున్న కిరోసిన్ కొంచెం కట్టెలమీద వేసి

అంటించాను. పక్క రూంలో నుండి మాటలు వినవస్తున్నాయి.

"ఎవరో కొట్టుకొచ్చిన సరుకే సార్, లేకపోతే ఇంత రాత్రి..."

"మీరు ఊ అనండి, లాక్కొచ్చేస్తాం" ఇంకో గొంతు

"ఆదివారాలు ఇక్కడికొచ్చేవాళ్ళు ఇంటి ఆడోళ్ళతో ఎవరూ రారు సార్."

ఆ మాటలు మమ్మల్ని ఉద్దేశించినవేనని అర్థమౌతూనే వుంది. పార్వతి వైపు చూశాను. ఆమె కళ్ళలో చెప్పలేనంత బెదురు. ఆమె భుజం తట్టి ఫర్వాలేదు కంగారుపడవద్దని చెప్పి తలుపు గడియ వేద్దామని గుమ్మం దగ్గరకు వచ్చాను. ఫెడీమని తన్నిన చప్పుడు. మరుక్షణంలో తలుపు నా మొహాన్ని బలంగా తాకింది. మరునిముషంలో నా ఉనికి ఆవిరైపోయింది.

మళ్ళీ నేను కళ్ళు తెరిచేసరికి నా మెదడులో ప్రచండ ఘోషలు, గుండెల్లో సమ్మెట పోట్లు, వాచీ చూసుకున్నాను. అద్దం పగిలిపోయి పదింటి దగ్గర ఆగిపోయిందది. కుడి పక్క కణత దగ్గర, ముక్కులోంచీ రక్తం కారి గడ్డకట్టుకుపోయింది మొహం మీద. గదిలో పార్వతి లేదు. వుంటుందని నేనూ అనుకోలేదు.

ఏ నిముషంలోనైనా ఆగిపోవచ్చుననిపించే గుండెను అరిచేతిలో పెట్టుకుని పక్కగది తలుపు తోశాను. కానీ నాది ఇనుపగుండె, రాతి గుండైతే కనీసం కరగనైనా కరిగేది. మనిషినైతే నేను చూసిన దృశ్యానికి నాకు ఆకస్మిక మరణం సంభవించాలి.

ఆమె పార్వతి కాదు. రాబంధులు పీక్కుతిన్న శవం.

విరిగిన గాజులు....తన పుట్టినరోజని నాలుగు రోజులనాడు నా చేత స్వయంగా తొడిగించుకున్న గాజులు...నలిగి, వాడిపోయి గదంతా చిందర వందరగా వెదజల్లబడిన మల్లెపూలు.....తనకెంతో ఇష్టమని వచ్చేప్పుడు నేను దారిలో పెద్ద చెండుకొని జడలో తురిమిన మల్లెపూలు....చెరిగి పోయిన బొట్టు....బయల్దేరేముందు సరిగ్గా వచ్చిందో లేదో చూడమని నా దగ్గరకు వస్తే "అద్దంలో చూసుకోలేదా" అని చిరుకోపం నటిస్తూ నేను దిద్దిన బొట్టు. చీలికలైపోయి, చిరిగిపోయిన చీర.....ఏ చీర కట్టుకోను అని నన్నడిగితే శోభనం నాడూ, పెళ్ళిరోజూ తప్ప కట్టుకోని పాలమీగడలాంటి తెల్లని పట్టుచీర తీసి, తను కట్టుకుంటే నేను కుచ్చెళ్ళు సరిచేసి....

ఈ దేవతని రాక్షసుల చేతికి అప్పగించడానికి ఎన్ని అలంకరణలను చేశాను. ఎంత ఆర్భాటం చేశాను, ఎన్ని మైళ్ళు తీసుకొచ్చాను....భగవాన్....

అనుభవాలను హద్దులుండవని భ్రమపడి, కన్న బంగారు కలలన్నిటికీ శాశ్వతత్వం, ఆపాదించుకుందామని ఆశపడి నా భాగస్వామినితో నేను చేసిన ఈ యాత్ర నా జీవితానికి అంతిమయాత్ర అవుతుందనుకోలేదు. నా కోరికలకు చరమగీతం

ఆలపిస్తుందనుకోలేదు.

పిడికెడు గుండెలో అనంతమైన ఆశల్ని నింపుకుని బయల్దేరితే చివరికి ఏమైంది? పిడికెడు బూడిద మిగిలింది దేవతలు పిశాచాల మధ్య ఉండటానికి భయపడరు. కానీ మనుషుల మధ్య ఉండడానికి భయపడతారు. అందుకే వెళ్ళిపోతున్నాను. ఆమె చితిమంటల్లోంచి శూన్యంలోనికి లీనమైపోతూ అందించిన అంతిమ సందేశాన్ని అందుకుని తిరిగి వచ్చేశాను.

ఆపి ఊపిరి తీసుకున్నాడతను కాసేపు.

"ఏం చెయ్యాలి నేనిప్పుడు, పగ తీర్చుకోనా? సంభవించే విషయమేనా? నా పార్వతి తిరిగి వస్తుందా? సాధ్యా సాధ్యాలను పక్కకు పెట్టినా, ద్వేషించడం నేర్పలేదు నాకా ప్రేమమయి, అసలు ద్వేషించడానికీ, ప్రేమించడానికీ నేను మిగల్లేదు. ఆమెతో పాటే ఆ క్షణంలోనే అనంతంలో లీనమైపోయాను. ఇప్పుడున్నది కేవలం నా జీవచ్ఛవం.

అమృతానికి అలవాటుపడిన వ్యక్తి మంచి నీళ్ళతో తృప్తిపడలేడు. అంత ఆనందం, అన్ని అనుభవాలు చవిచూసిన తర్వాత, అవన్నీ తనకు పంచియిచ్చిన వ్యక్తి దూరమైతే భరించి బ్రతకలేడు. ఆత్మహత్య చేసుకోవాలంటే మనిషి అత్యంత సాహసి అయినా కావాలి లేదా యెంతో పిరికివాడైనా అయివుండాలి. పూర్తిగా అపరిచితమైన అసలు వుందో లేదో తెలియని మరో లోకంలోకి అడుగుపెట్టడానికి అతనికి యెంతో ధైర్యం కావాలి. సాటి మనుషుల్ని చూస్తేనే గజగజ వణికిపోయే పిరికితనమైనా వుండాలి.

"మీకు ధైర్యం వుంది, నేను చాలా పిరికివాణ్ణి. అందుకే ఇద్దరం ఆత్మహత్యకు తలపడ్డాం. ఇద్దరం ఒకేసారి అందుకు ప్రయత్నించడం విచిత్రం, మన ఈ పరిచయంలాగే."

"అయితే మీరు మరోసారి ఆలోచించండి. స్తబ్ధతలో నుంచి చైతన్యం పుడుతుంది. మీ జీవితం మీ చేతుల్లోనే వుంది. తప్పును ఎదుటివారి మీద రుద్దకుండా నిష్పాక్షికంగా ఆలోచించండి. బ్రతుకును దిద్దుకోవడానికి మీరేం చేశారు? చీకటిని చీకటని ఒప్పుకుని చిరుదీపం వెలిగించుకోవడానిక్కూడా మీరు ప్రయత్నించలేదు."

"నా సంగతి వేరు, ధారావాహికంగా ప్రవహించిన నా జీవన స్రవంతి హఠాత్తుగా ఆకాశంలోకి ఎగిరిపోయింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా మళ్ళీ నేను పూర్వపు చైతన్యాన్ని తెచ్చుకోలేను. కళ్ళు మిరమిట్లు గొలిపేంత వెలుగులోనుంచి నేనొక్కసారిగా నిబిడాంధకారంలోకి విసిరేయబడ్డాను. ఎన్ని దీపాలు వెలిగించుకున్నా అవి నా జీవితంలో చీకటిని పారద్రోలలేవు. నా నిర్ణయానికి అర్థం వుంది. మీది కేవలం ఆవేశంలో తీసుకున్న నిర్ణయం."

"వెళ్ళండి చావుకూ బ్రతుక్కూ మధ్య ఉన్న సరళరేఖను దాటడానికి మీకున్న చిన్న సమస్యలు పనికిరావు. వెళ్ళి మీ బ్రతుకును సరిదిద్దుకోండి. ఎంతో భవిష్యత్తు మిమ్మల్ని ఆహ్వానిస్తోంది. నా గతం వర్తమానాన్ని, భవిష్యత్తునీ కూడా మింగేసింది" లేచాడతను.

ఆమె కూడా లేచి నిలబడింది.

ఒకరి కభిముఖంగా ఒకరు లోకం అంచున నిలబడ్డారు కాసేపు. అనూహ్యమైన నూతన సందేశాన్నందుకుని, రేపు మీద ఆశ నిలుపుకొని ప్రపంచంవైపు కామె అడుగువేసి కనుమరుగయ్యాక అనుభవించిన గత స్మృతుల బంగారుఛాయల్ని మర్చిపోలేక, వర్తమానంతో రాజీపడలేక, భవిష్యత్తును తల్చుకోలేక సముద్రంకేసి అతను.

*　　*　　*

చీకటి కాటుతిన్న సముద్రపు అంచులు తెల్లగా నురుగు కక్కుతున్నాయి అతని కాళ్ళముందు. పిరికితనము ధైర్యమై అతన్ని మృత్యువుకేసి నడిపిస్తే అడుగులు ముందుకు పడుతున్నాయి స్థిరంగా.

హఠాత్తుగా అతని భుజాలమీద ఏదో అనినట్లయింది. తల వెనక్కి తిప్పి చూశాడు. భుజంపై బరువు భారమై బలంగా తిప్పుకుంటే తనూ వెనుతిరిగాడు.

"ఆగండి" అంటూ యెవరో అగంతకుడు అతని చెయ్యి పట్టుకొని వడ్డుకేసి నడిపిస్తూ అన్నాడు "మీరు మాట్లాడుకున్న దంతా విన్నాను. ఆ రాయికి అటువైపు కూర్చున్న నన్ను మీరు గమనించలేదు. ఆమెను ఆత్మహత్యనుంచి విరమింపజేసినందుకు మిమ్మల్ని కంగ్రాచ్యులేట్ చేస్తున్నాను."

కాస్త దూరం నడిచారు

"కూర్చోండి"

ఆగంతకుడితో పాటు అతనూ కూర్చున్నాడు.

"ఆలోచించండి, మీ పార్వతి, మీయీ జీవితాన్ని యిలా అంతం చేసుకోవటాన్ని హర్షిస్తుందా? ఒకవేళ మీరే యేదైనా అన్యాయానికి బలైతే పార్వతి యెలా వుండాలని కోరుకుంటారు? చచ్చిపోవాలనుకుంటారా?"

అతనేమీ మాట్లాడలేదు.

"ఆ అమ్మాయి ఆత్మహత్యకే ఎందుకు తలపడింది? వివాహ బంధాన్నుంచి బయటపడవచ్చుగదా! అలాంటి ప్రయత్నం ఎందుకు చేయలేకపోయింది? ఏమేమి అడ్డుపడ్డాయి?"

అతను మౌనాన్ని వీడలేదు.

ప్రేమ, లైంగిక తృప్తి జీవితాల్లో చాలా అవసరం. అయితే జీవన పరిధి చాలా విస్తృతమైనదన్న విషయాన్ని విస్మరించి మీరిద్దరూ జీవితాన్ని స్త్రీ పురుష సంబంధాలకే పరిమితం చేసుకున్నారు. ఆమె సమస్యకన్నా మీ సమస్య జటిలమైనది, నిజమే. ప్రయత్నించి జీవితాన్ని బాగుచేసుకోమని ఆమె మార్గాన్ని మరల్చి మీరు చేస్తున్నదేమిటి?

ప్రభుత్వోద్యోగుల్లా, పెద్ద మనుషుల్లా మీకు అరకులో తటస్థపడ్డ ఆ వ్యక్తుల విలువలేమిటి? అలాంటివారు దొరలుగా చలామణి కాగలుగుతున్న సమాజపు విలువలేమిటి? మీరు చట్టబద్ధంగా వాళ్ళమీద ఏదైనా చర్య తీసుకోవడానికి ఎందుకు వెనుకాడారు? వీటన్నిటికీ మీరు సమాధానం అన్వేషించండి, జీవితాల్ని పరిశీలిచండి. భార్యని చంపే భర్తలు, భర్తల్ని చంపే భార్యలు, పిల్లలకి విషంపెట్టే తల్లులు పూట తిండి కోసం, పావలా కోసం హత్యలు....పోలీసు స్టేషన్లలో, క్లాసురూముల్లో మానభంగాలు....ఎన్ని? ఎన్నని? వీటన్నిటినీ తరచండి.

మీరు బాగా చదువుకున్నవారనుకుంటాను. మీ ఆర్థికస్థితి కూడా హీనమేమీ కాదు. మీకు జరిగిన అన్యాయానికి ఆత్మహత్యకు తలపడితే, అజ్ఞానం, అమాయకత్వం, లేమితో కలిసివుండే నిస్సహాయత, ఇవన్నీ మూర్తీభవించిన వ్యక్తులకి జరుగుతూన్న అన్యాయాలకు వారేం చేయాలి. మూకుమ్మడిగా ఆత్మహత్యలు చేసుకోవాలంటారా? మీరు వెనక్కి తిరగండి, జీవితాన్ని పరిశీలించండి, పరిష్కారాలు అన్వేషించండి, చావే పరిష్కారమైతే చావండి."

ఆగంతకుడు సిగరెట్ ఆర్పి లేచాడు.

తన మాటల్ని అతనెలా తీసుకున్నదీ తెలుసుకోవాలనుకుంటున్నట్టు వంగి చూస్తూ కరచాలనం కోసం చేయిచాపాడు. అతను లేచి చెయ్యి ఇస్తూ ఏదో గొణిగాడు.

చేతులు కలిపిన అతనిలో ఏదో సంచలనం, ఆగంతకుడు వెళ్ళిన కాసేపటికి అతను తిరుగుముఖం పట్టాడు.

తననుంచి వద్దు చేరిన ప్రాణులు మానవులై, తామే నిర్మించుకున్న సమాజంలో పడ్డునపడ్డ చేపల్లా కొట్టుకోవడాన్ని నిరశిస్తున్నట్లుగా సముద్రం ఘోషిస్తూనే వుంది.

*   *   *



నిర్ణీత గమ్యాలు

వేములపల్లి మోహనరావు – పి.వి. కృష్ణారావు

"ఉషారాణీస్ డెస్క్'

గొంతుకూడా ఆమెలాగే విలక్షణంగా ఉంది అనుకున్నాడు నారాయణ.

'హలో....'

'నమస్తే మేడమ్. నేనూ...నారాయణను మాట్లాడుతున్నాను' కొద్దిగా తడబడ్డాడు. ఓ క్షణం సేపు గుర్తు చేసుకోవాలనే ప్రయత్నంలో మునిగిన మౌనం ఆవతలివైపు నుండి.

'నేనండీ...లక్ష్మినారాయణ. సెక్రటేరియట్ నుండి మాట్లాడుతున్నాను. అదే...మొన్న మా నాన్నగారు వాళ్ళూ మీ ఇంటికొచ్చారు చూడండి...'

'ఓ... ఎస్... ఎస్... సారీ... ముందుగా మిమ్మల్ని ప్లేస్ చెయ్యలేకపోయినందుకు, మోస్ట్ అనెక్స్‌పెక్టెడ్ కాల్ కదా! అందుకని!'

'ఇట్సాల్ రైట్... ఫర్వాలేదు... నో ప్రాబ్లం...' అంతే...తర్వాత మళ్ళీ మాటలు రావడం లేదు.

'మొన్న మీరు రాలేదని మా ఫాదర్ వాళ్ళు డిజప్పాయింటయ్యారు. మీరేదో క్యాంప్‌లో ఉన్నారనీ, తర్వాత మళ్ళీ మంచిరోజు కుదరదనీ హడావిడిగా ఏర్పాటు చేసేశారనుకుంటాను...'

'అవునండీ...'మళ్ళీ మాటల కోసం వెతుకులాట. రోజూ ఎదురయ్యే అనుభవం

కాకపోయినా, ఫియాన్సీతో మాట్లాట్టం ఇంత కష్టమని అనుకోలేదతను.

'చెప్పండి.....ఏమిటి ఫోన్ చేశారు....నాతో ఏదైనా పనుందా? అడిగిందామె.

ధైర్యం కూడదీసుకున్నాడు నారాయణ.

'సాయంత్రం రవీంద్రభారతికి రాగలరా....ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏదో జరుగుతోందక్కడ.....ఆఫ్‌కోర్స్ మీకు వీలైతేనే.'

'లెట్ మీ చెక్.....' డైరీ తిరగేస్తున్న చప్పుడు. 'సాయంత్రం ఆరున్నరకు వస్తాను, ఫర్వాలేదా!'

'ఇట్ సూట్స్ మీ ఫైన్, సరిగ్గా ఆరున్నరకు మీకోసం వెయిట్ చేస్తుంటాను.'

'అబ్బే, అదేంలేదండీ, ఇలాంటి ప్రదర్శనలకు ఎవరూ రారు కాబట్టి మనం మాట్లాడుకోవడానికి కావలసినంత ప్రైవసీ ఉంటుందని.'

'మెత్తగా నవ్విందామె.

'అలాగే.....యాజ్ యూ విష్.'

'థాంక్స్ మిస్ రాణీ.'

'మోస్ట్ వెల్‌కం అండ్ ఇట్స్ మై ప్లెజర్, కానీ తొందర్లోనే ఆ పిలుపుకు దూరం అవుతున్నందుకు కొంచెం విచారంగా ఉంది.'

అతని ఎడంకన్ను, రిసీవర్ పట్టుకున్న ఎడం చెయ్యి కొద్దిగా వణికాయి.

'నాకర్థం కాలేదు.'

'పెళ్ళయ్యాక నన్ను మిస్ రాణీ అని పిలిచేవారింకెవరుంటారు మహానుభావా! మిస్ మిస్సయ్యి మిస్సెసవుతుంది గదా!'

'ఓ...అదా...' అంటూ నవ్వాడతను రిలీఫ్‌గా.

'ఉండనా మరి...సాయంత్రంలోపు చాలా వర్కు పూర్తిచెయ్యాలి.' అందామె అభ్యర్థిస్తున్నట్లు.

'ఓకే, కారీఆన్...'

'నొ...నొ...అలాంటి పదాలు పెళ్ళయిన ఆడవాళ్ళను విష్ చెయ్యడానికే గానీ నాలాంటివాళ్ళకోసం కాదు.'

ఓ నిముషం తర్వాత అతనకి అర్థమై కొంచెం గట్టిగా నవ్వాడు 'యూ నాటీ!' అంటూ.

ఫోన్ పెట్టేసిన తర్వాత చాలా సేపటి వరకూ అతనికి ఆ సంభాషణే గుర్తుకు రాసాగింది. ఫోన్ చెయ్యడానికి ముందున్న టెన్షన్, బిడియం తర్వాత తేలిగ్గా

మాయమయిపోయాయి. అసలు డయల్ చేసేముందే జేబురుమాలుతో ఎన్నిసార్లు మొహం తుడుచుకున్నాడో! లైను కలిసేలోపు చమటతో తడిసి రిసీవర్ ఎన్నిసార్లు కిందకు జారిపోబోయిందో!

ఫన్నీ! వెరీ ఫన్నీ.....తనింత నెర్వస్‌గా ఫీలవుతుంటే ఆ అమ్మాయి మంచి నీళ్ళు తాగినంత తేలిగ్గా తీసుకుంది. ఎంత ఈజీ గోయింగ్, నిజంగా భర్త చికాకులన్నీ ఇలా క్షణాలమీద మరిపించే లైఫ్ పార్టనర్ దొరకడం ఎంత అదృష్టం. కాబోయే మొగుణ్ణి అప్పుడే మొదటి పరిచయంలోనే 'మహానుభావా' అని పిలుస్తోందంటే ఈ అమ్మాయి చాలా యాక్టివ్ అన్నమాట. మేడ్ ఫర్ ఈచ్ అదర్ అంటే ఇదేనేమో. తను చాలా సాఫ్ట్ మరి.

సాయంత్రం ఆరింటి వరకూ అతని పెదవుల మీద కనీకనిపించని చిరునవ్వు అలాగే చెదరకుండా ఉంది. అసలు ముందు ఆ అమ్మాయి ఫొటోని చూసినప్పుడే అనుకున్నాడతను, ఆ అమ్మాయిలో ఏదో ప్రత్యేకత ఉందని! ఆ కళ్ళు ముఖ్యంగా హిప్నాటిస్టులకుండవలసినవి. ఎంత వద్దనుకున్నా తనవైపే చూపుల్ని తిప్పుకునేంత ఆకర్షణీయమైన ఆ మొహంలో కొట్టవచ్చినట్లు కన్పించే ఓ లక్షణం ఉంది. చాలాసేపు చూసిన తర్వాత గానీ నారాయణ అదేమిటో అర్థం కాలేదు. నిర్లక్ష్యం... ఎస్... అదే... ఎవరు ఎన్ని పేర్లుతో పిల్చినా ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం అని దానికి మెరుగులు దిద్దినా, ప్రతి మనిషిలోనూ అంతర్లీనమై ఉండే నిర్లక్ష్యభావం, లోకానికి ఎదురీదే స్వభావం.

ఏమైనా, రూపాన్ని చూసి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం నారాయణ పద్ధతి కాదు. పెళ్ళిచూపులనే అరగంట తాత్కాలిక తతంగంలో ఎవరైనా సాధించగలిగేదేమిటో అతనికి అర్థం కాదు. అందుకే అతను క్యాంప్ వంకతో వెళ్ళడం మానేశాడు.

లేడిపిల్లలాంటి ఆడపిల్ల నర్థం చేసుకోవడం కేవలం ఈ మహాజనారణ్యంలో తను తిరుగుతున్నప్పుడే సాధ్యం, బోనుల్లాంటి నాలుగ్గోడల ఇనప్పెట్టెల్లో చాపల మీద తలదించుకుని కూర్చున్నప్పుడు కాదు.

టైమవుతుండటంతో ఫైల్స్ క్యాబినెట్‌లో సర్దేసి తాళాలు వేసి లేచాడతను. స్కూటర్ తాళాలు తీసుకుని బయటికి నడుస్తుండగా అటెండర్ ఎదురుయ్యాడు.

'సార్, మిమ్మల్ని మినిస్టర్‌గారు పిలుస్తున్నారు.'

'ఓహ్... నాట్ నౌ... నాట్ నౌ.' బాధగా మూలిగిందతని మనసు. కాళ్ళు మాత్రం తప్పనిసరిగా ఛాంబర్‌వైపు దారితీశాయి.

* * *

'నారాయణా... వాట్‌హాపెండ్... ఈరోజు చురుగ్గా లేవే... ఒంట్లో బావుండలేదా!'

ఎనిమిదిన్నరకొచ్చింది మంత్రిగారికి ఆ అనుమానం.

చూస్తున్న ఫైల్స్‌లో నుండి తల పైకెత్తి నీరసంగా నవ్వాడు. 'అదేం లేదు సార్.'

'సారీ టూ బాదర్ యూ......కానీ ఈ రిపోర్టు రేపు పదింటికల్లా సీఎమ్‌గారి టేబుల్ మీద ఉండాలి. లేకపోతే....ఎందుకులే....కానీ తొందరగా.'

కాబోయే భార్యతో మొదటి డేట్ అంత దారుణంగా చిత్రవధ చేయబడటం నుండీ అంత త్వరగా తేరుకోలేకపోయాడు నారాయణ. ఆ మర్నాడూ తర్వాత, రెండు మూడు సార్లు ఫోన్ చేశాడు జరిగింది చెప్పి క్షమాపణ అడుగుదామని, కానీ ఉష దొరకలేదు, కనీసం ఆమె వచ్చింతర్వాత మెసేజ్ చూసుకుని ఫోన్ చేస్తుందని తన ఫోన్ నెంబర్ ఇచ్చాడు. కానీ మళ్ళా ఆమె ఫోన్ కూడా చేయలేదు.

*   *   *

వారం తర్వాత వాళ్ళ నాన్నగారు అడిగారు నారాయణను.

'ఏమంటావ్ రా మరి! వాళ్ళేమో అవతల తొందరపడుతున్నారు. నువ్వేమో ఎటూ తేల్చవ్.....ఏమిటసలు సంగతి.'

'అబ్బే......ఏంలేదండీ....ఈ వైజాగ్ ట్రిప్పు పూర్తికాగానే ఓసారి ఆ అమ్మాయితో మాట్లాడి...'

'ఎప్పుడు నీ ప్రయాణం?'

'శనివారం రాత్రి గోదావరికి వెళ్దామనుకుంటున్నాను.

'అదే ట్రైనులో ఆ అమ్మాయి కూడా వెళ్తోందనుకుంటాను. వైజాగ్‌లో వాళ్ళ స్నేహితురాలి పెళ్ళేదో ఉందట. మొన్న వాళ్ళ తమ్ముడు బజార్లో కనిపించినప్పుడు చెప్పాడు.'

ఓ క్షణం పాటు అతని గుండె లయ తప్పింది.

దాదాపు పన్నెండు గంటల సాహచర్యం, జీవితాంతం కలిసి తామిద్దరూ జరపబోయే ప్రయాణానికి ఈ ప్రయాణమే నాంది పలకడం నిజంగా శుభసూచకం.

*   *   *

ఆ రోజు ఆఫీసుకు వెళ్ళగానే తన టికెట్ కాన్సిల్ చేసి ఫస్ట్‌క్లాస్ బుక్ చేయించాడు.

ఎన్నో విషయాలు మాట్లాడుకోవాలి. ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవాలి. మొదటి రాత్రితో మొదలుపెట్టి పుట్టబోయే పిల్లల పెళ్ళిళ్ళ వరకూ ఎన్నో ప్లాన్ చేసుకోవాలి, సరిపోతాయా పన్నెండు గంటలు?!

ఆ రోజు రెండున్నరకు వాళ్ళ ఆఫీసులోనే దొరికింది ఉష. పలకరింపులూ సారీలూ అయ్యాక ప్రయాణం సంగతి చెప్పాడు నారాయణ.

'కానీ నేనా ట్రైన్‌లో రావడం లేదు. పెళ్ళికూతురుతోపాటు రేప్పొద్దున్నే కార్లో వెళ్తున్నాను.'

'మీ కోసం నేను టికెట్ కూడా బుక్ చేయించేశాను. మీరు రాలేకపోతే చాలా డిజప్పాయింట్ అవుతాను. ఆలోచించండి. అదీగాక మనం మాట్లాడుకోవలసినవెన్నో ఉన్నాయి....ప్లీజ్.'

ఓ క్షణం తటపటాయించి అంది ఉష. 'సాయంత్రం చెబుతాను మీకు ఏ సంగతీ, ఈలోపు మా ఫ్రెండ్‌తో కూడా ఓ మాట చెప్పి...

'ఎలా అయినా సరే మీరు నాతో రావాలి. ఇంతకన్నా ఎక్కువగా మిమ్మల్ని ఇబ్బందిపెట్టే అధికారం నాకు ప్రస్తుతానికి లేదనుకోండి. కానీ రేప్పొద్దునే ఒకవేళ అటువంటి సందర్భాలు వస్తే వాటిల్లో ఒకదాన్ని ఇప్పుడే మీకు త్యాగం చేసేస్తున్నాను.' కొద్దిగా నవ్వి అన్నాడు.

ఆవతలి వైపు నుండి రెస్పాన్స్ లేదు. తను చెప్పింది ఆమెకర్థంకాలేదా?

'ఓకే, సాయంత్రం ఫోన్ చేస్తాను, ఉంటాను', ఫోన్ పెట్టేసిందామె.

అతను నివ్వెరపోయాడు. అంత ఎబ్రప్ట్‌గా ఆమె సంభాషణను తుంచేస్తుందనుకోలేదు. ఎందుకింత కోల్డ్‌గా ఉంది తను? మొదటి మీటింగ్‌లో కలిగిన ఆశాభంగం నుంచీ ఆమె తేరుకోలేదా ఇంకా?

మొదటి సంభాషనకూ దీనికీ ఎంత తేడా!

ఆ సాయంత్రం ఆమె ఫోన్ చేసి తను అతనితోనే వస్తున్నాని చెప్పే వరకూ అతను అన్యమనస్కంగానే ఉన్నాడు. అప్పటినుండీ అతని హడావిడి ప్రారంభమైంది. మొట్టమొదటిసారి ఆమె ఎదురైనప్పుడు ఏమి చెయ్యాలి. మొదట ఏ టాపిక్ మొదలెట్టాలి, ఫామిలీ ప్లానింగ్ వరకూ ఆగాలా?

కావలసినంత ఏకాంతం కాబట్టి ఆమెను ఆనుకుని కూర్చోవచ్చా. ఏమైనా అనుకుంటుందేమో! ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటే బాగుంటుందా! బెజవాడ స్టేషన్ దాటిం తర్వాత తను నిద్రకు ఆగలేక పడుకుంటానంటుందేమో. అప్పుడు దొంగతనంగా ఓ ముద్దు పెట్టుకుంటే....ఛీ పాడు.....ఆ ఆలోచనకు అతనికే సిగ్గేసి మొహం కప్పుకుని వేళ్ళసందుల్లోంచి చూస్తే అతని మూకాభినయం చాలా కుతూహలంతో చూస్తోంది లేడీ టైపిస్టు.

మరు నిముషంలో స్వీట్ నథింగ్స్‌కు గుడ్‌బై చెప్పేసి ఈ లోకంలో పడ్డాడు.

*　　*　　*

ఆ రోజే తన పెళ్ళి అన్నంత కంగారూగా తిరిగేస్తున్నాడు నారాయణ

శనివారంనాడు. పెద్దవాళ్ళెవరైనా చూస్తే రెండుదిళ్ళెందుకురా అని అడుగుతారని ఎవరూ చూడకుండానే బెడ్డింగ్ సర్దేశాడు. మల్లెపూలు స్టేషన్‌కు వెళ్ళే దార్లో దొరుకుతాయో లేదో....ఆఫీసు నుంచి వచ్చేటప్పుడే పుల్లారెడ్డి స్వీట్స్ దగ్గర ఆగాలి, మధ్యాహ్నం పన్నెండింటికల్లా ఇంటికొచ్చెయ్యాలి.

ఆ రోజు పదకొండింటికి మంత్రిగారి పి.ఏ.వచ్చాడు నారాయణ దగ్గరకి. 'సాయంత్రం వైజాగ్ వెళ్తున్నావట గదా! ఎమ్ డీ గారికి ఓ ఫైలిస్తాను తీసుకెళ్ళి అందజెయ్యి.'

'అలాగే సార్' అన్నాడు నారాయణ.

'సాయంత్రం నువ్వు వెళ్ళేప్పటికి రెడీ చేసి పెడతాను, నా రూంకి వచ్చి కలెక్ట్ చేసుకెళ్ళు.'

'ఓకే సర్.'

*   *   *

స్టేషనుకు వెళ్ళేముందు ఆఫీసుకు వచ్చాడు నారాయణ, బయట ఆటోలో సామాను అలాగే ఉంచి.

పీఏ అతన్ని కూర్చోమని అటెండర్‌ని మంత్రిగారి ఛాంబర్‌లోకి పంపించాడు. రెండు నిముషాల్లో అతను తిరిగి వచ్చి 'మంత్రిగారింకా రాలేదు సార్' అన్నాడు.

'ఐదు నిమిషాలుండు, ఇప్పుడే వస్తానని వెళ్ళారాయన, వచ్చేస్తారు, రాగానే సంతకం పెట్టేస్తారు తీసుకెళ్దువుగాని.'

బయటకు వచ్చి కారిడార్‌లో నిలబడ్డాడు నారాయణ. ఐదు నిమిషాలు పదిహేను నిమిషాలయ్యాయి.అమాత్యవర్యుడి ఆచూకీ లేదు. ట్రైన్ టైం దగ్గరపడుతోంది. అతనిలో టెన్షన్ పెరిగిపోతోంది. ఇంకో అయిదు నిమిషాల తర్వాత అతను పియ్యే రూంలోకి వెళ్ళాడు. తర్వాత అయిదు నిమిషాలకోసారి నాలుగుసార్లు వెళ్ళిన తర్వాత పియ్యే చెప్పాడు. 'ఇప్పుడే ఫోన్‌చేశారు మినిస్టర్‌గారు, బయల్దేరి వచ్చేస్తున్నారు, వెళ్ళిపోదువుగాని.'

'నాకు అవతల ట్రైన్ మిస్సవుతుంది సర్...'

'అయితే అవనీవయ్యా, అదీగాకపోతే తర్వాత ట్రైన్‌కు వెళ్ళవచ్చు. అందులోనూ రేపు ఆదివారమే కదా... ఆన్‌డ్యూటీ వెళ్ళేప్పుడు సగం పని వదిలేసి వెళ్తావా ఏం?'

ఈ ప్రయాణం ప్రాముఖ్యం గురించి తను ఎవరికైనా చెప్పవలసి వచ్చినా ఆ వ్యక్తి ఖచ్చితంగా మంత్రిగారి పియ్యే మాత్రం కాదు.

*   *   *

మంత్రిగారు సంతకంపెట్టీ పెట్టకుండానే ఆయన చేతిలోనుంచి ఫైల్ లాక్కున్నంత పనిచేసి బయటికి పరుగెత్తాడు నారాయణ. ఆటోలో కూర్చుంటూనే డ్రైవర్

చేతిలో వంద రూపాయల నోటు పెట్టి 'నీ ఇష్టం వచ్చినంత స్పీడ్ పోనీ' అన్నాడు.

పెళ్ళి సంగతి ఎలా ఉన్నా చావు మాత్రం అతనికి రెండుసార్లు చాలా దగ్గరగా వచ్చి కొద్దిలో తప్పుకుంది.

అతను లగేజ్ తీసుకుని ఫ్లాట్‌ఫాం మీదకు చేరుకునేప్పటికి గోదావరీ ఎక్స్‌ప్రెస్ ఆఖరి కంపార్ట్‌మెంట్ అప్పుడే దాటి వెళ్ళిపోతోంది. ఒక్కసారిగా అతన్ని చెప్పలేనంత నిస్సత్తువ ఆవరించింది. బెడ్డింగ్ కింద పడేసి దాని మీద చాలా సేపు కూర్చుండిపోయాడు. ఉష తప్పకుండా వెళ్ళిపోయి ఉంటుంది. ఈ ట్రైన్‌లో వెళ్ళలేకపోతే పెళ్ళి కూతురుతోనే వెళ్ళిఉండేది కాదూ!

నీరసంగా తిరుగుముఖం పట్టాడతను.

*   *   *

సరిగ్గా పదిరోజుల తర్వాత అతనికి ఆఫీసుకో రిజిష్టర్డ్ లెటర్ వచ్చింది, ఓ ఉత్తరం, ఫోటో ఉన్నాయి అందులో. ఫోటోలో ఉష పక్కన ఓ స్ఫురద్రూపి ఉన్నాడు. ఏ కోణంలో చూసినా రాజసం ఉట్టిపడుతోందతనిలో. దాన్ని పక్కన పెట్టి ఉత్తరం విప్పాడు.

'డియర్ మిస్టర్ నారాయణా.....అతి చిన్న సంఘటనలు మనిషి జీవిత గమనాన్ని అనూహ్యమైన మలుపుల్ని తిప్పుతాయంటే ఇంతవరకూ నమ్మలేదు. కానీ నా జీవితంలోనే అలాంటిది జరిగినప్పుడు నమ్మకుండా ఎలా ఉండగలను!

ఈ ఫోటోలో వ్యక్తి నిన్నటినుండీ మాశ్రీవారు. రిజిస్ట్రార్ ఆఫీస్‌లో హడావిడిగా కార్యక్రమం ముగించడంతో ఎవర్నీ పిలవడం కుదరలేదు.

ఈ ఉత్తరం మీకు వ్రాయడానికి ఓ ప్రత్యేకమైన కారణం ఉంది. అదేమిటంటే మా పెళ్ళికి ముఖ్యకారకులు మీరు, మీకు ఆశ్చర్యంగా ఉండవచ్చు. కానీ ఇది నిజం.

ఆరోజు మీరు నన్ను రవీంద్రభారతికి రమ్మన్నారు, ఒంటరిగా నిలబడిన నేను మీకోసం ఎంతో సేపు వెయిట్ చేశాను. అక్కడే అప్పుడు ఆయన కలిశారు. మాటలు పరిచయాలకు దారితీశాయి. ఆరోజు, ఆలోచిస్తూంటే అనిపిస్తోంది, ఆరోజే మా గమ్యాలు నిర్ణయింపబడిపోయి ఉంటాయని.

గోదావరీ ఎక్స్‌ప్రెస్ దగ్గర మీ కోసం ఎదురుచూస్తున్న నన్ను ఆయన పలకరించారు. ఆయన కూడా వైజాగ్ వస్తున్నారట. రిజర్వేషన్ లేదాయనకు. ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ మీద కూపే మనిద్దరి పేరుమీద రిజర్వు చేయబడి వుంది.బండి కదిలే వరకూ మీ కోసం చూసి చూసి మేమిద్దరం ఏక్కేశాం. టీ టీ తో విషయం చెప్పి ఆ కూపే తీసుకున్నాం.

కొన్ని గంటల ప్రయాణం కొన్ని సంవత్సరాల అనుబంధానికి నాంది

పలుకుతుందని నేనూహించలేదు. విజయవాడ స్టేషన్ వచ్చే వరకూ ఇద్దరం ఒకరి మనసు ఒకరికి విప్పి చెప్పుకున్నాక ఒకరికొకరం అని అర్థమైపోయింది. ఆ అర్థరాత్రి విజయవాడ దాటిన తర్వాత....వెల్....మిమ్మల్ని కించపరచాలనీ, అవమానించాలనీ నా ఉద్దేశ్యం కాదు గానీ.....మీకు కనీసం ఆ సందర్భంలో నన్ను ముద్దు పెట్టుకునే ధైర్యం అయినా ఉంటుందని నేననుకోను....ఎందుకంటే కాబోయే జీవిత భాగస్వామి కోసం రోజూ ఉండే మీ మామూలు సమస్యల నుండీ కొన్ని క్షణాలైనా తప్పుకుని చెప్పినమాట నిలబెట్టుకునేపాటి ధైర్యం కూడా మీకు లేదు కాబట్టి....

....అలా ఆ రాత్రి మేమిద్దరం ఒకటయ్యాం. తర్వాత రిజిస్ట్రార్ ఆఫీస్‌లో మా పెళ్ళి జరిగిపోయింది.

నిజం చెప్పాలంటే మీకు సారీ కూడా చెప్పాలనిపించడం లేదు. ఎందుకంటే జరిగిన రెండు సంఘటనల్లోనూ తప్పంటూ ఉంటే మీదే కానీ నాది కాదు గనుక.

మీకు కృతజ్ఞతలు చెప్పడానిక్కూడా మనస్కరించడం లేదు. కారణం జరిగిందంతా యాదృచ్ఛికమే గానీ మీరే కావాలని ఏర్పాటు చేసింది కాదు గనుక.

ప్రతి మనిషికీ కొన్ని బలహీనతలుంటాయి. మీ బలహీనత ఎటువంటి పరిస్థితుల్లోనూ మీ రొటీన్‌నుండి బయటికి రాలేకపోవడం, నా బలహీనత ఎటువంటి పరిస్థితుల్లోనూ ఒకరి కోసం వేచి ఉండకపోవడం, నిరీక్షణలో జీవితాలు బలి చేసుకున్న ప్రేమికులెందరో నాకు తెలుసు. నాది ఆ పంథా కాదు. ఒకవేళ నాకు ఆయన తారసపడకపోయినా నేను మీతో పెళ్ళి ఒప్పుకుని ఉండేదాన్ని కాదు. కారణం పైన చెప్పిందే. ఒకరి కోసం వెయిట్ చెయ్యడం నా తత్వానికే విరుద్ధం అని.

అనుకున్న సమావేశాలు అనుకోని కారణాల వల్ల ఆగిపోతే కలిగే నిరాశా నిస్పృహలకు సంజాయిషీలు ఓదార్చలేవు. కానీ అనుకోని సమాగమాలు ఒక్కోసారి ఆ లోటును పూర్తిగా భర్తీ చేస్తాయని నా భర్త రుజువుచేశాడు.

మీకనిపిస్తుండవచ్చు... పెళ్ళంటే ఇంత తేలికా?....జస్ట్ లైక్ దట్.....అని, కానీ ఒక్కసారి బయటికి వచ్చి చూడండి, శరవేగంతో పరుగెత్తుతున్న ఈ తరంలో ఒకరి కోసం ఒకరు ఆగడం త్యాగం అనిపించుకోదు. తెలివితక్కువ అనిపించుకుంటుంది.

విష్ యూ ఆల్ సక్సెస్ ఇన్ యువర్ నెక్ట్స్ మ్యాచ్."

*   *   *



నిషిద్ధ ద్వారాలు

వేములపల్లి మోహనరావు – పి.వి.కృష్ణారావు

'నెక్ట్స్ మీరు రండమ్మా' అన్నడు కాంపౌండర్.

కర్టెన్‌కున్న చిరుగంటలు మృదువుగా మోగాయి. వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుంటున్న డాక్టర్ ప్రసాద్ గుమ్మం వైపు తిరిగాడు, యధాలాపంగా చూసిన అతని చూపులు యధాతథంగా నిలిచిపోయాయి.

చీకటి ఆకాశంలో చుక్కల్ని కరిగించి పోతపోసిన పుత్తడి శిల్పం.

నల్లటి చీరమీద నక్షత్రాలుకంటి వెలుగుల ఒంటి బంగారరంగుని ద్విగుణీకృతం చేస్తుంటే, చేతులు రెండూ జోడించి 'నమస్తే' అందామె.

'నమస్తే, రండి కూర్చోండి.

పొందిన స్త్రీత్వానికి నిర్వచనం, గాంభీర్యత పరిపూర్ణ వ్యక్తిత్వానికి నిదర్శనం. ఆ రెండూ ఆమె రూపాన్ని డామినేట్ చేస్తున్నాయి.

'నా పేరు మానస' అందామె అతని కళ్ళలోకి చూస్తూ, ఎదుటివాడి శక్తిని అంచనావేసే చూపు, ఆత్మవిశ్వాసం ఎంతో పుష్కలంగా ఉంటే తప్ప సాధ్యపడని చూపు.

'గ్లాడ్ మీటింగ్ యూ, చెప్పండి' అన్నాడతను తనని తాను సర్దుకుంటూ.

'వెల్....' చిన్న పాజ్

'నా సమస్య చాలా వ్యక్తిగతమైనది.

వివరణకు టైం తీసుకుంటుంది. చెప్పడానికి నాకూ వినడానికి మీకూ సరైన మూడ్ కావాలి. నాలుగు గోడల మధ్య అది వీలుకాదని నా అభిప్రాయం 'మీకు, నాతో బయటికి రావడానికి ఎప్పుడు కుదురుతుంది?'

డెస్క్ క్యాలెండర్లో పేజీలు తిరగేశాడతను. వారం రోజుల వరకూ గంటకొకటి చొప్పున అపాయింట్‌మెంట్లు నిర్ణయమై ఉన్నాయి.

'ఈ రోజు సాయంత్రం నాలుగు గంటలకు మీకు వీలవుతుందా?' అడిగాడు

'ష్యూర్ ఇట్ సూట్స్ మీ.'

'ఓకే దెన్, ఫోన్ ఇన్ ది ఈవెనింగ్.'

'రైట్, ఆ టైంకు నేనిక్కడికి వస్తాను, థాంక్యూ డాక్టర్' లేచిందామె.

ఓ శ్రావ్యమైన గీతంలోని చివరి చరణంలా మంద్రంగా మాయమైంది. కర్టెన్ గంటల ముక్తాయింపుతో.

క్యాలెండర్‌లో నాలుగుగంటల కెదురుగా వున్న 'ఎంపీ గారి బర్త్‌డే' మీద అడ్డంగా రెండు గీతలు గీశాడతను. టూ హెల్ విత్ ద ఎంపీ, జీవితంలో ముఖ్యమైనవి ఇంకా చాలా ఉన్నాయి.

* * *

వెన్నెల్లో తడుస్తున్న సముద్రం, ఒడ్డున తెల్లగా విరిగే అలలు. కేవలం వారిద్దరి కోసమే ప్రకృతి ఏర్పాటు చేసిందా అన్నంత అద్భుతమైన అమరిక.

'ప్రపంచంలో మనిషికి కావలసినవన్నీ నాకు ఓ పాలు ఎక్కువే ఉన్నాయి డాక్టర్.' అతనివైపు చూసిందామె....ఓ క్షణం మౌనం.

'గో ఎహెడ్, మీరు ఎఫెక్టు కోసం ఆగక్కర్లేదు. సైకాలజిస్టులకు కావలసింది నాటకీయత కాదు... అయామ్ సారీ... నో ఆఫెన్స్ ఇంటెండెడ్, మీ భావాలు నిరంతరంగా ప్రవహిస్తున్నప్పుడే మాకు కావలసిన పాయింట్లు రాబట్టుకోగలుగుతాం. నిజానికి మీ సమస్యలకు జవాబులు మీకు తెలియకుండానే మీ అభిప్రాయాలద్వారా వ్యక్తమవుతాయి. మేము చేసేదల్లా వాటిని కొంచెం రిఫైన్ చేసి మీకు అర్థమయ్యే పద్ధతిలో మీ ముందుంచడమే. నా రియాక్షన్ కోసం చూడకండి, ప్లీజ్ ప్రొసీడ్.

మళ్ళీ మెదలు పెట్టడానికి కొద్దిగా టైం తీసుకుందామె, 'నాకు ఇరవై రెండో ఏట పెళ్ళయింది. మాకు స్వంత ఇల్లుంది. ఇద్దరు ముచ్చటైన పిల్లలు వున్నారు. ఆయన

చాలా మంచివారు. గౌరవప్రదమైన ఉన్నతోద్యోగంలో ఉన్నారు. ఒక్క కథలు వ్రాయడం మినహాయించి వ్యసనాలేమీ లేనివారు...

కెరటాల నేపథ్య సంగీతాన్ని ఆమె గొంతు మధురంగా అధిగమిస్తోంది.

*   *   *

కారు డోర్ తెరచి పట్టుకున్నాడతను. ఆమె కూర్చుంది. జీరాడుతున్న చీరకొంగు తలుపు మధ్య పడకుండా జాగ్రత్తగా సర్ది డోర్ వేశాడు.

దీపాల వెలుగులో గజిబిజిగా మనుమలు, వాహనాలు.

'సో.....వెన్ వియార్ మీటింగ్ నెక్ట్స్' అడిగాడతను డ్రైవ్ చేస్తూ

'నేను చెప్పడానికింకేమీ మిగల్లేదు. మీరు చెబితే వినడానికే మీ దగ్గరకొచ్చేది.'

'నో.....నో.....ఒక్క మీటింగ్‌లో వ్యక్తిగతమైన సమస్యల్ని అవగాహన చేసుకోవడం, సరైన పరిష్కారం వెదుక్కోవడమనేది అసంభవమైన విషయం. నేను మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకోనేంత వరకూ మనమిలా కలుస్తూనే ఉండాలి.'

'అయితే మీరే ఫిక్స్ చేయండి.'

కారు ఊళ్ళోకి ప్రవేశించింది.

'శనివారం మధ్యాహ్నం మీరు మొగల్‌రూంకు వస్తున్నారు లంచ్‌కి....నా గెస్ట్‌గా....'

'ఒకే....డన్, అండ్ థాంక్స్ ఫర్ ద లిఫ్ట్ డాక్టర్.'

'మోస్ట్ వెల్‌కం....గుడ్‌నైట్.'

'గుడ్‌నైట్.'

*   *   *

కాలింగ్ బెల్ చైమ్స్ పేరుకున్న నిశ్శబ్దాన్ని తరంగాలుగా విడగొట్టాయి. బటన్ మీద చెయ్యి తీసి టైం చూసుకున్నాడు ప్రసాద్. పదీ ఇరవై.

తలుపు తెరుచుకుంది.

'అబ్బ ఇప్పటిదాకా ఎక్కడికెళ్ళారండీ,' అందామె విసుగ్గా భర్తను చూస్తూ, పగలంతా పనులతో సతమతమై ఇంటికొచ్చిన మొగుణ్ణి గుమ్మంలో అడగవలసిన మొదటి ప్రశ్న అది కాదని గుర్తించే వరకూ, ఓ కరణేషు మంత్రీ, పెళ్ళి చేసుకోకు.

ఆమెను దాటుకుంటూ వెళ్ళి సోఫాలో కూలబడి షూస్ విప్పుకుంటున్నాడు.

'అడుగుతుంటే అలా సమాధానం చెప్పకుండా వెళ్ళిపోతారేమిటి' అందామె అతని ముందుకొచ్చి నిలబడి నడుంమీద చేతులుంచుకుని.

నువ్వడిగిన ప్రశ్న భర్త మెదడుకు చేరి, నీకు అర్థమయ్యేలా సమాధానం తయారు చేసుకుని నీకు చెప్పేంత వరకు ఆగే సహనం లేకపోతే, ఓ క్షమయా ధరిత్రీ, భార్యవి కాకు

ఫ్రిడ్జ్ తెరచి మంచినీళ్ళ సీసా ఒకటి పైకెత్తి తాగసాగాడతను.

'అసలు నేనంటే మీకంత నిర్లక్ష్యం ఏమిటి? దీనికెందుకు జవాబు చెప్పాలి అనేగా.'

మంచినీళ్ళు నోట్లో ఉండగా మాట్లాడటం అసంభవం అనే విషయం అర్థమయ్యే వరకూ ఓ కార్యేషుదాసి, గృహిణివి కాకు.

టై ఊడదీసి షర్ట్ బటన్స్ విప్పుకుంటున్నాడతను.

'ఎక్కడైనా భోంచేసే వచ్చారా, లేకపోతే దానికి మాత్రమే ఇల్లు గుర్తొచ్చిందా!'

బిచ్చగాడిని సైతం ఆదరించి అన్నం పెట్టే ఓ భోజ్యేషుమాతా, కట్టుకున్న వాడు, వాడికన్నా ఓ మెట్టు ఎక్కువేనన్న ఆలోచన నీకు వచ్చేవరకూ ఇల్లాలివి కాకు.

స్నానం చేసి అలసటగా మంచం మీద వాలాడతను.

భార్య అంటే బాధ్యత....ఆమెకు లభించవలసిన ఆదరణ, గౌరవం అంతేనా? అంతవరకేనా?

మనసునీ, శరీరాన్నీ కూడదీసుకున్నాడు

ఫర్‌గెట్....ఫర్‌గెట్ ఎవ్విరీథింగ్.....ఫర్‌గివ్ ఎవ్విరి థింగ్, అటువైపు తిరిగి ఆమె నడుంమీద చెయ్యి వేశాడు.

విసిరికొట్టిందామె. 'ఏమున్నా లేకపోయినా దీనికి మాత్రం తయారు. పెళ్ళాం అవసరం కేవలం పడగ్గదిలోనే....ఛీ.....ఏం మనుషులో' పాలరాతి శిల్పాలు ఎంత అంతంగా ఉన్నా శృంగారానికి పనికిరావు. ఆడతనం అనేది అవయవాలక్కాదు. మనసుకుండాలి అనే ఇంగితజ్ఞానం లేనంతవరకూ, ఓ శయనేషు రంభా, ఎవడికీ అర్థాంగివి కాకు.

* * *

టేబుల్‌కీ కుర్చీకీ మధ్య ఆమె నిలబడ్డ తర్వాత, ఆమెకు అనువుగా కుర్చీని జరిపి 'ఆర్ యూ కంఫర్ట్‌బుల్' అని అడిగాడతను

'ఓ....ఎస్....థాంక్స్.....'

వెయిటర్ మెనూ తెచ్చాడు.

'ఏం తీసుకుంటారు?'

'యువర్ ఛాయిస్'

నా అభిరుచులు మీకు సరిపడకపోవచ్చుగా.'

'అభిరుచులు కలిసినా కలవకపోయినా ఆధారపడడాన్ని మించి ఆడదానికి ఆల్టర్నేటివ్స్ ఏమున్నాయి'

'మైండ్.....టేకిట్ ఈజీ....టేకిట్ ఈజీ....' అన్నాడతను కొంచెం కంగారుగా, ఆమె చిన్నగా నవ్వింది. బేరర్ ఆర్డర్ బుక్ చేసుకెళ్ళాడు.

'మీది చాలా మైనర్ కంప్లెయింట్ మానసా.....పాల్పిటేషన్స్.....ఒక్కోసారి ఎమోషనల్ రీజన్స్ ఉండవచ్చు దానికి, మీ భర్త మిమ్మల్ని తక్కువగా చూస్తారనీ, పట్టించుకోరనీ మీరనుకుంటున్నది యాన్ ఎలివేటేడ్ ఇల్యూజన్. సామాజిక ప్రగతిలో మాతృస్వామిక వ్యవస్థ పతనమై పితృస్వామికి వ్యవస్థకు చోటిచ్చింది. అప్పటి వరకూ వివాదరహితంగా సాగిన జీవనక్రమం తారుమారై పురుషాధిక్యతకు నాంది పలికింది. అవకాశరాహిత్యం స్త్రీని ఉన్నచోటే ఉంచేస్తే మగవాడి మాత్రం, దొరికిన అవకాశాల్ని పూర్తిగా వినియోగించుకుని స్త్రీ మగవాడు కాంప్లెక్స్ పట్ల ఈర్ష్యాసూయలు పెంచుకుని అతనికి ముద్దుగా పెట్టిన పేరే మేల్ చావినిస్టిక్ పిగ్'

వెయిటర్ జాగ్రత్తగా వడ్డించి వెనక్కి వెళ్ళిపోయాడు.

బేరర్ ప్లేటు తీసుకొచ్చి వారి ముందుంచాడు అతడు ఆమె ప్లేటు అంచులు ముట్టుకుని చూశాడు.

'ఏమిటి' అడిగాందామె

'ఏంలేదు....వేణ్ణీళ్ళతో కడిగాడో లేదోనని చూస్తున్నాను.'

'ప్లీజ్...' అన్నాడతను తినడం ప్రారంభించనున్నట్లు మూడు నిమిషాలు గడిచాయి.

'మరి మీరు స్త్రీకింత గౌరవం ఎందుకిస్తున్నారు?'

'ఎంత? అన్నాడతను

'సింపుల్ థింగ్స్....కారు డోర్ తెరవడం దగ్గర్నించీ మీ ప్రతీ చిన్న గెశ్చర్ స్త్రీ అహాన్ని ఎంతో సంతృప్తిపరిచేదిగా ఉంది.'

'వెల్....దటీజ్ డ్యూటూ ఏ ఫీలింగ్ ఆఫ్ బిలాంగింగ్. ఆత్మీయత పెరిగినప్పుడు అవన్నీ అసంకల్పిత చర్యలు.'

'మీ భార్య చాలా అదృష్టవంతురాలు'

'రియల్లీ...' ప్రశ్నార్థకంగా అంటూ నవ్వాడతను.

భోజనం పూర్తయింది. ఫింగర్ బౌల్‌లో అందంగా కదుల్తున్న ఆమె పొడుగాటి వేళ్ళను చూస్తూ ఉండిపోయాడతను కాసేపు.

'ఎనీ డిజర్ట్స్.'

'నో థాంక్స్, అయామ్ డైట్ కాన్షస్' అందామె.

'బేరర్.....ఆఫర్ చెక్ ప్లీజ్.'

* * *

నీళ్ళనీ నింగినీ కలిపేసిన చీకట్లో శబ్దాలు తప్ప ఆకృతులు కనిపించడం లేదు.

'ఐ లవ్ యూ డాక్టర్' అందామె.

అటువైపు నుండి నిశ్శబ్దం.

'డాక్టర్ ఐ లైక్ యూ వెరీ మచ్, ఐ రియల్లీ మీన్ ఇట్' తను పణంగా పెడుతున్నది, తన ఆత్మనీ, తన అహాన్నీ అని ఆమెకు తెలుసు...అతనేమంటాడోనన్న టెన్షన్.

'మీకు తెలుసు, నేను పెళ్ళయినవాణ్ణి....ఇద్దరు పిల్లలు తల్లి మీరు...'

వాక్యాన్ని మొదలుపెట్టినప్పుడు అతనికి ముగింపు తెలియదు. ఇక ముందుకు వెళ్తే ఆమెను తృణీకరించడం అవుతుందనే స్పృహ కలిగి మధ్యలో ఆపేశాడు.

'నేను మీ నుండి ఏమీ ఆశించడం లేదు.' అప్రయత్నంగా ఆమె నాలుక చివరినుంచే ఉరికిన అబద్ధం....

ఆమెకు తెలుసు తన అణువణువూ అతన్ని కోరుతుందని

'మీరు ఊరు వెళ్ళి రండి ముందు...

తిరిగొచ్చాక మన నెక్స్ట్ సెషన్‌లో...'

'అయామ్ సారీ ఇఫ్ ఐ హర్ట్ యువర్ ఫీలింగ్స్ డాక్టర్.'

తను మాట మార్చడాన్ని ఆమె అంత సులువుగా గ్రహిస్తుందనుకోలేదతడు.

'నో...నో...నాటెటాల్.'

ఆమె దిగింది...కారు ముందుకు కదిలింది.

* * *

విశృంఖల నృత్యం చేస్తున్న తన ఆలోచనల్ని నిస్సహాయంగా గమనించడం తప్ప అతనేమీ చెయ్యలేకపోతున్నాడు. ఒక్కసారిగా తన చైతన్య స్రవంతికి ఆమె కేంద్రబిందువు ఎలా కాగలిగింది. ఎందుకు తన చూపులు అందరిలోనూ ఆమెనే వెదుకుతున్నాయి. రెస్ట్‌లెస్‌నెస్ న్యూరాటిక్ అండ్ అబ్‌సెసివ్ అనిపించేటంత రెస్ట్‌లెస్‌నెస్.

ఆమె తనిను తాను నివేదించుకుంటున్నప్పుడు తనకు వృత్తిపరంగానూ ఉన్న లక్ష్మణరేఖలు నాలుగు పక్కలా అడ్డొచ్చి.....ఆ తర్వాత తనకేమైంది....తన

శరీరం.....మనసూ ఆమెనే ఎందుకంత తీవ్రంగా కోరుకుంటున్నాయి! అప్పటి వరకూ అందమైన తెలివైన పేషంట్‌గా మాత్రమే తను గుర్తించిన మానస, ఒక్కసారిగా ప్రణయ ప్రళయ ప్రభంజనమై తననెలా చుట్టుముట్టగలిగింది.

ఇన్నాళ్ళ ప్రేమరాహిత్యం, మనోగత కాంక్షలు, శారీరక వాంఛలు, అన్నీ ఒక్కమ్మడిగా తనను వశపర్చుకుని, తన మనసు మీద చలాయిస్తున్న నియంతృత్వాన్ని తనేం చేయలేడా... అంత నిస్సహాయుడా తను!

మానస సమస్యను అర్థం చేసుకునే ప్రయత్నంలో అప్రయత్నంగా తను ఆమెతో ఏర్పరచుకున్న సామరస్యానికి పర్యవసానమా ఇది!

తనకు ఆడవాళ్ళంటే ఎంతో గౌరవం, తన తల్లి ఆడది గనక, హఠాత్తుగా భార్య గుర్తొచ్చిందతనకి. కాఠిన్యత ఒక్కటే, తన జడత్వానికి కారణం అని ఆమె ఎప్పటికి తెలుసుకుంటుంది. ఆమె సమక్షంలో మౌనాన్ని మించిన స్పందనా, నటనా అతనికసాధ్యమన్న విషయం ఆమె ఎప్పటికి అర్థం చేసుకుంటుంది?

మానసతో అతను అనేకసార్లు అన్నాడు, వైవాహిక జీవితంలో ఏదో ఒక స్థాయిలో రాజీ తప్పదని, కానీ ఈ రాజీయే దంపతుల్ని రాగరహితుల్ని చేస్తుందా?

ఆమే, తనూ, ఒకరిలో ఒకరు లీనమై, ఆమె తన భర్తనీ, ఇటు తను తన భార్యనీ వంచిస్తూ....లేదా....తమ తమ వైవాహిక బంధాలను తెంచుకుని పిల్లలకు దూరమై....

ఈ రెండు మార్గాల్లోను ఏదీ సరిపడదు తనకి.

మనుషులు ఉద్దేశ్యపూర్వకంగానే తమ విలువల్ని నిర్ణయించుకోవాలి.....తను నిర్ణయించుకుంటాడు.

* * *

సందేహిస్తున్నట్లు, ఆమె అడుగులు వేగం తగ్గాయి.

'రండి' అన్నాడు ప్రసాద్ నవ్వుతూ.

మానస కూర్చుంది అతనికెదురుగా

'ఈ వారం రోజులూ మీ గురించి ఆలోచిస్తున్నాను. ఆ రోజు నా మాటల్ని మీరు తిరస్కారం అనుకోలేదు గదా!'

ఆమె అడ్డంగా తల ఊపి అంది.

'లేదు, కానీ మీతో ఆ మాట అనడానికి నేను ఎన్నో రోజులు ఆలోచించాను. ఇద్దరు పిల్లల తల్లినన్న స్పృహ ఉండీ, మీతో ఆ మాట చెప్పకుండా నిగ్రహించుకోవడం

నావల్ల కాకపోయింది. మీరంటే నాకున్న ఆత్మీయతనూ, గౌరవాన్ని వ్యక్తం చేయడానికి నాకింతకంటే....నన్ను నేను అర్పించుకోవడం కంటే....వేరే పద్ధతి తోచలేదు.....'

బలవంతంగా ఆమె నుండి చూపులు మరల్చుకున్నాడు ప్రసాద్. అంత అందమైన స్త్రీ కోరివస్తే తను కాదంటున్నాడు పాపం. పాపం అనేది కేవలం భౌగోళికమే అయి, దానికి ఆధ్యాత్మిక చింతన ముడిపడి ఉండకపోతే సమాజం 'పాపం'అనే పదాన్ని అసలు కనిపెట్టి ఉండకపోతే...ఎంత బాగుండేది!

'ఐ లైక్ యూ మానసా!' మీరంటే నాకెంతో బాధ్యత ఉన్నట్టు అనిపిస్తోంది. మన సంబంధాలు దారి తప్పగూడదు. మనం అతిక్రమించలేని హద్దులు కొన్ని ఉన్నాయి. నలుగురి గురించి కాదు... మన అంతరాత్మ గురించి.

నడి వయసు ప్రేమ మిగతా జీవితాన్ని హాయిగా గడపటానికి ఉపయోగపడాలి గానీ బ్రతుకుల్ని అస్తవ్యస్తం చేయడానికి కాదు....మనం తెరవాలనుకుంటున్న తలుపుల్ని సమాజం ఏనాడో శాశ్వతంగా మూసేసింది. అయినా మొండిగాముందుకు సాగినవారు ఎలా పతనమయ్యారో చరిత్ర చెబుతోంది.

"జీవితానికి మారు పేరు రాజీ.....ఆ రెండూ అవినాభావాలు, రాజీపడటమనేది ఊపిరి బంధించినంత కష్టమైనా, ఊపిరి పీల్చినంత సహజం. లెటజ్ కాంప్రమైజ్. ఆల్ ద బెస్ట్ అతనామె చేతిని అందుకుని మృదువుగా పెదవుల కానించుకుని వదిలేశాడు.


ఆమె ఎంత మాత్రమూ గిల్టీగా ఫీలవలేదు.

అంత విచక్షణావరుడూ, సంస్కారీ కాబట్టే తను అతనికి దగ్గర కావాలనుకుంది. ఆమె కోరింది మనసుల ఐక్యతో, శరీరాల సాన్నిహిత్యమో ఆమెకే తెలియదు. యవ్వనపు తొలిదినాల ప్రగాఢవాంఛలు ఒక్కసారిగా మళ్ళీ జాగృతమై తనను విచలితురాల్ని చేస్తే అతను, తనని తాను నిలదొక్కుకునేలా చేశాడు.

సరైన వైద్యుడికతను నిర్వచనం.

కృతజ్ఞతతో, ఆరాధనతో, కళ్ళు తడిసి, ఆమె చూపులు ప్రకాశవంతమయ్యాయి.

*   *   *



ఓ మాస్టారి కథ

వేములపల్లి మోహనరావు –
పి.వి.కృష్ణారావు

అప్పటికి అయిదోసారి నేనా పాఠాన్ని ఆ క్లాస్‌కు చెప్పడం, వీళ్ళకు అర్థమయ్యేట్టు చెప్పేకన్నా బజార్లోకి వెళ్లి నాలుగు బండరాళ్ళను ఏరి, ఓ సంవత్సరంపాటు నేర్పించి వాటికి డాక్టరేట్ ఇప్పించవచ్చు. తల పగిలిపోతోంది అడిగే ప్రశ్నలకు ఒక్కడై సరైన జవాబు చెప్పడు. కళింగ యుద్ధం ఎప్పుడు జరిగిందిరా అంటే నలభై మందీ నలభై సంవత్సరాలు చెప్పారు. దాంతో అసలా యుద్ధం జరిగిందో లేదో, ఒక వేళ జరిగితే

ఎప్పుడు జరిగిందో నాకే అంతుపట్టకుండా అయిపోయింది.

లాభంలేదు వీళ్ళకిలా ఎంతకూ అర్థంకాని పాఠాలు చెబుతూ కూర్చుంటే మరో రెండేళ్ళ నా మొదటి తద్దినం పెట్టవలసి వస్తుంది. ఇంకా నేను పెళ్ళాడని నా భార్య ఖర్మకొద్దీ ఈ హైస్కూలుకు వచ్చి పడ్డానుగానీ లేకపోతే నా ఎమ్మే డిగ్రీకి, నా పర్సనాలిటీకి తగ్గట్టు ఏ కాలేజీలోనో హాయిగా సూటూబూటూ వేసుకుని అందమైన ఆడపిల్లలవైపు చూస్తూ, లెక్చరైవ్వవలసినవాణ్ని కాదూ!

అసలిదంతా మామయ్య చేశాడు. పేరుకు పెద్ద రాజకీయ నాయకుడేగాని సొంత మేనల్లుడికి ఉద్యోగం కావల్సివచ్చేసరికి ఆయన రాజకీయాలు ఎందుకూ పనికి రాలేదు. డిగ్రీ పట్టుకుని ఆయన దగ్గర వెళ్తే వచ్చే సంవత్సరం చూద్దాం–అందాకా ఆ స్కూల్లో పనిచెయ్యి అనుభవం వస్తుంది అని ఈ పల్లెటూర్లో వేయించేశాడు. నేను వచ్చే సంవత్సరందాకా బతికినప్పటిమాట కదా! వీళ్ళతో అరిచీ అరిచీ ప్రాణం పోతోంది ఉసూరుమంటూ కుర్చీలో కూలబడ్డాను. ప్యూన్ వచ్చాడు టెలిగ్రాం తీసుకుని, అది మామయ్య దగ్గర్నుంచీ, బెజవాడలో ఓ కాలేజీలో ఉద్యోగం వేయించాననీ, వెంటనే బయల్దేరి రమ్మనీ. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను ఒక్క నిముషం క్లాసంతా ఎగిరి గంతులు వేయాలనిపించింది. గది పై కప్పు నుండి కోతిలా వేళ్ళాడాలనిపించింది. టెలిగ్రాం తెచ్చిన ప్యూన్‌ని ముద్దు పెట్టుకోవాలనిపించింది.

వెంటనే హెడ్‌మాస్టర్‌తో విషయం చెప్పి ఆయన అభినందనలను స్వీకరించి మూటా ముల్లే సర్దుకుని ఆ సాయంత్రమే బయల్దేరాను. ఎంతో బిజిగా ఉండే మామయ్య నా కోసం స్టేషన్‌కు రావడం నాక్కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయన నన్ను తిన్నగా ఊరి బయట విసిరేసినట్టున్న ఓ యింటికి తీసుకువెళ్ళాడు. చిన్న బంగళా అది, ముందు విశాలమైన పూలతోట, చుట్టూ ఎత్తుగా కాంపౌండ్, మిగతా ఇళ్ళతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఉంది. లోపలంతా అల్ట్రామోడర్న్ ఫర్నిచర్, కార్పెట్లు, ఏసీలు.

"బావుంది ఎవరిదీ ఇల్లు" అడిగాను

"ఇంకెవరిదీ, నీదే."

"వాట్?"

అవునన్నట్టు తలూపాడాయన

కళ్ళెగరేస్తూ అన్నాను

"ఏం మామా! ఏమిటి విశేషం. ఇంద్రభవనంలాంటి ఇల్లు మేనల్లుడి కివ్వవలసిన అవసరం కూతుళ్ళు లేని నీకు కలిగిందంటే నేన్నమ్మను, ఏదో ఉంది మొత్తానికి రాత్రిళ్ళు రోజూ రంభా ఊర్వశులతో డాన్సు ప్రోగ్రాంలు ఎంజాయ్ చేసుకుంటావా ఏం కథ.'

"ఏడిశావ్‌లేరా" చిన్నగా నవ్వి సిగరెట్ వెలిగించాడాయన

మా ఇద్దరి మధ్యా అమరికలు లేవు. వయసు, వరసా మా స్నేహానికి ఎప్పుడూ అవరోధం కాలేదు. నలభై పైన పడుతున్నా ఆయన ఇంకా కుర్రవాడిలాగే కనిపిస్తాడు.

''నేనింకా మీ ఇంట్లోనే అత్తయ్యకు చేదోడు వాదోడుగా ఉండిపోదామనుకుంటున్నాను. పాపం అసలే అనారోగ్యం కదా తనకి."

"నీకలాంటి తెలివి తక్కువ ఆలోచనలు పుష్కలంగా వస్తాయని ముందే తెలిసి ఈ ఇల్లు అద్దెకు తీసుకున్నాను. నీకు మాతో ఉండడం కష్టమౌతుందనీ, స్టూడెంట్లూ వాళ్ళూ వస్తూపోతుంటారనీ, కావాలంటే అప్పుడప్పుడూ వచ్చి తనను చూసిపోతుంటాడనీ ఆవిడకు నచ్చచెప్పేసరికి నా తల ప్రాణం తోకకొచ్చింది."

"అది సరే, అసల్నీ ఉద్దేశ్యమేమిటి?"

ఆయనింకా దక్షిణ నాయకత్వం వదలనట్టే ఉంది. ఆ విషయం ఆయన నోటి వెంటే వినడం నాకు సరదా.

"ఓరి వెధవా, ఆ మాత్రం తెలీదురా నీకు? పగలంతా ఈ ఇల్లు నీది, రాత్రిళ్ళు మాత్రం నాది, ఫ్రెండ్సూ, వాళ్ళు వస్తుంటారు అప్పుడప్పుడూ పేకాటా, మందుపార్టీలూ."

"నథింగ్ డూయింగ్ మామయ్యా, నాకు తెలుసు నీ వేషాలు. కాని ప్రస్తుతం నేను బాధ్యత గల ఓ లెక్చరర్ని. నేనుండే చోట నీ చిలక్కొట్టుళ్ళు పనికిరావు జాగ్రత్త."

"అంతేనంటావా" అన్నాడు.

అంతేనన్నాను అభినయిస్తున్న సీరియస్‌నెస్‌ను జారిపోనివ్వకుండా

టైం చూసుకున్నాడు.

"సరే పద, స్టేషన్‌లో దిగబెట్టివస్తాను. వచ్చినదార్నే పోయి ఆ పల్లెటూళ్ళో బళ్లో చేరిపో. ఇక్కడ నీ ఉద్యోగం హుష్‌కాకీ."

ఇద్దరం గట్టిగా నవ్వుకున్నాం కాసేపు.

"చూడు నేనేదో వారానికో పదిరోజులకో ఓ తోడు తెచ్చుకుంటాను. నువ్వు గనక బిజీగా ఉంటే వరండాలో లైటు తీసెయ్. ఖాళీగా ఉంటే వేసి ఉంచు. అదీ మన సిగ్నల్. ఓ.కే."

"సరే ఇంతకీ ఇల్లు ఎవరిది, అద్దె ఎంత కట్టాలి?" అడిగాను.

"అదంతా నేను చూసుకుంటాను, నీకేం సంబంధం లేదు."

"ఊరికి ఇంత చివర్లో తీసుకున్నావ్, నేను రోజూ కాలేజీకి ఎలా వెళ్ళేది" అన్నాను కాస్త కోపంగా.

"నా పాత ఫియట్ కారు ఉంది అది వాడుకో, నేనీమధ్యనే కొత్తది కొన్నాను.

"మరి పెట్రోలు?"

"ఒరేయ్....వచ్చి నా నెత్తినెక్కరా, నీకు ఇల్లిచ్చీ, ఉద్యోగమిచ్చీ, కారిచ్చీ, ఆఖరికి పెట్రోలు కూడా నేనే పోయించనా....పుణ్యానికైతే ఇంకో పుట్టెడు కొలవమన్నాడట నీలాంటి ప్రబుద్ధుడు. మేనమామనే ఇంత డిమాండ్ చేసున్నావ్. రేప్పొద్దున పిల్లనిచ్చే మామ వంటిమీద బట్టలు కూడా మిగల్చవల్లే ఉంది..."

"సరే లేవయ్యా పెట్రోల్ నువ్వే పోయించుకో అని చెప్తే పోయేదానికి ఇన్ని సాధింపులెందుకు. సరే అలాగే కానీ" అన్నాను నేను.

ఆ సాయంత్రం వెళ్ళి అత్తయ్యకు కనబడి పరామర్శించి, మామయ్య చెప్పమన్నవన్నీ తు.చ.తప్పకుండా వల్లించి, కారు తెచ్చేసుకున్నాను. ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. మర్నాడు పొద్దున్నే కారు శుభ్రంగా కడిగి, స్నానం చేసి ట్రిమ్‌గా తయారై పదింటికల్లా కాలేజీ చేరుకున్నాను. కుర్రవాళ్ళు సింహద్వారం దగ్గర గుంపులుగా చేరి ఘన స్వాగతం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. నా పేరు రాయబడిన దిష్టి బొమ్మ ఒకటి ఓ చెట్టుకొమ్మకు ఉరితీయబడింది. నాకు కాళ్ళు వణికాయి కారు దిగగానే ఒకడు గుంపులో నుంచి అరిచాడు. "ఏ ఊరు గురూ మంది?"

"తప్పుకోండి, తప్పుకోండి. డొక్కు కార్లో బక్క మాస్టారొస్తున్నారు. అవునూ ఎప్పుడు రిజైనిచ్చేస్తున్నారట?"

ఎందుకు వీళ్ళకీ ఆకారణ శత్రుత్వం? నేనెవరో తెలియకుండానే నన్ను బద్ధ శత్రువుగా పరిగణిస్తున్నారు. ఎక్కడుంది లోపం?

ప్రిన్సిపాల్ రూంలోకి అడుగుపెట్టేటప్పటికే స్నానం చేసినట్టు పూర్తిగా తడిసిపోయాను చెమటతో. సాదరంగా ఆహ్వానించారాయన కుశల ప్రశ్నలు వేశారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికిచ్చి ఈరోజే మంచిది, క్లాస్ తీసుకోవాలన్నారు. టైం టేబుల్ చూసి ఓసారి పరికించి, కొంచెం సేపు దగ్గి, కళ్ళజోడు తీసి తుడుచుకుని "మొదట క్లాసే సియీసీ పడింది" అని గొణిగారు." మళ్ళా ఆయనే "ఫర్వాలేదులెండి, నేనే స్వయంగా వస్తాను. వచ్చి మిమ్మల్ని ఇంట్రడ్యూస్ చేస్తాను. ఫర్వాలేదు. మరేం భయంలేదు. కంగారుపడకండి. అబ్బే దీంట్లో ఏముందీ?" నాకు అనుమానం వచ్చింది ఆయన కూడా నాలాగే వణుకుతున్నారేమోనని.

మేము కారిడార్‌లోకి వచ్చేసరికి అక్కడంతా ఖాళీగా ఉంది. ఒక్క స్టూడెంటూ కనబడలేదు. 'చూశారా మన డిసిప్లిన్' అన్నట్లు ప్రిన్సిపాల్ నావైపు గర్వంగా చూసి కోటు సర్దుకున్నారు. నాకెందుకో అది తుఫాను ముందు ప్రశాంతతలాంటిదనిపించింది. నేనేదో

శ్మశానంలో ఉన్నట్లు అయిపోతున్నాను. అంతకుముందు ఎంతో కోలాహలంగా ఉన్న ఆ ప్రదేశం అలా నిశ్శబ్దమైపోవడం చాలా అసహజంగా ఉంది.

క్లాస్ రూం తలుపు తెరిచి నిలబడ్డారు ప్రిన్సిపాల్‌గారు. పిల్లి మెళ్ళో గంటకట్టేది ఆయనో, నేనే తెలియనట్టు ముందు ఆయన వెళ్తారని నేనూ, నేను వెళ్తానని ఆయనా అలా నిలబడిపోయాం కాస్సేపు. లోపల ఎవరూ లేనట్లున్నారు. సూదిపడితే వినిపించేంత నిశ్శబ్దంగా ఉంది. నాకాశ్చర్యం వేసింది. క్లాసు మొత్తం తలలు వంచుకుని ప్రార్థన చేస్తున్న మునుల్లా కూర్చున్నారు. మేము లోపలకి రావడం చూసి సంతాప సభలో మౌనం పాటించడానికి లేచినట్టు నిలబడ్డారు. ప్రిన్సిపాల్ గారిమీద నాకు అంతులేని గౌరవం జనించింది. ఆయన నా గురించి రెండంటే రెండే ముక్కలు చెప్పి దాదాపు పరుగెడుతున్నట్లుగా వెళ్ళిపోయారు.

నాకేం చెయ్యాలో తోచక ముందు బ్లాక్‌బోర్డు తుడిచాను. తర్వాత చాక్‌పీస్‌ను నలుపుతూ కూర్చున్నాను. మొదటిసారి క్లాస్ ఎలా తీసుకోవాలి అని నేను వెలిబుచ్చిన సందేహానికి, మా మాస్టారిచ్చిన అమూల్యమైన సలహా ఒకటి గుర్తొచ్చింది. “చూడు బాబూ, మొదటి రాత్రీ, మొదటి క్లాసూ రెండూ ఒకటే, దేనికీ ఓ నిర్దుష్టమైన పద్ధతీ, వ్యవహారం, ఇలా మొదలుపెట్టాలీ, ఇలా సాగించాలీ, ఇలా ముగించాలీ అని సూత్రాలేం లేవు. అవి మనిషి మనిషికీ మారుతుంటాయి. కానీ ఒక్కటి గుర్తుంచుకో ఏ నిముషంలోనూ భయపడకు.”

థాంక్స్ మాస్టారూ అని మనసులో అనుకుని గొంతు సవరించుకున్నాను గంభీరంగా హఠాత్తుగా ప్రిన్సిపాల్, ఇద్దరు పోలీస్ ఆఫీసర్లూ క్లాస్‌లోకి వచ్చేశారు. ఏమయింది అంటూ నేను లేవబోయాను కంగారుగా.

“కూర్చోండి, కదలొద్దు ప్రమాదం” అన్నారు ప్రిన్సిపాల్ గట్టిగా.

బిగుసుకుపోయిన నన్ను ఇద్దరు పోలీస్ ఆఫీసర్లూ జాగ్రత్తగా కుర్చీతో సహా బయటకు మోసుకొచ్చారు. ప్రిన్సిపాల్ రూంకి తీసుకెళ్ళి కాస్త కాఫీ అదీ తాగించారు. కాసేపటికి తర్వాత మళ్ళీ తిరిగొచ్చి “అంతా వెతికాం సార్. బాంబు ఎక్కడా కనబడలేదు” అన్నారు ప్రిన్సిపాల్‌తో. నా పక్కలో బాంబు పేలినట్లయింది. అంటే ఈ కుర్రాళ్ళు మాస్టార్ల కుర్చీల కింద టేబుల్ సొరుగుల్లోనూ బాంబులు కూడా పెడతారన్నమాట, ప్రిన్సిపాల్ నన్ను అనునయిస్తున్నట్లు అన్నారు.

“చూశారా, అంతా మన మాస్టర్ల అనుమానమే, స్టూడెంట్లు అంత నిశ్శబ్దంగా కూర్చున్నారంటే క్లాసులో తప్పకుండా బాంబు ఉంటుందని ఇంతకు ముందు రెండు మూడుసార్లు రుజువైందనుకోండి. ఇందాక నాకు ఆ సంగతి తట్టలేదు అయితే మాత్రం ప్రతీసారీ అలాగే జరుగుతుందా ఏమిటి?”

ఆ రోజుకి ఇక నాకు క్లాసుల్లేవు. సాయంత్రం ఇంటికి చేరుకునేప్పటికి పది లంకణాలు చేసిన వాడిలా అయిపోయాను. మళ్ళీ పల్లెటూళ్లోకి, పాత బళ్ళోకి వెళ్ళిపోదామా మనసా అనుకున్నాను. కానీ చేపలతో తినబడటం కన్నా తిమింగలంతో మింగబడటం సుఖం అని మనసు మార్చుకున్నాను.

మర్నాడు మరి కాస్త ధైర్యం కూడదీసుకుని ఇంకో క్లాసుకు వెళ్ళాను. ముందు బెంచీలో మినీ ఫ్రాక్ వేసుకుని ఓ పిల్ల కూర్చుంది. కాళ్ళు కనిపించకూడనంత వరకూ కనిపిస్తున్నాయి, ఏమాటకామాటె చెప్పుకోవాలి, నాకున్న ఒకే ఒక బలహీనత ఆడవాళ్ళు ఏ కొంచెం సెక్సీగా ఉన్నవాళ్ళు కనిపించినా నాకు హిస్టీరియా వచ్చినంత పని అవుతుంది. మనసు మొద్దుబారిపోతుంది, ఏం మాట్లాడతానో తెలియదు.

నేను పాఠం మొదలుపెట్టపోతూ ఎవడు తుమ్ముతాడో అని ఎదురుచూశాను. కానీ ఎవడూ ఆ పని చెయ్యలేదు. బహుశా అది చాలా అవుట్ డేటెడ్ అయిపోయి ఉంటుంది.

“పాఠం మొదలుపెట్టే ముందు...నా పేరు...అని ఎఫెక్ట్ కోసం సర్దుకున్నాను.

“మాకనవసరం” వెనక బెంచీలో నుండి ఓ ఆశరీరవాణి.

“పరస్పర పరిచయాలు అవసరం పోనీ మీలో ఒక్కొక్కరూ లేచి మీ మీ పేర్లు చెప్పండి.

“మీకనవసరం...” ఇంకోవైపు నుంచీ.

“సరే అయితే. నాకేం, జైల్లో ఖైదీల్ని పిలిచినట్లు నంబర్లతో పిలుస్తాను....ప్రస్తుతం పాఠం మొదలుపెడతాను...”

“పెట్టు...” దీర్ఘం తీసింది ఆడో, మగో తెలీని గొంతు, బ్లాక్‌బోర్డు వైపు తిరిగానో లేదో.

“హారతిదే గైకొనుమా....మామా....అందాల రామా.” అని రాగయుక్తంగా వినిపించింది. వెనక్కి తిరిగి చూస్తే మినీ ఫ్రాక్ పిల్ల పుస్తకాన్ని హారతి పళ్ళెంలా పట్టుకుని నిలబడింది.

“వాటీజ్ దిస్...” అన్నాను కోపంగా

“పాఠం మొదలెడతానన్నారుగా....మీ దగ్గర పుస్తకం ఉందోలేదోననీ...”

“సిడౌన్....”అని కొంచెం చిరాగ్గా ఆ బుక్ అందుకున్నాను

ఆ మధ్యాహ్నం లంచ్ అవర్లో జువాలజీ లెక్చరర్ దీన పరిచయమైంది. ఎక్కువగా లాబ్‌లో ఉంటుందట. అందుకే మొదటిరోజు కనబడలేదు, చాలా అందంగా ఉంది. అలాగే మాట్లాడింది కూడా.

"మొదట్లో అందరికీ ఇలాంటివి మామూలేలెండి. ఓ వారం పది రోజులు పోయాక అంతా అలవాటైపోతుంది." ధైర్యం చెప్పిందామె.

"వాళ్ళకా....నాకా..." అన్నాను. అందంగా నవ్వింది. లేబొరేటరీ అంతా చూపించి అప్పుడప్పుడూ వస్తూండమని చెప్పింది.

బాత్‌రూంలో కూని రాగాలు తీసుకుంటూ స్నానం చేస్తున్నాను. ఎదురుగా అద్దంలో నాలాంటి వాడే ఒకడు నేనేం చేస్తే అది చేస్తున్నాడు. వాణ్ణి వెక్కిరించాను. వాడూ అలాగే చేశాడు. కోతిలా, కిచకిచమన్నాను వాడూకూడా. మరు నిమిషంలో ఓ పెద్ద అరుపు వినిపించింది. అదేవిటి నెనలా అరవలేదే....అంటే నా ప్రమేయం లేకుండా అద్దంలో వాడే ఆ రకంగా చొరవ తీసుకున్నాడా?....ఎందుకైనా మంచిదని గబగబా టవల్ చుట్టుకుని బయటికి వచ్చాను. అప్పుడే పాపం ఎవరో ఒకావిడ గుమ్మం దాటి వెళ్ళిపోతోంది. మావయ్య. 'అరే, ఏవిటి....కాంతం....ఏమైంది వెళ్ళిపోతున్నావేమిటి" అంటూ ఆమె వెనకపడ్డాడు.

బయట కారిడార్లో లైటు వెలుగుతోంది. మామయ్యతో నా సిగ్నల్స్ ఆరేంజ్‌మెంట్ గుర్తొచ్చింది. పాపం ఆయన తప్పేముంది. ఛ...ఛ... నాకు మరీ నిర్లక్ష్యం యెక్కువ....యోగి వేమనలా బాత్‌రూం తలుపు వేసుకోకుండా స్నానం చెయ్యడం యేమిటి నన్ను నేను యెంతో సేపు తిట్టుకున్నాను.

క్లాసులు రానురాను మరీ కఠినంగా తయారవుతున్నాయి, ఏ ఒక్కడూ పాఠం వినడు, ఆ రోజు అసలే తిక్కగా వుంది. అటెండెన్స్ తీసుకుని పుస్తకాలు అందుకొబోతుంటే టేబుల్ చివర వున్నాయేమో క్రిందపడి కొన్నిటిలో నుండి విడి కాగితాలు చెల్లాచెదరయ్యాయి. టేబుల్ పక్కన కూర్చుని వాటిని ఏరుకుంటున్నాను. ఎదురుగా కాళ్ళూపుతూ మినీ ఫ్రాక్ పిల్ల నాకు ఒళ్ళంతా గుగుర్పాటు, ఇంతలో గుమ్మంలో నుంచి ఓ అరుపు.

"ఏదిరా! వంకాయ్‌గాడింకా రాలేదా."

అంటే నా నిక్‌నేమ్ వంకాయన్నమాట, మెల్లగా లేచి నిలబడ్డాను, వాడు నన్ను చూసి బిత్తరపోయి కాసేపు మిమిక్రీ చేసి "అబ్బే ఏం లేదు....మిమ్మలిన కాదు సార్. మా ఫ్రెండ్ ఒకడికి వంకాయ కూరంటే చాలా యిష్టం. అందుకని....వాడు.....వాడింకా రాలేదేమిటా అనీ..."

"షటప్ అండ్ టేక్ యువర్ సీట్."

వాడు పిల్లిలా వెళ్ళి తన చోట్లో కూర్చున్నాడు.

క్లాస్ సగం జరిగిన తర్వాత మూడో బెంచీలో ఒకడు కాళ్ళు ముందు బల్ల

మీద పెట్టుకుని, చొక్కాగుండీలు ఊడదీసుకుని హాయిగా వెనక్కివాలి, నన్ను తినేసేలా చూస్తున్నాడు దువ్వెన తీసి తల దువ్వుకుంటున్నాడు.

"ఇదిగో నీ పేరేమిటి" నాకు తెలీదు గాని సరిగ్గా కూర్చో.....ఇది సినిమా హాలు కాదు. బార్బరు షాపు అసలేకాదు... ఆ దువ్వెన జేబులో పెట్టుకో....రేప్పొద్దున ఎవరికైనా క్షవరం చేసేప్పుడు .....పనికొస్తుంది" అన్నాను.

"మైండ్ యువర్ ఓన్ బిజినెస్" అన్నాడు వాడు మండిపోతూ

"అదే ప్రస్తుతం నేను చేస్తున్నది."

"పాఠాలు చెప్పడం వరకే మీ బాధ్యత....మిగతావి మీకనవసరం."

"నా బాధ్యత లేవిటో నాకు తెలుసు.....మర్యాదగా కాళ్ళు తియ్..."

వాడు నావైపు పోవోయ్ పుల్లాయ్ అన్నట్లు చూశాడు. ఈసారి కాళ్ళు ఆడించడం కూడా మొదలుపెట్టాడు.

వాడి దగ్గరకు వెళ్ళి చొక్కా పట్టుకున్నాను. వాడూ నా అంత ఉన్నాడు. కానీ నాకు, వాడికి లేని అధికారం ఉంది. ఆ బలంతో వాణ్ణి ఈడ్చుకుంటూ గుమ్మం దగ్గరకు తీసుకొచ్చి బయటికి తోసి తలుపేశాను. క్లాసంతా కిక్కురమనకుండా అయిపోయింది.

"మీకేదో నేను భయపడి ఊరుకుంటున్నానుకోకండి, మంచితనం వేరు, అసమర్థత వేరు, రెంటిని ఒకటే అని పొరపాటుపడితే మీ మిత్రుడికి జరిగిన సన్మానమే మీకూ జరుగుతుంది. మేమిక్కడ చెప్పే పాఠాలు రేప్పొద్దున మీకెందుకూ పనికిరావు. అవి మీకు తిండిపెట్టవు. ఉద్యోగాలు వెదకవు మీరు వాటిని వినకపోతే నాకు కించిత్తు బాధ కూడా లేదు. కానీ సంస్కారం, సభ్యత నేర్చుకోండి, భవిష్యత్తులో మిమ్మల్ని ఓ మనిషిగా తీర్చిదిద్దేవి అవే. మీరు బయటకు పట్టుకెళ్ళే డిగ్రీ ముక్కలు ఇవి తోడు రాకపోతే గడ్డిపోచ విలువ కూడా చెయ్యివు. మీ మీద మీ తల్లిదండ్రులు తగలబెట్టే డబ్బుకు ఆ కాస్త న్యాయం అయినా చేకూర్చండి. గురువును అవమానించడం ఈ తరం సంప్రదాయం కావచ్చు కానీ, దాని వల్ల మీకేమైనా లభిస్తే, ఓ క్షణికమైన, క్షుద్రమైన ఆనందం మాత్రమే. క్లాసు మొత్తానికి హీరో అనిపించుకోవాలని ప్రయత్నించిన మీ కొలీగ్‌లా ప్రవర్తించి అభాసుపాలు కాకండి. నాదీ మీ తరమే మీలో ప్రవహించే వేడి రక్తమే నాలోనూ ప్రవహిస్తోంది. మీలాగే నేనూ తొందరపడితే మిమ్మల్ని కాలేజీ నుంచి డిబార్ చేయించగలను. ఆ అధికారాన్ని వుపయోగించు కోవడానికి నేను జంకను, టేక్ కేర్."

క్లాస్ మొత్తం మంత్రముగ్ధులై పోయారు. ఆ తర్వాత వాళ్ళకు పాఠాలు చెప్పడం నాకు నల్లేరు మీద బండి నడకైపోయింది. కానీ నా విశ్వాసాన్ని దెబ్బతీసే సంఘటన మరో క్లాస్‌లో కొద్ది కాలానికే జరిగింది. ఆరోజు ఓ ఇంపార్టెంట్ టాపిక్ మీద లెక్చర్

ఇస్తున్నాను. వెనక బెంచీలో నుండి సన్నగా పొగ వస్తోంది. వెంటనే లేచి అక్కడికి వెళ్ళాను. సిగరెట్ కాలితో నలిపేస్తున్నాడొకడు.

"వాటీజ్ దిస్" అడిగాను కోపంగా.

వాడు నోరు తెరవక తప్పలేదు అందులో నుండి సిగరెట్ పొగ బైటికి రాక తప్పలేదు. నేను సంజాయిషీలేం అడగలేదు. చాచి వాడి లెంపమీద ఒక్కటిచ్చుకున్నాను. దెబ్బతో వాడి కళ్ళు బైర్లు కమ్మినట్టున్నాయి.

"గెటౌట్" అన్నాను.

వాడు కదల్లేదు, మిరి మిరి చూస్తున్నాడు.

"వెళ్తావా, ప్యూన్‌ని పిలిపించనా." అరిచాను

మెల్లగా క్లాస్ మొత్తం లేచారు. ఒక్కొక్కరుగా అందరూ బయటికి నడిచారు...అవసరం లేనిచోట ఐకమత్యం కనిపించేది. ఒక్క కాలేజీల్లోనే, తర్వాత తెలిసింది నాకు వాడు ఆ కాలేజీ సెక్రటరీ అని, క్లాసులో సిగరెట్ కాల్చగలనని పక్కవాడితో పందెం కాశాడని.

రెండురోజులపాటు వాళ్ళు నా క్లాసులో కూర్చోలేదు. ఆ తర్వాత ప్రిన్సిపల్ నన్నూ వాళ్ళనీ పిలిచి రాజీ చెయ్యడంతో ఆ గొడవ తాత్కాలికంగా ముగిసింది కానీ, వాళ్ళు మాత్రం నన్ను శత్రువుగా చూట్టం మానలేదు.

మళ్ళీ క్లాసులు క్రమంగా నా చేయి దాటిపోసాగాయి. ఒక క్లాసులో ఎవడో లేచి "మాస్టారూ చిన్న రిక్వెస్టు మీరెందుకంత గట్టిగా అరిచినట్టుగా పాఠం చెబుతారు. మాకు చెవుడేం లేదు. అదీగాక మీరంత గట్టిగ మాట్లాడుతుంటే మాకు పక్కవాళ్ళ మాటలు కూడా వినిపించడం లేదు దయచేసి మెల్లగా చెప్పండి." అన్నాడు ఓరోజు.

వాడికి ఏం సమాధానం చెప్పాలి."

* * *

దీపకూ, నాకూ పరిచయం పెరుగుతోంది ఆరోజు డిన్నర్‌కు పిలిచింది నన్ను కాలేజీకి దగ్గర్లో వున్న ఓ మూడు వాటాల డాబా యింట్లో ఓ చివర పోర్షన్‌లో వుంటోంది తను ఆ రాత్రి తొమ్మిదింటికి నీట్‌గా తయారై వెళ్ళాను.

"రండి....రండి ఆహ్వానించిందామె.

"మా అమ్మగారు" పరిచయం చేసింది.

పరస్పర నమస్కారాలయ్యాయి. కాసేపు కబుర్ల తర్వాత భోజనానికి కూర్చున్నాం. నా కుర్చీ కెదురుగా గోడమీద ఓ ఫోటో. దానికో దండ, అగరొత్తులు, ఆ ఫొటోలో భయంకరంగా కనపడే వ్యక్తి, ఇంతింత కళ్ళతో 'ఎవడ్రా నువ్వు రాస్కెల్' అంటూ మీదకొచ్చి

తంతాడేమోననిపించేట్లు. ఆ ఫొటో ఇంట్లో ఉన్నంత కాలం ఈ ఆడవాళ్ళ రక్షణకేం లోపం లేనట్లుంది.

దీప చెప్పింది, ఆ వ్యక్తి వాళ్ళ నాన్న గారు. ఫారెస్టు రేంజర్‌గా పనిచేసి ఐదేళ్ళ క్రితం హృద్రోగంతో మరణించారట. వెనక స్థిరాస్థి బాగా ఉండడంతో జరుగుబాటుకేం లోటులేదు. కేవలం సరదా కోసం ఉద్యోగం చేస్తోందట.

పదకొండు గంటల ప్రాంతంలో వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని ఇంటికి వచ్చేశాను. కొన్ని రోజులు గడిచాక ఓ రోజు తను కాలేజీలో అడిగింది. "ఏమిటి యెప్పుడూ మీరు మీ యింటికి కనీసం కాఫీకైనా రమ్మనరు!"

"బ్రహ్మచారి కొంప నాది. మీరొస్తానంటే అంతకన్నా భాగ్యమేముంటుంది. సాయంత్రం రెడీగా వుండండి, వచ్చి తీసుకెళతాను" అన్నాను.

ఆ సాయంత్రం తనొక్కతే వచ్చి కారెక్కి కూర్చుంటే "అదేవిటీ మీ అమ్మగారు రావటంలేదా" అడిగాను.

"తనెందుకూ మన మధ్య..."అంది.

కారు సగం దూరం వెళ్ళిన తర్వాత గానీ నాకు ఆ మాటలకర్థం బోధపడలేదు. ఆడవాళ్ళను అర్థం చేసుకునే విషయంలో నేను కొంచెం లేటు. ఆమె వైపు తిరిగి చూశాను. రతీదేవిలా నా పక్కనున్న ఈమెను జీవితాంతం అలాగే కూర్చోబెట్టుకోగలిగితే? అంతకన్నా కావలసిందేముంది?

"సింప్లీ మార్వెలెస్" అంది నా చిన్న బంగళాను. దాని ప్రైవసీని చూసి.

"ఏం తీసుకుంటారు...కాఫీ...టీ...బొర్నవిటా....ఓవల్టిన్, కోక్, గోల్డ్‌స్పాట్?" అన్నాను హడావిడిగా.

"ఇంతకు ముందు మీరేదైనా హొటల్లో పనిచేశారా" నవ్వుతూ అందామె.

నేను కూడా నవ్వాను 'కాఫీ తీసుకురానా' అంటూనే కిచెన్‌లోకి నడిచాను. నా వెనకాలే వచ్చింది తను, ఏవో కబుర్లు చెబుతూ మా కిచెన్ కొంచెం ఇరుకు, ఒకరికొకరు తగలకుండా అటూ, ఇటూ తిరగడం సాధ్యం కాదు.

"ఆ కాఫీపొడి డబ్బా ఇలా అందుకోండి, అక్కడ పై అలమారాలో ఉంది" అన్నాను నేను పాలలో పంచదార వేస్తూ.

మునికాళ్ళమీద లేచి పైకి రెండు చేతులూ చాచి డబ్బా అందుకుంటుంటే పైట జారిపోయింది. అది సర్దుకోవాలా, డబ్బా వదిలేయాలా తెలియనట్లు ఓ క్షణం అలాగే నిలబడింది. అబ్బ...ఏం భంగిమ...మై గుడ్‌నెస్...కళ్ళు గట్టిగా మూసేసుకున్నాను. కానీ పంచదార వేయడం మాత్రం మానలేదు.

"ఏవిటి కళ్ళు మూసుకున్నారు" అంది కొంగు బొడ్లో దోపుకుంటూ

"అబ్బే....ఏం లేదు...." అన్నాను తడబడుతున్న గుండె. గొంతుకలతో...

"కాఫీ నాకేనా" కప్పు అందిస్తున్న నన్ను అడిగింది.

"లేకపోతే మరి నాకా..."

"అహ, ఎలా కుదిరిందో ముందు టేస్ట్ చెయ్యరూ...."అంటూ నా నోటి దగ్గర కప్పు పెట్టి తాగమంది, కిలో పంచదార మొదటి సిప్‌లో నా గొంతులోకి వెళ్ళిపోయి మింగుడుపడక ఉక్కిరిబిక్కిరయ్యాను.

"అయ్యో తెలివి....కాఫీ అలాగేనా చెయ్యడం....పదండి పదండి చాలా కష్టపడ్డారుగానీ, నేను కలుపుకొస్తాను."

"నేనూ ఇక్కడే వుంటాను"అన్నాను మారం చేస్తున్నట్లు.

"ఉండండి....నాదేం పోయింది, మీరు నా ఎదురుగా ఉంటే కాఫీ ఇందాకటిలాగే తయారవుతుంది."

ఈ వాక్యం ఆవిడ వెళ్ళిపోయిన అరగంటగ్గానీ నాకర్థం కాలేదు.

సోఫాలో దాదాపు నన్నానుకుని కూర్చుని కబుర్లు చెబుతూంటే తాగుతున్న కాఫీ విస్కీలా అయిపోయి మత్తెక్కి, ఆమె కళ్ళలోకి సజెస్టివ్‌గా చూశాను. ఆ భాష మగవాళ్ళ కన్నా బాగా ఆడవాళ్ళకే అర్థమౌతుందేమో, మాట్లాడే విషయాన్ని ఆపేసి సిగ్గుతో తలదించుకుందామె. నా ఒళ్ళు పులకరించింది.

"ఇల్లు చూద్దువుగానిరా," మొదటి సారిగా ఏకవచనం, అప్పుడు ఆగి నా అధికారం అందించిన నా చేయిని అందుకోవడానికి వెనుకాడలేదామె.

* * *

మామయ్య నాకిచ్చిన కారు ఇక్ష్వాకుల కాలం నాటిది. అది నడుస్తుంటే సౌండురాని పార్టు అంటూ ఏదీ వుండదు, నిజానికి ఏ మ్యూజియంలోనో యాంటిక్‌గా పెట్టవలసిన కారు. మామయ్య అనేవాడు మీ అత్తకూ దీనికీ తేడా లేదురా, ఇంట్లో అదీ, బయట ఇదీ ఎప్పుడూ షణుగుతూనే ఉంటారు అని, అందుకే కనీసం ఓ పోరునైనా తగ్గించుకుందామని దీన్ని మూలపడేశారు నడిచినంత కాలం నడుస్తుంది. ట్రబులివ్వగానే నేను కూడా దాన్ని కిలోల లెక్కన పాత సామాను వాడికి అమ్మేద్దామనే ఉద్దేశ్యంతో తీసుకున్నాను. విచిత్రమేమిటంటే అది ఇంత వరకూ ఏం ట్రబులివ్వలేదు. పిండిమరలా రొదపెట్టినా గమ్యం చేరుస్తూనే వచ్చింది. మామయ్య ఎందుకైనా మంచిదని ఆ మధ్య దాని ఇన్సూరెన్స్ రెన్యూ చేయించబోతే, ఆ ఏజెంటు ఛ జోకులెయ్యకండి మేస్టారూ అన్నాట్ట.

ఓరోజు సాయంత్రం నేను కాలేజీ వదిలి, పార్క్ చేసిన చోట చూస్తే కారు లేదు అది ఉండవలసిన స్థానంలో కొన్ని ఇనుప ముక్కలూ, రబ్బరు చెక్కలూ, ఇంజన్ తాలూకు అవశేషాలు ఉన్నాయి. కొట్టవచ్చినట్లు వాటి మధ్యలో ఓ మందమైన తెల్లటికార్డు తీసి చదివాను "మీకెన్నో సార్లు చూచాయగా చెప్పాం....కారుమోతతో మమ్మల్ని హింసించవద్దనీ, మాకు దాన్ని చూస్తేనే పూనకం వస్తోందనీ, మీరు వినలేదు, పర్యవసానానికి క్షమించాలి. స్టూడెంట్లు.'

హమ్మయ్య అనుకున్నాననుకుంటాను ఎందుకైనా మంచిదని ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్ళి విషయం చెప్పి ఆ కార్డు ఇచ్చాను. ఆయన కుర్చీలోంచి లేచి నిలబడి "మీరేం వర్రీ అవకండి....నేను ఎంక్వైరీ చేస్తాను" అన్నారు. కానీ, ఆయన సంతోషాన్ని మాత్రం కప్పిపుచ్చుకోలేకపోతున్నారు. పాపం ఆ కారు మోతతో విసుగెత్తిపోయిన వాళ్ళలో ఆయన కూడా ఒకరు.

దీపా, నేనూ ఆ రోజు కలిసి కాలేజీకి వెళుతున్నాం. మెయిన్ గేటు దాటుతుండగా వెనక గుంపులో నుండి ఎవడో అన్నాడు. "వంకాయ్‌కి టొమాటో జోడీ అయిందిరోయ్" మిగతా వాళ్ళంతా పగలబడి నవ్వారు. దీప మొహం నిజంగానే టొమాటోలా ఎర్రగా అయిపోయింది. నేను వెనక్కి తిరిగి వాళ్ళ దగ్గరకు నడిచాను.

"ఎవడాకూసిందీ." అన్నాను చొక్కా చేతులు ముడుస్తూ. నాకీ మధ్య రౌడీ లక్షణాలు వచ్చేస్తున్నాయి.

"కూతలు పక్షులు మాత్రమే కూస్తాయి గురువుగారూ మనుషులు మాటలాడెదరు" గ్రాంథికంలో ఏడిశాడొకడు.

"ఒళ్ళు దగ్గర పెట్టుకోండి. నోటికెంతొస్తే అంత మాట్లాడటం ఒంటికి మంచిది కాదు"

"కాస్త గుర్రాన్ని కట్టెయ్యండి మాస్టారూ. ఇది క్లాస్ రూంకాదు మీ అధికారం చెల్లడానికి. మనం ప్రస్తుతం కాలేజీ కాంపస్ బయట ఉన్నాం. కాబట్టి మీరన్న మాటలు మాకన్నా మీకే బాగా వర్తిస్తాయి. అయినా ఆవిడను వెంటబెట్టుకుని కృష్ణా బేరేజ్ మీద షికార్లూ, దుర్గగుడి చుట్టూ ప్రదక్షణాలూ, ఊర్వశిలో సెకండ్ షోలూ' ఎగ్జిబిషన్లూ తెగ తిరిగినపుడు లేని తప్పు మేమంటే వచ్చిందా! అంత సరదాగా ఉన్నవాళ్ళు, మాట పడకూడదనుకున్న వాళ్ళు పెళ్ళే చేసుకోవచ్చుగా!" అన్నాడు ఒకతను.

అదే మాట ఆ సాయంత్రం దీప కూడా అడిగింది. చిన్నబోయిన మొహంతో, కాదనడానికి నాకు కారణాలేం లేవు. వాళ్ళ అమ్మగారితో మాట్లాడతాననీ, త్వరలోనే రిజిష్టర్ మారేజ్ చేసుకుందామని చెప్పాను.

మావయ్య దురదృష్టం ఏమిటోగానీ, నేనుంటున్న ఇల్లు ఆయనకు పెద్దగా ఉపయోగపడలేదు, ఒకటి రెండుసార్లు పేకాట, మందు పార్టీలకు మినహాయించి, ఎప్పుడూ ఏదో అవాంతరమే. బయట వరండాలో లైటు వేసి వచ్చాను. భోజనం చేసి పుస్తకం పట్టుకుని ఓ గంట చదివానో లేదో తలుపు తట్టిన చప్పుడు. మావయ్య అయితే బాగుండును అనుకుంటూ తలుపు తీశాను. ఎదురుగా మినీ స్కర్ట్ పిల్ల . నిర్ఘాంతపోయాను. ఇంత రాత్రి వేళ నేను గమనించలేదు గానీ బయట ఉరుములూ, మెరుపులతో వర్షం కురుస్తోంది. ఆ పిల్ల పూర్తిగా తడిసిపోయి వుంది అదేమిటో ఆ అమ్మాయి చూపులు ఎదుటి మనిషిని కొరుక్కుతినేసేట్టుంటాయి. మగతనం ఉన్నవాడికెవడికైనా ఆ పిల్ల కళ్ళల్లోకి చూసి కౌగిలించుకుని ముద్దు పెట్టుకోకుండా నిగ్రహించుకోవడం కష్టమైన పని.

"మాస్టారూ, రేపు మీరు కృష్ణానది ఒడ్డుకు రాగలరా" అంది గుమ్మానికానుకుని అలవోకగా చూస్తూ.

"ఎందుకు?" అనగలిగాను బలవంతం మీద " 'అలాగే తప్పకుండా' అని వచ్చేస్తున్న మాటల్ని తొక్కిపట్టి.

"ఎందుకో మీకే తెలుస్తుంది వస్తే, అదేమిటో యిక్కడే చెప్పి సస్పెన్స్ పాడు చెయ్యడం నాకిష్టం లేదు. అన్నట్టు వొంటరిగా రమ్మని ప్రత్యేకించి చెప్పక్కర్లేదుగా, వస్తాను గుడ్‌నైట్."

వర్షపు జల్లు మొహం మీద కొట్టడంతో తలుపు మూశాను.

ఆ అమ్మాయి వెళ్ళిపోయిన మరుక్షణం నుంచీ నేను మర్నాడు సాయంత్రం కోసం యెదురుచూట్టం మొదలెట్టాను. ఎన్నో యుగాల తర్వాతగానీ ఆ ఘడియరాలేదు. ఓ జంట గులాబీని జాగ్రత్తగా తెంపి నలిగిపోకుండా పట్టుకుని ఆమె చెప్పిన చోటికి చేరుకున్నాను.

పెద్ద జామతోట అది. దాన్ని ఆనుకుని వరసనే అరటిచెట్లూ, అందులో కాపలాకోసం యెవరో వేసుకున్న గుడిసె. దాన్ని దాటితే మెత్తటి యిసుక. ఆ తర్వాత నిరంతర ప్రయాణీకురాలు కృష్ణవేణి. అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తూ ఏవో వూహాల్లో తేలిపోతున్న నన్ను వెనుకనుంచి కళ్ళు మూసింది మినీస్కర్ట్ పిల్లేనని తెలుసు.

"ఏమిటీ సంగతి?" అన్నాను సాధ్యమైనంత మృదువుగా ఆ చేతుల్ని విడదీస్తూ

"పాపం....ఏం తెలియని పసివారు మా మాస్టారు" అంది నా ముక్కుపట్టుకుని ఊపుతూ, ఆడవాళ్ళ అంతర్యాన్ని అర్థం చేసుకోవడంలో నేను ట్యూబ్‌లైటునే అయినా కాస్సేపటి తర్వాతైనా వెలుగుతాను. అయితే, ఆ అమ్మాయి మాటలు నాకు అర్థమై దీప జ్ఞాపకాలు నా చుట్టూ కవచాన్ని నిర్మించేటప్పటికే ఆ అమ్మాయి నా ఒళ్ళో వుంది తినేసేట్టు

చూస్తూ.

"దేవుడా నాకు నిగ్రహం ప్రసాదించు" అనుకున్నాను కళ్ళు మూసుకుని, నా పెదవుల మీద తియ్యటి మరో జత.

గోవింద. నా బ్రహ్మచర్యం నేటితో సరి. నా చేతులు రెండిటినీ తన భుజాల మీద వేసుకుని "కళ్ళు తెరవండి మాస్టారూ" అంది నా తలను కొంచెం వంచి.

లోనెక్ లోయల లోతుల్లో నా చూపులు చిక్కుపడి నా మస్తిష్కం స్తంభించి....నేనేం చెయ్యబోతున్నాను?

హఠాత్తుగా నన్ను వదిలించుకుందామె.

"ఒక్క క్షణం ఇపుడేవస్తాను, మంచినీళ్ళు తాగి, "అని నా సమాధానం కోసం చూడకుండా అరటి తోటల్లో కనిపించే పాక దగ్గరికి పరుగెత్తింది.

సాయం సంధ్య నిశీధి కౌగిట్లోకి మెల్లిగా ఒదిగిపోతోంది. అరుణ వర్ణంతో కృష్ణ కిలకిలా నవ్వుతోంది. ఎదురు చూస్తున్న నా చూపులు చీకటిలో ఓడిపోయాక గాని నాకు గుర్తు రాలేదు. ఆ అమ్మాయి వెళ్ళి చాలా సేపయిందని, మెల్లగా లేచి పాకవైపు నడిచాను. అక్కడ నరసంచారమే లేదు, పాడుబడిపోయి వుందది. నాకు కంగారెక్కువైంది, ఏం చెయ్యాలో తోచలేదు. మరి కాస్సేపు అక్కడే అటూ, యిటూ వెదికి అదురుతున్న గుండెలతో యింటికి చేరుకున్నాను. ఆ అమ్మాయి పిచ్చిదా! నన్ను ఫూల్‌ని చెయ్యడానికి ట్రై చేసిందా, కనీసం ఈ రోజు ఏప్రిల్ ఫస్టయినా కాదే.

తలుపు తెరిచిన నేను అవాక్కైపోయాను. సోఫాలో మామయ్య ఒళ్లో యెవరో ఓ అమ్మాయి, నన్ను చూడగానే కంగారుపడి, చీర సర్దుకుంటూ అటు తిరిగి నిలబడింది. మామయ్య ఎక్స్‌ప్రెషన్స్ అనిర్వచనీయం.

"అయాం సారీ" అని తలుపు మూసి తిరిగి వచ్చేశాను, సెకండ్ షో చూసి ఎప్పటికో ఇంటికి చేరుకున్నాను.

మూడు రోజుల తర్వాత కాలేజీ కాంటీన్‌లో కాఫీ తాగుతున్నాం నేనూ, దీపా. ఈ రెండు రోజులూ నామనసు మనసులో లేదు, ఆ మినీ స్కర్ట్ అమ్మాయి కనబడ్డం లేదు, క్లాసులో ఎవర్నైనా, ఏమని అడగను. మేము లేవబోతుండగా ఓ స్టూడెంట్ మా దగ్గరికొచ్చి దీపకు ఏదో కవరిచ్చి వెళ్ళిపోయాడు. మగవాళ్ళ ఏకపత్నీ వ్రతం గురించి ఏకధాటిగా ఇస్తున్న ఉపన్యాసం ఆపేసి వాణ్ణి అనుమానంగా చూశాను. నా క్లాసులో సిగరెట్ కాల్చింది వాడే, వీడికి దీపతో ఏం పని?

"ఏమిటది" అంటూ ఆసక్తిగా ముందుకు వంగిన నా మొహం మీద ఆ కవర్ విసిరి కొట్టి గబగబా వెళ్ళిపోయిందామె. కింద పడిన ఫొటోలు తీసి చూస్తున్న నాకు

మతిపోయింది మినీస్కర్ట్ పిల్ల వర్షం రాత్రి నా గుమ్మం దగ్గర నిలబడ్డం దగ్గర్నుంచీ కృష్ణానది ఒడ్డున నన్ను తన గుండెలకు హత్తుకునే వరకూ చాలా క్లియర్‌గా, ఫర్‌ఫెక్ట్‌గా వచ్చాయి ఫొటోలు. ఎవడు తీశాడోగానీ మంచి ఫొటోగ్రాఫర్. ఫొటోగ్రాఫర్‌ని తర్వాత పొగుడుదువుగాని ముందు దీప సంగతి ఆలోచించు' అంది మెదడు.

నీరసంగా కుర్చీలో కూలబడ్డాను. ఇన్ని తెలివితేటలు స్టూడెంట్లకెలా వస్తాయి. వీటిలో యెన్నోవంతు చదువులో చూపించినా డిస్టింక్షన్ వస్తుందే!

ఇప్పుడు దీపనెలా నమ్మించడం?

భయపడుతూనే వాళ్ళింటికి వెళ్ళాను. నన్ను రక్కింది, పీకింది, ఫర్నిచర్ విరగొట్టింది, గ్లాసులూ, ప్లేట్లూ గాల్లో నాట్యమాడాయి కాసేపు. ఇంకో నిముషం అక్కడుంటే కాళ్ళు విరగ్గొడతా నంది. ఆమె శక్తి మీద నాకేమాత్రం అనుమానం లేదు గనక నోరు మూసుకుని బయటపడ్డాను. బజార్నుంచీ వస్తూ వాళ్ళమ్మగారు కనిపించింది.

"అప్పుడే వెళ్ళిపోతున్నారేం బాబూ" అంటూ.

బలుసాకు తినడానికి అందామని నోటిదాకా వచ్చి "అబ్బే ఏం లేదండి...చిన్న పని వుంది" అని తప్పించుకుని వచ్చేశాను.

*** *** ***

క్లాస్ రూం నిశ్శబ్దంగా ఉంది. నా గొంతు కంచుగంటలాగా నాకే ముచ్చటగా వినిపిస్తోంది. అందరూ చెవులప్పగించి వింటున్నారు. ఒక్క వాక్యం మిస్సయితే ఓ రత్నాన్ని పోగొట్టుకున్నట్టే అన్నంత జాగ్రత్తతో ఎవరూ ఈలలు వేయడం లేదు, కోతి పనులు చెయ్యడం లేదు వెకిలిగా ప్రవర్తించడం లేదు, ఎదురు తిరిగి తలపొగరు సమాధానాలివ్వడం లేదు, ప్రశ్నలు వెయ్యడం లేదు.

నిశ్చలంగా వున్న నీటిని కోసుకుని దూసుకుని వెళ్తున్న కత్తి పడవలా చురుగ్గా సాగుతోంది పాఠం.

సముద్రంలోకి ఓడకన్నా కాలువలో పడవ క్షేమం, మునిగే అవకాశాలు తక్కువ.


అవునుమరి. ఇది పీడకలలలాంటి నా మూడు నెలల కాలేజీ ఉద్యోగం కాదు.

నా పల్లెటూళ్ళో, పాతబళ్ళో వెనకటి బడిపంతులు జీవితం.

క్లాస్ రూంలోనూ, బయటా బండరాళ్ళెంత అందంగా వున్నాయి.

("టేకిట్ ఈజీ ప్రొఫెసర్" అనే ఇటాలియన్ చిత్రం ఆధారంగా)

* * *



ది రింగ్

వేములపల్లి
మోహనరావు

లండన్ హీత్రూ ఎయిర్‌పోర్టులో జంబో దిగగానే నాకు మొదట కనిపించిన వ్యక్తి మహారాణి. నన్ను చూడగానే ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ఎంతో ఆప్యాయతతో నా కుడిచెయ్యి నొక్కుతూ అంది, 'వాటే ప్లజంట్ సర్‌ప్రైజ్, ఇది పారిస్ ఫ్లైటనుకుంటాను. ఇండియా నుండి కాదా మీరు రావడం?'

'లేదు, వారమైంది పారిస్ వచ్చి, నిన్ననే పని పూర్తయింది. ఈ రోజు ఇక్కడ ఓ ప్రైవేటు ఫరమ్‌తో అగ్రిమెంట్స్ సైన్ చేయించాలి. మళ్ళీ ఎల్లుండి రాత్రికల్లా మిలాన్‌లో ఉండాలి' అన్నాను.

ఇంతలో నన్ను చూసి కెర్నీ రిచర్డ్ ముందుకు వచ్చాడు. అతను అక్కడ కస్టమ్స్‌లో పనిచేస్తున్నాడు. నాకు క్లోజ్ ఫ్రెండ్. అతనుంటే నాకు హోటల్ రిజర్వేషన్‌తో సహా అన్ని ఏర్పాట్లూ తనే చేసిపెడతాడు. అందుకే అతను డ్యూటీలో ఉండే సమయాల్లోనే ప్రయాణం పెట్టుకుంటాను నేను.

ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయి ఎయిర్‌పోర్ట్ బయటకు వచ్చేసరికి టైమ్ ఏడయింది. దీపాల ప్రవాహాల్లా కార్లు, ఆ దీపాల వెలుగుపడి తళతళ ప్రతిఫలించే రోడ్లు.

'కారుందా, టాక్సీలో వెళ్దామా' అన్నాను.

'ఇంకా నయం, ఈ మహానగరంలో కారు లేకుండానా!' నవ్వింది మహారాణి. అదే నవ్వు. రాజ్యాలను సైతం జయించి ప్రజల్ని మంత్రముగ్ధుల్ని చెయ్యగలిగే నవ్వు. ఇన్ని సంవత్సరాల్లోనూ ఆమె ఏమీ మారలేదు. క్షణం పాటు ఆమెనే తదేకంగా చూస్తూండిపోయాను. కించిత్తు సిగ్గుపడిందామె. బట్టలు విప్పుకుని విచ్చలవిడిగా స్త్రీలు మగవాళ్లతో రాసుకుతిరిగే ఈ నగరంలో ఎర్రబడిన బుగ్గలూ, కొంచెం వాలిన కళ్ళూ నాకెంతో రిలీఫ్‌నిచ్చాయి.

అంత రద్దీరోడ్లలోనూ సిగ్నల్స్ జాగ్రత్తగా గమనిస్తూ నేర్పుగా డ్రైవ్ చేస్తున్నదామె. ఎర్రటి బుల్లి వోక్స్ వాగన్ కారు. కొంచెం చలిగా ఉన్నట్లనిపించి హీటర్ ఆన్‌చేశాను. కొద్దిక్షణాల్లోనే కారంతా వెచ్చగా అయిపోయింది.

'అవునూ! ఇంతకీ నువ్వు ఎయిర్‌పోర్ట్‌కెందుకొచ్చినట్టు?' అన్నాను.

'నీకోసమే' అంది తను కొద్దిగా పెదవులు బిగబట్టి వస్తున్న నవ్వును ఆపుకుంటూ.

'థాంక్స్! ట్రై ఎనదర్ కాజ్' అన్నాను.

'మా దూరపు బంధువొకాయన ఇక్కడికి విజిట్ కొస్తున్నట్టు కేబుల్ వచ్చింది నాలుగురోజుల క్రితం ఆయన్ని రిసీవ్ చేసుకుందామని!'

'మరి ఆ విమానం రాకముందే వచ్చేస్తున్నావే!' అన్నాను కొద్దిగా కంగారుగా.

'లెట్ హిమ్ గో టు హెల్, హీ ఈజ్ నాట్ సో ఇంపార్టెంట్.'

అంతే. మహారాణీలు మనుషుల్నే కాదు, వేటినీ లెక్కచెయ్యరు. కాసేపాగి అడిగాను. 'ఇంతకీ నువ్విక్కడేం చేస్తున్నట్టు?'

'యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైకాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను' అప్పుడు చూశాను ఆమె జుత్తులో కనపడీ కనపడని ఒకటి రెండు వెండి తీగల్ని. అప్పటివరకూ ఆమె నా కళ్ళకు విజయవాడలో మేరీస్టెల్లాకు ఠీవిగా, దర్పంగా ఒక చేత్తో పుస్తకాల్ని గుండె కదుముకుని మరో చేతిని నిర్లక్ష్యంగా ఊపుకుంటూ నడిచి వెళ్ళే పదిహేడేళ్ల పరికిణీ, ఓణీల అమ్మాయిలాగే కనిపించింది.

మా పరిచయమే చాలా విచిత్రం. తను బస్ ఎక్కబోయే సమయంలోనే నేనూ బస్ దిగేవాణ్ణి. మొదటి రెండు రోజులూ నన్నసలు చూడకపోయినా మూడో రోజునుండి నన్ను గమనిస్తోందని కనిపెట్టాను. ఆమెతోపాటు మరో ఇద్దరుండేవారు చెలికత్తెల్లాగ. నేను ఒంటరిగాణ్ణి. చేతిలో పెన్నుమాత్రం ఉండేది. నా పుస్తకాలు కాలేజీలోనే ఉండేవి. రెండు సంవత్సరాలు అనుభవం ఉందేమో, పిల్లలకు పాఠాలు చెప్పడానికి నేను ఇంటిదగ్గర ప్రిపేరయ్యేవాణ్ణికాదు. అందుకే పుస్తకాలు ఇంటికి తీసుకువచ్చేవాణ్ణికాదు.

ఒకవారం తర్వాత వాళ్లల్లో వాళ్ళు నవ్వుకోవడం, నన్ను చూసి గుసగుసలాడటం మొదలుపెట్టారు. అందమైన ఆడపిల్లలు ఏంచేసినా లైట్‌గా తీసుకునే మనస్తత్వం నాది. ఆ రోజుల్లో మైసూరు నుండి మా మామయ్య పంపిన గంధం సెంటు రాసుకునేవాణ్ణి. ఒకరోజు నాకు వినపడేలా అంది.

'ఈ అబ్బాయి ఏం సెంటు రాసుకుంటాడో మనక్కూడా కొంచెం తెలిస్తే బాగుండును లతా!'

వెంటనే అన్నాను నేను. 'అది సెంటు కాదు పాపా! అందమైన బ్రహ్మచారుల శరీర సుగంధం!' తెల్లబోయి చూస్తున్న వాళ్లను వదిలేసి ముందుకు సాగాను. తర్వాత ఒకరోజు నన్ను రోడ్డుమీద నిలబెట్టేసింది.

'ముందీ సంగతి చెప్పండి, మీరు లెక్చరరా!'

'ఏం అయితే' అన్నాను మెల్లగా నవ్వుతూ.

'అయ్యో! ఇంకా మేం ఎవరో రోడ్‌సైడ్ రోమియోలే, పుస్తకాలు లేకుండా కాలేజీకి వెళ్లే షోకిల్లా అనుకున్నాం మాస్టారూ. క్షమించండి' అంది.

'అరే, దేనికీ?' అన్నాను నేను.

'అయితే మీరు రోజూ మేం చేసే కామెంట్లు వినడంలేదా?'

'ఏం కామెంట్లు?' అన్నాను నేను కొంచెం సీరియస్‌గా.

అంతే, పరిగెత్తిందా అమ్మాయి.

ఇంకోరోజు 'ఈరోజు నా బర్త్‌డే, సాయంత్రం మనోరమలో పార్టీ ఇస్తున్నాను. తప్పకుండా రండి. అప్పటిదాకా ఈ టాఫీ తినండి.'

మా సంభాషణంతా రోడ్డుమీదే సాగినా కించిత్తు కూడా భయపడేది కాదామె ఎవరైనా చూస్తారేమోననీ, ఏమైనా అనుకుంటారేమోననీ నేనే కొంచెం వెనకాడేవాణ్ణి.

ఆ సాయంత్రం మంచి ప్రజంటేషన్ పట్టుకుని పార్టీకి హాజరయ్యాను. చాలా గర్వంగా నన్ను తన ఫ్రెండ్స్‌కు పరిచయం చేసుకుంది.

ఆ రాత్రి వీడ్కోలు తీసుకుంటూ 'వెళ్ళొస్తాను మహారాణీ' అన్నాను.

'అదేమిటి? నా పేరు శారద'

'కానీ నాకు మాత్రం మహారాణీవే. నీ ఠీవీ, నీ హుందా మహారాణుల్లో తప్ప కనిపించవు! వెళ్లబోయేముందు ఆ వెన్నెల్లో, ఆమె కళ్లల్లో మెరిసిన ఆరాధనాపూర్వకమైన మెరుపును మనసులో దాచుకుని కదిలాను.

ఆ సంవత్సరమే నేను ఉద్యోగరీత్యా ఇంకో ఊరికి బదిలీ కావడంతో ఆమెను తర్వాత చూడలేదు. పధ్నాలుగేళ్ల తర్వాత మళ్ళీ ఇలా...

'ఎక్కడుంటున్నావ్?' అన్నాను టైనాట్ వదులు చేసుకుంటూ.

'ఫైవ్‌బై ఫోర్టీన్, నెల్సన్ ఎవెన్యూ, ఓల్డ్ బాండ్ స్ట్రీట్, యార్డ్‌లీకి దగ్గర్లో' అంది

'అందుకే నన్నమాట ఈ పరిమళపు ఉధృతాలు' అన్నాను.

'కాదులే. అందమైన బ్రహ్మచారిణుల శరీర సుగంధం అది.'

ఇద్దరం మనసారా నవ్వుకున్నాం. ఆ కొద్దినిముషాల్లోనే నా కాంట్రాక్టులూ, టాక్సులూ, లైసెన్సులూ అన్నీ మరిపించేసి మరో లోకంలోకి, మమతలున్న, ప్రేమలున్న లోకంలోకి తీసుకెళ్ళిందామె.

'నాకు రూం రిచ్‌మండ్ హోటల్లో బుక్ అయింది నన్నక్కడ దింపెయ్యి. తర్వాత కలుస్తాను' అన్నాను. తీక్షణంగా చూసిందామె నావైపు. నేనింకో మాట మాట్లాడటానికి జంకాను. సీజరైనా, క్లియో అలా చేస్తే మాట్లాడలేడేమో.

మరి కాసేపటికి ఆమె ఫ్లాట్లో ఉన్నాం ఇద్దరం. టీవి ఆన్ చేసి విండో కర్టెన్స్ పక్కకు లాగి లోపలికెళ్ళిందామె. ఆ ఐశ్వర్యం, అలంకారాలూ నాకేం కొత్త కాకపోయినా మహారాణి ప్రత్యేకత ఆ రూంలో నా చూపుల్ని కట్టేసింది.

'ఏం తీసుకుందాం' అందామె ఫ్రిడ్జ్ తెరుస్తూ.

'జస్ట్ షాంపేన్' అన్నాన్నేను.

ఇద్దరం ఆ షాంపేన్ సిప్ చేస్తూ టీవీ చూశాం కాసేపు. అలా చూడటమనేది మా మనసుల్లో ఎగిసిపడే తరంగాల ఘోషలను దాచుకోవడానికేనని మా ఇద్దరికీ తెలుసు.

కిటికీ దగ్గర నిలబడి కిందికి చూస్తూ ఎన్నో బారుకారులు, కారులబారులు. రెండు నిమిషాల తర్వాత అన్నాను నేను, కోటు చేతిలోకి తీసుకుంటూ, 'వెల్, మళ్ళీ ఎప్పుడైనా కలుద్దాం!'

నా భుజం మీద చెయ్యివేసి సోఫాలోకి తోసింది. నా పక్కనే కూర్చుని నా మొహంలోకి చూస్తూ అంది 'మీ కర్థంకాదు రాజా, ఆ రోజుల్లో మిమ్మల్నెంత అభిమానించేదాన్ని? చివరకు వెళ్ళిపోయేటప్పుడు మాటమాత్రమైనా చెప్పలేదు మీరు. నేనెంత వేదన అనుభవించానో ఆ దేవుడికే తెలియాలి.'

గ్లాస్‌లో మిగిలిన ద్రవాన్ని మింగేసి ఆమె చేతుల్లో చిక్కుకున్న నా చేతిని, ఆమె చూపుల్లో చిక్కుకున్న మనసునూ విడిపించుకోబోయాను. మరింత గట్టిగా పట్టుకుందామె.

'అరెరె! నీ ఉంగరం గుచ్చుకుంటోంది వదులు' అన్నాను. చెయ్యి వదిలేసింది. అప్పుడు చూశాను ఆ ఉంగరాన్ని. స్వతహాగా పెద్ద నటుణ్ణేమో, నాలోని భావాన్ని నిరంకుశంగా అణగదొక్కి పైకి మామూలుగా ఉండగలిగాను. లేకపోతే.....

పదేళ్ళ క్రితం ధవళేశ్వరం దగ్గర గోదావరి ఒడ్డున పరిగెత్తి, పరిగెత్తి అలిసిపోయి నా ఒళ్ళో తలపెట్టుకుని ఆయాసంతో ఎగిసిపడుతున్న గుండెల మీద చెయ్యి వేసుకుని, నా కళ్ళల్లో కళ్ళు కలిపి వాటితోని మత్తునంతా నా మనసులోకి జొప్పిస్తున్న రమను గట్టిగా హత్తుకుని ఆమె చేతికి నేను తొడిగిన ఆ పచ్చరాళ్ళ ఉంగరం, హృదయం ఆకారంలో రావాలని చేయించుకుని ప్రాణంగా చూసుకుంటూ, తనుమాత్రం నా ప్రాణంకాదా అనే ఉద్దేశ్యంతో రమ మధ్య వేలికి తొడిగిన ఆ ఉంగరం, ఆ తర్వాత నాకు దొరికిన ఆ ఎర్రటి పెదవుల సుధారసం అన్నీ ఒక్కుమ్మడిగా గుర్తొచ్చి గుండెను పట్టి కుదిపినప్పుడు, ఏమీ ఎరగనట్టు 'ఉంగరం బావుంది, ఎక్కడకొన్నావ్!' అని అడగడం ఇంకొకడివల్ల అయ్యేపనేనా!'

'చాలా పెద్ద కథ రాజా! రమ అనుకుంటాను ఆ అమ్మాయి పేరు. ఆమెదీ ఉంగరం, మా కజిన్ ఒకతనున్నాడు రాజేష్ అని, మంచి ఆస్తిపరుడు. ఇద్దరూ కలిసి తిరిగారు చాలా రోజులు. తర్వాత ఏదో ఏక్సిడెంట్‌లో ఆ అమ్మాయి చచ్చిపోయింది. ఆమె గుర్తుగా అతనికా ఉంగరం మిగిలిపోయింది. నాలుగేళ్ళ క్రితం నేను ఇండియా వెళ్ళినప్పుడు నన్నతనికి ప్రపోజ్ చేశారు. కానీ అతను ఒప్పుకోలేదు. నాకు అతను చెప్పిన కారణం ఒక్కటే. రమను తను మర్చిపోలేకపోతున్నాడు. నన్ను పెళ్ళి చేసుకుంటే అది నాకూ, రమకూ చేసిన ద్రోహమే అవుతుందన్నాడు. నాతో మాట్లాడుతున్నంతసేపూ ఈ ఉంగరాన్నే చూశాడు. అది అతని ప్రాణం, దీన్ని చూస్తూనే అతను పిచ్చివాడైపోతున్నాడట. ఆ ఉంగరం నాకిచ్చెయ్యమన్నాను. మొదట ఇవ్వనన్నాడు. తర్వాత ఓ విధంగా బలవంతంచేసి నేనే లాక్కున్నాను. ఈ ఉంగరాన్ని అప్పట్నుంచీ ఇది నా

దగ్గరే ఉంది. విచిత్రమేమిటో తెలుసా ఇది నా దగ్గర కొచ్చింతర్వాత రాజేష్ మామూలు మనిషయ్యాడట. నేనేమో పిచ్చిదాన్నైపోయాను' దీర్ఘంగా నిట్టూర్చిందామె.

రమ చనిపోయిన సంగతి కానీ, ఆ రాజేష్ సంగతి కానీ నాకింత వరకూ తెలియదు. ఇన్నేళ్ళ తర్వాత మళ్ళీ వాళ్ళను గురించి ఆలోచించి మనసు పాడుచేసుకుని ఈ సైకాలజీ ప్రొఫెసర్ సానుభూతిని పొందే దీనస్థితిలో లేనిప్పుడు నేను.

'నాకింకో గంటలో ఓ అపాయింట్‌మెంటుంది, వెళ్తాన్నేను' అన్నాను వాచీ చూసుకుంటూ.

'నో ఫియర్స్. నువ్వీ రాత్రికి ఇక్కడ ఉండాల్సిందే' లోపల్నుండి రూం లాక్ చేసేసి తాళాన్ని జాకెట్లో వేసేసుకుందామె.

'నీకు తెలీదు రాణీ, వయసైతే వచ్చిందిగానీ కోరికలు మాత్రం కుర్రవే నాకింకా. నేను చాల బలహీనుణ్ణి' అన్నాను.

'ఫర్వాలేదు. కొందరి బలహీనత, మరికొందరికి ఆనందదాయకం కావచ్చుగా!' కొంటెగా నవ్విందామె. నా ఒళ్లు పులకరించింది.

భోజనాలు పూర్తిచేశాం.

'నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదు?' సూటిగా అడిగాను.

'డియర్ రాజా, జీవితంలో ఎన్నో అనుకుంటాం, నన్ను ఉదాహరణగా తీసుకోండి, మా వాళ్ళందర్నీ పైకి తీసుకురావాలని చిన్నప్పటినుండీ ఎన్నో కలలు కన్నాను. ఆ కలలన్నీ నిజం చేసుకుని అందర్నీ ఉన్నతమైన స్థానాల్లోనే కూర్చోబెట్టగలిగాను. ఆఖరికి నన్ను నేను చూసుకునేసరికి మూడు పదుల వయసూ, ఒంటరి జీవితం నన్ను చూసి వెక్కిరించాయి. ఒకప్పుడు నేను పెళ్ళి వద్దన్నాను.

ఇప్పుడు పెళ్ళే నన్ను వద్దంటోంది. నేనెవర్నీ అర్థించను, అటువంటి అలవాటు నాకు లేదు, నిన్ను సూటిగా అడుగుతున్నాను, ఈ ఉంగరాన్ని, ఉంగరం ఉన్న చేతినీ నువ్వు స్వీకరించగలవా'

మళ్ళీ అదే దర్పం, అదే ఠీవి, మగవాణ్ణి శాసించే అందమైన అహం.

'నాకు పెళ్ళయింది రాణీ, ఇద్దరు పిల్లలు కూడా.'

విరగబడి నవ్వింది మహారాణి

'సిల్లీఫూల్, నీకు పెళ్ళికాకుండా నువ్వింత కాలం బ్రహ్మచారిగా ఉన్నావనీ, నాకోసం నిరీక్షిస్తున్నావనీ నేననుకున్నానా! ఐ డోంట్ వాంట్ యువర్ ఎంటైర్ లైఫ్. నీ జీవితంలో కొన్ని గంటలు నాకోసం వెచ్చించు. నా ఒంటరితనాన్ని తాత్కాలికంగానైనా దూరం చెయ్యి. ఒక లక్ష్యాన్ని నాకు ఏర్పాటు చెయ్యి. నాకోసం వచ్చే మనిషి, నేనంటే

అభిమానించే వ్యక్తి ఒకడున్నాడనే భావన, ఆత్మతృప్తి నాకు కలిగించు, దట్సాల్.' ఆ కళ్ళల్లో ఆరాధన అర్థంకాని, అంతంలేని భావలహరి, నా చేతిని మౌనంగా ముందుకు చాచాను. ఉంగరాన్ని నా చిటికెనవేలికి తొడిగి దాన్ని ముద్దుపెట్టుకుందామె.

నేను పీయూసి చదివేటప్పుడు మా ఫ్రెండ్ ఒకడు నా ఆటోగ్రాఫ్ పుస్తకంలో రాశాడు. 'రింగ్ ఈజ్ రౌండ్, ఉచ్ హేజ్ నో ఎండ్, సచ్ ఈజ్ లవ్' మహారాణీని రెండు చేతుల్తోనూ దగ్గరకు తీసుకున్నాను. అదే సౌకుమార్యం, అదే లాలిత్యం, సుతిమెత్తని పట్టులాంటి శరీరం, మనసును మత్తెక్కించే సౌరభం, మహారాణీలు వాడే సుగంధ ద్రవ్యాలు వెలువరించే సువాసన.

వెల్, ఆ తర్వాత మీకనవసరం.

*   *   *



సంధి

–వేములపల్లి మోహనరావు – పి.వి.కృష్ణారావు

చివరిసారి గట్టిగా పీల్చి సిగరెట్ పారేశాను. ఊపిరితిత్తుల్లోనుంచి రక్తంలోకి పాకి విషంతో శరీరాన్ని ఉత్తేజం చేసి బలైపోయిన సిగరెట్ తాలూకు దట్టమైన పొగ, యదార్థమైన వర్తమానం నుండి తిరోగమించి, ముడుచుకుని, జీవన వాంఛ నోట్లో పెదాల మీద సుళ్లు తిరుగుతోందా?

మస్తిష్కపు మడతలో యిమిడిన ప్రచండ ఘోషలు, పరిష్కారంలేని సంఘర్షణలు, మనిషిని జయిస్తే ఇలా స్వల్ప సుఖాలే శరణ్యాలవుతాయా! దేనికిట్లా పొగతో తరచు గుండెను తగలేసుకోవడం! తాత్కాలికమే అయినా, నాకు ఉత్సాహాన్ని కలిగించిన ఆ సిగరెట్‌ను కృతజ్ఞతారహితంగా కిందపడేసి ఆ ఎరుపు నేలపై నీడలో నలుపయ్యే వరకూ చూసి దాని పీకనొక్కాను. కేవలం మనిషికి మాత్రమే చేతనైన చర్య.

ప్రమాదానికి సంకేతమైన ఈ రంగు బస్సుల్లో ప్రయాణిస్తూ మళ్ళీ గాయాన్ని రేపుకోవడానికా నేను బయలుదేరింది! కాదు, కాకూడదు. కనీసం ఈ ఒక్క సారికి, తన హస్పిటల్ ఓపెనింగ్‌కు తానాహ్వానించిన ఎందరో గొప్పవాళ్ళ కంటే నా ప్రెజెన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందనీ, నేను రాకపోతే అది తీరని వెలితి అనీ రామం వ్రాసిన అక్షరాల వెనుక అతని హృదయం ప్రతిబింబించి అందులో అదివరకు నేనంటే తనకున్న అభిమానం, హీరో వర్షిప్ చెక్కుచెదరకుండా వుండటం చూసి ముగ్ధుణ్ణై, ఎన్నడూ అర్థంకాని నన్ను నేను మరీ మరీ శోధించుకుని, అతని ఔన్నత్యానికీ, నా స్థితికీ మధ్య ఉన్న అంతరాన్ని అసూయతో నింపుకోవటం లేదని ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకుని మరీ బయల్దేరాను. అణు ధూమమైన నాగతం, నన్ననుసరిస్తూ ఛాయలా వర్తమానం మీదనుంచీ భవిష్యత్తులోకి కమ్ముకుంటూ, చదివిన పుస్తకాలూ సంపాదించుకున్న భావసంపదా ఆధ్యాత్మీకరణకు అందక వక్రీకరిస్తే గతం తాలుకు నీలినీడలు క్షమార్హుణ్ణి చేస్తాయా! అయినా....ఎవరు నన్ను క్షమించాలి. నా ఈ పరిస్థితికి, లక్ష్యం లేని నా అన్వేషణకు అంతంలేని ఈ అర్థరహిత ప్రయాణాలకు కారణం ఎవరు? కారణం ఎవరైనా అనుభవిస్తున్నది నేను. క్షమించుకోవలసిందీ నన్ను నేనే.

మళ్ళీ రాజ్యలక్ష్మి జ్ఞాపకాలు, వాటితో ముడిపడ్డ ఫాంటసీలు, చైతన్య ప్రవంతి ఒడ్డుల్ని ఒరుసుకొని ఉధృతంగా ప్రవహిస్తుంటే వర్తమానం మీదకు మళ్ళని దృష్టి గతాన్ని తరుస్తోంది. రాజ్యలక్ష్మి.....రాజ్యలక్ష్మి...నేను ప్రతీకారం తీర్చుకుంటాను. నా జీవితానికి పెద్ద అవరోధం అయ్యావు. నా ఆశలకూ ఆశయాలకూ అడ్డు నిలిచావు. దూకే సెలయేరును మళ్ళీ పైకిలేవకుండా పాతాళంలోకి తొక్కేసావు. నీ మూలంగా నేను కాలేజీనుంచి డిస్మిస్ కాకపోతే పెద్ద ఆఫీసర్ని.....కనీసం పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ని అయివుండేవాణ్ణి. పోనీ అవేవీ అక్కర్లేదు. గతంచేత ఇలా వేటాడబడేవాణ్ణి కాను, అది చాలదూ!

హద్దులేని ఆలోచనలు మనిషిని ప్రలోభ పెడతాయి. ఒకరకమైన, సంయమన రహితమైన అంతరంగంతో, బ్రతుకులో గెలుపుకూడా ఓటమిలా భావిస్తూ సాగిపోతున్న నా ఆలోచనా పరంపరలో ఒకే ఒక్క సబ్జెక్ట్....రాజ్యలక్ష్మి. నా బ్రతుకులో ప్రతి మెలికకూ రాజ్యలక్ష్మే కారణం అనుకోవడానికి అలవాటుపడిపోతున్నావా! తన ఆశక్తతలకూ, తప్పులకూ, పరాజయాలకూ కారణాలు వెతుక్కోకపోతే తనను తాను డిఫెండ్

చేసుకోలేకపోతే ప్రతి మనిషికీ ఈ ప్రపంచం ఓ పెద్ద లూనటిక్ ఎసైలంలా గోచరిస్తుంది. నిజానికి ఏదో పీడకలలో నుండి ఒక్కసారిగా మేలుకుని, బాహ్యా జగత్తుకు భిన్నంగా నేను తచ్చాడుతూ నడవడానికి కారణం తను కాదూ.

తాడూ, బొంగరం ఉండీ, ఇంటికీ హైద్రాబాదుకీ అనవసరంగా తిరిగే నేను, నా ఫ్రస్ట్రేషన్‌కీ, వానిటీ, స్త్రీత్వం, డబ్బును విడిచిపెట్టలేని అహం మూర్తీభవించిన రాజ్యలక్ష్మిని తప్ప వేరే కారణాన్ని వెదుక్కోలేను. ఒప్పుకోలేను. కాలేజీనుంచీ ఆడవాళ్ళంటే ఓ రకమైన రివెంజ్ మనస్తత్వం నా కలవాటు కావడానికి కారణం తనే.

ఎలక్ట్రిక్ దీపాలు, తిరిగే మనుష్యులూ, బస్సులూ చీకటిని తరిమి కొట్టడానికి ప్రయత్నిస్తున్నా, నీడల్లోనూ, వెలుగుల పైనా, శబ్దాల అస్పష్టతలో అంధకారం రాజ్యం చేస్తూనే ఉంది.

'ఎక్స్‌క్యూజ్‌మీ, కాస్త తప్పుకోండి.' స్త్రీ గొంతు.

కాళ్ళు వెనక్కు లాక్కుంటూ ఆమె వైపు చూశాను. నా పక్కనే కూర్చుంది. క్షణంలో అవగతమై జీవితాంతం గుర్తుండే సౌందర్యం. ఆడవాళ్ళంటే అసహ్యం నాకు. అందమంటే కాదు.

నా సిగరెట్ పొగ బాలే నర్తకిలా మొగ్గలేసి పాతబడి, పల్చబడి, తీగలా సాగి, ఆవిడ మొహం మీదనుంచీ విండోదాటి గాలిలోకి....మసక వెలుతురులోకి వ్యాపించి అస్థిత్వాన్ని కోల్పోతోంది.

'సారీ, మీకేమైనా అభ్యంతరమా' సిగరెట్ ఆర్పడానికి ప్రయత్నిస్తూ అన్నాను.

"ఫరవాలేదండీ, మా వారు కాలుస్తారు" అందామె చిన్నగా నవ్వుతూ.

'పోనీ బస్ కదిలే వరకూ నేను ఆ పక్కన కూర్చుంటాను' అన్నాను కర్టెసీ చావక.

సీట్లు మారాము. ఈ సంఘటనతో నాకెంతో చొరవనిపించింది. మార్క్‌ట్వైన్ కథలోలా ఒకోసారి చిన్న చిన్న విషయాలే జీవనగతుల్ని మార్చేస్తాయి. తన భర్త కాలుస్తారు కాబట్టి నేను కాల్చినా ఫర్వాలేదా! మూమెంటరీగా నాలో ఆయన్ని చూసిందా!

చూపులు తడుముతున్నట్టై ఒక్క సారిగా తల తిప్పాను. ఆవిడ నావంకే చూస్తోంది. నా అంచనాల ప్రకారం, తరతరాలుగా రిఫ్లెక్స్‌లైపోయిన ఇన్‌హిబిషన్స్‌తో కంగారు నటిస్తూ ఆవిడ తల తిప్పుకోలేదు. పైగా నవ్వుతోంది.

'మిమ్మల్నెక్కడో చూశాను' అందామె చూపుల్ని మరికాస్త నొక్కుతూ, ఒక్కసారిగా రాజ్యలక్ష్మి జ్ఞాపకం, పోలికలు లేవుకదా! నిశితంగా చూశాను. బుచ్చిబాబు కలల్లో ప్రాణం పోసుకుని, చండీదాస్‌లో ఎదిగి వచ్చిన ఈ సౌందర్యపు ముద్దని నేనింతకు ముందు

ఎరుగుదునా! తను నన్నెరుగునా! నన్నోడి తన్నోడెనా! తన్నోడి నన్నోడెనా!.... ఆలోచనల్లోని ద్రౌపది మాటల్లోకి రాకపోవడం నా శానిటీకి నిదర్శనం. చూసుంటే, తెలిసుంటే మరిచిపోవడమే సరైన మందు.

'ఇట్లా చూడగానే వ్యక్తుల్నిగానీ, పరిసరాలనుగానీ అంతకుముందు చూసినట్టుగా అనుభూతి చెందడాన్ని 'డిజావు' అంటారు. నిజం చెప్పాలంటే ముందు నేనూ అట్లాగే అనుకున్నాను. ఏ సినిమా హాల్లోనో, బస్‌స్టాపులోనో చూసి ఉంటారు. లేదా ఇల్యూషన్ కావచ్చు'

నా అబద్ధాన్ని క్వాలిఫై చేసుకునే ప్రయత్నం అప్రయత్నంగానే చేశాను. నేనూ అట్లాగే అనుకున్నానవి అంటే ఆవిడ ఈజీగా ఫీలవుతుందనా!

'కాదు...ఏమో...గుర్తురావడం లేదు'

మనసు పొరల్లోంచి బయటపడటానికి ఒత్తిడి చాలని, మరువని, అనుకోలేని ఆ స్థితి నాకు అనుభవమే అయినా, నన్నెట్లా తెలిసుంటుందా అని ఆలోచనల్లోపడి మౌనం విసుగై.

'ఇప్పుడు ఎరుగుదుం కదా ఒకర్ని ఒకరం. అయినా డిజావుగా సరైన ఏ ఒక్క వివరణా లేదు. నిర్దిష్టంగా రూపుదిద్దుకోని ఆలోచనలు, ఊహలు, మానసిక ప్రతిమలు...' ఆమె అనుభూతికి సైకికల్ ఎక్స్‌ప్లనేషన్ ఇస్తూ డ్రైవర్ రాకతో ఆపాను.

బస్ కదిలింది. హాండ్‌బాగ్‌లోంచి ఏదో పుస్తకం తీసి చూస్తోందామె. అప్రయత్నంగా చూశాను, డాస్టోవస్కి, ఈడియట్ ఆ లేత రంగుల్లో ఓ మూల స్కెచ్‌పెన్ రాతలో ఇనీషియల్ తెలీని సీతాలక్ష్మి బి.ఎ. ఉలిక్కిపడ్డాను. రాజ్యలక్ష్మి....సీతాలక్ష్మి....ఈ సౌమ్యమా నాకు తెలిసింది? కాదు, ఈ పేరు విన్నానా! ఎక్కడ! ఎప్పుడు! పేరు పక్కన బి.ఎ.నన్ను వెక్కిరించింది. ఫైనల్ ఇయర్‌లో డిస్‌కంటిన్యూ కాకపోతే నేనూ అయ్యేవాణ్ణే బియ్యేనో, ఏమ్మెనో.

రాజ్యలక్ష్మి....నిన్నూ.....నిన్నూ......ఏంచేస్తే పాపముంది!

సైకాలజీ పుస్తకాల్లో క్రమబద్ధంగా ఇమడని మానవనైజపు యదార్థతలకు సారూప్యమైన ఆ పుస్తకం ఆమె చేతుల్లో కాసేపు పొరల్ని విచ్చుకుని మళ్ళీ మూసుకుంది.

చెయ్యి చాపాను. 'ఆ పుస్తకం ఇలా ఇవ్వండి!'

సౌందర్యం, నిమ్నోన్నతాల హృదయం అతికినట్టుగా, ఓ స్త్రీ, నీకు బుద్ధిసంపద అతకదు. ఆమె స్పర్శ తాలూకు జ్ఞాపకాల్ని ఈ పుస్తకం నెమరువేయదు. అయినా చిలిపి ఆలోచన....అంతర్యపు లోతులకు ప్రతీకలైన ఆ ఎత్తుగుండెల మీద ఆ పుస్తకం ఎన్ని రాత్రుళ్ళు నిద్రపోయిందో.

'మీరెందాకా వెళ్తున్నారు?'

'తణుకు'

'నేనూ అక్కడికే'

కాసేపు మౌనం, ఆలోచన లేని బ్లాంక్‌నెస్, బస్ శబ్దం, ఒక్కసారిగా పరిసరాల కాన్షస్‌నెస్. ఆమెకు దూరంగా చుట్టూ చీకటి, వర్తమానంలో కేంద్రీకృతమౌతున్న చైతన్యం.

'మీరేం చేస్తుంటారు? అర్థరహితంగా పెదాల్నించి ఉరికిన మాటలు.

'అది నేనడగవల్సిన ప్రశ్న' అందావె కొంచెంగా నవ్వుతూ, ముకుళించుకుంటున్న పెదాలు. ఆ నోరు ఏదో పేరు తెలీని అడవిపువ్వు. స్వచ్ఛత దాని పరిమళం. సంస్కారం దాని సొగసు, సహజత అస్థిత్వం.

'లెక్చరర్' అన్నాను, ఆమె బి.ఏ. అని తెలియకపోతే నిజం చెప్పేవాణ్ణా! చలి వేస్తున్నట్టుంది. చెవులమీదగా స్కార్ఫ్ కట్టుకుంది. ఎర్రటి బ్యాక్‌గ్రౌండ్‌లో ఆమె మొహం గెస్టాల్ట్.

'విండోగ్లాస్ వెయ్యమంటారా! అన్నట్టు మనం సీట్లు మార్చుకోనేలేదు!

'వద్దండీ, కొద్దిగా చలి చాలా బావుంటుంది.'

బస్ చేస్తున్న డిస్ట్రబెన్స్‌నుంచీ, విసుగ్గా వెలుగు పక్కలకు పడిపోతున్న చీకటి అందంగా ఉంది. మళ్ళీ సిగరెట్.

కొద్దిగా ఒళ్ళు చేసిన ఈ బాపు బొమ్మలో సృష్టిరహస్యాల్ని వెదుక్కునే ఆ అదృష్టవంతుడెవరు! మదమాత్సర్యాలు మచ్చుకైనా అగుపించని ఆ స్త్రీమూర్తి అవయవ సౌష్టవాన్ని అనాచ్ఛాదితంగా ఊహించడానికి నా ఇమేజరీ ఎందుకు సహకరించడంలేదు! రిలీఫ్‌తో కూడిన ఓ రకమైన ఉత్తేజం, ఆవిణ్ణి తాకాలనిపించింది. పుష్‌బాక్ సీట్లో రిలాక్స్ అయి కూర్చున్న ఆ స్త్రీ పట్ల నా ప్రెజుడిస్ ఇంటిమసీగా మారాలన్పించింది. ధైర్యం చాలదు. బయటకు చూస్తున్నాను, పుస్తకం మూసేసి.

మళ్ళీ నయనాల స్పర్శ.

'మిమ్మల్ని గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తున్నాను కొద్దిగా చిలిపితనం, మరింత హుందాతనం, మూర్తీభవించిన సిన్సియారిటీ నన్ను చొరవ తీసుకోనివ్వలేదు.

'నా పేరు మోహన్, ఎక్కడ చూసుంటారు?'

'మిమ్మల్ని బాగా ఎరుగుదును!'

'ఇంపాజిబుల్, పునర్జన్మను మీరు నమ్ముతారా పోనీ!'

'కొద్దిగా చదివాను. మావారికి చాలా ఇంట్రెస్ట్. అయినా ఈ జన్మలోనే మీరు నాకు తెలుసు. బస్ దిగేలోగా చెప్పేస్తానులెండి!'

ఈ ఆడవాళ్ళకు అస్తమానం భర్తని మాటల్లోకి తీసుకురావడం అలవాటా! భర్త జ్ఞాపకం భద్రతనిస్తుందా!

చెయ్యి అడ్డుపెట్టుకుని సున్నితంగా ఆవలించిందామె. మళ్ళీ అడవిపువ్వు అందం, రంగుల విచిత్ర సమ్మేళనం.

'నిద్రపోతారా! లైటు తీసేస్తాను.'

'వద్దు ఏమైనా మాట్లాడండి.'

'ఏం మాట్లాడను? నా ఎక్స్‌పెక్టేషన్స్‌కి అందటం లేదు మీరు. మీరే ఏదైనా చెప్పండి!'

'నా పట్ల మీ అభిప్రాయం ఏమిటి!'

'క్షమించండి. మన పరిచయం ఇంకా కొన్ని గంటలే. ఇప్పటికి తెలిసింది చెప్పమంటే చెబుతాను. ఎవరూ ఎవర్నీ పూర్తిగా తెలుసుకోలేరు. అది వేరే విషయం అనుకోండి!'

'చెప్పండి.' అందామె.

'మీరు యింటిని, బయట ప్రపంచాన్ని ఒకేలా చూస్తారు. బహుశా జీవితాన్ని మీరు ఎక్స్‌పెక్ట్ చేసినట్టుగానే చూస్తూ వచ్చాడు.'

'నన్ను అమాయకురాలు అంటారా.'

'కాదు అనుభవాలన్నీ అందమైనవి అవి మాత్రమే అన్నాను 'మీకు జీవితం రెండోవైపు తెలీదు.'

మనల్ని అమాయకులు అనుకోవడాన్ని ఎంజాయ్ చెయ్యాలంటే ఆ మాట మనం ఆరాధించే వ్యక్తులు, కనీసం ఉన్నతంగా భావించే వ్యక్తులు, ఆత్మీయత ఉన్న వాళ్ళు అనాలి.

'మీరు సైకాలజీ లెక్చరరా!'

'కాదు, కామర్స్.'

'బాగా మాట్లాడతారు!'

'ఇన్స్‌పిరేషన్ మీరే అంటే, ఏమీ అనుకోరుగా!'

కాస్త వెనకాడుతున్నట్టు భావ ప్రకటన. జవాబుగా చిన్న నవ్వు. ముఖస్తుతిని ఎంత నిరసించినా, అవి మన ఎప్రీసియేషన్ని ఏ మూలో పొంది తీరుతుంది.

జీవితంలోలా బస్ కుదుపులు, కాన్షస్‌నెస్‌లో కదిలిపోతున్న భావ స్రవంతిలో గతం మళ్ళీ మెదిలింది. రాజ్యలక్ష్మితో అల్లుకుని ఉన్న ఆ గతంలో నా పాత్ర పెద్దగా లేకపోయినా నా దురుసుతనం మూలంగా. ఆమె అభిజాత్యం, అహంకారం కారణాలుగా,

ఆమె తండ్రి కాలేజీ కమిటీ ఛైర్మన్ కావడం వల్ల కాలేజీ నాకు ఉద్వాసన చెప్పింది.

'ఏదో చెబుతూ మళ్ళీ ఆలోచనలో పడ్డారు'

నవ్వాను, ఆలోచనా స్రవంతికీ బాహ్య వర్తనకీ ఉన్న వైరుధ్యం ఎక్సిస్టెన్షియల్ హిపోక్రసీ.

'ఏం లేదు మనం ఒకర్ని ఒకరం, లేదా మీరు నన్ను ఎరిగి వుండటానికి గల పాజిబిలిటీస్ గురించి ఆలోచిస్తున్నాను. రోడ్డుమీద, సిటీబస్సుల్లో, సినిమా హాల్స్‌లో....ఇట్లా ఎక్కడో, ఎప్పుడో అంతే అనిపిస్తోంది.'

'లేదండీ, అయామ్ ష్యూర్, ఐకెన్ టెల్‌యూ ఎట్‌లీస్ట్ ఎట్ ది ఎండ్ ఆఫ్ అవర్ జర్నీ. ఓకే.'

దూరంగా చీకటిని కప్పుకున్న చెట్లు కన్పించీ కన్పించకుండా పరుగెడుతున్నాయి. దగ్గరగా బస్ హెడ్‌లైట్ల వెలుతుర్లో చెట్లు మేల్కొని పరుగెత్తుడం బావుంది. మెల్లగా నా చేతనా స్రవంతి పల్చనై ఏవో రూపాలు బయటపడుతున్నాయి. ఇమేజరీతో కలగాపులగం అయిన స్ట్రీమ్ ఆఫ్ థాట్‌లో అసోసియేషన్ పోతోంది. ఈ బస్ ప్రయాణంలో ఫోర్ గ్రౌండ్ అయిన ఈమె డీరెసిడ్యూ అయ్యి, నా మస్తిష్కపు పొరల్ని ఆవిష్కరించి నా కలల్లో ఈ రాత్రికి దర్శనమిస్తుందా! మెల్లిగా జారిపోతున్నాను, శరీరస్పృహనుంచి, ఉద్దీప్తమైన శబ్దాలనుంచి, నిశ్శబ్దంలోకి, నిద్రలోకి, ఎవరో స్త్రీమూర్తి నన్ను గాఢంగా కౌగిట్లోకి తీసుకుంటోంది. శరీరం సడలి, జీవితంలో వెలితినుంచీ ఏదో నిండుతనం లోకి జారిపోతున్నాను.

అస్పష్టంగా ఎవరిదో స్త్రీ గొంతు.

'నిద్రపోతున్నారా! లైటే తీసేస్తున్నాను.'

టప్‌మని వెలుతురు తొలగిన చప్పుడు. గాజుల సవ్వడి.

* * *

ఎక్కడో తెలీదు...బద్ధకంగా కూర్చున్నాను...క్రేన్...క్రేన్‌లో జారుతున్నాను. కింద అగాధం.....చప్పుడు ఎక్కువైంది, కళ్ళు విప్పాను, నిద్రలోనుంచీ.....బస్ శబ్దం.

'గుడ్ మార్నింగ్'

ఆ మొహం...ఎంత ఆనందం!...రాత్రి మాట్లాడుతూ నిద్రలోకి జారిపోయాను. ప్రయాణం...రాత్రి...ఆమె నన్ను ఎరుగుదుననడం...అంతా ఒక్క క్షణం.

నవ్వుతూ...'వెరీగుడ్‌మార్నింగ్, బాగా నిద్రపోయారా' అన్నాను.

'మీ అంత గాఢంగా కాదనుకోండి, కానీ నిద్రపోయాను!'

కొద్దిగా అలిసిన మొహం. నిద్ర విడిచిన ముద్రగా రంగు తగ్గిన వెంట్రుకలు

నలుపు జారిపోనీకుండా పట్టుకున్న కనురెప్పలు..... ఈమెను నేను ఎరుగుదునా! ...నిద్ర మంచులా కడిగి విడిచిన ఆ కళ్ళల్లో తేజాన్ని నేను ఎరుగుదునా! చుట్టూ చూశాను. రాత్రి కురిసిన మంచుపై ఉషస్సు ఉత్తేజం, సూర్యుడు చిత్రకారుడై దిద్దుతున్న ప్రకృతి. పరిచితమైన చెట్టూచేమల అమరిక రాబోయే ఊరికి సంకేతం.

'చాలా దూరం వచ్చేశాము.'

'అవును, ముందుస్టాప్‌లో బ్రేక్‌ఫాస్ట్ ముగిస్తే లంచ్ టైంకి ఇల్లు చేరవచ్చు.'

బస్ ఆగింది.

'నేను ఆ ఊర్లోనే చదివాను. పక్కనే అలంకార్, కాఫీ బావుంటుంది, రండి' అన్నాను.

మొహం కడుక్కుని వచ్చింది. 'మీ అందానికి దిద్దుబాట్లు, సర్దుబాట్లు అనవసరం, మీరు ఎప్పుడూ బావుంటారు. అనాలని అనిపించక అనుకున్నాను. నా అనాసక్త ప్రవృత్తిని విచ్ఛిన్నం చేసి గతం కట్టిన గోడల మధ్య ఖైదీలా మగ్గుతున్న నన్ను చేయి పట్టి పైకిలాగి వర్తమానంలో నిలిపిన ఈ అత్యద్భుత శక్తి, వ్యక్తి ఎవరు!..ఎవరు...

'మావారు ఇక్కడే చదివారు!'

'మీరే బ్యాచ్!'

చెప్పాను.

'మావారు మెడిసిన్ చదవడానికి ముందు బి.ఎస్సీ, ఇక్కడే చదివారు. బహుశా మీ బ్యాచ్ అయ్యుంటారు!

'నేను బికాం, మీ వారి పేరు?' భావపరంపరలా అబద్ధాల్లో కంటిన్యుటీ, ఆలోచనల్లో రాత్రి సంభాషణ,

'సీతారామారావు'

నా ఉలికిపాటు ఆమె గమనించిందా! జీవితంలో ఎలాంటి పదునైన క్షణలు! రామం, నా డాక్టర్ రామం, తల్లిదండ్రులు పెట్టిన పేరును ముందూ వెనుకా నరికేసి మేము ముద్దుగా పిల్చుకున్న రామం, ఉధృతం అయిన అంతరంగ తరంగాలు శరీరాన్ని చీల్చుకుని...నేను నశించి....నేను సాధించలేని పరిష్కారం నన్నూ, తన్ను తానూ వెతుక్కుని బయటపడి...అంతా ఒకే ఒక్క క్షణంలో.

'అవును, అతన్ని నేను ఎరుగుదును. తల వంచుకున్నాను.

'నిజం చెప్పండి, మీ పేరు జగన్ కదూ!'

ప్రతి మనిషీ తన జీవితంలో అత్యద్భుతంగా నటించవలసిన అవసరాలు, సందర్భాలు ఏర్పడుతుంటాయి. అలవాటు లేక ముఖకవళికల్ని మారకుండా ఉంచుకోడం

నాకు చాలా కష్టమైంది. అయినా ఏదో స్థిరత్వం, వేటిపైనో వేసుకున్న ముసుగు, ఏదో ముసుగు, నాకు అర్థం కాదు.

'కాదు' అన్నాను, కంట్రోల్ అవుతూ

'మావారి గ్రూప్ ఫోటోలలోనూ, ఆల్బంలోనూ చూశాను అతన్ని, మీలాగే ఉన్నట్టు జ్ఞాపకం.

నవ్వాను, ఇంకా నవ్వగలుగుతున్నందుకు అభినందించుకోలేను....అది హిస్టీరిక్ స్మైల్.

'నాకు సీతారామారావుతో కొద్దిగా పరిచయం ఉంది. నేను బి.కాం. కావడం వల్ల పరిచయం స్నేహంగా మారలేదు. జగన్ నాకూ తెలుసు!'

'మావారికి అతనంటే ప్రాణం. రేపు మావారి హాస్పిటల్ ఓపినింగ్. జగన్ తప్పకుండా వస్తారు'

'అలాగా' అన్నాను.

'అతన్ని కాలేజీనుంచి డిబార్ చేశారని మావారు అన్నారు. మీకేమైనా తెలుసా! ఆమె చూపులు నన్ను నిలువునా చీలుస్తున్నాయి. దేనికోసమో శోధిస్తున్నాయి.

ఇంక ఆపుకోలేని పరాజయం. గుర్తింపు కోసం, సింపతీ కోసం నా ఆత్మీయుడి భార్య, ఆ ఆరాధ్యమూర్తి ముందు బయటపడిపోతున్నాను.

'పూర్‌ఫెలో....రాజ్యలక్ష్మి అని ఓ అమ్మాయి వుండేది. బి.ఏ.లో అతని క్లాస్‌మేట్. ఆ అమ్మాయి విషయంలో గొడవైంది. విక్టిమ్స్‌లో అతనొకడు. కానీ పాపం అతనికేమీ తెలియదు. అహం, అధికారం ఆమె సొత్తు, అభిమానం, ఆత్మగౌరవం అతని సొమ్ము, రాజీ లేదు రెండింటికీ...ఫలతంగా అతను డిబార్ అయ్యాడు. అపాలజీ అడిగారు. చెబితే సస్పెన్షన్‌తో ఆగిపోయేదే. కానీ ఆ అమ్మాయికి క్షమాపణ చెప్పుకునే కన్నా, ఛిద్రమైపోయిన జీవితానికే అంతిమ ఘడియల్లో క్షమాపణ చెప్పుకుందామనుకున్నాడతను.'

మనిషి, ఓ అపరిచితురాలిముందు, తనమీద తానే సానుభూతి చూపించుకోవలసివచ్చే క్షణాలు ఎంత దుర్భరమైనవి!

'ఐ పిటీ' అందామె.

ఇద్దరం హొటల్లోంచి బయటకు నడిచాము.

'రాజ్యలక్ష్మి ఇప్పుడెక్కడుందో తెలుసా!'

'తెలీదు' అన్నాను. ఆలోచనల్లో తప్ప ఆమెమీద పగతీర్చుకోలేను. వెదకలేను, క్షమించలేను, మరచిపోలేను, సుఖపడలేను..... అప్పటికి స్పృహలో నా నిర్ణయాన్ని అమలుపరిచే ధైర్యం వచ్చింది.

'చూడండి, నాకు ఇక్కడ అవసరమైన పనివుంది. తణుకునుంచి వచ్చేప్పుడు దిగుదామనుకున్నాను. కానీ నిర్ణయం మార్చుకున్నాను. సాయంకాలం తణుకు వస్తాను. ఇఫ్ యూ డోంట్‌మైండ్, ఐ విల్ గెట్ డౌన్ హియర్.'


ఆమె మొహంలో నమ్మలేనంత ఆశ్చర్యం, కనుపాపలు పెద్దవై, 'ఇట్సాల్‌రైట్, రేపు హాస్పిటల్ ప్రారంభోత్సవానికి తప్పనిసరిగా రండి. సరిగ్గా నాలుగింటికి ఇదీ అడ్రెస్' అంది నా వంక పరీక్షగా చూస్తూ, డాక్టర్ రామం విజిటింగ్ కార్డ్‌నాకిస్తూ అందుకుంటుంటే నా చేతులు తీవ్ర జ్వరంలోలా, కలలోలా విశ్వమంతై వొణికాయి.

'థాంక్స్ మేడమ్, థాంక్స్ ఎలాట్, తప్పకుండా వస్తాను, కన్వే మై రిగార్డ్స్ టు ద డాక్టర్'

'ష్యూర్, మీతో పరిచయం బావుంది. తప్పనిసరిగా రండి, వస్తారుకదూ!'

తల వూపుతూ బ్యాగ్ అందుకుని దిగిపోయాను. బస్‌లోనుంచి నా అబద్ధాల్లోనుంచీ, వర్తమానంలోంచీ, ఆమె నుంచీ, వెనక్కి, నన్ను విడవని గతంలోకి, మళ్ళీ ఇంకోసారి ఓడిపోయి...

* * *



అలిఖితం

పి.వి. కృష్ణారావు

ఈ విషయం ఎన్నో సంవత్సరాల క్రితం విన్నాను. అప్పటికి నేనింకా హైస్కూల్లో చేరనేలేదు. దాన్ని కథగా వ్రాయాలని ఎన్నోసార్లు అనుకున్నాను. కాని ధైర్యం చాలలేదు. చలం, బుచ్చిబాబు, చండీదాస్ లాంటివారు వ్రాయాల్సిన కథ ఇది అనుకుంటూ ఉండేవాణ్ణి. నేను చెప్పుకోదగ్గ వచన కవితలు వ్రాశానేమో గాని వ్రాసిన కథలు మాత్రం చాలా తక్కువ. ఈ ప్రయత్నాన్ని పాఠకులు ముఖ్యంగా పాత్రల స్వభావాల దృష్ట్యా ఆదరిస్తారని ఎందుకో నమ్మాను కాబట్టి రాయటం జరిగింది. నిజానికి ఇది కథ కాదు. వాస్తవం. యదార్థతలో మొదలై యదార్థతతోనే ముగుస్తుంది. కాల్పనికతని దూరంగా పెట్టి వ్రాసినది ఇది.

మా నాయనమ్మ తన చిన్నప్పుడు వాళ్ళ వూళ్ళో జరిగిందని చెప్పిన ఉదంతం ఈ కథకి ఆధారం.

* * *

ఆమె పందిరి గుంజని ఆనుకొని నిలుచొని ఉంది. అస్తమిస్తున్న సూర్యుని కిరణాలు వెనకనుంచి ఆమెని దాటి ఆ తాటాకు పందిరి క్రింద పరచుకుంటున్నాయి. ఆ పందిరి కొంతమేరా గుమ్మానికి రెండు వైపులా ఉన్న అరుగులపైన కూడా ఉంది.

అంతటా పడుతున్న సూర్యుడి కిరణాల ఎర్రటి వెలుతురు ఆమె చుట్టూ వ్యాపించి ఉంది. ఒక అరుగుమీద పడక్కుర్చీలో పడుకొని ఉన్న భూస్వామి లక్ష్మయ్య ముఖం ఇంకా రౌద్రంగా మెరుస్తోంది. తెల్లని మీసాలు అతని క్రోధానికి కొమ్ములు తిరిగినట్లున్నాయి.

"ఎవరది?" ఆయన గొంతు గంభీరంగా ధ్వనించింది. అది ఆమెకు గర్జనలా వినిపించింది. ఆమె ముఖంమీద పడుతున్న నీడ ఆమెని బహుశా గుర్తుపట్టనీయలేదేమో, గుర్తించినా అది విముఖతతో కూడిన పలకరింపేమో చెప్పలేము.

ఆమెని వర్ణించాలంటే నాకు బీనాదేవి రాజమ్మ గుర్తొచ్చింది. సరదాకోసం దాసి వేషం వేసుకున్న మహారాణిలా ఉందామె. సౌందర్యం పోతపోసిన శిల్పంలా ఉంది. అహల్య, ద్రౌపది, దమయంతిలను తలపిస్తోన్న ఆమె అందాన్ని వర్ణించబోతే, ఆమె ముఖంలోని దీనత్వం, విషాదం ఘనీభవించిన గ్లేసియర్‌ని గుండెల్లో దాచుకున్నట్లుంది.

"నేను అయ్యా, రేణుకని"

"ఆ లంజ ఎప్పుడో చచ్చిపోయింది. నువ్వెవరో నాకు తెలియదు.." అతని మాటలు పూర్తి కాకముందే, ఆమె అందుకొని

"నేను చిన్నారిని" అంది. ఆమె తండ్రి తనని చిన్న నాటినుంచి ముద్దుగా పిలిచే పేరు అది.

"నన్ను, నా వాత్సల్యాన్ని, నా కుటుంబాన్ని, నా పరువు ప్రతిష్టల్ని ఫెడేల్‌మని తన్నేసి ఎవడో వీధులెమ్మట తినుబండారాలు కావిట్లో పెట్టుకొని అమ్ముకునే ఆ వెధవతో... లేదు, నాకు కూతురు లేదు, అది ఆనాడే చచ్చిపోయింది." అన్నాడు.

ఆమె గుండెల్లోని గ్లేసియర్ వేగంగా జారుతూ తడబాటుతో ఒక పర్వతాన్ని గుద్దుకొని పెద్ద శబ్దంతో ఫెళఫెళామని బ్రద్దలైనట్లు ఆమె గుండె ఆ క్షణంలో ముక్కలైంది. కళ్ళనుంచి జాలువారుతున్న కన్నీళ్ళని అద్దుకుంటూ, పెల్లుబికి వస్తున్న ఏడుపుని ఆపటానికి పమిట కొంగుని నోట్లో కుక్కుకుంటూ వృథా ప్రయత్నం చేసింది.

అప్పుడే ఆమె తల్లి సుందరమ్మ ఇద్దరు పిల్లల్ని గుమ్మం లోపలినుంచి బయటికి మెల్లగా తోస్తూ, అస్పష్టంగా, భయంగా

"మీ అమ్మ వెళ్ళండి" అన్నది.

కొన్ని నెలల తర్వాత అదే వాళ్ళు అమ్మని చూడటం.

షుమారుగా ఆరేళ్ళ వయస్సున్న పెద్ద పిల్ల వాడు. రేణుక దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు. నాలుగేళ్ల ప్రాయపు చిన్నవాడు అన్న చొక్కా పట్టుకొని అతని వెనకే నిలబడ్డాడు. వాళ్ళిద్దర్నీ గుండెలకి హత్తుకొని ఇక దుఃఖాన్ని ఆపుకొనే ప్రయత్నాన్ని వదిలేసింది.

జలపాతపు హోరుతో ఆమె ఏడుపు విని, కన్నీళ్లు చూసి ఆ పిల్లలు బిత్తరపోయారు.

"ఇంత చిన్న పిల్లల్ని వదిలేసి ఎట్లా వెళ్ళావే వాడితో. రాక్షసీ. నీ తల్లి మనసుకేమైంది? నీ పిల్లలు, మేము గుర్తు రాలేదా నీకు. వాళ్ళని సముదాయించటానికి మీ అమ్మ ఎంత తిప్పలు పడిందో ఆ దేవుడికే తెలియాలి."

"పిల్లల కోసమే వచ్చా.. తీసుకెళ్తా"

"తీసుకెళ్ళి ఏం చేస్తావే. బిచ్చమెత్తిస్తావా వాళ్ళతో" అన్నాడు లక్ష్మయ్య కర్కశంగా.

"ఎలాగో ఒకలా బ్రతుకుతాము. నా పిల్లలు నాకు కావాలి" అంది రేణుక.

"మళ్ళీ తిరిగి వెనక్కి వచ్చావు కాబట్టి ఒక మాట చెప్తా. ఆ కావిడి వెధవని మరిచిపో. నీ పిల్లలతో ఉండిపో. మన పొలాల్లో, తోటల్లో ఎందరో పనిచేస్తూ బ్రతుకుతున్నారు. నువ్వూ అట్లాగే పడివుండు. నీ పిల్లల చదువు సంధ్యలు మీ అన్న పిల్లల్లాగానే జరిగిపోతాయి. నీ తప్పుకు శిక్ష అనుభవిస్తూ ఒక మూల పడివుండు"

కోపం, వాత్సల్యాల్లో మనవళ్ళ పట్ల కన్సర్న్ గెలిచి ఆ కామందు నోటినుంచి అతికష్టం మీద ఆ మాటలు వెలువడ్డాయి.

"అయ్యా నేను అతన్ని వీడి ఇక్కడ ఉండే ప్రసక్తే లేదు. నా చావైనా, బ్రతుకైనా అతనితోనే, నేను నా పిల్లల్ని తీసుకెళ్తాను" ఆమె గొంతులో సంకల్పబలం ధ్వనించింది.

లక్ష్మయ్య కొద్దిసేపు ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు. ఆలోచనల సుడిగాలికి అతను తట్టుకొని నిలబడ్డాడు.

"సరే. నీ ఇష్టం వచ్చినట్లు తగలడు. నీ నుంచి పిల్లల్ని వేరే చేసే హక్కు నాకు లేదు. బాగా చీకటి పడింది. ఇంట్లోకి వెళ్ళి మీ అమ్మ, అన్నయ్య, వదిన, పిల్లలతో మాట్లాడి బువ్వ తిని పొద్దున్నే లేచి పిల్లల్ని తీసుకొని వెళ్ళిపో. మళ్ళీ నాకు కనబడకు"

రేణుక తడిసి ముద్దైన కళ్ళతో, తండ్రివైపు సునిశితంగా చూసింది.

కాసేపాగి, "అలాగే అయ్యా" అంది.

"ఇది బాగా గుర్తుపెట్టుకో. నువ్వు అతణ్ణి నీ మనస్సు నుంచి పూర్తిగా తుడిచేసి, మరెన్నటికీ అతని నీడ నీ జీవితం మీద పడకుండా ఉండేటట్లయితే, తిరిగి రా. ఇక్కడే మూల పడి వుండు. నీ పిల్లల సంగతి మేము చూసుకుంటాము" అన్నాడు లక్ష్మయ్య ఎంతగానో రాజీ పడుతూ. కూతురి పట్ల ప్రేమ, వాత్సల్యత తను ఏర్పరచుకున్న విలువలు, మనవళ్ళ పట్ల ప్రేమ అంతకుమించి ఆయన్ని దిగిరానియ్యలేదు.

ఆ రాత్రి ఆ ఇంట్లో ఎవరికీ నిద్రలేదు. రేణుక మనసు మార్చడానికి ఆమె కుటుంబ సభ్యులు చేసిన ప్రయత్నాలు ఏమాత్రమూ ఫలించలేదు. తెల్లవారుతూనే ఆమె ఇద్దరి పిల్లలతో, తలమీద పిల్లల బట్టల మూటతో ఆ ఇంటి నుంచి మరోసారి బయటకు

నడిచింది.

ఈ కథ మా నాయనమ్మ నాకు చెప్పింది. వాళ్ళ కన్నవారి ఊళ్లో వారికి బంధువులై ఒక కుటుంబంలో ఇది జరిగిందని.

నేను ఆ కథ విని సంతృప్తి పడలేక, వాళ్ళకి పరిచయం ఎలా అయింది? ఎందుకు రేణుక అలా వెళ్ళిపోయింది? ఆ తర్వాత వాళ్ళేమయ్యారు? అన్నీ ప్రశ్నలే. సమాధానాలు లేవు.

మా నాయనమ్మ "నాకు మీ తాతయ్యతో చిన్నతనంలోనే పెళ్ళయ్యి, రజస్వల అవ్వగానే అత్తారింటికి, ఇక్కడికి వచ్చేశాను. మావూరు వెళ్ళినప్పుడల్లా రేణుక గురించి వాకబు చేసేదాన్ని. వాళ్ళ పరిచయం ఎలా జరిగిందని అడిగావుగా. విను.

"రేణుకకి అప్పట్లో అందరికి లాగానే బాగా చిన్నతనంలో పెళ్ళయింది. ఆమె అందం అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసేది. పెద్దమనిషి అయ్యాక పసిడి ఛాయతో, గొప్ప అవయవ సౌష్టవంతో ఉన్న ఆమెని చూసిన వారెవరూ మరొకసారి తలతిప్పి చూడకుండా ఉండలేకపోయేవారు. కాపురానికి వెళ్ళిన కొద్ది సంవత్సరాలకే ఆమెకు ఇద్దరు మగ బిడ్డలు కలిగారు. ఇంతలో ఆమె భర్త జ్వరంతో మంచాన పడ్డాడు. కొన్నాళ్ళకు తనువు చాలించాడు. మరికొన్నేళ్ళకి, రేణుక తల్లిదండ్రులు సంపన్నులు కావటంతో ఇద్దరు మగబిడ్డలతో ఆమె కన్నవారిల్లు చేరింది.

తోటల ఫలసాయం కొనుగోలు చేస్తూ ఒక చిన్న వ్యాపారి మావూరు తరచూ వచ్చేవాడు. అప్పుడప్పుడూ పండ్లు, తినుబండారాలు కావిడి వేసుకొని ఒకతని వెంట నడుస్తూ అమ్మేవాడు. అప్పుడప్పుడూ తనే కావిడి మోశేవాడు. లక్ష్మయ్యగారికి మామిడి, నిమ్మ, సపోట మొదలైన తోటలు ఉండేవి. తరచూ అతను భూస్వామి అయిన లక్ష్మయ్యగారి తోటల్లో పండ్లు, కూరగాయలు కొని, బండ్లమీద, కావిడి మీద చుట్టుపక్కల గ్రామాల్లో, దగ్గర్లో ఉన్న చిన్న బస్తీల్లో అమ్మేవాడు. అతను నేను విన్నదాన్ని బట్టి ఎత్తుగా, బలంగా, చామనఛాయతో అందంగా ఉండేవాడట. అతన్ని వయసు మళ్ళాక నేను చూశాను. వయస్సులో ఉన్నప్పటి ఆనాటి రూపం తాలుకూ ఛాయలు ముదిమిలో సైతం నాకు కనిపించాయి.

నేను మావూరు వెళ్ళినప్పుడల్లా వాళ్ళను గురించి వాకబు చేసేదాన్ని. ఎవరూ ఏమీ తెలియదు అని మాత్రమే అనేవారు.

నేను బాగా పెద్ద దాన్నయ్యాక ఒకసారి మావూరు వెళ్ళినప్పుడు ఒక ముసలతను తినుబండారాల కావిడితో ఊర్లో అమ్మకాలు జరపటం చూశాను. అతనితోనే రేణుక లేచిపోయింది చానాళ్ళ క్రితం అని ఎవరో అనగా విన్నాను. నా జ్ఞాపకపు పొరల్లో

నిక్షిప్తమై ఉన్న మూర్తిని నేను గుర్తుచేసుకున్నాను.

ఒకరోజు ఆ కావిడతన్ని మా ఇంటికి పిలిచి పిల్లలకు ఏవో తినుబండారాలు కొన్నాను. మళ్ళీ మళ్ళీ పిలిచాను. ఒకసారి ధైర్యం చేసి, "రేణుక మా దూరపు చుట్టం. నాకంటే చాలా పెద్దది. నేను కాస్తంత ఎదిగాక, ఆమె అత్తవారి ఇంటినుండి మావూరి వచ్చేయడంతో ఆమెతో నాకు కొద్దిపాటి పరిచయం ఉంది. ఏమీ అనుకోనంటే ఆమె మీతో వచ్చేసినాక ఏమైంది? ఇప్పుడు రేణుక ఎక్కడుంది? పిల్లలేమయ్యారు? మళ్ళీ ఈ ఊర్లోనే ఎందుకు వుంటున్నారు?" అని అడిగాను.

"నేను సూర్యాన్ని, 'కావిడి, కావిడబ్బాయి' కాదు నా పేరు. రేణుక నేను ఒకర్ని ఒకరం ఎంతో ఇష్టపడ్డాం. కలిసి బ్రతకాలని అనుకున్నాము. లక్ష్మయ్యగారు సంపన్నులు, ఛండశాసనుడు. మా విషయం వారికి తెలిస్తే ఏమౌతుందనే భయంతో "మనం ఇక్కడినుంచి ఎక్కడికైనా వెళ్ళిపోదాం, క్రొత్త జీవితం ప్రారంభిద్దాము" అన్నాను రేణుకతో ఆమెకు కూడా నాకు మల్లేనే ఇంకా ఎన్నాళ్ళీ ఇలాటి చాటు మాటు వ్యవహారం సాగదనీ, తెగించి ఇంటినుంచి వెళ్ళటమే మార్గమని అనిపించింది.

పిల్లల్ని తనతోపాటు తీసుకొస్తానంది. మనం ముందు వెళ్ళి, ఎక్కడన్నా కుదురుకున్నాక పిల్లల్ని తీసుకొద్దువుగానీ అన్నాను.

అప్పటికే మా విషయం పొక్కింది. లక్ష్మయ్యగారికి తెలిస్తే మా ఇద్దరికీ ప్రమాదమని అనుకొని ఒకరోజు ఇద్దరం కలిసి బయటపడ్డాము. కొన్నాళ్ళకు నైజామ్‌లో ఒక చిన్న పల్లెటూర్లో అప్పటికి నేను కూడబెట్టిన డబ్బుతో ఒక చిన్న పాక వేసుకొని కొంత భూమిని కౌలు తీసుకొని కొత్త జీవితం మొదలుపెట్టాము. తనూ నాతో పాటు కష్టపడింది. పొలం పనుల్లో సాయం చేసేది. నేను అమ్మే తినుబండారాలు తనే చేసేది. పర్వాలేదు, ఇక బ్రతకగలం అన్న ధైర్యం వచ్చింది మా ఇద్దరికీ. కొన్నాళ్ళ తర్వాత ఇక పిల్లల్ని విడిచి ఉండలేనని వాళ్ళ వూరు వెళ్ళి పిల్లల్ని తీసుకొచ్చింది. అలా కొన్నాళ్ళు మా జీవితం ఉన్నంతలో హాయిగా గడిచింది. ఆమె నాతో వచ్చేసిన చాలాయేళ్ళకి, ముట్లుడిగే తరుణంలో గర్భం దాల్చింది. పురుటి సమయానికి చాలా ముందే రేణుకకి గర్భస్రావమై, ఆమె నాకు దూరమై పోయింది" సూర్యం కళ్ళల్లో ఈ ప్రస్తావన నీళ్ళు తెప్పించింది. రేణుక పిల్లల్ని చూసుకుంటూ అలాగే నా జీవితాన్ని కొనసాగించాను. వాళ్ళని చదివించాను.

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళు నన్ను 'నాన్న' అని పిలిచేవారు. నేను నా కష్టంతో వాళ్ళకి చదువు చెప్పించాను. పెద్ద చదువులకు నా సంపాదన చాలలేదు. స్కూల్ ఫైనల్ అయ్యాక ఐ.టి.ఐ.లో చేరి ఏదో పనులు నేర్చుకొని త్వరగానే ఉద్యోగాల్లో కుదురుకున్నారు. ఇద్దరూ ఇప్పుడు ఒక వూళ్ళోనే ఉన్నారు. పెళ్ళిళ్ళయి పిల్లలతో చాలా

సంవత్సరాలు మనవళ్ళతో మనవరాళ్ళతో కొన్నాళ్లు గడిపాను. నన్ను వాళ్ళెప్పుడూ పరాయివాడిగ చూడలేదు. నాకే నా రేణుక పుట్టి పెరిగిన ఊళ్ళో ఆమె జ్ఞాపకాల్ని నెమరువేస్తూ బ్రతకాలనిపించింది. నాకు ఓపిక ఉన్నంతకాలం ఇక్కడే ఉంటాను. నాకుగా నేను ఉండలేని నిస్సహాయ స్థితికి వస్తే నా పిల్లల దగ్గరికి వెళ్ళిపోతాను.

నాకు ఇంకొక ఆశ కూడా ఉంది. నన్ను చూడటానికి నా పిల్లలు ఈ ఊరు వస్తే తరం మారినా, వారి రక్త సంబంధీకులని ఎప్పుడో ఒకప్పుడు కలుస్తారని వాళ్ళతో సంబంధాలు ఏర్పరచుకోవాలని నా ఆకాంక్ష" అన్నాడు నిజాయితీగ, నిబ్బరంగా సూర్యం.

"మరి సూర్యం ఆశించినట్లు జరిగిందా నానమ్మా" అని అడిగాను.

"తెలియదు. నేను మావూరు వెళ్ళి చాలా సంవత్సరాలైంది. మావాళ్ళెవరూ మిగల్లేదు నాకు అక్కడ" అని ముగించింది.

ప్రేమ. అదొక మిస్టరీ. భౌతిక స్థాయిలో గ్రహాల్ని కట్టిపడేసే గురుత్వాకర్షణశక్తి, అణువులోని పార్టికల్స్ మధ్య ఉండే ఆకర్షణ జీవుల స్థాయిలో పరస్పర లైంగిక ఆకర్షణై స్త్రీ పురుషుల మధ్య ప్రేమగా పరిణమించిందా?

ఏమైనా అదెంతో బలీయమైన శక్తి.

జీవితాన్ని శాసించగల సత్తా దాని సొత్తు.

నాకు రేణుక సూర్యాల అంతరంగాలు తెలియవు. అందుకే నేను ఏమీ చెప్పలేదు. వారి అనుబంధానికి కదిలిపోయాను.

*   *   *

సీరియల్



జీవితానికి
అర్ధమూ, సొగసూ
అజరామరమైన
ప్రేమానుబంధాల
వల్లనే –

మనిషి కాటు

వేములపల్లి మోహనరావు – పి.వి. కృష్ణారావు

1

పికాడిల్లీలో అత్యంత అధునాతనమైన 'ఎంప్రెస్' బ్యూటీ పార్లర్ ముందు తళతళ మెరుస్తున్న నల్లటి జాగ్వార్‌కారు పేవ్‌మెంట్‌ను తాకుతూ ఆగింది.

హేండ్‌బాగ్ తీసుకుని దిగుతూ "నువ్వు కూడా రా" అంది జెన్నీ.

'నేనెందుకూ' అన్నాడు కొంచెం చిరాగ్గా రాజా. అంతకన్నా చిరాగ్గా చూసిందామె. 'ఆర్గుమెంట్సు అనవసరం, వస్తావా రావా' అంది కఠినంగా.

'పార్క్ చేసి వస్తాను అయితే' అన్నాడతను. ఆమె మీద కోపం యాక్సిలరేటర్ మీద చూపిస్తూ. కారు సర్రున ముందుకు దూకింది.

సన్నసన్నగా వర్షం పడుతోంది. ప్రియుడి కోరికను మన్నించి మధురంగా పాడుతున్న జవరాలిగొంతులోంచి జాలువారుతున్న సంగీత సుధలా.

"నాటీ గర్ల్" గొణుక్కున్నాడు రాజా. సెంట్రల్లీ హీటెడ్ అపార్ట్‌మెంట్‌లో వెచ్చగా పడుకుని ఆలిస్టర్ మెక్లీన్‌ను చదువుకునే అద్భుతమైన సందర్భంలో తయారైందీమె. ఈ వర్షంలో షోకులెందుకో, అయినా వెధవది వెళ్ళేసరికి పార్టీకి ఈ తతంగం లేకపోతే ఏమో!

పేవ్‌మెంటుమీద అలాగే తడుస్తూ నిలబడి ఉందామె. అతను చేరుకునే వరకూ. ఇద్దరూ అద్దాల తలుపుల ముందుకు రాగానే ఆటోమేటిగ్గా తెరుచుకున్నాయవి. లోపల అడుగు పెట్టగానే మళ్ళీ మూసుకున్నాయి. ఎంప్రెస్ అనే పెద్ద పెద్ద గోల్డ్‌ప్లేటెడ్ అక్షరాలు గోడమీద మెరుస్తున్నాయి. ఎలిజిబెత్‌రాణి నిలువెత్తు ఛాయాచిత్రం, లిజ్‌టేలర్, సోఫియాలారెన్స్, అనితా ఎక్బర్గ్, నటాలీ వుడ్‌ల ఫొటోలు వేలాడుతున్నాయి. పదిపన్నెండు దాకా రివాల్వింగ్ ఫోమ్ కుర్చీలు, వాటి ముందు రకరకాల బట్టల మధ్య నిలువుటద్దాలు, లెక్కలేనన్ని క్రీములు, లోషన్లు, పెర్ఫ్యూంలు, ఆ గదిని పరిమళభరితం చేస్తున్నాయి. బాబ్ చేయించుకునేవాళ్ళు, హెయిర్ డై చేయించుకునేవాళ్ళు, మేకప్ చేసేవాళ్ళతో చాలా రద్దీగా ఉందా గది. ఇంకో పక్కన బాణం గుర్తు వేసిన 'సవానా బాత్స్' అని వ్రాసి వుంది.

కొంచెం యెడంగా విజిటర్స్ కూర్చోవడానికి కుర్చీలు, టీపాయ్‌మీద రకరకాల మేగజైన్లు.

మినీ ఫ్రాక్ వేసుకున్న ఓ ఇరవై ఏళ్ళ పిల్ల వచ్చి "వాట్ కెనైడూ ఫర్‌యూ మేడమ్" అని అడిగింది తియ్యగా.

"అమృతను కలుసుకోవాలి" చెప్పింది జెన్నీ.

"అపాయింట్‌మెంట్ ఉందా!"

చురుగ్గా చూసింది జెన్నీ "ఎన్ని రోజులయింది నువ్విక్కడ చేరి?"

"వారం"

"అందుకే నీకు తెలియదు. అమృత దగ్గర ఈ జెన్నీకి అపాయింట్‌మెంట్లక్కరలేదు, వెళ్ళి మీ మేడంతో చెప్పు" హుందాగా అందామె. జెన్నీ స్వరంలో కాఠిన్యానికి కొంచెం చిన్నబుచ్చుకుని "దయచేసి కూర్చోండి" అని చెప్పి లోపలికెళ్ళింది. మరునిముషంలో తిరిగి వచ్చి "రమ్మంటున్నారు" అంది.

ఆ గదిలో అడుగుపెడుతూనే కళ్ళు తిప్పుకోలేకపోయాడు రాజా. అమృత మీద నుంచి. వర్ణనలకందని సౌందర్యం ఆమెది. ఆమె నడుపుతున్న బ్యూటీ పార్లర్‌కు జనం అంత వేలం వెర్రిగా ఎందుకు ఎగబడతారో, ఆమెను చూడగానే అర్థమైందతనికి.

"వెల్‌కం జెన్నీ" అంది అమృత కుర్చీలోనుంచి లేచి ఎదురొస్తూ

"దిసీజ్ మై ఫ్రెండ్ రాజా, షి ఈజ్ అమృత", పరిచయం చేసింది జెన్నీ. గులాబీ కన్నా సున్నితమైన ఆమె చేయి తన చేతిని నొక్కుతుంటే మధురమైన పులకింత ఒళ్ళంతా పాకింది రాజాకి.

"అయాం సో హాపీ టు మీట్ యూ మిస్టర్ రాజా. యూ ఆర్ ఫ్రం హుచ్ పార్ట్ ఆఫ్ ఇండియా?"

అతను జవాబిచ్చే లోపలే ఫోన్ మోగింది. "ఎక్స్‌క్యూజ్‌మీ" అని రిసీవర్ అందుకుందామె.

"ఆ ఏమిటమ్మా. ఆహ...లేదు, ఇప్పుడు రావడం లేదు. కొంచెం పనుంది. పోనీ నువ్వెళ్ళి రాకూడదూ!...అబ్బ!...ఎలాగే నీతో!'

తేనెలాంటి తెలుగు ఆమె గొంతులోంచి రావడం వల్ల కాబోలు మరింత తియ్యదనాన్ని సంతరించుకుంది. అమృతను మొదట చూసిన అనుభూతిని మించిందేదో రాజాను మరింత కదిలించింది. తన చిన్నప్పుడే చచ్చిపోయిన అమ్మచేతి గోరు వెన్నముద్దలూ, అమలాపురం కొబ్బరి తోటల మధ్య ఆడుకున్న దాగుడుమూతలూ, గోదావరి ఈతలూ, గుండెల నిండా పీల్చుకునే పైరగాలి పరిమళాలూ, అన్నీ మళ్ళీ ఒకేసారి అనుభవిస్తున్నట్టుంది, అతనికి ఆమె మాటలు వింటుంటే, తను లండన్ వచ్చిన

ఈ ఆరు నెలల్లోనూ తెలుగు వినడం ఇదే మొదటిసారి! అప్రయత్నంగా అతని కళ్ళు తడిసాయి.

"మా అమ్మగారు, సెల్‌ఫ్రిడ్జెస్‌కెళ్లాలి. ఓసారి రమ్మని గొడవ" అందామె జెన్నీతో, ఫోన్ పెట్టేసిన తర్వాత, "ఎస్ మిస్టర్ రాజా!" ప్రశ్నార్థకంగా చూసిందనివైపు.

"నేను.....నేను కూడా తెలుగువాణ్ణేనండీ" అన్నాడతను. గొంతు పెగుల్చుకుని, క్షణంసేపు ఆమె నోటివెంట మాట రాలేదు. ఆ కళ్ళలో ఆశ్చర్యం, ఆనందం పోటీపడుతున్నాయి.

"రియల్లీ! హౌనైస్, నిజంగా నాకు చాలా సంతోషంగా వుంది. మిమ్మల్ని కలుసుకోవడం, ఎప్పుడొచ్చారు మీరిక్కడికి!"

"ఆరు నెలల క్రితం"

"మేం వచ్చి పది సంవత్సరాలపైనే"

భాష అర్థంకాని జెన్నీ అయోమయంగా చూడసాగింది.

"ఓహ్, సారీ జెన్నీ, మేమిద్దరం ఒకే రాష్ట్రానికి చెందిన వాళ్ళం. అందుకే..."

"అలాగా, అయితే మీ భాషలోనే మాట్లాడుకోండి, నేను మళ్ళీ వస్తాను."

ఆమె తన మేకప్ పూర్తి చేసుకుని వచ్చేవరకూ అమృతతో కరువుతీరా మాట్లాడేశాడు రాజా.

"రేపు ఇరవయ్యో తారీఖు నా పుట్టిన రోజు, మీరు తప్పకుండా రావాలి" అంది అమృత వాళ్ళను సాగనంపుతూ.

"ఆహ్వానం అతనొక్కడికేనా, నాక్కూడానా" అంది జెన్నీ.

"ఈ ఆహ్వానం ప్రత్యేకంగా నీకే. ఆయనకి ఇంతకుముందే చెప్పాను. అయినా నువ్వు లేకుండా పార్టీ చేసుకుని మర్నాడు లండన్లో బతగ్గలవా?" అంది అమృత నవ్వుతూ.

"ఓకే సో లాంగ్"

"సో లాంగ్."

కళ్ళతోనే వీడ్కోలిచ్చింది అమృత రాజాకి. అడుగులు ముందుకు పడటం లేదతనికి. ఎందుకో ఆ సమావేశం అసంపూర్తిగా, అర్థంతరంగా ముగిసిందనిపించింది. థ్యాంక్స్ జెన్నీ, థ్యాంక్స్ ఎలాట్, నువ్వీరోజున నాకు చేసిన సహాయం ఈ జన్మలో మర్చిపోను, ఇన్నాళ్ళూ నీ గర్వానికీ, దర్పానికీ తిట్టుకునేవాణ్ణి మనసులో, ఇక ముందు అలా చేయను అనుకున్నాడతను, ఇదీ మనసులోనే.

* * *

థేమ్సనది నానుకుని, విక్టోరియా ఎంబాంక్‌మెంట్ పక్కన ఉన్న ఓ ఎనిమిదంతస్తుల భవనంలో డి.డబ్ల్యు.చెస్టర్‌టన్ అసోసియేట్స్ ఆఫీసు ఉంది. రకరకాల ఇండస్ట్రీలకు కావలసిన కెమికల్స్ సప్లయి చేయడం వాళ్ళ వ్యాపారం. యూరప్ మొత్తంలోనూ, స్టేట్స్‌లోనూ వాళ్ళకు లైజాన్ ఆఫీసులున్నాయి. జపాన్‌లో అన్నిటికన్నా పెద్ద సంస్థ 'మిట్సుబిషీ'కి వీళ్ళు యూకే ఏజెంట్లు, సంవత్సరానికి అధమం ఫైవ్ మిలియన్ పౌండ్స్ టర్నోవర్ వుంటుంది వాళ్ళకి. ఛెస్టర్‌టన్ అసోసియేట్స్ కెమికల్స్ ఉత్పాదనచేసే ఫ్యాక్టరీలు ప్లిమౌత్, గ్లాస్గో, లివర్‌పూల్‌లో వున్నాయి. ఆ కంపెనీకి సేల్స్ మేనేజర్ రాజా అదే బిల్డింగ్‌లో ఓఎపార్ట్‌మెంట్‌లో ఉంటాడతను. దాని అద్దె కూడా కంపెనీయే భరిస్తుంది.

ఆరోజు ఉదయం అతను ఆఫీస్‌కొచ్చేసరికి, రిసెప్షనిస్ట్ క్లారా మెసేజ్ అందచేసింది. బాస్ అర్జంట్‌గా కలవమన్నారనీ, ఇంట్లో ఉన్నారనీ, మరో అయిదు నిముషాలకు అతని ఆల్ఫారోమియో కారు అప్పుడే జీవం నింపుకుంటున్న లండన్ రోడ్లలోని అనేక వందల కార్లలో ఒకటిగా కలిసిపోయింది. రీజెంట్స్ పార్క్ దగ్గర ఉన్న ఛెస్టర్‌టన్ ఇల్లు నగరంలో అరుదైన కోటల్లాంటి ఇళ్ళలో ఒకటి, చుట్టూ ఇనప ఫెన్సింగ్ మధ్య అర ఎకరం స్థలంలో కట్టబడిన రెండంతస్థుల విల్లా అది. ఇంటిముందు పెద్ద లాన్, కోర్ట్‌యార్డ్, మూడు కారు గేరేజ్‌లు, పెద్ద ఫౌంటెన్, విశాలమైన సర్క్యులర్ డ్రైవ్.

కారు దిగుతూ చూశాడు రాజా. పోర్టికోలో బాస్ సిల్వర్ షాడో రోల్స్‌రాయిస్ మెరుస్తోంది. ఐశ్వర్యపు తళుకులన్నీ చూపిస్తూ అతను హాల్లోకి వెళ్ళగానే స్టీవర్ట్ చెప్పాడు బాస్ తన కోసం ఎదురుచూస్తున్నారనీ, బెడ్‌రూంలోనే ఉన్నారనీ, రాజా మునివేళ్ళతో తలుపుమీద చిన్నగా శబ్దం చేశాడు.

"కమిన్" అన్నాడు ఛెస్టర్‌టన్. దాదాపు యాభై సంవత్సరాలుంటాయతనికి. ఐర్లండులో పుట్టి తన ఏడో ఏట వరకూ అక్కడే పెరిగాడు. చిన్నతనం నుంచీ అతనికి చదువు అబ్బలేదు. లండన్‌లో మొదట న్యూస్‌వెండర్‌గా ప్రారంభమైన అతని జీవితం అనేక మలుపులు తిరిగి ఈరోజు లక్షలాది పౌండ్లకు అతన్ని అధిపతిని చేసింది.

కింగ్‌సైజ్ డబుల్ బెడ్ మీద గుండెల దాకా బ్లాంకెట్ కప్పుకుని పడుకుని వున్నాడు ఛెస్టర్‌టన్. నోట్లో పైప్ వెలుగుతోంది. బెడ్ పక్కనే కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది జెన్నీ. రాజా లోనికి రాగానే ఆమెను వెళ్ళమన్నట్టు చెయ్యి ఊపాడాయన. మౌనంగా నిష్క్రమించిందామె.

"ఏమైంది బాస్" అడిగాడు రాజా కొంచెం కంగారుగా.

"జస్టే మైల్డ్ స్ట్రోక్"

"మీకు అనేకసార్లు చెప్పాను, ఊరికే ఎక్సైట్ కావద్దని. ఇప్పుడేమైందని మీరు వర్రీ కావడం, ఆ నొప్పిని తెచ్చుకోవడం!" కొంచెం నిష్టూరంగా అన్నాడు రాజా. ఆ

చనువుంది అతనికి.

పైప్ పీల్చడం తప్ప, ఛెస్టర్‌టన్ ఏం మాట్లాడలేదు.

"నో, నో, మీరిలా లాభం లేదు. ఇక్కడ ఉంటే ఇలాగే ఆరోగ్యం చెడగొట్టుకుంటారు, ఏ స్విట్జర్లండో వెళ్ళిరండి ఓ పదిరోజులపాటు. జస్ట్ ఫరే ఛేంజ్"

అప్పటికీ ఏం మట్లాడలేదాయన. కూర్చోమన్నట్టు చెయ్యి వూపాడు.

"రేపే టికెట్లు బుక్ చేయిస్తాను మీకూ జెన్నీకీ"

"అసలు నా అనారోగ్యానికి కారణం తెలుసా నీకు." అడిగాడాయన పైప్ పక్కన వుంచి.

"ఎందుకు తెలియదు, మీ ఒక్కరికీ కాదు, మీలాంటి వాళ్ళందరికీ ఒకటే భయం, బిజినెస్ గురించి ఫౌండ్ విలువ పడిపోతుందనీ, రా మెటీరియల్ ధర పెరిగిపోతోందనీ, పౌండ్ కస్టమర్స్‌లేరనీ, టాక్సులు విపరీతమైపోతున్నాయనీ ఇంతకుమించి ఏమున్నాయి కారణాలు! మీరు నా మాట విని ఇవన్నీ నాకొదిలేసి కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోండి. అయినా ఎందుకు మీకీ తాపత్రయం, ఉన్నది చాలదా!"

"నువ్విప్పుడు చెప్పిన వాటిల్లో ఏ ఒక్కటీ నన్ను పీడించలేదు. ఆలోచనలు మనిషిని ఒక్క క్షణం కూడా విడిచివుండలేవు. అవి వెంటాడుతున్నంతకాలం అతను ప్రపంచంలో ఎక్కడున్నా ఒక్కటే రాజా...శాంతి, సంతృప్తి అనేవి మనిషి మనసులో తప్ప మరో చోట లేవు. భౌతికమైన సౌకర్యాలు వాటిని సృష్టించలేవు."

రెండు నిమిషాల పాటు తన మంచానికెదురుగా వున్న పికాసో చిత్రం వంక చూస్తూ వుండిపోయాడాయన.

"మన మొదటి కలయిక గుర్తుందా నీకు రాజా!"

ఎలా మర్చిపోగలడు రాజా!

*   *   *

బాంబే నుంచి వచ్చే ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఎయిర్ బస్ ఆరోజు రెండు గంటలు ఆలస్యంగా లాండయింది. ఏవో సాంకేతికమైన లోపాల వల్ల లౌంజ్‌లో ఓపిగ్గా ఎదురు చూస్తున్నాడు రాజా, వాళ్ళ కోసం. సహనం అతని ఉద్యోగానికి మొదటి లక్షణం. అది అతనికి పుష్కలంగా ఉంది. రోజుల తరబడి, చెరగని చిరునవ్వుతో టూరిస్టులడిగే అనేక రకాల ప్రశ్నలకు తడుముకోకుండా జవాబివ్వగలగడం రెండో లక్షణం. అదీ అతనికి కావలసినంత ఉంది. 'ఎరైవల్' గేట్లో నుంచి బయటపడి అలసటగా ఊపిరిపీల్చుకున్నారు ఛెస్టర్‌టన్, జెన్నీలు, రాజా తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"మీరు వస్తున్నట్లు ఇచ్చిన కేబుల్ నిన్ననే అందింది. టూరిజం

డిపార్టుమెంటువాళ్ళు మీక్కావలసిన అన్ని ఏర్పాట్లూ చేశారు. రండి వెళదాం" అంటూ ముందుకు దారి తీయబోయిన రాజా, వాళ్ళిద్దరూ కదలకపోవడం చూసి ఆగిపోయాడు.

ఇద్దరి మొహాల్లోనూ ఏదో ఆశ్చర్యం తాండవిస్తోంది. రక్తం అంతా ఇంకిపోయినట్టు పాలిపోయాడు ఛెస్టర్‌టన్. కొద్దిగా వణుకుతున్నాయి అతని పెదవులు. తీవ్రంగా ఒకేసారి అన్ని జబ్బులకూ లోనైనవాడిలా వున్నాడాయన.

"ఏమైంది సర్! సమ్‌థింగ్ రాంగ్ ఇన్ ది ఫ్లైట్?" అడిగాడు రాజా.

"నో నో. అదేంలేదు. పదండి" అన్నాడు ఛెస్టర్‌టన్ తన బ్రీఫ్‌కేస్‌ను అందుకుంటూ.

కార్లో వెళుతుండగానే మద్రాస్ నగరాన్ని వాళ్ళిద్దరికీ పరిచయం చేస్తూ, యధాలాపంగా వెనక్కి తిరిగి చూశాడు రాజా. వాళ్ళిద్దరూ పరిసరాలను పరికించడం లేదు. అతన్నే చూస్తున్నారు వింతగా. అర్థం కాలేదు రాజాకి. నిజ జీవితంలో విచిత్రమైన వ్యక్తులెందర్నో చూస్తుంటాడతను. చాలామంది టూరిస్టులు, గైడ్‌లు తమ నెక్కడ దోచేస్తారోనని భయపడుతుంటారు. మొదటి రెండు రోజులూ, వీళ్ళు ఆ కోవలోకి చెందిన వాళ్ళే అయుంటారు అనుకున్నాడు రాజా.

హొటల్ చోళా షెరటన్ ముందు ఆగింది కారు. రిసెప్షన్‌లో తాళం తీసుకుని వాళ్ళిర్నీ గదికి తీసుకెళ్ళాడతను. వెనకే బాయ్ వచ్చి సామాను పెట్టి వెళ్ళిపోయాడు.

"మీరు కొంచెం విశ్రాంతి తీసుకోండి. నేను మళ్ళీ సాయంత్రం కలుస్తాను. మంచి టైంలో వచ్చారు మీరు. రాత్రికి మీకో మంచి సౌత్ ఇండియన్ డాన్స్ చూపిస్తాను."

వాళ్ళిద్దరూ బొమ్మల్లా నిలబడ్డారు. కదల్లేదు. మాట్లాడలేదు. తన వృత్తి సహజమైన చిరునవ్వుతో సెలవు తీసుకున్నాడతను.

2

ఆ సాయంత్రం హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌కు ఓ పార్టీని పంపించి హొటల్ కొచ్చేసరికి ఆరయింది. వాళ్ళు రాజాని దాదాపు నమిలి మింగేశారు. భార్యాభర్తలిద్దరికీ సెంట్రల్ గవర్నమెంట్‌లో పెద్ద ఉద్యోగాలు. నలుగురు పిల్లలు, అందరూ పదేళ్ళలోపువాళ్ళే.

మొగుడు పైసా ఖర్చు కాకూడదంటాడు. పెళ్ళాం చూసిన ప్రతీదీ కొనాలంటుంది. పిల్లలు అడిగిన ప్రతి విషయం గురించావిడకి విడమర్చి చెప్పేసరికి ఆ వూళ్ళో రాజాకు తెలిసిన దానికన్నా వాళ్ళకు తెలిసింది ఎక్కువైంది రెండు రోజుల్లో, అవి రోజులు కావు యుగాలు.

జెన్నీ తలుపు తెరచి 'కమిన్' అంది, ఛెస్టర్‌టన్ కొంచెం విశ్రాంతి తీసుకోవడం వల్ల ఫ్రెష్‌గా ఉన్నాడు. విష్ చేశాడు రాజా.

"కాఫీ తాగుతారా' అడిగింది జెన్నీ

"నో థ్యాంక్స్, మీరు రెడీ అయితే మనం బయల్దేరదాం."

మరో పది నిముషాల్లో వాళ్ళు హోటల్ బయటికొచ్చారు. ఆ రాత్రి రాజా అన్నామలై హాల్లో యామినీ కృష్ణమూర్తి భరతనాట్యం. హాలంతా కిటకిటలాడుతోంది. స్టేజికి ఎదురుగావున్న వరుసలో కూర్చున్నారు ముగ్గురూ, సాధారణంగా పాశ్చాత్యులు ఆసక్తి చూపే సంప్రదాయ నృత్యం కాబట్టి అంతకు ముందురోజే వాళ్ళ రాకను గురించి తెలిసిన రాజా టికెట్లు బుక్ చేయించాడు. డాన్స్ జరుగుతున్నంతసేపూ కన్నార్పకుండా చూసింది జెన్నీ. మధ్య మధ్య భరతనాట్యం పుట్టు పూర్వోత్తరాల గురించీ, డాన్సర్ ప్రావీణ్యాన్ని గురించీ, ఆమె అభినయాల అంతర్యాన్ని గురించీ, వివరించి చెప్పాడతను. ఛెస్టర్టన్ మాత్రం ముప్పాతిక భాగం కళ్ళు మూసుకుని తీవ్రంగా ఆలోచిస్తూనే ఉన్నాడు. అతనికి పెద్ద ఆసక్తిలేదని గ్రహించి రాజా, ఇక విసిగించలేదు.

"అటువంటి డ్రెస్ నేను కూడా వేసుకోవచ్చా!" అడిగింది జెన్నీ అతని చెవిలో. అప్పుడు చూశాడు రాజా ఆమె వంక పరీక్షగా స్టేజ్ మీదకు ఫోకస్ చేయబడిన ఫ్లడ్లైట్ల ఇండైరెక్ట్ లైటింగులో ఆమె తేనెరంగు కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి. చక్కని లేత మొహం, తీర్చిదిద్దినట్లున్న ఒంపుసొంపులు.

"చాలా బాగుంటుంది కూడా మీకు." అన్నాడతను.

"మరెలా! నాకు కట్టుకోవడం రాదు గదా, పోనీ మీ ఆడవాళ్ళెవరిచేతనైనా కట్టిస్తారా.'

'ఆడవాళ్ళేకాదు నా అనేవాళ్ళెవరూ లేరు నాకు. ఒంటరిగాణ్ణి.'

'అలాగా' అందామె సానుభూతిపరంగా.

ప్రోగ్రాం అయిపోయిన తర్వాత "మా సౌత్ ఇండియన్ డిషెస్ ట్రై చేస్తారా డిన్నర్కి" అన్నాడు రాజా.

"తప్పకుండా" అంది జెన్నీ హుషారుగా.

ఛెస్టర్టన్ ఆలోచనలు తెగలేదు. ఆయన రాజాను తదేకంగా చూడటం మానలేదు. ఉడ్లాండ్స్కు వెళ్ళారు. పప్పు, ఆవకాయ, నెయ్యి, సాంబారు బాగా నచ్చాయి ఇద్దరికీ. చేత్తో తినడం చేతకాక అవస్థపడుతున్న జెన్నీని చూసి తనలో తనే నవ్వుకున్నాడు రాజా. ఆ రాత్రి వాళ్ళకు గుడ్నైట్ చెప్పి రూం కొచ్చేసరికి పదకొండు దాటింది.

గమ్యం లేని జీవితం. ఎందుకు బ్రతకాలో, ఎవరి కోసం బ్రతకాలో తెలీదు. ఆ వ్యక్తి నిస్సారపు జీవితపు పుటల్లో ఇంకో కాగితం కాలిపోయింది. అంతకు ముందు బూడిదైపోయిన ఇరవై అయిదు అధ్యాయాల్లాగే. అయితే దీనికో ప్రత్యేకత ఉందనీ

ఉంటుందనీ అప్పుడతను ఊహించనైనా లేదు.

* * *

దక్షిణ భారతదేశంలో వాళ్ళు గడిపిన పదిహేను రోజుల్లోనూ విడదీయలేని అనుబంధం ఏర్పడిపోయింది. రాజాతో వాళ్ళకి, కేరళ కొబ్బరితోటలూ, కోవలం బీచ్ రిసార్ట్లూ, మహాబలిపురం పల్లవుల శిల్పకళాభిరుచీ, మైసూర్ మహారాజా పాలెస్, హంపి శిథిలాలూ ఎంత వచ్చాయో, రాజా కూడా అంత నచ్చాడు వాళ్ళకి. వెళ్ళిన ప్రతిచోటా ఆ ప్రదేశంలో, ఆ చరిత్రలో, ఆ వైభోగంలో, ఆ అభిరుచిలో, ఓ భాగమై కనిపించాడతను. అతని ఆసక్తికరమైన వివరణలలో ప్రతి సంఘటనా తమ కళ్ళకు ముందు జరుగుతున్నట్టు. ప్రతి శిల్పం తమ కళ్ళ ముందు ప్రాణం పోసుకుంటున్నట్టు. ప్రతి కట్టడం జీవం సంతరించుకుంటున్నట్టు అపురూపమైన అనుభవం పొందగలిగారు వాళ్ళు.

ఆరోజే వాళ్ళ ప్రయాణం. ఓ పదిహేనురోజుల పాటు కాశ్మీర్, ఢిల్లీ, ఆగ్రా, జైపూర్‌లు చూసి లండన్ వెళ్ళిపోవడానికి ఏర్పాట్లు జరిగాయి. సామానంతా సర్దేసుకుని కూర్చున్నారు. ఫ్లైట్‌కింకా రెండు గంటల టైముంది. ముగ్గురు ఒకర్ని గురించి ఒకరు ఆలోచిస్తున్నారు. అంతకు ముందు రాత్రి సాగర్‌లో మూన్‌లైట్ డిన్నర్ తీసుకుంటున్నప్పుడు రాజా కాంచీపురం పట్టుచీర ఇస్తూ 'ఇది మీకు నా కానుక' మీతో నేను గడిపిన క్షణాలు నాకెంతో హాయిని కలిగించాయి. అందుకు కృతజ్ఞతగా, ప్లీజ్ యాక్సెప్ట్' అన్న మాటలు గుర్తొచ్చి కళ్ళు చెమర్చాయి జెన్నీకి. ఆ రాత్రి దూరాన సముద్రం మీదనుంచి వచ్చే చల్లటిగాలీ, ముద్దగా కురిసే వెన్నెలా తమను మృదువుగా పరామర్శించే సమయంలో తను ఇచ్చిన పాకెట్‌ను అందుకుంటూ,

"నిజానికి కృతజ్ఞత చెప్పాల్సింది మేము. మా స్టే ఇంత ప్లెజంట్‌గా గడవడానిక్కారణం మీరు, మీరు తప్ప ఇంకొకరెవరైనా మాకటువంటి అనుభవాన్నివ్వగలిగి ఉండేవారని మేము భావించడం లేదు" అన్న జెన్నీ మాటలు గుర్తొచ్చి రాజా గుండె బరువెక్కింది.

ప్రేమ, అనురాగం, ఆప్యాయత విశ్వజనీనమైనవి. కేవలం ఏ ఒక్క ప్రాంతానికో, జాతికో, ప్రాణికో మాత్రమే అవి పరిమితమై వుంటే వాటి కంత పవిత్రత, విలువ సంక్రమించి వుండేవికావు. మనిషితోపాటే పుట్టాయి. భూమిమీద ప్రాణం ఉన్నంత కాలం వుంటాయి. అజరామరమైన ఆ అనుబంధాల వల్లే మనిషి జీవితానికో అర్థమూ, సొగసూ ఏర్పడ్డాయి.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు ఛెస్టర్‌టన్ "చూడు మిస్టర్ రాజా, సమ్ హౌ" నువ్వు నన్ను బాగా ఆకర్షించావ్. నీ రూపం, భాష, సంస్కారం నాకు నచ్చాయి, నా

బిజినెస్‌కు కావలసింది నీలాంటి చొరవా, సహనమూ గలిగి ఎదుటి వారిని ఆకట్టుకోగలిగిన వ్యక్తులే. నువ్వు లండన్ ఎందుకు రాకూడదు? కావలసిన ఏర్పాట్లన్నీ నేను చేస్తాను."

రాజాకు ఇటువంటి ఆఫర్లు రావడం కొత్తకాదు. తమ కృతజ్ఞతలు తెలుపుకోవడానికి అనేకమంది అనేక ప్రామిస్‌లు చేస్తుంటారు. కానీ ఇంత వరకూ ఏ ఒక్కటీ ఆచరణలోకి రాలేదు.

నవ్వి ఊరుకున్నాడు రాజా.

'లైట్‌గా తీసుకోకు మిస్టర్ రాజా, నేనొకటి ప్రపోజ్ చేస్తే బాగా లోచించి చేస్తాను, నీకూ నీవాళ్ళెవరూ లేరుకాబట్టి అక్కడికి రావడం నీకు అభ్యంతరకరం కాదనుకుంటాను."

రాజా అప్పుడూ ఏం మాట్లడలేదు.

"ఓ.కె. నీ యిష్టం. బాగా ఆలోచించుకో, నా అడ్రస్ నీ దగ్గరుంది, పాస్‌పోర్టు సంపాదించుకో, మిగతా ఏర్పాట్లన్నీ నేను చూసుకుంటాను."

"థాంక్స్ ఏ లాట్ సర్."

ఎయిర్‌పోర్ట్ వరకూ వాళ్ళను పంపి వస్తుంటే అతన్ని నిలువునా నీరసం ఆవహించింది. సరిగ్గా పదిహేనురోజుల తర్వాత, అతను ఆఫీసులో ఉన్న సమయంలో అతనికి ఫోన్ వచ్చింది. ఛెస్టర్‌టన్ చేశాడు. బొంబాయి నుంచి, లండన్ వెళ్ళబోయే ముందు.

'ఏమైంది! పాస్‌పోర్టుకు అప్లయ్ చేశావా!'

'చేశాను సర్' అన్నాడతను నిజం చెప్పడం ఇష్టం లేక.

"దట్స్ గుడ్. అది రాగానే పర్టిక్యులర్స్‌తో కేబుల్ ఇవ్వు. వీసా సంగతి నేను చూసుకుంటాను. వుంటాను, బై, బై."

ఆ రోజంతా ఆలోచించాడు రాజా. ఎటూ నిర్ణయించుకోలేకపోయాడు.

* * *

నెల రోజులు గడిచిపోయాయి. ఆ రోజు సాయంత్రం ఏదైనా సినిమాకు పోదామని రూం లాక్ చెయ్యబోతున్నాడు రాజా. ఇంతలో పక్కింటి అమ్మాయి వచ్చింది ఫోన్ వచ్చిందంటూ.

"హలో మిస్టర్ రాజా!" అంది అవతలి ఆడ గొంతు.

"స్పీకింగ్."

"ఒన్ మూమెంట్ సర్, యాన్ ఓవర్సీస్ కాల్ ఫర్ యూ"

రెండు క్షణాల తర్వాత ఛెస్టర్‌టన్ లైన్లోకి వచ్చాడు.

"హలో రాజా, మై స్వీట్‌బాయ్, హౌ ఆర్యూ!"

"ఫైన్ థాంక్యూ. హౌ ఆర్యూ సర్?"

"ఓ, వెరీ వెల్ థాంక్స్. ఏం చేశావ్ పాస్‌పోర్ట్ సంగతి!"

పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది రాజాకి. నిజానికి అతనింత వరకూ అప్లికేషన్ పెట్టలేదు. గొంతు సవరించుకున్నాడు.

"వస్తుంది సర్, ఇంకో పదిరోజులు పడుతుంది."

"మై గుడ్‌నెస్ అంత లేటా!"

"జెన్నీ ఎలా వుంది!"

"షీ ఈజ్ ఆల్‌రైట్, షాపింగ్ కెళ్ళింది."

"నా అభినందనలు తెలియజేయండి."

"ష్యూర్ నువ్వు మాత్రం అది తొందరగా వచ్చేట్టు చూడు."

"అలాగే."

"ఓకే. బై బై."

సినిమాకు బదులు, తనకున్న ఒకే ఒక్క ఫ్రెండ్ నారాయణను కలవడానికి వెళ్ళాడు రాజా. అతను రైల్వేస్‌లో పని చేస్తున్నాడు. ఈ విషయంలో అతని సలహా తీసుకోవడం మంచిదనిపించింది. అదృష్టవశాత్తూ అతను గదిలోనే వున్నాడు. ఆ రోజు ఆఫ్ అతనికి. అతన్ని నిద్రలేపి విషయమంతా చెప్పేసరికి పావుగంట పట్టింది రాజాకి.

"ఎవడో ఫూల్ తప్ప యిలాంటి అవకాశాన్ని వదులుకోడు. నాకు తెలిసినంత వరకూ నువ్వు ఫూల్‌వి కావు మరి" అన్నాడు నారాయణ.

"అది కాదురా, నాకిక్కడ హాయిగా వుంది. బాధ్యతలు లేవు. డబ్బు, స్టేటస్ సంపాదించాలనే కోరికా, అవసరం లేవు, నా ప్రగతిని చూసి ఎవరు సంతోషించాలి కనుక."

"ఆ కారణాలవల్లే వెళ్ళమంటున్నాను. నిన్నిక్కడ పట్టి బంధించే రక్తసంబంధాలూ, అనుబంధాలూ ఏమీ లేవు, నీకు ప్రపంచంలో ఏ చోటైనా ఒక్కటే నా అనే వాళ్ళెవరూ లేనప్పుడు, అదీగాక వాళ్ళు నిన్ను కావాలనుకుంటున్నారు. వెళ్ళడం వల్ల అంతో, యింతో మేలేగానీ కీడు జరగదు. అసలు పోగొట్టుకోవడనికి మీ దగ్గర ఏం వుందని? వెళ్ళు వెళ్ళు అవకాశాలు అన్నిసార్లూ రావు."

పాస్‌పోర్టుకు అప్లయ్ చెయ్యడం, అదిరావడం, ఛెస్టర్‌టన్ పీటీఏ, విసాలు పంపించడం అన్నీ అయి రాజా విమాన మెక్కేసరికి రెండు నెలలు గిర్రున తిరిగిపోయాయి.

తనను రిసీవ్ చేసుకోవటానికి స్వయంగా ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఛెస్టర్‌టన్, జెన్నీలను చూసి కొంచెం ఆశ్చర్యపడ్డాడు రాజా. మంచు కురుస్తోంది. ఆయనకు ఒంట్లో బావున్నట్టు లేదు. బాగా జలుబు చేసి కాబోలు ముక్కులు ఎర్రబడ్డాయి. లాంగ్‌కోటు వేసుకున్నా చలికికొంచెం వణుకుతున్నాడు. తిన్నగా ఆఫీస్ పైన అతని కోసం తీసుకున్న ఫ్లాట్‌లోకి వెళ్ళారు.

పెద్ద లివింగ్ రూం. ఎడమ పక్కన బెడ్‌రూం, కుడివైపు కిచెన్, ఖరీదైన సోఫాలు, కలర్ టీవి, వాల్ టు వాల్ కార్పెట్టు, థేమ్స్ నదికి అభిముఖంగా ఉంది ఆ ఫ్లాట్. కిటికీలు తెరిస్తే ఆకాశం నుంచి భూమికి తెల్లని పట్టుపరదా వేళ్ళాడుతున్నట్టు మంచు. దూరంగా వెస్ట్ మినిస్టర్ బ్రిడ్జి, మందంగా కదులుతున్న కార్లు. నదిలో విశ్రాంతి తీసకుంటున్న టూరిస్టు బోట్లు.

"కొంతకాలం పాటు నువ్విక్కడే ఉండాలి" అన్నాడు ఛెస్టర్‌టన్.

"ఆ తర్వాత" అడిగాడు రాజా.

"వెల్"......ఏదో చెప్పబోయి ఆగిపోయాడాయన.

"నువ్వు కాసేపు రెస్ట్ తీసుకో మిగిలిన విషయాలు తర్వాత మాట్లడుకుందాం" వెళ్ళిపోయారు జెన్నీ, ఛెస్టర్‌టన్‌లు.

టబ్‌లో కూర్చుని వేణ్ణీళ్ళ షవర్ ఆన్ చేసుకుంటే పదిగంటల ప్రయాణపు బడలికా చిటికెలో తేలిపోయింది. తల తుడుచుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళి ఫ్రిజ్ తెరిచాడు. ఒక అరనిండా బీర్‌క్యాన్‌లు, ఇంకో అరనిండా రకరకాలు ఫ్రూట్ జ్యూస్, ఎగ్స్, బేకన్, పాలు, పెద్ద బటర్ పాకెట్, బ్రెడ్, ఛీజ్ ఉన్నాయి. ఇంకో అరనిండా ఫ్రెష్ వెజిటబుల్స్. కిచెన్ పెద్దది దానికి సరిపడా వుంది కుకింగ్ రేంజ్. ముందు ఓ గ్లాసుడు పాలు తాగి తర్వాత గుడ్లు ఫ్రై చేసి, బ్రెడ్‌టోస్ట్ తయారుచేసుకున్నాడు. సాంబారూ, అన్నం లేని తిండి కడుపునైతే నింపింది గానీ సంతృప్తి నివ్వలేకపోయింది.

సుమారు నాలుగు గంటల పాటు గాఢంగా నిద్రపోయాడతను. ఆ మర్నాడు లంచ్ ఛెస్టర్‌టన్‌లతో, ఆయన కారు వచ్చి అతన్ని తీసుకెళ్ళింది, తన బిజినెస్ గురించీ, అందులో రాజా నిర్వహించవలసిన పాత్ర గురించీ, తీసుకోవలసిన జాగ్రత్తల గురించీ వివరించాడాయన. రాత్రి ఏడు గంటల వరకూ వాళ్ళతోనే గడిపి ఫ్లాట్‌కు చేరుకున్నాడు రాజా.

అది లండన్‌లో అతని మొదటి రోజు.

ఆ తర్వాత మూడు రోజులూ జెన్నీతో కలిసి ముఖ్యమైన ప్రదేశాలన్నీ చూశాడతను. గేట్ వే టూ లండన్‌గా ప్రసిద్ధి పొందిన టవర్ బ్రిడ్జి నుంచీ పోర్ట్ ఆఫ్

లండన్, హైడ్ పార్క్, బేకర్ స్ట్రీట్, పికాడిల్లీ అన్నీ తిరిగారు.

"ఇది మా నగరపు ఒయాసిస్సు, సాయంత్రం వరకు పనిచేసీ చేసీ విసుగెత్తిన జనమంతా విశ్రాంతి కోసం ఇక్కడకు చేరతారు." అంది జెన్నీ ట్రఫాల్గర్ స్క్వేర్‌ను చూపిస్తూ, ఫౌంటెన్లలోంచీ చల్లని నీటి తుంపరలు ఆ ప్రాంతపు గాలిని మరింత చల్లబరుస్తుంటే, ఎన్నెన్నో పక్షులు, ట్రాఫిక్‌తో పాటు కోరస్ పాడుతుంటే ఎందరి కెమేరాలో క్లిక్ మంటుంటే, ఆ ప్రదేశమంతా నిండుగా, వింతగా వుంది రాజాకి.

స్ట్రాట్‌ఫర్డ్‌లో ఎవాన్ నదిమీద బోటు షికార్లు చేస్తూ, అత్యంత పురాతనమైన కలపతో కట్టిన యిళ్ళను చూస్తూ, ఎటుచూసినా పూలు, పచ్చికా తప్ప మరోటి కనిపించని ప్రకృతిలో లీనమైపోయాడు రాజా, స్వచ్ఛతకు నిదర్శనంగా అలల మీద తేలిపోయే చిన్న తెల్ల పడవల్లాటి బాతులు.

"ఇదే షేక్స్‌పియర్ పుట్టినచోటు, ఆయనకు ఈ వాతావరణమంటే ఎంతో యిష్టం. ఇక్కడకాక యింకెక్కడైనా పుట్టివుంటే ఆయన అటువంటి అద్భుతమైన రచనలు చేయగలిగి వుండేవాడా అన్నది అనుమానాస్పదమే. సంవత్సరానికి సుమారు రెండున్నర లక్షల నుండి విజిటర్లు వస్తారు ఈ ప్రాంతం చూడటానికి.....అరే.....ఎందుకు నవ్వుతున్నారు" అని ఆగిపోయింది జెన్నీ.

"ఇండియాలో మీకు నేను గైడ్. ఇప్పుడు ఇక్కడ మీరు నాకు గైడ్ అవుతారని ఎప్పుడూ ఊహించలేదు. అందుకే"

నవ్వింది ఆమె కూడా. ఎల్లుండి జూ, మ్యూజియంలు చూపిస్తాను. ఓకే."

"నో, నో, అయామ్ నాట్ ఇంటరెస్టెడ్ ఎనీమోర్" అన్నాడు రాజా.

"అదేమిటి? పోనీ లండన్ కాసినోలకూ, నైట్‌క్లబ్‌లకూ ప్రసిద్ధి, రాత్రికి తీసుకెళతాను వస్తావా!"

తనను ఏకవచనంతో పిలవడం గమనించాడు రాజా.

"నో లుక్ మిస్ జెన్నీ. నాకవంటే అసహ్యం, నా కేరక్టర్ ఇప్పటి వరకూ ఫెయిర్ అండ్ క్లీన్. ఎటువంటి మానసిక, శారీరక వికారాలకూ లోను కాలేదు నేను. అసలా అవసరమే రాలేదు నాకు. నాకు నా వర్క్‌లో ఉన్న సంతృప్తి, ఆనందం మరి దేన్లోనూ లభించవు. నన్నిలాగే యింకో రెండురోజులు తిప్పితే నాకు పనిలేక పిచ్చెక్కిపోతుంది. నాకు ప్రస్తుతం కావలసింది పని, వినోదం, విలాసాలు కావు."

మర్నాటినుంచీ రెగ్యులర్‌గా ఆఫీస్‌కెళ్ళడం మొదలెట్టాడతను. అతని మొట్టమొదటి పరిచయం యంగ్‌తో, అభినవ్‌యంగ్ అతని పూర్తి పేరు. అమెరికన్. పెళ్ళి కాలేదు ఇంకా. కెమికల్ ఇంజనీర్ అతను. మూడుచోట్ల వున్న ఫ్యాక్టరీలలోని వుత్పత్తిని సూపర్‌వైజ్

చెయ్యడం అతని డ్యూటీ. అతనికింద పని చేయడానికి మరి కొంతమంది ఇంజనీర్లున్నారు. రాజాను ఫ్యాక్టరీలకు తీసుకెళ్ళి ప్రొడక్షన్ అంతా చూపించాడు యంగ్. రాజాకూ, అతనికీ చాలా త్వరగా స్నేహం కుదిరింది.

ఛెస్టర్‌టన్ అసోసియేట్స్‌లో వాళ్ళిద్దరికే అత్యంత ప్రాధాన్యత వుంది. స్టాక్ నిలవ వుండిపోయినప్పుడు ఆర్డర్స్ కోసం పరుగెత్తడం రాజా పని. డిమాండ్ యెక్కువ వున్నప్పుడు ఫ్యాక్టరీల చుట్టూ తిరిగి రాత్రింబవళ్ళు పని చేయించడం యంగ్‌పని. మూడు నెలలు తిరిగేసరికి రాజాకి ఆ ఆఫీస్‌లో తెలియని విషయమంటూ ఏదీ లేకుండా పోయింది.

ఓ రోజు సాయంత్రం రాజా ఫ్లాట్‌కొచ్చాడు యంగ్.

"గుడ్ ఈవినింగ్ మైడియర్ మేనేజర్"

"వెల్‌కం డియర్ ఇంజనీర్. ఏమిటి విశేషం? సడన్‌గా మామీద దయ కలిగింది"

"విశేషమే. విషయం తర్వాత చెబుతాను ముందు నువ్వు రెండు నిమిషాల్లో రెడీ కావాలి, క్విక్" చిటికెలు వేస్తూ కాకటెయిల్ కాబినెట్ వైపునడిచాడతను.

రాజాను కలవడానికి ఎంతో మంది వస్తుంటారు. వాళ్ళందర్నీ ఎంటర్‌టెయిన్ చేయడానికి మినీ బార్ వుంది.

తను ఓ హైబాల్ కలుపుకుని "నీకేం కావాలి" అడిగాడు యంగ్.

"నాక్కావలసింది అక్కడ లేదు. మనదంతా సాఫ్ట్! ఫ్రిజ్‌లో వుంటుంది."

"ఏమిటీ! నువ్వసలు తాగవా, నేనెప్పుడూ గమనించలేదే, బీర్ ఎట్‌లీస్ట్!"

"నో"

"సర్‌ప్రైజింగ్, ప్రత్యేకమైన కారణం ఏదైనా వుందా!"

"చిన్నప్పట్నుంచీ తాగే వాళ్ళంటే భయం నాకు, వాళ్ళ మాటలూ, చేతలూ విపరీతంగా కలవరపరుస్తాయ్ నన్ను. అన్నిటికన్నా ముఖ్యం, దాని వాసన నాకు గిట్టదు."

"అహ్ రబ్బిష్, అసలింత వరకూ ట్రై చేశావా తాగడానికి!"

"లేదు, అవసరం రాలేదు."

"తాగడమనేది ప్రతివాడూ అవసరముండి చెయ్యరు రాజా. జస్ట్ ఫాన్సీ, కమాన్ ట్రై నౌ."

"నో, నెవ్వర్."

"ఈరోజు నా బర్త్‌డే మాన్, కాబట్టి నువ్వు తాగడానికి తగినంత కారణం ఉంది. ఓ గొప్పవాడు పుట్టాడు ఈ రోజు. ఓ మంచివాడి చేత తాగించబోతున్నాడు."

"మొదటిది నిజమేమో గానీ రెండోది అబద్ధం."

"ఆ క్షణమే వస్తే నీకే గుడ్‌బై, కానీ తాగలేను."

యంగ్‌కు నోటమాట రాలేదు. ఇంత మొండివాడిని ఇదే మొట్టమొదటిసారి అతను చూడ్డం. రెండు గుక్కల్లో గ్లాసు ఖాళీచేశాడు.

"ఓ....కే. నువ్వే గెలిచావు. పోనీ నాతో రాత్రికి డిన్నర్‌కు రావడానికి ఏమైనా అభ్యంతరమా!"

"నాటెటాల్."

"వెల్, గెట్ రెడీ దెన్."

"నీ కార్లోనా నేను రాను బాబోయ్." అన్నాడు రాజా ఫోర్ట్‌పాల్కన్ తాళం తీస్తున్న యంగ్‌తో, గట్టిగా నవ్వాడతను.

"ఏం! బాగా స్పీడ్ వెళ్తాననేనా, పోనీ నీకోసం ఈ రోజుకు మెల్లిగా డ్రైవ్ చేస్తానులే"

"అదేం కుదరదు నన్ను డ్రైవ్ చెయ్యనిస్తే వస్తాను, లేకపోతే నాకార్లో వెళ్దాం."

"సరే, రా" అన్నాడు యంగ్ తాళాలు అతనికిస్తూ.

3

కార్లు వ్యక్తిత్వాలకు చిహ్నాలు. అందులోనూ అవి తప్పనిసరియైన ప్రదేశాల్లో వాటికీ, మనిషికీ అవినాభావ సంబంధం ఉంటుంది. ఓ వ్యక్తి ఎటువంటివాడో అతని కారు చూసి చెప్పవచ్చు!

"ఓహ్! అయాం సారీ మె లిటిల్ స్వీట్ బర్డ్. నిన్ను ఈ రకంగా ఎడ్లబండిలో ఈ రోజు తోలించవలసి వచ్చినందుకు చింతిస్తున్నాను" అన్నాడు యంగ్ కారు నుద్దేశించి. రాజా నవ్వి ఊరుకున్నాడు.

ఎనిమిదిన్నరకు సోహెూలో కింగ్స్ అండ్‌క్వీన్స్ ముందు ఆగింది కారు. రెస్టారెంట్ లోపల జనం పల్చగా వున్నారు. వాయిద్యాలు మంద్రంగా మోగుతున్నాయి. అన్ని నైట్‌క్లబ్‌లలాగే అదికూడా చిరుచీకటిగా, విచ్చలవిడిగా, మత్తుగా వుంది. బేరర్ వచ్చాడు. చాప్స్ సాస్డ్‌ఫిష్, ఫ్రెంచ్‌ఫ్రైడ్స్, పొటాటోస్, బ్రెస్ట్ ఆఫ్ చికెన్‌లకు ఆర్డర్ వెళ్ళింది. కార్ల్స్‌బర్గ్ బీర్ మగ్‌లో పోసుకుని బార్ దగ్గర్నుండి యివతలకు వచ్చాడు. యంగ్ ఇంతలో యిద్దరు అమ్మాయిలు వచ్చారు. ఆ టేబుల్ దగ్గరకు, ఫ్లోర్‌షోస్ పదిన్నర, పదకొండు గంటలగ్గానీ మొదలు కావు. అంతవరకూ కాల్‌గరల్స్ బిజీగా వుంటారు. కంపెనీ కోసం తిరుగుతూ ఆ సమయంలో ఆ ప్రదేశంలో ఎటువంటి వాళ్ళుంటారో తెలీనంత అమాయకుడు కాదు రాజా. వస్తూనే ఓ అమ్మాయి యంగ్‌ని ముద్దుపెట్టుకుంది.

"ఈమధ్య ఎక్కడా కనిపించడం లేదు" అంది.

"కొంచెం బిజీ, కూర్చోండి, ఈ పిల్ల ఎవరు, ఆ......ఏం తీసుకుంటారు."

వాళ్ళకు కావలసినవి ఆర్డర్ చేశారు. రెండో అమ్మాయి అనవసరంగా రాజా మీదకు ఒరిగి ఏదో మాట్లాడుతోంది. చవకరకం సెంటూ, ఘాటైన విస్కీ వానల మేళవింపులతో, ఉక్కిరి బిక్కిరయ్యాడు రాజా లేచాడు.

"ఎంజాయ్ యువర్ సెల్ఫ్ యంగ్ నేను పోతున్నాను."

"అదేమిటి, డిన్నర్ పూర్తికాకుండానే' అన్నాడు యంగ్ కాస్త కోపంగా.

"సారీ, నాకీ వాతావరణం పడదు నీక్కావలసిన కంపెనీ దొరికిందిగదా, నన్ను ఇంక వదిలెయ్ నువ్వు."

"డోంటాక్ లైక్ స్టుపిడ్ నా బర్త్‌డేకి ఇంకెవర్నీ కాకుండా నిన్నొక్కణ్ణే ట్రీట్‌కు పిలిపించానంటే నీకెంత విలువ ఇస్తున్నానో అర్థం కావడంలేదా, అంత నిర్మొహమాటంగా లేచి వెళ్ళిపోవడం సభ్యతేనా. ఓకే గాల్స్ గెట్‌లాస్ట్. తర్వాత కనపడండి, లీవ్ అజ్ ఎలోన్" అన్నాడు యంగ్.

ఆ అమ్మాయిలు వెళ్తూ వెళ్తూ తననెంత తిట్టుకున్నాడో తెలియదు రాజాకి. పన్నెండింటికి డిన్నర్ ముగించుకుని తనను ఫ్లాట్ దగ్గర డ్రాఫ్ చేసి మళ్ళీ వెనక్కెళ్ళి ఆ అమ్మాయిలిద్దర్నీ యంగ్ కారెక్కించుకున్న సంగతీ తెలియదతనికి.

రాజా వచ్చిన రెండో నెలలో అతని పేరు మీద అమెరికన్ ఎక్స్‌ప్రెస్ కార్డ్ తీసుకున్నాడు ఛెస్టర్‌టన్. క్రెడిట్ కార్డు అది, ప్రపంచంలో ఏ పెద్ద హోటల్‌కు, ఎయిర్‌లైన్స్‌కు, జ్యువెలర్స్‌కు, షాపింగ్ సెంటర్లకు వెళ్ళినా, దాన్ని చూపిస్తే అప్పు ఇస్తారు వాళ్లు, కావలసింది కొనుక్కుని సంతకం పెట్టడం మాత్రమే చేయవలసింది. ఆ డబ్బు అమెరికన్ ఎక్స్‌ప్రెస్ కంపెనీ చెల్లించేసి తర్వాత ఆ కార్డు స్వంతదారు బ్యాంకు ఎకౌంట్‌లో నుంచి క్లెయిమ్ చేసుకుంటుంది. జేబులో పెన్నీ కూడా లేకుండా లోకమంతా చుట్టి రావచ్చు. దొంగల భయం వుండదు, డబ్బు పోగొట్టుకోవడమన్న సమస్య వుండదు. పైగా స్టేటస్ సింబల్ అది.

ఆ కార్డును తన స్వంతానికి ఉపయోగించుకోవలసిన అవసరం పెద్దగా ఏర్పడలేదు రాజాకి.

* * *

అప్పటి వరకూ తన జీవితాన్ని సమీక్షించుకుంటున్న రాజా, తల వెనక్కు వచ్చి భుజాల మీద చేతులు వేసే వరకూ ఛెస్టర్‌టన్‌ను గమనించలేదు.

"నిన్ను నేనిక్కడికి తీసుకురావడం, ఓ వున్నతమైన స్థానాన్ని నీకు కల్పించడం, జెన్నీ కూడా నీమీద ఏదో అధికారం వున్నట్టు ప్రవర్తించడం, ఇదంతా నీకు కొంచెం

వింతగా అనిపించడంలేదూ!"

"ఆ ప్రశ్న అడగడానికి నాకింత వరకూ అవకాశం రాక ఆగిపోయాను, మిగతా స్టాఫ్‌నెవర్నీ చూడనంత దయతో నన్ను ఆదరిస్తున్నారు. ఇల్లు, కారూ, హెూదా, డబ్బు, ఒకటేమిటి, ఇప్పుడు నాకందుబాటులో లేనిదంటూ యేదీలేదు. ఇందుకు ప్రతిఫలంగా మీకు నేను చేసే సేవ స్వల్పం. ఈ సౌకర్యాలన్నీ కల్పిస్తే నేనే కాదు, ఎవరైనా చేస్తారు మీకీ సర్వీస్. అదీగాక ఇంతకు ముందు మరెవరి చేతుల్లోనూ పెట్టకుండా మీరే స్వయంగా నిర్వహించిన శాఖను నాకప్పగించడంలో మీ ఉద్దేశ్యమేమిటి? ఇప్పుడే కాదు, నన్ను మీరు మొదటిసారి చూసినప్పట్నుంచీ మీ ప్రవర్తన విచిత్రంగానే వుంది. మీ అంతట మీరే కదిలించారు, చెప్పండి, కారణం ఏమిటి?"

ఛెస్టర్‌టన్ మౌనంగా తన టేబుల్ దగ్గరకు వెళ్ళి సొరుగు లాగి ఓ ఆల్బం తీసి రాజాకిచ్చారు చూడమన్నట్టు తెరిచి చూసిన రాజాకి మొదటి పేజీలో తన ఫొటోయే కనిపించింది, కానీ విచిత్రం, అతనికటువంటి డ్రస్ లేదు. ఆ భంగిమలో ఫొటో దిగినట్టు గుర్తు కూడా లేదు.

"ఇదేమిటి, నా ఫొటో మీకెలా వచ్చింది!"

"అది నీది కాదు, నా కొడుకుది. మై ఓన్ సన్, నా రక్తం పంచుకు పుట్టిన నా కొడుకుది"అదోలా అయిపోయిందతని గొంతు.

మళ్ళీ ఓసారి ఫొటోవంక చూశాడు రాజా. నిజమే, తను ఇంత ఎర్రగా లేడు ఎప్పుడూ, అసలు తనకు కలర్ ఫొటోలే లేవు. జెన్నీ ఎందుకు తనమీద జులుం చెలాయిస్తుందో, ఛెస్టర్‌టన్ తనకిన్ని సౌకర్యాలెందుకు కల్పిస్తున్నాడో మొదటిసారి మద్రాస్‌లో తనను చూడగానే వాళ్ళ మొహాలు ఎందుకు మారిపోయాయో, అన్ని ప్రశ్నలకూ ఒకేసారి జవాబు లభించిందతనికి.

"కానీ మీరీ సంగతి నాకెప్పుడూ చెప్పలేదు."

"కారణం వుంది....ఎందుకంటే..." ఆగి ఊపిరి పీల్చుకున్నాడాయన

"వాడు నా జీవితంలో మొదటి శత్రువు. చచ్చిపోయిన వాళ్ళ గురించి చెడు మాట్లాడకూడదుగానీ..."

"అవును. దాదాపు సంవత్సరన్నర క్రితం లాస్‌వెగాస్ నుంచి వస్తూ ఫ్లైట్ కూలిపోయి నికృష్టపు చావు చచ్చాడు. దహన సంస్కారాలకు శవం తాలూకు అవశేషాలు కూడా మిగల్లేదు."

"వాటే పిటీ" అన్నాడు రాజా బాధగా.

"సానుభూతి చూపించవలసింది వాడిమీద కాదు, నామీద, బ్రతికున్నంతకాలం

నా పరువు ప్రతిష్టలను, గౌరవాన్నీ మంటగలిపాడు. నా ఆదాయంలో సగం వాడి ఖర్చు కింద అయిపోయేది. లండన్‌లో ఎన్ని నైట్ క్లబ్బులున్నాయో, అన్నిట్లోనూ వాడు లైఫ్ మెంబర్. వాడు తెలియని వేశ్య లేదు ఈ ఊళ్ళో. వాడికి తెలియని గాంబ్లింగ్ హౌస్ లేదు. వాడికి లేని సుఖరోగాల్లేవు. వాడికి లేనిదల్లా ఒక్కటే నామీద ప్రేమ, నా డబ్బు కావాలి, నేనక్కర్లేదు. వాడి తాగుడికి అప్పిచ్చిన వాళ్ళకు నేను చెల్లువేసి బాకీలు ఎంతో తెలుసా! సుమారు పదివేల పౌండ్లు, ఈ ఊళ్ళో నేనూ, వాడూ తెలియని వాళ్ళు లేరు. నా దౌర్భాగ్యం ఏమిటంటే వాడు నా కొడుకని అందరికీ తెలియడమే. ఆఖరుకు చచ్చిపోయేముందు కూడా దాదాపు ఇరవైవేలు జూదంలో ఓడిపోయి మళ్ళీ డబ్బు కావాలని ఫోన్ చేశాడు. అదే ఆఖరిసారి నేను వాడి గొంతు వినడం. అంతకుముందు ఆరు నెలలుగా వాణ్ణి చూడలేదు. నేను చచ్చినా సరే డబ్బివ్వనన్నాను. తను చచ్చినా సరే నన్ను వదలనన్నాడు. విచిత్రంగా చావే మా మధ్య పరిష్కారం కుదిర్చింది. ఇద్దరం మాట నిలబెట్టుకున్నాం. నేను డబ్బివ్వలేదు. వాడి జ్ఞాపకాలు నన్ను వదలడం లేదు.”

చెబుతున్న ఛెస్టరటన్ ఆగాడు, కళ్ళు తుడుచుకోడానిక్కాదు. ఆరిపోయిన పైప్ తిరిగి వెలిగించుకోవడానికి, పొడిగా ఉన్నాయి ఆ కళ్ళు, కంఠం స్థిరంగా, గంభీరంగా ఉంది.

“నిన్ను మొట్టమొదటి సారి చూసినప్పుడు ఫ్లైట్ యాక్సిడెంట్ మాట అబద్ధమనుకున్నాను. ఆఖరికి వాడే మళ్ళీ ఇండియాలో తేలాడనుకున్నాను. కానీ నీ కళ్ళలో నాకు అమాయకత్వం కనిపించింది. కానీ వాడిలోలా రాక్షసత్వం కనిపించలేదు. నేను కొంచెం నీరసంగావున్నానని, ప్రయాణం బాగా జరగలేదా అని అడిగావు. నేను ముందు చచ్చిపోయినా నా శవం చూట్టానికైనా వచ్చి వుండేవాడు కాదు నా కొడుకు. నన్ను నేను సర్దుకోవడానికి చాలా సమయం పట్టింది. ఇండియాలోనే నున్నన్ని రోజులూ నీ గురించి ఆలోచనలే. జెన్నీకి మొదటినుంచీ తన అన్నతో అనుబంధం ఎక్కువ. రక్తసంబంధం ఒక్కసారిగా తెగిపోవడం ఆమెను విపరీతంగా కుంగదీసింది. వాడెంత దుర్మార్గుడైనా వాడి మరణం నాకూ పెద్ద షాక్. ఆ దెబ్బకు తట్టుకోలేక మార్పు కోసం ఇండియా ప్రయాణం పెట్టుకున్నాం. నిన్నిక్కడకికి తీసుకురావడానికి ముఖ్యకారణం జెన్నీ. ఆమె ప్రోద్బలం వల్లనే నేనూ ఆ నిర్ణయానికి వచ్చాను. మొదటినుంచీ సెంటిమెంట్ల మనిషిని నేను, నా మనసెందుకో అంగీకరించలేదు. నువ్వు చాలా మంచివాడవనీ, తన అంచనా తప్పడానికి వీల్లేదనీ గట్టిగా చెప్పింది జెన్నీ. నా సిద్ధాంతం వేరు. చెడిపోవడానికి అవకాశాలూ, అవసరాలూ లేనంత కాలం మనిషి మంచివాడే. మంచికి ప్రపంచంలో విలువా, గౌరవం ఉండబట్టి తప్పనిసరిగా మంచివాడనిపించుకోవాలనే స్వార్థం కొద్దీ మనిషి మంచిగా ప్రవర్తిస్తాడు. అనుబంధాలు పెంచుకోవడం తేలికే. తెంచుకోవడమే

కష్టం. నా ఇంట్లో పెరిగిన పిల్లయినా, కుక్కయినా సరే నాకు దూరమైతే నేను భరించలేను. అందుకే అసలు పెంచుకోవడమే మానేస్తే మేలంటాను నేను.

నా కొడుకు పోలికలు నీలో వున్నాయి కాబట్టి. నిన్ను తెచ్చుకుని పెంచుకుంటాను. చివరికి నువ్వు కూడా వాడిలా తయారైతే తట్టుకునే శక్తి నాకు లేదు. సర్వసంగపరిత్యాగులనైనా మహాభోగులుగా మార్చేంత మాయానగరం ఇది. నీమీద ఈ ప్రయోగం నేను చేయలేనన్నాను. కానీ జెన్నీ కోసం ఒప్పుకోక తప్పలేదు. ఫలితంగా నువ్విక్కడికి వచ్చావు. నువ్వీ దేశంలో అడుగుపెట్టిన దగ్గర్నుంచీ నీ ప్రతిచర్యా నాకు ఎప్పటికప్పుడు తెలుస్తూనే వుంది. నువ్వేమిటో అర్థం చేసుకోవడానికి నాకు ఆరు నెలలు పట్టింది. సంపూర్ణ స్వేచ్ఛా స్వాంతంత్ర్యాలిచ్చినా నువ్వు వాటిని దుర్వినియోగం చేయలేదు. చెడిపోవడానికి ఎన్ని అవకాశాలుండాలో అన్నీ నీకున్నాయి. కానీ నీ మంచితనం స్వతస్సిద్ధమనీ, ప్రదేశాలూ, పరిస్థితులూ నిన్నేమీ చేయలేవనీ నాకర్థమవడానికింత కాలం పట్టింది. ఈ రోజునుంచీ ఈ ఇంట్లో జెన్నీతో పాటు సర్వాధికారాలూ ఉంటాయి. నిన్ను మొట్టమొదట ఫ్లాట్లో దిగబెడుతూ 'కొంతకాలం పాటు నువ్విక్కడే ఉండాలి' అన్నాను గుర్తుందా, ఆ కొంత కాలం పూర్తయింది. ఇకనుంచీ నీ నివాసం ఇక్కడే. ఈ ఆరునెలల్లో ఏ ఒక్క క్షణంలో నువ్వు తప్పటడుగు వేసినా నిన్ను వెంటనే ఇండియా పంపించేసి ఉండేవాడిని."

ఆయన పైప్ మళ్ళీ ఆగిపోయింది. తిరిగి వెలిగించే ప్రయత్నం చేయలేదాయన. తీసి పక్కన పెట్టాడు.

"మహా అయితే ఇంకో పదిహేనేళ్ళు బ్రతుకుతానేమో. ఇన్నేళ్ళూ నా కొడుకు నాకు చేసిన గాయాల్ని ఈ శేషజీవితంలోనైనా నయం చేసుకుందామనుకున్నాను. వాటిని మాన్పగల శక్తి నీ ఒక్కడికే వుంది. నా కొడుకు ఇప్పుడు నువ్వు నిర్వరిస్తున్న విభాగాన్ని చేపట్టాలనీ, ఎప్పుడూ నా కళ్ళెదుటే వుండాలనీ ఆశపడ్డాను నీలో వాడి పోలికలున్నాయని నీకీ ఉద్యోగం ఇవ్వలేదు. నువ్వు ఏమాత్రం నా అంచనాలకు తక్కువగా వున్నా ఆ శాఖను మళ్ళీ నేనే తీసుకునేవాణ్ణి. నిన్ను ఇన్ని పరీక్షలకు గురిచేసినందుకు ఈ ముసలివాణ్ణి క్షమించు. ఏంజేయను? నా అనుభవాలు నన్ను ఇన్ని జాగ్రత్తలు తీసుకోమని హెచ్చరించాయి.

"ఇప్పుడు చెప్పు, చెయ్యి చాచి అడుగుతున్నాను. నా కొడుకు స్థానాన్ని నువ్వు భర్తీ చెయ్యగలవా? ఎప్పుడూ నాతోనే వుండిపోగలవలవా? నన్ను విడిచి వెళ్ళిపోవుగదూ!" అంటున్నప్పుడు ఆయన గొంతు వణికింది. తలెత్తి పైకి చూసిన రాజానుదటి మీద తనవంకే అభ్యర్థనగా చూస్తున్న కళ్ళలోంచి రెండు కన్నీటి చుక్కలు జారాయి.

ఇంక ఎప్పటికీ విడిపోనంత గట్టిగా అతుక్కుపోయారు. కొన్ని నెలల క్రితం

ఒకరికొకరు తెలియని ఆ ఇద్దరూ.

*   *   *

ఎస్లీ డేవిస్‌లో బ్లాక్ డయల్ గోల్డ్ ఒమేగా తీసుకున్నాడు రాజా. డైమండ్ స్టడెడ్ బ్రేస్‌లెట్ తీసుకుంది జెన్నీ. ఆ రోజే అమృత పుట్టినరోజు. ఇద్దరూ కలిసి జెన్నీ జాగ్వార్‌లో గ్రేంపియన్ గార్డెన్స్ వున్న అమృత ఇంటికి వెళ్ళేసరికి టైం ఎనిమిదయింది. బయట వరసనే నిలబెట్టి వున్న రోల్స్‌రాయిస్‌లు, మెర్సిడెజ్‌లు, కాడిలాక్‌లు, ఆ యింటికివున్న పరిచయాలు ఎంత పెద్దవో సూచిస్తున్నాయి. కారు పార్క్ చేసి లోపలికెళ్ళారు.

ఏచోట కాలిడినా తన ప్రత్యేకతను నిలబెట్టుకునే భారతీయ సంస్కృతి చీరకట్టుకుని అమృత రూపంలో, గుమ్మంలో నిలబడి ఆహ్వానిస్తోంది అతిథుల్ని. క్రీమ్ ఆఫ్ సొసైటీతో అప్పటికే సగం హాలు నిండిపోయింది. దేదీప్యమానంగా వెలుగుతున్న షాండిలీర్లు ఆడవాళ్ళ వజ్రాలహారాల మెరుపులతో పోటీ పడలేకపోతున్నాయి. షాంపేన్ వెయిటర్ల ట్రేల్లోంచీ అతిథుల గ్లాసుల్లోకి ప్రవహిస్తోంది.

"ఇలాంటి పుట్టినరోజులు ఇంకెన్నో నువ్వు చేసుకోవాలని కాంక్షిస్తూ ఈ చిన్న కానుక." అంది జెన్నీ అమృతకు తన ప్రజంటేషన్ అందిస్తూ.

"నీ అభిమానాన్ని మించిన కానుక నాకింకేముంది జెన్నీ" అంది అమృత. కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పింది వాచీ ఇచ్చిన రాజాకి.

"రండి గెస్ట్సని పరిచయం చేస్తాను" అంది అమృత.

"ఒక్క నిముషం" అన్నాడతను. ఏమిటన్నట్టు చూసిందామె.

"మరేం లేదు. కేవలం కొన్ని గంటల వరకే పరిమితమైన ఈ పరిచయాలంటే నాకు పెద్ద ఆసక్తి లేదు. బిజినెస్‌మాన్‌ని. అయినా తెల్లవారితే వాళ్ళెవరో, నేనెవరో, ఈ కాస్సేపటికే ఎన్నో ఫార్మాలిటీస్, ఎంతో ఆప్యాయత, ప్రేమ ఒలకబోయడం నాకు చేతకాదు. ఏకాంతం ఇష్టం నాకు, మీరేమీ అనుకోకపోతే నేను లోపలికెళ్ళి మీ అమ్మగారితోనో, నాన్నగారితోనో కబుర్లు చెబుతూ కూర్చుంటాను."

ఆశ్చర్యంగా చూసిందామె.

"అచ్చం మా డాడీ మెంటాలిటీయే. ఆయనా అంతే. అదుగో తప్పనిసరై వాళ్ళతో మాట్లాడుతున్నారుగానీ లేకపోతే ఈపాటికి బయట తోటలో కూర్చుని పుస్తకం చదువుకుంటూ వుండేవాడు ఈ టైంలో. వుండండి పిలుస్తాను" అని ఎవరితోనో మాట్లాడుతున్న వాళ్ళ నాన్న గారి దగ్గరకు వెళ్ళింది అమృత.

ఆయన వృత్తిరీత్యా డాక్టర్, ప్రాక్టీస్ మీదకన్నా పుస్తకాలమీద ధ్యాస ఎక్కువ. అందుకే ఎక్కువ మంది పేషంట్లూ వుండరు, ఫ్రెండ్సూ వుండరు.

"డాడీ, మీట్ మై ఫ్రెండ్ రాజా మన తెలుగువారే. జెన్నీ వాళ్ళ ఆఫీసులో సేల్స్ మేనేజర్. మీకు సరిగ్గా సరిపోయే కంపెనీ."

"చాలా సంతోషం మిస్టర్ రాజా. నా పేరు రమేష్? ఏమిటో ఇంత దూరం వచ్చాం. బ్రతుకుదెరువు కోసం, మన అనేవన్నీ వదులుకుని, పదండి బయట లాన్‌లో కూర్చుందాం. తెలుగువాళ్ళను చూస్తే ఎంతో ఆత్మీయుల్ని చూసినట్లనిపిస్తుంది. మనసు విప్పి కష్టం, సుఖం చెప్పుకోవాలనిపిస్తుంది" ఆప్యాయంగా రాజా భుజం మీద చెయ్యి వేస్తూ అన్నారాయన.

"అదుగో రజనీ కూడా వచ్చేశాడు. గెస్ట్స్‌ని మీరు ఎంటర్‌టైన్ చెయ్యండి బేబీ, మేం కాసేపు అలా స్వేచ్ఛావాయువులు పీల్చుకొస్తాం." అన్నాడు రమేష్.

రజనీకాంత్ అమృత అన్న. పచ్చటి శరీరఛాయ. ఆరున్నర అడుగుల ఎత్తు. చూడగానే ఆకర్షించే రూపం అతనిది. అతను వేసుకున్న పియర్ కారిన్ సూట్ బట్టలమీద అతనికున్న అధారిటీని, అభిరుచినీ తెలియజేస్తోంది.

పరిచయాలయ్యాయి తెలుగు కొంచెం యాసగా మాట్లాడతాడు రజనీకాంత్, కాంటినెంటల్ షిప్పింగ్ అనే కంపెనీ నడుపుతున్నాడు. తన కార్డు ఇచ్చి తప్పకుండా ఓ సారి ఆఫీసుకు రమ్మని చెప్పాడు రాజాతో.

లాన్‌లో కూర్చున్నారు రాజా, డాక్టర్ రమేష్‌లు. పచ్చటి పచ్చిక మెత్తగా గిలిగితంతలు పెడుతోంది. ఇంతలో సరస్వతమ్మగారు ట్రేలో షర్బత్ గ్లాసులు తీసుకొచ్చింది. ఆమె అమృత తల్లి.

"అరెరే మీరు తీసుకొస్తున్నారా, ఎవరితోనైనా పంపిస్తే సరిపోయేదిగా." అన్నాడు రాజా లేచి ఆమె చేతిలోన ట్రే అందుకుంటూ, అదే మొదటిసారి అతను లండన్‌లో ఓ అమ్మను చూడటం అప్రయత్నంగా అతని కళ్ళు చెమర్చాయి. రాజాను పరిచయం చేశారు రమేష్‌గారు. ముగ్గురూ కబుర్లలోపడ్డారు. రాజామాటలు, అతని చురుకుదనం, తెలివితేటలు, నమ్రత, సంస్కారం భార్యాభర్తలిద్దర్నీ బాగా ఆకర్షించాయి. గంటలు నిముషాల్లా గడిచిపోయాయి. గెస్ట్స్ ఒక్కొరొక్కరే సెలవు తీసుకుంటున్నారు. వచ్చినవారందరికీ రజనీకాంత్, అమృతలు కృతజ్ఞతలు చెబుతూ గుమ్మంలో నిలబడ్డారు అందరూ వెళ్ళిపోయాక జెన్నీ వచ్చింది. "ఇంక వెళదామా" అంటూ లేచాడు రాజా. వీడ్కోలు తీసుకుంటూ చూశాడు అమృత చేతికి చెప్పలేనంత అందాన్నిస్తోంది. తనిచ్చిన ఒమేగావాచీ అనిర్వచనీయమైన ఆనందమేదో అతని మనసు నాక్రమించుకుంది.

ఛెస్టర్‌టన్, జెన్నీలను బలవంతంగా స్విట్జర్లాండ్ పంపించాడు రాజా. వాతావరణం మారితే అతని ఆరోగ్యం మెరుగవుతుందని. ఆ రోజు ఆఫీసులో కూర్చుని ఉన్నాడు. ఏం

తోచడం లేదు. చెయ్యడానికి పనేమీ లేదు ఫోన్ మోగింది.

"రాజా హియర్"

"బాబూ, నేను సరస్వతమ్మని."

"ఆ! ఏమిటమ్మా!" ఒక్కసారి నిటారుగా అయిపోయాడు. ఒళ్ళు జల్లుమంది అతనికి ఆవిడ గొంతు వినగానే.

"ఏం చేస్తున్నావ్?"

"ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాను. పనేమీ లేక పిచ్చెక్కినట్లుంది."

"మధ్యాహ్నం భోజనానికి రాగలవా?"

తెలుగుదేశపు రుచులు గుర్తొచ్చి నోరూరింది రాజాకి ఒక్క క్షణం.

"ఎందుకులేమ్మా మీకు శ్రమ!" అన్నాడు మొహమాటంగా.

"నాకు శ్రమేముంది, నీ ఒక్కడి కోసం ప్రత్యేకంగా వండటంలేదుగా మాతోపాటే నువ్వూనూ, అమృత కూడా వచ్చేస్తుంది కాస్సేపటిలో, త్వరగా వచ్చేయ్" మళ్ళీ అతను మాట్లాడే అవకాశం యివ్వకుండా ఫోన్ పెట్టేసిందావిడ.

కోటు వేసుకుంటూ టైం చూసుకున్నాడు, పదకొండు దాటుతోంది. బయటకు వచ్చి క్లారాతో మళ్ళీ రెండింటికల్లా వచ్చేస్తాననీ, ఇంపార్టెంట్ ఫోన్‌కాల్స్ ఏమైనా వుంటే అమృత యింటికి డైవర్ట్ చేయమని నంబర్ యిచ్చాడు.

"అరే, చాలా తొందరగా వచ్చేశావే" అంది సరస్వతమ్మగారు ఆప్యాయంగా.

"వంటలో మీకు కాస్త సహాయపడదామనీ."

నిండుగా నవ్వి అందావిడ. "ఎదిగిన ఆడపిల్ల ఇంట్లో ఉండీ, దాని చేతి కాఫీ అయినా తాగి ఎరగం మేము ఎన్నడూ! భోజనానికి పిలిచి నీచేత వంట చేయించుకుని తినమన్నావా! భలేవాడివేలే!"

"పోనీ మీరు వంట చేస్తూండండి. నేను కబుర్లు చెబుతుంటాను" అన్నాడు ఆమె వెనకే నడుస్తూ.

ఆడవాళ్ళను, అందులోనూ వయసు మీరిన వాళ్ళను మంచి చేసుకోవడానికి కొన్ని పద్ధతులుంటాయి. అందులో ముఖ్యమైన సాధనం వంటిల్లు. సరస్వతమ్మగారితో ఆ మాటా, ఈ మాటా చెబుతూనే ఉల్లిపాయలు తరిగాడు. సాంబారు కాచాడు. ఆమ్లెట్లు వేశాడు. గొప్పతనం ఏమిటంటే అతనా పనులన్నీ చేసేసే వరకూ ఆమెకూ తెలియదు. అంతగా మునిగిపోయింది ఆవిడ అతని వాక్చాతుర్యంతో.

డాక్టర్ రమేష్, అమృత కలిసి వచ్చారు పన్నెండింటికి ఇద్దరికీ కొండంత

సంబంధం కలిగింది రాజాని చూడగానే.

"హల్లో యంగ్‌మాన్, ఎలా వున్నావ్" అడిగాడాయన.

"రాజాలా వున్నాను."

"అవును సార్థకనామధేయులు. కిరీటం, కత్తీ, సింహాసనం మాత్రమే తక్కువ" అంది అమృత. ఇద్దరూ శ్రుతి కలిపారు.

"రండి నా గదికి వెళదాం, పోయిన సారి వచ్చినపుడు చూడలేదు గదా!" దారి తీసింది అమృత.

ఎవరిగది వారి వ్యక్తిత్వానికి ప్రతిరూపం. అందుకే ఇల్లు చూస్తే ఇల్లాల్ని చూడనక్కర్లేదన్నాడు. ప్రతి అంగుళంలోనూ అమృత అభిరుచి కొట్టవచ్చినట్టు కన్పిస్తోంది. ఎంతో స్వచ్ఛమైన మనస్తత్వం కలవాళ్ళు తప్పితే తమ నివాసాన్ని అంత అద్భుతంగా, అపురూపంగా కళాత్మకంగా మలుచుకోలేరు. ఐశ్వర్యం అతిశయాన్నిస్తుంది. అభిరుచులనివ్వదు. అవి మనిషికి స్వతహాగా ఉండవలసిందే.

గదిలో అడుగుపెట్టగానే యెదురుగా గోడనిండా ఆక్రమించుకున్న పూలతోట సీనరీగల వాల్‌పేపర్ అది నిజంగా పూలతోటో, బెడ్‌రూమో తెలియకుండా తికమకపెడుతుంది. బాగా విశాలమైన ఆ గదాంతా అల్లుకున్న ఆకుపచ్చని మెత్తటి కార్పెట్ పచ్చికమీద నడుస్తున్న అనుభూతిని కలిగిస్తుంది. ఎడంచేతివైపు పెద్ద వార్డ్‌రోబ్. దాని నానుకుని నిలువెత్తు బెల్జియం అద్దంతో డ్రెస్సింగ్ టేబుల్. ఇంకో పక్కన గోడకు బదులు గ్లాస్ డోర్లు. దానికి ఆకుపచ్చని వెల్వెట్ కర్టెన్లు. డబుల్ బెడ్ మీద ఒకే ఒక్క గులాబీ పువ్వు డిజైన్ వున్న ఆకుపచ్చని దుప్పటి. బెడ్‌నానుకుని వీడియో సిస్టమ్. పక్కనే రికార్డు రాక్. బుక్‌షెల్ఫ్. తలెత్తి పైన చూస్తే చంద్రుడూ, నక్షత్రాల సీలింగ్. ఒక్క క్షణం పాటు ఆరుబయట వెన్నెల్లో వున్నట్లు భ్రమింపజేస్తుంది.

కర్టెన్ పక్కకు లాగి గ్లాస్‌డోర్ తెరిచింది అమృత. అది తోటలోకి దారి ఎదురుగా స్విమ్మింగ్ పూల్ కనిపిస్తోంది. నీళ్ళు నిశ్చలంగా ఉన్నాయి. దూరంగా లాన్స్ కట్ చేస్తున్నాడు ఓ నీగ్రో యువకుడు.

"కూర్చోండి, ఇప్పుడే వస్తాను" అంటూ తోటలోకి వెళ్ళిందామె.

బుక్ షెల్ఫ్ దగ్గరకు నడిచాడతను. జీవితాన్నీ, లోకాన్నీకాచి వడపోసిన హేమాహేమీలందరూ వున్నారుదాంట్లో. మార్క్స్, సార్త్రే, పెరల్ బక్, చెకోవ్, ఓహెన్రీ, గోర్కీ, చలం, రావిశాస్త్రి, జిడ్డు కృష్ణమూర్తిలాంటి ఎందరో. ఇటు తిరిగి రికార్డ్ రాక్‌లో చూస్తే పండిట్ రవిశంకర్, బిస్మిల్లాఖాన్, లతా, ఎల్విన్, జేసుదాస్, రోలింగ్‌స్టోన్స్, ఎరప్షన్ వరకూ లేటెస్ట్ ఎల్పీలు.

అన్ని విధాలుగా అత్యున్నతురాలు ఆమె సంపూర్ణమైన స్త్రీత్వం ఆమె. మూర్తీభవించిన ముగ్ధత్వం ఆమె. అతనికి ఎందుకో ఆ క్షణంలో ప్రతివారు ముందూ చేతులు కట్టుకుని వినయంగా ప్రతిదానికి 'ఎస్ సర్, నో సర్' అంటూ ఎదుటివారిని నొప్పించకూడదనే ప్రయత్నంలో తనను తాను చంపుకుంటున్న ఓ చిన్న సామాన్యమైన గైడ్ గుర్తొచ్చాడు.

రికార్డులన్నీ రాక్‌లో సర్దేసి లేచి నిలబడ్డాడతను. ఆ ప్రయత్నంగా ఓ నిట్టూర్పు వెలువడింది. ఎందుకో అతనికే తెలియదు సరస్వతమ్మగారు వచ్చింది "రండి భోజనానికి, ఏదీ అమ్మాయ్" అంటూ.

తోటలో నీగ్రో యువకుడితో మాట్లాడుతూ డైరెక్షన్స్ ఇస్తోంది అమృత.

ఒకటిన్నరకు అందరూ భోజనాలకు కూర్చున్నారు.

"ప్రపంచంలో కడుపునిండా తినగలిగేవాణ్ణి మించిన అదృష్టవంతుడు లేడు. ఇనప్పెట్టెనిండా ఉన్నవాడికన్నా పొట్టనిండా తిన్నవాడిదే సంతృప్తి అంతా. కాబట్టి యెటువంటి సంకోచాలూ, మెహమాటాలూ లేకుండా భోంచెయ్యి" డాక్టర్‌గారు రాజాకు సలహా చెప్పారు.

4

"మమ్మీ, ఈ రోజు సాంబారు అద్భుతం, రియల్లీ మార్వెలెస్" అన్నాడు రజనీకాంత్. సాధారణంగా దేన్నీ పొగడని కాంత్ నోరువెంట ఆ మాట రావడం విచిత్రమనిపించింది సరస్వతమ్మగారికి.

'నిజం అమ్మా, చాలా బాగుంది. ఇంతకుముందెన్నడూ యింత రుచిగా లేదు ఏమిటి విశేషం?" అంది అమృత.

"అయితే మీరంతా రాజాకు థాంక్స్ చెప్పుకోండి. అతని చేతి మహత్యమే అది."

"వాట్?" మూడు ప్రశ్నార్థకాలు ఒకేసారి.

"వచ్చేదెవరో గానీ సుఖపడుతుంది" అన్నాడు కాంత్ మరికొంచెం పోసుకుంటూ.

"నువ్వు మగవాడివి కాకుండా ఆడదానివై వుండి పాతికేళ్ళ క్రితం కాక యాభై ఏళ్ళ ముందు పుట్టి, అప్పటికి మా ఆవిడ నాకింకా పరిచయం కాకుండా వుండి నువ్విలాంటి సాంబారు రుచి చూపించి వున్నట్టైతే తప్పకుండా నిన్నే పెళ్ళాడివుండేవాడినోయ్" అన్నాడు డాక్టర్‌గారు.

"సో మెనీ ఇఫ్స్.. నో ఛాన్స్. బెటర్ లక్ నెక్స్ట్ ఇన్‌కార్నేషన్ డాడీ" అంది అమృత. నవ్వులూ, కేరింతల మధ్య భోజనాలు ముగిసాయి. తర్వాత అరగంటకు ఆఫీసు

నుంచి ఫోన్ వచ్చింది రాజాకి.

"వెళ్ళొస్తాను" అన్నాడతను కోటు అందుకుంటూ.

"మళ్ళీ యెప్పుడు" అడిగాడు రమేష్.

"ఇలాగే యెప్పుడో" వీడ్కోలు తీసుకున్నాడు రాజా.

రాజా ఆఫీసులో ఆ రోజు మెయిల్ చూస్తున్నాడు. ఇంటర్‌కమ్ మోగింది ఓసారి తన ఛాంబర్‌లోకి రమ్మన్నాడు ఛెస్టర్‌టన్. రాజా వెళ్ళేసరికి ఇద్దరు పార్టీలు కూర్చుని వున్నారు. అక్కడ పరస్పర పరిచయాలయ్యాయి. వాళ్ళకు కావలసిన ప్రొడక్ట్ డాటా, ప్రైస్‌లిస్టూ, కాటలాగ్‌లూ ఇచ్చాడు. అరగంట తర్వాత యాభైవేలకు ఆర్డర్ ప్లేస్ చేసి వెళ్ళిపోయారు వాళ్ళు.

"హాలెండ్ వెళ్ళొస్తావా ఒకసారి!" అడిగాడు ఛెస్టర్‌టన్.

"ఏమిటి పని!"

"గ్రిఫిత్ ఇంటర్నేషనల్' అని ఓ కంపెనీ ఉంది. ఆమ్‌స్టర్‌డామ్‌లో, మూడు నాలుగు సంవత్సరాల క్రితం వాళ్ళతో బిజినెస్ చేశాం మనం. కానీ తర్వాత ప్రస్తుతం మన ఏజెంట్లుగా వున్న మారిసన్ అండ్ గోల్‌డవిచ్‌కి డిస్ట్రిబ్యూషన్ అప్పగించడం జరిగింది. వీళ్ళు చాలా వీక్ పొజిషన్‌లో ఉన్నారు. మనకు కావలసినంత మార్కెట్ తీసుకురాలేకపోతున్నారు. నువ్వక్కడికి వెళ్ళి ఈ రెండు కంపెనీల గురించి తెలుసుకొని అవసరమైతే ఏజెన్సీ మార్చెయ్యాలి. ఇప్పుడు వీళ్ళతో మనకున్న ఎగ్రిమెంటు డిసెంబర్‌తో లాప్స్ అవుతోంది. అక్కడి మార్కెట్ కూడా కొంత స్టడీ చెయ్యాలి నువ్వు. మారిసన్‌వాళ్ళ దగ్గర్నుంచీ మనకు కొంత అవుట్ స్టాండింగ్ వుంది, అది ఎంతో లెక్క చూసి వసూలు చేసుకురావాలి. ఎప్పుడు బయల్దేరుతావ్ మరి!"

ఒక్కసారి తన ఎపాయింట్‌మెంట్లు గుర్తుకు తెచ్చుకున్నాడు రాజా.

"ఈ వారం కుదరదు. నెక్స్ట్ వీక్ వెళ్తాను."

"ఓకే, టికెట్ బుక్ చేయించుకో."

ఆ సాయంత్రం టీవీలో ఆలీ, స్పింక్స్‌ల ఫైట్ చూస్తున్న రాజాకి ఎందుకో సడెన్‌గా రజనీకాంత్ గుర్తొచ్చాడు. వెంటనే అతనిచ్చిన విజిటింగ్ కార్డ్ తీసి నంబర్ చూసి ఫోన్ చేశాడు.

లక్కీగా ఆఫీస్‌లోనే వున్నాడతను. రాజా గొంతు వినగానే ఎంతో ఉత్సాహం వచ్చిందతనికి.

"హాయ్, ఇంటర్నేషనల్ కుక్. మళ్ళీ ఎప్పుడు మీ సాంబారు!"

"ఇంక వేరే పనేమీ లేదా మీకు తినడం తప్ప! లేకపోతే నాకు వేరే పనులేమీ

లేవనుకున్నారా సాంబారు కాయడం తప్పు!"

"అంతకు మించిన పనులేముంటాయ్ మనిషికి. అసలు మనం తిరిగేదే తిండికోసం, తినడమెందుకంటే తిరగడానికి ఓపిక కావాలి కాబట్టి. బాగుంది కదూ!"

"ఊ ఏమిటి విశేషాలు?"

"ఫోన్ చేసింది మీరు, మీరే చెప్పాలి."

"ఊరికే చేశాను, రేపోసారి మీ ఆఫీసుకొస్తాను."

"మోస్ట్ వెల్‌కం, ఏ టైంలో."

చెప్పాడు రాజా "ఓకే. ఆఫీసులోనే వుంటాను, రండి."

"అవునూ, ఈ టైం దాకా యింకా ఆఫీసులోనే వున్నారేమిటి?"

"ఎవరో కేప్టెన్ ఒకతను వచ్చాడు. వాళ్ళ ఓనర్స్‌తో మాట్లాడాలని కాల్ బుక్ చేశాం ఏతెన్స్‌కి, ఇంకా రాలేదు. వెయిట్ చేస్తున్నాం!"

"ఓ.కే. దెన్, సీయూ టుమారో!"

"బై గుడ్ నైట్"

మర్నాడు రజనీకాంత్ ఆఫీసుకు బయల్దేరాడు రాజా.

ఆ ఆఫీసు బాండ్ స్ట్రీట్‌లో ఉంది. బిల్డింగ్ తేలిగ్గానే దొరికింది రాజాకి. కాంటినెంటల్ షిప్పింగ్, ఫోర్త్ ఫ్లోర్ అని ఉన్న బోర్డు చూసి లిఫ్ట్ ఎక్కాడు రాజా. అతను ఆ ఆఫీసులో అడుగుపెట్టేప్పటికి గట్టిగా మాటలు వినబడుతున్నాయి.

"ఐ డోంట్ వాంట్ యువర్ ఇడియాటిక్ ఎక్స్‌ప్లనేషన్స్" తారాస్థాయిలో వుంది రజనీగొంతు. ఫోన్‌లో యెవరితోనో మాట్లాడుతున్నాడు. రాజాని చూసి కూర్చోమని చెయ్యి వూపాడు. పది నిముషాలపాటు అరిచీ బెదరించీ నానా తిట్లూ తిట్టి రిసీవర్ పెట్టేశాడతను.

"బాస్టర్డ్స్ రియల్ బాస్టర్డ్స్."

"ఏమైంది" అడిగాడు రాజా.

"ఏమని చెప్పను? ఒకటా, రెండా మా బాధలు, ఓనర్స్‌కి, కెప్టెన్‌కీ షిప్పర్స్‌కీ ఇంపోర్టర్స్‌కీ మధ్య అన్నిటికీ నలిగి చావాలి, ఈ గాడిద చాకిరీ అంతా చేస్తే మాకు వచ్చే ఆ నాలుగు రాళ్ళు కూడా ఎగ్గొట్టడానికి చూస్తారు వెధవలు."

"ఇంతకీ ఎవరు?"

"ఎవరోలెండి. ఎవరైతేనేం. ఈ బిజినెస్‌లో ఖచ్చితంగా ఉంటే అందరూ శత్రువులే. సిగరెట్ కాలుస్తారా" ఆఫర్ చేస్తూ అన్నాడు రజని.

వద్దన్నాడు రాజా, బోయ్‌ని పిలిచి కాఫీ తెమ్మని విశ్రాంతిగా వెనక్కి వాలాడు రజనీ.

"సారీ ఫర్ దట్ వెలకం."

"ఇట్స్ ఓకే."

ఆ ఆఫీసు మరీ అంత పెద్దదీ కాకుండా, అంత చిన్నదీ కాకుండా వుంది. ఓ మూల టైపురైటర్, దాని పక్కనే రెండు టెలెక్స్ మెషీన్లు, ఓ రెండు పెద్ద ఫైలింగ్ కాబినేట్లు, ఆ గదినానుకుని పక్కనే వున్న ఇంకో గదిలో నలుగురైదుగురు పని చేసుకుంటున్నారు.

"వచ్చేవారం నెదర్లాండ్స్ వెళ్తున్నాను నేను" అన్నాడు రాజా.

"అలాగా ఏమిటి పని."

చెప్పాడు రాజా రజనీకాంత్ తనకు తెలిసిన ఓ అడ్రెస్ యిచ్చి అతనికేమైనా అవసరమైతే ఆ అడ్రస్‌ని కాంటాక్ట్ చెయ్యమన్నాడు.

కాఫీ వచ్చింది, ఓ పదినిమిషాలు కూర్చుని వచ్చేశాడు రాజా.

రాజా ఎయిర్‌పోర్టులోకి అడుగుపెడుతుండగానే ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

"కే ఎల్లెమ్ ఎనౌన్సస్ ద డిపార్చర్ ఆఫ్ దెయిర్ ఫ్లైట్ కే ఎల్ త్రీ టూ ఒన్ ఫ్రం లండన్ టూ అమ్‌స్టర్‌డామ్, పాసెంజర్స్ ఆర్ రిక్వెస్టెడ్ టూ పాస్ త్రూ ది కస్టమ్స్ అండ్ ఇమిగ్రేషన్. థాంక్ యూ."

ఇరవై నాలుగు గంటలూ తిరునాళ్ళలా రణగొణ ధ్వనుల్తో ఉండే లండన్ హీత్రో ఎయిర్‌పోర్ట్ కొత్తవాళ్ళకు ఓ పద్మవ్యూహం. తెలిసినవాళ్ళకు మంచినీళ్ళప్రాయం. ప్రతి నిముషం ఏదో ఫ్లైట్ లాండవుతూనే, టేకాఫ్ అవుతూనో ఉంటుంది. అన్ని విమానాల్నీ, అంత మంది ప్రయాణీకుల్నీ సమన్వయ పరుచుకుంటూ ఏ వొక్కరికి అసౌకర్యం కలగకుండా వుండటానికి అనునిత్యం ప్రయత్నిస్తుంటారు ఎయిర్‌పోర్ట్ స్టాఫ్‌లో ప్రతివొక్కరూ.

పాస్‌పోర్ట్, టికెట్ తీసుకుని క్యూలో నిలబడ్డారు రాజా. ఐదు నిముషాల్లో అతని వంతు వచ్చింది. బేగేజ్ వెయ్ చేయించి బోర్డింగ్ పాస్ తీసుకుని, కస్టమ్స్ ఇమిగ్రేషన్ ఫార్మాలిటీస్ ముగించుకుని డిపార్చర్ లాంజ్‌లోకి వచ్చాడు. ఫ్లైట్ ఇండెక్స్‌లో కేఎల్లెమ్ గేట్ నంబర్ ఎయిట్ అని సూచిస్తోంది. 'నౌ బోర్డింగ్' క్రింద రెండు పచ్చలైట్లు వెలిగి ఆరిపోతున్నాయి. పాసెంజర్స్ విమానం ఎక్కుతున్నారన్న గుర్తుగా.

కె.ఎల్.ఎం.ప్రయాణీకులకు మంచి అతిథ్యమివ్వడంలో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన అత్యంత పురాతనమైన రాయల్ డచ్ ఎయిర్‌లైన్. కడిగిన ముత్యంలా తళతళలాడుతూ చిరునవ్వుతో యెదురొచ్చి విష్‌చేసి బోర్డింగ్ పాస్‌లో నంబర్ చూసి "దిస్‌వే ప్లీజ్" అంది బ్లూ యూనిఫాంలోని ఎయిర్ హెూస్టెస్. ఆమె చూపించిన సీట్లో కూర్చోబోతూ పక్కకు తిరిగి చూసి అవాక్కైపోయాడు రాజా.ఒక్క క్షణం అతని గుండె

లయ తప్పింది. అమృత వుంది ఆ సీట్లో.

"మీరు...మీరు"... మాటలు తడబడ్డాయతనికి.

"ఆ, నేనే పరాయిదేశం వెళ్ళేటప్పుడు స్నేహితులకు చెప్పాలనే కనీస మర్యాద కూడా తెలియకుండాపోయిందా మీకు" లోగొంతులో అందామె. మాట పెగల్లేదతనికి కాస్సేపటివరకూ.

"నేను మీకు చెబుదామనే ఫోన్ చేశాను. కానీ మీ ఇంట్లో ఎవరూ లేరు అప్పుడు."

"అబద్దాలు చెప్పేవాళ్ళంటే నాకిష్టం ఉండదు."

"అయితే ఇంకెప్పుడూ చెప్పను" అనేశాడు రాజా.

"అంటే ఇంతకు ముందు మీరు చెప్పింది అబద్ధమన్నమాటేగా."

"అబ్బే.....అది కాదూ......అంటే....."

"అలా కంగారుపడేవాళ్ళన్నా నా కిష్టం ఉండదు"

"ఇంకెప్పుడూ పడను" గంభీరంగా ఉండటానికి ప్రయత్నిస్తూ అన్నాడతను.

నాకిష్టంలేని పనులు చేయకుండా ఉండాలనే తాపత్రయం ఎందుకు మీకు?"

వయసులోవున్న స్త్రీమాత్రమే మగవాణ్ణి అలా కార్నర్ చెయ్యగదు. ఆమె ప్రశ్నకు రాజాకే సమాధానం తెలియదు, ఆమెకేం చెప్పగలడు.

"మరి నాతో చెప్పకుండా మీరెలా బయల్దేరారు" అడిగాడతను.

"అసలు నేను వెళ్ళవలసింది ఎల్లుండి, నిన్న మీ ఆఫీస్‌కి ఫోన్ చేస్తే క్లారా చెప్పింది మీ ప్రయాణం సంగతి. మీరు లేరప్పుడు, ఏదో పనిమీద బయటకు వెళ్ళారట."

ఆమె కళ్ళలోకి చూశాడు ఓసారి. ఎల్లుండి వెళ్ళవలసిన మీరు ఈరోజే వస్తున్నారెందుకని అన్న ప్రశ్నార్థకం ఆ చూపు కర్థం ఆమెకళ్ళు చెప్పిన జవాబు మాత్రం అతనికర్థం కాలేదు.

"మీ కోసమే" అని కావచ్చు

"మీకోసం మాత్రం కాదులెండి" అనైనా కావచ్చు.

"మనకు పక్కపక్క సీట్లు దొరకడం ఎంత యాదృచ్ఛికమో చూడండి" అంది అమృత.

అదృష్టం కూడానూ అనుకున్నాడు రాజా. ఎనౌన్స్‌మెంట్ వినిపించింది. "గుడ్‌డే, లేడీస్ అండ్ జెంటిల్మన్. వెల్‌కం టూ ద పాసెంజర్స్ ఆన్ బోర్డ్ కే ఎల్లెమ్ ఫ్లైట్ త్రీ టూ ఒన్ టూ ఆమ్ స్టర్‌డాం వియార్ రెడీ ఫర్ టేకాఫ్ నౌ, యూ ఆర్ రిక్వెస్టెడ్ టు ఫాజెన్ యువర్ సీట్ బెల్ట్స్ అండ్ కైండ్లీ ఎక్స్‌టింగ్విష్ యువర్ సిగరెట్స్ థాంక్ యూ."

సీట్ బెల్ట్స్ కట్టుకున్నారు. మరి కాసేపటికి వాళ్ళెక్కిన బోయింగ్ 747 విమానం ఇంగ్లీష్ ఛానల్ మీద ఎగురుతోంది.

"ఏం పనిమీద వస్తున్నారు" అడిగాడు రాజా.

"ఎవాన్ కాస్మెటిక్స్ వాళ్ళ కాన్ఫరెన్స్ ఒకటి జరగబోతోంది ఎల్లుండి సాయంత్రం. నాలుగురోజులపాటు ఉంటుంది అది. ఒకరోజు మీటింగుకు చీఫ్ గెస్ట్ నేను. శరీరాన్ని అందంగా ఎలా వుంచుకోవాలన్న విషయం మీద ప్రసంగించాలి"

"రైట్ జాబ్ ఫర్ ఏ రైట్ గర్ల్" అన్నాడు రాజా.

చిన్నగా నవ్వింది అమృత. ఇంతలో మళ్ళీ ఎనౌన్స్‌మెంటు, ఫ్లైట్ లాండవబోతోందనీ, సీట్ బెల్ట్స్ కట్టుకోమనీ, అసలు ఎక్కినంతసేపు పట్టదు లండన్, ఆమ్‌స్టర్‌డామ్‌ల మధ్య ప్రయాణం.

సిఫోల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగుతూ టైం చూసుకున్నాడు రాజా. హాలెండ్ టైం ఉదయం పదకొండు గంటలయింది. పార్టీలను ఆ రోజే కలుసుకోవచ్చు అనుకున్నాడతను.

"మీ మకాం ఎక్కడ" అడిగాడు అమృతని.

'ఎల్లుండి నుంచీ అయితే హిల్టన్‌లో సూట్ వుంటుంది నాకు. కానీ ఈ రెండు రోజులూ ప్రాబ్లెమ్. వచ్చేప్పుడు ఎకామడేషన్ గురించి ఆలోచించలేదు. ఇంతకీ మీరెక్కడ దిగేది?"

"అపోలో హోటల్లో, దాంట్లో సేల్స్ మేనేజర్ అది వరకు మా కంపెనీలో పనిచేశాడు. బాస్ ఫోన్ చేసి రూం రిజర్వ్ చేశారు నాకోసం. పదండి మీక్కూడా అక్కడే ట్రై చేద్దాం."

ఇద్దరూ టాక్సీలో హోటల్‌కు వెళ్ళారు. రిసెప్షన్ దగ్గర నిలబడి "చెకింగ్ ఇన్, రాజా ఫ్రం లండన్" అన్నాడు.

"ఓ ఎస్ సర్, మీ రాక గురించి మాకు ముందే వర్తమానం అందింది. దిస్ బోయ్ విల్ షో యూ ద రూం సామానకతనికివ్వండి. వెల్‌కంటూ ఆమ్‌స్టర్‌డాం. ఎంజాయ్ ఏ నైస్ సే" అన్నాడు కౌంటర్ వెనక ఉన్న పాతికేళ్ళ యువకుడు స్నేహపూర్వకంగా నవ్వుతూ.

"థాంక్స్, మీ సేల్స్ మేనేజర్‌ని కలుసుకోవాలి" అన్నాడు రాజా.

"హిజ్ నేమీజ్ నీల్ థాంప్సన్, మీ కోసమే ఎదురు చూస్తున్నారాయన. అసలు ఎయిర్‌పోర్టుకే రావలసింది. పని ఒత్తిడి వల్ల వీలుకాలేదు. మీరు రూంకి పదండి అక్కడికి వచ్చి కలుస్తారాయన."

"థాంక్స్ ఏ లాట్, ఇంకో రూం ప్రొవైడ్ చెయ్యగలరా మాకు" ఇబ్బందిగా తల

గోక్కున్నాతడను.

"వియార్ పుల్లీ బుక్‌డ్ సర్. యూ ఎన్ ఓ కన్వెన్షన్ జరుగుతోంది. ప్రపంచశాంతి ఛత్రదల మీద. వివిధ దేశాల ప్రతినిధులూ రావడంతో ఊళ్ళో పెద్ద పెద్ద హొటళ్ళన్నీ నిండిపోయాయి. మీకో రూం ఎలాట్ చెయ్యడానికే మేము చాలా కష్టపడవలసి వచ్చింది. మిస్టర్ థాంప్సన్‌తో మాట్లాడండి. ఆయన ఎక్స్‌ప్లెయిన్ చేస్తారు మీకు.

ఇంకో గెస్ట్ యెవరో రావడంతో అటు తిరిగాడతను.

లిఫ్ట్‌వైపు నడిచారిద్దరూ. నాలుగో ఫ్లోర్‌లో చివరి రూం వాళ్ళది. బోయ్ సామాను పెట్టి వెళ్ళిపోయాడు. రాజా కోటు తీసి హేంగర్‌కి తగిలిస్తూ "కాఫీ తాగుదామా" అన్నాడు.

రూం సర్వీసికి ఫోన్ చేసి అర్డరిచ్చింది అమృత.

గదంతా చల్లగా ఉంది. అయినా ఇద్దరికీ చెమడలు పడుతున్నాయి. బోయ్ వెళ్ళేటప్పుడు తలుపు లాగి వెళ్ళలేదు. ఓరగా వేసి వుందది. ఆ తలుపును వెయ్యాలో తియ్యాలో అర్థం కాలేదు రాజాకి. ఏం మాట్లాడాలో ఇద్దరికీ తెలియడం లేదు. ఏదో ఒకటి చెయ్యాలి. ఏం చెయ్యాలో తోచడం లేదు. ఇరుకైన మార్గంలోకి వచ్చి ఇకముందుకు వెళ్ళడానికి, వెనక్కు మళ్ళడానికి అవకాశం లేని ప్రయాణీకుల్లా అయిపోయారు ఇద్దరూ. అటూ, యిటూ పచార్లు చేయసాగిందామె చేతులు వెనక్కు కట్టుకుని, టాయిలెట్‌లోకి వెళ్ళి మొహం కడుక్కున్నాడతను అవసరం లేకపోయినా.

5

నీల్ థాంప్సన్ గదిలోకి అడుగుపెట్టి పరిస్థితిని కొంత వరకు గట్టెక్కించాడు. చాలా సరదా మనిషి అతను. ఛెస్టర్‌టన్‌కు ఎంత విలువా, గౌరవమూ ఇస్తాడో రాజాకూ అంతే ఇస్తున్నాడతను. ముగ్గురూ కలిసి కాఫీ తాగారు. రూం కోసం యింకో నాలుగైదు హొటళ్ళకు ఫోన్ చేశాడతను. కానీ యెక్కడా దొరకలేదు.

'ఇంత టైట్‌గా పొజిషన్ యెప్పుడూ లేదు సర్. రేపటివరకూ టైం యివ్వండి. తప్పకుండా యెక్కడో చోట చూస్తాను. ఇంతకీ రూం యెవరికి?

రూం దొరకనప్పుడు ఆమె కోసమని చెప్పడం ఎబ్బెట్టుగా అనిపించింది రాజాకి. ఎలాగో తామిద్దరూ ఒకే గదిలో గడపవలసిన పరిస్థితి. అలాంటప్పుడు తాము దంపతులు కాదనీ, జస్ట్ ఫ్రెండ్సనీ నలుగురికి తెలియడం ఎందుకు?

"నా ఫ్రెండ్ ఒకతన్ని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం ఈరోజు, సాయంత్రానికి అతను రాలేకపోతే వెల్ అండ్ గుడ్. వస్తే ఏదో గెస్ట్‌హౌస్‌లో ఎకామడేట్ చెయ్యాలి మరి." అన్నాడు రాజా. ఏ సహాయం కావలసివచ్చినా తనను పిలవమనీ, రాజాను స్పెషల్‌గా ట్రీట్ చెయ్యమనీ హొటల్ సిబ్బందిని హెచ్చరించాననీ, అతని ట్రిప్ ఆనందంగా గడవాలని

కోరుకుంటున్నాననీ సెలవు తీసుకున్నాడు నీల్. ఎందువల్లనో అతను అమృతతో ఎక్కువ మాట్లాడలేదు.

మళ్ళీ గదిలో నిశ్శబ్దం, గడపవలసిన రాత్రి గురించి ఆలోచిస్తున్నారిద్దరూ. ఇంకో మార్గం లేదని తెలుసు, ఏదో తప్పు చేస్తున్నట్లు ఫీలౌతున్నాడతను. మారిసన్ అండ్ గోల్డ్ విన్‌కు ఫోన్ చేశాడు. పార్ట్‌నర్స్‌లో ఒకరైన గోల్డ్‌విన్ దొరికాడు. టూకీగా తను వచ్చిన పని చెప్పాడు రాజా. మధ్యాహ్నం మూడింటికి అపాయింట్‌మెంట్ ఫిక్సయింది.

"ఈ కంపెనీకి ఏదైనా గెస్ట్‌హౌస్ ఉందేమో, నేను దాంట్లోకి మారతాను." అని మళ్ళీ ఫోన్ చెయ్యబోయాడు రాజా. వారించింది అమృత. ఒకటిన్నరకు లంచ్ ముగించారిద్దరూ.

"నేనలా కాసేపు బయటకు వెళ్ళనా, మీరు పడుకుంటారేమో" అన్నాడు రాజా.

అప్పటికే ఓ గట్టి నిర్ణయం తీసేసుకున్న అమృత అతనివంక పదునుగా చూసింది.

"ఎందుకు మీరలా తప్పుకుపోవాలని చూస్తారు! ఈ పరిస్థితి మన ఇద్దరిలో ఏ ఒక్కరమూ కావాలని కల్పించుకున్నది కాదు. మనం స్నేహితులం, దట్సాల్, స్త్రీ పురుష విభేదాలు మర్చిపోయి చూస్తే మనకీ అవకాశం దొరికినందుకు సంతోషించాలి నిజానికి! సముద్రాలూ, దేశాలూ, ఖండాలూ దాటి వచ్చినా మన సంప్రదాయాలూ, కట్టుబాట్లూ, ఆచారాలే మనల్నింకా శాసిస్తున్నాయి. ఒకే గదిలో స్త్రీ, పురుషులిద్దరూ పెళ్ళి కాకుండా గడపకూడదని హెచ్చరిస్తున్నాయి. అందులో మీతో ఆ గిల్టీ ఫీలింగ్, ఆ సంకెళ్ళు తెంచుకుని అప్పుడు కూడా నిర్మలంగా, స్వచ్ఛంగా వుండగలిగితేనే గొప్ప. నిజానికి ఇది మన ఇద్దరి వ్యక్తిత్వాలకూ పరీక్ష. పరీక్షలకు నేనెప్పుడూ భయపడను. మీరూ పిరికివారు కారనీ, బలహీనులు కారనీ నిరూపించుకోండి."

మనిషి యుగాలూ, తరాలూ తపస్సు చేసినా, తన్నుకున్నా అతనికి అంతుపట్టని విచిత్రం సృష్టిలో ఒకటుంది. అదే ఆడది, అసలీ అమ్మాయి తన ప్రయాణం యెల్లుండి పెట్టుకుని ఈ రోజు తనవెంట రావడమేమిటి! తన రూంలో కూర్చుని తనకు పాఠాలు చెప్పడమేమిటి! తన శీలానికి పరీక్ష పెట్టడమేమిటి!

"ఓరే, మూడింటికి నాకు అపాయింట్‌మెంట్ ఉంది. ఆ టైంలో ఏంచేస్తారు మీరు?"

"కింద బుక్ షాప్ చూశాను. పుస్తకాలు ఉంటే ప్రపంచంలో నిమిత్తం లేదు నాకు" అంది అమృత. రెండింటివరకూ ఇద్దరూ కబుర్లు చెప్పుకున్నారు. తర్వాత రాజా డ్రెస్ చేంజ్ చేసుకుని ఆమెను లాంజ్‌లో వదిలి బయటికి వెళ్ళిపోయాడు.

ఆమ్‌స్టర్‌డాంలో ఎక్కువ భాగం పెద్ద పెద్ద పాత బిల్డింగ్‌లే, అందులోనూ ఎక్కువ ఎర్రరంగు ఇటుకలతో కట్టినవి, అలాంటి ఓ పాత బిల్డింగ్‌లో వుంది మారిసన్ అండ్ గోల్డ్‌విన్ ఆఫీసు. ఆ ఆఫీసు వాతావరణమంతా మహా బద్ధకంగా కనిపించింది రాజాకి. ఏ ఒక్కరికీ పనిమీద ధ్యాస లేదు. పుస్తకాలు చదువుతూనో, గోళ్ళు కత్తిరించుకుంటూనో కనిపించారు స్టాఫ్ అంతా. గోల్డ్‌విన్‌కి యాభై అయిదు సంవత్సరాలుంటాయి. బట్టతలమీద మిగిలిన కాసిని వెంట్రుకలూ నెరిసిపోయాయి. వయసుకు మించిన ముసలి వాడిలా కనపడుతున్నాడతను. రాజా అతని గదిలోకి అడుగుపెట్టబోయేసరికి నిద్రనుంచి అప్పుడే లేచిన వాడిలా వున్నాడతను. అతన్ని చూడగానే అనుకున్నాడు రాజా అతని బద్ధకమే ఆఫీసంతటికీ సంక్రమించిందనీ, తన బిజినెస్‌కు కావలసింది యిలాంటి కంపెనీలు కావనీ, తర్వాత జరగవలసినవి చకచక జరిగిపోయాయి. వాళ్ళదగ్గర్నుంచీ రావలసిన డబ్బులో కొంత భాగానికి మాత్రమే చెక్ రాసిచ్చాడు గోల్డ్‌విన్. మిగతాది ఓ వారంలో పంపుతానన్నాడు. ప్రస్తుతానికి ఆర్డర్సేవీ లేవన్నాడు. ఆ ఆఫీస్ బయటికి వచ్చి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు రాజా. వీళ్ళని మార్చెయ్యాలి వెంటనే అనుకున్నాడు. అతను హొటల్‌కు చేరుకునేసరికి ఐదు దాటింది. అమృత రూంలోనే ఉంది.

"బోర్ కొట్టడంలేదా, ఏం చేస్తున్నారు?" అన్నాడు బ్రీఫ్‌కేస్ టేబుల్ మీద వుంచుతూ.

"చదువుకుంటున్నాను. ఇది చదువుతుంటే బోర్ అనే సమస్యలేదు." అప్పుడు చూశాడామెచేతిలో పుస్తకాన్ని, భగవద్గీత, ఓ క్షణంపాటు ఆమె తననెంతో చిన్నవాణ్ణి చేసి తానెంతో ఎత్తుకు ఎదిగిపోయినట్టు ఫీలయ్యాడతను. ఏమిటీ వ్యక్తి! ఆధునిక నాగరికతలో అనుక్షణం మునిగితేలుతూ, ఆధ్యాత్మిక విషయాలు ఆలోచించే తీరిక ఎందరికుంటుంది! పరీక్షకు ప్రిపేరవుతున్నారా అని అడగలేక పోయాడతను.

"మీ వయసుకు మీకున్న అభిరుచులు భలే విచిత్రమైనవి" అన్నాడతను.

"అభిరుచులుంటేనే అనుభవాలు వస్తాయి. అనుభవాలు సంపాదించుకోవడానికి వయసు అడ్డురాదు. జీవితపు చరమాంకంలో యెవరికైనా మిగిలే నిధి అనుభవాలే" అందామె.

ఆ సాయంత్రం నీల్ సలహా మీద లెయిడ్ సే ప్లెయిన్‌కు వెళ్ళారు. నగరం నడిబొడ్డున వివిధ దేశాల ప్రజలలో నిత్యం కళకళలాడే ప్రదేశం అది. మంచి మంచి నైట్‌క్లబ్‌లూ, బార్లూ, టెర్రేస్ రెస్టారెంట్లూ ఉన్నాయి అక్కడ. అవన్నీ ఆనగరవాసుల జీవితంలో అంతర్భాగాలు. సింగ్ ఎల్ క్రాక్ట్ కాలువను ఆనుకుని ఉన్న ఓ రెస్టారెంట్‌లో కూర్చున్నారు ఇద్దరూ, నియాన్ లైట్ల జిలుగులు నీళ్ళ మీద పడి వింతగా ప్రతిఫలిస్తున్నాయి.

నీళ్ళ పైకి వంగి నీటితో ఆటలాడుకుంటున్న చెట్ల కొమ్మలు, కాలువమీద మెల్ల మెల్లగా సాగిపోయే రకరకాల లక్జరీ బోట్స్.

అసలు ఆమ్‌స్టర్‌డాం అందమంతా ఆ కాలువల్లోనే వుంది. రోడ్ల కన్నా ఎక్కువ కాలువలుంటాయి ఆ నగరంలో. ప్రజలకు ముఖ్యమైన రహదారులు అవే. అవి నగరం మూలమూలలకూ విస్తరించి వుండటం వల్ల కార్లకన్నా యెక్కువ బోట్లనే వాడతారు. ప్రజలు శీతాకాలంలో నీరు ఘనీభవించిపోయినప్పుడు తప్ప. ఊరినిండా పాతకాలంనాటి బ్రిడ్జిలే.

సన్నటి సంగీతం వినవస్తోంది. వెయిటర్ మెనూ యిచ్చి నిలబడ్డాడు చేతులు కట్టుకుని.

"మాకు మీ ఊరు కొత్త. మీరు ఏం తింటారో మాకు తెలియదు. మంచి డిషెష్ ఏవో నువ్వే ఆర్డరిచెయ్" చెప్పాడు రాజా.

"ఒక్క పది నిముషాలు, డ్రింక్స్ ఏం తీసుకుంటారు?"

రాజా అమృతవైపు చూశాడు.

"నాకలవాటు లేదు, మీరు కావాలనుకుంటే నాకభ్యంతరంలేదు."

"ఏమీ వద్దు" చెప్పాడు రాజా. కొంచెం వింతగా చూసి లోపలికెళ్లాడు వెయిటర్.

మరి కాస్సేపటికి పొగలు కక్కుతున్న సీ సూప్ బీన్స్ విత్ బేకన్, పొటాటోస్, స్మోక్‌డ్ సాసేజ్ వాళ్ళ టేబుల్‌కు సర్వ్ చేయబడ్డాయి. ప్రతి వంటకంలోనూ డచ్ వారి నైపుణ్యం, అతిథులకు వాళ్ళిచ్చే ఆదరణా, ఆప్యాయతా ప్రతిఫలిస్తున్నాయి. ఫ్రూట్ టార్ట్స్, ఛీజ్ వేపర్స్, కాఫీతో వాళ్ళ భోజనం ముగిసింది.

ఆ రాత్రి వాళ్ళిద్దరి జీవితాలత్లోనూ మరపురాని రాత్రి.

"మీ గురించి చెప్పండి ఏమైనా" అంది అమృత యిటువైపు తిరిగి పడుకుని మోచేతి మీద తల ఆన్చుకుంటూ, కుర్చీలో కూర్చున్నాడతను. టైం పదకొండున్నర దాటి వుంటుంది, అద్దాల తలుపుల్లోంచి చూస్తే బయట అప్పుడే సముద్రంలో స్నానం ముగించి పైకి లేస్తున్నాడు పూర్ణచంద్రుడు.

వేలమైళ్ళ దూరం దాటి ఆంధ్రదేశంలోని అమలాపురంలోకి వచ్చిపడ్డారిద్దరూ. ఎంత చిన్న విషయాన్నైనా ఎంతో నేర్పుగా, శ్రోతల్ని ఆకట్టుకుంటూ చెప్పగలగటం అతని ప్రత్యేకత. కొన్ని క్షణాల్లో కొన్ని సంవత్సరాలు చిన్నవాడైపోయాడతను. అతను చిన్నప్పుడు లాగూలు వేసుకునే వయసులో స్కూల్ ఎగ్గొట్టి గోదావరి ఈతలకు వెళ్ళడం, దొంగచాటుగా కొబ్బరి బొండాలు దించుకుని తాగడం, గోలీలు, గోడుంబిళ్ళా ఆడటం, మాస్టర్ల నేడ్పించడం, తల్లిదండ్రుల్ని ఏక్సిడెంట్లో పోగొట్టుకోవడం, మిగిలిన కొద్దిపాటి

ఆస్తినీ దాయాదులు లాక్కోవడం, భవిష్యత్తుమీద బెంగతో మద్రాసు రావడం, బ్రతుకుతెరువుకై గైడ్‌గా మారడం, ఛెస్టర్‌టన్ పరిచయం, అమృత కలయిక....తన జీవితం యావత్తూ ఆమె ముందు పరిచాడతను.

పాతికేళ్ళ ప్రవాహంలో, ఆ నిరంతర ప్రయాణంలో ఎన్నెన్ని కొండలు, గుట్టలు అతను దాటాడో, ఎన్నెన్ని బండరాళ్ళను ఢీకొన్నాడో, ఎన్ని మలుపులు తిరిగాడో, ఎన్ని చోట్ల జలపాతం కిందకు దూకాడో, ఎన్ని చోట్ల ఆవిరై పైకెగిశాడో, ఎన్ని ముళ్ళకంపల్ని ఒరుసుకున్నాడో, ఎన్నెన్ని అరణ్యాలు చూశాడో, ఎన్ని చిన్న చిన్న నదుల్ని తనలో కలుపుకున్నాడో, తను వెళ్ళి ఏ మహాసాగరంలో కలుస్తాడో అన్నిటిలో... అన్నిటిలోనూ భాగం పంచుకుందామె. పాతికేళ్ళ జీవితాన్ని మళ్ళీ ఒక్క రాత్రిలో జీవించాడతను. అచేతనురాలైన శ్రోతగా మిగిలిందామె. అంతకన్నా అద్భుతమైన, అపురూపమైన అనుభవం అంతకుముందు వారెరగరు. అందుకే ఆ రాత్రి వాళ్ళిద్దరికీ మర్చిపోలేని రాత్రి.

టైం చూసుకుంటే తెల్లవారుఝామున ఐదుగంటలు, ఆమె తలక్రింద చేర్చుకున్న చెయ్యి నొప్పి పెట్టడం అప్పుడు తెలిసిందామెకు. కుర్చీలో కూర్చునీ, కుర్చునీ నడుం నొప్పిపెట్టడం అప్పుడే తెలిసిందతనికి. ఒళ్ళు తెలియని నిద్రపోయారు పదింటివరకూ. ఆ కొన్ని గంటలూ వాళ్ళిద్దర్నీ ఎంతో దగ్గరకు చేర్చాయి.

బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటుండగా నీల్ వచ్చాడు. తులిప్ పూలతో కట్టిన ఓ పెద్ద బుకేను అమృతకిస్తూ. "ఈరోజు నాకు ఆఫ్, మీకు మా నగరం చూపించదలచుకున్నాను. మీరింతకుముందు రాలేదుగదా ఇక్కడికి" అన్నాడతను.

"లేదు ఇదే ఫస్ట్ టైం. థాంక్‌యూ వెరీమచ్ ఫర్ యువర్ ఆఫర్ అండ్ ఫ్లవర్స్" అంది అమృత.

ముందు వాళ్ళిద్దర్నీ సెయింట్ నికోలస్ చర్చికి తీసుకెళ్ళాడతను పందొమ్మిదో శతాబ్దంలో కట్టిన ఆ చర్చి ఆమ్‌స్టర్‌డాంలోని అన్నిట్లోకీ పెద్దదీ, ముఖ్యమైనదీ ప్రొటెస్టెంట్లకూ, కాథలిక్కులకూ ఇద్దరికీ కూడా సెయింట్ నికోలస్ పూజ్యుడు. గౌరవనీయుడు ఆయన గౌరవార్ధం నిర్మించబడిన ఆ చర్చిని ఆనుకుని ఇంకో చిన్న బిల్డింగ్ ఉంది, వీసింగ్ టవర్ అంటారు దాన్ని. పూర్వం తమ భర్తలు సముద్రం మీద వర్తక వాణిజ్యాల నిమిత్తం వెళ్ళి ఇక తిరిగిరాలేని దూరతీరాలకు చేరుకున్నప్పుడు, ఆ నావికుల భార్యలు ఈ ప్రదేశంలో చేరి వారికి అశ్రుతర్పణాలు వదిలేవారట. అందుకే దానికి ఆ పేరు వచ్చింది. హాలెండ్ దేశస్థులకు ప్రకృతి అన్నిటికన్నా పెద్ద శత్రువు. సముద్రం మట్టానికన్నా దిగువనవున్న ఆ దేశాన్ని తుఫానులు, వరదలూ సర్వనాశనం చేసి వదిలి పెట్టేవి. వారికున్న ఓర్పు, నేర్పు, సహనం, పట్టుదలతో సముద్రానిక్కూడా కొన్ని హద్దులు ఏర్పరిచి వాటిని దాటరాదని శాసించారు. అక్షరాలా ఆ శాసనాన్ని

అమలుపరుస్తోంది సముద్రం యిప్పుడు. ప్రకృతి మీద మనిషి సాధించిన విజయానికి ఓ నిదర్శనం ఆ దేశం.

చిన్న అద్దాల పడవను అద్దెకు తీసుకుని మధ్యాహ్నం వరకూ ఊరంతా తిరిగారు. ఎటుచూసినా యెక్కువగా చర్చీలు, బ్రిడ్జీలు కనిపించాయి వారికి. సైకిళ్ళ మీద ట్రాఫిక్ జాంను తప్పించుకుంటూ చకచక తిరిగే ముద్దులు మూటగట్టే చిన్న చిన్న పిల్లలు.

ఆ సాయంత్రం రెయిక్స్ మ్యూజియంకు తీసుకెళ్ళాడు నీల్. దాన్ని గురించి అంతకు ముందు విని వున్నారు రాజా, అమృతలు, ప్రపంచ ప్రఖ్యాతి చిత్రకారుడు రెంబ్రాంట్ చిత్రించిన 'నైట్‌వాచ్' చిత్రం ఆ మ్యూజియకు ప్రాణం. ఫ్రాన్‌హాల్స్, జాన్‌వెర్నీర్ వంటి ప్రసిద్ధ చిత్రకారుల చిత్రాలున్నా, అవన్నీ కేవలం అలంకారప్రాయాలుగా కనిపిస్తాయి ఆ చిత్రంముందు. ఒక గోడమొత్తాన్నీ ఆక్రమించుకున్న ఆ చిత్రం తరతరాల్నుంచీ కాలాన్నెదిరించి నేటికీ నిత్య నూతనంగా విలసిల్లుతోంది. ఆ చిత్రం నుంచీ కళ్ళు తిప్పుకోవడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. చిత్రకారుడి నైపుణ్యం, మేధాశక్తి, నేర్పు, రంగుల మేళవింపులో చాకచక్యం అన్నీ కలిసి ఆ చిత్రానికి ప్రాణప్రతిష్ఠ చేశాయి. తమలాంటి మనుషులే గోడపై నిలబడ్డారా అన్నంత జీవకళ గల ఆ చిత్రానికి ప్రపంచఖ్యాతి లభించడంలో ఆశ్చర్యం లేదనిపించింది వారికి.

తిరిగి తిరిగి అలిసిపోయి రాత్రి ఎనిమిది గంటలకు హోటల్‌కు చేరుకున్నారు వాళ్ళు. భోజనం ముగించి పడుకునేసరికి పది గంటలయింది. వెంటనే నిద్రపట్టేసింది ఇద్దరికి. టెలిఫోన్ మోగుతుంటే మెలకువ వచ్చింది రాజాకి. ఛెస్టర్‌టన్ నుంచి వచ్చిన కాల్ అది చేరిన వెంటనే ఫోన్ చెయ్యనందుకు కోప్పడ్డారాయన. గోల్డ్‌విన్‌తో తన మీటింగ్ గురించి చెప్పాడు రాజా. మర్నాడు గ్రిఫిత్‌ను కలిసి, ఇంకో రెండు మూడు కంపెనీలను కూడా చూసి ఎవరిది నచ్చితే వారికి డిస్ట్రిబ్యూషన్ అప్పగిస్తానని చెప్పాడు. నీ యిష్టం వచ్చినట్టు చెయ్యి అన్నాడు ఛెస్టర్‌టన్. కానీ రోజూ ఫోన్ చెయ్యిమని మరీ మరీ చెప్పాడు.

ఫోన్ పెట్టేసి ఇటు చూసిన రాజాకు తన పక్కనే పడుకుని ఉన్న ఓ పాలరాతి శిల్పం కనిపించింది. ఆపాదమస్తకం తీర్చిదిద్దిన ఒంపుసొంపులు, బ్రహ్మదేవుడు ఆమెను మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని యుగాలు శ్రమించి సృష్టించాడా అనుకునేటంత సౌందర్యం, తను ఎన్ని వేల జన్మలో ఎత్తి అన్ని జన్మల్లోనూ అంతులేనంత పుణ్యం సంపాదించుకుని వుండకపోతే ఈమె తన పక్కన యిలా పడుకోగలిగిన వుండేదికాదు.

తన అర్హతను మరీ మించిపోయినదేదైనా అందుకోవడానికి మనిషి వెనకాడతాడు.

ప్రశాంతంగా నిద్రపోతోందామె నిశ్చింతగా, నిర్భయంగా, ఎంత ధైర్యం, ఎంత ఆత్మ విశ్వాసం!

మృదువుగా ముద్దు పెట్టుకున్నాడతను.

అతని పెదవుల స్పర్శ తగిలి తన అరికాలును కొంచెం వెనక్కు లాక్కుందామె నిద్రలో.

మళ్ళీ రూం మారే ప్రసక్తి తీసుకురాలేదు ఇద్దరూ. నీల్ వచ్చి రూం దొరికిందని చెబితే అక్కర్లేదనీ, తన ఫ్రెండ్ ప్రోగ్రాం కాన్సిల్ అయిందనీ చెప్పాడు రాజా.

అమృత వచ్చిన పనీ, రాజాపనీ ముగిశాయి. ఇద్దరూ తిరిగి లండన్ ప్రయాణమయ్యారు. నీల్ ఎయిర్‌పోర్ట్ వరకూ వచ్చాడు. అతడు తమకిచ్చిన ఆతిథ్యానికీ, తమ పట్ల చూపిన శ్రద్ధకూ కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకున్నారు.

జెన్నీ వచ్చింది రిసీవ్ చేసుకోవడానికి, రాజా, అమృతలిద్దరూ కలిసి రావడం చూసి ఆశ్చర్యపోయిందామె.

రాజా వెళ్ళినట్టు తెలుసుగానీ అమృత కూడా వెళ్ళినట్టు తెలియదామెకు.

"అరే, నువ్వెప్పుడు వెళ్ళావ్, ఎందుకు వెళ్ళావ్."

"ఎవాన్ వాళ్ళ కాన్ఫరెన్స్‌కు వెళ్ళవలసి వచ్చింది. ఇద్దరం ఒకే ఫ్లైట్‌లో వెళ్ళాం, కలిసి తిరిగి వస్తున్నాం నీతో చెబుదామని ఫోన్ చేశాను. కోవెంట్రీ వెళ్ళావట," అంది అమృత.

"ఆ, మా ఫ్రెండ్ పెళ్ళికి వెళ్ళాను. అయితే ఆరోజేనన్న మాట మీరు వెళ్ళింది. వెరీగుడ్, ఎలావుంది హాలెండ్, నాకోసం ఏం తెచ్చావ్ అక్కడ నుండి" అడిగింది జెన్నీ రాజా వంక చూస్తూ.

కోటు జేబులోంచి చిన్న జువెల్ బాక్స్ తీశాడు. ఆమ్‌స్టార్‌డాంలో తను కొన్న యాభై ఎనిమిది కోణాలు గల బ్రిలియంట్ బ్లూ-వైట్ డైమండ్ రింగ్ ఉంది దానిలో.

"ఓ ఫెంటాస్టిక్, మార్వలెస్, సూపర్బ్" అందామె పట్టలేని సంతోషంతో.

"మరేమనుకున్నావ్ అమూల్యమైన అమ్మాయికి అద్భుతమైన కానుక."

"ఐ లవ్ యూ సో మచ్ రాజా, ఐ లవ్ యూ" రెండు చేతులూ తని మెడకు పెనవేసి ఆమె అతని నుదుటిమీద ముద్దు పెట్టుకుంటుంటే అమృత మనసులో ఓ మూల సన్నటి బాధా వీచిక కదలాడింది. కానీ దానిని బయటకు తెలియనిచ్చేటంత సామాన్యురాలు కాదామె.

ముందు అమృతను యింటి దగ్గర దించి తర్వాత యిద్దరూ ఛెస్టర్‌టన్ విల్లాకు వచ్చారు. రాజా అక్కడకు మకాం మార్చి నెలదాటుతోంది. వీళ్లు వచ్చేసరికి ఛెస్టర్‌టన్ ఇంట్లోనే వున్నాడు. ఓ గంటసేపు బిజినెస్ విషయాలు మాట్లాడుకున్నారు. ఆ రాత్రి రాజాకు ఎంతకూ నిద్రపట్టలేదు. తాము ఆమ్‌స్టార్‌డాంలో గడిపిన మొదటి రాత్రి జ్ఞాపకాలే

వెంటాడుతున్నాయతన్ని. బాగా పొద్దుపోయిన తర్వాత తనకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయాడు.

6

చిమ్మ చీకటి, దట్టమైన అడవి, వాతావరణం భయానకంగా వుంది. ఎక్కడో దూరాన్నుంచి సముద్ర కెరటాల ఘోష, వెలుగు జారనివ్వని నక్షత్రాలు చీకటిని పోగేసుకున్న వృక్షాలు.

నిశిరాత్రి ఘనీభవించి ముద్దలైనట్టు పడివున్న కొండరాళ్ళు. ఆ కీకారణ్యంలో వొంటరిగా, వికృతంగా, తలలూపుతున్న చెట్ల మధ్యలో అప్సరసలాంటి ఆడపిల్ల నడిచి వెళ్తోంది.

తెల్లటి ఆమె బట్టలు గాలికి యెగురుతున్నాయి. గుర్రపు డెక్కల చప్పుడు. అది క్రమంగా దగ్గరవుతోంది. నల్లటి గుర్రం మీద రాక్షసుడొకడు కూర్చొని ఆమె కెదురుగా వస్తున్నాడు. అతణ్ణి చూసి ఆమె ఆగింది. నవ్వుతున్నాడు వాడు చెయ్యి చాచి ఆమెను గుర్రం మీదకు లాక్కున్నాడు. ప్రతిఘటించలేదామె. గుర్రం శరవేగంతో దూసుకుపోతోంది. పక్కకు తిరిగి చూసిన ఆమెను పొదల మధ్య పడివున్న ఓ అందమైన రాకుమారుడు కనిపించాడు. రాక్షసుడి అరచేయి ఆమె మెడను బలవంతంగా వెనక్కి వంచింది. మరుక్షణం ఆమె గొంతులో వాడి పదునైన గోళ్లు దిగిపోయాయి. ఎర్రటి రక్తం రాక్షసుడి మొహంమ్మీదకు చింది మరింత భయంకరంగా తయారైంది. గుర్రం మీద నుంచి కిందకు పడిపోయిందామె. మెలికలు తిరుగుతూ, బుసలు కొడుతూ ఆమెను సమీపించింది ఓ పాము, క్షణం తర్వాత ఆ ప్రదేశమంతా పాములే. ఆమె శరీరాన్నంతా ఆక్రమించుకుంటున్నాయి. అడవీ, పాములూ నీళ్ళై ప్రవహించి, ఆ నీళ్ళలో మునిగిపోతోందామె.

కెవ్వున కేక వేసి లేచి మంచిమీద కూర్చుంది అమృత. ఎగిసిపడుతున్న గుండెల మీద చెయ్యి వేసుకుంది. ఎండిపోయిన గొంతు, వణుకుతూ నిండిన పెదాలు, సెగలు చిమ్ముతున్న ఒళ్ళు, మోకాళ్ళను పైకి లాక్కుని తల ఆన్చి ముడుచుకుందామె.

అదే కల. గత కొద్ది రోజులుగా యించుమించు ప్రతిరాత్రీ తన నిద్రను పాడుచేస్తున్న కల. ఎంత భయపడింది తను ఆ కల వచ్చిన మొదటిసారి. విశ్వంలో స్థానం కోల్పోయిన వొంటరి నక్షత్రంలా? ఉధృతంగా కొట్టుకుంటున్న గుండెని చీల్చుకుని బయట పడుతున్నట్లు, చర్మం చిట్లి రక్తం వరదలై పారుతుందేమో అన్నట్లు అనిపించిన ఆ క్షణాలు తను మరిచిపోగలదా! ప్రకృతికి, మనిషికి అతీతమైన ఏదో పైశాచిక శక్తిలా తనను వెర్రిగా కుదిపేసిన కల. తన ఆలోచనల్ని శాపపు నీడలా వెంటాడుతున్న కల.

అలవడిన జీవన దృక్పథం, చదివిన పుస్తకాలు తనను క్రమక్రమంగా ఆ కలకు అలవాటు చేస్తున్నాయి. అందుకేనేమో రాను రాను భయం తగ్గుతొంది. అయినా ఆ కలకు అర్థం ఏమిటి? అందులో ఏదో సందేశం వున్నట్టు అన్పిస్తోంది. ఆ సందేశం ఏమిటి?

తనకున్న జ్ఞానాన్ని, స్వప్నాలపై సాహిత్యం చదివి ఆకళింపు చేసుకున్న దాన్నీ జోడించి దాని సహాయంతో ఆ కలని విశ్లేషించుకోవాలని ప్రయత్నిస్తోంది అమృత. ఆ కల తనకు రావడానికి తోడ్పడిన తన జీవితానుభవాలేమిటి? ఆచేతనతో ముడిపడిన తన మానసిక జీవనం తాలూకూ ఏదో గుప్తమైన విషయంతో ఆ కలకు సంబంధం వుండి వుంటుంది.

తనకు మొట్టమొదటిసారి ఆ కల వచ్చింది బర్త్‌డే పార్టీకి కొన్నాళ్ళు ముందు. కలలో అప్సరస తనే. తనకు అర్థమైనంతలో ఫ్రాయిడ్ రీత్యా ఆలోచిస్తే రాజా రాకతో స్పందించిన తన లైంగిక వాంఛలు, లండన్ సొసైటీలో పెరిగినప్పటికీ తనలో జీర్ణించుకున్న హిందూ సాంప్రదాయ విలువల వల్ల దమనమై కలల్లో తలెత్తుతున్నాయా? రాక్షసుడి రాజాని పోలిలేడు. రాకుమారుడూ లేడు. గుర్రపుస్వారి, పాములు సెక్స్‌ని సూచిస్తాయి. అలాంటి అనుభవం కోసం తను యెదురు చూస్తోందా? అడవిలో వొంటరితనం భద్రత లేమిని సూచిస్తుందా? తన బాల్యానుభవాలు, ఊహాజనితమైన భయాలు కావు కదా! ఒకవేళ తండ్రి పట్ల అభివృద్ధి దశల్లోని తన ప్రేమాభిమానాలు ఇలా వ్యక్తమవుతున్నాయా? ప్రశ్నలూ, సందేహాలూ; సమాధానాల్లేవు.

ఈ కల భావం సెక్స్ అయితే కొంత మేరవరకూ తను వివరించుకోగలదు. రాజా ఆగమనంతో స్పందించి, తను సింబాలిక్‌గా, డిస్టార్టెడ్‌గా సంతృప్తిపడుతోందా? కలలో రాకుమారుడితో రాజాని అసోసియేట్ చేసుకోగలుగుతోంది.కానీ మరి రాక్షసుడో! కాశీమజిలీ కథల్లో తను చదివిన వర్ణనలు, జానపద సినిమాల్లో తను చూసిన ఆకృతులు ఆ ఇమేజరీకి మూలం అయివుంటాయి. రాక్షసుణ్ణి తను ప్రతిఘటించలేదు. అయినా తనెంతో భయపడింది. కల జరుగుతున్నప్పటి తన భావోద్వేగాల్ని గుర్తుకు తెచ్చుకుంది అమృత. మొదటినుంచీ భయమే. కల అంతం సమీపిస్తున్నకొద్దీ భయం ఎక్కువైంది. చివర్లో భూమీ, ఆకాశం దగ్గరై తనను నొక్కిపట్టినంత భయం. పొదల్లో రాకుమారుడు కదల్లేదు. అంటే నిద్రపోతున్నాడా! మెలకువగా వుండే అసహాయుడై వున్నాడా! ఏమో! తెలీదు.

గట్టిగా ఊపిరిపీల్చి, ఈ కలకు అర్థాన్ని తెలుసుకోవాలి అనుకుందామె. లేచి చన్నీళ్ళతో, గొంతు, మొహం తడుపుకుని పడుకుంది. పది నిమిషాల్లో మామూలుగా నిద్రలో మునిగిపోగలిగింది.

*   *   *

"ప్లీజ్ గో యిన్" అని స్వింగ్‌డోర్ తెరిచిపట్టుకుంది డాక్టర్ బర్క్ సెక్రటరీ. "థాంక్యూ" అంటూ కొద్దిగా బెరుగ్గా లోపలికి అడుగుపెట్టింది అమృత.

"గుడ్ ఈవెనింగ్ మిస్ అమృతా" అన్న డాక్టర్ బర్క్ ప్రతిగా విష్ చేస్తూ. వెల్వెట్ కార్పెట్‌లో అడుగులు కూరుకుపోతుంటే మెల్లిగా నడిచి వచ్చి అతని టేబిల్ ముందు కూర్చుంది.

గదిలోపలి కన్‌సీల్డ్ లైటింగ్‌కి, ఆమె కళ్ళు అలవాటుపడి క్రమంగా ఆ గది ఆకృతి సంతరించుకోగాసింది. విశాలమైన ఆ గది అమరికలో ఏదో విశిష్టత వుంది. రెండువైపులా పెయింటింగ్స్‌తో, వాల్‌మేట్స్‌తో, కాబిన్స్‌తో పాటు ఒక పక్కగా ఉన్న పడకలాంటి కుర్చీ దానిపై కుషన్స్. "కౌచ్" అంటారు దాన్ని. దానికి కొన్ని అడుగుల దూరంలో కొంచెం ఎత్తుగా ఉన్న కుర్చీ సెల్‌మేట్స్‌లోంచీ వేలాడుతున్న రాయల్ బ్లూ నైలాన్ కర్టెన్లు. కాబిన్స్‌లో అమర్చిన రకరకాల వస్తువులు, పుస్తకాలు.

డాక్టర్ బర్క్‌కు దాదాపు యాభై ఏళ్ళుంటాయి. అంత వయసుంటుందని చూసి అంచనా వేయడం కష్టం. ప్రపంచ ప్రసిద్ధ సైకియాట్రిస్ట్ అతను. సైకోయెనాలిసిస్ అతని స్పెషాలిటీ. లండన్ సొసైటీ ఫర్ సైకికల్ రిసెర్చ్‌లో పదేళ్ళ పాటు కౌన్సిల్ మెంబర్‌గా వుండి ఒక సారి అధ్యక్షుడై కారణాంతరాల వల్ల రిజైన్ చేశాడు. ఆయన వ్రాసిన "అతీంద్రయ శక్తుల్ని, అతీత మానవశక్తుల్ని నేనెందుకు నమ్మను" అనే పుస్తకం ఎంతో సెన్సేషన్‌కి కారణమైంది. "ఆధునిక సాహిత్యంలో అతీంద్రియ శక్తుల ప్రస్తావన" పై ఆయన వ్రాసిన వ్యాసాల్లో పటిష్టమైన రుజువుల్లేని క్లారివాయడ్స్. టెలిపతీ, పునర్జన్మలాంటి విషయాల్ని పాఠకులపై రుద్దుతున్న రచయితలు నైతిక బాధ్యతల్ని విస్మరించి సమాజానికి అపకారం చేస్తున్నారని దుమ్మెత్తిపోశారు. "అకాడమీల బహుమతులు, యూనివర్శిటీల గౌరవపట్టాలు నా ప్రతిభకు తార్కాణాలు కావు. అంతులేని మానసిక వ్యధతో నా దగ్గరకు వచ్చి చిరునవ్వుతో తిరిగివెళ్ళే నా క్లయింట్సే దానికి గీటురాళ్ళు" అని గర్వంగా చెప్పుకుంటారాయన. ఆయనతో అపాయింట్‌మెంట్ దొరకడమే చాలా కష్టం. అమృత ప్రయత్నించిన నెల్నాళ్ళకుగానీ డాక్టర్ బర్క్‌తో ఆ సమావేశం సాధ్యపడలేదు.

ఎదురుగా వున్న లూయిస్‌వేన్ పెయింటింగ్స్ 'ది కాట్స్' వంకా బ్లేక్ వేసిన 'గోస్ట్ ఆఫ్ ఎఫ్లీ' వంకా, సీలింగ్ నుంచి వేళ్ళాడుతున్న షాండిలీర్ వంకా మార్చి మార్చి చూసింది అమృత. పక్కకు చూస్తే నగ్నంగా వున్న స్త్రీమూర్తి రేఖాచిత్రం. ఈ సెట్టింగ్‌లో ఏదో ప్రత్యేకత ఉంది. డాక్టర్ బర్క్ తనను కోచ్‌మీద పడుకోమన్నప్పుడు కాసేపు సందేహించింది ఊయలలో పసిపాపలా దానిమీద పడుకోవడానికి సిగ్గుపడింది.

"ఇష్టం లేకపోతే వద్దు. ఎలా బాగుంటుందో అలా చేయండి, ఇలా అయితే

మాట్లాడుకోవడానికి వీలుగా వుంటుంది మన యిద్దరికి."

ఇంక ఆమె మొరాయించలేదు.

డాక్టర్ బర్క్ కౌచ్ వెనకాల వున్న పొడవాటి కుర్చీలో కూర్చున్నాడు. సైకియాట్రిస్ట్ ఆమెకు కనపడరు. అతని చూపులు ఆమెను శల్యపరీక్ష చేయవు.

కాసేపు నిశ్శబ్దం.

"ఇలా పడుకుని నేనేం చెయ్యాలి?"

"మాట్లాడండి."

"ఏం మాట్లాడను?"

"ఏదైనా సరే మీ మనసులోనిది."

"చెబితే ఏమౌతుంది?"

"మీ అచేతనని మనం అర్థం చేసుకోవచ్చు. మీ మనసులో ఓ భాగం అది."

"నేను అందుకు రాలేదు." కానీ ఆమెకు తెలుసు తను వచ్చింది అందుకేనని, అయినా ఒప్పుకోలేదు అమృత.

"అచేతన గుంచి నాకెలా తెలుస్తుంది?"

"నేను చెబుతాను."

"నాకేమీ సమస్యల్లేవు. హాయిగా సాగిపోతోంది జీవితం....కానీ...మీకు చెప్పానే...ఆ కల పదే పదే వస్తోంది."

మౌనం...అమృత ఆలోచనల్లో బ్లాంక్‌నెస్, డాక్టర్ వున్నాడా తన వెనుక? వింటున్నాడా?

"ఎస్. అయామ్ హియర్, కంటిన్యూ" ఆమె అనుమానాన్ని నివృత్తి చేస్తూ అన్నాడు బర్క్. అమృత తన భయాల్నీ, కలనీ వివరించింది. డాక్టర్ ఏమైనా చెబుతాడేమోనని ఎదురుచూసింది. కొన్ని నిమిషాలు గడిచాయి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" డాక్టర్ గొంతు.

"మీరేం మాట్లాడలేదు."

"గో ఎహెడ్ అండ్ టాక్."

"ఆ కల వచ్చింది నా బర్త్‌డే పార్టీకి ముందు. బర్త్‌డేకి రాజా వచ్చాడు జెన్నీతో కలిసి...." ఆ తర్వాత మాటలు రానట్లు ఆగిపోయింది. తర్వాత ఏం చెప్పాలి తను. రాజా అంటే తనకిష్టం అనా?

"నేను ఆలోచించే ప్రతి విషయం మీకెందుకు?

"మీరు మాట్లాడే వాటిలో మీకు తెలియకుండానే నాకుపయోగపడే విషయాలెన్నో బయటపడవచ్చు ప్రొసీడ్"

"ఫ్రాయిడ్ గురించి నేనూ చదివాను. నిజంగా నా అసోసియేషన్స్ ఫ్రీగా లేవు."

"ఫర్వాలేదు అసోసియేషన్స్ క్రమేపీ ఫ్రీగా వస్తాయి. దాచడానికి ప్రయత్నించకండి."

బాగా దళసరిగావున్న కళ్ళద్దాలు తీసి తుడుచుకుంటూ గ్లాస్ షెల్ఫ్‌స్‌లో వున్న యాంటిక్స్‌ని చూస్తూ అప్పుడప్పుడు. ప్రశ్నలు వేయసాగాడు డాక్టర్ బర్క్.

కోచ్ మీద విశ్రాంతిగా పడుకున్న అమృత గొంతు సవరించుకుంది. ఇప్పుడు తను చెప్పే విషయాలకి డాక్టర్ బర్క్ ఇస్తున్న వ్యాఖ్యానాలు తనకి బాగా అర్థం అవుతున్నాయి. సాహిత్యంలోనూ, సైకాలజీతోనూ తనకున్న కొద్దిపాటి పరిచయం ఈ అవగాహనకు ఎంతో దోహదం చేస్తోంది.

ఎంత విచిత్రం! ధారాపాతంగా తన ఆలోచనా స్రవంతిని బర్క్ ముందు పోస్తే తనలో దాగి తనవని చెప్పుకోవడానికి వెనకాడే భయపడే, సిగ్గుపడే ఎన్నో అంశాలు బయటకు వస్తున్నాయి. మనసు లోతుల్లోకి తామిద్దర చేసే ఈ మహాయాత్ర ఎంత సాహసోపేతమో అంత విజ్ఞానదాయకం. ఎన్నో విషయాలు తెలుసుకోగలుగుతోంది. తనతో తాను సమాధానపడుతోంది. వర్తమానంలో ఇప్పుడున్న తను, గతం తాలూకూ ప్రభావాల ముద్ద. అయినా కల విషయం పూర్తిగా పరిష్కారమైనట్లననిపించడం లేదు. ఇది తనకు ఏదో ఇంటర్‌వ్యూ. అసలు విషయం మరుగునపడిందేమోననిపించింది అమృతకి.

"అమృతా నీ కల గురించి ఇప్పటి వరకూ ఎనాలిసిస్‌లో నువ్వర్థం చేసుకోగలిగిందీ, దాని వల్ల నీకు కలిగిన ఇన్‌సైట్ నీ మనం ఈ దశలో పరిశీలిద్దాం. ముందు నువ్వర్థం చేసుకున్నదేమిటో చెప్పు." అన్నాడు డాక్టర్.

"ఓకే డాక్టర్, నాలోని లైంగికవాంఛలకీ, ఈ స్వప్నాలకీ సంబంధం వుంది. కోర్కెలకి తలవంచక నేను రెసిస్టెన్స్ చూపాను. నాలో ఓ భాగం అయిన సామాజిక విలువలు దానికి కారణం. కలలోని గుర్రం మీద రాక్షసుడు నా కోర్కెలకు ప్రతినిధి. ఆ కోరికలకు నేను లొంగిపోయాను. రాకుమారుడు నా వూహామూర్తి. నేనుకోరుకునే పురుషుడు. నా బాల్యంలో సెక్స్ భావనతో ముడిపడివున్న అపోహలు. యాంగ్జయిటీ మూలంగా నాలో ఆ భయం, ఆ కల యెప్పుడు వచ్చిందో ఎనాలిసిస్‌లో తెలుసుకున్నాను. అలా రాజాతో పరిచయం అయిననాటి రాత్రి. రాజాపట్ల నాకు రోజురోజుకూ ఏదో బలీయమైన అనుబంధం....ప్రేమ అనొచ్చునేమో దాన్ని......ఏర్పడి బలపడుతోంది.

కదలికలేని రాకుమారుడు తన ప్రేమను వ్యక్తం చేయలేని రాజాకు ప్రతిరూపం. సెక్స్ గురించిన నా బాల్యపు అపోహలు కలలో రక్తానికి కారణం అయితే, రాజాతో పెళ్ళి కాకుండా సంబంధం ఏర్పడితే అది అవినీతి అన్న నా అంతఃకరణో, తల్లినౌతానేమోనన్న భయమో, సర్పాలనీ, నీళ్ళనీ మీరన్నారు. అయితే ఈ భాష్యం సరైనదే అనిపించినా ఏదో సందేశం వుందని నాకెందుకనిపిస్తోంది? ఆ మెసేజ్ ఏమిటి? దీనిలో ఏదో అసమగ్రత వుంది. నాకింకా వివరణ కావాలి." అంది అమృత.

కౌచ్ వెనక నుంచి డాక్టర్ బర్క్ గొంతు మోగింది. మార్దవమూ గంభీరతా మిళితమైన ఆ సైకో ఎనలిస్ట్ అద్భుతమైన గొంతు విన్నకొద్దీ వినాలనిపిస్తుంది.

"చూడు అమృతా, నేనింతకుముందు చెప్పినట్లు అది ఓ పీడకల, కలలు అచేతనని చేరడానికి రాచబాట అంటాడు ఫ్రాయిడ్. అయితే స్వప్నాలకు అర్థాలు వెతకడం ఓ మహా యజ్ఞం. వ్యక్తినుంచీ వ్యక్తికీ, కల నుంచీ కలకీ ఆ అర్థాలు మారతాయి. సైకో ఎనాలిసిస్ నా ఓరియంటేషన్, నీ కలకి నేను అట్లాగే అర్థం చెబుతున్నాను. నీ ఫ్రీ అసోసియేషన్స్ నాకు ఆధారం. నేను పూర్తిగా కనెక్ట్ కాకపోవచ్చు. నీ కలలో వుందని నువ్వనుకుంటున్న ఆ సందేశం. లైంగిక వాంఛలకు నువ్వు తల వొగ్గుతావని కావచ్చు. అయినా మనం వర్కవుట్ చేసిన ఏ వివరణా అసంబద్ధం కాదు.

యుూంగ్, కలల భవిష్యత్తును తెలుపుతాయని భావిస్తారు. నేను అతీంద్రియశక్తుల్ని నమ్మను. నేను జరిపిన విషయ సేకరణనూ, ప్రయోగాలు నిర్వందమైన సాక్ష్యాన్ని ఇవ్వలేదు. అయితే కలలో, ఆ కలలు కనే వ్యక్తికి త్వరలో రాబోయే పరిణామాలు సూచింపబడవచ్చు. కల వ్యక్తిపై ప్రభావాన్ని చూపితే, తదనుగుణంగా తనకు తెలియకుండానే, ఆ వ్యక్తి కల నిజం అయ్యేలా ప్రవర్తించవచ్చు.

ఇన్నాళ్ళ ట్రీట్‌మెంట్‌తో నీ మానసిక సంఘర్షణ పరిష్కారమౌతుంది. కలకు అర్థం తెలిసిన తర్వాత ఆ కల పదే పదే రావడానికి ఆస్కారం లేదు ఈ విశ్లేషణ తర్వాత కూడా నీకు ఆ కల మళ్ళీ వస్తే నాకు తెలియజేయి. నీ అవగాహన నీకు అన్ని విధాలుగా తోడ్పడుతుంది. ఆల్ ది బెస్ట్."

7

కాలం సంధించి విడిచిన బాణాల్లా రోజులు పరిగెడుతున్నాయి. అమృతకు ఆ కల ఇదివరకంత తరచుగా రావడం లేదు.

రాజాతో సాన్నిహిత్యం పెరుగుతున్న కొద్దీ, కలలో రాకుమారుని రూపం రాజా ఆకృతి దాల్చసాగింది. మునుపటిలా కాకుండా, కల చివర్లో, మెలకువ వచ్చినప్పుడు ఆమె భయాందోళనలు చాలా వరకు తగ్గిపోయాయి.

అయితే, కల వచ్చిన ప్రతీసారీ ఆమె కలత పడేది. ఆ కల తనకేదో చెప్పబోతున్నట్లు. అదేమిటో తను తెలుసుకోలేకపోతున్నట్టు భావించేది. డబుల్‌కాట్ మీద గులాబీరేకులపై వొంటరిగా వున్న తన పక్కన రాజావుంటే తన అస్థిత్వాన్నే మరిచి అతని గుండెలపై కళ్ళు మూసుకుని పడుకోగలిగితే అని ఆలోచించేది. ఆ కల ఆమె అంతర్జీవనంలో ఓ భాగం అయిపోయింది. కల వచ్చిన మర్నాటి ఉదయం మొదట్లోలా కాకుండా, ఎనాలిసిస్ తర్వాత స్థిమితంగానే వుంటోంది. చాలా రోజులు డాక్టర్ బర్క్‌ను చూడడం పడలేదామెకు. ఆ కల ఆగిపోనూలేదు.

*   *   *

పార్క్‌టవర్ షెరటన్ హోటల్లో దిగిన ఓ అరబ్ షేక్‌ను కలుసుకుని తిరిగి వచ్చాడు రాజా అప్పుడే. అతను ఆఫీస్‌లో అడుగుపెట్టగానే క్లారా చెప్పింది. అతని కోసం డాక్టర్ రమేష్ అరగంటలో మూడుసార్లు ఫోన్ చేశారని, వచ్చిన వెంటనే పంపించమన్నారని వెంటనే ఫోన్ చేశాడు రాజా విషయం తెలుసుకుందామని.

చాలా ఆదుర్దాగా వుంది ఆయన గొంతు.

“దయచేసి వెంటనే బయల్దేరు రాజా. ఇప్పుడు నన్నేం అడక్కు.”

“అసలు విషయమేమిటి...”

“కాంట్ యూ అండర్‌స్టాండ్. అయామ్ ఇన్ ఏ బిగ్ సూప్. ఉన్నపాటున బయల్దేరు” ఆయన గొంతు గద్గదంగా వుంది.

జరగకూడనిదే ఏదో జరిగింది. అది ఏమిటని ఊహించడానిక్కూడా భయం వేస్తోంది రాజాకి. అమృతకేం కాలేదుకదా. అతని గుండె ఆగినట్టైంది ఆ ఆలోచనకు. వెంటనే బయల్దేరాడతను. అమృత ఇల్లు చేరే లోపల అతని ఆల్ఫా రోమియో నంబర్‌ను నాలుగుచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర వుండే కానిస్టేబుళ్ళు నోట్ చేసుకున్నారు.

పోలీస్ కార్లు రెండు. ఆంబులెన్స్ ఒకటి నిలబడి వున్నాయి ఆ యింటిముందు. లోపలికి అడుగుపెట్టిన రాజాకు అక్కడి దృశ్యం చూసేసరికి నవనాడులూ కుంగిపోయాయి. తన పంచ ప్రాణాల్నీ ఎవరో బలవంతాన తోడేస్తున్నట్టు అయిపోయాడతను. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. అతి కష్టం మీద తనను తాను సంబాళించుకుంటూ మళ్ళీ యింకోసారి చూశాడు. అదే దృశ్యం.

ఎదురుగా సోఫా మీద గుండెల వరకూ దుప్పటి కప్పబడి వుంది రజనీకాంత్ శవం. మొహమంతా నల్లగా కమిలిపోయింది. జుట్టంతా రేగిపోయింది.

నిలబడలేనట్టు సోఫాలో కూలబడి రెండు చేతుల్లోనూ మొహం దాచుకున్నాడతను.

"ఏమిటిది, నాకు ధైర్యం చెబుతావని నిన్ను రమ్మంటే నువ్వే ఇలా ఢీలా అయిపోతే ఎలా" అన్నారు డాక్టర్ రమేష్ పూడుకుపోతున్న గొంతుతో, అతని భుజం మీద చెయ్యి వేస్తూ.

"నిన్నగాక మొన్న పరిచయమైన నాకే గుండెల్లో మంట పెట్టినట్లుంది. రక్తమాంసాలు పంచి ఇచ్చి పాతికేళ్ళు పెంచి పెద్ద చేసి చేతికందొచ్చిన చెట్టంత కొడుకును క్షణాల్లో పోగొట్టుకుని మీరెలా భరించగలుగుతున్నారు డాక్టర్?" దు:ఖంతో అతనికి మాటలు రావడం లేదు. "ఇలాంటి సమయంలోనే మనిషి మనిషిగా నిలబడవలసింది. దేవుడు మనిషితో చేసే యుద్ధంలో అంతిమ విజయం ఎప్పుడూ ఆపైవాడిదే. తాత్కాలికమైన సుఖాలు కల్పించుకుని నేనెంత గొప్పవాణ్ణో అని విర్రవీగుతాడు మనిషి. కానీ వాడి సుఖం ఎంతసేపు? ఆ దేవుడి కన్నుపడేవరకే, నిజానికి ప్రపంచంలో దేవుడు అందరికన్నా అసూయాపరుడు. వాడికి కొబ్బరికాయలు కొట్టేదీ, దండాలు పెట్టేది. మొక్కుకునేదీ, లంచాలిచ్చేది మంచి చేసుకోవడానికే. వాడి మీద ప్రేమ వుండి కాదు. నా సుఖసంతోషాల్ని లాక్కోకు బాబూ అని ఎన్నోసార్లు నేనూ వాడిని ప్రార్థించాను. ఫలితం ఇది. వాడు కొట్టే గట్టి దెబ్బల్ని తట్టుకోగలిగితేనే మనం ఈ జీవనసమరం కొనసాగించగలుగుతాం. ఈ రోజున పచ్చి పుండులా వున్న ఈ గాయం రేపటికి కొంత, ఎల్లుండికి మరికొంత, ఆ తర్వాత మరింతగా మానిపోతుంది. కొన్నేళ్ళకు ఆ గాయం తాలూకు చిహ్నాలు కూడా కనిపించవు ఇక. గుండె దిటవు చేసుకో. జరగవలసిందేమిటో చూడు" అన్నాడు రమేష్.

పోలీస్ ఆఫీసర్లలో పొట్టిగా, లావుగా ఉన్నతను ముందుకు వచ్చాడు.

"నా పేరు మైక్ కానర్స్, స్కాట్లండ్ యార్డ్ డిటెక్టివ్‌ను నేను. మిస్టర్ కాంత్ హత్య కేసును మేము దర్యాప్తు చేస్తున్నాం, మీ నుంచీ కొన్ని వివరాలు కావాలి."

"వాట్, కాంత్ హత్య చేయబడ్డాడా?" అప్పటి వరకూ అదేదో యాక్సిడెంట్ అనుకుంటున్న రాజాకు మరో షాక్ తగిలింది. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. "ఎస్ ఇట్ ఈజ్ ఎ మర్డర్... మెడ వెనక ఒకటీ, గుండెల్లో ఒకటీ బుల్లెట్లు దూసుకుపోయాయి, ఇన్‌స్టెంట్ డెత్."

"ఓ గాడ్. నో...." రాజా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కాంత్ ఎంత చావు బాధ అనుభవించి వుంటాడో తలుచుకుంటే

"ఈ పరిస్థితుల్లో మిమ్మల్ని ఇన్ఫర్మేషన్ కోసం యిబ్బంది పెట్టడం మాకూ బాధాకరంగానే ఉంది కానీ, మా డ్యూటీ మేం చెయ్యాలి. కాంత్‌కు యెవరైనా శత్రువులున్నట్లు తెలుసా!

అడ్డంగా తల ఊపాడు రాజా.

"గడిచిన నెల మూడో తారీఖు సాయంత్రం నేను వాళ్ళ ఆఫీసుకెళ్ళాను. అప్పుడు అతను ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు యామై కరెక్ట్."

స్కాట్లండ్ యార్డ్‌వాళ్ళు దేవుళ్ళు కారు. కానీ వాళ్ళకు ఆ సంగతి ఎలా తెలిసిందన్నది రాజాకి అర్థం కాలేదు. వాళ్ళ ప్రతిభకూ, నేర్పుకూ, ఫాస్ట్‌యాక్షన్‌కూ అది తార్కాణం.

"అప్పుడు ఫోన్‌లో అవతలి పక్కన ఉన్నది ఎవరో మీకు తెలుసా?"

ఒక్కసారి ఆ సాయంత్రం గుర్తుకు తెచ్చుకున్నాడు రాజా. ఎవరితో నువ్వు మాట్లాడింది. అని ఒకటి రెండుసార్లు అడిగినా చెప్పలేదతను ఆ ఫోన్ కాల్‌కు ఇంత ప్రాముఖ్యత ఉంటుందని ఇద్దరిలో ఎవరూ ఊహించలేదు.

"పోనీ ఆ ఫోన్‌లో ఏం మాట్లాడారో చెప్పగలరా!" అడిగాడు మైక్. తనకు గుర్తున్నంతవరకూ చెప్పాడు రాజా. అంతకుముందు రోజు కాంత్ ఎవరో కెప్టెన్‌తో సాయంత్రం ఆఫీస్‌లో వుండడం, గ్రీస్‌కు కాల్ బుక్ చెయ్యడం కూడా వివరించాడు.

"కాంత్ ఇన్ని సంవత్సరాలలోనూ ఎవరితోనూ ఆ రోజు మాట్లాడినంత గట్టిగా, అసభ్యంగా మాట్లాడలేదని ఆఫీస్ స్టాఫ్ చెప్పారు.వారి ద్వారానే మీరు ఆరోజు ఆఫీసుకు వెళ్ళడం, అక్కడ అప్పుడు అతను ఫోన్‌లో మాట్లాడటం మాకు తెలిశాయి. కాంత్‌కు శత్రువులు కూడా ఎవరూ లేరు. అందుకే మేము ఆ ఫోన్‌లోని ఆవతలి వ్యక్తిని అనుమానిస్తున్నాము. ఆ వ్యక్తి ఎవరో తెలిస్తే కేసు తేలిపోయినట్లే. ఎనీ హౌ థాంక్‌యూ వెరీమచ్ ఫర్ ది కోఆపరేషన్."

రాజా స్టేట్‌మెంట్ తీసుకుని వెళ్ళిపోయారు వాళ్ళు. కొద్ది క్షణాల పాటు దుర్భరమైన నిశ్శబ్దం రాజ్యమేలిందా గదిలో." అమ్మగారికి విషయం తెలుసా!" నూతిలోనుంచి వచ్చినట్టుందతని గొంతు.

"తెలుసు, ఆ షాక్‌కి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయింది. ఇప్పుడే సెడెటిన్ ఒకటిచ్చాను. కొంతసేపటి వరకూ నిద్రలేవదిక."

"మరి అమృత!"

"అందుకే అమృత గురించే నిన్నక్కడికి పిలిపించింది దాని కన్నీళ్ళు. నేను చూడలేను. దాని ఏడుపు నేను వినలేను అది బాధపడితే నాకు నరకప్రాయం కొడుకు పోయాడన్న దు:ఖం కంటే కూతుర్నెలా ఓదార్చుకోవాలన్న భయం నన్నెక్కువ పీడిస్తోంది. యూ ఫేస్ హర్, యూ హేండిల్ హర్, నేనిక్కడ వుండలేను. నువ్వే ఏదో ఒకటి చెయ్యి." మరికాస్సేపటికి ఆయన గది తలుపు మూసుకుంది.

లేచి నిలబడ్డాడు రాజా. కాంత్ శవం దగ్గరగా నడిచాడు. అతని తలమీద చెయ్యి వేసి నిమిరాడు. చల్లటి స్పర్శకు అతని ఒళ్ళు జలదరించింది. అయిపోయింది. పట్టుమని పాతికేళ్ళు నిండకుండానే ఓ మంచి మనిషి, సహృదయుడు రాలిపోయాడు. మంచివాళ్ళను దేవుడు తొందరగా తన దగ్గరకు పిలిపించుకుంటాడట. ఆ స్వాగతంలో ఎన్ని గుండెలు అగ్నికీలలౌతాయో, ఆ పిలుపు వల్ల ఎంత మంది కన్నీళ్ళు సముద్రాలవుతాయో వాడికనవసరం, ఎంత స్వార్థపరుడు దేవుడు!

అమృతకు ఫోన్ చేస్తుంటే అతని చేతులు వణికాయి.

"హలో! ఎవరూ అమృతా!"

"హాయ్ రాజా ఏమిటి విశేషం ఎలా ఉన్నారు? ఎక్కణ్ణుంచీ!"

"బాగానే ఉన్నాను. మీ ఇంటి దగ్గర్నుంచే."

"మా ఇంటి దగ్గర్నుంచా, సర్‌ప్రైజింగ్ ఈ టైంలో మీరు మా ఇంట్లో....జోక్ కాదు కదా, అవునూ, మీ గొంతు అలా వుందేమిటి?"

"ఏం లేదు నువ్వోసారి యింటికి రాగలవా!"

"నేనా, ఇప్పుడా, ఇంపాసిబుల్, రాయల్ ఫామిలీనుంచి వొకావిడ వస్తోంది ఆమె కోసం యెదురు చూస్తున్నాను."

"నో అమృతా నువ్వు వచ్చితీరాలి. ఎందుకో, ఏమిటో నేను ఫోన్‌లో చెప్పలేను. నువ్వుమాత్రం వెంటనే బయల్దేరి రావాలి. అండ్ ప్రిపేర్డ్ ఫర్ ఏ షాక్."

కంగారుపడింది అమృత.

"అసలేమైంది రాజా?"

"సమ్‌థింగ్ వియ్ నెవ్వర్ యాంటిసిపేటెడ్, కం క్విక్." ఫోన్ పెట్టేశాడతను. అదురుతున్న గుండెను అదుపులో ఉంచుకుంటూ బయల్దేరింది అమృత.

* * *

అగ్నిపర్వతం బద్దలయింది. లావా ప్రవహించినంత వేగంగానూ, వేడిగానూ ఆమె కన్నీళ్ళు ప్రవహించాయి. దాదాపు అరగంట సేపు ఆమెను పట్టుకోవడం, తట్టుకోవడం చాలా కష్టమైంది రాజాకి. డాక్టర్ రమేష్ ఆమెను ఎందుకు ఎదుర్కోలేకపోయాడో అప్పుడర్థమైందతనికి. ఆమె ఏడ్చి, ఏడ్చి, సొమ్మసిల్లి పడిపోయిన తర్వాతగాని రాజాకి ఊపిరి తిరగలేదు. ఆమె మనస్తత్వం అంత సున్నితమని, మానసికంగా ఎంత ఉన్నతురాలో అంత బలహీనత కూడా ఆమెలో వుందనీ అప్పటి వరకూ తెలియదతనికి. అంతేకాదు తన దాకావస్తే ఏ భగవద్గీతలూ పనికిరావని కూడా అప్పుడే తెలిసిందతనికి. ఆమెకు

వచ్చిన కష్టం సామాన్యమైంది కాదు నిజమే కానీ ఆమె అందరిలాంటి స్త్రీ కాదు, అయినా, ఎంత చదివినా, ఎంత నేర్చినా కష్టాల్ని తట్టుకుని ధైర్యంగా నిలబడగలిగేంత గుండెబలం ఆమెకు లేదు.

సరస్వతమ్మగారు ఆ గదిలోకి వచ్చేసరికి పది రోజులు లంకణం చేసిన దానిలా వున్న అమృత రాజా ఒళ్ళో తల పెట్టుకుని పడుకుని వుంది. ఆయాసంతో ఆమె గుండెలు ఎగిసిపడుతున్నాయి. బుగ్గలమీద కన్నీటి చారికలు. ఒక్క అరగంటలో మనిషి సగమైందామె. రాజా తలను నిమురుతున్నాడు.

"బాబూ రాజా" అతన్ని చూడగానే ఒక్కసారి దు:ఖం కట్టలు తెంచుకుంది సరస్వతమ్మగారికి.

"ఊరుకోండమ్మా, ఊరుకోండి, ఏం చేస్తాం అలా రాసి వుంది" ఆమెను సోఫాలో, కూర్చోబెడుతూ అన్నాడతను. అమృత లేచి తల్లిని కౌగిలించుకుని ఏడవసాగింది.

అటువంటి పరిస్థితిని ఎదుర్కోవడం అదే మొదటిసారి అతని జీవితంలో. తనను ఎంతో అభిమానించే ఆత్మీయులకు అనుకోకుండా వచ్చిన ఆపదకు అతనూ తల్లడిల్లిపోతున్నాడు. ఎంతో సేపటిగ్గానీ డాక్టర్ రమేష్ తన గది వదిలి ఇవతలికి రాలేదు. ఆయన కళ్ళుజ్యోతుల్లా వెలుగుతున్నాయి. మనసులోని వేదనంతా ఆయన మొహంలో కేంద్రీకృతమైంది. ఆయన్ని చూసి సరస్వతమ్మగారు దాదాపు పిచ్చిదైపోయింది. చొక్కాపట్టుకుంది.

"ఏమండీ ఎందుకండి మమ్మల్నిక్కడికి తీసుకొచ్చారు? చెట్టంత కొడుకును మృత్యువుకు బలివ్వడానికా, ఉన్న ఊళ్ళొ అందరికీ తలలో నాలుకలా వుండేవాడే నా బిడ్డ. సముద్రాలు దాటించి మరీ నరకంలోకి తోశారే. నన్ను ఎలా బతకమన్నారు వాడు లేకుండా వాణ్ణి చూడకుండా భగవంతుడా ఏం అపకారం చేశామని మమ్మల్నిలా సాధిస్తున్నావ్. వెళ్ళిపోదామండీ, ఇక్కడ ఇంకొక్క రోజు కూడా ఉండొద్దండీ, నా ఇంకో కన్ను కూడా పోకముందే, నా రెండోచేయి కూడా విరక్కముందే దయచేసి నన్నిక్కణ్ణుంచి తీసుకుపోండి. కట్టుకున్నందుకు, ఇన్నేళ్ళు కలిసి కాపురం చేసినందుకు ఈ ఒక్క ఉపకారం చేసి పెట్టండి చాలు. ఈ క్షోభ నేను భరించలేను, పోదామండి, వెళ్ళిపోదాం"

తల గోడకేసి బాదుకుంటున్న ఆమెను అతికష్టం మీద పక్కకు తీసుకురాగలిగారు.

రజనీ శవాన్ని తీసుకువెళుతుననప్పుడు ఆడవాళ్ళిద్దరికీ స్పృహ లేదు. పరామర్శించడానికి వచ్చే వాళ్ళకు సమాధానాలివ్వడం ఇంట్లో వాళ్ళను కనిపెట్టి వుండడంతో నాలుగు రోజులు పాటు రాజా అక్కడే వుండవలసి వచ్చింది.

"మేము ఇండియా వెళ్ళిపోదామనుకుంటున్నాం" అన్నారు డాక్టర్ రమేష్. రజనీ

పోయిన పదిహనే రోజుల తర్వాత. అమృత బ్యూటీ పార్లర్‌కు వెళ్ళడం లేదు ఎవరికో లీజ్‌కిచ్చేసింది. అస్తమానం గదిలో కూర్చుని తోటవైపు, స్విమ్మింగ్‌పూల్‌లోని నీళ్ళవైపూ చూస్తూ వుంటుంది. నీగ్రో యువకుణ్ణి పనిలోంచి తీసేసింది. అయినా కలలో రాక్షసుడు కనిపించడం మానలేదు. కాంత్ మరణం తర్వాత తన కలలో రాకుమారుడిలో అతని పోలికలు వెదికింది, లేదు, సమన్వయం కుదరడం లేదు.

సరస్వతమ్మగారు మంచం దిగడం లేదు. ఎవరితోనూ మాట్లాడటం లేదు.

"ఎప్పుడు బయల్దేరుతున్నారు!" అడిగాడు రాజా.

"పదిహేనో తారీఖున"

కాస్సేపాగి అమృత గదిలోకి వెళ్ళాడతను.

"వెళ్ళిపోతున్నారట"

"ఉండి ఇంకా ఏం పోగొట్టుకోమంటారు? నిర్లిప్తంగా అందామె.

"పోగొట్టుకోవడమేనా? ఏమీ సంపాదించుకోలేదా మీరు?"

"ఏం సంపాదించగలిగాను" తలెత్తి చూసిన ఆమె కళ్ళల్లో ఎన్నో ప్రశ్నలు. జవాబులు కోరుకోని ప్రశ్నలు. అర్థమయీ కాకుండా ఉన్న సందేశాలు, ఎన్నో సందేహాలు. అనిశ్చితమైన భావాలను అస్పష్టంగా వ్యక్తీకరించే చూపులు. ఆ రెండు హృదయాల్లోనూ ఆ రోజు వాళ్ళిద్దరూ హెూటల్లో గడిపిన రాత్రి, ఎవరికివారికే ఏదో అడగాలన్న తపన, ఏదో తెలుసుకోవాలన్న ఆరాటం, నాగరికత నేర్పిన సిగ్గు, బిడియాల ముసుగులో, సభ్యత, సంస్కారాల పరదాల చాటు దాక్కుని మనసును చంపుకుంటూ తన కోరికలను, ఆశలను నిర్భయంగా, ఘాటిగా వెల్లడించలేని అసహాయత యిద్దరిలోనూ.

దించుకున్న ఆమె కళ్ళల్లోని అస్పష్టమైన కన్నీటి పొర. నిజమేనా లేక తను వూహించుకున్నాడా ఏమో! ఒక్క క్షణం నిలబడి వెనక్కి తిరిగి వచ్చేశాడు రాజా.

ఈ ప్రపంచంలో పనికిరానిదంటూ ఏదైనావుంటే అది పిరికివాళ్ళ ప్రేమ.

* * *

అమృత జీవనగతిలో వచ్చిన మార్పులు, ఇండియా వెళ్ళడానికి వారు సిద్ధమవడం, డాక్టర్ బర్క్‌ను ఆలోచనలో పడవేశాయి అప్పుడప్పుడూ యింకా ఆ కల ఆమెకు వస్తూనే వుంది. రాకుమారుడు కాంత్‌నికాక రాజాని పోలివుండటం పరిష్కారాన్ని చూపించలేని ఎనాలిసిస్ ప్రభావం అయి వుండవచ్చు.

ఓ నిర్ణయానికి వచ్చాడాయన. హిప్నాసిస్‌తో ఆమె కలను పునర్జీవనం చేసి ఎనాలిసిస్ అనంతరం సజెషన్ ఇద్దామని, సమ్మోహన స్థితిలో ఉంచి అనుభవాల్ని

గుర్తుతెచ్చి, ప్రశ్నించి, సూచనలిచ్చే ఆ పద్ధతి ఆయన తరచుగా ఉపయోగించేది కాదు.

కౌచ్ మీద పడుకుని ఉన్న అమృతను ట్రాన్స్‌లో వుంచి ఎదురుగా కూర్చుని ఆయన అమృతను అడగసాగారు.

"అమృతా!"

"ఎస్"

"నన్ను గుర్తించగలవా?"

"ఎస్ డాక్టర్ బర్క్. యు ఆర్ మై థెరపిస్ట్."

"నీకు సాయపడాలంటే నీకు వచ్చే నైట్‌మేర్‌ను గురించి నేను మరింత తెలుసుకోవాలి, నిన్ను కొన్ని ప్రశ్నలు అడుగుతాను."

"అడగండి డాక్టర్."

"ఇప్పుడు నువ్వు నిద్రపోతున్నావు. ఆ కల ఇప్పుడు నీకు వస్తుంది. దాన్ని నాకు సమగ్రంగా వివరించి చెప్పాలి. జరుగుతున్న దాన్ని జరుగుతున్నట్టుగా, కల అయిన వెంటనే నీకు మెలకువ రాదు. అండర్‌స్టాండ్!"

"ఎస్ డాక్టర్!"

"నౌ యూ స్టార్ట్ డ్రీమింగ్"

"డాక్టర్ నాకు భయంగా ఉంది, చిమ్మచీకటి.....దట్టమైన అడవి."

....

కెవ్వుమంది అమృత. ఆత్మ కాలిపోతున్నప్పుడు శరీరంచేసే ఆక్రందన అది. మొదటిసారి ఆ కల వచ్చినప్పటిలా ఆమె దేహం భయాందోళనా వీచికలకు లేత మొక్కలా వణికింది. చల్లటి ఆ ఎయిర్ కండిషన్డ్ వాతావరణంలో కూడా ఆమెకి విపరీతమైన చెమట, కలలోని నీళ్ళు వాస్తవంలోకి వచ్చి తనని తడిపేసినట్టు.

"అమృతా, భయపడకు" బర్క్ గొంతు స్థిరంగా. కాసేపట్లో తేరుకుందామె.

8

"ఇప్పుడు నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి, సరేనా?"

"ఓ.కే డాక్టర్"

"కలలో నడుస్తున్న అమ్మాయి ఎవరు?"

"ఇట్స్ మి, నేనే డాక్టర్."

"ఆ రాక్షసుడు నీకు తెలిసినవాళ్ళ నెవర్నయినా పోలి వున్నాడా?"

"నో డాక్టర్, హీ ఈజ్ ఎ మాన్‌స్టర్"

"కెన్ యూ థింక్ ఆఫ్ ఎనీబడీ?"

"నో డాక్టర్."

"ఆ రాజకుమారుడు ఎవరు?"

"రాజా"

"ఆ పొదల్లో అతనెందుకున్నాడు. ఏం చేస్తున్నాడు?"

"పడి వున్నాడు, అది రాజా శవం."

"నువ్వు వుందనుకునే సందేశం ఏమిటి ఈ కలలో?"

"తెలీదు, ఉందనిపిస్తోంది, ఐ గెస్, ఏదో వుంది, అదేమిటో తెలీదు."

"అమృతా,"

"యస్ డాక్టర్"

"నీకు ఈ సెషన్‌లో ఇప్పుడు జరిగిన విషయమేదీ గుర్తుండదు. ఈ కల యింకెప్పుడూ రాదు. నీ మీద ఈ కల ఎలాంటి ప్రభావమూ చూపదు. మామూలుగా వచ్చే ఎన్నో కలల్లో ఇదొకటి. అంతే, అర్థమైందా?

"ఎస్ డాక్టర్"

"ఓ.కే. నౌ గెటప్."

లేచి సోఫాలో కూర్చుని కూల్ డ్రింక్స్ తాగుతూ ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు. ఆత్మీయులు ఒకర్ని విడిచి మరొకరు వెళ్తున్నప్పటి ఆప్యాయత.

"మిమ్మల్ని అడుగుదామనుకున్నాను. యింతకుముందు ఆ నాలుగు పిల్లి బొమ్మలు నాకు చాలా నచ్చాయి. స్త్రీమూర్తి కూడా. కౌచ్ మీద నుంచి వాటిని చూసేదాన్ని. ఆలోచనా స్రవంతిపై మనసు విలవనప్పుడు అవేమిటి డాక్టర్."

"ఇన్‌శానిటీ వివిధ దశల్లో లూయిస్‌వేన్ అనే చిత్రకారుడు వేసిన బొమ్మలవి. ఆయా దశల్లో ఆయన మానసికాస్థని తెలుపుతాయి. ఆ రేఖాచిత్రం 'మాతృమూర్తి' ఒక క్లయింట్ కానుక అది."

ఆమె వేసిన ప్రశ్నతో డాక్టర్ బర్క్‌కు ఆమె మానసిక స్థితి అవగతమైంది. ఆమె ఆ సెషన్ని ఎంతో ఈజీగా తీసుకుందనడానికి నిదర్శనం అది.

"మిస్ అమృతా, ఈ సెషన్లో నేను యత్నించినది హిప్నాటిక్ సజెషన్. నీకేమీ గుర్తుండదు. ఈ రోజుతో ఈ కల పరిష్కృతమైనట్టే. మరెప్పుడూ రాదు. వచ్చినా భయపడటం జరగదు. మళ్ళీ కల వచ్చి భయం వేస్తే మాత్రం యెవర్నైనా కన్సల్ట్ చెయ్యడం మంచిది. ఇండియా వెళ్తున్నానన్నావు. నాకు స్నేహితులున్నారక్కడ, ఎక్కడ సెటిలయ్యేదీ తెలిస్తే

నేనెవరినైనా సజెస్ట్ చేస్తాను, ఆ అవసరం ఉండదు బహుశా, ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్, పెళ్ళెప్పుడు? మీ ప్రిన్స్ ఛార్మింగ్ ఇంకా మౌనంగానే ఉన్నాడా?" నవ్వాడు డాక్టర్ బర్క్. సిగ్గుపడింది అమృత.

"థాంక్స్ డాక్టర్. నన్ను నేను ఎంతో తెలుసుకోగలిగాను మీవల్ల. యూ హెల్ప్‌డ్ మీ ఏ లాట్. థాంక్యూ వెరీ మచ్, సో లాంగ్."

బయటకు వచ్చింది అమృత ఆరామంలాంటి బర్క్ ఆఫీస్ గదిలోంచి.

* * *

రాజా అన్యమనస్కంగా ఉండటం, ఆఫీస్ పనుల్లో శ్రద్ధ చూపకపోవటం, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తుండటం, జెన్నీ, ఛెస్టర్‌టన్‌లు కనిపెట్టకపోలేదు. అతని వాలకం చూసి వాళ్ళకూ ఏదో తెలియని భయం పట్టుకుంది.

"వాటీజ్ రాంగ్‌విత్ యూ రాజా" అడిగాడు ఛెస్టర్‌టన్. ఆ రోజే డాక్టర్ రమేష్ కుటుంబాన్ని ప్లేనెక్కించి వచ్చారు. వాళ్ళు దూరమవడం తన మీద అంతటి ప్రభావాన్ని చూపుతుందని అప్పటివరకూ అతనికే తెలియదు. ప్రతిక్షణం ఏదో వెలితి, తనదనుకున్న వస్తువు పోగొట్టుకున్న బాధ, మనసునెవరో ముక్కలు చేస్తున్న అనుభూతి, గుండెనెవరో పిండేస్తున్నంత వేదన. ఇతమిద్ధమని చెప్పుకోలేని ఆలోచనలతో సతమతమవుతున్నాడతను. చిరాగ్గా అన్నాడు.

"ఏం లేదు, దయచేసి నన్ను ఒంటరిగా వదలండి". విచిత్రంగా చూసి బయటకు వెళ్ళిపోయాడు ఛెస్టర్‌టన్.

"జెన్నీ వచ్చింది."

"టాక్ ఆఫ్ ది టౌన్‌లో డీన్‌మార్టిన్ ప్రోగ్రాం వుంది.వెళ్దాం వస్తావా?"

"నో, రాలేను."

"ఏం, ఎందుకని."

"నన్నాట్టే విసిగించకు, వెళ్ళు."

"ఏమైంది రాజా, ఎందుకలా ఉన్నావ్" అతని భుజం మీద చెయ్యివేస్తూ అందామె. విదిలించుకొని తన గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాడతను.

ఇంకో వారం గడిచింది. రోజురోజుకూ అతని పరిస్థితి క్షీణిస్తోంది. చేసే ప్రతి పనిలోనూ తప్పులే చేస్తున్నాడు. తిండి సరిగ్గా తినడు, గడ్డం చేసుకోడు, బట్టల మీద శ్రద్ధ చూపించడు.

ఆ రోజు ఛెస్టర్‌టన్ అతన్ని పరీక్షగా చూసి ఆశ్చర్యపోయాడు.

"నువ్వు నువ్వేనా, ఎలా వుండేవాడివి ఎలా అయిపోయావ్, డాక్టర్ దగ్గరకు వెళ్దాం పద."

"ఎందుకు సర్, అక్కర్లేదు."

"ఏమిటి నీ బాధ రాజా? నాతో చెప్పుకోవడానికేం!"

మాట్లాడలేదు రాజా.

"నేను నీమీద చూపిస్తున్న ప్రేమ, అభిమానం తిరిగి నామీద చూపించవెందుచేత! ఇంకా నన్ను నువ్వు పరాయివాడిగానే, బాస్‌గానే చూస్తున్నావ్ కదూ!"

"దానికీ, దీనికీ అసలు సంబంధమేలేదు. అసలు నా బాధ ఏమిటో నాకే తెలియదు, మీకేం చెప్పను!"

"పోనీ ఓ సారి ఇండియా వెళ్ళొస్తావా!"

ఒక్కసారిగా అతని కళ్ళు మెరిశాయి. తన ఆవేదనకు అదే పరిష్కారమేమో!

"ఎస్ సర్. నేనిక్కడ వుండలేను. ఉన్నా పని చెయ్యలేను. మీకే విధంగానూ ఉపయోగపడలేను. నన్ను వదిలెయ్యండి, మర్చిపోండి."

"మర్చిపోవడమా! నిన్నా! ఏం మాట్లాడుతున్నావో అర్ధమౌతోందా, అసలు యెందుకంత కుంగిపోతావ్, కన్న కొడుకును పోగొట్టుకుని నేను వెంటనే తేరుకోగలిగానే, స్నేహితుడిని పోగొట్టుకున్న నువ్వు ఆ మాత్రం భరించలేవా! ధీజ్ థింగ్స్ హాపెన్ ఇన్ లైఫ్. గుండెదిటవు చేసుకో. అతను నీకెంతో ముఖ్యుడే కావచ్చు. అంతమాత్రాన అతని మరణం ఏ జీవితానికి అవరోధం కాకూడదు."

"మీకర్ధం కాదు సర్. అతని మరణమొక్కటే కాదు, ఇదీ అని చెప్పుకోలేని సమస్యలెన్నో నన్ను పట్టి పీడిస్తున్నాయి. నన్ను వెళ్ళనివ్వండి. నా బాధలకు నా మాతృదేశమైనా కొంత పరిష్కారమార్గాన్ని సూచించగలదేమో!"

"ఆల్‌రైట్, యూ సర్టెన్లీ నీడే ఛేంజ్. కానీ మళ్ళీ తిరిగి రావాలి నువ్వు. నీకు నేనిచ్చేది సెలవు మాత్రమే. శాశ్వతమైన వీడ్కోలు కాదు. మళ్ళీ ఒక్క నెలలో వచ్చెయ్, వారం వారం ఫోన్ చేస్తూండు."

రాజా సామానులు సర్దుకున్నాడు. టికెట్ బుక్ చేయించుకున్నాడు. కానీ తీరా బయల్దేరబోయేసరికి మళ్ళీ ఛెస్టర్‌టన్ ఆపేశాడు.

"నాకెందుకో భయంగా వుంది రాజా. నువ్వు వెళ్ళొద్దు."

"అదేమిటి, ఎందుకని?"

"ఏమో చెప్పలేను. నా మనసేదో కీడును శంకిస్తోంది. ఈ రోజు వుండు, రేపు వెళ్దువుగాని."

"ఆ పిచ్చి సెంటిమెంట్స్, జరగవలసిందేదో జరిగి తీరుతుంది. దానికి ఈ రోజు రేపు అనే తేడానేలేదు. ఊరికే కంగారుపడకండి."

"నో రాజా, నాది పిచ్చి సెంటిమెంట్స్ కావచ్చు. కానీ ఒక రోజులో నీకు పోయేదేమీ లేదు. నా మాట విను. ప్లీజ్ ఈఒక్కసారికి."

తప్పలేదు రాజాకి. అంత దీర్ఘమైన రాత్రి అతని జీవితంలో అంతవరకూ తటస్థపడలేదు. ప్రతి నిముషం ఒక యుగంగా గడిచింది అతనికి. ఆ మార్నాడు ఉదయమే బీబీసీ న్యూస్, అంతకుముందు రోజు బొంబాయి బయల్దేరిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానాన్ని జర్మన్ రెడ్ ఆర్మీ ఫాక్షన్ వాళ్ళు హైజాక్ చేశారని, తమ తమ రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రభుత్వాలను కూలదోయడం కోసం, దేశాల మధ్య యుద్ధాలు కల్పించడం, అలా విమానాల్లో ప్రయాణం చేసే అమాయకుల అమూల్యమైన ప్రాణాలు పావులుగా పెట్టడం అంతర్జాతీయ రాజకీయాల్లో అంతర్భాగం. తమ షరతులకు లొంగకపోతే తమకు బందీలుగా వున్న ఆ ప్రయాణీకుల్నందర్నీ కాల్చేస్తామంటారు. విమానాన్ని కూల్చేస్తామంటారు. ఆలోచించుకోవడానికి వ్యవధి యివ్వరు. తమ లక్ష్యసిద్ధి కోసం తమ ప్రాణాల్నే లెక్క చెయ్యరు. ప్రాణాల్ని తియ్యడానికి వెనుకాడరు హైజాకర్లు. సుడిగాలిలో దీపం ఎంత శాశ్వతమో, వాళ్ళ చేతికి చిక్కిన ప్రయాణీకుల ప్రాణాలూ అంతే.

ఛెస్టర్‌టన్ ఆపకపోతే రాజా ఆ విమానంలోనే వెళ్ళవలసినవాడు. ఈపాటికి గుండెల్ని గుప్పెట్లో పెట్టుకుని ఎప్పుడు పోతుందో తెలీని ప్రాణాన్ని క్షణక్షణం చూస్తూ నిలుపుకోవలసినవాడు.

"చూశావా, నావి మూఢనమ్మకాలన్నావ్. అయినా అవి మనల్ని ఒకోసారి ఎంత పెద్ద ప్రమాదాల్నించి రక్షిస్తాయో!" అన్నాడు ఛెస్టర్‌టన్ రాజా భుజం తడుతూ. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయతనికి, వంగి ఆయన పాదాలు స్పృశించాడు. కృతజ్ఞతను వెలిబుచ్చడానికి భారతీయులు మాత్రమే చేసే ఆ చర్య ఆయన్ను కదలించగా, రాజాను హృదయానికి హత్తుకున్నాడు, తనే స్వయంగా ఎయిర్‌పోర్ట్ దాకా వచ్చాడు. మరీ మరీ చెప్పాడు త్వరగా వచ్చేయమని.

బాంబేలో లాండవుతుండగానే ఏదో తెలియని మధురానుభూతి అతని నరనరంలోనూ రక్తమంత వేగంగా ప్రవహించింది. ఎన్నో రోజుల తర్వాత కన్నతల్లి ఒళ్ళో తలదాచుకుంటున్న పసివాడిలా అయిపోయాడతను. జన్మభూమిని తల్లితో యెందుకు పోలుస్తారో అప్పుడర్థమయిందతనికి. ఈ దేశంలో నా అనేవాళ్ళురూ లేకపోయినా పుట్టిన గడ్డ మీద అడుగుపెట్టగానే ఎందుకో అంత సంతోషం. అయితే అంత సంతోషాన్నీ హరించడానికి కస్టమ్స్‌వాళ్ళకు మూడున్నరగంటలు పట్టింది. నీరసంగా బయటపడి

టాక్సీ ఎక్కి తాజ్ ఇంటర్ కాంటినెంటల్‌కు చేరుకున్నాడు. ఛెస్టర్‌టన్ ముందే రూం బుక్ చేసి ఉంచాడు అక్కడ. రాజా ఎటువంటి అసౌకర్యానికీలోను కాగూడదని అతని ప్రయత్నం అహర్నిశలూ.

హొటల్లో దిగుతూనే వైజాగ్‌కి కాల్ బుక్ చేశాడు. ఓ గంటలో కాల్ మెటీరియలైజ్ అయింది. అమృత ఎత్తింది రిసీవర్.

"హలో ఎవరూ!"

"నేనే" పరిచయాలక్కర్లేని గొంతు,

"రాజా!" దాదాపు స్పృహ తప్పినంత పనైందామెకు.

"అవును నేనే."

"మీరు.....ఎప్పుడు.....ఎలా?" మాటలు కరువైపోతున్నాయామెకు.

"వచ్చేశాను, అక్కడ వుండలేకపోయాను."

"ఎప్పుడొస్తున్నారు వైజాగ్?"

"ఎందుకు?"

ఓ క్షణం పాటు నిశ్శబ్దం అవతలినుంచి,

'ఎందుకొచ్చారు లండన్ నుంచీ"

సమాధానం లేదు ఆ ప్రశ్నకు అతని దగ్గర.

"ఎవరి కోసం రావాలి అక్కడికి" ఎంతో భయపడ్డాడు అనడానికి.

"ఆ మాటకొస్తే ఈ దేశం మొత్తం మీద ఎవరున్నారు మీకు, మీరు వెళ్ళడానికి?" కఠినంగా అందామె.

మాట్లాడలేదు రాజా

"నాకు తెలుసు మీ తత్వం. పిరికివాళ్లు మీరు. మూగవాళ్ళు, మీ భావాలు మీకే అర్థంకాని అజ్ఞానులు. నేను చెబుతాను వాటికి భాష్యం. నేను విశ్లేషిస్తాను మీకు తెలియని ఎన్నో విషయాల్ని. కమ్ హియర్. మీకు తెలియకుండానే మీ మనసులో మేమంతా వున్నాం. ఆ అజ్ఞాతబంధమే మిమ్మల్నిక్కడికి లాక్కొచ్చింది. అది మినహాయిస్తే మీరిపుడు ఇండియా రావడానికి కారణమే లేదు. మీ గమ్యం మేమే. కాబట్టి బయల్దేరండి వెంటనే. రేపు ఎయిర్‌పోర్ట్‌కు వస్తాను."

"నా టికెట్ కన్ఫర్మ్ కాలేదు."

"ఛాన్స్ తీసుకోండి, అమృత దగ్గరకు వచ్చేవాళ్ళను ఆ దేవుడు కూడా ఆపలేడు. మీకోసం ఎదురుచూస్తుంటాం. గుడ్‌నైట్."

* * *

విమానంలోంచి దిగుతున్న రాజాని చూడగానే ఆమె శరీరం పులకించింది. ఎంత చిక్కిపోయాడతను. ఆమెను గురించి అతనూ అదే అనుకున్నాడు. ఎదురెదురుగా నిలబడ్డ ఇద్దరికీ మాటలు పెగలడం లేదు. అనిర్వచనీయమైన భావాలెన్నో అల్లరి పెడుతున్నాయి ఇద్దర్నీ. ఒకరినొకరు చూసుకుంటూ అలానే నిలబడిపోయారు చాలాసేపటివరకూ. ఈ సారి ఆమె కళ్ళల్లో ఎలాంటి సందేహాలూ సంశయాలూ లేవు. ఉన్నవల్లా ఎదుటివాడికి తేలిగ్గా అర్థమయ్యే సంకేతాలు మాత్రమే. ఎందుకు వచ్చేశావని ఆమె మళ్ళీ అడగలేదు. సమాధానం యిద్దరికీ తెలుసు యిప్పుడు.

"హోం స్వీట్ హోం" అన్నాడతను నవ్వుతూ.

"ఆ విషయం, ఓ నిండు ప్రాణం బలి అయిపోతేగానీ తెలియలేదు మనకు," ఆమె గొంతు రుద్ధమైంది.

"వెరీ అన్‌ఫార్చునేట్, మాఫియాకి ఆ హత్యతో సంబంధం వుందని అనుమానిస్తోంది స్కాట్లండ్‌యార్డ్."

"కారణాలు తెలుసుకుని ప్రయోజనమేమిటి, పోయిన మనిషి తిరిగి రాదుగదా" అందామె నిట్టూరుస్తూ.

బేగేజ్ వచ్చింది. కార్ పార్కింగ్ లోంచి ఫియట్ కారు బయటకు తీసింది అమృత.

"నాన్నగారూ, అమ్మా కులాసానా?" అడిగాడతను. తల ఊపిందామె. విశాలమైన రోడ్డు మీద మెత్తగా సాగిపోతోంది కారు. ఆమె మీద నుంచి వీస్తున్న గాలులు ఆమె శరీర పరిమళాన్ని తమతో కలుపుకుని అతనికి మత్తెక్కిస్తున్నాయి.

అప్‌లాండ్స్‌లో వున్న రెండతస్తుల ఆధునికమైన బిల్డింగ్ ముందు ఆగింది కారు. డాక్టర్ రమేష్, సరస్వతమ్మగారు అతన్ని ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నారు. ఎంతో ఆత్మీయుణ్ణి చూసినట్టు అతని వొళ్ళంతా నిమిరింది ఆవిడ. ఒక్క క్షణం పాటు తను పోగొట్టుకున్న కొడుకు కనిపించాడామెకు అతనిలో. వాళ్ళ ముగ్గురిలో అతని రాకతో ఏదో కొత్త చైతన్యం వచ్చినట్లయింది.

"మేము కూడా ఎయిర్‌పోర్ట్‌కు వస్తామంటే వద్దని బలవంతాన ఆపింది" అంది సరస్వతమ్మగారు నిష్టూరంగా.

ముందు తనొక్కతే అతన్ని చూడాలనుకున్న ఆమె తియ్యని స్వార్థం అర్థమై ఆమె వైపు చూశాడు రాజా. తల దించుకుంది అమృత.

"ఆ మీకు అనవసరంగా శ్రమెందుకని ఆపేసి వుంటుంది" అన్నాడతను.

"ఇందులో శ్రమేముంది బాబూ, నిన్న నీ ఫోన్‌వచ్చిన దగ్గర్నుంచీ కళ్ళల్లో

వత్తులు వేసుకుని చూస్తున్నాం ముగ్గురమూ. రాత్రి తెల్లవార్లూ ఎవరికీ కంటిమీద కునుకులేదు. ఏమిటో మా కుటుంబంలో అలా కలిసిపోయావు నువ్వు?"

ఆ ఆప్యాయతకు అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆ రాత్రి సరస్వతమ్మగారి చేతివంట తింటుంటే తన అశాంతీ, ఆవేదనా, నిరాశ, నిస్పృహలు ఇట్టే ఎగిరిపోయినట్లనిపించింది.

ఆ రాత్రి ఆ ఇంట్లో నలుగురూ నిద్రపోలేదు.

మర్నాడు హాలులో సమావేశమయ్యారు. అందరికీ తెలుసు అప్పుడు చర్చించబోయే విషయమేమిటో, కానీ ఎవరు మొదలుపెట్టాలనేది అర్థం కావడం లేదు. చివరకు రమేష్ అన్నారు.

"రాజా, మనకు పరిచయం అయింది మొదలు నీతో మాకు విడదీయరాని అనుబంధం ఏర్పడిపోయింది. కష్టసుఖాల్లో నువ్వు మాతో వున్నావు. మా అందరికీ ఆత్మీయుడవయ్యావు. మన ఈ బంధాన్ని శాశ్వతం చేసుకుందాం. మా అమ్మాయిని పెళ్ళిచేసుకో, నీకు వేరే అభ్యంతరం ఏదీ లేకపోతే." సరస్వతమ్మగారి వైపు చూస్తూ అన్నారాయన. అతని సమాధానం కోసం ఆమె కుతూహలంగా ఎదురుచూస్తోంది. రాజా అమృత వైపు చూశాడు. ఆమె చూసిన చూపులో అతనికి కోటి వసంతాలు కనిపించాయి.

"నేను నిజంగా చాలా అదృష్టవంతుణ్ణి సర్, మీ జీవిత సర్వస్వమైన మీకున్న ఒకే ఒక్క ఆణిముత్యాన్ని నాకు సమర్పిస్తున్నారు. వాస్తవానికి అందుకోగలిగిన అర్హత నాకుందో లేదో తెలియదు. నా జీవితంలో కొత్త వెలుగులు నింపే ఈ అవకాశాన్ని మీరు నాకిస్తున్నందుకు మీకు జన్మంతా ఋణపడి వుంటాను నేను."

నలుగురి హృదయాల్లోనూ సంతోషతరంగాలు ఉవ్వెత్తుగా ఎగిరిపడుతున్నాయి.

9

పెళ్ళి చాలా నిరాడంబరంగా, సింహాచలం గుడిలో జరిగింది. ఛెస్టర్‌టన్ కేవలం ఈ పెళ్ళి కోసమే పనిగట్టుకుని వచ్చాడు.

జెన్నీకి ఆపెండిసైటిస్ ఆపరేషన్ జరిగింది డాక్టరు బలవంతాన ఆమెను ఆపేశారు పెళ్ళికి రానివ్వకుండా, గ్రీటింగ్స్ పంపిందామె.

ఆ రాత్రి సన్ ఎన్ సీలో ఛెస్టర్‌టన్ సూట్‌లో కూర్చుని ఉన్నారు. రాజా, ఛెస్టర్‌టన్‌లు, ఆయన అద్దాలు తలుపుల్లోంచి నురగలు కక్కుతున్న సముద్రాన్ని చూస్తున్నారు. ప్రకృతికిక్కూడా కొన్ని హద్దులున్నాయి. ఎంత ప్రయత్నించినా కడలి పుడమిని మింగెయ్యలేదు.

రాజా చెప్పకుండానే ఆయనకు అర్థమైంది. అతనిక లండన్ రాడనీ, వాళ్ళు శాశ్వతంగా దూరమౌతున్నారనీ, గట్టిగా ఊపిరి తీసుకుని, ఇటు తిరిగాడు ఛెస్టర్‌టన్.

"నేను నీ అంత వున్నప్పుడు ఓసారి ఓ చిన్న కుందేలు పిల్లను తెచ్చుకున్నాను పెంచుకుందామని, పాలమీగడలా తెల్లగా, పట్టులా మెత్తగావున్న బొచ్చుతో, తళతళ మెరిసే కళ్ళతో ఎంతో ముద్దొస్తూండేదది. దాన్నెంతో అపురూపంగా చూసుకునేవాడిని. దానికి కారట్లు, బీన్స్, పాలు ఒకటేమిటి అన్నీ నేనే స్వయంగా పెట్టేవాడిని. దాని కోసం ప్రత్యేకంగా ఓ మెత్తటి పరుపు తయారు చేయించాను. నేలమీద పడుకుంటే ఎక్కడ కందిపోతుందోనని. అసలు నాకది తారసపడటమే ఓ విచిత్రం. సౌత్ ఆఫ్రికాలో ఓ సారి మా మిత్రులు కొందరం కలిసి వేటకు వెళ్ళాం. కేప్‌టౌన్‌లో ఉండేవాళ్ళం అప్పుడు. ఏ జంతువు బారి నుండి తప్పించుకొచ్చిందో, మా దారికడ్డంగా రక్తం ముద్దలా పడివుంది. ఆ గాయాలన్నీ కడిగి మందురాసి దాన్ని మామూలుగా చెయ్యడానికి నెల పట్టింది నాకు.

నేను దాన్ని ఇంటికి తీసుకొచ్చిన నెలా పదిహేను రోజులకు చచ్చిపోయిందది. ఆ కారణంగా ఎప్పుడూ దిగులుగా, ఏదో పోగొట్టుకున్నట్లు వుండేది. ఆఖరికి తిండీ తిప్పలు ఏమీ లేకుండా ప్రాణం తీసుకుంది బలవంతాన. ఆలోచిస్తే అప్పుడర్థమైంది ఏ ప్రాణికైనా సేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎంత ముఖ్యమో, క్రూరమృగాలు సంచరించే ఆ కారడవిలో అలాగే వదిలేసినా అనుక్షణం మృత్యువుతో చెలగాటాలాడవలసి వున్నా, ఇంకా కొంతకాలం బతికి వుండేదేమో అది.

నా జీవితానికి ఆ ఒక్క అనుభవం చాలు. మళ్ళీ అలాంటి తప్పు యింకోటి చెయ్యదల్చుకోలేదు నేను. "పైప్ వెలిగించబోయాడాయన. ఎంత ప్రయత్నించినా అంటుకోలేదది. విషాదంగా నవ్వుకున్నాడు.

"నీ రాకతో నా పరిస్థితి ఎంతో మెరుగుపడింది. మానసికంగా, వ్యాపారపరంగా ఎంతో ఎదిగాను నేను నీవల్ల. నీ ఋణం తీర్చుకోలేనిది, తీర్చుకుని నీతో బంధాన్ని తెంచేసుకోవాలని కూడా నేననుకోవడం లేదు. అయితే నీకు నీ దేశం ఎంత ముఖ్యమో, నాకు నా దేశమూ అంతే. నువ్వు నా కోసం అక్కడికి వచ్చినా తృప్తిగా వుండలేవు. ఇక్కడికి వచ్చిన తర్వాత నీలో కలిగిన మార్పు చూసి నా కళ్ళను నేనే నమ్మలేకపోతున్నాను. నువ్వెక్కడున్నా, ఎప్పుడూ ఇలా నవ్వుతూ, నిండుగా వుండటమే నాకిష్టం కన్నతల్లిలో కన్నభూమిలో ఓ ప్రత్యేకమైన లక్షణం ఏమిటంటే వాటిని మనం యెవరికోసమూ, ఏ పరిస్థితుల్లోనూ త్యాగం చెయ్యలేం. అందుకే ఎంత బాధాకరమైనా, నీతో ఎడబాటుకే సంసిద్ధమైపోయాను, నీ కోసం నేను నీ దేశంలో స్థిరపడలేను గనుక."

రాజా మనసులో కల్లోల తరంగాలు వువ్వెత్తున లేచిపడుతున్నాయి. సంఘంలో తనకో గౌరవస్థానాన్ని సంపాదించి పెట్టిన వ్యక్తి, తనదైన ప్రతిదాంట్లోనూ తనకో భాగం

కల్పించిన వ్యక్తి. తన అవసరం ఆయనకెంతో ఉందిప్పుడు, కానీ తను అసహాయుడు, మాట్లాడలేకపోతున్నాడు. కృతజ్ఞతలూ, సంజాయిషీలూ, క్షమాపణలూ చెప్పుకోవడానికి మాటలు చాలని సందర్భం అది.

"నాదొక సలహా, ఇక్కడ నీ ఇష్టమొచ్చిన బిజినెస్ స్టార్ట్ చెయ్యి, పెట్టుబడి మొత్తం నేను పెడతాను. లాభాలు చెరిసగం, ఈ రకంగానైనా నిన్ను నేను అప్పుడప్పుడూ చూడవచ్చు ఏమంటావ్" అన్నాడు ఛెస్టర్‌టన్.

ఏం మాట్లాడటానికీ నోరు రావడం లేదు రాజాకి. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. అవతలి వ్యక్తి ఆదరణకూ ఆప్యాయతకూ.

"రేపే బాంక్ ఎకౌంట్ ఓపెన్ చెయ్యి. నేను వెళ్ళగానే అవసరమైన డబ్బు నీకు ట్రాన్స్‌ఫర్ చేస్తాను."

మర్నాడు మధ్యాహ్నం ఫ్లైట్‌లో వెళ్ళిపోయాడాయన.

* * *

అతని కౌగిట్లో ఆమె, ఆమె గుండెలపై అతను. గోరింటాకుతో ఎర్రగా పండిన ఆమె కాళ్ళ మీద అతని తల, అతని వీపు మీద ఆమె. ఆమె ముంగురులలో అతని మోము. అతని కళ్ళల్లో, ఆమె చూపుల్లో, ఆమె హృదయంలో, అతని కనుపాపల్లో ఆమె శరీరంలోని అణువణువులో, అతనిలో ప్రవహిస్తున్న ప్రతి రక్తకణంలో, ఆమె తీస్తున్న ఊపిరిలో, అతని గుండెల్లో అనుక్షణం ఆమె. అతను, ఆమె అరికాళ్ళకు అతని ముద్దులు. అతని చెవుల్లో ఆమె గుసగుసలు, ఆమెలో నిండిపోయి అతను. అతన్ని అల్లుకుని ఆమె ప్రపంచంతో వాళ్ళకు పనిలేదు. ప్రజలేమనుకుంటున్నారన్నది వాళ్ళకి పట్టదు. వాళ్ళు ఒకరికొకరు ప్రతి నిముషం కావాలి. అంతకు మించి వాళ్ళకు అవసరాలూ లేవు.

తుళ్ళిపడింది అమృత. బాహ్య పరిసరాలకి అనుసంధానం కాని చైతన్యంతో, అంతర్జీవన స్వాప్నిక ప్రక్రియలకి వెర్రిగా ప్రతిస్పందించిన శరీరంతో, మెలకువ వచ్చి చుట్టూ చూసింది. పెనవేసుకున్న తమ నగ్న శరీరాల్ని కొంత మేరకు మాత్రమే కప్పుతున్న ఆకుపచ్చటి శాలువా. తలపై నుంచి జారి రొమ్ముల్ని కప్పిన జుట్టు కొంత రాజా చేతికింద, నలిగిన మల్లెపూల వాసన. బెడ్‌లాంప్ వెలుతురు, తెరిచివున్న వెనీషియన్ బ్లైండ్స్‌లోంచి చల్లని గాలి.

చాలా రోజుల తర్వాత మళ్ళీ ఆ కల. తమాయించుకోగలిగింది. కిందికి జరిగి, రాజాకి మెలకువ రాకుండా తలనీ అతని గుండెలకి ఆన్చి ఆ చప్పుడు వింటూ లోచించసాగింది.

ఏమిటీ కల? ఎందుకిలా? రాజాతో తన ప్రణయం ఫలించి, ఇద్దరూ ఒక్కటై,

శరీరాలు ఆత్మల్నీ, ఆత్మలు శరీరాల్నీ వెదుకుతున్న వేళ, ఇహానికీ, పరానికీ, వాస్తవానికీ కల్పనకీ మధ్య గీత చెరిగిన వేళ. మెరిసిన రాజా కళ్ళల్లోని సౌందర్యలోకాలకు తమ మహారాణి అయిన ఈ రాత్రి మళ్ళీ ఆ కల. తన శారీర తృష్ణలకూ, ఆ కలకూ సంబంధం ఉంటే, అవి తీరిన తర్వాత కూడా మళ్ళీ ఈ కల రావడమేమిటి? ఎవరైనా సైకియాట్రిస్ట్‌కు కన్సల్ట్ చెయ్యమని డాక్టర్ బర్క్ చెప్పడం గుర్తొచ్చింది తను మరీ అంతగా భయపడలేదు అయినా క్యూరియాసిటీని చంపుకోలేకపోయింది.

ఆ మధ్య ఏదో పార్టీలో పరిచయం అయిన సైకాలజిస్టు డాక్టర్ మూర్తి గుర్తొచ్చాడామెకు. రాజాని లేపి తన కల సంగతి చెబుతామా అనుకుంది. ఇంత వరకూ తనెవ్వరికీ చెప్పలేదు. ఒక్క డాక్టర్ బర్క్‌కి తప్ప. కల వస్తున్న తొలి దినాల్లో ఒకసారి తన కేక విని డాడీ వచ్చి అడిగితే, ఏదో పీడకల అని మాత్రమే చెప్పింది. రాజా వంకచూసిందామె. ఆదమరిచి నిద్రిస్తున్న తన ప్రణయ దైవాన్ని నిద్రలేపి అనవసరంగా డిస్టర్బ్ చేయడమెందుకు! మూమెంటరీగా భయం తప్పించి ఆ కల తనపై ఎలాంటి ప్రభావమూ చూపలేదు. తనకు అలవాటైంది. తర్వాత ఎప్పుడైనా చెప్పొచ్చులే అనుకుని, గట్టిగా రాజాని అదుముకుని నిద్రలోకి జారిపోయింది అమృత. ఆమ్నియాటిక్ సాక్‌లో శిశువుకుండే ప్రశాంతత ఆమెకి అతని కౌగిట్లో.

కౌన్సిలింగ్ సెంటర్ ముందు రోజ్‌గార్డెన్ పక్కన కారు పార్కు చేసి, ఆలోచిస్తూ ముందుకు నడిచింది అమృత. పడమటకి వాలుతున్న సూర్యుడు ఆమెను వెనకనుంచి తాకి నీడై దారిచూపుతున్నాడు. పరిసరాల్ని, తనని చూస్తున్న వ్యక్తుల్ని గమనించకుండానే బిల్డింగ్‌లో అడుగుపెట్టింది. డాక్టర్ బర్క్‌తో తన పరిచయాన్ని గురించి చెప్పగానే మూర్తి వెంటనే అప్పాయింట్‌మెంట్ ఇచ్చాడు.

పొడవాటి కారిడార్‌లో రిబ్బన్ ముక్కలా సన్నగా, పొడుగ్గా వున్న కార్పెట్‌పైన నడుస్తూ యిరువైపులా గోడలకు వేలాడుతున్న సైకాలజిస్టుల బొమ్మల్నీ, గుమ్మాలముందు అందంగా అమర్చిన, మెరుస్తున్న యిత్తడి పూలకుండీలను చూస్తూ ఆఫీస్ ముందు ఆగింది. ఇండియాలో ఒక ఇన్‌స్టిట్యూట్‌లో అంత ఆరిస్టోక్రసీ, గ్రేస్ చూడటం ఆమెకు ఆశ్చర్యంగానే వుంది.

"ఎక్స్‌క్యూజ్‌మీ ఐయామ్ అమృత, డాక్టర్ మూర్తిని చూడాలి," టైప్‌రైటర్ మీద నుంచి తలెత్తి,

"ఎస్.మేడమ్. మీరు నిన్న ఫోన్ చేశారు కదా, రండి నాతో, అయామ్ హిజ్ సెక్రటరీ" అంటూ దారి తీశాడతను.

'రండి, రండి, మీ కోసమే చూస్తున్నాను" రివాల్వింగ్ ఛైర్‌లోంచి లేచాడు డాక్టర్

మూర్తి, గౌరవ సూచకంగా.

ఆంధ్రప్రదేశ్‌లో సైకలాజికల్ కన్సల్టేషన్ కోసం ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టి సక్సెస్ అవగలిగిన అరుదైన వ్యక్తి మూర్తి. భారతదేశంలో సైకాలజీ,పేరాసైకాలజీల అభివృద్ధికి ఎంతో కృషి చేశారాయన. శాస్త్రీయ దృక్పథం, సంప్రదాయ విజ్ఞానం పట్ల ఆయనకున్న సునిశిత ధోరణి చెప్పుకోదగ్గవి.

పలకరింపులూ, డాక్టర్ బర్క్ క్షేమసమాచారాలూ అయ్యాక,

"మిసెస్ అమృతా రాజా, ఇప్పుడు చెప్పండి. మీకు బర్క్‌తో ఎనాలిసిస్ అనుభవం వుంది. కాబట్టి నేను వేరే చెప్పాల్సింది ఏమీలేదు, ఫీల్ ఫ్రీ. యూకెన్ ట్రస్ట్ మీ అండ్ మై ప్రొఫెషన్" అన్నాడు డాక్టర్ కృష్ణమూర్తి.

స్వజాతీయుడు తన సొసైటీ మనిషి అయిన మూర్తి ముందు మనసంతా విప్పడానికి ఆమె కాసేపు వెనకాడింది. తర్వాత అతని సిన్సియారిటీ ఆమె సంకోచాల్ని దూరం చేసింది.

తన కల, ఆలోచనలు, బర్క్ ఎనాలిసిస్ మళ్ళీ కొన్నాళ్ళ క్రితం ఆ కల రావడం, ఆ కల ఏదో సందేశం యిస్తున్నట్టు తనకు తోచడం.

రైటింగ్ పాడ్ మీద నోట్సు వ్రాసుకుంటూ, విజ్ఞానం, అణుకువ, సంస్కారం మూర్తీభవించిన అమృత మాటల్ని వినసాగాడు కృష్ణమూర్తి.

"...ఆ కల నన్నేమీ డిస్టర్బ్ చెయ్యడంలేదు ఇప్పుడు అయినా ఆత్రుతను చంపుకోలేను. అదేమిటో తెలుసుకోవాలి" అని ఆగిందామె. చుట్టూ చూసింది.

"ఆగిపోయారేం?" అన్నాడు మూర్తి.

"మీరు కౌచ్ వుపయోగించారా?" చిన్నగా నవ్వి అందామె.

మూర్తి నవ్వాడు. "నేను సైకో ఎనలిస్ట్‌ను కాను, ఎక్‌లెక్టిక్, అంటే ఏ సిద్ధాంతం అన్వయిస్తుందనుకుంటానో ఆ సిద్ధాంతాన్ని నా కౌన్సిలింగ్‌లో వుపయోగిస్తాను. కౌచ్‌ని, సైకో ఎనాలిసిస్‌ని యింకా మన కల్చర్ అందుకోలేదు. అయినా నేను 'ఎనాలిసిస్' ఉపయోగిస్తాను మీ విషయంలో అవసరమైతే."

"నా కల గురించి, మళ్ళీ అది రావడం గురించీ మీ ఉద్దేశ్యం చెప్పగలరా?"

ఆలోచిస్తున్నాడు మూర్తి. డాక్టర్ బర్క్ ఎనాలిసిస్ గురించి అంత సునిశితంగా చెప్పగలిగిన అమృత. సర్టెన్లీ యాన్ ఇంటెలిజెంట్ గర్ల్.

"మళ్ళీ ఎనాలిసిస్ అవసరం వుంటుందంటారా!" అంది.

"లేదు కానీ మీ కల గురించే కాక, నేను చాలా తెలుసుకోవాలి. ముఖ్యంగ మీ "కన్విక్షన్' గురించి, ఏదో సందేశం ఆ కలలో ఉందని మీరనుకోవడాన్ని గురించి,

కొన్ని బాల్యానుభవాల గురించి, సైకోఎనాలిసిస్ పూర్తిగా జరగడానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది. డాక్టర్ బర్క్ కూడా పూర్తిగా ఫ్రాయిడియన్ కాదు. కానీ మీ కలలాంటి కలలకి, ఇంకా చెప్పాంటే ఏ స్వప్న విశ్లేషణకైనా ఫ్రాయిడ్‌ని మించిన పద్ధతేదీ ఇంకా కనిపెట్టలేదు."

వ్యాఖ్యానాలూ, భాష్యాలూ లేకుండా అప్పుడప్పుడూ ప్రశ్నిస్తూ మూర్తి నోట్సు రాసుకోసాగాడు.

*   *   *

ఆరు ఇంటర్వ్యూలు చేసి, బర్క్ దగ్గర్నుంచీ వచ్చిన కేస్ హిస్టరీని జతపర్చి తర్జన భర్జనల అనంతరం ఓ అభిప్రాయానికి రాగలిగాడు మూర్తి. అయితే అది అసమగ్రంగా అనిపించింది అతనికి, ఆ విషయమే చెప్పడానికి ఉద్యుక్తుడయాడతను.

రెండు ఏనుగుల కుంభస్థలాల మధ్య స్థిరంగా నిలచిన పుస్తకాల దొంతరవైపు చూస్తూ, ఖంగునమ్రోగే మూర్తి గొంతు లోంచి వెలువడే ఏ విన్యాసాలూ లేని, సరళమైన వాక్యాలు మనసుకెక్కించుకుంటోంది అమృత. మంచి గొంతు ఓ వరం. సైకాలజిస్టులకు అది ఎంతో అవసరం.

"డాక్టర్ బర్క్ భాష్యాన్ని నేను సమర్థిస్తాను, సైకాలజికల్‌గా ఆలోచిస్తే మీ కల ఓ నైట్‌మేర్ – అంటే పీడకల, పేవర్ నాక్టోర్నస్, అణచబడ్డ లైంగిక వాంఛలు కలలో తలెత్తడం దానికి కారణం. బహుశా బాల్యంలో మీ తల్లిదండ్రుల సమాగాన్ని చూడటం వల్ల, సెక్స్‌పట్ల సాధారణంగా వుండే సెన్సార్‌వల్లా, అపోహల వల్ల ఆ భయం. పీడకలలు పదే పదే వచ్చే వ్యక్తుల్లో మానసిక రుగ్మతా ధోరణులుంటాయి. మీ ఆధ్యాత్మిక ధోరణి విజ్ఞాన భరితమైన వైఖరి అది ఎస్కేపిజంకాదు, ఇటీవల మీ సెక్స్ లైఫ్ సంతృప్తికరంగా వుందన్నారు. మీలో మానసిక రుగ్మతలు ఎప్పుడూ లేవు. మీ కలలో "సింబల్స్"ని పరిశీలిస్తే, సైకో ఎనాలిసిస్ సిద్ధాంతరీత్యా. అవన్నీ సెక్స్‌ని, జననాన్నీ సూచిస్తాయి.

10

"అయితే చాలా సంస్కృతుల్లో మీ కలలోని "సింబల్స్"ని మరో రకంగా వివరించడం జరిగింది. ఉదాహరణకు నక్షత్రాలు, చుక్కలు కలలో కన్పించడం, ఏదో జరగబోయే దానికి, విధికి, మీ జీవనగతికి సంకేతంగా భావించవచ్చు.

అయితే ఈ దృక్పథం శాస్త్రీయం కాదు. శాస్త్రజ్ఞానం శైశవ దశలో ఉన్నప్పటి వ్యాఖ్యానాలను మనం ఒప్పుకోవలసిన పని లేదు. మరే ఇతర రుజువులూ లేకుండా. అలాగే మరో సింబల్ పాము. పాశ్చాత్యులు ఇది చెడును సూచిస్తుందంటారు. అయితే

ఇది అన్ని సంస్కృతులకూ వర్తించదు. ఒక వేళ ఈ కలలో మీరనుకుంటున్నట్టు ఏదైనా సందేశం ఉందేమో పరిశీలిద్దాం.

ఈ కల, మిగతా కొన్ని కలల్లా వాస్తవానుభవాల్ని పోలిలేదు అతీంద్రియశక్తి వల్ల ఏదైనా సమాచారం మీ ఆచేతనికి వచ్చి చేరి అది జాగృతమవడానికి జరిగిన ప్రయత్నం మీ కల అనుకుందాం. అంటే మీకు, లేదా మీ వాళ్ళకు జరగబోయే సంఘటనని సూచిస్తుందనుకోవచ్చు.

నేను అతీంద్రియ శక్తులకు పటిష్టమైన రుజువులున్నాయని అనుకోను. నా అధ్యయనం అంత ఖచ్చితమైన సాక్ష్యాల్నివ్వలేదు. ఈ ప్రస్తావన ఎందుకు తెచ్చానంటే మీరు మీ కలలో ఏదో మెసేజ్ వుందని భావిస్తుండం వల్ల.

ఎల్.ఇ.రైన్ అనే పేరా సైకాలజిస్టు అతీంద్రియ శక్తుల ప్రమేయం ఉన్నదనిపించే వందలాది వ్యక్తుల అనుభవాన్ని సేకరించి, పరిశీలించింది. అలాంటి అనుభవాలు మెలకువలో ఇంట్యూషన్ రూపంలో కానీ, విభ్రమల్లో గానీ వుంటాయనీ, నిద్రలో వాస్తవాన్ని పోలిన, లేదా అవాస్తవికమైన కలల రూపంలోగానీ వుంటాయని తెలిసింది.

ఇట్లాంటి అనుభవాల్లో వుండే "కన్విక్షన్" ఆ అనుభవం తాలూకు నిజాన్ని గుర్తింపజేస్తుంది. అయితే మీకు ఆ కన్విక్షన్ స్ఫురించడంలేదు." ఆగాడు మూర్తి.

"అయితే ఎలాంటి సంఘటనను సూచిస్తుందంటారు?"

"చెప్పలేను. కలల్లోని పేరా సైకలాజికల్ అంశాన్ని వివరించడానికి ఒక పద్ధతంటూ ఏమీలేదు. అసలు పేరా సైకాలజికల్ అని అనుకునే ఒక అనుభవం నిజంలో మామూలు మానసిక ప్రక్రియల వల్ల కాదని తేల్చగలిగితేనే ఈ ఇంటర్ప్రెటేషన్, అప్పుడు కూడా, ఏదైనా ఒక అనుభవం మీ కలకి సరిపోతే అది కేవలం యాదృచ్ఛికం, అంటే కో ఇన్సిడెన్స్ అయి వుండవచ్చు."

డాక్టర్ మూర్తికి అడ్డొచ్చింది అమృత.

"మీరు పేరా సైకలాజికల్ అనేదాన్ని కాస్త వివరించండి."

"మనకు బాహ్య ప్రపంచాన్ని గురించి తెలిసేవి జ్ఞానేంద్రియాలు. ఇవి కాలానికీ, దూరానికి కట్టుబడివుంటాయి. అంటే వేల మైళ్ళ దూరంలో వున్నదాన్ని మనం కళ్ళతో చూడలేము, వినలేము సంవత్సరాల క్రితం జరిగిన విషయాలు ప్రతినీ మనకు గుర్తుండవు. అయితే జ్ఞానేంద్రియాల ప్రమేయం లేకుండా మీకేదైనా స్ఫురిస్తే, ఉదాహరణకు కొన్ని వందల మైళ్ళదూరంలో భవిష్యత్తులో ఫలానా సంఘటన జరుగుతుందని మీకు అంతీంద్రియశక్తుల మూలంగా తెలిస్తే దాన్నే పేరా సైకలాజికల్ అంటారు."

"మీరు నమ్ముతారా?"

"చెప్పలేను మనం ఎన్నో కలలుకంటాం. ఊహిస్తాం, అనుకుంటాం ఒకటీ ఆరా జరగవచ్చు వీటిలో. అది కేవలం యాదృచ్ఛికం కావచ్చు. శాస్త్రరీత్యా అది సరైన సాక్ష్యం కాదు ఈ అంశాలపై పరిశోధనలు మొదలై శతాబ్దం దాటింది. ఇంత వరకూ వీటిల్లో దేన్నీ 'డిమాన్‌స్ట్రేట్' చేసి చూపిన వాళ్ళెవరూ లేరు. నేను జరిపిన పరిశోధనలు గణాంకశాస్త్రరీత్యా సాక్ష్యాన్నిచ్చాయి. అయితే మళ్ళీ ఆ పరిశోధనలు అనే ఫలితాన్నిస్తాయని గ్యారంటీ లేదు. అందువల్ల ఇదమిత్థంగా తేల్చి చెప్పలేము."

అమృత ఆలోచించింది. ఒకవేళ తన అనుభవం అలాంటిదైతే, దాని అర్థం ఏమై ఉంటుందని, అదే మళ్ళీ అడిగింది.

"నేను ప్రస్తుతం చెప్పలేను. మీరు వచ్చేవారం ఇంటర్వ్యూ వచ్చినప్పుడు ప్రయత్నిస్తాను" అన్నాడు మూర్తి.

లేచి వెళ్ళడానికి ఉద్యుక్తురాలైంది అమృత.

"డాక్టర్ బర్క్ ఎనాలిసిస్ తర్వాత మీకు ఆ కల రావడం నాకు ఆశ్చర్యం కల్గించిన విషయం....ఆ మెసేజ్‌ని మనం గుర్తించగలిగిననాడు మీకు ఆ కల ఆగిపోతుంది. మీరు ఇండియా వచ్చాక ఆ ఒక్కసారే కదూ ఆ కల రావడం."

గ్లాస్ టేబుల్ మీద తన ప్రతిబింబాన్ని చూస్తూ," అవును మళ్ళీ మళ్ళీ రాలేదు. అయినా నాకు.....క్యూరియాసిటీ" అందామె.

"ఐ థింక్ వియ్ టుగెదర్ కెన్ వర్కౌట్ అవుట్."

సెలవు తీసుకుని వచ్చేసింది అమృత.

* * *

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నాలుగెకరాలు స్థలం కొన్నారు. 'రజనీ కెమికల్స్' ఫ్యాక్టరీ నిర్మాణానికి జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. పునాదుల వరకూ వచ్చింది బిల్డింగు. ఆ సాయంత్రం ఫ్యాక్టరీ ప్లాన్ చేత్తో పట్టుకుని కారు దిగాడతను. అతనికెంతో యిష్టమైన తెల్లచీర, మల్లెపూలు, ముత్యాలదండతో దివినించి దిగివచ్చిన శాంతిదేవతలా దర్శనమిచ్చిందామె. ఆమెను చూస్తే సర్వం మర్చిపోతాడతను.

"అబ్బ వుండండీ ఇది ఆరుబయట, అందులోనూ పట్టపగలు" అంది అమృత చిరుకోపంతో పెదాలు తడుచుకుంటూ.

"కోరికలకు స్థలం, సమయంతో నిమిత్తంలేదు డియర్. అందుకే నిన్ను బెడ్‌రూంలో తప్ప నా కళ్ళ పడవద్దంటాను నేను," అన్నాడతను టైవిప్పి ఆమె చుట్టూ వేసి దగ్గరగా లాక్కుంటూ.

"అబ్బ వదలండీ, ఏమిటిది మరీ అల్లరి"

పళ్ళు బిగబట్టి అన్నాడు!

"నిన్ను.....నిన్నూ.....ఇక్కడ ఇలా కాదు బయల్దేరు, నీ సంగతి చెబుతాను."

"ఎక్కడికి?"

"అడగకు, బయల్దేరమన్నాను, అంతే ఐదు నిమిషాలు, స్నానం చేసి వస్తాను."

మరో పావుగంటకు యోగాశ్రమాన్ని దాటి, సముద్రం పక్కగా కొండమీద మెలికలు తిరుగుతున్న రోడ్డుమీద సాగిపోతోంది వాళ్ళ ఫియట్ కారు, అస్తమిస్తూ సూర్యుడు సముద్రాన్ని రాగ రంజితం చేస్తున్నాడు. బెస్తవాళ్ళ పడవలు ఇళ్ళకు తిరిగివస్తూ, ఎత్తిన తెరచాపల్తో ప్రకృతికే వింతశోభను కలిగిస్తున్నాయి ఆ పడవలకు తోడుగా పైన ఎగురుతున్న రకరకాల పక్షులు, పెద్ద పెద్ద బండరాళ్ళను ఢీకొని ఇంతెత్తున విరిగిపడే సాగర తరంగాలు.

"నువ్వు రోడ్డును చూడాలి, నన్ను కాదు" అందామె ఆమె యిష్టం అతన్ని రకరకాలుగా సంభోదిస్తుంది. ఏరా అంటుంది, అప్పుడప్పుడు ఏమండీ అంటుంది, నువ్వు అంటుంది, ఏమోయ్ అంటుంది. అతనితో ఆమెకు హద్దుల్లేవు.

"నా వల్లకాదు, పక్కన అపరంజి బొమ్మ కూర్చుని వుంది. మనసు యిటు లాగుతోంది. ఎదురుగా శూన్యం కనిపిస్తోంది. నేను నీ వంక తప్ప యింకోవైపు చూడలేను." అన్నాడు రాజా.

"చూడలేకపోతే ఇంత ఎత్తు నుంచీ కిందకు పడిపోతాం. ఆ రాళ్ళ మీద పడి ఛిన్నాభిన్నమై తునాతునకలై సముద్రంలో కలిసిపోతాం అప్పుడు నిన్ను నేనూ, నన్ను నువ్వూ ఎప్పటికీ చూసుకోలేం."

సడెన్ బ్రేక్ వేసి ఆమె నోరు మూశాడతను.

"మన అనుభవాలకు ఈ జన్మ ఒక్కటే చాలదనీ, ఇంకో నూరేళ్ళ కాలం వుంటే బాగుండుననీ కోరుకుంటున్నాను నేను. ఉన్న జన్మను చిన్నది చేసెయ్యకు, నేను భరించలేను."

"యూ సెంటిమెంటల్ ఫూల్" అతని నెత్తిమీద మొట్టి అందామె.

"అన్నంతమాత్రాన అన్నీ జరిగిపోతాయా? అయినా స్టీరింగ్ నీ చేతిలో వుంది. నడిపేవాడివి నువ్వు. బాధ్యత నీది. అనుసరించడమే నా వంతు. మన ప్రయాణం నిరంతరం కావాలనీ, మనం యిలాగే జంటగా వుండాలనీ నాకు మాత్రం వుండదా"

భీమిలికీ వైజాగ్‌కూ మధ్యలో వున్నారు వాళ్ళు. కారు దిగి సరుగు తోటలు దాటి మెత్తటి ఇసుకలో కొచ్చి కూర్చున్నారు. సముద్రపుటలలు వాళ్ళ పాదాల్ని పరామర్శించి పోతున్నాయి. వెన్నెల విరగబూస్తోంది. అతని ఒళ్ళో తల పెట్టుకుని పడుకుందామె. నిమిషాలు గడుస్తున్నాయి. కళ్ళు మూసుకుంది తృప్తితో. ఆమె నుదుట చిరుచెమట,

తీరిన కోరికల తాలూకూ సంతృప్తికి నిదర్శనంగా గాలిలో తేలిపోతున్నట్టుగా వుందామె దేహం. స్త్రీ పురుషులకు సృష్టి ఆదేశించిన కార్యాన్ని ప్రకృతి ఒడిలోనే నెరవేర్చి పరవశిస్తోన్న ఆ జంటకు బాహ్య ప్రపంచం గుర్తుకొచ్చేసరికి మిగిలిన జగమంతా గాఢ సుషుప్తిలో ఉంది.

తప్పనిసరి కాబట్టి లేచారు.

"నడవలేను. ఎత్తుకో" అందామె. ఆమె సేవకన్నా అతనికిష్టమైన పనులు లేవు.

కానీ అతని అడుగు తడబడింది. కాళ్లు కూరుకుపోతున్న ఇసుకలో భారంగా ఆమె నెత్తుకుని నడవసాగాడు.

"భరించేవాణ్నే భర్త అన్నారందుకే" అందామె. అతని జుట్టులోకి వ్రేళ్ళు పోనిస్తూ. సరుగుతోట మధ్యకు వచ్చారిద్దరూ.

"అబ్బా" అన్నాడతను చటుక్కున ఆమెను వదిలేసి –

"ఏమైంది" అందామె కంగారుగా.

సమాధానంగా అరడుగుల పొడవున్న గోధుమత్రాచు సరుగుచెట్ల మీదనుంచీ ముక్కలు ముక్కలుగా జారి పడుతున్న వెన్నెల్లో మెరుస్తూ సరసర పాకిపోయింది ఎండుటాకుల్ని గలగలలాడిస్తూ.

ఎక్కడో ఏదో అతీత మానవశక్తి వికటాట్టహాసం చేస్తున్నట్టు గాలిలో తేలి వస్తున్నాయి తీతువుల కూతలు. ఆ ఇద్దర్నీ విధి శపించిన ఆ క్షణం, వాళ్ళ గుండెలు లయ తప్పాయి.

"కాటు వేసిందనుకుంటాను" అన్నాడతను మడమమీద కారుతున్న సన్నటి రక్తపు చారను తుడుచుకుంటూ.

"అమ్మో ఇప్పుడెలా?" అందామె కంగారుగా. జేబులోంచి రుమాలు తీసి గాయానికి పైన గట్టిగా కట్టుకున్నాడతను. తన భుజంమీద అతని చేయివేసి నడిపించసాగిందామె. కానీ వాళ్లు కారు దగ్గరకు వచ్చేటప్పటికే మైకం కమ్ముతోంది. అతని ఒళ్ళంతా చెమట. నీరసం. మగతగా వెనక సీట్లో పడుకున్నాడతను.

ఇగ్నీషన్ కీ తిప్పుతున్న ఆమె చేతివేళ్ళు కంపించాయి. మైలు దూరం కూడా రాకముందే ఇంజన్ బాయిలైపోయి బానెట్లోంచి సెగలూ పొగలూ రావడం మొదలుపెట్టాయి. ఫాన్ బెల్టు తెగిపోయింది. వాళ్ళను భౌతిక ప్రపంచానికి చేర్చగల ఆధారం ఒక్కటీ నిస్సహాయంగా నిలిచిపోయింది. స్టీరింగ్ మీద తల వాల్చి వెక్కి వెక్కి ఏడవసాగిందామె. ఆమె ఏడుపు చెవులను సోకేంత స్మారకస్థితిలో లేడతను.

వెన్నెల వెలవెలబోతోంది. చీకటికి చోటిచ్చేస్తోంది క్రమంగా. ఆత్రుతతో క్షణం కూడా స్థిమితంగా కూర్చోలేక అమృత కారు దిగింది. అసహనంతో పెదిమలు కొరుక్కుంది. నీళ్ళతో నిండిపోయిన ఆ కళ్ళకు లోకం పూర్తిగా చీకటైపోయింది. కొన్ని గంటల క్రితం వరకూ వాళ్ళకు ఆ ప్రదేశం స్వర్గం. మనుషులెవరూ వుండరు కాబట్టి ఆ రోడ్డుమీద వాహనాలు పెద్దగా నడవవుకాబట్టి. కావలసినంత ఏకాంతం కాబట్టి అవే కారణాలవల్ల యిప్పుడు ఆ ప్రదేశం నరకం వారికి. నిర్మానుష్యమైన ఆ రోడ్డుమీద ఆ అర్ధరాత్రివేళ కర్తవ్యం తోచక బొమ్మలా నిలబడిపోయిందామె.

*   *   *

అతనికి మహా విసుగ్గా వుంది. వారం రోజులైంది పంకజాన్ని కలిసి. ఈ రోజున ఎంతో ఆశతో వెళ్తే ఆ క్రుకెడ్ ఉమన్ వాళ్ళ అత్తగారి ఊరు వెళ్ళిందట. ఆ సంగతి తనకు ముందే తెలిస్తే అంత ఎక్కువగా మందు వేసుకోక పోయేవాడే. ఇప్పుడెలా? తనను నిలువెల్లా దహిస్తున్న ఈ కోరికను నిగ్రహించుకొనేదెలా? ఈ అగ్నిని చల్లార్చుకొనేదెలా? సిగరెట్‌ను పళ్ళ మధ్య నొక్కి పెట్టి గట్టిగా దమ్ములాగాడతను. ఆ ఘాటుకు కళ్ళు నీళ్ళతో నిండి దారి మసకైపోయింది. బ్రేక్ వేశాడతను.

*   *   *

ఒంటరిగా, నిస్సహాయంగా కారు చీకటిలో నిలబడిన అమృతకు ప్రపంచమంతా శూన్యంగా కనిపిస్తోంది. అతన్నెలా దక్కించుకోవాలన్న సమస్య పెరిగి పెరిగి పెద్దదై భూమినంతా ఆక్రమించుకున్నంత పెద్దదై ఆమెను వేధిస్తోంది. ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి?

దూరంగా రోడ్డుమీద సన్నటి వెలుగు కనిపించింది. క్రమ క్రమంగా అది రెండుగా చీలి మరికాస్సేపటికి ఇంజన్ చప్పుడు వినిపించింది.

దారికి అడ్డంగా నిలబడిందామె.

దేవుడున్నాడు అనుకుంది.

ఉన్నాడా నిజంగా?

*   *   *

కళ్ళు నులుముకుని మరీ చూశాడు అతను. నిజమే ఎవరో అమ్మాయే, పక్కన ఎర్రటి కారు. హెడ్‌లైట్ల వెలుగులో ఒంటరిగా ఆమె తన కారువైపు వేగంగా నడిచి వస్తోంది. క్షణం సేపు అతని కళ్ళు చెదిరాయి. అంతకుముందు తను అజంతా, ఎల్లోరాల్లో చూసి ఎంతో ముచ్చటపడిన శిల్పాలు గుర్తొచ్చాయి. మరుక్షణం అతనికి వాటి మీద

అసహ్యం ఏర్పడింది. ఏదో తెలియని ఆనందంతో అతని ఒళ్ళు పులకించింది. పంకజం మీద అంతకు ముందు వరకూ వున్న కసీ, కోపం ఇట్టే మాయమైపోయాయి. ఆ స్థానంలో కృతజ్ఞత మిగిలింది. తనకోసం భీమిలిలో వుండకుండా వాళ్ళ అత్తగారి ఊరు వెళ్ళినందుకు.

కారు దిగాడతను. అతనికి యెదురుగా నిలబడి చేతులు జోడించిందామె.

“సర్, మాది వైజాగ్. షికారుకి యిటొస్తే మా వారిని పాము కాటేసింది. స్పృహ తప్పి పోయారు. కారు ట్రబులిచ్చింది. మీరు కొంచెం మమ్మల్ని హాస్పిటల్‌వరకూ చేరిస్తే..”

వాళ్ళ కారు దగ్గరకు వెళ్ళి వెనక సీట్లో పడివున్న రాజాను చూశాడు. నాడి బలహీనంగా కొట్టుకుంటోంది.

“ఆలస్యం చేస్తే ప్రమాదం. ఇప్పటికే లేటైపోయింది” అన్నాడతను. కారును ఆనుకుని నిలబడి.

“అవును” అందామె అసహనంగా. ఆ సంగతి తెలిసీ అతనెందుకు జాప్యం చేస్తున్నాడో ఆమెకు అర్థంకాలేదు.

“ఈ వేళప్పుడు ఈ రోడ్డు మీద ఎటువంటి సంచారమూ వుండదు. నేనైనా చాలా లక్కీగా దొరికాను మీకు.” అన్నాడతను సిగరెట్ వెలిగించుకుంటూ.

“మీరీ సహాయం చేస్తే జీవితాంతం మీకు కృతజ్ఞులమై వుంటాం.”

“నాక్కావలసింది అది కాదు. నేను పక్కా వ్యాపారస్థుడిని. నాకు ప్రయోజనం లేని పని ఏదీ నేను చేయలేదు.”

“మీకెంత డబ్బు కావాలన్నా యిస్తాను. బ్లాంక్ చెక్ యిస్తాను. వైజాగ్ చేరగానే.. ప్లీజ్,”

“డబ్బు...” నవ్వాడతను. “దానికేం లోటులేదు నాకు. నేనే పదిమందికి దాన్ని పంచగల స్థితిలో వున్నాను.”

“మరి?” క్షణం ఆలోచించిన తర్వాత గానీ ఆమె కర్థం కాలేదు అతనిక్కావలసిందేమిటో.

* * *

స్త్రీని మొట్టమొదట అన్యాయం చేసింది సృష్టి. అందం ఆమె మొదటి శత్రువు. వయసు రెండోది. నిస్సహాయత, బలహీనత, పరిస్థితులు అనేవి తర్వాతవి. మగవాడు ఆఖరివాడు మాత్రమే.

అవసరం ఆమెది. అవకాశం అతనిది.

అనాదిగా మనిషికీ, మనిషిలోని రాక్షసుడికీ మధ్య జరుగుతున్న నిరంతర సంగ్రామంలో గెలుపు ఎన్నడూ మనిషిని వరించలేదు.

మానవత్వం ఉండనిది కేవలం మానవుడిలోనే. ఏ వ్యక్తినైనా అడకత్తెరలో నొక్కడానికి విధికి అరక్షణం చాలు. కానీ దాంట్లోంచి తప్పుకోవడానికి మనిషికి యుగాలు కావాలి.

తన కారు దగ్గరకు వెళ్ళిపోయాడతను. గడుస్తున్న ప్రతిక్షణం ఆమెను చిత్రవధ చేసి మరీ వెళ్తోంది. అతని నోట్లో సిగరెట్ వికృతంగా వెలుగుతోంది. అతన్లో రగులుతున్న కామంలా.

సంఘం స్త్రీ కిచ్చిన ఆల్టర్నేటివ్స్ చాలా తక్కువ. మనిషి ఆమెకు మిగిల్చినవి మరీ తక్కువ.

ముందుకే నడిచిందామె. వెనక డోర్ తెరిచి పట్టుకున్నాడతను. వర్షం మొదలైంది. నిప్పును చంపగల శక్తి నీళ్ళకే వుంది. మగవాడి వేడిని చల్లార్చగల శక్తి ఆడానికే వుంది. నీళ్ళు పవిత్రమైనవి. కానీ ఆడది? అతను పారేసిన సిగరెట్ తడిసిపోయింది. ఆరిపోయింది పూర్తిగా. రాజాను భుజంమీద వేసుకుని తన కారు దగ్గరకు తీసుకొచ్చాడతను.

"లే. లేచి ముందు సీట్లో కూర్చో" అన్నా డామె నుద్దేశించి. అంతకు ముందు వరకూ 'మీరు' తర్వాత 'నువ్వు' తనకు ఓడిపోయిన ఆడదంటే ఎంత చులకన మగవాడికి!

యాంత్రికంగా ముందు సీట్లోకి వచ్చింది.

క్షణాలు గడుస్తున్నాయి. కారు మనసుతో పోటీపడి పరుగెడుతోంది. పక్కకు చూసిన అతనికి చరిత్ర మిగిల్చిన శిథిల శిల్పాలు కన్పించాయామెలో. గుండె అట్టడుగున ఓ పొర సన్నగా మూలిగింది.

"పర్వాలేదు. నయమైపోతుందిలే మీ వారికి."

ఆమె ఏం మాట్లాడలేదు. అసలా అవసరమూ లేదు.

కేజీ హాస్పిటల్ ఆవరణలో ఆగింది కారు. నైట్ డ్యూటీలో వున్న డాక్టర్ పరీక్ష చేసి పెదవి విరిచాడు.

"ఇంతసేపూ ఏం చేస్తున్నారు? కనీసం ఓ పది నిమిషాలు ముందు వచ్చినా బ్రతికి వుండేవాడు. టూ లేట్. హీ ఈజ్ నో మోర్."

ఎందుకో పగలబడి నవ్వాలనిపించిందామెకి. వెనక్కు తిరిగి నడిచింది. హాస్పిటల్ బైటికి. వెంబడించాడతను. పది నిమిషాలు... పది నిమిషాలు... జస్ట్ టెన్ మినిట్స్... తన కోరిక విలువ పది నిమిషాలు... తామిద్దరూ కార్లో గడిపింది పది నిమిషాలు. ఓ ప్రాణం ఖరీదు పది నిమిషాలు.

"అయామ్ సారీ ఇలా జరుగుతుందని..."

అతని వైపు తిరిగి చేతులు జోడించిందామె. "దయచేసి నన్నొదిలెయ్యండి. ప్లీజ్." ఆమె మొహంలో ఏ భావాన్నీ చదవలేక పోయాడతను. ఆగిపోయాడు. నడుస్తూనే వుందామె. ఇప్పుడామెలో ఎటువంటి ఉద్విగ్నతా, ఆవేశమూ లేవు. జలపాతంలా ఎంతో ఎత్తు నుంచి కిందకు పడి ఛిన్నాభిన్నమైన తర్వాత ప్రశాంతంగా సాగిపోయే సెలయేరు ఆమె ఇప్పుడు.

తన కల గుర్తొచ్చిందామెకు. మంచు విడినట్టు విడిపోయిందది. డాక్టర్ మూర్తి ఏం చెప్పబోయినా తనకిక అవసరంలేదు. సైకియాట్రిస్టులు ఊహించలేని సమాధానాన్ని విధి విశ్లేషించి చూపించింది. ఆమెలో ఇప్పుడు ఎటువంటి వికారమూ, భయాలూ, సందేహాలూ లేవు. ఆమెకిక రాత్రిళ్ళు ఆ కల రాదు.

ప్రకృతిలో అనేక రకాల జీవరాసులు నివసిస్తున్నాయి. అందులో కొన్ని చాలా భయంకరమైనవి అయినా వాటి రక్షణ కోసం మాత్రమే అవి ఇతరులకు హాని కలిగిస్తాయి. వినోదం కోసం ఆ పని చేసే వింత జీవి మనిషి ఒక్కటే. చాలా జంతువులు కాటు వేయగలవు. అన్నిటికన్నా ప్రమాదమైనది మనిషి కాటు.

ఆమె నడుస్తోంది వెనక్కి తిరిగి చూడకుండా.

కేజీ హాస్పటల్‌కు సముద్రం ఎంతో దూరం వుండదు. ఆమెకు యిక ఏ విధి న్యాయం చేయగలదు?

మనిషికి మరణంకన్నా పవిత్రత ఏముంది?


(సమాప్తం)

– ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ప్రచురితం, 1981

ది ఆస్ట్రేలియన్ కనెక్షన్!



పునరంకితం



వేములపల్లి మోహనరావు –
పి.వి. కృష్ణారావు



నవల

ఇది హృదయం,
మృదుకుసుమం
పదిలము సుమ్మీ!

'సిడ్నీ హిలన్, గుడ్ మార్నింగ్' అందో తియ్యని ఆడ గొంతు.

"కనెక్ట్ మి టు మిస్టర్ మార్టిన్, యువర్ సేల్స్ మేనేజర్ ప్లీజ్" అడుగుతోంది ఆపరేటర్.

"యా ఒన్ మినిట్"

రెండు నిమిషాలకు మార్టిన్ లైన్‌మీదకు వచ్చాడు.

"మిస్టర్ మార్టిన్, యాన్ యిన్‌కమింగ్ కాల్ ఫ్రం ఇండియా. గో ఎ హెడ్ సర్,"

"ఓ.కె. థాంక్స్.. హలో,"

"గుడ్ డే మార్టిన్. చక్రవర్తి హియర్!"

"ఓ, వాటే ప్లజంట్ సర్‌ప్రైజ్ సర్! ఈ మధ్య మీరిటు రాకపోతే మమ్మల్ని సాంతం మర్చిపోయారేమోననుకున్నాను. ఎలా ఉన్నారు? కులాసానా?"

"ఆహా! నిక్షేపంలా ఉన్నాను. రేపు ఈవినింగ్ ఫ్లయిట్‌లో వస్తున్నాను, హెల్లికి కబురు చెయ్యి. నేను ట్రై చేశాను. దొరకలేదు. రెండు మూడు రోజులకన్నా ఎక్కువ ఉండననుకుంటాను. ఈసారి చాలా పనులున్నాయి."

"ఓకే సర్, ఇప్పుడే కబురు చేస్తాను. మీరొచ్చేప్పటికి హోటల్లో ఉంటుంది. సరేనా."

"థాంక్స్ ఎ లాట్. నీకేమైనా కావాలా ఇక్కడి నుంచి?"

"నో థాంక్‌యూ వెరీమచ్, వెరీ కైండ్ ఆఫ్ యూ సర్."

"ఓకే. బై దెన్."

ఫోన్ పెట్టేసి ఇటువైపు తిరిగాడు చక్రవర్తి. తలకింద చేతులుంచుకుని సీలింగ్ వైపు నిర్లిప్తంగా చూస్తోంది శాంతి. కప్పు నుంచి వేలాడుతున్న గాజు భవనమంత క్రిష్టల్ షాండిలీర్‌లో నుంచి విచ్చలవిడిగా విస్తరిస్తున్న నీలి వెలుతురు. పల్చటి నైట్‌గౌన్‌లో దాగలేక సౌందర్యపు వెలుగుల్ని విరజిమ్మే ఆమె శరీరం. విషాదం అల్లిన సాలిగూడులో చిక్కుకున్న వదనం. ఆమె నడుంమీద చెయ్యివేసి తనవైపు తిప్పుకున్నాడతను. బ్లాంకెట్ లోపల తనకు దగ్గరైన ఆమె శరీరం అశాంతితో ఘనీభవించిన మంచుముద్ద.

ఇక నిగ్రహించుకోలేనట్టు అతని గుండెల్లో తల దాచుకొని వెక్కి వెక్కి ఏడవసాగిందామె. విషాదం కరిగి కన్నీరై అతని గుండెల్ని వెచ్చగా తడిపేసింది.

" టేకిట్ ఈజీ శాంతీ... ఇప్పుడేమైందనీ... కమాన్. కంట్రోల్ యువర్ సెల్ఫ్. "

"ఎంతకాలం?... ఎన్ని రోజులిలా..." ఆమె కన్నీళ్ళు బుగ్గలమీద నిలిచిపోయాయి కెంపుల మీద వజ్రాలు ఒలికినట్టు.

" ఇంకెంత? మహా అయితే ఓ సంవత్సరం. "

" ఎన్ని సంవత్సరాల నుంచి చెబుతున్నారా మాట. "

" ఏడేళ్ళ నుంచి! "

" ఇంకా ఎన్నేళ్ళు చెబుతూనే వుంటారు? "

" మరో ఐదేళ్ళు. నవ్వేశాడతను. కానీ ఆమె నవ్వలేదు. అతనికి దూరంగా జరిగింది.

" జీవితం పట్ల మీకో అవగాహనంటూ వుందా అసలు? ప్రేమ, అభిమానం, ఆప్యాయత, అనురాగం అనేవి ఎప్పటికైనా అర్ధమౌతాయా మీకు? మీకో మనసంటూ వుంటే అదో కంప్యూటర్. అందులో అంకెలూ, లాభాలూ, నష్టాలూ, మీ షేర్లూ, షిప్పులూ, డబ్బూ తప్ప మానవత్వానికి, ప్రేమకి చోటుందా! "

మాట్లాడలేదు.

" భార్యంటే మీ దృష్టిలో జీవిత భాగస్వామి కాదు. మీ ప్రయాణంలో కేవలం ఓ రాత్రికి పనికొచ్చే మజిలీ మాత్రమే. "

" ఎనఫ్, స్టాపిట్ " మంచం దిగుతూ అన్నాడు.

" అంతకు మించి నేనేం చెయ్యగలిగాను. ఏం చెయ్యగలను? నా కోరికలూ, ఆశలూ అన్నీ నాలోనే సమాధి చేసుకున్నాను. నన్ను నేను చంపుకున్నాను. నా అంతరాత్మను వంచించుకుంటున్నాను. నా దుఃఖాన్నీ, కన్నీళ్ళనూ ఆపుకుంటూనే ఉన్నాను. ఆపుకోక చేసేదేముంది. "

" ఓ... హెల్ .... ఏమైంది. ఇప్పుడు నీకేం తక్కువైందనీ..."

" అబ్బే... నాకేం తక్కువ. రెండెకరాల్లో రెండంతస్తుల రాజభవనం. ఓడంత కాడిలాక్ కారు. రోజూ బంగారం బ్రేక్‌ఫాస్ట్‌గారు, వజ్రాలు లంచ్‌గాను, డాలర్లు డిన్నర్‌గాను తిన్నా రెండు తరాల వరకూ తరగని సంపదా. చిటికె వేస్తే బారులుతీరి నిలబడే నౌకర్లు. నేను బయటికి వెళ్తే రెడ్ కార్పెట్ ట్రీట్‌మెంట్ ఇచ్చే సంఘం. అన్నిటినీ మించి సంవత్సరానికి రెండు సార్లో, మూడుసార్లో పక్కలో పడుకోబెట్టుకునే మొగుడూ. అవును... నాకేం తక్కువ!"

" చేప పిల్లలకు ఈత నేర్పాలేమో గాని ఆడవాళ్లకు నిష్ఠూరాలాడ్డం నేర్పక్కర్లేదు. అసంతృప్తికి అందమైన రూపం ఆడది. " అనుకున్నాడతను బాత్‌రూంలోకి వెళ్తూ.

ఇది పొద్దున్నే ఎనిమిదింటికి.

* * *

" ఐ లవ్ యూ చక్రీ. "

" ఐ టూ లవ్ యూ శాంతీ " ఆమెను గట్టిగా అదుముకుంటూ అన్నాడతను.

" నువ్వసలు ఈమధ్య అద్దంలో చూసుకున్నావా. ఎంత చిక్కిపోయావో? సరైన తిండీ నిద్రాలేక. ఆ కళ్ళు చూడు ఎంత లోతుకు వెళ్ళిపోయాయో. ఆ పాడు సిగరెట్లు మానవు. జుట్టు అప్పుడే ఎంత ఊడిపోయిందో... ఎలా అయిపోతున్నావ్ చక్రీ. "

" అమ్మాయి గారికి అస్తమానం మొగుడి ధ్యాస తప్ప వేరే పనేం లేదనుకుంటానే."

" మరి నాకున్నది ఒక్కడే మొగుడు. నాకున్న వాటన్నిటిలోకి అతి తక్కువ సంఖ్య. "

“ పెరుగుతున్నాడో, తరుగుతున్నాడో తెలీని అర్ధ చంద్రుడు. ప్రియురాలి పెదవిమీద ప్రియుడి పంటిగాటులా తడిగా మెరుస్తున్నాడు. విశాలమైన గార్డెన్‌లో తన నడుంచుట్టూ పెనవేసుకున్న అతని చేతిని మృదువుగా నిమురుతూ అతని అడుగులో అడుగు కలిపి నడుస్తోందామె. విరబూసిన నైట్‌క్వీన్ పూలుతమ యజమానురాలి అరుదైన అనుభవానికి పరిమళాల హారతుల నిస్తున్నాయి. గుర్రాలంత యెత్తున్న సెయింట్ బెర్నార్డ్ కుక్కలు రెండూ వారిద్దరి ఏకాంతాన్నీ దూరంనుంచే కాపలా కాస్తున్నాయి. బంగళా నిద్రపోతోంది. కీచురాళ్ళు నోరు మూసుకున్నాయి. వాటన్నిటికీ తెలుసు ఆ యింటి యజమాని అభిరుచులూ, అవసరాలూ యేమిటో. వీటిలో ఏ ఒక్కదానికీ ఆ హద్దు నతిక్రమించే దమ్ములేవు.

పచ్చని పరుపు పరిచిన పచ్చిక ఆ జంటకు మెత్తని ఆతిధ్యం యివ్వడం కోసం యెదురు చూస్తోంది. ఇంకా యెంతసేపు అనుకుంటున్నాయి పొత్తుగా పెరిగిన క్రోటన్ మొక్కలు. అటువంటి రాత్రుల కోసం శాంతితో పాటు అవీ ఎదురు తెన్నులు చూసి చూసీ విసుగెత్తి పోయాయి. అందుకే ఎప్పుడోగాని లభించని ఆ ఆనందం కోసం ఆ ఆరాటం. ప్రతీ మొక్కనూ, పొదనూ పరామర్శించి, ఆ జంట అక్కడికి చేరుకునేటప్పటికి పచ్చిక సిగ్గుతో ముడుచుకుపోయింది.

కాలానికి గుండె వేగంగా కొట్టుకుంటోంది. చేరువైన మనసులు శరీరాలకు దారి చూపుతున్నాయి. ఆ మథనంలో అంతర్యాలు ప్రక్షాళిత మౌతున్నాయి. క్రోటన్ మొక్కలు ఆ జంటకు మిగతా సృష్టి దిష్టి తగలకుండా వెయ్యి కళ్ళతో కాపలా కాస్తున్నాయి.

సొమ్మసిల్లిన ప్రకృతీ పురుషుడూ ఒకరి నొకరు పెనవేసుకున్నారు. తృప్తి... అంతులేనంత తృప్తి. విశ్వమంతా ఆవరించుకుని!

“ ఈ క్షణాలు శాశ్వతమైపోతే... ” అన్న స్పృహ ఆమె హృదయంలో.

ఇది రాత్రి ఒంటిగంటకు.

* * *

“ ఏమండీ ”

“ ఊ ”

“ మిమ్మల్నేనండీ ”

“ ఊ! ఏమిటీ ” అని దీర్ఘం తీశాడతను.

“ ఇప్పుడు ఆస్ట్రేలియా వెళ్ళడం అంత అవసరమా? ”

“ అఫ్‌కోర్స్. ఎస్. ”

“ తప్పదా? ”

" పిచ్చి శాంతీ... మళ్ళీ వచ్చేస్తాను వెంటనే... ఎంత... రెండు రోజులే గదా! "

" రెండు రోజులంటే మీ డిక్షనరీలో నా అనుభవంలో రెండు నెలలని కదా అర్థం! "

" ఓ...నో... ఈసారి అలాకాదు. నిజంగానే వచ్చేస్తాను. "

" ఏమండీ "

" మిమ్మల్ని ఓ మాటడగనా "

" ఊ "

" అసలు మీరు పెళ్ళెందుకు చేసుకున్నారు? "

" నిన్ను ప్రేమించబట్టి. "

" అసలెందుకు ప్రేమించారు? "

" బుద్ధి తక్కువై. "

" అయితే మనం విడాకులు తీసుకుందామా? "

" ప్చ్. నాకంత అదృష్టం కూడానా? " నిట్టూరుస్తూ అన్నాడు చక్రవర్తి.

" నేను విడాకులిచ్చేస్తే మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటారా? "

" వచ్చే పది జన్మల వరకూ ఆ ప్రసక్తే లేదు. ఏ తప్పైనా ఒక్కసారే చేస్తాను నేను "

" యూ ఆర్ ఎ రియల్ బాస్టర్డ్. "

" ట్రూ "

" మానవత్వం అంటే నీ కసలు అర్థం తెలీదు "

" కరెక్ట్ "

" నేను చచ్చిపోతే నా శవాన్ని చూట్టానికి కూడా రారు మీరు. "

" పనేం లేకపోతే వస్తాను "

" మీరు రాక్షసలు నన్ను మాయచేసి వల్లో వేసుకుని, నా చదువు చెడగొట్టి నా జీవితాన్ని సర్వనాశనం చేసిన మహా కర్కోటకులు మీరు. మీతో కాపురం చెయ్యడం కన్నా దేంట్లోనైనా దూకి చావడం నయం. "

" అదే బెటరనుకుంటాను "

" ఐ హేట్ యూ... ఐ హేట్ యూ ప్రపంచంలో నేను ద్వేషించే మొట్టమొదటి వ్యక్తి మీరే. "

" చూశావా. దేంట్లోనైనాసరే నేనే నంబర్ ఒన్. "

రాకెట్లా దూసుకు వస్తున్న తలగడకు చేతులు అడ్డుపెడుతూ అన్నాడు చక్రవర్తి.

ఇది పొద్దున్నే ఎనిమిదింటికి.

*　　*　　*

సింగపూర్. జకర్తాల మీదుగా సిడ్నీ వెళ్ళే క్వాంటాస్ ఎయిర్‌లైన్స్ 747 విమానం బాంబే శాంతాక్రజ్ ఎయిర్ పోర్టులో టేకాఫ్‌కు సిద్ధంగా వుంది.

" నువ్వు నవ్వుతూ పంపించాలి. లేకపోతే నేను వెళ్ళేపని పూర్తి కాదు " అన్నాడు చక్రవర్తి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

" ఏం చూసుకుని, ఏం తల్చుకుని, ఏం ఆశించి నవ్వమంటారు " అంది పేలవంగా శాంతి.

" అదుగో. ఇక్కడ కూడా సాధింపులేనా? మళ్ళీ వచ్చేస్తానుగా రెండుమూడు రోజుల్లో. ఏదీ నవ్వమరి. వచ్చేటప్పుడు సింగపూర్‌లో ఆగుతాను. ఏం తీసుకురాను నీకు? "

" హు! మీరు తప్ప నాకు లేనిదేముంది? మీరు దగ్గరుంటే నాకు కావలసిందేముంది? ఎన్ని ఉంటే అవి మీతో సమానమౌతాయి? "

" ప్రామిస్ శాంతీ. ఈ పారి నెలరోజుల పాటు యెక్కడికి వెళ్ళను. వేసవికాలం వచ్చేస్తోందిగదూ. ఏ ఊటీయో, డార్జిలింగో వెళ్ళిపోదాం "

" మీరు చెప్పేది నిజమౌతుందో, అబద్ధమౌతుందో మీకే తెలియదు. ఎందుకీ ప్రామిస్‌లు. "

" దిసీజ్‌ద లాస్ట్ కాల్ ఫర్ పాసెంజర్స్ ట్రావెలింగ్ టూ సిడ్నీ బై క్వాంటాస్ ఫ్లయిట్ నంబర్ క్యూ ఎఫ్ ఎయిట్ " అనౌన్స్‌మెంట్ వినిపించింది,

" ఓకె. వెళ్ళొస్తాను "

చెయ్యి వూపిందామె.

చెకిన్ అయ్యాడతను.

అలవాటైన దారి వెంట కారు సాగి ఇంటి ముందాగితే, ఆమె ఆలోచనల్లో నుంచి మేల్కొని లోపలికి నడిచింది. కొన్నేళ్ళుగా అది ఆమెకి అనుభవమే అయినా అలవాటు కాలేదు.

భావాల్లో చక్రవర్తి, ఆమె భయాలు, ఒంటరితనం... ఒకోసారి సంబద్ధంగానూ, మరోసారి అసంబద్ధంగానూ అనిపించే వూహల దాడి ఆమెపై. ఎవరితోనూ చెప్పుకోలేదు. చెప్పేందుకు ఏమీ వున్నట్టు గాని, చెప్పుకునేందుకు యెవరూ వున్నట్టు గానీ అనుకోదు

స్నేహితులంటూ వున్నా అవి మెయిన్‌టెయిన్ చేసే మానవ సంబంధాలే తప్ప సహజ బాంధవ్యాలు కావని ఆమె నమ్మకం. చక్రవర్తిని విడిచి ఆమె వుండలేదు. అలా అని అతనితో తిరగనూ లేదు. అతనికేమైనా ప్రమాదం జరిగితే అని తన మనసులోకి తరచూ వచ్చే ఆలోచనల్ని భయంగా ఆమె గమనిస్తుండేది. రాను రాను ఆమెకది దుర్భరమౌతోంది. ఎప్పుడూ లేనిది చక్రవర్తి తనకు దూరమౌతున్నాడేమోనన్న శంక ఆమెను ఈ మధ్య పట్టి పీడిస్తోంది.

వ్యాపారం పేరుతో కావాలని తనను తప్పుకు తిరగడం లేదుగదా అతను. ఈ ఆలోచన వచ్చినప్పుడల్లా గూటికేసి దూకుతూ వస్తున్న కాల నాగును చూసిన పక్షిపిల్లలా ఆమె గుండెలు కొట్టుకునేవి.

ఛ. ఏమిటి ఇలా ఊహిస్తోంది తను. అలా ఎప్పటికీ జరగదు. వ్యాపారం పెద్దది. అన్ని విషయాలూ తనే స్వయంగా చూసుకోవాలి. ఒంటరి మనిషి. అని సర్దిచెప్పుకోవడానికి ప్రయత్నిస్తుంది మళ్ళీ తనకుతానే.

బెడ్‌ని ఆనుకుని వున్న రోజ్‌వుడ్ కాబినెట్ మీద వీనస్ నుంచి ఆమె దృష్టి పక్కనే ఉన్న ఫోటోమీదకు మరలి, మనసు వెనక్కు నడిచి, గతం ఆమె ఆలోచనల్లో వర్తమానమై ఆ ఫోటోలో వున్న కస్తూరి క్రమంగా ఆమె ఆలోచనల్ని ఆక్రమించుకోసాగింది.

కస్తూరి వుంటే తన మానసిక కల్లోలాన్ని ఆమెకీ పంచి కాస్త తేరుకోగలిగేది. ఎన్నాళ్ళయింది కస్తూరిని చూసి. మళ్ళీ ఎప్పుడైనా తను కన్పిస్తుందా? ముప్పై మూడేళ్ళ తన జీవితంలో శాంతి తనతో మానసిక సాన్నిహిత్యం వుందని భావించిన వ్యక్తులు ఇద్దరే ఇద్దరు. చక్రవర్తి, కస్తూరి.

ఆమెతో కలిసి పంచుకోని అనుభూతి బాల్యంలో తనకసలు ఉండేదా! ఎంతగా కలిసి మెలిసి తిరిగారు. స్కూల్లో, కాలేజీలో ఎప్పుడూ జంటగానే తిరిగే తామిద్దరినీ ఆశ్చర్యంగా, అసూయగా ఎన్నికళ్ళు చూసేవి?

ఆ ఫొటో చాలా పాతది. అప్పుడు దానికి పదహారేళ్ళు. తనకంటే ఒక సంవత్సరం పెద్ద. వాళ్ళనాన్న సహచర్యంలో వయసుకుమించి చదివి, తనకెన్నడూ అర్థంకాని విషయాలపై మాట్లాడుతుంటే తనెంత ఆరాధనగా చూసేది?

" నెనెన్నడూ ప్రేమలో పడనేవ్ స్వజాతి అభివృద్ధికి సెక్స్ చాలా బలమైన ఇనిస్టింక్ట్. జంతువుల్లో, మానస జీవులైన మనుషుల్లో స్త్రీ పురుషులు జట్టుకట్టి సంతానం పొందేందుకు దోహదం చేసేదే ప్రేమ. చదువయ్యేదాకా సెక్స్‌కీ, దాని రూపమే అయిన ప్రేమకీ నా జీవితంలో ప్రవేశం లేదు. "

అంటూ వుండే కస్తూరికి పిల్లలు కూడా ఉండి ఉంటారీపాటికి. తనకు లేని

అదృష్టం ఆమెకు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంది శాంతి.

లేచి కిటికీ వైపు నడిచిందామె. బరువైన కర్టెన్లు అంచులు కాగా, స్థిరమూ, చంచలమూ అయిన దృశ్యాన్ని చూడసాగింది. ఒడ్డున ఠీవిగా నిలిచిన స్కైస్క్రేపర్స్‌ని తాకడానికి సాగే సముద్రపుటలలు, మార్పులేని తన జీవితంలానే ఆ దృశ్యం మారదు.

చక్రవర్తి సాన్నిధ్యం లేని క్షణాలు, అస్తిత్వం వ్యర్థమనిపించే యుగాలు. ఆలోచనల ఉచ్చు బిగిసి కళ్ళనీళ్ళ పర్యంతం అలుముకునే నిరాశా నిస్పృహలు. ఏ దిక్కూ తోచని శాంతి. ఆ ప్రగాఢ సుదీర్ఘ తిమిరంలో చక్రవర్తి గూర్చి వెల్లువలాంటి ఆలోచనల పొంగుదో ఒంటరి.

*   *   *

" హిల్టన్ వెల్‌కమ్స్ హిజ్ ఎక్సెలెన్సీ చక్రవర్తి ఆఫ్ ఇండియా "చిరునవ్వుతో అన్నాడు మార్టిన్. చక్రవర్తి కారు దిగగానే కరచాలనం చేస్తూ.

" ఇంకానయం, ట్వెంటీ ఒన్ గన్స్‌తో రాయల్ సెల్యూట్ ఏర్పాటు చేయించావు కాదు. " అతని భుజం మీద చెయ్యి వేసి లోపలికి నడుస్తూ అన్నాడు చక్రవర్తి.

" గుడ్ డే సర్ " అన్నారు రిసెప్షన్‌లో వున్నవాళ్ళంతా ముక్త కంఠంతో. వాళ్ళను విష్‌చేసి లిఫ్ట్ వైపు నడిచాడు చక్రవర్తి మార్టిన్ వెంటరాగా. అతను ఆ హోటల్లో అడుగు పెట్టిన దగ్గర్నుంచీ స్టాఫ్ అందరి దృష్టీ అతనిమీదే వుంటుంది. ఏ హాలీవుడ్ నటుడికి, ఏ రాజకీయ నాయకుడికీ లేనంత గ్లామర్ వుంది అతనికి అక్కడ. కేవలం కోటీశ్వరుడిగానూ, ఆరు షిప్పుల యజమానిగానూ, ఆస్ట్రేలియన్ గవర్నమెంట్‌లో మంచి పలుకుబడి గల వ్యక్తిగానే కాక, ఓ మంచి మనిషిగా, నెమ్మదస్తుడిగా, స్టాఫ్‌ను మర్యాదగా ట్రీట్‌చేసే పొలైట్ కస్టమర్‌గా అతన్ని అందరూ గౌరవిస్తారు. అతను హోటల్ ఖాళీచేసి వెళ్ళేప్పుడు అందరి జేబులూ బరువవడం అన్నిటికన్నా ఆఖరు కారణం.

చక్రవర్తిని అతని సూట్ దగ్గర వదిలి వెళ్ళిపోయాడు మార్టిన్. ఆ హోటల్లో పనిచేసే ప్రతి వొక్కరికీ చక్రవర్తి అలవాట్లూ, అవసరాలూ క్షుణ్ణంగా తెలుసు.

అతను నోరు విప్పి చెప్పనక్కర్లేకుండానే కావలసినవన్నీ చకచకా జరిగిపోతుంటాయి. హోటల్లో దిగగానే అతనికి మొట్టమొదట కావలసింది గోరువెచ్చని నీటిలో స్నానం. టాయిలెట్ తలుపు తెరిచారు. టబ్‌నిండా నీళ్ళు పట్టివున్నాయి సెంటెడ్ ఫోమ్ బాత్‌బబుల్స్‌తో మల్లెపూవులాంటి రెండు తెల్లని టవల్స్ చేతి కందుబాటులో. టబ్ దిగగానే కాళ్ళతడి పీల్చుకోవడానికి రోజారంగులో నేలమీద పరచబడివున్న మందమైన టర్కిష్ టవల్. ఎయిర్ ఫ్రెష్‌నర్ తియ్యటి వాసన. వీటిలో ఏ ఒక్కటి సరిగ్గా అమరకపోయినా అతను సహించడు.

బట్టలు విప్పి మంచంమీద పడేసి బాత్‌రూంలోకి అడుగుపెట్టాడతను. విమానాలు కిందనుంచి చూసేవారికేగాని, వాటిలో ప్రయాణించేవారికి అంత ఆనందాన్ని కలిగించవు. కొన్నివేల పరికరాలలో ఏ ఒక్కటి పనిచెయ్యకపోయినా ప్రాణాల మీద ఆశ వదులుకోవడమే. ప్రతీ ప్రయాణం ఓ పునర్జన్మ. అందులో కూర్చున్నంతసేపూ టెన్షన్. అయినా మనిషి ప్రాణాలను పణంగా పెట్టి అదే ఆ జూదానికి అలవాటుపడిపోయాడు.

అరగంటసేపు స్నానంచేసి బడలిక వదిలించుకుని అతను బయటకు వచ్చేసరికి పొగలు కక్కుతున్న కాఫీ సిద్ధంగా వుంది. అంతకు ముందు విడిచిన బట్టలు లేవు. అప్పటికే లాండ్రీకి వెళ్ళిపోయుంటాయిన జేబుల్లోని కాగితాలూ, డబ్బూ మాత్రం డ్రెస్సింగ్ టేబుల్ మీద వున్నాయి. కాఫీ తాగి పందొమ్మిదో ఫ్లోర్‌లోని స్విమ్మింగ్‌పూల్ దగ్గరకు వచ్చాడతను. ఇల్యూమినేటెడ్ నీళ్ళు తళుకులీను తున్నాయి. కాసేపు అక్కడ కూర్చున్నాడు.

ఆ హోటల్లో ఇరవయ్యో అంతస్తు. అందులోని సూట్ నెంబర్ 201 మీద అతని కెంతో సెంటిమెంటు, తన మొట్టమొదటి షిప్పు కొన్నది ఆ రూంలో వుండగానే. అక్కడ నుంచీ జీవితంలో వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం కూడా అతని కివ్వకుండా అదృష్టదేవత పరిగెత్తిస్తోంది.

గదికి తిరిగి వచ్చేటప్పటికి ఫోన్ మోగుతోంది.

" హెల్లీ స్పీకింగ్ సర్ "

" హాయ్ స్వీటీ. ఎలా వున్నావ్ "

" అయామ్ ఆల్‌రైట్. మీరెలా వున్నారు. "

" ఫైన్ "

" రమ్మంటారా "

క్షణంసేపు ఆలోచించాడతను.

" నో. నాట్ నౌ. రేపు పదింటికి వస్తే సరిపోతుంది "

" ఓకే సర్. ఎయిర్‌పోర్ట్‌కు ఫోన్‌చేస్తే ఫ్లయిట్ లేటన్నారు. అందుకని మీరు వచ్చిన తర్వాత ఫోన్‌చేసి, రమ్మంటే వద్దామని..."

" ఇట్స్ పర్‌ఫెక్ట్లీ ఆల్‌రైట్. సీయూ టుమారో. "

" గుడ్‌నైట్ సర్. "

హెలెనా ఆ అమ్మాయి పేరు. సిడ్నీలో అతని ఆఫీస్ మేనేజర్ ఆమె. టైపు, షార్ట్‌హాండ్, ఫైలింగ్, టెలెక్స్ ఆపరేషన్, డ్రాఫ్టింగ్ అన్నిట్లోనూ ఆమెకు ప్రావీణ్యం వుంది. చక్రవర్తి వ్యాపారం ఏటూ జెడ్ ఆ అమ్మాయికి తెలుసు. ముందు ఆ ఆఫీసులో రిసెప్షనిస్ట్‌గా చేరి సంవత్సరం తిరక్కుండానే అతని కుడిభుజమైంది.

చక్రవర్తి సాధారణంగా ప్రయాణం తర్వాత భోజనం చెయ్యడు. రాత్రి పదకొండు గంటల తర్వాత అతని గదిలో ఫోన్ మోగడానికి వీల్లేదు. పడుకున్న అయిదో నిమిషంలో నిద్రపట్టే అదృష్టవంతుల్లో అతడొకడు.

పొద్దున్న ఏడున్నరకు లేచేప్పటికల్లా టీ సిద్ధంగా వుంటుంది. కాలకృత్యాలు తీర్చుకుని వచ్చేసరికి కాంటినెంటల్ బ్రేక్‌ఫాస్ట్, కార్న్‌ఫ్లేక్స్, బాయిల్డ్ ఎగ్, కాఫీలతో రెడీగా వుంటుంది. బట్టలు వేసుకుని గదితలుపు తెరిస్తే గుమ్మం పక్కనే నిగనిగలాడుతూ షూస్ కనిపిస్తాయి. తర్వాత అతను హోటల్లో యెక్కడవున్నా మళ్ళీ సరిగ్గా పన్నెండింటికి కాఫీ అందుతుంది. రెండింటికి రూంకి వచ్చేప్పటికి లంచ్ సర్వ్ చెయ్యబడి వుంటుంది. వారంరోజుల్లో అతను ఏరోజు ఏం తింటారో రూం సర్వీస్‌లో పనిచేసే ప్రతి ఒక్కరికి తెలుసు. కాబట్టి మెనూ క్రమం తప్పదు.

రెండున్నరకల్లా అతను నిద్రకుపక్రమిస్తాడు. నాలుగింటికి అతను లేచేటప్పటికి బటర్ కుకీస్, ఆరంజ్ ఫ్రెష్‌జ్యూస్ వుంటాయి. రాత్రిళ్ళు అతను హోటల్లో భోంచెయ్యడు. బయటి రెస్టారెంట్లకు వెళ్తుంటాడు. తిరిగి వచ్చేటప్పటికి మళ్ళీ దిగి నిగనిగలాడుతూ మార్చబడిన టవల్స్, బెడ్‌షీట్లతో మల్లెపువ్వులా వుంటుంది.

అతనికి ఆ పనులన్నీ చేసిపెట్టేవాళ్ళు ఎప్పుడూ కనబడరు. అసలు నోరు విప్పి ఇది కావాలీ అని అడిగే అవసరం రానివ్వరు. అందుకే ఆ హోటలంటే అతనికి అంత ఇష్టం.

* * *

శాంతీ నేవిగేషన్ ఎస్.ఏ. పనామాకు అధిపతి చక్రవర్తి. ఆ షిప్పింగ్ కంపెనీకి రెండు బల్క్ కారియర్‌లు. ఒక్కొక్కటి 20,000 టన్నుల కెపాసిటీ గలవి వున్నాయి. వాటిలో ఎక్కువగా ఖనిజాలు రవాణా అవుతుంటాయి. ఓ ఆయిల్ టాంకర్ 46,000 టన్నులదీ, రెండు రో-రో షిప్‌లూ (కార్లూ, స్కూటర్లూ తీసుకువెళ్ళేవి) ఓ రీఫర్ (కూరగాయలూ, మాంసం వంటివి తీసుకువెళ్ళే ఫ్రిజిడైర్ షిప్) వున్నాయి. హెడ్డాఫీసు లండన్‌లో ఇద్దరు గ్రీక్ కెప్టెన్ల ఆధ్వర్యంలో నడుస్తుంది. సాధారణంగా చక్రవర్తికి ఆ కంపెనీ విషయాల్లో తల దూర్చవలసిన అవసరం రాదు. ఆ ఆఫీసులో పనిచేసే వాళ్ళంతా అనుభవజ్ఞులు. నమ్మకపాత్రమైన వాళ్ళు. కెనడాలో మాంట్రియల్ స్టీల్స్‌లోనూ, శాన్ ఫ్రాన్సిస్కోలోని స్టేట్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్‌లోనూ అతనికి షేర్లున్నాయి. యూరోపియన్ కామన్ మార్కెట్‌లో, న్యూయార్క్ స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లో అరచేత మందాన పేరుంది. అమెరికన్ సెనెట్‌లో దాదాపు సగం మందికి అతను తెలుసు.

నలభై కూడా నిండని వయసులో అంత పేరూ, ప్రఖ్యాతీ సంపదా ఆర్జించడం

చాలా అపురూపమైన విషయం. అతనితో సంబంధమున్న ప్రతి ఒక్కరికీ అందుకే అతనంటే అనిర్వచనీయమైన ఆరాధన. అభిమానం, అతని కింద పనిచేసే వారిలో ఏ ఒక్కరూ నిరాశ, అసంతృప్తితో బాధపడరు. అందుకే అతని వ్యాపారం విపరీతంగా పెరిగిపోతోంది రోజురోజుకూ.

మలబార్ హిల్స్‌లో అతనికున్న ఇంటిలాంటిది ఇండియాలో ఇంకెవరికి లేదని చెప్పుకుంటారు. బాత్‌రూం టైల్స్ దగ్గర్నుంచి బయట గార్డెన్‌లో పెరుగుతున్న పచ్చటి గడ్డి వరకూ అంతా ఇంపోర్టెడ్ అనేది అతిశయోక్తేగాని అబద్ధం కాదు. ఆ ఇంట్లో స్విమ్మింగ్‌ఫూల్‌ను ఫ్రెంచ్ ఇంజనీర్లు డిజైన్ చేశారు. ఓ వెల్ షేప్‌లో గ్లాస్ బాటమ్‌తో ఫ్లడ్‌లైట్ల వెలుతురుతో నిత్యం మెరిసిపోతుంటుందది. నీటికీ అతని జీవితానికీ అవినాభావ సంబంధం వుంది. అతను ఎక్కడవున్నా, నీటికి దగ్గరగా ఉంటాడు. ఆ ఇంట్లో ఏ మూలనుంచి చూసినా కనబడుతుందా స్విమ్మింగ్‌ఫూల్. ఆ ఇంటికి మూడువైపులా సముద్రం కనిపిస్తుంటుంది.

గార్డెన్ ఛైర్‌లో కూర్చుని సముద్రం వైపు తదేకంగా చూస్తోంది శాంతి. పది సంవత్సరాల క్రితం ఇదే బాంబేలో ఆ కనపడే చౌపాటి బీచ్‌లో పావలాకు రెండు వేరుశనగ పొట్లాలు కొనుక్కుని కబుర్లు చెప్పుకుంటూ, ఒకరి నొకరు ఆనుకుని యిసుకలో బలవంతాన నడుస్తూ గడిపిన యెన్నో అందమైన సాయంత్రాలు యేమైపోయాయి! బెస్ట్ కంపెనీ వాళ్ళ డొక్కు బస్సులో మైళ్ళకు మైళ్లు ఆఫీసు నుంచి ఇంటికీ, ఇంటి నుంచి బీచ్‌కీ, బీచ్ నుంచి సినిమాకి చెట్టాపట్టా లేసుకుని తిరిగిన మర్చిపోలేని ఆ రోజులు ఈ రోజుల్ని మరీ దుర్భరంగా చేస్తేన్నాయి. అంతకు ముందు బెజవాడ ఎస్సారార్‌లో చదివేటప్పుడు కలిసి ఆడిన నాటకాలూ పనిచేసిన రాజకీయాలు, దొంగతనంగా కాలేజీ యెగ్గొట్టి పాత సినిమా హాల్స్‌లో మరీ పాత సినిమాలకు వెళ్ళి ఒకరి నానుకుని ఒకరు కూర్చుని తాము చూడకుండా యితరులను చూడనివ్వకుండా గుసగుసల్లో చెప్పుకున్న కోట్లకొద్దీ స్వీట్ నిథింగ్స్‌లో ఏ వొక్కటీ యిప్పుడు మళ్ళీ యెదురు కాదేం? గాంధీ హిల్ మీద తన పుట్టిన రోజు తమ రిద్దరే జరుపుకున్నప్పుడూ, అమరావతి గుహల్లో అతని చీకటిచాటున తనమీద ముద్దుల వర్షం కురిపించినప్పుడూ, హైద్రాబాద్ ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళేటప్పుడు సూపర్ డీలక్స్‌లో అర్ధరాత్రి తన వెనక సీట్లో జేరి నడుం చుట్టూ చెయ్యి బిగింది కొంటెతనాలు పోతే పక్కసీటు పద్మావతి కెక్కడ మెలకువ వస్తుందోనని తన గుండె కొట్టుకున్నప్పుడు, నాగార్జునసాగర్‌లో అంతెత్తు నుంచీ పడే నీళ్ళను చూసి తను గుండెలమీద చేతులు వేసుకుంటే, అక్కడ ఉండవలసింది నీ చేతులు కాదు అని తన చెవిలో అంటే, ఆ సిగ్గులేని తనాన్ని ఎవరన్నా విన్నారేమోనని తను అటూ, ఇటూ చూసినపుడు, ఆ రాత్రి హొటల్లో తనను సగం మాత్రమే తిననిచ్చిన అతని చొరవకు

చుట్టూ పదిమందీ ఏమనుకుంటారోనని తను బెదిరినప్పుడూ, పొద్దున్నే ఆరింటికి గెస్ట్‌హౌస్ బాల్కనీలో నిలబడి నదిని తదేకంగా చూస్తుంటే వెనకనుంచీ హఠాత్తుగా వచ్చి తన కళ్ళు మూస్తే కింద మొక్కలకు నీళ్ళు పడుతున్న తోటమాలి తనను చూసి ముసిముసిగా నవ్వినప్పుడూ స్తంబించిపోయిన కాలం, ఇప్పుడూ స్తంభించపోయే వుంది.

కానీ అనుభవాల్లో ఎంత తేడా!

" ఈ శాంతికోసం నేను పోగొట్టుకోలేనిదంటూ ఏమీ లేదు " అని ఎన్నిసార్లు అనలేదు? ఎన్నిసార్లు నిరూపించలేదు " ఆఖరికి వాళ్ళ అమ్మా, నాన్నా వద్దంటే "కనిపెంచినందుకు థాంక్స్, మీ ఆస్తి నాకు వద్దు, శాంతి నాతో వుంటే నాకు లేనిదంటూ ఏమీలేదు. గుడ్ బై " అని కోటగోడ లాంటి వంశాన్ని ఛేదించుకుని, కట్టుగుడ్డలతో ఉద్యోగం కోసం బయల్దేరిన ఆనాటి ప్రేమలో ఎన్నోవంతు ఈనాడు చూపించినా, సంతోషపడకపోయిందా తను?

" టీ చల్లారిపోతోందమ్మా " పని మనిషి నమ్రతగా చెప్పి వెళ్ళిపోయింది.

" టీ ఏం ఖర్మ యవ్వనం, కోర్కెలు, ఆశలు, జీవితాలే చల్లారిపోతున్నాయి " అనుకుందామె.

అంథేరీలో ఓచిన్న ఇరుకు గదిలో మొదలైనా, తమ కాపురం ఎప్పుడూ చీకటి నీడలకు పరిమితం కాలేదు. అతనికి మొట్టమొదట ఓ షిప్పింగ్ కంపెనీలో దొరికిన చిన్న ఉద్యోగం అంచెలంచెలుగా పెరిగి అదే కంపెనీకి మేనేజర్ అయ్యేవరకూ తనపట్ల అతని ప్రేమ తరగలేదు. నా మనసుకు శాంతివి, నా జీవితానికి కాంతివి అని పదేపదే అనే అతని అనురాగాన్ని భరించలేక ఎంత ఉక్కిరిబిక్కిరయింది తను. ఎప్పుడైనా, దేన్నైనా కావాలీ అని కోరిందా? ఎవరికోసం ఈ ఐశ్వర్యాలూ, రాజభోగాలూ! నాకీ జీవితం వద్దూ అని ఎన్నిసార్లు అతనితో పాటు దేవుడిక్కూడా మొరపెట్టుకోలేదు! ఒక్కసారిగా ఎందుకని ఆ ఇద్దరూ తనమీద ఇంత నిర్ధయ చూపిస్తున్నారు? మనిషి దేన్నైనా తట్టుకోవచ్చుగానీ ప్రేమ రాహిత్యాన్ని మాత్రం కాదు. అందులోనూ స్వర్గంలో సంవత్సరం పాటు తనను ఓలలాడించి క్రమ క్రమంగా ఈ ఒంటరితనపు నరకంలోకి తోసివేయ దగినంత పాపం ఏం చేసుకుంది తను? ఎందుకింత కక్ష తనమీద?

ఆలోచిస్తున్న కొద్దీ శాంతి కళ్ళు నీళ్లతో నిండిపోతున్నాయి. ఎన్ని రోజులు, నెలలు, సంవత్సరాలు ఈ నిరీక్షణ!

" ఏం చేసుకుంటారు ఇంత సంపాదించి? " అంటే –

" కసి, నీకు డబ్బులేదని సంఘం నిన్ను నాదాన్ని కాకుండా చేయాలని చూసింది. అదే కారణంచేత మా వంశం నిన్ను, నిన్ను కట్టుకున్న నన్నూ వెలివేసింది. నేను

ఉద్యోగం లేక ఊరిమీద తిరుగుతుంటే “ ప్రేమ ఫలించింది చాలదా, అది తిని బ్రతకరాదూ ” అని వెక్కిరించింది. ఆ సంఘాన్నీ, ఆ ఎత్తిపొడుపులనూ, వెక్కిరింపులనూ మనసులో వుంచుకున్నాను. సంపాదిస్తాను, అపరిమితంగా సంపాదిస్తాను. నిన్ను సింహాసనం ఎక్కిస్తాను. నిన్ను అవమానించిన వాళ్ళందర్నీ, నీ అభిమానాన్ని గాయపరచిన వాళ్ళందర్నీ ఆఖరిరోజున ఆహ్వానించి, వాళ్ళందరి ముందూ ఈ టన్నుల కొద్దీ డబ్బు గుమ్మరించి, వాళ్ళు ఆరాధించే ఈ చిత్తు కాగితాలకు నిప్పంటించి, వాళ్ళవిలువలూ, అభిరుచులూ ఎంత హేయమైనవో, నాదృష్టిలో ఎంత హీనమైనవో నిరూపించి ఆ మసితో వాళ్ళ మొహాలకు రంగు పూస్తాను. నా శాంతిని అవమానించిన ఈ సంఘం మొత్తానికి చితి పేర్చుతాను ”

“ ద్వేషించడం వల్ల ఎవరూ, ఏమీ, ఎప్పుడూ సాధించలేరు. ”

“ తప్పు. నన్ను చూడు. నా ద్వేషమే, నాపగే నన్నింత వాణ్ణి చేసింది. ”

“ కానీ ఫలితం మాటేమిటి? నేను బలైపోతున్నాను. మీ ఆత్మ తృప్తికోసం, మీరు సాధించుకోబోయే కక్ష కోసం నేను క్షణక్షణం చస్తున్నాను. మీ లక్ష్యం నెరవేర్చుకునే రోజుకు ఈ శాంతి మిగలదు. ఆమె అవశేషాలే వుంటాయి. ”

“ నో. నా ప్రేమ నీ చుట్టూ కట్టిన వలయం అభేద్యం. అందులోకి ప్రవేశం అనితర సాధ్యం. ”

“ అవును ఇంకెవరూ నా దగ్గరకు రాలేదు. నేనే ఈ ఏకాంతంలో నీ కోసం నిరీక్షణలో కరిగిపోయి, ఆహుతైపోయి, నా చివరి క్షణాల్లో ఓ కన్నీటి బొట్టు కోసం పరితపించిపోయే సమయంలో నువ్వెక్కడో మిలియన్ల కాంట్రాక్టుల మీద సంతకాలు చేస్తూ రాబోయే లాభాలను తలచుకుని పొంగిపోతుంటావు. ఏ గృహిణి జీవితానికైనా అంతకన్నా సార్ధకత ఏం కావాలి? ”

“ నో శాంతీ ” గట్టిగా తన నోరు మూశాడతను. “ నేనీ భూమ్మీద ఉన్నంత కాలం దేవుడికూ్కడా దమ్ములుండవు నిన్ను దరి చేర్చుకోవడానికి? ”

అటువంటి సంభాషణలు ఎన్నిసార్లు జరగలేదు తమ మధ్య. వాటివల్ల ఏం ప్రయోజనాన్ని సాధించగలిగింది తను!

ఏకాంతాన్ని జయించడానికి స్త్రీకి పురుషుడూ, పురుషుడికి స్త్రీ ప్రకృతి సిద్ధమైన పద్ధతి. పుస్తకాలు, సంగీతం, సినిమాలు, విలాసాలూ కృత్రిమం.

చీకటిని దూరం చేయడానికి సూర్యుడు కావాలి. నియాన్ లైట్లు, సోడియం వేపర్ లాంపులూ, మెర్క్యురీ దీపాలూ కేవలం అలంకారాలు.

*   *   *

మార్బుల్ బార్‌లో కూర్చున్నారు చక్రవర్తి, హెలెనా, మరో ఇద్దరు పెద్దమనుషులూ. వాళ్ళలో ఒకాయన ఆస్ట్రేలియన్ బీట్ కార్పొరేషన్‌కు ప్రెసిడెంట్. రెండో ఆయన సెక్రెటరీ. ఆ దేశం నుంచి మిడిల్ ఈస్ట్‌కు వీట్ ఎక్స్‌పోర్టు చేయడానికి చక్రవర్తి షిప్పులను వుపయోగించాలని నిర్ణయం జరిగింది. ఆ ఉదయమే ఫ్రైట్ ఫిక్స్ అయి సంతకాలు కూడా అయిపోయాయి. ఆ సందర్భంలో చిన్న పార్టీ ఇస్తున్నాడు చక్రవర్తి.

వెయిటర్ డ్రింక్స్ తీసుకొచ్చాడు.

"లాంగ్ లీవ్ ది వీట్ కార్పొరేషన్" అన్నాడు చక్రవర్తి. తన బ్లడి మేరీ గ్లాసును ఎత్తి పట్టుకుని.

"ఫర్ ది హెల్త్ ఆఫ్ మిష్టర్ చక్రవర్తీ అండ్ హిజ్ నావిగేషన్" అన్నారు గెస్ట్‌లు షాంపేన్ గ్లాసులు తాకించి.

"ఛీర్స్ టు యువర్ కాంట్రాక్ట్" అంది హెలెనా.

సాధారణంగా అటువంటి సమయాల్లో వ్యాపారంలో నుంచి వ్యక్తిగత విషయాలలోకి సంభాషణ జారిపోతుంటుంది.

"మీరు ఎక్కువగా ఇతర దేశాలు తిరుగుతుంటారుకదా. మరి మీ వైఫ్‌ను తీసుకువెళ్ళరా" గెస్ట్‌లో ఒకాయన అడిగాడు.

"ఫ్లైట్స్ ఆమెకు పడవు. అదో రకమైన ఫోబియా. చిన్నప్పుడు ఆమె అన్న యుద్ధంలో విమాన ప్రమాదంలో మరణించాడు. ఆ యాక్సిడెంట్ ఆమె మీద విపరీతమైన పరిణామాన్ని చూపించింది. మొదటిసారి మేమిద్దరం విమాన మెక్కినప్పుడు ఆమె అంతులేని సంఘర్షణకు లోనైంది. తర్వాత కూడా ఓసారి అలాగే జరిగితే ఇక ఆ ప్రయత్నానికి స్వస్తి చెప్పాం. డాక్టర్లు కూడా వద్దన్నారు."

"ఆన్‌ఫార్చునేట్. మరి పాపం ఆవిడకు బోర్ కొట్టదూ ఒంటరిగా ఉండాలంటే."

"వెల్. అది తప్పనిసరి, కానీ నేను ఇండియాలో ఉన్నంతకాలం మేమిద్దరం కలసే ఉంటాంకదా" అన్నాడు చక్రవర్తి.

సంవత్సరంలో ఎన్ని రోజులు మీ రిండియాలో ఉంటారు అని వాళ్ళడగలేదు. "థాంక్ గాడ్" అనుకున్నాడతను. తర్వాత సంభాషణ ఎన్నో విషయాల్ని చుట్టి హెలెనా మీదకు వచ్చి ఆగింది.

" షీ ఈజ్ మై ఎస్సెట్, నా బిజినెస్‌లో నాకు తెలీని విషయాలు కూడా కొన్ని ఆమెకు తెలుసు. ఆమె ఇక్కడ నా ఆఫీస్ వ్యవహారాలు చూస్తుండబట్టే నేను నిశ్చింతగా వుండగలుగుతున్నాను, అన్నాడను గర్వంగా వాళ్ళవైపు చూస్తూ.

అది పొగడ్తకాకపోయినా, హెలెనా సిగ్గుపడింది.

"అయితే మీరిక్కడ లేనప్పుడు, ఏమైనా అవసరమైతే కాంటాక్ట్ చేస్తాం."

"ష్యూర్, కొన్నికొన్ని డెసిషన్స్ తీసుకునే అధికారం కూడా ఆమె కుంది. ఆమె మాట ఇస్తే నేనిచ్చినట్టే" అన్నాడు చక్రవర్తి ఆమె గ్లాస్‌లో మరి కొంచెం వైన్ పోస్తూ

"థ్యాంక్స్." అందామె చిన్నగా.

డిన్నర్ సర్వ్ చేయబడింది. పెకింగ్ డక్ స్పెషల్ ఆ రోజు. పిజయన్ సూప్. హాకియన్ ప్రాన్, ఫ్రైడ్ ఈల్స్ టేబుల్‌మీద చూస్తేనే నోరూరించేట్టు ఆరేంజ్ చెయ్యబడ్డాయి.

మౌనంగా డిన్నర్ పూర్తిచేశారు.

గెస్ట్స్‌కు వీడ్కోలుచెప్పి లాంజ్‌లో నిలబడ్డారు హెలెనా. చక్రవర్తీ.

"మేడమ్‌కు ఫోన్ చేశారా?"

"బుక్ చేశాను. ఏ నిమిషంలోనైనా రావచ్చు" అన్నాడతను సిగరెట్ వెలిగించుకుంటూ.

"చొరవ తీసుకుంటున్నానని మీరనుకోకపోతే ఓ మాట చెప్పనా" అందామె.

"ఏమిటది" అన్నాడతను కొంచెం ఆశ్చర్యంగా.

"ఏ స్త్రీకైనా కామన్‌గా కావలసింది ఒకటే. తనను అర్థం చేసుకునే భర్త. ఐశ్వర్యాలూ, అంతస్తులూ కాదు. అవి కేవలం జీవితానికి మెరుగుపెట్టే పై పూతలు మాత్రమే. వెళ్ళొస్తాను. గుడ్‌నైట్."

"వాట్ డూ యూ మీన్" ఆమె చెయ్యిపట్టుకుని ఆపాడతను.

మెల్లగా వదిలించుకుని అందామె, ఓ క్షణం అతని కళ్ళలోకి చూసి.

"మీరు చిన్నపిల్లలు కాదు అర్థం చేసుకోలేకపోడానికి."

కారు డోర్ తెరిచి పట్టుకున్నాడతను. అది అతని ప్రత్యేకత. తనకింద పనిచేసే వాళ్ళనుకూడా వీఐపీల్లా ట్రీట్ చేస్తాడు. ఆమె స్టీరింగ్ ముందు కూర్చుంది.

"పరాయి ఆడదైన నాకు ఇంత మర్యాద ఇచ్చేవారికి స్వంత పెళ్ళాం పట్ల తన బాధ్యత ఏమిటో ఇతరులు చెప్పాలా... ఒకే... గుడ్ నైట్."

ఆమె తెల్లని చిన్న రెనాల్ట్ కారు మెల్లగా కదిలింది. ఓ నిమిషం పాటు అక్కడే నిలబడ్డాడతను.

గదిలోకి వచ్చి బ్లాంకెట్ కప్పుకుని సిగరెట్ వెలిగిస్తే భరించలేని ఒంటరితనం అనిపించింది. తన చుట్టూ సంపద. తన కాళ్ళకింద ప్రపంచం. తన కోసం. కేవలం తన కోసమే యెదురుచూసే శాంతి. ఎంత గర్వపడాల్సిన విషయం? అయినా ఏదో తపన. నిర్వచించలేని అసంతృప్తి. మనిషి మొదటి వూపిరి దగ్గర్నుంచీ చితిమంటల

వరకూ వూపిరంత సహజమైన అసంతృప్తి. ఊపిరికూడా పీల్చుకో నివ్వనంత అసంతృప్తి. కారణం... తన బలహీనత. శాంతి తన సర్వస్వం. నో డౌట్. ఆమె కోసం ఏం చెయ్యడానికైనా వెనకాడడు. కానీ, ఎందుకిలా ఆమె అభీష్టానికి వ్యతిరేకంగా వ్యాపారం పేరుతో ప్రపంచమంతా తిరుగుతున్నాడు: ఎందుకని ఈ వ్యసనాన్ని జయించలేకపోతున్నాడు. ఫలానా బిజినెస్‌లో లాభాలు వస్తాయని తెలిస్తే ఈ లోకంలో యింకెవరూ శాంతితో సహా గుర్తు రాకుండా పోతారేం? ఏదోశక్తి తనను బలవంతాన అటు లాగేస్తుందెందుకని: ఆ ఆకర్షణను తమ ప్రతిఘటించలేకపోతా డెందుకని:

గెలుపులో ఆనందం వుంది. ఉత్సాహం ఉంది. థ్రిల్ ఉంది. ఓ బిజినెస్ డీల్‌లో లక్షల లాభం సంపాదిస్తే ఆ విజయం వల్ల కలిగే ఆనందం అనిర్వచనీయం. ఆ ఆనందం కోసం మనిషి దేన్నైనాసరే త్యాగం చెయ్యడానికి వెనకాడడు. పెళ్ళాం, బిడ్డలనైనా సరే.

అతనికి తనెప్పుడో చదివిన రస్కిన్ వ్యాసాల్లో ఓ వాక్యం గుర్తొచ్చింది. “ఏర్నింగ్ మనీ ఈజ్ గేమ్” అన్న ఆ వాక్యం “ది క్రౌన్ ఆఫ్ వైల్డ్ ఆలివ్” లోనిది. డబ్బు ఇచ్చే సౌఖ్యలమీద తన మక్కువ తీరిపోతోంది. అయినా, అదిచ్చే గెలుపు, గుర్తింపు, అధికారం ఇంకా ఇంకా తనక్కావాలి.

శాంతికి తనేమీ అన్యాయం చేయడం లేదు. తనని తప్పించి మరో స్త్రీని ఎరగము. ఆమె లేదు. తన శరీరం. అంతరంగంలో శాంతిని గుండెల్లో తనకున్న బలమైన స్థానం తనకెంతో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది నిజంగా. పూర్ శాంతి... ఐ మస్ట్ డివోట్ మచ్ టైం ఫర్ హర్... అనుకున్నాడు.

అతనికో సంఘటన గుర్తొచ్చింది. లండన్ నుంచి స్టేట్స్ బయల్దేరాడారోజు. అప్పటికి రెండు నెలల పది రోజులయింది శాంతిని చూసి. స్టీల్ కార్పొరేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ మర్నాడు న్యూయార్క్‌లో, తీరా ఎయిర్‌పోర్ట్‌కు వచ్చేసరికి ఆలోచనలు మారిపోయాయి. తప్పనిసరిగా అటెండ్ అనాల్సినంత ముఖ్యమైన మీటింగ్ కాదది, బాంబేవెళ్తే శాంతికి సడెన్ సర్‌ప్రైజ్ ఇవ్వొచ్చు. ఆ కళ్ళల్లో తనను చూడగానే వెలిగే వెయ్యి దీపాల కాంతిలో ఈ చికాకులన్నీ మర్చిపోవచ్చు. ఎస్. ప్రస్తుతం నాక్కావలసింది శాంతి... మనశ్శాంతి. అనుకుని వెంటనే ప్రయాణం మార్చుకున్నాడు.

శాంతాక్రజ్ నుంచి బయట పడేసరికి రాత్రి పదిన్నర. టాక్సీలో ఇంటికి చేరేసరికి పదకొండున్నర. సాధారణంగా అతను రావడానికి ముందు రెండు రోజుల నుంచీ పనివాళ్ళతో సహా అందరూ వెయ్యికళ్ళు పెట్టుకుని ఎదురు చూస్తుంటారు. అలాంటిది అతనంత సడెన్‌గా వచ్చేసరికి అందరికీ మతులుపోయాయి.

“ఉష్... గొడవ చెయ్యకుండా పోయి పడుకోండి” అని మెల్లిగా పిల్లిలా అడుగులు

వేసుకుంటూ బెడ్‌రూంచేరుకున్నాడు. పాలమీగడల్లాంటి తెల్లని దుప్పటి పరిచిన రివాల్వింగ్ డబుల్‌కాట్‌మీద అటువైపు తిరిగి పడుకునివుంది శాంతి. చప్పుడు కాకుండా ఆమె మీదకు వంగి చూశాడతను కనురెప్పలు ఆపలేని కన్నీటి ప్రవాహాలు కిందకు జారితడిపిన తలగడ. చివుక్కుమంది అతని మనసు.

"అన్నీ వుండీ యేమీ లేని నిరుపేదను నేను."

అనే ఆమె మాటలు గుర్తొచ్చి అతని గుండెలు పిండినట్లయింది. ఇంకొంచెం ముందుకు వంగి ఆమె పెదవులపై సున్నితంగా ముద్దుపెట్టుకున్నాడతను. అప్పుడు తెరుచుకున్న ఆ కళ్ళలోని భావాల్ని నిర్వచించడానికి ఏ మహా రచయితకు శక్తి చాలుతుంది? ఆ ఆనందాశ్చర్యాలను వెలకట్టడానికి ఏ కొలమానాలున్నాయి: ఆ అనుభవాన్ని భరించడానికి యెంత పెద్ద గుండె అయితే నిండిపోకుండా వుంటుంది? ఆ పులకింత మళ్ళీ పొందాలంటే యెన్ని జన్మలెత్తాలి?

భారంగా కళ్ళు మూసుకున్నాడు చక్రవర్తి.

తను తలుచుకుంటే అటువంటి అనుభవాలను కొల్లలుగా పొందవచ్చు. శాంతికి శాంతిని ప్రసాదించవచ్చు. కానీ తనకది సాధ్యమయ్యే పనేనా?

మనిషి ఓ స్థాయికి వచ్చేవరకే అతనిమీద మనసుకు అధికారం వుంటుంది. ఆ తర్వాత అతని వ్యాపకాలు, వ్యసనాలైన బానిస.

*   *   *

సింగపూర్ ఎయిర్‌లైన్స్. డిసి 10 విమానం కౌగలించుకుంటున్న మబ్బుల్ని తాపీగా విడిపించుకుంటోంది. ఫస్ట్‌క్లాస్‌లో ఎక్కువమంది లేరు. చక్రవర్తికాక మరో ముగ్గురు జాపనీస్ వాళ్లూ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కాబోలు. తమ ముందు ప్రాజెక్ట్ రిపోర్ట్ లాంటిదేదో పెట్టుకుని కాగితాల మీద లెక్కలు వేసుకుంటూ. బీరు తాగుతూ వాళ్ళ బాషలో మాట్లాడుకుంటున్నారు.

మామూలుగా అయితేచక్రవర్తి మిగతా వారికి తనను పరిచయం చేసుకోవడం, వాళ్ళ విషయాలు తెలుసుకుకోవడం, పరస్పరం సంబంధించిన విషయాలైతే ఆఫర్లు, ప్రపోజల్స్ యివ్వడం లాంటివి చేస్తాడు. అతని అగ్రిమెంట్లు సగం ఫ్లైట్లలో ఫైనలైజ్ అయినవే. కానీ ఈ రోజు అతని మూడ్ బాగుండలేదు. పదేపదే శాంతి గుర్తొస్తోంది.

"ఏం తీసుకురమ్మంటారు సర్" వినయంగా అడిగింది ఎయిర్ హోస్టెస్.

"ఏం అక్కర్లేదు" అన్నాడతను.

"బయల్దేరిన దగ్గర్నుంచి మీరేం తీసుకోలేదు. ఎందుకలా వున్నారు... బావుండ లేదా వొంట్లో." అతని చెయ్యి పట్టుకుని టెంపరేచర్ చూడబోయిందామె.

"ఆయామ్ ఆల్‌రైట్. థాంక్స్" అన్నాడతను.

"మెనూ చూడండి. మష్రూం ఆమ్లెట్ చాలా బాగుంది ఈరోజు. టొమాటో గ్రిల్స్‌తో కలిపి తీసుకురానా:"

"చూడు బేబీ. నువ్వు నన్నేం యింప్రెస్ చెయ్యక్కర్లేదు. మీ ఎయిర్‌లైన్ చాలా మంచిదని నాకు తెలుసు. నా కిప్పుడు కావలసింది ఏకాంతం. ప్లీజ్ లీవ్‌మీ ఎలోన్."

విచిత్రంగా చూసిందామె అతనివైపు

"లేవండి అయితే. పక్క వేస్తాను. కాసేపు పడుకుందురుగాని" దిళ్ళూ, బ్లాంకెట్ తీసింది.

అతను పడుకున్న కాసేపటికి ఓ ఆస్పిరిన్. మంచినీళ్ళూ తెచ్చి "వేసుకోండి. తలనొప్పి వుంటే తగ్గిపోతుంది" అంది.

లైట్లు ఆప్ చేసి అతనిమీద బ్లాంకెట్ సరిగ్గా కప్పి వెళ్ళిపోయింది.

* * *

అతను కళ్ళు తెరిచేసరికి అంతా నిశ్శబ్దం. అతని ఉనికి అతన్నే భయపెట్టేంత నిశ్శబ్దం. ఒక్కసారిగా లేచి కూర్చున్నాడతను. పక్కకు చూశాడు. జాపనీస్ లేరు.

ఆమె మళ్ళీ వచ్చింది.

"ఎక్కడున్నాం మనం."

"జకార్తాలో లాండయి ఇరవై నిమిషాలైంది. ఇంకో పది నిమిషాల్లో టేకాఫ్."

"ఆస్పిరిన్ బాగా పనిచేసింది. ఐ ఫీల్ బెటర్ నౌ.... థాంక్స్" అన్నాడు.

"నా పేరు షీలా"

"గుడ్‌నేమ్... గుడ్ లుక్స్"

"మాది ట్రివేండ్రం..."

మళ్ళీ ఓసారి పరీక్షగా చూశాడామెను.

చెప్పకపోతే ఆమె కేరళ అమ్మాయని తెలుసుకోవడం కష్టం.

"సింగపూర్‌లో డ్యూటీ దిగిపోతున్నాను నేను" అంది.

"ఆహా!"

"మళ్ళీ ఎల్లుండి వరకూ పనిలేదు."

తలపంకించాడతను.

"ఏ హొటల్లో దిగుతున్నారు?" చెప్పాడు.

కాసేపు తటపటాయించిందామె. తానూహించిన ఆహ్వానం అతని దగ్గర్నుంచి రాకపోవడంతో.

"కాఫీ తీసుకురానా" అంది.

"కాఫీ కాదు. బ్లడీమేరీ చెయ్యగలవా నువ్వు."

"ఓ మీక్కూడా బ్లడీ మేరీ ఇష్టమా: ఐ లైకిట్ వెరీమచ్. ఒక్కక్షణం-ఇప్పుడే తెస్తాను" లోపలికి వెళ్ళిందామె కర్టెన్ తొలగించి.

"రేపంతా ఫ్రీ నేను" అందామె అలవోకగా గోళ్ళు చూసుకుంటూ.

డ్రింక్ సిప్ చేస్తూ తల ఊపాడతను విన్నానన్నట్టు.

అప్పటికర్థమైంది ఆ అమ్మాయికి తను ఇందాకటినుంచీ డయల్ చేస్తున్నది రాంగ్ నంబరని.

*　　*　　*

నాసిమ్ హిల్ ప్రాంతంలో కట్టిన ఓ పదిహేనంతస్థుల సెంచరీ పార్క్. షెరటన్. సింగపూర్‌లో కొత్తగా వెలసిన మరో ఆధునాతనమైన ఇంటర్నేషనల్ హోటల్. చాక్లెట్ రంగులో చూడముచ్చటగా వుండే ఆ హోటల్లో ఫైవ్ స్టార్ హోటల్స్ కుండవలసిన హంగులన్నీ ఓ మోతాదు ఎక్కువలోనే వున్నాయి. ప్రక్కరూంకీ మెత్తని ఎర్రని కార్పెట్లు, టెలిఫోన్, రేడియో, టీవీ, ఫ్రిజ్జ్, పైప్డ్ ఇన్‌మ్యూజిక్, 24 గంటలూ రూం సర్వీస్ బ్యూటీ సెలూన్లు, షాపింగ్ ఆర్కేడ్, స్విమ్మింగ్‌ఫూల్ ప్రతి లక్షరీ హోటల్లోనూ వున్నా. అవి అమర్చేతీరులో ఆ హోటల్ యాజమాన్యం అభిరుచీ. ఆసక్తీ కొట్టవచ్చినట్టు కనిపిస్తుంటాయి. జిమ్, టెన్నిస్, బాడ్మింటన్ కోర్టులూ, గోల్ఫ్‌కోర్సులూ అతిథులకు ప్రత్యేక ఆకర్షణలు,

చక్రవర్తి ఆ హోటల్లో దిగగానే ఇంటర్నేషనల్ ప్లాజాలో వున్న ఫ్రెండ్‌షిప్పింగ్ సర్వీసెస్‌కు ఫోన్‌చేశాడు. ఆ కంపెనీతో అతని లావాదేవీలు చాలా పురాతనమైనవి, షిప్పులు కొనడం, అమ్మడం రిజిస్ట్రేషన్ అన్నీ వాళ్ళద్వారానే చేస్తాడు. కిమ్ ఆండర్సన్ అనే ఇంగ్లీష్ వ్యక్తి దానికి మేనేజర్. అతనికి చక్రవర్తి అంటే చాలా యిష్టం. బిజినెస్‌లో నిజాయితీగా, ముక్కుసూటిగా పోయే చాలా అరుదైన వ్యక్తుల్లో చక్రవర్తి ఒకడు కావడం అందుకు కారణం.

అంతకు వారం రోజుల క్రితం ఆండర్సన్ ఫోన్‌చేసి బల్క్ కారియర్‌లకు డిమాండ్ పెరుగుతోందనీ, రో. రో. రీఫర్లను వీలైతే అమ్మేయడం మంచిదనీ, ఆ విషయాలు మాట్లాడడానికి రమ్మనీ చెప్పాడు.

చక్రవర్తి ఫోన్ చేసిన అరగంటకు వచ్చాడు ఆండర్సన్ వెంట మరో యిద్దరు బ్రిటిషర్స్‌తో, వాళ్ళదగ్గర 77 బిల్ట్ వెసల్స్ రెండున్నాయి. మేనేజ్‌మెంట్ ప్రాబ్లెమ్స్ వల్ల అమ్మేయానుకుంటున్నారు.

పరిచయాలయ్యాక కాఫీ తాగుతూ అన్నారు వాళ్లు.

"మా దగ్గరున్న ఈ రెండూ సిస్టర్ షిప్స్, ఒకటి లివర్‌పూల్‌లో వుంది. రెండోది అట్లాంటిక్‌లో వుంది. లివర్‌పూల్‌లో వున్నదాన్ని మీరు ఇన్స్‌పెక్ట్ చెయ్యవచ్చు:

ఇంజన్ వివరాలూ, టన్నేజ్, డ్రాఫ్ట్, ఆయిల్ కన్సంప్షన్, డిశ్చార్జింగ్ ఫెసిలిటీస్, హెూల్డ్స్, హేచెస్, క్యూబిక్ ఫీట్...

'నా వంటి బుద్ధిహీనులు కవితలు సృష్టిస్తారు. కానీ భగవంతుడు మాత్రమే పుష్ప, ఫల శోభితమైన వృక్షాల్ని సృష్టిస్తాడు.'

–జాయిన్ కిల్మెర్

అనంతమైన దారిద్ర్యం కానీ, అమితమైన సంపద కానీ హేతువాదాన్ని ఆలకించవు.

– ఫిర్డింగ్

స్పీడ్ వివరాలు చెప్పారు.

"ప్రైస్ ఐడియా ఎంత" అడిగాడు చక్రవర్తి.

"ముందు మీరు షిప్పును చూడండి, తర్వాత మాట్లాడదాం:

"ఇట్స్ ఓకే.... ఎప్రాక్సిమేటుగా చెప్పండి."

"త్రీపాయింట్ ఫైవ్ మిలియన్ యు ఎస్ డాలర్స్ ఈజ్"

"పేమెంట్స్ టరమ్స్?"

"టెన్ పర్సంట్ అగ్రిమెంట్లు సంతకాలు చేసేటప్పుడు మిగతాదానికి బ్యాంక్ గ్యారంటీ.... ఎన్ని నెలల్లో పే చేస్తారో మీరు చెప్పండి. వచ్చే నెల్లోనే మొత్తం పేచేసేస్తామంటే మేం కాదనంగదా".... నవ్వుతూ అన్నాడు వాళ్ళలో ఒకతను, చక్రవర్తి కూడా నవ్వాడు.

"మేము రేపు బయల్దేరి స్టాక్‌హెూమ్ వెళ్తున్నాం. మరో రెండు మూడు రోజుల్లో లండన్ తిరిగి వస్తాము, మీ ప్రయాణం గురించి తెలియజేసే అన్ని ఏర్పాట్లూ ముందుగా చేసుకోవచ్చు. ఏ సంగతీ రేపు చెప్పండి. హయత్‌లో ఉన్నాం మేము. రూం నెంబర్ ఫోర్ ఓ ఫైవ్."

ఆండర్సన్‌ను అక్కడ వదిలి వెళ్ళిపోయారు వాళ్ళు.

"నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు చక్రవర్తి.

"నేనింతకుముందు చూశాను, వాటిలో ఒకదాన్ని. చాలా మంచి మెయింటెనెన్స్. కెప్టెన్స్ వీళ్ళడబ్బు చాలా తినేశారుగానీ షిప్పులను మాత్రం చాలా బాగా చూసుకున్నారు. అదీగాకుండా మనకు యీ టన్నేజ్‌లో అంతకొత్తవెసల్స్ దొరకటం కష్టం. ప్రైస్ త్రీ మిలియన్‌కు తగ్గించేస్తారు, ఇఫ్ వుయార్ సీరియస్ ఎబౌట్ బైయింగ్ దెమ్. పేమెంట్ టరమ్స్ కూడా ఫేవర్‌బుల్‌గానే ఉన్నాయి కదా"

ఆస్ట్రేలియన్ వీట్ కార్పొరేషన్‌తో తాను సైన్ చేసిన కాంట్రాక్టు గురించి చెప్పాడు చక్రవర్తి.

"అయితే ఇక ఏమీ ఆలోచించకుండా తీసుకోవచ్చు. సంవత్సరన్నర వరకూ కార్గో కోసం వెతుక్కునే పనిలేదు కదా?"

"ఫైనాన్స్ కష్టమౌతుందేమో. రీఫర్‌నీ, రోరోలనూ అమ్మేద్దాం. బాగా పాతవైపోయాయి. తప్పదనుకుంటే స్క్రాప్‌కైనా వేసేద్దాం."

"చూద్దాం తొందరేముంది" అన్నాడు చక్రవర్తి.

"నోనో.... అసలు వీళ్లు రేపు స్వీడన్ ఎందుకు వెళ్తున్నారో తెలుసా: అక్కడ ఇంకో ఇంటరెస్టెడ్ పార్టీ వుంది. వెసల్స్‌ను చూస్తే వాటిని గురించి తెలిసినవాడెవడూ వదిలిపెట్టడు. నన్నడిగితే వాళ్ళను తిన్నగా లండన్ తీసుకెళ్ళి డీల్ ఫైనలైజ్ చేసుకోవడం ఉత్తమం."

రెండు నిముషాలు ఆలోచించాడు చక్రవర్తి.

"ఓకే... అయితే, నువ్వు కూడా రారాదూ నాతో."

"నేనా, ఇంపాసిబుల్. అసలు నా అవసరం ఏముంది. మీ కెప్టెన్‌లు ఇద్దరున్నారుగా అక్కడికి వాళ్ళను తీసుకెళ్ళండి. నేనిక్కడ మన ఓల్డ్ లేడీస్‌ను ఎవరికైనా ముడిపెట్టడం కుదుర్తుందేమో చూస్తాను."

"అయితే వాళ్ళకు ఫోన్‌చేసి చెప్పు, రేపు లండన్ రావడానికి సిద్ధంగా వుండమని, ఫ్లైట్స్ ఏమున్నాయో కనుక్కుని టికెట్ బుక్ చెయ్యి."

"అలాగే, ఈ డిల్ త్రూ అవగానే నాకు ఫోన్ చెయ్యండి" అన్నాడతను.

"ష్యూర్, థాంక్స్ ఏలాట్" మీ మిసెస్, పిల్లలూ బాగున్నారా" అడిగాడు చక్రవర్తి."

"యా: దే ఆరీ ఫైన్. థ్యాంక్స్ హౌ ఎటౌట్ మేడమ్?"

"షీ ఈజ్ ఆల్‌రైట్."

"ఓకే. బై ఫర్ నౌ."

"బై."

ఒళ్ళంతా నొప్పులుగా వున్నట్లనిపించింది. మసాజ్ చేయడానికి యెవరినైనా పంపమని రిసెప్షన్‌లో చెప్పి, శాంతికో కాల్ బుక్ చేశాడు. ఐదు నిమిషాల తర్వాత ఓ తైవానీ అమ్మాయి చిన్న కిట్ పెట్టుకుని గదిలోకి వచ్చింది. అతను బట్టలు విప్పి షార్ట్స్‌తో మంచంమీద బోర్లా పడుకున్నాడు.

తర్వాత పది నిమిషాలు ఆ అమ్మాయి అతని వీపునూ, భుజాలనూ, కాళ్ళనూ

మసాజ్ చేసింది ఆయిల్‌తో.

"ఇలా తిరగండి" అంది అతని నడుం కింద చెయ్యివేసి వెల్లకిలా తిప్పుతూ. తగలరాని చోట తగిలాయి ఆమె వేళ్ళు, క్షణంసేపు పరీక్షగా చూశాడామెను. కావాలని కృత్రిమంగా మత్తుగా చూసే కళ్ళూ, వంపు తిరిగిన పెదాలమధ్య బిగించిన ఇన్వైటింగ్ స్మైల్, ఆడవాళ్ళ అంతరార్థాన్ని అవసరమైన దాని కంటే ఎక్కువగానే స్పష్టీకరిస్తాయి.

మళ్ళీ ఇంకోసారి అదే చోట అనవసరంగా.

"ఇంకాసేపుంటే ఈ అమ్మాయి నన్ను మానభంగం చేసేస్తుంది" అనుకున్నాడు చక్రవర్తి నరాలను అదుపులో పెట్టుకుంటూ.

"పదండి స్నానం చేద్దురుగాని" అందా అమ్మాయి మర్దన ముగించి.

"నువ్వక్కర్లేదు. వెళ్ళు నేను చెయ్యగలను" అన్నాడతను ఆమెకు టిప్ ఇస్తూ.

విచిత్రంగా చూసిందా అమ్మాయి అతనివైపు. ఆ చూపుకు భాష్యం "నువ్వు నపుంసకుడివి" అని.

తర్వాత, గంటకు బాంబేలైన్ దొరింది కానీ శాంతి ఇంట్లో లేదు బయటికి వెళ్ళింది. డిజప్పాయింటయ్యాడను. స్నానం చేసి బట్టలు వేసుకుని బయల్దేరాడు.

ప్రపంచంలో అన్నిటికన్నా క్లీన్‌సిటీగా పేరుపొందిన సింగపూర్, షాపింగ్‌కు ప్రసిద్ధిచెందిన నగరం ఎన్నో డ్యూటీ ఫ్రీషాప్స్. వెస్టర్న్ కంట్రీస్‌లో తయారయ్యేవీ, ఓరియంట్‌లో దొరికేవీ ఆయా దేశాల్లోకన్నా తక్కువ ధరలకు లభిస్తాయి సింగపూర్‌లో. రకరకాల కెమేరాలు, వాచీలు, స్టీరియో సిస్టమ్స్, ఎలెక్ట్రికల్ వస్తువులు, కాస్మెటిక్స్, విస్కీలేకాకుండా లండన్, పారిస్, రోమ్‌లలో మొదలయ్యే సరికొత్త ఫ్యాషన్లన్నీ మర్నాడు ఇక్కడ చూడొచ్చు.

ఒక్కో డిపార్ట్‌మెంట్ స్టోర్ మూడేసి ఫ్లోర్లు ఆక్రమించుకుని వుంటుంది. షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్పెషాల్టీ షాపులూ గజాని కొకటి చొప్పున తగులుతుంటాయి. చైనీస్, పోర్సిలీన్, ఉడ్‌క్రాఫ్ట్స్, చీరలు ప్రదర్శించే పెద్దపెద్ద ఎంపోరియంలన్నీ ఆర్చేడ్ రోడ్‌చుట్టూ ప్రక్కల వుంటాయి. షాపింగ్ చేసేవాళ్ళు ఒక చోటనుంచి మరో చోటికి వెళ్ళడానికి ఆట్టే శ్రమపడనక్కర్లేకుండా.

ఇవి కాకుండా తీప్స్ మార్కెట్, చైనా టౌన్‌లలో సెకండ్‌హేండ్ వస్తువులు విరివిగా దొరుకుతాయి. కొంచెం చీకటిగా, ఇరుగ్గావుండే ఆ సందుల్లో షాపింగ్‌కు వెళ్ళాలంటే మొట్టమొదటిసారి కొద్దిగా బెరుకనిపిస్తుంది.

సింగపూర్‌లో యింకోవిచిత్రం యేమిటంటే ఒక వస్తువు ధర వందడాలర్లు చెప్పి బేరమాడితే యాభై డాలర్ల కిచ్చేసారు. ఏ వస్తువుకూ ఫిక్సెడ్ ప్రైస్ వుండదు గోడలమీదతప్ప.

కష్టమర్ అమాయకత్వమే ఏ వ్యాపారస్తుడికైనా పెట్టుబడి.

టాంగ్లిన్ రోడ్‌లో వున్న సింగపూర్ హాండీక్రాఫ్ట్ సెంటర్ దంతపు బొమ్మల నుంచీ మంచి ముత్యాలు, పచ్చలు, కెంపులు అతి ప్రాచీనమైన పోర్సిలీన్ వస్తువులు, పెయింటింగ్స్, బాతిక్, పర్షియన్ కార్పెట్లు, వెండిసెట్లు, వివిధ జంతువుల చర్మాలతో చేసిన పర్సులు, కోట్లు మొదలైన వాటితో ఓ మ్యూజియంలా అనిపిస్తుంది. ప్రపంచంలో ఎన్నికళలైతే వున్నాయో, అన్నిట్లోనూ నిష్ణాతులై వారి నిపుణత అక్కడ కనిపిస్తుంటుది. ప్రాచీన వస్తువులు సేకరించేవారికి అది ఓ స్వర్గం, ఆ షాప్‌లో శాంతి కోసం ఓ పట్టుచీర, రెండు ఏనుగుల దంతపు బొమ్మలు తీసుకున్నాడతను.

చైనా టౌన్ ప్రాంతంలో ఉన్న ఓ చిన్న ఓపెన్ ఎయిర్ రెస్టారెంట్ అంటే చక్రవర్తికి చాలా ఇష్టం. పేరుకూడా లేని దాన్ని డిక్ నే, ఆరవయ్యేళ్ళ వృద్ధుడు, అతని భార్య నడుపుతుంటారు. అక్కడ దొరికే చైనీస్, మలయ్, ఇండియన్, డిషెస్ ఏ వెస్టర్న్ రెస్టారెంట్‌లోనూ దొరకవు. థాయ్ లాబ్‌స్టర్. హైపన్ చికెన్ రైస్. జాపనీస్ సుకియాకీ అతను తయారు చేసినట్టు ఇంకెవరూ చేయలేరని ప్రతీతి.

చిన్న కొయ్య కుర్చీలో కూర్చుని విరిగిపోవడానికి సిద్ధంగా వున్నట్టుండే పాత టేబిల్‌మీద కిరోసిన్ బుడ్డి దీపం వెలుగులో పక్కనే ట్రాఫిక్ సంగీతం పాడుతుంటే త్రిషా (రిక్షాలాంటిది)లు తొక్కేవాళ్ళ అరుపులతో ఎప్పుడూ కోలాహలంగా వుండే ఆ వాతావరణంలో డిక్, అతని భార్య ప్రేమగా కబుర్లు చెబుతూ యోగక్షేమాలు విచారిస్తుంటే, భోంచెయ్యడం అతని కిష్టమైన అనుభవాల్లో ఒకటి. పెద్దపెద్ద హొటల్స్‌లో హిపోక్రసీ, ఫార్మాలిటీస్‌తో, విసుగెత్తిపోయే అతనికి ఆ చిన్న రెస్టారెంట్ పెద్దరిలీఫ్.

రాత్రి పదకొండింటికి రూంకు చేరుకున్నాడతను.

* * *

బ్రిటిష్ ఎయిర్‌వేస్ కాంకార్డ్ విమానం మనుష్యుల చూపులకేకాదు. ఊహలకే అందనంత ఎత్తులో మామూలు విమానాల కన్నా రెట్టింపు వేగంగా ఎగురుతోంది, వాళ్ళు ఎడ్వర్టయిజ్ చేసుకుంటున్నట్లు, అది నిజంగానే మరో ప్రపంచం. కొన్ని ప్రత్యేకమైన రూట్లలో మిత్రమే మిగతా ప్లేన్స్ తీసుకునే టైంలో సగం కన్నా తక్కువ సమయంలో ప్యాసింజర్స్‌ను నిర్ణీత గమ్యాలకు చేర్చే ఆ తెల్లని ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఆకాశంలో ఐరావతంగా అభివర్ణిస్తారు. కేవలం బిజినెస్‌మెన్‌కే అందుబాటులో వుండే ఆ విమానానికి ఎయిర్‌పోర్ట్‌లలో ప్రత్యేకమైన కస్టమ్స్ క్లియరెన్స్ కౌంటర్లుంటాయి. ప్యాసింజర్స్‌కు టైం సేవ్ చేయడానికి.

పేకాడుతున్నారు చక్రవర్తి. అతనితో పాటు ప్రయాణిస్తున్న లండన్ పార్టీలిద్దరూ

కావాలనుకున్నప్పుడు డ్రింక్స్, అడక్కుండానే అవసరాలు కనుక్కునే ఎయిర్ హోస్టెస్‌లు.

గ్రేసూట్‌లో వున్న ఓ అమెరికన్ వాళ్ళ దగ్గరకు వచ్చాడు.

"మే ఐ జాయిన్ యూ?"

"మోస్ట్‌వెల్‌కం" అన్నారు చక్రవర్తి. పరిచయాలయ్యాయి. అతను డెట్రాయిట్‌లోని ఓ పెద్ద కార్లతయారీ కంపెనీకి చీఫ్ ఎగ్జిక్యూటివ్. పేరు నార్త్ బ్లాక్.

"ఇఫ్ ఐ యామ్ నాట్ మిస్టేకెన్. మిమ్మల్నిదివరకెక్కడో చూశాను" అన్నాడతను.

తేరిపార చూశాడు చక్రవర్తి. ఒకసారి చూసే మనుషుల్ని మర్చిపోడతను. ఇక నెవరో తెలిసిన వ్యక్తిలాగే వున్నాడు కానీ, ఎక్కడ కలిశారో గుర్తురావడం లేదు.ఐదు నిమిషాలు మౌనంగా గడిచాయి.

"ఐ గాటిట్" చిన్నగా చిటికె వేస్తూ అన్నాడతను. "సెనెటర్ కాలిన్స్ ఇంట్లో పార్టీకి. వాషింగ్టన్‌లో. యామైరైట్."

"ఎక్జాక్ట్లీ. ఈ మధ్య నాకు కొంచెం మతిమరుపు పెరుగుతోంది. ఏమనుకోకండి. బావున్నారా! ఆ రోజు నాకు హోటల్ దాకా లిఫ్ట్ యిచ్చిందికూడా మీరే కదూ?"

"అవునవును. మీరెలా వున్నారు. స్టీల్స్ యెలా వున్నాయి. కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ బాగా నడుస్తోందా?"

"యా... యా... దే ఆర్ ఫెయిర్లీ గుడ్."

కాసేపు అయిన తర్వాత మాటల సందర్భంలో అన్నాడతను.

"మీరు మా ఫర్మ్‌లో షేర్స్ యెందుకుతీసుకోకూడదు?"

ఆసక్తిగా ముందుకు జరిగారు ముగ్గురూ.

"ఐవిల్ షో యూ ద ఫిగర్స్." అంటూ చేతిలోని పేకముక్కలు కిందపడేసి తన సీట్ దగ్గరకు వెళ్ళి శాంసనైట్ ఎటాచీ పట్టుకొచ్చాడతను. ఆ తర్వాత ఓ గంటసేపు ఆ కంపెనీ పుట్టుపూర్వోత్తరాలూ. షేర్ కాపిటల్, బ్యాంకర్స్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, వివిధ దేశాల్లో వాళ్ళ కార్లకున్న సేల్స్, షుమారుగా వచ్చే ప్రాఫిట్స్ అన్నీ సోదాహరణంగా వివరించి వాటికి సంబంధించిన కాగితాల కాపీలు చక్రవర్తికిచ్చాడతను.

ఆ కంపెనీలో చక్రవర్తి చేరడంవల్ల అతనికి కలిగే బెనిఫిట్స్, టాక్స్ విషయాలూ అగ్రిమెంట్ టరమ్స్ అన్నీ చర్చించుకున్నారు.

"క్వైట్ ఇంటరెస్టింగ్" అన్నాడు చక్రవర్తి.

మీరు స్టేట్స్ వస్తే మా జనరల్ మేనేజర్‌ను మీటవుద్దాం. అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేస్తాను."

"అలాగే. మా ఆడిటర్స్‌ను కూడా కన్సల్ట్‌చేసి మీకీసంగతి వెన్సడే చెబుతాను."

"ఫెయిర్ ఎనఫ్" అన్నాడు నార్త్ బ్లాక్.

ఇద్దరూ విజిటింగ్ కార్డ్సు మార్చుకున్నారు.

* * *

అది ఓ గ్రీటింగ్ కార్డు. దాంట్లో "నువ్వు సూర్యుడివి, నేను పొద్దు తిరుగుడు పువ్వును. లవ్ శాంతి" అని వ్రాసిఉంది. బాగా మాసిపోయి చిరిగిపోవడానికి సిద్ధంగా వున్న ఆ గ్రీటింగ్ శాంతి, చక్రవర్తి కాలేజీలో చదువుకునేటప్పుడు అతని బర్త్‌డేకి పంపించింది. ఎప్పుడూ అతని బ్రీఫ్‌కేస్‌లో వుంటుంది. ఈ సారి మర్చిపోయాడు. కాబోలు, బెడ్‌రూంలో దొరికింది.

సరికొత్త ప్రేమ, యువత ఎదురుచూస్తే ఓ తప్పనిసరి అనుభవం, జంట కోసం తహతహలాడే యవ్వనం లోకంలో తమ ప్రేమంత నిర్మలమైన, గాఢమైన ప్రేమ మరొకటి లేదని గుడ్డిగా నమ్మే మనసులు. చూసే పదిమందీ ఏమనుకుంటారోననే వెరపును కూడా పక్కకునెట్టి, స్వేచ్ఛగా తిరగాలని శాసించే వయసు. కెరటాల్లా ఎగిరిపడే కోరికలు. ఎదుటివ్యక్తి చూపు, స్పర్శ, మాట, ఊహ, అత్యంత మధురంగా అనిపించే ఓ ఇంద్రజాలం. తప్పించుకునే ప్రయత్నం కూడా చెయ్యజాలని రంగుల వల.

అప్యాయంగా ఆ గ్రీటింగ్‌ను తడుముతూ ఉండిపోయిన వేళ్ళు కాసేపటి తర్వాత పెదాలను సున్నితంగా తాకాయి. ఆ గ్రీటింగ్ అందుకుంటూనే తనను ఒక్కసారి చుట్టేసి అతను పెట్టిన తొలిముద్దు ఇంకా అక్కడ సజీవంగానే వున్నట్టుంది.

వయసు మనిషికే గాని అనుభవాకు లేదు.

నిట్టూర్చిందామె,

"అమ్మగారూ. మీ కోసం ఫోన్, కస్తూరిగారట."

"ఎవరు... కస్తూరి... తన కస్తూరికాదు గదా... ఇంకే కస్తూరి తెలుసు తనకు!" అదురుతున్న గుండెలతో రిసీవర్ అందుకుంది.

"శాంతీ. బాగున్నావా" యుగాల తర్వాత విన్నా గుర్తుపట్టగల గొంతు.

"కస్తూరీ... ఏమే... ఇది నిజమా... ఇన్నాళ్ళకు గుర్తొచ్చానా. ఎక్కడున్నావ్. ఏం చేస్తున్నావ్"

అప్రయత్నంగా గొంతు రుద్ధమైపోతోందామెకు.

"ప్రస్తుతం బాంద్రాలో, మొన్న డెల్హీలో. ఇంకా అంతకుమునుపూ, పది రోజుల తర్వాత సిడ్నీతో.

"నువ్వు మరోమాట మాట్లాడకుండా నీ అడ్రస్ నాకివ్వు. డ్రైవర్‌ని పంపిస్తున్నాను. వెంటనే వచ్చేయ్."

"ఓ.కే. పంపించు." అడ్రసిచ్చి ఫోన్ పెట్టేసింది కస్తూరి.

చాలా రోజుల తర్వాత శాంతి మనసు మళ్ళీ ఏవో ఆనంద లోకాల్లోకి తేలిపోతున్నట్లనిపించసాగింది. కస్తూరి... అవును పేరులానే ఆమె స్నేహం కూడా యెంతో పరిమళభరితం. స్కూళ్లో, కాలేజీల్లో యెప్పుడూ తన చెయ్యి పట్టుకుని విడవకుండా వెంటతిప్పుకున్న కస్తూరి క్లాసుల్లో, సినిమాల్లో, తనను ఆనుకుని కూర్చోకపోతే పిచ్చెక్కిపోయే అయిదున్నర అడుగుల అజంతా శిల్పం.

"నా ప్రేమ నీ వొక్కదానికే అంకితం. నా స్నేహం నీ వరకే పరిమితం. నా అభిమానం, నా అనురాగం అన్నీ నీ ఒక్కదానికే. ఈ పితృస్వామ్య సామాజిక వ్యవస్థలో మొగుడనేవాడు ఆడదాని మొదటి విరోధి. కాబట్టి మనం పెళ్ళిళ్లు చేసుకోవద్దు. ఇలాగే వుండిపోదాం" అంటుండే కస్తూరి, పరీక్షల్లో జ్వరపడితే వారంరోజులపాటు నిద్రాహారాలు మాని, తన పక్కనే కూర్చుని తనకన్నా నీరసపడిపోయిన ఆనాటి కాలేజీ బ్యూటీ. వాళ్ళ నాన్నగారికి అర్థాంతరంగా ట్రాన్స్‌ఫర్ కావడంతో పీయూసీ పరీక్షలయ్యాక డెల్హీ వెళ్ళిపోయి తనను మర్చిపోయిన కృతఘ్నురాలు. వెళ్ళిన కొద్ది రోజుల వరకూ రోజుకు రెండు ఉత్తరాలు వ్రాసి ఆఖరికి ఎవరో బాయ్ ఫ్రెండ్ పరిచయంతో క్రమంగా తనను పక్కకు నెట్టేసిన కస్తూరి, తన ఆలోచనల్లో ఇన్నేళ్ళూ సజీవంగా నిలిచిన తన కస్తూరి.

"రానీ దీని పని చెబుతాను" నాలుగోసారి తనకు తనే చెప్పుకుంది శాంతి.

బయట కారు ఆగిన చప్పుడు. డ్రైవర్ డోర్ తెరిచి పట్టుకుంటే మెల్లగా దిగుతున్న కస్తూరి. చూస్తున్న శాంతి మ్రాన్పడిపోయింది. అమాంతం వెళ్ళి కౌగలించుకోవాలన్న ఆత్రుతతో బయటకు వచ్చిన ఆమె ఆ క్షణంలో ఆసరా కోసం గుమ్మం పట్టుకోవలసినంత బలహీనపడిపోయి, నిలదొక్కుకోలేక కస్తూరిమీద వాలి,

"ఏమిటే ఇదీ" అని చిన్నపిల్లలా ఏడుస్తుంటే.

"ఏమిటీ, ఏమైందినీకు, ఇంకా అంతే సెన్సిటివ్‌గా ఉన్నావా, నో... నో... కమాన్. హోల్డ్ యువర్‌సెల్ఫ్" అంది కస్తూరి శాంతి వీపు నిమురుతూ.

"అసలు ఎలా జరిగిందిదీ" వెక్కుతూ అడిగింది శాంతి.

బొట్టు లేకపోయినా, పూలు పెట్టుకోలేకపోయినా, కస్తూరి మునుపటికన్నా అందంగానే వుంది. కొంచెం ఒళ్లు చేసింది.

"వెల్. జీవితం అనేక అనుభవాల మిశ్రమం. కష్టాల్నీసుఖాల్నీ తట్టుకుంటూ సాగిపోతేనే మనిషి జన్మసార్థకం. ఎడ్జస్టుమెంట్ బ్రతుక్కి ప్రధమ సూత్రం" అంది కస్తూరి.

"అసలెలా జరిగిందంటుంటే."

"కారుయాక్సిడెంటయింది. ఇన్‌స్టాంటేనియస్ డెత్."

"అతనేనా... మీ బాయ్ ఫ్రెండేనా?"

"ఆవును' అంటున్నపుడామె గొంతు వణికి, కళ్లు తడిశాయి.

"ఎప్పుడు?"

"డెబ్భైరెండులో. పెళ్లయిన మూడేళ్ళకు."

"పిల్లలా"

తల అడ్డంగా ఊపింది కస్తూరి. "వాయిదా వేసుకున్నాం. విధిదాన్ని శాశ్వతం చేసింది."

"మరి నువ్వు మళ్ళీ...?"

"వాట్ ఫర్! మళ్ళా దేనికోసం? అనుభవించిన ఆనందం చాలు జీవితాంతం నెమరుసుకోవడానికి. ఒకరికి అంకితమైన జీవితాలు మరొకరికి పునరంకితం చెయ్యలేం. నువ్వు ఇంకో వ్యక్తిని ఊహించగలవా, మీ వార్ని మినహాయించి?"

ఆ ఆలోచనే కష్టంగా తోచింది శాంతికి. మాట్లాడలేదు కాస్సేపు. లాన్‌లో నడుస్తున్నారిద్దరూ. అతనితో తన పరిచయం. పెద్దవాళ్ళ అంగీకారం, పెళ్ళి, ఆస్ట్రేలియాలో ఇద్దరికీ ఉద్యోగాలు రావడం, అతని మరణం. తనుమాత్రం ఇంకా అక్కడే వుండిపోవడం అన్నీ చెప్పింది కస్తూరి.

"నువ్వొక్కదానివే ఎందుకక్కడ వచ్చెయ్యయ్యరాదూ?

"అవసరమేముంది. నాకక్కడ బాగానే ఉంది. నా అనే వాళ్ళెవరూ ఇండియాలో మిగల్లేదు. ఎట్‌లీస్ట్ నేను కావాలీ అనుకునే స్టాఫ్, సంతృప్తినిచ్చే ఉద్యోగం మానాన నన్ను బ్రతకనిచ్చే సమాజం అన్నీ వున్నా యక్కడ. ఇక్కడేముంది?"

"మీ అమ్మా, నాన్న...."

"సంవత్సరం తేడాతో పోయారు. చాలా రోజులైంది."

విధి తన జీవితంతో ఆడుకున్న ఆటను మళ్ళీ ఓసారి గుర్తుకు తెచ్చుకుంటున్నట్టు కాసేపు మౌనంగా వుండిపోయింది కస్తూరి.

"మీ వారేంచేస్తుంటారు. లేరా యింట్లో."

ఆ ప్రశ్నకు సరిగ్గా సరిపోయే జవాబు లేదు శాంతి దగ్గర రెడీగా,

"ఉండు. ఫోటో పట్టుకొస్తాను." లోపలికివెళ్ళి వారిద్దరూ వున్న గోల్డెన్ ఫోటో ఫ్రేం పట్టుకొచ్చింది.

"హాయ్ కుర్రవాడు అందగాడేనే?"

శాంతి బుగ్గలు ఎర్రబడ్డాయి.

"నువ్వు వెళ్ళిపోయిన తర్వాత కాలేజీలో జాయిన్ అయ్యారాయన" అంటూ శాంతి తన కథ మొదలుపెట్టి ముగించేసరికి టైం రాత్రి తొమ్మిదయింది.

"అమ్మగారూ డిన్నర్ ఈజ్ సర్వ్‌డ్."

"వస్తున్నాం" లేచింది శాంతి కస్తూరికి చెయ్యి అందిస్తూ.

"ఏం పనిమీద వచ్చావే ఇండియాకి" అడిగింది శాంతి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటూ. చెరువంత విశాలంగా ఉన్న ఆ పెద్ద సన్‌గ్లాస్ టేబుల్‌నూ, పైన వేళ్ళాడే గాజూదీపాలనూ, వెండిగ్లాసులూ, పళ్ళాలనూ, వెనక చీకట్లో చేతులు కట్టుకునిలబడ్డ పని మనుషుల్నీ, కాలికింద పరుపులా మెత్తగా తగిలే కార్పెట్‌నీ, ఆ ఇంటినీ చూసి, క్షణంలో చక్రవర్తిని అంచనా వేసింది కస్తూరి.

"ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ వాళ్ళ కాన్ఫరెన్స్ ఒకటి కాల్‌ఫర్ చేశారు. ఆస్ట్రేలియన్ ఎబొరిజన్స్ మీద పేపర్ చదవడానికి వచ్చాను. అదీగాకుండా నాకు కొంచెం మార్పు కావాలనిపించింది. అందుకే ఓ నాలుగైదు రోజులు సౌతిండియా టూర్ కూడా వేసొద్దామని బయల్దేరాను. పొద్దునే వచ్చాను బాంబే."

"మరి నా అడ్రెస్ ఎవరిచ్చారు నీకు."

"మనసుంటే మార్గమే ఉండదా? డెల్హీ కాన్ఫరెన్స్‌లో మన కాలేజీమేట్ నారాయణ కలిశాడు. మొన్నఎప్పుడో మీ వారు కనబడితే ఫోన్ నెంబర్ తీసుకున్నాడట." భోజనం ముగిసింది. ఇద్దరూ బెడ్‌రూంలోకి వచ్చారు.

"ఎలాగడుపుతున్నావే రోజులు. బోర్ కొట్టడంలేదూ" ఆపిల్‌ను ముక్కలుగా కోస్తో అడిగింది శాంతి.

"ఎప్పుడో తప్ప సాధారణంగా టీచింగ్, రీసెర్చ్, ఫీల్డ్‌ట్రిప్స్ వీటితోనే సరిపోతుంది."

ఐదు నిమిషాలు మౌనంలో ఐక్యమయ్యాయి. వాతావరణం గంభీరతను, స్తబ్దతను సంతరించుకుంటోంది. శాంతి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అడిగింది కస్తూరి.

"ఏమిటీ... ఇంకా ప్రివెంటివ్స్‌వాడటం మానలేదా?"

"ఎప్పుడో మానేశాను. కాని పిల్లలు కావాలంటే ముందు మొగుడూ, తర్వాత దేవుడూ కనికరించాలిగదా."

మళ్ళీ కాసేపు మౌనం.

"నా కప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది. ఓ కొడుకో, కూతురో వుంటే బాగుండేదని. లేకపోతే జీవితానికి అర్థం, ప్రయోజనం లేవు. పోతూపోతూ నా సుఖసంతోషాలను తీసుకుపోవడమే కాకుండా, కనీసం ఈ అదృష్టమైనా లేకుండా చేశారాయన." గద్గదంగా అంది కస్తూరి.

"అవును. నిజంగా పిల్లలు లేని బ్రతుకెంత నరకమో అనుభవిస్తున్న నాకు తెలుసు కస్తూరి. నిన్ను అర్థం చేసుకోగలను. అవకాశం లేక నువ్వు దురదృష్టవంతురాలివయ్యావు. అన్నీ వుండి నేనదృష్టవంతురాల్ని కాలేకపోతున్నాను."

"అర్థంలేని ఆలోచనలెన్నో వస్తుంటాయి. నాకు ఎవరితోనూ ఎటువంటి యెటాచ్‌మెంట్ వుండకూడదు మెంటల్‌గా, ఫిజికల్‌గా. కానీ ఏదో ఓ అద్భుతం జరిగి నాకో చక్కని పండంటి పాపాయి పుట్టాలి. తన ఆటపాటలతో నన్ను మురిపించాలి. పెరిగి పెద్దదైనా కన్నీళ్ళు తుడిచి ఇన్నేళ్ళ నా ఒంటరి జీవితంలో ఎదుర్కొన్న మానసిక సంక్షోభాన్ని రూపుమాపాలి. కావాలి... నాకో పాపాయి కావాలి" తనలో తను అనుకుంటున్నట్టు మెల్లగా అంది కస్తూరి.

ఉద్వేగాల బరువుతో కాలం మెల్లగా నడుస్తోంది. విప్పారిన కళ్ళతో చూస్తున్న శాంతికి కస్తూరి మసగ్గా కనిపించింది. కొంగుతో కళ్ళద్దుకుంటున్న ఆమెను కస్తూరిపట్ల సానుభూతి కదిల్చివేసింది. తనకు చక్రవర్తి అయినా వున్నాడు. పాపం ఆమెకో,

"ఎందుకే ఏడుస్తున్నావు. నా సోదంతా వెళ్ళబోసుకుని నిన్ను బాధపెట్టినట్టున్నాను ఛ. ఊరుకో."

శాంతిని అంత దిగులుగా చూట్టం ఇది వరకులాగానే కస్తూరికి యిప్పుడూ సాధ్యంకాలేదు.

"నీకు ఇప్పటిదాకా చెప్పడానికి సిగ్గుపడ్డాను. ఇక దాచుకోలేను. నేనేమన్నా అయిపోతానేమోనని భయంగా వుంటోంది ఈమధ్య, మనిద్దరి బ్రతుకు ఇట్లా అయిపోయాయి." చక్రవర్తి గురించి తను అప్పటివరకూ దాచుకున్నదంతా కస్తూరికి నివేదించింది. తన ఒంటరితనం... ఆలోచనలు.... అన్నీ.

ఆ రాత్రివారిద్దరి సంభాషణలో ఎక్కువభాగం చక్రవర్తే చోటు చేసుకున్నారు. అంతగా ఆమెను ప్రేమిస్తూ కూడా ఎందుకలా ఆమెను వదిలేసి తిరుగుతాడో కస్తూరికి అర్థం కాలేదు.

దూరపు కొండలు బాగా నునుపు కాబోలు అనుకుంది.

"అతనికి అర్థమయ్యేలా చెప్పి చూశావా?"

"ఆ" అంది శాంతి. ఆమె మనసు తేటపడింది ఆ డిస్‌క్లోజర్‌తో. "ఆయన సీరియస్‌గా తీసుకోరు. హీ టేక్స్‌మీ ఫర్ గ్రాంటెడ్. పైగా అంతా నా కోసమే అంటారు,"

కస్తూరి ఊహాల్లో సంతరించుకున్న చక్రవర్తి ఆకృతికి శాంతి ఆవేదన ముసుగు కప్పింది.

ఒకరి గురించి మరొకరు ఆలోచిస్తూ పడుకున్న ఆ ఇద్దరికీ ఆ రాత్రి శివరాత్రి.

ఆ మర్నాడు అనుపమ్‌లో తెలుగు మార్నింగ్‌షో సినిమాకు వెళ్ళారిద్దరూ. వచ్చి, భోంచేసి పడుకుంటే ఐదున్నర వరకూ గాఢమైన నిద్రపట్టింది.

"మీ స్విమ్మింగ్‌పూల్ చాలా బాగుందే," అంది కస్తూరి టీ తాగుతూ

బేతింగ్ సూట్‌లు వేసుకుని ఇద్దరూ ఓ అరగంటసేపు ఈతకొట్టారు.

"అప్పటికీ, ఇప్పటికీ నీలో పెద్దమార్పేమీ లేదు. కాలేజీ రోజుల్లో కన్నా ఇప్పుడే అందంగా వున్నావు" అంది శాంతి కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న ఆమె ఒంపుల్ని చూస్తూ.

"నువ్వు మాత్రం.... నేనే ఇంకా లావయ్యాను." అంది కస్తూరి.

ఆ మర్నాడు ఎలిఫెంటా కేవ్స్ నుంచీ తిరిగొచ్చాక తాజ్‌లో కూర్చున్నారిద్దరూ. చాలా ఏళ్ళ తర్వాత. మళ్ళీ ఇదివరకటి సాన్నిహిత్యం వాళ్ళిద్దరి మధ్యా.

గ్లాస్ టాప్ టేబుల్ మీద ఆరుతున్న వేలిముద్రలను చూస్తూ అంది శాంతి.

"ప్రేమంటే కొట్టిపారేసే దానివి అప్పుడు. అతన్ని ఎలా ప్రేమించావే మరి?"

"నీకు అప్పుడు రాసినట్టు గుర్తు. పరిచయం స్నేహంగా మారింది అతన్ని చాలా ఇష్టపడ్డాను. అది ప్రేమే అయితే ప్రేమించానన్న మాటే."

కాఫీ తాగేసి గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర సముద్రం పక్కనే నడుస్తున్నారు.

"నువ్వు తొందరగా మాతృశ్రీవి కావే. నాకో పాపాయిని ఇద్దువుగాని పెంచుకుంటాను." అంది కస్తూరి.

"ఆలులేదు చూలులేదని... అయినా నా పిల్లలు నీ పిల్లలెలా అవుతారు."

"ఎందుక్కారు. నేనే నువ్వైనప్పుడు పిల్లల్లో మాత్రం తారతమ్యాలెందుకొస్తాయి? అయినా వేచి వుండే ఓపిక వుందిలే నాకు. ఇప్పుడు కాకపోతే ఒకటి రెండెళ్ళ తర్వాత ఇవ్వు."

"ఇది అనుకోకుండా నేను కలిశాక నువ్వంటున్నమాట, నీ సమస్యకు పరిష్కారం కాదు."

"పరిష్కారాల్లేక కాదు. ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ లేదూ."

సంయోగం లేకుండానే పురుషుడి స్పెరంను స్త్రీలో ప్రవేశపెట్టి గర్భవతిని చేసే ఆ ప్రక్రియ శాంతికీ తెలుసు.

"నువ్వు బాగా చదువుకున్నదానివి కదా. ఇదంతా నీకు సబబనిపిస్తోందా. ఎవరోముక్కూ, మొహం తెలియని వాడికి సంతానం కనడం..."

తల వూపింది కస్తూరి. "సబబే... కానీ సహజం కాదు, కానంత మాత్రాన నష్టమేమీలేదు. స్త్రీ త్వానికి పరిపూర్ణత మాతృత్వంలోనే. సంయోగం అంటే నాకు విముఖత

అని కాదు. ఆయన పోయాక చాలామంది ప్రయత్నించారు నాకు దగ్గరవ్వాలని, నేను యెవరినీ యిష్టపడలేకపోయాను. ఒకవేళ ఫ్రిజిడ్ అయిపోతున్నానేమో అనుకుని ఈ విధానం గురించి ఆలోచించాను. అంతే…"

ఏదో అనబోయి మాటల్ని మింగేసింది శాంతి.

* * *

షాపింగ్ నుంచీ తిరిగొచ్చి సిటవుట్‌లో కూర్చున్నారిద్దరూ, ఆ రోజే కస్తూరి వెళ్ళిపోతోంది.

"వెళ్ళే ముందు నాదో సలహా, చక్రవర్తికి నీ ఒంటరితనం నిన్నెంత గాయపరుస్తోందో తెలియడంలేదనుకుంటాను. అతను ఆలోచించేట్టు నువ్వు చెయ్యాలి. ఇంటికి వచ్చినప్పుడు ఎప్పటిలా కాక కాస్త నిర్లిప్తంగా వుండు. అతన్ని లక్ష్యపెట్టకు, నీ ప్రవర్తనలో మార్పు అతన్ని వేరే కోణాల్లోంచి ఆలోచింపజేస్తుంది. ఈసారి అతను సిడ్నీ వచ్చినప్పుడు నన్ను కలవమను. నేను వివరిస్తాను."

"నేనలా ఉంటే తను బాధపడతారు, ఏమోలేవే ఎప్పటికైనా ఆయనే మారతారు." అంది శాంతి.

"నీ ధోరణి చూస్తుంటే ఇట్లా ఇంకెన్నాళ్ళో సాగడం మీ ఇద్దరికీ మంచిది కాదనిపిస్తోంది. ఎంతో ప్రయత్నం మీద గానీ నువ్వు మామూలుగా వుండలేకపోతున్నావు. నీ ఫ్లైట్ ఆఫ్ అయిడియాస్ చూస్తుంటే నాకు భయంగా వుంది. ఉయ్ మస్ట్ డూ సమ్‌థింగ్ ఎబౌటిట్."

తల ఊపింది శాంతి అలాగే అన్నట్లు.

"నిన్నటినుంచీ గమనిస్తున్నాను. ఏదో చెప్పబోయి ఆగిపోతావు. ఏమిటే అది."

గుచ్చి గుచ్చి చూస్తూ అడిగింది కస్తూరి.

"అబ్బే…. ఏం లేదు…. తర్వాత ఎప్పుడైనా చెప్తాలే."

"అమ్మా కారు రెడీ" అన్న డ్రైవర్ మాటలకు ఇద్దరూ లేచారు."

* * *

పార్క్‌లేన్‌కు ఉత్తరదిశలో మార్బుల్ ఆర్చ్‌దగ్గర ఉన్న "డయల్ నైన్" క్లబ్ లండన్‌లో ఉన్నతశ్రేణి కళాకారులకూ, సినీ యాక్టర్లకూ, అత్యంత ప్రీతిపాత్రమైన సమావేశ స్థలం. డిస్కోతెక్‌లో సాయంత్రం తొమ్మిదిన్నర నుంచీ డాన్సులూ, సంగీతం నిర్విరామంగా సాగుతుంటాయి. నగరంలోని ఏ ఫైవ్ స్టార్ హొటల్‌కూ తీసిపోని వెరైటీ డిషెస్ దొరుకుతాయి. అక్కడ డ్రైవింగ్ రూంలో. అక్కడలేని డిగ్నిఫైడ్ ఎంటర్‌టెయిన్‌మెంట్

అంటూ ఏదీ లేదు.

చక్రవర్తి, శాంతి, నేవిగేషన్ వ్యవహారాలు చూస్తున్న కెప్టెన్ అహ్మద్, కన్సల్టెంట్ ఫ్రాంక్ ఆర్నాల్డ్‌లు బయటకుర్చీల్లో కూర్చుని బీర్ తాగుతూ టెన్నిస్ చూస్తున్నారు. లివర్‌పూల్‌లో వున్న షిప్పును అంతకుముందురోజే చూసి వచ్చారు. కెప్టెన్ అహ్మద్‌కు బాగా బాగా నచ్చిందది. ఏమైనాసరే కొనాలనే స్థిరనిశ్చయంతో వున్నాడతను. మరో అయిదు నిమిషాలకు ఓ బట్టతల వ్యక్తి, నోట్లో పైప్‌తో, గ్రీన్‌కలర్ సూట్‌లో వచ్చి తనను పరిచయం చేసుకున్నాడు. అతనే ఆ షిప్పులకు ఓనర్, అంతకుముందు సింగపూర్‌లో చక్రవర్తిని కలిసినవాళ్ళు అతని కంపెనీ ఎగ్జిక్యూటివ్స్.

కొంచెం మత్తుగా, నిర్లక్ష్యంగా వుండేకళ్ళు, నిలకడగా ఓ చోట నిలబడని చూపులు, క్షణక్షణానికీ వాచీ చూసుకునే అసహనం, రెండు నిమిషాలకోసారి నిట్టూర్పులు. అతను బిజినెస్‌కు యెంతమాత్రం పనికిరాదని చెబుతున్నాయి. అతని దగ్గర పనిచేసిన కెప్టెన్‌లు యిద్దరు యిప్పుడు చెరో షిప్పు కొనుక్కున్నారు. సహజమే అనుకున్నాడు అహ్మద్, అతన్ని చూసిన తర్వాత, మరో పది నిమిషాలకు అతని కంపెనీ ఎగ్జిక్యూటివ్స్ ఇద్దరూ వచ్చారు. వస్తుండగానే వాళ్ళమీద విరుచుకుపడ్డాడతను. కొంచెం చిన్నబోయిన మొహాలతో చెప్పారు వాళ్ళు. వాటికి సంబంధించిన కాగితాలు తీసుకురావడంలో ఆలస్యమైందని.

"చెప్పండి ఏం నిర్ణయం తీసుకున్నారు" అడిగాడతను పైప్ పొగ గుప్పున వదుల్తూ, చక్రవర్తికి అతన్ని చూస్తేనే చిరాకుపుడుతోంది. అహ్మద్ వైపు చూశాడు.

కెప్టెన్ అహ్మద్ మొదలుపెట్టి ఆ షిప్పుల లోతుపాతులన్నీ వివరిస్తూంటే. "నో వెయిటే మినిట్ కెప్టెన్. నా వెసల్స్ సంగతి నాకు తెలుసు. మళ్ళీ మీరు చెప్పక్కర్లేదు. ఇప్పుడు తేలవలసిందల్లా ప్రైస్ విషయం" అన్నాడతను ఖచ్చితంగా.

"ఫైవ్ పాయింట్ ఫైవ్ మిలియన్లకైతే తీసుకుందామనుకుంటున్నాం" అన్నాడు అహ్మద్ కూడా కుండబద్దలు కొట్టినట్టు.

"దటీజ్ రిడిక్యులస్. మాకు మార్కెట్ ఏమీ తెలియదనుకోకండి. ఇంకెవరికైనా ఆఫర్ చేస్తే హీనపక్షంలో ఆరున్నర పైన వస్తుంది"

"మంచిది. అలా అయితే ఆ కొనేవాళ్ళకే అమ్ముకోండి. మాకక్కర్లేదు" అన్నాడు అహ్మద్ బ్లంట్‌గా.

చక్రవర్తి వారించాడతన్ని.

"చూడండి. ఈ డీల్‌లో మా యింట రెస్ట్ యెంతో మీ యింటరెస్ట్ కూడా అంతే వుంది. ఆలోచించి మీ ప్రైస్ మీరు చెప్పండి. మేమూ రివైజ్ చేస్తాం."

"జస్టే సెకండ్" అంటూ అతను లేచి వాళ్ళిద్దర్నీ తీసుకుని, కొంచెందూరం వెళ్ళి

ఓ పది నిమిషాలు సంప్రదించాడు. ఈ లోపల చక్రవర్తికి అహ్మద్, ఆర్నాల్డ్‌లు ఓ ఫిగర్ యిచ్చారు.

గంటసేపు తర్జన భర్జనల తర్వాత సిక్స్ పాయింట్ ఒన్ మిలియన్‌కు డీల్ ఫైనలైజ్ అయింది. పేమెంట్ టరమ్స్ మీదకూడా ఒక వొప్పందానికి వచ్చేశారు. వాటికి సంబంధించిన కాగితాలూ, అగ్రిమెంట్లూ అన్నీ తన వాళ్ళను చూడమని ఆయన వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయాడు.

''మేము ఈ షిప్పులను యెందుకు అమ్మేయాలనుకుంటున్నామో మీకర్థమైందనుకుంటాను'' అన్నాడు వాళ్ళిద్దరిలో ఒకతను స్నేహపూర్వకంగా నవ్వుతూ.

చక్రవర్తికూడా మందహాసం చేశాడు.

''యా ! పెక్యూలియర్ మాన్... ఓకే జంటిల్మన్. మా అహ్మద్‌తో మాట్లాడుతుండండి. మేము ఇప్పుడే వస్తాము'' అని ఆర్నాల్డ్‌ను తీసుకుని బయల్దేరాడు.

''ఎక్కడికి వెళ్దాం'' వోల్వో కారు స్టార్టు చేస్తూ అడిగాడు ఆర్నాల్డ్.

''జస్ట్ ఫర్ డ్రైవ్. ఈ లోపల నేను మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి.''

బేస్ వాటర్ రోడ్‌లోనుంచీ హైడ్ పార్క్ దాటి కెన్సింగన్ చర్చ్‌స్ట్రీట్‌లోకి తిరిగారు.

డెట్రాయిడ్ కార్లకంపెనీ షేర్ల గురించి చెప్పడం మొదలెట్టాడు చక్రవర్తి. ఆర్నాల్డ్ మధ్యమధ్య ప్రశ్నలు వేస్తున్నాడు. నైట్స్ బ్రిడ్జి. పికాడిల్లీ దాటి స్ట్రాండ్ మీదుగా ఫ్లీట్ స్ట్రీట్‌వైపు పరుగెత్తుతోంది కారు. నింపాదిగా నడుపుతున్నాడు ఆర్నాల్డ్ మాట్లాడే విషయాల మీద కాన్‌సెంట్రేట్‌చేస్తూ, ట్రాఫిక్‌నూ, సిగ్నల్స్‌నూ గమనించడం కొంచెం కష్టమైన పనే. అయినా ఆ ఇద్దరికీ అది చాలా సంవత్సరాలుగా అలవాటు.

సెంట్‌పాల్స్‌ను చుట్టి హైహోల్ బోర్న్‌మీదుగా ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్ దాటి మళ్ళీ డయల్‌నైన్ చేరుకునేసరికి చక్రవర్తి చెప్పదల్చుకుంది పూర్తయింది.

దీనిమీద ఆలోచించి ఏ సంగతీ రేపు చెపుతానన్నాడు ఆర్నాల్డ్. వీలైతే తను కూడా డెట్రాయిట్ వస్తానన్నాడు.

ఆ రాత్రి టాప్ ఆఫ్ ది టవర్ రివాల్వింగ్ రెస్టారెంట్‌లో డిన్నర్ ఇచ్చాడు చక్రవర్తి. షిప్పులు కొన్న సందర్భంలో.

తను కదలకుండా కూర్చుంటే లండన్ నగరం తనచుట్టూ పరిభ్రమిస్తోందన్న అనుభూతినిచ్చే ఆ స్కై స్క్రేపర్ రెస్టారెంట్ అతని కిష్టమైన వాటిల్లో ఒకటి.

పన్నెండున్నరకు గ్రీన్ పార్క్ దగ్గర్లో వున్న తన ఫ్లాట్‌కువచ్చేశాడతను అక్కడికి హైడ్‌పార్క్. బకింగ్‌హామ్ పాలెస్, సెంట్‌జేమ్స్ పార్క్ కనిపిస్తుంటాయి. అతని ఆఫీసు కూడా అదే బిల్డింగ్‌లో రెండు ఫ్లోర్ల కింద వుంటుంది. కెప్టెన్స్ ఇద్దరూ సోఫాలో

వుంటున్నారు, ఫ్యామిలీలతో సహా. ప్రస్తుతం రెండో కెప్టెన్ షర్నారస్ మెక్సికోలో వున్నాడు. ఏదో షిప్పు ప్రాబ్లెం రావడం వల్ల.

మర్నాడు చక్రవర్తి శాంతీ నావిగేషన్‌కు సంబంధించిన లెక్కలూ అవిపైపైన తిరగేశాడు. అన్నీ సంతృప్తికరంగానే వున్నాయి. అతను ఆఫీస్‌లో వుండగానే స్టేట్స్ నుంచి నార్త్ బ్లాక్ ఫోన్ చేశాడు. తమ జనరల్ మేనేజర్ ఎల్లుండి న్యూయార్క్ వస్తున్నాడనీ, వీలైతే అక్కడ కలవమన్నాడనీ. చక్రవర్తి చెప్పాడు. తనూ, ఆర్నాల్డ్ కలిసి బయల్దేరుతున్నామని, వోల్డార్ఫ్‌లో కలుసుకోవడానికి నిశ్చయమైంది.

ఆ రాత్రి చక్రవర్తి తన స్విడ్జర్లాండ్ బ్యాంక్ మేనేజర్‌కు ఫోన్ చేసి, టూకీగా తను చేస్తున్న డెవలప్‌మెంట్స్ చెప్పాడు. న్యూయార్క్ నుంచి వచ్చి కలుసుకుంటాననీ, డబ్బు అవసరమౌతుందనీ చెప్పాడు. ఆ బ్యాంక్‌కున్న మంచి హెల్దీ కస్టమర్స్‌లో చక్రవర్తి ఒకడు. అందుకే అతని ప్రాజెక్ట్స్‌కి మేనేజర్ యెప్పుడూ అడ్డుచెప్పడు. అప్పుడప్పుడూ ఆయన యిచ్చే సలహాలు చాలావరకూ లాభసాటి కావడం కూడా చక్రవర్తి అనుభవంలోకి వచ్చిన విషయమే.

మేనేజర్ అతన్ని ప్రోత్సహించాడు. డబ్బుకోసం వెనకాడవద్దనీ. తన సపోర్ట్ అతని కెప్పుడూ వుంటుందనీ.

ఆ మర్నాడు రాత్రి పదిన్నరకు పానామ్‌లో బయల్దేరారు చక్రవర్తి. ఆర్నాల్డ్. హొటల్లో దిగగానే అతను చేసిన మొదటి పని శాంతికి కాల్ బుక్ చేయడం. స్టేట్స్ నుంచి ఏ యితరదేశాలకైనా ఫోన్ చెయ్యడం నిమిషాలమీద పని. ఐదో నిమిషంలో శాంతిలైన్‌మీదకు వచ్చింది.

"హలో నేను శాంతీ... న్యూయార్క్ నుంచి మాట్లాడుతున్నాను.

"పక్కన లేని మొగుడు న్యూయార్క్‌లో వున్నా ఒకటే, నూతక్కిలో వున్నా ఒకటే, ఇంతకీ ఏమిటి?"

"మొదలెట్టావ్ సణుగుడు. ఫోన్‌లోనైనా కొంచెం ప్రేమగా మాట్లాడటానికేం పోయిందీ!"

"ఎందుకూ కంఠశోష. ఏం మాట్లాడను. దానివల్ల ఉపయోగమేమిటి?"

"డోంట్ బీ సో రూడ్ శాంతీ" అతని గొంతులో వేడుకోలు.

శాంతించింది.

"ఊ! ఎన్ని రోజులూ మకాం?" అడిగింది మృదువుగా.

"రెండు మూడు రోజులు...." అంటూ తను వచ్చిన పనేమిటో చెప్పాడు, సింగపూర్‌లో తను కొన్న ప్రెజెంట్స్ గురించి చెప్పాడు. ఇంకో నాలుగైదు రోజుల్లో నీ

ఒళ్లో వాలిపోతానన్నాడు.

"మీ మాట నమ్మడం మినహాయించి ఈ లోకంలో ఏ పని చెయ్యడానికైనా సిద్ధమే" అంది శాంతి.

"ఒట్టు. నీతోడు" అన్నాడతను.

"సరే అయితే. మీ కోసం నమ్మినట్టు నటిస్తాను. దటీజ్‌ది మాగ్జిమమ్ ఐకెన్‌డూ" అంది.

తర్వాత కస్తూరి రావడం, వెళ్ళడం గురించి చెప్పింది. అరగంట మాట్లాడిన తర్వాత ఆనవాయితీగా ముందు ముద్దూ తర్వాత ఫోన్ పెట్టేశాడతను.

అనుకోని అవాంతరాలవల్ల నార్త్‌బ్లాక్, మెక్‌డోనాల్డ్‌లు రెండురోజులు ఆలస్యంగా వచ్చారు. న్యూయార్క్ అంటే చక్రవర్తికి చిరాకు. ఎప్పుడూ బిజీగా రణగొణధ్వనుల్తో ఏదో కొంపలంటుకుపోతున్నట్టు పరిగెత్తే కార్లూ, ఎన్నెన్నో రోడ్లూ, దట్టమైన పొగమంచుతో మన్‌హట్టన్ ప్రాంతం అంతా ఇరవై నాలుగ్గంటలూ హడావిడి పడిపోతుంటుంది.

జనరల్ మేనేజర్ మెక్‌డోనాల్డ్‌తో సంప్రదింపులయ్యాక ఆ మర్నాడు ప్రయాణం పెట్టుకున్నాడు. ఆ రాత్రి లండన్ నుంచీ కెప్టెన్ ఫోన్‌చేశాడు. స్టేట్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ చైర్మన్ జోవెస్ట్ కూతురి పెళ్ళట, శాన్‌ఫ్రాన్సిస్కోలో ఇరవై ఎనిమిదన. చక్రవర్తి కోసం అడిగితే కెప్టెన్ వోల్డార్ఫ్‌హోటల్ నంబర్ ఇచ్చాడట. ఏ నిమిషంలోనైనా అతను ఫోన్ చెయ్యవచ్చు. కాబట్టి పెళ్ళికి వెళ్ళాల్సి వుంటుందేమో. తొందరపడి రావద్దూ అని దాని సారాంశం.

ఆ రోజు తారీఖు ఇరవై ఆరు. ఇంకో రెండు రోజులు శాన్‌ఫ్రాన్సిస్కోలో గడపాలి. కానీ తప్పదు. జోవెస్ట్‌కు తనంటే విపరీతమైన అభిమానం: బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో అతని పాలసీలన్నిటికి గట్టి సపోర్టు ఇస్తాడనీ కీలకమైన విషయాల్లో నిర్దుష్టమైన అభిప్రాయాలూ, సలహాలు చెబుతాడనీ, చక్రవర్తంటే ప్రాణం ఇస్తాడు.

మరో అరగంటలో ఫోన్ వచ్చింది.

"గుడ్ డే సర్. ఎలా ఉన్నారు" అడిగాడు చక్రవర్తి.

"నాట్ టూ బాడ్. హౌ ఆర్యూ" అన్నాడు జోవెస్ట్.

మామూలు ఫార్మాలిటీస్ అన్నీ అయ్యాక.

"మా అమ్మాయి పెళ్ళి ఎల్లుండి రేపు బయల్దేరి రావడానికి వీలౌతుందా నీకు."

టూకీగా తను న్యూయార్క్ వచ్చిన పనిచెప్పాడు చక్రవర్తి.

"ఓ. దటీజ్ వెరి గుడ్. ఈ మధ్య ఆ కంపెనీ మంచి ప్రోగెస్ చూపిస్తోంది. ఆ కార్లు చాలా ఎకనామికల్ అంటున్నారంతా. ఈ ఆయిల్ క్రైసిస్‌తో మనకు కావలసింది

అలాంటి కార్లేగదా. కాబట్టి మార్కెట్‌కేం ఢోకా వుండదు. మంచి టైమ్‌లో సరైన డెసిషన్ తీసుకున్నావు. కంగ్రాచ్యులేషన్స్."

"థాంక్ యు సర్. రేపు తప్పకుండా రావడానికి ప్రయత్నిస్తాను"

"ప్రయత్నించడం కాదు. వచ్చితీరాలి. ఎట్లాగూ స్టేట్స్‌లోనే వున్నావు కాబట్టి. అదే ఇండియానో. లండనో అయితే నిన్ను బలవంతం చెయ్యలేను గదా. అదీ గాక నువ్వు వచ్చినపని కూడా పూర్తయిపోయిందటున్నావు. మరింకేమిటి అభ్యంతరం?"

"అబ్బే; ఆభ్యంతరం ఏం లేదు. వస్తాను. రేపు కలుస్తాను మిమ్మల్ని."

"వెల్ కం: బై ఫర్ నౌ."

"బై బై. సర్"

* * *

ఐదేళ్ళ నాటిమాట. ఆ రోజు తమరిద్దరూ సినిమాకి వెళ్దామని తయారవబోతున్నారు. ఇంతలో తలుపుకొట్టిన చప్పుడు. ఆయన వెళ్ళి తీశారు. హీరాచంద్ లోపలికి వచ్చాడు. కలలోకూడా వూహించని తన యజమాని ఆగమనానికి తత్తరపడి ఏం మర్యాదలు చెయ్యాలో తెలీక కంగారుపడిపోసాగాడు చక్రవర్తి.

భుజాలచుట్టూ కొంగుకప్పుకుని నమస్కరించింది తను.

"మంచిదమ్మా. లక్ష్మీదేవిలా వున్నావు. కలకాలం వర్ధిల్లుతల్లీ" ఆశీర్వదించాడాయన తను యిచ్చిన కాఫీ తాగుతూ వచ్చినపని చెప్పాడు హీరాచంద్.

వాళ్ళ షిప్పింగ్ కంపెనీలో చక్రవర్తికున్న శక్తి సామర్థ్యాలు, నేర్పు మిగతా వాళ్ళతో వ్యవహరించడంలోగల మెలకువలు అన్నీ కిందవాళ్ళనుంచి పైదాకా అందరికీ తెలుసు. ఆ కంపెనీ దినదిన ప్రవర్ధమానమవడానికి కారణం అతను మేనేజర్ కావడమేనని తెలుసు. అందుకే హీరాచంద్‌కు చక్రవర్తిమీద మంచి గురి.

"నేనూ, సోనా విడిపోదా మనుకుంటున్నాం" మెల్లగా అన్నాడాయన. క్షణంసేపు తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడతను. వాళ్ళిద్దరూ అన్నదమ్ములు. ఏ పొరపొచ్చాలూ లేకుండా యిన్నాళ్ళూ కంపెనీ వ్యవహారాలన్నీ ఒక్క తాటిమీద లాక్కొస్తున్నారు.

"అవును. వాడికి సినిమాల మీద వ్యామోహం మళ్ళింది. ఇంక ఆ పిచ్చిలో పడ్డవాడిని దేవుడు కూడా రక్షించలేడని నీకూ తెలుసు. నా వాటా నాకు కావాలంటూ కూర్చున్నాడు. చెప్పి, చెప్పి విసిగిపోయాను. ఇక నావల్లకాదు" అన్నాడాయన కళ్ళజోడు తుడుచుకుంటూ.

సోనా చక్రవర్తి కన్నా తెలివైనవాడు. సమర్థుడు. చక్రవర్తి ఆ ఆఫీస్‌లో చేరేటప్పటికే

అది సోనా ఏకచ్ఛత్రాధిపత్యం కింద నడుస్తోంది. చక్రవర్తికి వ్యాపారంలో మెలకువలు నేర్పిందీ. అతన్ని గైడ్ చేసిందీ సోనాయే. అలాంటిది అతనిప్పుడు తప్పుకుంటున్నాడంటే, అదీ ఈ వయసులో సినిమా పిచ్చిలోపడి... ఆశ్చర్యం కలిగింది చక్రవర్తికి.

"నేను కూడా మాట్లాడి చూస్తాను. అయినా ఉన్నట్టుండి ఆయనకిలాంటి బుద్ధి పుట్టిందేం?"

"ఏం చేస్తాం? అంతా గ్రహచారం. అయినా ఇది ఈ రోజు పుట్టిన బుద్ధికాదు. నాలుగైదు నెలలనుంచీ వాడిలో మార్పు కనబడుతూనే వుంది. వ్యాపారం అంటే విసుగు. ఎల్నాళ్ళిలా గాను గెద్దుల్లా. ఒకే రకం ప్రాబ్లెమ్స్‌తో సతమతమవడం? వెరైటీ లేని జీవితం. ఇక నే చెయ్యలేను ఈ బిజినెస్. నాకు రిలీఫ్ కావాలి అంటున్నాడు."

"ఆయనంత గట్టిగా పట్టుబడుతున్నప్పుడు బలవంతాన మనం ఆఫీస్‌లో కూర్చోబెట్టినా తన పనికి న్యాయం చెయ్యలేడు." అన్నాడు చక్రవర్తి సాలోచనగా

"అవును, నా అభిప్రాయం కూడా అదే. అందుకే వాడి దారిన వాడిని వదిలెయ్యడం మంచిదనే నిర్ణయానికివచ్చాను. తర్వాత వాడు ఎదురుదెబ్బలు తిని నా దగ్గరకొస్తే నేను చేరదియ్యడానికి ఎప్పుడూ సిద్ధమే," అన్నాడు హీరాచంద్.

"అయితే ఇప్పుడేం చేద్దామనుకుంటున్నారు" అడిగాడు చక్రవర్తి. అతనికి మనసులో ఏదో ఓ మూల ఈ కంపెనీ మూసివేయబోతున్నామనీ. ఇంకోచోట ఉద్యోగం వెతుక్కోమనీ చెప్పడానిక వచ్చాడేమోనన్న భయం పీడిస్తోంది. ఎందుకంటే సోనాకు వున్న స్థానం అటువంటిది. అతను లేని కంపెనీని ఊహించడం కూడా కష్టం.

"నీకో ప్రపోజల్ ఇద్దామని వచ్చాను సోనా సలహా మీద."

అలా చూస్తుండిపోయాడు చక్రవర్తి.

"కంపెనీని నువ్వు మెయింటెయిన్ చెయ్యి" సర్వాధికారాలూ నీకు యిస్తాను. అంతా అయిన తర్వాత నీకు పాతికశాతం లాభాల్లో ఇస్తాను. ఏమంటావ్?"

చక్రవర్తి మ్రాన్పడిపోయాడు. మునిగిపోతున్న వాడికి గడ్డిపరక బదులు పడవ చేతికి తగిలినంత ఆనందం కలిగింది. కళ్ళు చెమర్చుతూండగా అన్నాడు.

"మీరు నామీద వుంచిన ఈ విశ్వాసానికి కృతజ్ఞతలెలా చెప్పాలో తెలియటంలేదు. కానీ ఈ లాభాల్లో వాటాలేమిటి మీరు నాకిచ్చే జీతం చాలు. వాటా ఇస్తేనే పని బాగా చేస్తాను, లేకపోతే చెయ్యను అనుకుంటున్నారా."

"నో నో" వారిస్తూ అన్నాడాయన.

"అలాంటిదేమీ లేదు. నీ విలువేమిటో నీ కన్నా నాకు బాగా తెలుసు. సామర్థ్యమున్నవాళ్ళను ఎలా సత్కరించాలో కూడా తెలుసు. అసలు ఎప్పట్నుంచో

అనుకుంటున్నాను నీకు ఏదో ఒకటి చెయ్యాలని. నీకు వాటా ఇచ్చి తద్వారా నీతో ఎక్కువ పని చేయించుకుని ఇంకా లాభాలు రాబట్టుకోవాలనే స్వార్థం లేదు నాలో. నువ్వంటే మాకున్న అభిమానానికి చిన్న నిదర్శనం ఇది. నాకిప్పటికే కట్టుకుపోయేంత ఆస్తి ఉంది. ఇంకా వచ్చేదెంతో ఉంది. అపరిమితంగా పెరిగిపోతున్న దీన్ని ఏం చేసుకోను?"

ఎప్పుడో, ఎక్కడోతప్ప ఎదురుకాని అరుదైన వ్యక్తిత్వం అంతమాత్రంచేత అలాంటి మనుష్యులే ఉండరని అనుకోవడం పొరపాటు.

ఆయన వెళ్ళిపోయిన తర్వాత ఆమెను చుట్టేస్తూ అన్నాడతను.

"నువ్వెంత అదృష్టవంతురాలివి శాంతీ, నువ్వు నా జీవితంలోకి అడుగుపెట్టకపోతే ఇదంతా నాకు జరిగేదేనా:"

"అదేంమాట, మీ అదృష్టమే నాకూ సంక్రమిస్తోందేమో.... దేవుడి లాగా వచ్చాడు... ఎంతో పెద్ద వరమిచ్చి వెళ్ళిపోయాడు" కృతజ్ఞత ఉట్టిపడే గొంతుతో అంది శాంతి.

కానీ ఇన్నేళ్ళ తర్వాత ఆ వరమే ఘోరశాపంలా అనిపిస్తోంది. ఆ రోజునవచ్చింది. దేవుడుకాదు దెయ్యం అనిపిస్తోంది.

ఫోన్‌మోగితే యాంత్రికంగా రిసీవర్ అందుకుంది.

ఆస్ట్రేలియానుంచి కాల్. హెలెనా వుంది అవతలవైపు. ఆ అమ్మాయి శాంతికి తెలుసు. యోగక్షేమాల తర్వాత చెప్పింది ఆమె.

"బాస్ మళ్ళీ యిక్కడికి ఓసారి రావలసి వుంటుంది మేడమ్. ఫ్రైట్ మార్కెట్ విపరీతంగా పెరిగిపోయింది. బంకర్స్ ప్రైసెస్ పెరగడంవల్ల. వీట్ కార్పొరేషన్‌తో మనం వొప్పుకున్న రేట్లకు షిప్‌మెంట్లు చెయ్యాలంటే చాలా లాస్ వస్తుంది. అందుకే వాళ్ళతో మాట్లాడి అగ్రిమెంటు రివైజ్ చెయ్యాలి, వాళ్ళూ వొప్పుకుంటారు. కానీ బాస్ వస్తేనే సాధ్యపడుతుందది.

"అలాగే చెప్తానులే రాగానే. స్టేట్స్‌లో వున్నారు ప్రస్తుతం. రెండు మూడు రోజుల్లో వచ్చేస్తానంటున్నారు. ఇంకా యేమిటి కబుర్లు? నువ్వెలా వున్నావ్. బాగున్నావా?"

"ఆ.... అంతా బాగానే వున్నాం. మీరు బాగా లోన్లీగా ఫీలౌతున్నా రనుకుంటాను?"

శాంతి ఏం మాట్లాడలేదు.

ఓ నిమిషంపాటు నిశ్శబ్దం.

"వుంటాను మేడమ్."

"ఓ కే."

ఫోన్ పెట్టేయగానే శాంతి మళ్ళీ కస్తూరి గురించి ఆలోచించింది. ఆమే, తనూ

గడిపిన రోజులు. తన జీవితంలో వచ్చిన మార్పులు. ఎన్నెన్నో అస్పష్టమైన ఊహలు. రూపుదిద్దుకోలేని భావాలు, అంత రంగంలో మధన. కస్తూరి. చక్రవర్తి, తను తమకి సంతానం. క్రమంగా ఆమె ఆలోచనలు ఆకృతి సతరించుకోసాగాయి.

ఒక నిశ్చయానికివచ్చి ఆ సాయంత్రం కస్తూరికి ఫోన్ చేసింది శాంతి. ఇరవై అయిదు నిమిషాలపాటు తన భావాలు బయటపెట్టి, ఆమె ప్రశ్నలకు సమాధానమిచ్చి సలహాలు తీసుకుని, తన గుండెలో బరువు దింపుకునేవరకూ ఆమెకు తోచలేదు.

దారిమళ్ళిన ఆలోచనలు. ఊహాల్లో వింత మలుపులు. ఎప్పుడూ లేనంతగా చక్రవర్తి కోసం ఎదురుచూడసాగింది శాంతి.

*   *   *

న్యూయార్క్ నుంచి బయల్దేరిన స్విస్ ఎయిర్ జంబో జెనీవా చేరుకునేసరికి సాయంత్రం ఏడుగంటలు కావస్తోంది. లాంగ్ ఫ్లైట్ కావడంతో తలంతా ఒకే దిమ్ముగా వుంది చక్రవర్తికి.

ఆ మర్నాడు లొజాన్ పాలెస్ హొటల్లో బ్యాంక్ మేనేజర్ టెడ్ విలియమ్స్‌తో అపాయింట్‌మెంట్ వుంది. జెనీవానుంచి లొజాన్ బయల్దేరాడు టాక్సీలో.

హొటల్ చేరుకుని, స్నానంచేసి, రెండు పెగ్గులు స్కాచ్ తీసుకుని పడుకుంటే మర్నాడు యెనిమిదిన్నరకుగానీ మెలకువరాలేదు. మొహం కడుక్కుని కాఫీతాగుతూ విండోకర్టెన్ పక్కకు లాగాడు. ఎటుచూసినా ఆకుపచ్చని ప్రకృతి, నిర్మలంగా వున్న లేక్‌జెనీవాలో నీళ్ళను ఛిన్నాభిన్నం చేస్తూ సాగపోయే స్పీడ్‌బోట్స్. ఆ వెనక కనుచూపు మేరలో నీలంపైన తెల్లని మంచుపొరలు కప్పుకున్న పర్వతశ్రేణి బయట గార్డెన్‌లో నుంచి మేలుకొలుపులు వాడుతున్న పక్షుల మధురమైన సంగీతపు బాణీ.

ప్రపంచంలో స్విడ్జర్లాండ్ అంత అందమైన దేశాలు చాలా తక్కువ. ఆ దేశ ప్రజలు తమ అతిథులకు ఇచ్చే మర్యాదామన్ననాకూడా మిగతా దేశాల్లో అరుదు. కేవలం ఆ దేశపు అందాన్ని చూట్టానికి వచ్చే టూరిస్టులవల్ల వచ్చే ఆదాయంతో అక్కడి ప్రజల అవసరాలు వెళ్ళిపోతాయి. విశ్వవిఖ్యాతి పొందిన అక్కడి వాచీల కుటీర పరిశ్రమలు మూతపడినా వాళ్ళ జీవికకు లోటుండదు, అంత స్వచ్ఛమైన వాతావరణంలో ఉండటంవల్లనే ఆ దేశం శాంతి ప్రియత్వం, సౌమ్యత, సుహృద్భావాలు సంతరించుకుని మిగతా దేశాలకు మార్గదర్శకం అయింది కాబోలు.

బెల్ మోగింది. తలుపు తెరిచాడతను. టెడ్ విలియమ్స్ లోపలికొచ్చాడు. ఇంకా నైట్‌డ్రెస్‌లోనే ఉన్న చక్రవర్తి కొంచెం సిగ్గుపడి.

"సారీ సర్... రాత్రి బాగా లేట్ అయింది. ఒక్క పది నిమిషాలు టైమిస్తే స్నానంచేసి

వస్తాను.” అన్నాడు.

“నో ప్రాబ్లమ్ మిస్టర్ చక్రవర్తి. టేక్ యువర్ ఓన్ టైం...” అన్నాడాయన సోఫాలో కూర్చుంటూ.

ఆయన కోసం కాఫీకి ఆర్డరిచ్చి, బాత్‌రూంలోకి వెళ్ళాడు చక్రవర్తి.

లౌజాన్‌లోని లీడింగ్ ఇంటర్నేషనల్ బ్యాంక్స్‌లో ఒక దానికి జనరల్ మేనేజర్ అయిన టెడ్ విలియమ్స్ చాలా నిరాడంబరమైన వ్యక్తి, తను నమ్మిన దారిలో నిర్భయంగా నడవడం, లాభనష్టాలను ఒకే రీతిలో రిసీవ్ చేసుకోవడం, అతనికి పుట్టుకతో అబ్బిన విద్యలు. మనిషి చాలా సరళ స్వభావి. చక్రవర్తి అంతపైకి రావడానికి కారణం టెడ్ ప్రోత్సాహం, ఫైనాన్సింగ్, సలహాలు. ఆ కృతజ్ఞత చక్రవర్తి మనసులో బలంగా వుంది.

తమ తీసుకొచ్చినకాగితాలన్నీ టెడ్‌కు చూపించి వాటి గురించి వివరించాడు. అంతే. పరిశీలించిన తర్వాత సంతృప్తికరంగా తలాడించి, అవసరమైన పేమెంట్లన్నీ చేస్తానన్నాడాయన. మరో పావుగంట కూర్చుని పిచ్చాపాటి మాట్లాడి వెళ్ళిపోయాడు.

వచ్చినపని అయిపోయిన తర్వాత ఒక్క నిమిషం కూడా ఎక్కడా వుండబుద్ధికాదు చక్రవర్తికి. ఆ సాయంత్రం మళ్ళీ బొంబేకి విమానమెక్కాడు.

* * *

ఇద్దరూ పక్కపక్కనే కూర్చుని భోంచేస్తున్నారు. అతని ఎడంచెయ్యి ఆమె నడుంచుట్టూ వుంది. అతనికేం కావాలో చూసి కొసరికొసరి వడ్డిస్తుందామె యెప్పుడూ. కానీ ఈ సారి యెందుకనో చాలా ముభావంగా వుంది. పక్కనచక్రవర్తి వున్నాడన్న ధ్యాస లేకుండా, కోపం యింకా తగ్గలేదనుకున్నాడతను.

ఆ రాత్రి ఆమెను పరీక్షగా చూసిన అతనికి ఎన్నో మార్పులు గోచరించాయి, ఎక్కడో శూన్యంలోకి చూస్తున్న కళ్ళు పరధ్యానం, కళ్ళ కింద మొదలవుతున్న నల్లటి మచ్చలు, తను రాగానే, అంతకు ముందు పడిన వేదనంతా మర్చిపోయి తను వున్న నాలుగైదు రోజులూ నవ్వుతూ, తుళ్ళుతూ, సాధిస్తూ, స్వర్గం చూపించే శాంతేనా ఈమె అనుకున్నాడతను.

ఆ రాత్రంతా ఆమె పక్కమీద అసహనంగా అటూ, ఇటూ దొర్లడం, నిట్టూర్చడం, తల పట్టుకోవడం, జుట్టు పీక్కోపడం, అతనికి స్పష్టంగా తెలుస్తూనే వున్నాయి.

మర్నాడు హెలెనా ఫోన్ చేసిన సంగతి చెప్పిందామె.

ఆశ్చర్యపోయాడతను. సాధారణంగా ఎంత ఎమర్జన్సీ అయినా తను వచ్చిన నాలుగైదు రోజుల తర్వాతగానీ బయట పెట్టదామె. అంటే ఇప్పుడు తనని వెళ్ళి పొమ్మని

సజెస్ట్ చేస్తోందా? తనను ఎవాయిడ్ చెయ్యాలని చూస్తోందా: కారణం ఏమిటి?

"అయితే రేపు సాయంత్రం బయల్దేరి వెళ్ళి రెండుమూడు రోజుల్లో వచ్చేస్తాను అన్నాడతను ఆమెను పరీక్షగా చూస్తూ. ఆమెలో మార్పులేమీ కనబడలేదు.

"మీ ఇష్టం" అంది నిర్లిప్తంగా వేళ్ళుచూసుకుంటూ

చక్రవర్తికి భయం మొదలైంది తప్పకుండా తన నుంచి దూరంగా తప్పుకుంటోంది శాంతి, నో. అలా జరగడానికి వీల్లేదు. తన శాంతి తనను విడిచిపెట్టి ఇంకో మార్గం తొక్కిన రోజున తను విధించుకోవడానికే శిక్షా చాలదు. ఇంకా ఆ జీవితానికి విముక్తిలేదు.

అతని ఆలోచనలూ, నిర్ణయాల్లో బలం ఏదో ఓ ఫోన్ కాల్ వచ్చేవరకే. ఆ సాయంత్రం హెలెనా ఫోన్ చేసి వీట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ మూడునాలుగు రోజుల్లో బయల్దేరి వెకేషన్‌కు వెళ్తున్నాడనీ, ఈ లోపల అతన్ని కలవడం తప్పనిసరి అనీ, చెప్పడంతో అంతకుముందు అనుకున్నవన్నీ గాలికీ, అతను గాలిలోనూ వున్నారు.

రెండురోజులపాటు తీవ్రంగా చర్చలు జరిపిన మీదట వీట్ కార్పొరేషన్ వాళ్ళు ఫ్రైట్ టన్నుకు రెండు డాలర్లు పెంచడానికి సూత్రప్రాయంగా వొప్పుకున్నారు. అగ్రిమెంట్లు తిరిగి రాసుకోవడానికి రెండు రోజులు టైం పడుతుంది. అనుకున్న లాభాల్లో దాదాపు యిరవై శాతం తగ్గిపోతోంది మార్కెట్ పెరగడం వల్ల.

ఆలోచిస్తూ కూర్చున్న చక్రవర్తికి శాంతి తనకిచ్చిన విజిటింగ్ కార్డు గుర్తొచ్చింది తీసి చూశాడు. డాక్టర్ కస్తూరి. నైన్త్‌ఫ్లోర్. గోల్ఫ్‌ఫీల్డ్స్ హౌస్ 1, ఆల్ ఫ్రెడ్ స్ట్రీట్ సర్క్యులర్ స్కేర్ సిడ్నీ, ఎన్.ఎస్.డబ్లుయూ 2000 అని రాసి వుంది పక్కనే టెలిఫోన్ నెంబర్లు. అతని ఆలోచనలు కస్తూరివైపు మళ్ళాయి.

కస్తూరి గురించి, తమ అన్యోన్యత గురించి, శాంతి అతనికి ఎప్పుడూ చెబుతూవుండేది శాంతి సృజించిన కస్తూరిని తను పూర్తిగా ఎరుగును. తమ బెడ్‌రూంలో బుక్ కాబినెట్ మీద ఫోటోలో అందం, మేధస్సు, సంస్కారం, సమపాళ్ళలో మేళవింపబడ్డ ఓ పరిపూర్ణాకృతి, ఎన్నో సంవత్సరాల క్రితం కస్తూరి ఆమెతో తన కెంతో సాన్నిహిత్యం వున్నట్టు భావించేవాడతను. ఇన్నాళ్ళకు ఆ కస్తూరిని. తన శాంతి ఆత్మలో ఓ భాగాన్ని చూడబోతున్నాడతను. తన ఆలోచనల్లో ఎప్పుడైనా శాంతితోపాటు కస్తూరి దర్శనమిచ్చినా ఆమె రూపం స్పష్టంగా ఉండేది కాదు,

ఆ నంబర్‌కు ఫోన్ చేశాడతను. రెండు క్షణాల తర్వాత ఆమె తియ్యని గొంతు వినిపించింది.

"కస్తూరి హియర్", ఆ హుందాతనాన్ని వింటున్న చక్రవర్తికి ముచ్చటేసింది.

"నమస్కారమండీ. నా పేరు చక్రవర్తి. మిగతావాళ్ళకు ఎలా తెలిసినా మీకు

మాత్రం నేను శాంతి మొగుడిగా పరిచయం కావడం ఉచితం అనుకుంటాను" అన్నాడు చనువుగా.

"భలేవారే. మీరు తెలియనివా రెవరుంటారు. ప్రపంచమంతా మీ పేరు మారుమోగిపోతుంటే" మెత్తగా నవ్వుతూ అంది కస్తూరి.

"నిజమా... నాకు వినిపించలేదే ఇంతవరకూ..." అన్నాడు చక్రవర్తి కూడా నవ్వుతూ.

కొంతమంది వ్యక్తులతో మొదటి పరిచయం చాలా అద్భుతంగా, తమాషాగా వుంటుంది. మాట్లాడినకొద్దీ మాట్లాడాలనిపిస్తుంది. అందులో ఆ ఇద్దరికీ ఒకరంటే మరొకరికి జెన్యూన్ ఇంటరెస్ట్ వుంటే ఇక చెప్పనే అక్కర్లేదు.

ఆమె బలవంతంమీద ఆ రాత్రికి భోజనానికి రావడానికి ఒప్పుకున్నాడతను.

* * *

తలుపు తీసిన కస్తూరిని చూసి ఆవాక్కైపోయాడు చక్రవర్తి. స్త్రీ సౌందర్యాన్ని నిర్వచిస్తూ కళ్ళముందు నిలబడ్డ కస్తూరి ఓ అద్భుత సృష్టి ప్రక్రియలా తోచిందతనికి.

నీ రెండకు తళతళ మెరిసే మంచు బిందువుల వెలుగు ఆమె కళ్ళల్లో కనురెప్పల కదలికల్లో చిరుగాలికి ఊగు చిగురుటాకుల లయ. చక్రవర్తి చూపులు ఆమె కళ్ళనుంచీ దిగి పాదాలవరకూ స్పర్శించాయి. అతి సాధారణమైన దుస్తుల్లో యిమిడిన అసాధారణ సౌందర్యం.

"మీరు... మీరు అచ్చు శాంతి వర్ణించినట్టుకాదు ఇంకా గొప్పగా ఉన్నారు."

"ముందు మీరు లోపలికి రండి. శాంతి వర్ణనలూ, మీ పొగడ్తలూ, తర్వాత తేలిగ్గా, తీరిగ్గా చెబుదురుగాని" అందామె అతని చెయ్యిపట్టుకుని లోపలికి లాగుతూ అతని శరీరం రోమాంచితమైంఇ.

తలుపు మూసి ఇటు తిరిగింది కస్తూరి. తన చూపుల తీక్షతకు సిగ్గుపడ్డాడు చక్రవర్తి. అయినా దృక్కుల్ని మరల్చుకోవడం సాధ్యం కాలేదతనికి.

ఆమె మీద నుంచి వస్తున్న చానల్ 5 పరిమళం అతన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

"కూర్చోండి. ఐ విల్ గెట్ సంథింగ్ ఫర్ ఆజ్ టు డ్రింక్."

కాసేపటికి ట్రేతో తిరిగొచ్చిందామె బ్లడీ మేరీ.

"శాంతి చెప్పింది మీరు బ్లడీమేరీ లైక్ చేస్తారని."

"అయితే నా గురించి మీకంతా తెలుసన్నమాట."

"ఆ. ముఖ్యంగా మీ అలవాట్లు, ప్రయాణాలు..."

"మీ గురించి నాకూ తెలుసు. చాలా చాలా చెప్పింది శాంతి. మిమ్మల్ని కలుసుకోకుండా ఇండియా రావద్దంది. మీరు మంచి స్నేహితులుగదా. సారీ... మీరు బాంబే వచ్చినప్పుడు నేను లేను."

లైమ్ జ్యూస్ సిప్ చేస్తోందామె.

"మీకు... మీ వారు...." ఎలా అడగాలో అర్థం కాలేదు చక్రవర్తికి.

"ఇట్‌వజ్ యాన్ అన్‌ఫార్చునేట్‌థింగ్, కారు యాక్సిడెంట్లో పోయారు..."

సానుభూతితో అతని మనసు నిండిపోయింది.

"చాలా రోజులైంది. ఆయన లేని జీవితానికి మెల్లగా అలవాటుపడుతున్నాను"

డ్రింక్ పూర్తిచేశాడతను.

"చాలా బాగా చేశారు. ఎ పర్‌ఫెక్ట్‌లీ మిక్స్‌డ్ డ్రింక్."

"ఎన్నిసార్లు, ఎంతమందితో చెప్పి వుంటారో ఆ మాట. అలవాటు ప్రకారం రాలేదుకదా మీ నోటినుంచి."

"నో... నో... నాకు టేస్ట్ తెలుసు ఎవర్ని అభినందించాలో కూడా బాగా తెలుసు."

కాసేపయిన తర్వాత లేస్తూ అందామె

"ఐ విల్ ఆరేంజ్ అవర్ డిన్నర్."

ఆమె లోపలికి నడుస్తుంటే వెనకనుంచి చూస్తూ, తనలో చోటుచేసుకుంటున్న భావాలకు చక్రవర్తి యిబ్బందిపడ్డాడు. పాలరాతి శిల్పంలా కదిలిన ఆమె గమనం అతనికి సౌందర్యవిన్యాసంలా తోచింది. శాంతి యింత అందంగానూ వుంటుంది. కస్తూరిపట్ల, ఆమె అందంపట్ల తనకి కలుగుతున్నలైంగికాకర్షణ. కుతూహలం అని సరిపెట్టుకో జూశాడు.

"రండి" అందామె.

చాలా లైట్ డిన్నర్, ఫార్మాలిటీస్ ఏవేవో పాటించి టేబుల్ అంతా డెకొరేట్ చెయ్యలేదామె. డిషెస్‌తో వున్న మూడు వెజిటేరియన్ కర్రీలూ ఆమె మంచి కుక్ అని చెప్తున్నాయి.

"వద్దు, వద్దు" అంటూ అడ్డుపెడుతున్న అతని చేతిని పక్కకు లాగేస్తూ బలవంతాన వడ్డిస్తోందామె.

పది నిమిషాల తర్వాత.

"ఓ.... వాటే సంప్చుయస్ డిన్నర్", అన్నాడతను లేస్తూ. నిజంగానే అతనికి హెవీ అయింది.

"అప్పుడేనా, ఇంకా స్వీట్ రుచి చూడనే లేదు" అందామె.

"ఓ... నో... ఐకాంట్. గాలికూడ పీల్చగలిగే స్థితిలో లేను" అన్నాడతను లివింగ్‌రూంలో పచ్చార్లుచేస్తూ.

డైనింగ్ టేబుల్ సర్దేసి ఫ్రిడ్జ్‌లో నుంచి కస్టర్డ్ తీసి పట్టుకొచ్చింది కస్తూరి. ఏదో జర్నల్ తిరగేస్తున్నాడతను.

ఆమె ఉద్యోగం మీద, అతని వ్యాపారాలమీద సంభాషణ నడిచింది చాలాసేపు. శాంతి గురించి మరి కొంచెంసేపు

తనువున్న సాన్నిధ్యం ఓ మామూలు మనిషి దనుకోలేకపోయాడతను. తనేదో అసాధారణ ప్రభావానికి లోనవుతున్నట్లు, ఆమెకూడా తనపట్ల ఆకర్షితులైనట్లు తోచిందతనికి.

"మీకు పిల్లలంటే చాలా యిష్టం అనుకుంటాను" అన్నాడతను గోడలకు తగిలించబడిన యెన్నో అందమైన పాపాయిల బొమ్మలను చూస్తూ,

"అందుబాటులో లేని ఆనందం అంటే అందరికీ ఇష్టమేననుకుంటాను" అంది ఆమె.

ఒక్క క్షణం మౌనం వహించాడతను. ఏం మాట్లాడబోతున్నాడో అతనికి పూర్తిగా తెలియలేదు. ఇంపల్సివ్‌గా చెప్పసాగాడు.

"వెల్, మీరు కావాలీ అనుకుంటే అదంత కష్టమైన పనేమీకాదు. కాలం మారుతోంది. మనుషుల ప్రవర్తన మారుతోంది. సంఘం ప్రజలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. వ్యక్తిత్వాలు మెరుగుపడుతున్నాయి. మంచికీ, చెడుకీ, ధర్మానికీ, న్యాయానికీ అదివరకున్న పరిథులు మరింత విస్తృతమవుతున్నాయి. సంస్కారం, సభ్యత తెలిసినవారెవరైనా సరే ఇతరులకు కష్టం కలగకుండా, ఇది తప్పుకాదు అనుకుని ఓ పని చేయగలిగితే అది నిజంగానే తప్పుకాదు. మీరు మళ్ళీ పెళ్ళి ఎందుకు చేసుకోరు?"

"పెళ్ళి. అది నా వల్ల అయ్యేపనికాదు. పిల్లల కోసం మళ్ళీ ఎటాచ్‌మెంట్లు... ఆయన స్థానంలో మరొకరు. ప్చ్. ఊహించలేను." అంది కస్తూరి.

చక్రవర్తి గొంతు ఉద్వేగపూరితంగా, అతనికేచిత్రంగా ధ్వనించింది. మాటలు వెలువడుతున్నప్పుడు అవి ఉద్దీప్తమై కనిపించాయి. ఆమెను దేనికో సంసిద్ధం చేయాలని తను తాపత్రయపడుతున్నట్టు అతనికి తోచింది.

అణుచుకోబడ్డ కోరికలకన్న నిరంకుశమైన శక్తులేమీ లేవు. అవి మనిషి జీవితాన్ని, ఆలోచనా విధానాన్ని శాసిస్తాయి. ఆరోగ్యం మీద దెబ్బతీస్తాయి. మానసికంగా పెడదారిని పట్టిస్తాయి.

"పిల్లలు శాశ్వతమైన అనుబంధాలవల్లనే ఉద్భవించరు. సహజమైన పద్ధతులు సహకరించకపోతే ఆర్టిఫిషియల్ మెథడ్స్ ఎటూ ఉన్నాయి."

తన మోటివ్ ఏమిటి? ఎందుకింత చొరవ తీసుకుంటున్నాడు. తొందరపడ్డాననుకున్నాడు చక్రవర్తి.

స్త్రీ పురుషుల మధ్య కొన్ని హద్దులున్నాయి. సభ్యతగల ఏ ఒక్కరూ వాటిని తేలిగ్గా అతిక్రమించలేరు.

"నేనింకా రెండు మూడురోజులుంటాను. హోటల్‌కు రండి ఓసారి. వుయ్ విల్ హేవ్ డిన్నర్ దేర్" అన్నాడు లేచి నిలబడుతూ.

కస్తూరి ఆలోచనల్లో శాంతి. చక్రవర్తి ఆమెకి నచ్చాడు. అయితే అతనిపట్ల తనకు కలుగుతోన్న అభిమానం, ఇష్టం శాంతి భర్తగా మాత్రమే అనిపించింది. శాంతి చెప్పిన విషయమై తను ఎటూ నిర్ణయించుకోలేదు. అది అంత తేలికైన విషయంకాదు. శాంతి గురించి తను చక్రవర్తికి చెప్పాలనుకున్నదికూడా చెప్పలేదు.

"అలాగే వస్తాను" అంటూ లిఫ్ట్ వరకూ అతన్ననుసరించింది.

గుడ్‌నైట్ చెప్పుకుని విడిపోయారిద్దరూ

* * *

కస్తూరి రాకకోసం లాన్‌లో కూర్చుని ఎదురుచూస్తున్న చక్రవర్తిలో సంఘర్షణ ఉధృతమౌతోంది. ఏదైనా సంఘటన పరిపరి విధాలుగా ఆలోచించడానికి ఆపకాశం యిస్తే... వ్యక్తి స్వంతమైన భావరాగాలు వాస్తవానికి రంగులు వేసి చూపిస్తాయి. చీకట్లో చిక్కని వర్ణాలు చూస్తున్నట్లయిందతనికి. తేడా తెలియదు. స్వచ్ఛమైన సంస్కారానికి, ఆమాయకత్వానికి, విచ్చలవిడితనానికి రూపం ఒక్కటే. కస్తూరి తనవల్ల యిష్టాన్నీ. లైంగికాసక్తినీ చూపించిందని అతనికి తోచింది. తనంటే కుతూహలం, శాంతి భర్తనన్న ఆదరమే కాదు. ఆమె ప్రవర్తనలో మరేదో వుంది. అదేమిటి? హూ విల్ టర్న్ ద కార్డ్స్ ఫస్ట్?

యవ్వనం సడలి ముదిమికి చోటిస్తున్న తన శరీరం శాంతికి మాత్రమే అంకితమైన అంతరంగం... కస్తూరికి అంతగా ఎందుకు స్పందించాయి? కొన్నేళ్లుగా శాంతి క్రియేట్ చేస్తూ వస్తున్న ఆమె రూపం తన మస్తిష్కపు పొరల్లో బలంగా ముద్రించబడి, ఇప్పటి పరిచయంతో జీవం పొంది పీఠం వేస్తున్నదా?

పరుగెత్తి, పరుగెత్తి కంగారూ పిల్ల మార్సుపియంలో ఒదిగినట్లు చక్రవర్తికి ఆమె గుండెల్లో ఒదిగి రావాలనిపించింది. మొన్నటి నుంచీ ఆమె తన ఆలోచనలో లేని క్షణాలంటూ లేవు.... తను శాంతికి దూరమౌతున్నాడా? శాంతి... కస్తూరి భయపడ్డాడతను.

శాంతికి.... గెలాక్సీల నుంచీ ఏ దేవతలో కరుణించి తన కనుగ్రహించిన కాంతి పుంజానికి దూరం కాకూడదు.... కాకూడదు.

ఆలోచనల్లోని స్ప్లిట్‌ని వొప్పుకోలేక అసహనంగా కుర్చీలో కదిలి గ్లాస్‌మీద పేరుకుంటున్న నీటి చుక్కల్ని చూపుడువేలితో కలిపేశాడు.

ద్వంద్వాలకు అతీతుడు కాని మనిషి పిరికితనానికి, ధైర్యానికి, నీతి అవినీతులకూ మధ్య ఏ ఒక్క బిందువు పడ్డా స్థిరంగా నిలబడలేదు. ప్రవర్తనలో తక్కువసార్లు, ఆలోచనల్లో ఎక్కువసార్లు అటూ యిటూ సంచారం చేస్తాడు.

కస్తూరితో పరిచయం యింకా పెంచుకోవాలి అనుకుంటున్న అతని గుండె లోతుల్లోనుంచి శాంతి ఆర్ద్ర నయనాలు పరికిస్తునే వున్నాయి.

"ఐయామ్ సారీ ఫర్‌ది డిలే"

సగం కళ్ళను మూసిన రెప్పల్ని బరువుగాపైకెత్తి నవ్వాడు చక్రవర్తి. కస్తూరిని చూసి కూర్చుంటున్న ఆమెను పట్టిపట్టి చూడకుండా నిగ్రహించుకోవడం మళ్ళీ సాధ్యం కాలేదతనికి మొదటిసారిలాగే. ఆత్మ తొంగి చూస్తున్న సజీవ నయనాలు. అద్భుతమైన ఆమె శరీర సౌష్టవంతో అతని కన్నులు నిండివిప్పారాయి. ఏవో స్వాప్నిక లోకాల్లో నిద్రిస్తున్న ఓ దేవతామూర్తి హఠాత్తుగా లేచి వచ్చి తన ముందు కూర్చున్నట్లయింది. ఎందుకో అతని గొంతు తడారింది. పెదాలు వణికాయి.

"ఏమిటి అదోలా వున్నారు." అంది కస్తూరి.

తనలాగే.... ఆమె కూడా కాదుకాదు తనకే ఏవో భ్రమలు. స్పాంటేనిటీ తెచ్చిపెట్టుకోవడం కష్టమైందతనికి.

"మొన్నటికీ ఇప్పటికీ చాలా తేడా కనబడుతోంది మీలో. వీట్ కార్పొరేషన్‌తో మీ డిస్కషన్స్ ఏమైనా...." కొంచెం ఆందోళన మిళితమైన స్వరం.

"లేదు, లేదు. ఇటీజ్ ఫర్‌ఫెక్ట్‌లీ ఓకే. ఎల్లుండి మళ్ళీ అగ్రిమెంటు రాసుకుంటున్నాం మనకు అనుకూలంగా. అయినా అదినన్నంత ఇన్‌ఫ్లుయెన్స్ చేసిందనుకోను." అన్నాడు చక్రవర్తి.

"మరి...." ఆగిందామె.

ఆమె మొన్నటిలానే వుంది. ఆ రూపంలో మరింత కళ తప్పించి, ఆ కళ్ళలో మరింత వెలుగు తప్పించి

సిగ్గుపడ్డాడు చక్రవర్తి తనెందుకు.... యవ్వనపు తొలిరోజుల్లో శాంతిని చూసి రియాక్టయినట్లవుతున్నాడు ఆమెకి. చెప్పుకోగలడా తన కల్లోలాన్ని? తన వ్యక్తిత్వాన్ని చంపుకుని ఆమెకు నివేదించుకోవాలా? ఇది ప్రేమా? ప్రగాఢ వాంఛా? దాచుకోవడం

కష్టమైందతనికి

''నేను మునుపెన్నడూ యెరగని ఓ మహత్తర ప్రభావానికి లోనయ్యాననుకుంటున్నాను. అదీ మీ మూలంగా, ఐ వజ్ మూవ్డ్ టూ ద కోర్ ఆఫ్ మై ఎగ్జిస్టెన్స్."

ఆ మాటలు వెలువడటానికి అతనిలో జరిగిన సంఘర్షణనీ. అతని నిస్సహాయతనూ అంచనావేసింది కస్తూరి. ఆమె ఆలోచనా ప్రవంతి వేగాన్ని పుంజుకుంది.

"మీ అపార్ట్‌మెంట్ నుంచి తిరిగొచ్చిన తర్వాత నా మనసులో లెక్కలేనన్ని సైక్లోన్లు.... సైమూన్లు...." చక్రవర్తి ఆగాడు తననుతాను అదుపులో పెట్టుకునే ప్రయత్నంలో. అయినా అతనికి తన గుండె పొరలువిప్పి తన మస్తిష్కంలోని మిలియన్ల నాడీ కణాలను పరిచి కస్తూరికి చూపించాలనిపించింది. పరిణామం గురించి వూహించసాగాడు.

విసురుగా లేచిన అతన్ని పరీక్షగా చూస్తోంది కస్తూరి.

"క్షమించండి.... అయాం లిటిల్ డిస్టర్బ్డ్ టుడే. రండి: లోపలికెళ్దాం"

వేగంగా నడుస్తున్న అతన్ని విస్మయంగా చూస్తూ అనుసరించింది కస్తూరి.

ఏదో తప్పుచేసి అమ్మ తిడుతుందేమోనని పరిగెడుతున్న ఐదేళ్ళ బాలుడు ఆరడుగుల ఎత్తు ఎదిగినట్టు అనిపించిందామెకు.

పరిస్థితి కొద్దికొద్దిగా విశదమౌతోంది. ఈ విశ్వపు గతి, మనుషుల మనస్థితి అదుపులో వుండవు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే సూత్రాలు అవగతమైతాయేమోగానీ నిబంధనం కుదరదు.... ఎందుకిలా? సాధ్యమా?

డోర్ తెరిచి పట్టుకున్నాడు. నాబ్ అతని చేతిలో బిగిసి వేళ్ళు కంపించాయి. అతనిలో ఆలోచనల వేగం తగ్గింది.

"కాసేపు కూర్చుని తర్వాత డిన్నర్‌కి వెళ్దాం శాంతీ" అన్నాడు కూర్చుంటూ.

సూట్‌ను పరికిస్తున్న కస్తూరి ఆ పిలుపుకు విచిత్రంగా చూసింది.

"నేను కస్తూరిని... శాంతిని కాను."

తను అసంకల్పితంగా కస్తూరిని శాంతీ అని పిలిచినట్లు అప్పుడతనికి స్ఫురించింది. "స్లిప్ ఆఫ్ ది టంగ్" అన్నాడు.

"శాంతి ఫోన్ చేసిందా? అసలేం జరిగింది? నా మూలంగానని ఏదో అన్నారు ఏమిటది?"

"లేదు.... శాంతి ఫోన్ చెయ్యలేదు.... ఇటీవల తను నాకు దూరమౌతోందన్పిస్తోంది. నేనిక్కడికి వచ్చేముందు ఆమె ప్రవర్తన ఏంబావుండలేదు. నన్ను తప్పుకు తిరిగింది. మిమ్మల్ని చూశాక నా మనసు నిలకడ తప్పింది... నన్ను కుసంస్కారి అనుకోరుగదా...

ఐ వాంట్ యు కస్తూరీ.... మీరు నాకు కావాలనిపిస్తోంది... గాఢంగా ఎంతో బలంగా...." అతని గొంతు బొంగురు పోతోంది.

అతని కెదురుగా వున్న సోఫాకేసి నడిచిందామె. అతన్నుంచీ కళ్ళు తిప్పుకోకుండా. చక్రవర్తి పచార్లు చేయసాగాడు. కాలం ఆలోచన బరువుతో మెల్లగా పాకుతోంది.

మాతృగర్భంలో గుండెలచప్పుడు... బాల్యంలో ఉయ్యాల ఊపు.... యవ్వనంలో శాంతి ప్రగాఢపరిష్వంగం.... మళ్ళీ తనక్కావాలి... తన నామె చేరదీస్తుందా! తన మాటల్ని ఎలా తీసుకుంటుంది?

విండో గ్లాసులపై వెలిగి, ఆరే నియాన్ లైట్ల వెలుతురు ప్రతిఫలించడం మానలేదు. తపస్సులో మునిగినట్టు కస్తూరి శిలైంది. ఆమె ఇప్పుడు చక్రవర్తిని చూడటంలేదు. ఆ చూపులు గమ్యాన్ని వెదుకుతున్నాయి. తన ఆలోచనల్ని కూడదీసుకునే ప్రయత్నంలో ఆమెవాటిలో సమాధి అయింది. ఆమె మౌనం హిమపాతమై కురిసి ఆమంచుకు అతను బరువెక్కిపోతున్నాడు.

"చక్రీ."

అతను నిలబడ్డాడు.

"చక్రీ వాటీజ్ హాపినింగ్ టూయూ. కమ్ హియర్."

ఆమెకేసి వస్తున్న అతనికి ఆమె కంఠ నాళాల చారలు పచ్చగా, బలంగా కొట్టుకోవడం కనిపించింది. ఆమెను చేరుకున్నాడతను. అతని తల ఆమె మోకాళ్ళపైన. ఆమె చేతులు అతని తలపై.

చక్రవర్తి ఆ క్షణంలో ఏడవాలనిపించింది. ఆమె ఒళ్ళో మూసుకున్న అతని కళ్ళముందు వెలుగుల ముద్దలు కరిగి అతని కళ్ళనుంచి నీళ్ళధార.

ఎప్పటిదీ అనుబంధం?.... తన గుండెలోతుల్లోకి చొచ్చుకుపోయి అంతర్లీనమై పోయిన అర్థంకాని ఎన్నో మధురస్మృతులను ఆవిష్కరిస్తూ..... తనను మత్తులో సుఖంలో విషాదంలో.... నిరాశలో.... ముంచేస్తున్న ఈ అద్భుత శక్తి తనకే జన్మలో ఎన్ని యుగాల వెనక పరిచయం!

"లేచక్రీ" అందామె. జీవం పోసుకున్న ప్రాచీన గ్రీకు శిల్పంలా, అతను లేచాడు.

ఆమె తల అతని ఛాతీవరకూ వచ్చింది. ఆమె పాపిట తిమిరావృత కాంతిరేఖ అతని కళ్ళకింద.

కస్తూరి ఒక్కసారిగా మునివేళ్ళపై కెరటంలా లేచింది. చక్రవర్తి చేతులు ఆమె నడుం ఒంపుల్లో అమిరి ఆమెను పైకి లాక్కున్నాయి. స్థిరంగా నిలిచిన ఆమె పెదాలు దానిమ్మ మొగ్గల్లా విడి ఆహ్వానిస్తున్నాయి. ఆమె నాలుక పై వరస పళ్ళను తాకింది. భాష

రాని ఈవ్ నోటినుంచి వెలువడినట్లు ఏదో అస్పష్టమైన శబ్దం ఆమె గొంతు నుంచి సాగి అతని గొంతులో లయించిది.

ఆమె కౌగిట్లో అతను పురుషయ్యాడు. ప్రకృతిని చూసి దిగ్భ్రాంతుడైన అనాది మానవుడిలా, ఆధునిక సంస్కృతిని చూసిన ఆస్ట్రేలియన్ ఎబొరిజిన్‌లా ఆమెను చూసి నిశ్చేష్టుడైన అతన్ని అక్కున జేర్చుకుని సేద దీర్చిందామె. అస్థిత్వపు భయాల్ని, ఆన్‌సర్టెనిటీలనూ, వైక్లబ్యాల్ని ఆమె ఒడిలో అతను, అతని ఒడిలో ఆమె మరిచిపోయారు. లైంగిక నాడులు వీణాతంత్రులై ఆమె శరీరం అతని రాగాలు పలికింది.

*　　*　　*

"యువర్ పంబర్ రింగింగ్ మేడమ్" అంది అపరేటర్.

"థ్యాంక్స్" అంది శాంతి వణుకుతున్న చేత్తో రిసీవర్ పట్టుకుని.

రెండో రింగ్ దాటకుండానే అవతల క్లిక్‌మంది.

"కస్తూరి... శాంతిని... ఏమయింది?"

"అంతా నువ్వనుకున్నట్టే జరిగింది. ఆ అన్నట్టు కంగ్రాచ్యులేషన్స్ నీకు ఫర్‌ఫెక్ట్ హజ్బెండ్"

"ఛీ పో సిగ్గులేనిదానా."

"నాక్కాదే సిగ్గులేనిది.... నీకే.... లేకపోతే..."

"సర్లే.... సర్లే ఇంతకీ ఎప్పుడొస్తున్నారట?"

"రాక ఇక్కడేం నాతో కాపురం చెయ్యబోవడంలేదులే. అయినా నేనేం అంత స్వార్థపరురాలిని కాను నీ మొగ్గుణ్ణి కొంగుకి ముడేసుకోవడానికి... పువ్వుల్లో పెట్టి అప్పగించేస్తాను. సరేనా. ఆ.... నా సజేషన్ ఎంతవరకూ పనిచేసింది..."

"ఫాలో అవుతున్నాను. మంచి రిజల్ట్స్ వచ్చే అవకాశాలున్నాయి" అంది శాంతి.

"చక్రవర్తితో అంతా డిస్కస్‌చేశాను. నువ్వతనితో ఏమీ చెప్పకు. తనంతట తాను చెబితే తప్ప. నువ్వా టాపిక్ యెత్తవద్దు."

"అలాగే... గుడ్‌నైట్".

ఫోన్ పెట్టేసిన శాంతి గుండె వేగంగా కొట్టుకుంటోంది. తను అనుకున్నది అనుకున్నట్టు జరిగినందుకు అది గెలుపనుకోవాలా?

ఇన్నాళ్ళూ తనను తప్ప మరో ఆడదాన్ని ఎరగననే మొగుడి శీలం కేవలం అవకాశవాదం అయిపోయినందుకు, తను అతన్ని ప్రభావితం చెయ్యలేకపోయినందుకు ఓటమి అనుకోవాలా?

తను చేసింది త్యాగమా? లేక భర్తకు పరీక్ష పెట్టిందా? ఏ ఆడదానికైనా ఇలాంటి ఆలోచనలు కూడా వస్తుంటాయా? ఇదంతా తనకు పుట్టిన బుద్దేకదూ.... తన ఆలోచనల్లో పెర్వర్షన్ ఏమైనా ఉందా! చక్రవర్తి కోసం ఎదురు చూసిచూసి. తన కతను ఎలాగూ అందని ఆనందమే కాబట్టి కనీసం తన స్నేహితురాలికైనా ఆ అదృష్టం లభించాలని ఆరాటపడిందా... కాదు... కాదు... ఇవేవీ కాదు... తనకు పిల్లలు లేకపోవడం పిల్లలంటే తనకుండే అపరిమితమైన అనురాగం. కస్తూరి అంటే తన జీవితంలో అంతర్భాగం అనే భావనా, ఇవన్నీ తన ఆలోచనకు కార్యరూపాన్ని ఇచ్చాయి. చక్రవర్తి కేవలం ఇందులో ఓ సాధనం మాత్రమే. అతని ప్రమేయం ఏమీలేదు అతన్ని తప్పుపట్టడానికి వీల్లేదు.

కానీ... కానీ... తనలో లేని సుగుణాలెన్నో కస్తూరిలో ఉన్నాయి ఒకవేళ చక్రవర్తి ఆమెని ఇష్టపడి తనని ఒకవేళ...

బలంగా కణతల్ని నొక్కుకుంది శాంతి. ఆమెని చిన్ననాటి నుంచీ వెంటాడుతున్న ఇన్‌సెక్యూరిటీ ఫీలింగ్స్ పడగలు చాచి బుసలు కొట్టాయి. ఆ విషజ్వాలల్లో ఆమె ఇంటిగ్రిటీ ఛిద్రమవడం మొదలైంది. తనేదో అపరిచిత పరిసరాల్లో వున్నట్టు భావించసాగిందామె చక్రవర్తి నిజంగానే తనకు దూరమైపోతాడన్న ఆలోచన ఆమెను లొంగదీసుకోసాగింది.

తను తట్టుకోలేదు ఈ ఒంటరితనాన్ని. ఆలోచనల్ని. సృష్టి నుంచి విడిపడి శరీరంలో చిక్కుకున్న ఆమె చైతన్యం, ప్రేమ రాహిత్యంతో, భద్రతా లేమితో మెలుకువలో, తనను తాను సమాధి చేసుకోవాలని ఆరాటపడిది. నిస్సహాయురాలిలా, నిద్రలోంచి లేచిన దానిలో ఆ టాయ్‌లెట్ కేసి నడిచింది.

వణుకుతున్న చేతులతో తలుపులు బిగించి గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద తనకు ఓ హిప్పీ యువకుడిచ్చిన పాకెట్ విప్పింది. అతను చెప్పిన సమాధి తనక్కావాలి. తన కాళ్ళు తననిక నిలపలేవు.

అతను చెప్పినట్టు, దాన్లో పౌడర్ని, కుడి నాసికా రంధ్రాన్ని బొటనవ్రేలితో మూసి బలంగా పీల్చింది.

అగ్నిపర్వతంపై హిమపాతంలా ఆమె శరీర చైతన్యాల్ని లైసర్జిక్ యాసిడ్ డై ఇథాలమైడ్ మెల్లగా లోబరుచుకోసాగింది.

కాసేపటికి తాత్కాలికమైన ఉన్మాదస్థితిలో ఆమెను విభ్రమలు లొంగదీసుకుని, ఆలోచనల్లో తార్కికత లోపించి మార్మిక లోకాల్లో ఆమెను విహరింపజేయసాగాయి. ఆమె పరిసరాలు సౌందర్యభరితమై ఆమెను ఆహ్లాదపరిచాయి.

శాంతి పసిపాపైంది. అమ్మా, నాన్న, అన్నయ్యల లాలనలో పెరిగి పెద్దదైంది. చక్రవర్తితో ప్రేమా, పెళ్ళీ, చక్రవర్తి ఆమెను క్షణమైనా విడిచివుండడు, ఇంటినిండా

పిల్లలు బిజీగా వాళ్ళ అవసరాల్ని గమనిస్తూ శాంతి.

ఒక్కసారిగా మలబార్ హిల్స్‌మీద యెగురుతోన్న విమానశబ్దం ఆమె మనోఫలకంపైన ఉన్న దృశ్యాన్ని మార్చేసింది.

ఆరోరా రంగుల్లో, అస్తమిస్తున్న సూర్యకాంతిలో ప్రయాణంచేసి తనూ, చక్రీ ఏదో మైదానంలో విమానం ఆగితే దిగారు. కస్తూరి వాళ్ళను ఆహ్వానిస్తోంది. ఏవో మాటలు. కస్తూరి అంత అందంగా తనూవుంది. కస్తూరి అంత చక్కగాతనూ మాట్లాడుతోంది. ఇంతలో శాంతి అన్నయ్యవచ్చాడు వాళ్ళ దగ్గరకు. విమానం ఎక్కాలంటూ. చక్రవర్తి ఆమెకేసి చూశాడు. "వెళ్ళిరా అన్నయ్యా. ఈ విమానం మా కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది. యాక్సిడెంట్లు జరగవు" అంటూ ముందుకు నడిచింది శాంతి.

"ఎంత అదృష్టవంతురాలివి నువ్వు. నీకన్నీ వున్నాయి" అంది కస్తూరి. గర్వంగా నవ్వింది శాంతి. ఇవ్వడంలో గల ఆధిక్యత పుచ్చుకోవడంలో లేదని ఆమెకి తెలుసు.

"చక్రవర్తి అడుగుతున్నాడు, శాంతిని ఆమెకు ఏం కావాలో, కస్తూరి చెబుతోంది. కానీ ఆ గొంతు తనదే. శాంతి ఆశ్చర్యపోయింది. "శాంతికి ఏమీ వద్దు. మీరూ, పిల్లలు పట్టణ జీవితంతో సౌఖ్యాలతో విసిగిపోయిందామె. మీ వ్యాపారంతో మరీనూ."

ఈసారి తనే మాట్లాడుతోంది. కస్తూరీ, నువ్వు రా మాతో. మాతోనే వుండు. నువ్వెప్పుడూ నాలో భాగానివే, ఎప్పుడన్నా అసూయపడ్డా, నువ్వంటే ఆరాధన, గొప్ప ఇష్టం నాకు, వస్తావా..." ఇంకా ఏదో అంటోంది. చుట్టూవున్న వస్తువులు, చెట్లు ముందుకు జరిగి ఆమెని వింటున్నాయి. జనం గుంపులుగా వస్తున్నారు, ఆమె మాటలు సంగీతమై ఆమెకే వినిపించాయి.

కలలోలా లేచింది శాంతి. తలవిదిల్చి మ్రోగుతున్న స్టీరియోని ఆపెయ్యాలని చుట్టూ చూసింది. అది టాయిలెట్. నవ్వుకుని, లేచి తలుపుతీసి తడబడుతున్న అడుగులతో బయటకు వచ్చి ఆ ప్యాకెట్ వార్డ్‌రోబ్‌లో పడేసి, బెడ్‌మీద వాలిపోయింది.

ఇప్పుడు అన్నీ వున్నట్లనిపించిందామెకి. ఏది కావాలనుకుంటే అదే వుండే లోకం. కళ్ళముందు కదిలిపోయే దృశ్యాల్ని ఏకాగ్రతతో చూడసాగింది. తనకు తెలీని, తనెన్నడూ వూహించని సంఘటనలు, సన్నివేశాలూ, రంగులూ, డిజైన్లూ, వ్యక్తులూ, పరిసరాలూ గిరగిరా తిరిగిపోతున్నాయి. ఆమె కళ్ళ ముందు. ఆమె నవ్వింది. అంతలోనే ఏడ్చింది. భ్రమలు ఆమెను వోదార్చాయి, మనోఫలకంపై మెదిలే దృశ్యాల్ని చూసిచూసి అలిసిపోయి మెల్లిగా నిద్రలాంటి స్థితిలోకి జారిపోయిది.

* * *

ఎలా.... ఎలా, ఎలా చెప్పాలి శాంతికి. అసలు చెప్పాలా అక్కర్లేదా? చెప్తే

ఆమెరియాక్షన్ ఏమిటి? ఎలా రిసీవ్ చేసుకుంటుంది ఈ విషయాన్ని, జరిగినదాన్ని దాచి ఆమెను మోసం చెయ్యలేడు. చెప్పి సంసారాన్ని నరకం చేసుకోలేడు.

కస్తూరి మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి.

"శాంతి భర్తవి నువ్వు. నా ప్రియుడివి కాలేవు. శాంతి నిర్లిప్తతో సుళ్ళు తిరిగిన నీ అంతర్యం, తల్లికి దూరమైన బిడ్డలా కలతపడితే, నీకేం చేయాలో తెలిసికూడా, డబ్బు సంపాదన మత్తులో అణుచుకున్నావు. బయట పడనిచ్చావుకావు. పర్యవసానంగా నా ఆదరణలో, అప్యాయతలో శాంతి కన్పించింది నీకు, ఎన్నో సంవత్సరాలుగా వినీ... వినీ నీ అంతర్జగత్తులో శాంతీ నేనూ మెర్జ్ అయిపోయాము."

తనేమీ మాట్లాడలేదు. మాట్లాడ లేక పోయాడు. ఆమె హృదయశిఖరాగ్రాలపై పదిలంగా అమిరిన తన మొహం. చెవులకు ఆమె గుండెలచప్పుడు. ఆర్షఋషి ముందు శిష్యుడిలా తను, ఆమె మాటలు వింటూ.

"నేను నిన్ను ప్రేమించలేదు. నీలా కదిలిపోనూలేదు. నీకు ప్రతిధ్వనించాను. నిన్ను ప్రతిఫలించాను. ఈ విశిష్టక్షణాల్లో బ్రతికి అమ్మనవుదామన్న ఆశ నాకులేకపోలేదు, అయితే నిన్ను అట్లాంటిస్థితిలో వదిలిపెట్టలేకపోయాను. ముఖ్యంగా నువ్వు నెలకొ రెండు నెలలకో ఇంటి మొహం చూస్తున్నా, ఆ దేవత నిన్నెప్పుడూ తోసి వెయ్యలేదు. నా సూచనపైనే నిన్ను తప్పుకు తిరిగింది. ఇన్నేళ్ళకు ఆమె ప్రవర్తనతో. ఆమె అసంతృప్తినీ గుండెను తాకింది. ఆమె బాధను కొన్నేళ్ళుగా నువ్వు గమనిస్తూనే ఉన్నావు. అయితే శాంతి నీదేనన్న నమ్మకం, శాంతి కోసమే నీతాపత్రయమంతా అన్న భ్రమనిన్ను కాపాడాయి.

ఆమెను బాంబేలో కలిసినప్పుడు అర్థం చేసుకున్నాను. నిన్ను ఆమె ద్వారా, ఈ మన పరిచయం ద్వారా అర్థం చేసుకోగలిగాననుకుంటున్నాను. శాంతిని మించిన సంపదేమీ లేదు నీకు. ఇప్పటి ఆస్తిపాస్తుల్ని చూసుకుంటూ, శాంతిని అట్లా వదిలెయ్యకుండా వుండటమే దీనికి పరిష్కారం. శాంతిని కాపాడుకోవాలి మనం. అది నీ చేతుల్లోపని.

చిన్నప్పట్నుంచీ ఆమె తల్లిదండ్రుల ఆదరణకు నోచుకోలేదు. ఆమెకంటే బాగా పెద్దవాడైన అన్నయ్య విమాన ప్రమాదంలో మరణించాడు. ఆమెను వాళ్ళ అమ్మమ్మ పెంచింది. ఆమె పేదరికం ఆమె జీవితానికి అవరోధం కాకుండా నేను చూశాను విజయవాడలో. తనంటే నాకెంతో ఆత్మీయత. శాంతి చాలా డిపెండెంట్. డబ్బన్నా, అదిచ్చే సౌఖ్యాలన్నా చాలా కూతూహలం దానికి. అయితే యాంగ్జయిటీ కూడా ఉంది. విమానమంటే భయందానికి.

ఇవన్నీ చాలనట్టు నీ ప్రవర్తన కూడా ఆమెను మరింత క్రుంగదీస్తోందని

నువ్వెప్పుడూ అనుకోలేదు. ఆమెను తప్ప మరో స్త్రీని ఎరగవు నువ్వు. ఎరిగుంటే నా ముందు ఇలా బయటపడిపోవు. నేను నిన్ను ఇష్టపడ్డాను. అయితే శాంతి భర్తగా కాక మరోలా మన పరిచయం జరిగుంటే, నీకు ప్రతిస్పందించేదాన్ని కాదనుకుంటాను, ఇప్పుడు నిన్ను నేను గుండె లోతుల్లో ఉంచుకోగలను కానీ శాంతితో నిన్ను పంచుకోలేను.

నా కెందుకో చాలా తృప్తిగా ఉంది. నాతో ఈ అనుభవానికి వెలకట్టి అయినా సరే నాకు మాటివ్వు. శాంతి బ్రతుకు పండిస్తాననీ. ఆమె కేకష్టమూ కలిగించననీ, ఆమెను విడిచి ఉండననీ...”

క్షణక్షణం తన కళ్ళముందు కస్తూరి యెదిగితే. ఆమె పాదాలమీదకు చక్రవర్తి జారిపోయాడు. నవ్వుతూ వీడ్కోలిచ్చిన ఆమెను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రయత్నిస్తూనే వున్నాడు.

శాంతి కస్తూరి చెప్పినంతగా క్రుంగిపోయిందా: అవును. తను గుర్తిస్తూకూడా ఏమీ చేయడంలేదు. ఇహ తను వూరుకోడు.... అమాయకత్వం, మంచితనం, స్త్రీత్వపు రూపుదాల్చిన తన శాంతి తనను దేవుళ్ళా కొలిచే శాంతి. కస్తూరి పరిచయంతో చక్రవర్తిని ఏదో తృప్తి ఆవహించింది. ఇక తనకేమీ అవసరం లేదు; శాంతి ఆనందం తప్ప

అయితే యిదంతా శాంతికి చెప్పాలా.? ఎయిర్‌హొస్టెస్ వచ్చి “సర్. ఫ్లైట్ లాండయి చాలా సేపయింది.” అంది.

ఇంటికి చేరుకునే లోపల ఓ నిర్ణయానికి వచ్చేశాడు. సిడ్నీలో కస్తూరితో తను కట్టిన అనుభవ హర్మ్యానికి ఇంజనీర్ తన భార్యేనని తెలియని చక్రవర్తి. అతన్ని చూడగానే జాలికలిగింది శాంతికి. నిజంఒప్పుకునే ధైర్యం అతనికెప్పుడూ లేదు ఇక్కడి నుంచీ అనుక్షణం ఏదేదో చెప్తూ, నటిస్తూ చాలా మామూలుగా కనిపించడానికి ప్రయత్నిస్తూ ఊరికే దొరికిపోతుంటాడు. అసహజత, కృత్రిమత్వంచోటు చేసుకుంటాయి. తమ మధ్య, అతన్ని ఇరకాటంలో పెట్టదల్చుకోలేదు శాంతి. చాలా కాజువల్‌గా అడిగింది కస్తూరి సంగతి. అతనూ చాలా నిబ్బరంగా సమాధానాలు చెప్పాననుకున్నాడు. ఆ మర్నాడూ, రెండో రోజూ,శాంతిలో మార్పులు కొట్టవచ్చినట్టు కనిపించాయి చక్రవర్తికి. ఈ శాంతి తనెరిగిన శాంతి కాదు. తనతో ఇన్నాళ్ళూ కాపుర చేసిన అమృతమూర్తికాదు. తన ఆరాధ్య దైవం కాదు. ఎందుకిలా మారిపోయింది? అర్థరాత్రి నిద్రపట్టనట్టు అటూ, ఇటూ బెడ్‌రూమంతా తిరుగుతుందెందుకని? ఏ ప్రశ్నకూ మొదటిసారి సమాధానం చెప్పదెందుకని? చక్రవర్తి కుంగిపోసాగాడు.

ఫస్ట్‌షోకి సినిమాకు వెళ్దామనుకున్నారు. శాంతి స్నానం చేస్తోంది. బట్టలు వేసుకుని తల దువ్వుకుంటున్నాడతను. బాత్‌రూంలోనుంచి కేక పెట్టిందామె.

"ఏవండోయ్. టవల్ మర్చిపోయాను కొంచెం యిలా యివ్వరూ." అదివరకు ఎన్నోసార్లు అలా తను కావాలని ఆమె బాత్‌రూంలో పెట్టుకున్న టవల్ దొంగతనంగా తెచ్చేసి దాచేసేవాడు. ఆమె లోపల్నుంచే అడిగితే తననుకూడా రానిస్తేనే ఇస్తాననేవాడు. తిట్టేది. అయినా మొండి పట్టుపట్టేవాడు. ఎన్నిసార్లు ఆ విషయంలో ఆమె గెలిచీ... తను గెలిచీ.

హూషారుగా ఆమె వార్డురోబ్ దగ్గరకు వెళ్ళి తలుపు తెరిచాడు. టవల్ తీసుకుని వెనుదిరగబోతున్న అతని దృష్టిని చీరల మధ్యలోనుంచి తొంగిచూస్తున్న ఓ పాకెట్ ఆకర్షించింది. విప్పి చూశాడతను. అంతే....

ఆ చీరల మధ్యనుంచీ ఓ పెద్ద కొండచిలువ లేచి అతన్ని చుట్టుకుని ఎముకల్ని పిండిచేసినా, అతనంత దిగ్భ్రమచెంది ఉండడు.

"వస్తున్నారా" పిలిచింది శాంతి.

"వస్తున్నాను" పాకెట్‌ను యథాస్థానంలో ఉంచేసి బాత్‌రూంవైపు నడవడానికి అతను ఎంతో శక్తి కూడదీసుకోవలసివచ్చింది.

కస్తూరి అర్థం చేసుకున్నంతగా తను శాంతిని ఎప్పుడూ అర్థం చేసుకోలేదు శాంతి ఇలా అవడానికి తనే అవకాశం ఇచ్చాడు. తననుతాను క్షమించుకోలేడు.

రెండు రోజులపాటు అతను గడ్డం చేసుకోలేదు, బట్టలు మార్చుకోలేదు, స్నానం లేదు, బయటకు వెళ్ళలేదు. భోజనం చెయ్యలేదు. ఎంతసేపూ కాఫీలు, సిగరెట్లు.

శాంతి పట్టించుకోలేదు ఇదేమని అడగలేదు.

ఓ నిర్ణయానికి వచ్చి ఫోన్ ముందు కూర్చున్నాడతను ఆ రోజూ. మర్నాడూ కాల్స్ చేస్తూనే ఉన్నాడు. తన వ్యాపారానికి సంబంధించిన వారందరికీ అవసరమైన యిన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు. ఎవరడిగినా అందరికీ డొమెసిక్ ప్రాబ్లమ్స్ అని చెప్పాడు. ఎవరికీ యెదురు ప్రశ్నించే అధికారం లేదు. ఆశ్చర్యమనిపించినా అందరూ నోరు మూసుకుని అతను చెప్పినట్టు విన్నారు.

ఆ రాత్రి హీరాచంద్ ఫోటోముందు నిలబడి మనసులో అనుకున్నాడతను.

"నన్ను యింతవాణ్ణి చేసింది మీరు. మీ ఆశీర్వాదబలం అండదండలు లేకపోతే ఈ రోజున చక్రవర్తి లేడు. మీరు నా మీద వుంచిన నమ్మకాన్ని యింతవరకూ కాపాడుకుంటూనే వచ్చాను. కానీ నా వున్నతిని చూడటానికి మీరీ లోకంలో లేకపోయినా పై నుంచి అంతా గమనిస్తుంటారని తెలుసు".

బంటుమిల్లి బస్సు దుమ్ము రేపుకుంటూ వచ్చి సింగరాయపాలెం తర్వాత సెంటర్లో ఆగింది. దిగిన పదిహేనుమంది ప్రయాణీకుల్లో శాంతీ, చక్రవర్తి వున్నారు. వాళ్ళను

చూడగానే చక్రవర్తి చిన్న మామయ్య చెయ్యి ఊపాడు. "ఏరా బాగున్నావా" అన్నాడాయన దగ్గరకు వచ్చి చెయ్యిపట్టుకుని. ఎంత తియ్యని పిలుపు.... ఎంతటి అభిమానాన్నీ, అనురాగాన్నీ సంతరించుకున్న రెండక్షరాలు.

"ప్రస్తుతం ఈ సమరాన్ని కొనసాగించడం ద్వారా నా వల్లకాదు. నా టైం అయిపోయింది. నా జీవితం అథఃపాతాళానికి దిగజారిపోవడానికి సిద్ధంగా వుంది. ఏ వ్యాపారమూ బ్రతుకులకు అవరోధం కాకూడదు. మనిషి జీవించడం కోమే వ్యాపారం చేయాలి. పరుగెత్తి, పరుగెత్తి, అలిసిపోయాను, కాదు బ్రేక్ పడింది. ఇంక ఎంత ప్రయత్నించినా మళ్ళీ ఈ పరుగు పందెంలో పాల్గొనలేను. విరమించుకుంటున్నాను. సోనాను క్షమించినట్టే నన్నూ క్షమించండి.

"శాంతి లేకుండా ఈ ప్రపంచానికి పట్టంకట్టుకోలేను. ఆమె కన్నుల్లో వెలిగే ఆనంద లోకాలకు రారాజునవడమే నాకు నిజమైన గెలుపు. ఎవరికోసం సంపాదించడం మొదలుపెట్టానో ఆమెకు కావలసింది నా సంపాదనకాదు, నేను ఈ పునరంకితానికి అనుమతినివ్వండి."

స్విట్జర్లాండ్ టెడ్ విలియమ్స్‌కు ఫోన్ చేశాడు సాధ్యమైనంత మృదువుగా పరిస్థితి వివరించి, అంతకుముందు ఆయనచేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పి, మంత్లీ, బ్యాంక్ స్టేట్‌మెంట్లు పంపించవలసిన అడ్రెస్ ఇచ్చాడు.

ఆఖరిసారిగా కస్తూరితో మాట్లాడాడు తన నిర్ణయాన్ని చెప్పాడామెతో. మనస్ఫూర్తిగా అభినందించిందామె. ఆనందించింది.

మనిషి దగ్గరతనాన్నీ చనువుగా, చొరవనూ వ్యక్తీకరించే చిన్నమాట ఇన్నాళ్లూ 'సర్' 'మిస్టర్'ల మధ్య తిరుగుతూ తను మర్చిపోయిన తనను మర్చిపోయిన సంభోదన తను యెంత పెరిగినా మామయ్యను మాత్రం యింకా "ఏరా"నే. ఒక్కసారి పదేళ్ళు వయసు తగ్గిపోయినంత వుత్సాహం వచ్చిందతనికి.

"అత్తయ్యావాళ్ళు కులాసా?" అడిగాడు చక్రవర్తి.

"ఆ....ఆ.... సామానేదీ"అన్నాడాయన:

"వెనకాల కార్లో వస్తుంది... ఇదిగో, ఈవిడగారి బలవంతమేఈ బస్సు ప్రయాణం" అన్నాడు శాంతి వైపు చూస్తూ.

ఏమిటమ్మా... అలా చిక్కిపోయావ్", అడిగాడాయన ఎడ్లను బండికడుతూ. చిన్నగా నవ్వి ఊరుకుంది శాంతి.

చుట్టూ చూశాడు చక్రవర్తి. వెనక తీక్షణత తగ్గి అస్తమిస్తోన్న సూర్యుడు. ఎదురుగా వెలిసిన నీలం కాన్వాసు లాంటి ఆకాశంపై పారదర్శకంగా వెలవెలా బోతున్న చంద్రుడు,

సంధ్యను అర్చిస్తూ పుడమి విసిరిన సింధూరంలా డొంకలోంచి లేస్తున్న ధూళి, హద్దులేర్పరిచిన పచ్చటిచెట్ల ఆకులు దుమ్ముకురిసి నిండిఎండినట్లున్నాయి. కొద్దిగా దూరంగా క్రమశిక్షణలేని సైనికుల సమూహంలా వెడుతోన్న గొడ్లమంద, నల్లగా వంటిమీద లాగూ తప్ప మరేమీలేని కుర్రవాడు: అనవసరంగా ఆదిలిస్తే ఉరకలూ పరుగులూ పెడుతున్న వాటి కాళ్ళనుంచి లేచిన దుమ్మును దాటి రోడ్డెక్కింది బండి.

పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి. పంట కాలువ పక్కనే కంకర రోడ్డుమీద బండి చక్రాలు చేసే విచిత్రమైన చప్పుడు మైసూరెద్దులమెళ్లో మువ్వలపట్టెడల ముచ్చటైన శబ్దం. ఈ జేగంటల నివాళి ఏ ఫైవ్‌స్టార్ హెూటళ్ళ స్టీరియో ఛానెల్‌మ్యూజిక్‌లో వినగలిగాడు తను? గడ్డి పరిచిపైన బొంతవేసిన మెత్తదనాన్ని, వెచ్చదనాన్ని ఏ పట్టు పరుపులమీద, మడతనలగని దుప్పట్లమీద, అనుభవించగలిగాడు తను? కుదుపులతో ఒళ్ళు బండి తడికెలకు తగుల్తుంటే ఈ పూల రథంలోని అందమైన తియ్యని నొప్పిని ఏ జంబోఫ్లైట్లు. ఏ ఫస్టుక్లాసులు ఇవ్వగలిగాయి తనకు? పచ్చని పొలాలు తడిగాలితో కలిసి ఆనందనృత్యం చేస్తుంటే, తొలకరితో సంగమించిన నల్లమట్టి మోసుకొచ్చే ఈ అనిర్వచనీయమైన సువాసనలను ఏ ఫ్రెంచ్ పెర్‌ఫ్యూమ్‌లలో ఆఘ్రాణించగలిగాడు తను? తాడిచెట్లు చుట్టూ కాపలాకాస్తున్న సైనికుల్లా నిలబడితే. చెరువులో ఎర్ర, తెల్ల కలువల మధ్య గొడవ గొడవగా తిరిగే నీటి కొంగల వుత్సాహాన్ని ఏ స్విమ్మింగ్ పూల్‌లో చూడగలిగాడు? పారలూ, పలుగులూ చేత్తో పట్టుకుని కొందరూ, నాగళ్ళు భుజాన వేసుకుని మరికొందరూ, ఇంటికి బయల్దేరే ఈ సహజతను ఏ థియేటర్లలో, ఏ బాలే నృత్యాల్లో చూడగలిగాడు?

"మీరు వ్రాసిన ఉత్తరం పదిరోజుల క్రింద అందించి, అసలు గుడివాడే వద్దామనుకున్నాను. వొద్దని రాశావుగా." అన్నాడు మామయ్య ఎడ్లను ఆదిలిస్తూ.

శాంతి అతని భుజంమీద తల ఆనించి పడుకుంది. ఆమె పెదవులు అతని చెక్కిళ్ళనూ, చెవులనూ కొరుకుతున్నాయి. అప్పుడప్పుడూ, అంతులేని తృప్తిమనిషికి కలిగితే ఏర్పడే మత్తు అది.

"చెరువుగట్టున మీ స్థలంలో పాత ఇల్లు బాగు చేయించాం. సున్నాలు అవీ మొన్నే అయ్యాయి. చాలా బాగుందిప్పుడు. రేపు చూపిస్తాను." అన్నాడాయన. "లేదు మామయ్యా... మీ ఇంటిదగ్గరే భోంచేసి వెళ్ళిపోతాం... మళ్ళీ పొద్దున్నే వస్తాంలే" అన్నాడు చక్రవర్తి. అతనికి శాంతితో ప్రత్యేకంగా గడపాలనీ, ఆ విషయం చెప్పాలనీ ఆతృత.

ఎంతమంచి రోజుకాకపోతే శాశ్వతంగా దూరమైపోయిందనుకున్న ఆనందం ఇలా చేజిక్కుతుంది... ఆలోచిస్తోంది శాంతి, థాంక్స్ కస్తూరీ... థాంక్స్ ఎలాట్ నిజంగా నువ్వునాకు చేసిన సహాయం జన్మజన్మలకూ మర్చిపోలేనిది.... నీ కోసం నేను చేసింది

చాలా స్వల్పం.... థాంక్స్ కస్తూరీ థాంక్స్ ఎ గైన్.

బండి మెల్లగా సాగిపోతోంది ప్రశాంత తీరాలకు. ఎన్నో మైళ్ళు ఉరుకుతూ ఉధృతంగా ప్రవహించి, ఎంతో ఎత్తునుంచి కిందపడి ఆఖరికి నిర్మలంగా, నిశ్శబ్దంగా సాగిపోయే సెలయేరులా వాళ్ళ జీవితాల్లా.


"సిగరెట్టుందా మామయ్యా" అడిగాడు చక్రవర్తి.

'చార్మినార్ వుంది కాలుస్తావా? అన్నాడాయన లాల్చీ జేబులో నుంచి సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టే తీసిస్తూ, ప్రాణం లేచి వచ్చినట్లైంది చక్రవర్తికి. మళ్ళీ ఎన్నాళ్ళకి. అప్యాయంగా అందుకున్నాడతను.

ఇంకా చీకటి పడకపోవడానికి నిదర్శనంగా గుబురు పొదల్లోంచి తొంగిచూస్తున్న బద్దేడు పూలగుత్తులు వాటి సహజమైన రంగుల్ని కోల్పోలేదు. వర్తమానంలో లీనమై ప్రకృతిని గమనిస్తున్న వారి మనసుల్ని నింపిన కస్తూరి సౌరభం. అభిమానంతో ఆమే, కర్తవ్య ప్రబోధానికి కృతజ్ఞతతో అతనూ, కస్తూరిని స్మరిస్తూ ముందుకు సాగారు. వారి ఆలోచనల్లో కస్తూరి రూపం చుట్టూ సంస్కార పరివేషం. ఆ వెలుగుతో నిండి ఒకరికొకరు చేరువై... బాసటై...

(సమాప్తం)

– ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ప్రచురితం, 1979



శ్రీ వేములపల్లి మోహనరావు గారు 50వ వసంతంలోకి అడుగిడిన శుభ సందర్భముగా

ఇల్లు కాదు ఇది ఒక గుడి
గుడిలోన స్వర్ణ మోహనలకు
మా "శతకోటి" దండాలు.

మొక్కలేదు మేము ఏనాడు ఏదేవుడుని
పూజించు చున్నాము ఇలలోన ఈ దేవుడుని
కోపమెరగని మనిషంట, మనసు వెన్న పూసంట !
మనిషంటే మాబాసంట, మనసున్న మాహరాజంట !

అందరికి ఆప్తులంట
చిరునవ్వే ఒక వరమంట
మంచితనం ఆయన తోడంట
ఇది ఆ తండ్రిగారి బాటంట
ఇక మీకంతా జయమంట.

అడుగు పెట్టారు 50వ వసంతంలోకి
జరగాలి నూరవ వసంతం దిగ్విజయంగా
చిరకాలం వుంటారు మీరు చల్లంగా
మేము వుంటాము మీ నీడలో మీ వెంటే . . .




మా చిరుమనస్సులోని మనోభావాలు, జగమెరిగిన సత్యాలు.

ఇట్లు
మీ శిష్యులు


పి.వి. కృష్ణారావుగారి రచనలు లభించు చోటు

సైకాలజీ పుస్తకాలన్నీ ఇంటర్‌నెట్ ఆర్కైవ్‌లో లభిస్తున్నాయి. అవి ఎంతో ఉపయోగకరమైనవని ఆ లింక్స్ ఈ క్రింద ఇస్తున్నాము.





1. https://archive.org/details/StressInDailyLifeAndItsPrevention
2. https://archive.org/details/dhyanam019308mbp/page/n1/mode/2up
3. https://archive.org/details/PsychologyOfSelfConcept
4. https://archive.org/details/in.ernet.dli.2015.388187/page/n1/mode/2up
5. https://archive.org/details/InkaYennallila



శ్రీ వేములపల్లి మోహనరావుగారు 1970 తొలి సంవత్సరాలలో, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శ్రీ పి.వి. కృష్ణారావుగారికి జూనియర్ మరియు రూమ్‌మేట్. వారిరువురికీ మంచి స్నేహం కుదిరింది. ఇరువురూ కలిసి మనో విజ్ఞానాన్ని మేళవిస్తూ అనేక కథలూ, వ్యాసాలూ రాశారు. అవన్నీ అపురూపమైనవి. తదనంతర కాలంలో శ్రీ వేములపల్లి మోహనరావు గారు వ్యాపారవేత్తగా మారారు. అబూదాబీలోని వెల్ ఎయిడ్స్ ఇంటర్నేషనల్ అనే ఎగుమతి దిగుమతి సంస్థను నడిపారు. ఆయన రచనల్లో ఆనాటి విదేశీ నాగరికత కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తుంది. ఎక్కడన్నా వారి స్నేహం అలా కొనసాగుతూనే వచ్చింది. ఇరువురూ ఉత్తమ స్నేహితులయ్యారు. ఉత్తమ సాహిత్యాన్ని తెలుగువారికి అందించారు.



శ్రీ పి.వి. కృష్ణారావుగారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, మానసిక, పరామనోవిజ్ఞానశాఖకు అధిపతిగానూ, ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ యోగ అండ్ కాన్షస్‌నెస్‌కు డైరెక్టర్‌గా, మరియూ ఆంధ్రా యూనివర్సిటీ డా॥ వి.ఎస్. కృష్ణ లైబ్రరీకి చీఫ్ లైబ్రేరియన్‌గానూ ఎన్నో సేవలందించారు. వారి వద్ద ఏడుగురు స్కాలర్లు పి.హెచ్.డి పట్టాలు పొందగా, యాభైకి పైగా పరిశోధనా వ్యాసాలు ఇంటర్నేషనల్ నేషనల్ పత్రికలలో అందించారు. వీరిరువురూ రాసిన సాహిత్యం, తెలుగువారికి సైకాలజీకి సంబంధించినవీ, కొత్తవిగానూ వుండడంతో, పాఠకులు వాటిని ప్రత్యేకంగా అభిమానించేవారు. శ్రీ కృష్ణారావుగారు అమెరికాలో స్థిరపడినా వీరిద్దరి మధ్యా ఆ తొలినాటి అపురూప స్నేహం, కొనసాగుతూనే వచ్చింది. అయితే 2021లో శ్రీ వేములపల్లి మోహనరావుగారు లోకం విడిచి వెళ్ళిపోవడంతో, ఎంతో కలత చెందిన శ్రీ పి.వి. కృష్ణారావుగారు, ఆయన జ్ఞాపకంగా యీ సంకలనం అందిస్తున్నారు.



శ్రీ డి. నటరాజ్ శాక్య 'బుద్ధపథగామిగా, అంబేద్కరైట్‌గా సామాజిక విలువలకోసం మేలైన రచనలు చేసిన రచయితగా, వృక్ష, బాల ప్రేమికునిగా అందరికీ పరిచయమే. శ్రీ పి.వి. కృష్ణారావుగారు, వారి స్నేహితుని జ్ఞాపకంగా యీ పుస్తకాన్ని వెలువరించే వుద్దేశంతో వుండగా, స్నేహితుని జ్ఞాపకంగా పుస్తకం తీసుకురావడాన్ని ఎంతో స్వాగతిస్తూ, ఆ పుస్తకం ప్రచురణ, సంపాదకత్వానికి తానే ముందుకు వచ్చారు. అంతకు మునుపు శ్రీ పి.వి. కృష్ణారావుగారి 'ఒత్తిడి – నివారించే పద్ధతులు' మరియు 'ఇంకా ఎన్నాళ్ళిలా?' అన్న కవితా సంకలనాన్ని వెలువరించడంలో శ్రీ డి. నటరాజ్ శాక్య కూడా తోడ్పడ్డారు. శ్రీ డి. నటరాజ్ శాక్యకు శ్రీ పి.వి. కృష్ణారావుగారు అంటే చాలా అభిమానం. వారి వద్ద ఆయన ఎన్నో మేలైన బోధనలు పొందారు. వాటి ముందు యీ సంపాదక సేవ చాలా చిన్నది అంటారు. స్నేహకానుకగా ఒక పుస్తకాన్ని వెలువరించే కృషిలో భాగస్వామ్యం వహించడం కన్నా గొప్ప విషయం ఏముంటుంది? అంటారాయన.

– సుజనా సొసైటీ, విశాఖపట్నం